శ్రీ గణేశాయ నమః

పావన ప్రసంగములు

పరమ పూజ్య మహరాజశ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్ వారి
ఆధ్యాత్మిక జీవనములోని కొన్ని సంస్మరణలు వారి మాటలలోనే

హిందీ మూలము

స్వామి శ్రీ అఖండానంద సరస్వతి మహరాజ్

తెలుగు అనువాదము

శ్రీమతి టి.ఛాయకృష్ణ

ప్రథమ ముద్రణ :

తారణనామ సం॥ విజయదశమి

మూల్యము : **అమూల్యము**

ప్రతులు లభించు స్థానము :

శ్రీమతి టి.ఛాయాకృష్ణ, టి.గోపాలకృష్ణ

ఎ7, ఎన్.ఎఫ్.సి. నగర్,
ఘట్‌కేసర్ (పోస్టు),
రంగారెడ్డి జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 501 301.
ఫోన్ : 08415 - 222441

డి.టి.పి. :

మా డిజిటల్ ఆర్ట్స్, (గిరి)

హైదరాబాద్.
ఫోన్ : 040-24242564, మొబైల్ : 93913 01348

ముద్రణ :

ఇమేజ్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్,

3-5-626, స్ట్రీట్ నెం.8, ఐసిఐసిఐ బ్యాంక్ ఎదురుగా,
తెలుగు అకాడమీ వద్ద, హిమాయత్ నగర్, హైదరాబాద్ - 29.
ఫోన్ : 23223645, మొబైల్ : 98480 21518

విషయ సూచిక

सत्साहित्य प्रकाशन (पब्लिकेशन) ट्रस्ट

प्रधान कार्यालय :
विपुल, 28/16, बी. जी. खेर मार्ग
मलाबार हिल, मुम्बई–400006
☎ : 3682055

शाखा कार्यालय :
श्रीअखण्डानन्द पुस्तकालय
आनन्द कुटीर, मोतीझील, वृन्दावन–281121
☎ : (0565) 540487 • 540481

दिनांक : 10.2004

शुभाशीर्वाद

प्रस्तुत है, भारत एवं विदेशों में रहने वाले तेलुगु भाषी अध्यात्म–पथ के जिज्ञासु, प्रेमी भक्तों का मार्गदर्शन करने वाला अनूठा ग्रन्थ 'पावन प्रसंग' का तेलुगु अनुवाद । इस ग्रंथ में परम पूज्य महाराजश्री जी द्वारा लिखवाए गए विविध प्रसंग एवं कुछ प्रश्नोत्तर संकलित हैं।

परम पूज्य महाराजश्री जी की सरस, सरल, एवं सारगर्भितवाणी के तेलुगु रूपान्तर शृंखला में यह द्वितीय–पुष्प साधकों तक पहुँचाने में सर्वप्रथम हम आभारी हैं प.पू. महराजश्री के परमकृपापात्र शिष्य श्री गोपामकृष्ण एवं श्रीमती छायाकृष्ण के, जिनके उत्साह एवं सहयोग से इस ग्रन्थ का अनुवाद कार्य श्रीमती छायाकृष्ण ने किया है एवं ग्रन्थ प्रकाशन में आर्थिक व्यय का भार श्री गोपालकृष्णजी, कृष्णानन्द ने वहन किया है।

हमारा यही शुभाशीर्वाद है कि श्री गोपालकृष्ण एवं श्रीमती छायाकृष्ण तथा उनके सहयोगियों पर भगवान् की ऐसी री कृपा बनी रहे जिससे कि वे सब हस प्रकारके मंगलमय एवं लोकपयोगी कार्य में प्रवृत्त रहें।

ओंकारानन्द

(ओंकारानन्द)

చిన్నమాట

పరమపూజ్య శ్రీ అకండానందజీ మహరాజ్ అంటే పరమాత్మ యొక్క మూర్తీభవించిన దివ్యవిభూతియే! ఆయనను దర్శించుకుంటే నారదవ్యాసాది మహర్షులను దర్శించినట్లు అనుభవం కలుగుతుంది. ఆయన భాగవతం బోధిస్తుంటే సాక్షాత్తు శుకమహర్షే మాట్లాడినట్లుంటుంది. వేదాంతంపై ప్రవచిస్తుంటే సాక్షాత్తు శంకరులే చెప్తున్నట్లుంటుంది. వారు ఒక రోజు ఎక్కడైనా నివసిస్తే అది పుణ్యక్షేత్రమవుతుంది. వారి ముఖం చూస్తేనే ఎటువంటి నాస్తికుడికైనా, అహంకారికైనా వారి పాదాలను కళ్ళకు అద్దుకొని ధన్యులమయిపోవాలి అనిపిస్తుంది. ఎందరో విద్వాంసులు వారి ప్రవచనము విని తమ పాండిత్యానికి సిగ్గుపడ్డారు. ఎందరో విద్వాంసులు, విరక్తులు, మహాత్ములు ఎల్లప్పుడూ వారి సన్నిధిలో ఉండటం కనిపిస్తుంది. ఒక పెద్ద చెఱువు - చేపలకు, కప్పలకు, కమలాలకు, మొక్కలకు, పక్షులకు, పశువులకు, మనుషులకు ప్రాణాధారమైనట్లు; వారు - అన్ని స్థాయిలకు చెందిన సాధకులకు స్ఫూర్తిని, మార్గదర్శనమును, బోధను చేసేవారు. ధర్మము, ఉపాసన, భక్తి, యోగము, తంత్రము, జ్ఞానము - ఇట్లు ఏ శాస్త్రమునకు చెందిన నిగూఢ మర్మమయినా హృదయంగమమగునట్లు బోధించు ఆచార్యేంద్రులు.

వారి ముఖారవిందము నుండి కురిసిన ఎట్టి చిన్న వాక్ జల్లు అయిన అది అమృతతుల్యమే. నిర్మల హృదయంలో నిస్వార్థ సేవాపరాయణులైన వారి నిశ్చల భక్తులు వారనుగ్రహించిన వచన కుసుమాలను ప్రేమతో సేకరించి పుస్తకరూపంగా ప్రచురించినారు. అటువంటి ఎన్నో పుష్పమాలలవంటి గ్రంథాలలో 'పావన్ ప్రసంగ్'

(అంటే పవిత్ర సందర్భాలు) అను గ్రంథము ఆధ్యాత్మిక సౌందర్య పరిమళాలను వెదజల్లే ఒక సుమధుర పుష్పగుచ్ఛము. శ్రీ మహారాజ్‌జీ మహిమను, ఈ గ్రంథము యొక్క మాధుర్యమును గుర్తెరింగిన శ్రీమతి చాయకృష్ణ అమ్మగారు దీనిని ఎంతో భక్తితో తెలుగులోకి అనువదించినారు. వారు, వారి భర్త శ్రీ గోపాలకృష్ణ - శ్రీ మహరాజ్‌జీ యొక్క పవిత్ర సత్సాంగత్యమును సుమారు మూడు దశాబ్దాల కాలం నుండి చవిచూసి ధన్యులై, ఈ అనువాదమునకు యోగ్యులైనారు.

ఈ 'పావన ప్రసంగముల'లో స్వామీజీ, తాను ఎందరో మహనీయులను దర్శించటం వర్ణింపబడినది. మహాత్ములను ఎట్లా గమనించాలి, ఏంనేర్చుకోవాలి, ఎట్లా నేర్చుకోవాలి అను విషయాలను మనకోసం వర్ణిస్తూ ఉంటారు. అది కళ్ళకు కట్టినట్లు ఉంటుంది. ఒక్కొక్క వాక్యంలో మనకు దివ్యానుభవం కలుగుతుంది. పూజ్య స్వామీజీ మనలను ప్రేమతో నడిపిస్తూ, నడిపిస్తూ పాఠకులను బ్రహ్మ స్వరూపంలో నిలిపేస్తారు. ఈ పుస్తకము చదవటం మొదలుపెడితే చివరి వరకు వదలలేము. పూర్తయ్యే సరికి జీవతమే కొత్తగా కనిపిస్తుంది.

ఆశ్వీ.శు.పంచమి. కలి-5105   పూజ్య మహరాజ్‌శ్రీ పాదాభివందనములతో...

(18-10-2004)   ఇట్లు

హైదరాబాద్

(ప్రకాశానందేంద్ర)

శ్రీ గురుభ్యోన్నమః

కృతజ్ఞతాంజలి

బ్రహ్మలీన స్వామి శ్రీ అఖండానంద సరస్వతీ మహరాజ్‌ను గూర్చి ఉత్తర భారతదేశములో తెలియని సంత్ మహాత్ములు చాలా అరుదు. వారు మా గురుదేవులవ్వడం మా అదృష్టం. వారణాసి దగ్గర "మహారాయి" గ్రామములో సంప్రదాయ బ్రాహ్మణ కుటుంబములో జన్మించి, పిన్నవయసులోనే భగవత్సాక్షాత్కారము కొరకు ఎందరో మహాత్ముల దర్శించి, కృతకృత్యులైనారు. దిగ్గజముల వంటి పండితుల వద్ద వేదవిద్యాభ్యాసమునొనర్చి, శ్రీమద్భాగవత, రామాయణ, ఉపనిషత్తులలో విషయాలను, తనదైన సరళ హిందీ భాషలో యెన్నో ప్రవచనములు, సప్తాహములు, ప్రశ్నోత్తరముల ద్వారా జిజ్ఞాసులకు ఆధ్యాత్మిక విద్యాబోధగావించారు. దైవకృప వల్ల మా కుటుంబ సభ్యులందరికీ చాలా ఏళ్ళుగా వారి సత్సంగమున శ్రవణముజేయు సదవకాశము గల్గినది. ఆయన విద్వత్తును, ఉదారతను, భక్తి, జ్ఞాన, వైరాగ్య సమన్వయ బోధను గూర్చి వ్రాయుట నాబోటివారికి దుస్సాహసకార్యమే. అందుకనే ఆయన మాటలలోనే హిందీ భాషలో ప్రచురితమైన "పావన్ ప్రసంగ్"ను తెలుగులో అనువదించే సులభప్రయత్నము నా సతీమణి టి.ఛాయకృష్ణ చేసినది. ఒక విధముగా ఈ "పావన ప్రసంగములు" ఆయన ఆధ్యాత్మిక జీవన చరిత్ర. ఈ పుస్తకము చదువుతున్నంతసేపు గురుదేవులతో కలసి ఎందరో మహాత్ములను దర్శించిన అనుభూతి గలుగకమానదు.

ఈ అనువాద ప్రక్రియలో స్వామి తత్త్వవిదానంద్ గారు చూపిన ప్రోత్సాహం, అడిగిన వెంటనే స్వామి ప్రకాశనందేంద్ర గారు వ్రాసియిచ్చిన "చిన్నమాట"కు, మీ ఇరువురికి కృతజ్ఞతాభివందనములు. అంతేకాదు, అనువాదములో క్లిష్టమైన వేదాంత ప్రసంగములను చూచి తన అమూల్యమైన అభిప్రాయములను ఇచ్చి, స్వామి ప్రకాశానందేంద్ర వారు మాపైన పెక్కు కృపజూపినందులకు వారికి మా పాదాభివందనలు. అచ్చుతప్పుల సవరణ (ప్రూఫ్ రీడింగ్)లో మేము కోరినవెంటనే ఎంతో శ్రద్ధజూపి మాకున్న అత్యల్పకాలపరిమితిలో ఎంతగానో సహకరించిన శ్రీమతి సీత గార్కి కృతజ్ఞతలు, మరియు మా కోడలు టి.పద్మజకు శుభాశీస్సులు. అతి కొద్ది సమయములోనే డి.టి.పి. చేసిన శ్రీ గిరి గార్కి, గ్రంథమును బహుముచ్చటగా ముద్రించిన శ్రీ అప్పారావు గార్కి మా కృతజ్ఞతలు.

ఈ గ్రంథ పాఠకుల ఆధ్యాత్మిక జీవన నిర్మాణములో ప్రగతినాకాంక్షిస్తూ...

పూజ్య గురుదేవుల చరణ కమలములకు నమస్కరిస్తూ...

- టి.గోపాలకృష్ణ

బ్రహ్మమూర్తి శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్

అఖండానంద సంబోధ పూర్తయే బ్రహ్మమూర్తయే ।
సుధాస్మిత సమాశ్లిష్టనేత్రాంతస్ఫూర్తయే నమః ॥

తీర్థరాజమైన ప్రయాగ పుణ్యక్షేత్రమున ప్రతిష్ఠానపురము (ఝూసీ)లో బ్రహ్మచారి శ్రీ ప్రభుదత్త మహరాజ్ వారి ద్వారా ఏర్పాటు చేయబడిన అఖండ హరినామ-సంకీర్తనయజ్ఞ సమయంలో నేను అక్కడ 'శ్రీమద్భాగవతం' పైన ప్రవచనము ఇస్తూఉంటిని. విశాల మంటపము, భవ్య సింహాసనము అసంఖ్యాక శ్రోతలు, విశిష్ఠ మహాత్ముల ఉపస్థితి - గోపీ గీత్ ప్రసంగము జరుగుతూ ఉంది. శ్రీకృష్ణ-కథామృతము దివ్యమైన స్వర్గామృతము కంటే కూడా ఉత్కృష్టమైనది. అని నేను చెబుతూంటిని. హఠాత్తుగా, కథలో ఏ మాత్రం విఘ్నం కల్గించకుండా ఒక మహాపురుషుడు వచ్చి, ఎదుట నేలమీద విరాజమానులయ్యారు. సిద్ధాసనంలో కూర్చున్నారు. దివ్య భవ్యమూర్తి! మందహాస వదనం! నేత్రాలలో ప్రేమ! జ్యోతిర్మయ ముఖం! ప్రసన్న గంభీరముద్ర! ప్రభావ పూర్ణ వ్యక్తిత్వము! జనంలో మెల్లగా కలకలం మొదలైంది. వీరే లోక విఖ్యాత మహాత్ములు శ్రీ ఉదియా బాబాజీ మహరాజ్ అని ఒకరికొకరు చెవుల్లో చెప్పుకున్నారు. నేను ప్రవచనం కొనసాగిస్తూనే, చేతులు జోడించి, శిరస్సు వంచి నమస్కరించి, 'తప్తజీవనమ్'పైన వ్యాఖ్య ప్రారంభించాను. సంసారతాప-దగ్ధులకు ఈ కథామృతము జీవనము, పాపులకు పాపప్రక్షాళనము, దుఃఖితులకు దుఃఖ నివారణము, విరహిజనుల(భక్తుల)కు జీవనం, ప్రియతమ శ్యామసుందరుడి సాక్షాత్కారం కోరుకునేవారికి ఇది దివ్య రసాయనం వంటిది. ప్రవచనం అయిపోయాక, వారి చరణాలపై శిరసు ఉంచి నమస్కరించాను. వారు ప్రసన్నతతో నన్ను అభినందించారు. నేను కూడా వారి వెంట వెనకాలే ఒక కుటీరంలో ఎక్కడైతే వారు

బసచేసి యున్నారో అక్కడికి వెళ్లాను. సత్సంగము జోరుగా సాగింది. వేదాంత సంబంధమైన ప్రశ్నోత్తరాలు జరుగుతున్నాయి. అప్పుడు అక్కడ విద్వాంసులు, విరక్తులు, అనుభవజ్ఞులు, జిజ్ఞాసులు చాలా మంది ఉన్నారు.

నేను కూడా మహారాజశ్రీ వారిని ఒక ప్రశ్న అడిగాను. పునర్జన్మ ఎవరికి కలుగుతుంది? నేను మనసులో ఎలాగనుకున్నానంటే, ఒక వేళ వారు సప్త దశ తత్త్వాత్మక లింగ శరీరమునకు జన్మ ఉంటుంది. లేదా పునర్జన్మ ఒకప్పుకోకపోతే జీవుడిపై అకృతాభ్యాగమము మరియు కృతవిప్రాశ దోషము కల్గుతుంది. అంతేకాక భగవంతుడిపైన కూడా వైషమ్య, నైర్ఘుణ్య దోషము ఆరోపించే అవసరమేర్పడుతుందని చెబితే నేను ఆత్మ అసంగద్రష్ట! లింగ శరీరముయొక్క జన్మ జన్మాంతరాలు ఆత్మతో ఏమీ సంబంధము లేదు! అని చెప్పాలనుకున్నాను. కానీ నా మనోరాజ్యం నా మనస్సులోనే ఉండిపోయింది. వారు ప్రసన్న ముద్రతో ఇలా అన్నారు. బాబూ! (పుత్రా) నీవు నీ బుద్ధిని పునర్జన్మను నిరూపించడానికి ప్రయోగించకు. జన్మరాహిత్యంపైన ప్రయోగించు. ఈ తిరుగులేని, ఖండిచలేని జవాబును విని నేను ఆశ్చర్యచకితు డయ్యాను. నిజంగా ఇలాంటి సమాధానం అశృతపూర్వము, కరుణా పూర్వము, పరమార్థ బోధకము అయినది. అప్పటి నుండీ నేను ముక్తుడిని అన్న అభిమానము వదలి సత్సంగము చేయవలెనన్న ధృఢ ప్రేరణ గల్గినది. శ్రద్ధ లేక భక్తితో దృఢత్వము రాదు. వైరాగ్యము లేక వేదాంత జ్ఞానములో ప్రగతి గలుగదు. ఎప్పుడైతే భగవంతుడి ఐశ్వర్యం పట్లకూడా వైరాగ్యం కల్గుతుందో, అప్పుడే పూర్ణవైరాగ్యం కల్గుతుంది. సృష్టి, స్థితి, సంహారాలు కూడా విక్షేపమే అని అర్థం చేసుకుని ఉదాసీనులై అసంగులైనపుడు పరమార్థానుభవ యోగ్యత కలుగుతుంది. సంపూర్ణ విచారణ బ్రహ్మానుభూతిలో పర్యవసిస్తుంది. భగవంతుడి స్వరూపము నిస్సంగము, (సంగరహితము). మరి స్వభావము దయాళుత్వము.

తత్త్వజ్ఞుడైన మహాత్ముడి జీవితంలో బ్రహ్మాకార వృత్తి నిరంతరమూ ఉంటుంది. తత్త్వజ్ఞుడుకి అవిద్య నివృత్తి అయివుంది. అనుభవం కలుగదు. అలాగ అయితే అవిద్య అనేది ముందు సత్యమై ఉంటే, తరువాత నివృత్తి అయిందనుకోవడానికి వారి అనుభవంలో అవిద్య అన్నది లేనేలేదు. నాసీదస్తి భవిష్యతి.

జ్ఞానము జ్ఞానమే. దానిలో పరోక్ష-అపరోక్ష అన్న భేదము లేదు. దైహిక దృష్టిలో ఈ బేధము కల్పితము.

జీవన్ముక్తి-విదేహముక్తి వీటిలో భేద-కల్పనయే అమంగళకరము. ఆత్మయొక్క స్వతఃసిద్ధ స్వరూపమే ముక్తి.

మన ఆత్మను పరిచ్ఛిన్నమైనదని అనుకుంటూ, అనుకుంటూ ఈ భ్రాంతి దృఢమయిపోయింది. మరి దానిలోనే రుచి కలుగుతోంది. అభ్యాస-వైరాగ్యాల వల్ల పరిచ్ఛిన్నత పట్ల కల రుచి నశించిపోతుంది, మరియు అర్థం చేసుకుని తెలుసుకోవడం వల్ల భ్రాంతి తొలగిపోతుంది.

నివృత్తి పరాయణత, అభ్యాసము ఇవి రానిదే సాధు జీవితంలో ఆనందమే లేదు.

ఝూసీ సత్సంగము ఇలాంటి అనేకమైన అశ్రుతపూర్వ (ఎపుడూ విననటువంటి) విచారములు-పరమ్పరాగతముగ శ్రవణగోచరమైనవి.

తీర్థరాజమైన ప్రయాగ పావన క్షేత్రము. గంగానది యొక్క రమణీయమైన తటము. త్రివేణీ సంగమము యొక్క సాన్నిధ్యము. అర్థకుంభమేలా శుభ అవసరము. భిన్న-భిన్న సంప్రదాయాల సంత్-సత్పురుషుల సత్సంగము. మాఘమేలా కోసం వచ్చిన సత్పురుషులు, యాత్రికుల సముదాయము, అన్నీ దర్శనీయమే! భాగీరథి ఒడ్డున దూరదూరం వరకు విరక్త అవధూతలయొక్క కుటీరాలున్నాయి. అయినా శ్రీఉదియా బాబాజీ వారి సత్సంగవైభవం అద్భుతముగా వుండేది. జిజ్ఞాసులు, జ్ఞానులు, విరక్తులు, విద్వాంసులు, వస్తూ వుండేవారు. చాలా జటిలమైన ప్రశ్నలు వేస్తుండేవారు. బాబా నేమో నవ్వుతూ నవ్వుతూ చిన్న చిన్న మాటలతోనే సమాధానం చెబుతూండేవారు. ఆ వాతావరణమంతా అత్యంత చమత్కారపూర్ణంగా ఉండేది. శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి గారి సంవత్సర పర్యంతం జరిగిన అఖండ నామ సంకీర్తన మహాయజ్ఞము యొక్క సమాప్తి మహోత్సవము జరిగింది. బ్రహ్మచారిగారు మొదటి రోజే బాబా దగ్గరకు వచ్చి, 'బాబా! మీకు అన్నపూర్ణ సిద్ధి వున్నది. అపుడు ఇక మీరే ఈ కార్యం సంభాళించుకోవాలి. మా కార్యాలయములో కేవలం రెండువందల యాభై

రూపాయలు మాత్రమే వున్నాయి' అని నివేదించుకున్నారు. బాబా నవ్వేశారు. మరి రోజు, రోజూ భోజనాలు జరుగుతూ వుండేవి. అన్నపూర్ణ తన ఖజానా తెరిచివేసింది. రెండు వందల యాభైరూపాయలు ఒక రోజు ఫలహారానికి కూడా సరిపోదని చెప్పనవసరం లేదనుకుంటాను.

అనుగ్రహ-విగ్రహుడైన సదాశివుని సేవించి జగదంబ అన్నపూర్ణ కూడా కృతార్థురాలైనది. ఈ రోజుల్లో గొప్ప-గొప్ప మహాత్ములు, జిజ్ఞాసులు దేశ-విదేశాల నుండి తరలి వచ్చిన శ్రద్ధాళువులు మరియు కేవలం కుతూహల ప్రియులు అందరు వస్తూ వుండేవారు. 'పాల్ బ్రంటన్' ఇలా అడిగారు, 'మీరు కూడా ఏదైనా సిద్ధిని చూపించండి' అని బాబాతో అన్నారు. ఒక నీటి బిందువు శరీరంగా తయారైంది. తిరుగాడుతుంది. ఆలోచిస్తుంది, ఇంతపెద్దగా కన్పిస్తూం వుంది. ఇంతకంటే శ్రేష్ఠమైన సిద్ధి కానీ, చమత్కారం కానీ ఏమివుంది? దేనిని చూసినీవు విశ్వసిస్తున్నావు?

శ్రీ మహరాజశ్రీ (బాబా), 'నీవు బ్రహ్మవు' అని ఎపుడు అనరు. 'నేను బ్రహ్మను' అని కూడా అనరు. వారిని ఎవరైన 'మీరు ఎవరు?' అని ప్రశ్నిస్తే 'నీవు ఏమి చూస్తున్నావో అది' అనేవారు. ఒక్కోసారి 'నేను చరా చర జగత్తుకు సేవకుడిని' అనేవారు. మరోసారి 'నా ఒక్కో రోమ కూపంలో కోటి కోటి బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు విస్ఫులింగాలలాగ మెరుస్తూ లీనమైపోతూ వుంటాయి' అనేవారు. ఎవరైనా వారితో మీరు మాకు తండ్రి, స్వామి, మిత్రుడు అని అంటే 'అవును' అనేవారు. వారి దృష్టిలో ఏదీ విశేషమన్నది లేదు అని స్పష్టంగా తెలిసేది. వారి పట్ల ఎవరు ఏ విధమైన విశేషతను ఆరోపించినా అన్నిటికి 'ఠీక్ హై' (సరే) అనేవారు. విధి, నిషేధమేదీలేదు. వారి ఉన్ముక్త మందహాసమే ఈ సమగ్ర ప్రపంచమేమో అనిపించేది.

వారి శరీరాన్ని ఎవరైన ఎత్తుకెళ్ళేవారు దొంగగా, వారి బోజ్జాపై తలవుంచి ఎవరైనా పడుకునేవారు ఎవరో వచ్చి పూజ చేస్తారు, ఎవరో వచ్చి ఊయలలో ఊపుతారు. కొందరు కృష్ణుడంటారు. కొందరు రాముడంటారు. కొందరు శివుడంటారు. వారైతే స్వయంగా ఎవరికీ నీ విలా అనుకో, అలా అనుకో అని ప్రేరణ కలిగించరు. ఎవరైన అనుకుంటే వద్దనరు. లోకులు నిందించారు, స్తుతించారు. పూజా-ప్రతిష్ఠా, అవమానం-తిరస్కారము అన్నీ జరుగుతూ వుండేవి. పూలమాలలు అర్పించేవారు. గొడ్డలివేటు

వేసినవాళ్లు వున్నారు. కానీ ఇవన్నీ ఇతరుల దృష్టిలో మాత్రమే. అజ్ఞానుల దృష్టిలోనే ఇవన్నీ, వారి దృష్టిలో ఏమీ లేదు. ఎలాగుంటే అలాగే అవిచలముగ, నిర్వికారముగ వుండేవారు. ఎవరైన ఎపుడైన అధిష్ఠాన స్వయం ప్రకాశపరబ్రహ్మ మూర్తిని గనుక చూసివుంటే అపుడు చెప్పగలము వారు మా మహారాజశ్రీ వారిని సరిగా దర్శనం చేసుకోగలిగారని. అన్నీ అధ్యారోప-అపవాదాలు వారిలోనే వుండేవి, పోయేవి. అందరి పరమార్థస్వరూపము పరబ్రహ్మమే. ఎందరో మహాత్ములు అలా ఉద్ఘోషించారు. కానీ వారు పరబ్రహ్మయొక్క వ్యావహారిక స్వరూపము. జిజ్ఞాసులకు వారి బ్రహ్మవిద్వరిష్ఠులైన మహాత్ములు, భక్తులకు భగవంతుడు, కాని వారు స్వయంగా ఏమిటన్నది వారెపుడూ చెప్పేవారు కాదు.


మా జన్మ జన్మల పుణ్య ఫలమో లేక భగవంతుని భూరి భూరి అనుగ్రహమో మాకు వారి సత్సంగము, ఘనిష్ఠమైన సంపర్కము మరియు వార్తాలాపములు చేయు సుఅవసరము కలిగినది. మేము వారితో పాటు యాత్రలు చేశాము. భోజన, శయనాదులు, చేశాము. చాలా సంవత్సరాలు వారి ఒడిలో క్రీడించాము. వారి ఆ ఆనందస్వరూపము, ఆ మందహాసం, ఆ మృగేంద్రుడి నడక లాంటి తీరు (సింహకీ సీ చాల్) ఆ వేదాంత గర్జన, ఆ నిరాపేక్షతా ఇప్పటికీ నా నేత్రాల ఎదుట నృత్యం చేస్తుంది. వారి ఆప్తులలో (నిజజన్) నేనూ ఒకడిని అని తలచుకుంటే ఆ కల్పనతోనే నేను పులకించిపోతువుంటాను. నేను అలిగినా వారు నన్ను సమాధానపరచేవారు. నేను ఏదైన తినకపోతే, వారు తినిపించేవారు. నేనయితే నా మనస్సుతో వారికి ఒక మాల కూడా వెయ్యలేదు. ఒక పూవైన అర్పించలేదు. కానీ నేను వారిలో లీనమయినట్లు, వారు నాలో లీనమయినట్లు నాకు అనేక సార్లు అనుభవం కలిగింది. వారేమో తన స్థానంలో తను స్థిరంగా ఉన్నారు. వారిలో (ఆ ఆనందాంబుధిలో) మునిగి తేలడం శాశ్వతమయినది. ఇలాగే జరిగింది. జరుగుతూ ఉంది. మా అవిచ్ఛేద సంబంధాన్ని మాయ, ప్రకృతి, అవిద్య అథవా సర్వాంతర్యామి ఈశ్వరుడయినా సరే వేరు చేయలేడు. ఇది అవిచ్ఛిన్నము, శాశ్వతము, పరమార్థము.

మా మహారాజశ్రీ వారి జన్మస్థలం-సముద్రపు పాలనురగలాంటి ఉత్తాల తరంగాలతో ప్రక్షాళితమై, చుంబితమైన నీలాచలము-శ్రీ జగన్నాథపూరి పావన పుణ్యక్షేత్రము.

ఆ సమయంలో రాజా ప్రతాప రుద్రుడు పూరీకి రాజు. వారి కుల గురువు శ్రీ కాశీమిశ్ర. అది శ్రీ చైతన్య మహాప్రభువు అవతార కాలం. కాశీ మిశ్ర వారి వంశ పరంపరలోనే చాలా తరాల తర్వాత శ్రీ ఉదియాబాబాజీ జన్మించారు. రాజగురువు లయినందున వారి వంశీయులకు అత్యంత గౌరవము ఉండేది. వారు ప్రాచీన పరంపరకు చెందిన నిష్ఠా గరిష్ఠులు. ఇంట్లో కర్మ కాండకు ప్రాధాన్యత ఉండేది. ఆంగ్ల భాష చదువుకున్న వాళ్ళతో మాట్లాడ్డానికి కూడా సంకోచపడేవారు. ఇతరుల ఆసనం పైన కూర్చునేవారు కాదు. ఎద్దుల బండి కూడా ఎక్కేవారు కారు. పాలకీలోనే బయటికి వెళ్ళేవారు. జోళ్ళువేసుకునేవారు కాదు. అన్య బ్రాహ్మణుల ఇళ్ళల్లో కూడా భోజనం చేసేవారు కాదు. చుట్టు ప్రక్కల యాభై - అరవై గ్రామాల ధర్మవ్యవస్థ వీరి చేతిలో ఉండేది. చెప్పవచ్చేదేమిటంటే శ్రీ ఉడియాబాబాజీ వారి జన్మ అత్యంత ప్రతిష్ఠాత్మక వంశలోనిది అని.

శ్రీ చైతన్య మహాప్రభువు సమయంలో కాశిమిశ్ర తర్వాత కూడ వారి వంశజులు వైష్ణవులే. కానీ శ్రీ ఉడియాబాబాజీ జన్మకు ముందు కొన్ని తరాలకు పూర్వము ఆవంశంలో కాళిమాత ఉపాసన మొదలైంది. వీరి ప్రపితామహుడు కాళి-మంత్రము జపించేటప్పుడు పొరపాటున కృష్ణ మంత్రము ఉచ్చారణ జరిగినది. క్రీం అనే బదులు క్లీం అన్నారు. కాళీమాత ఆయన ముఖంపైన ఒక దెబ్బ కొట్టారట. అది సొట్టపోయింది. అలాగే వుండిపోయింది. జన్మతా అలాగే వుండిపోయినది, అని చెప్పుకుంటారు జనం.

వారి పుత్రులు వాసుదేవ మిశ్ర. వారికి ముగ్గురు పుత్రులు, ముగ్గురు పుత్రికలు. అందరి కంటే చిన్నబ్బాయి పేరు వైద్యనాథ మిశ్ర. వారి పుత్రులే శ్రీ ఉదియాబాబాజీ. వారి జన్మ నామము శ్రీ ఆర్తత్రాణ మిశ్ర.



విక్రమ నామ సంవత్సరము 1932, భాద్ర కృష్ణ సప్తమి, సోమవారం మద్యాహ్నం సమయం వారు జన్మించారు. ఆ రోజు స్మార్తుల శ్రీకృష్ణజన్మాష్టమి. సూర్యోదయ ఇష్ట 16-6-30 వృశ్చిక లగ్నం. సూర్యస్పష్ట 4-7. కృత్తిక నక్షత్రం ప్రథమపాదం మేషరాశి.

పాలన-పోషణ మేనత్త చేశారు. స్వభావంలో చంచలత లేదు. ఆట పాటలలో అభిరుచి లేదు. ఎవరైన కొట్టినా సరే గమ్మని వుండేవారు. ప్రతి క్రియ వుండేది కాదు. కళ్ళు మూసుకుని కూర్చుంటే దానంత సుఖం మరిలేదు. అలా వుండేవారు.

నాలుగు సంవత్సరాల నుండి పన్నెండు సంవత్సరాల వరకు ఇంటి వద్దనే ఒరియా భాష, గణితము, సాధారణ సంస్కృతము నేర్చుకున్నారు. శరీరం దుర్బలంగా వుండేది. బంధువులకు వీరిని ఎక్కువ చదివించే ఇష్టముండేది కాదు. కాని పిల్లవాడైన ఆర్తత్రాణుడిలో మాత్రం చదువు పట్ల అభిరుచి వుండేది.

ఇంట్లోవారి అనుమతి తీసుకోకుండా చప్పుడు కాకుండ ఇంట్లో నుండి బయటపడి బాలేశ్వర్ వెళ్ళి మయూర్ బంఝ్ వచ్చారు. ఒక విద్యార్థి కూడ తోడు వున్నాడు. ఇంత చిన్న వయస్సులో ఇలాంటి సాహసము చెయ్యడం అంటే వారికి స్వాభావికంగానే స్వతంత్రత, అసంగత వున్నాయని తెలుస్తుంది. మయూర్‌బంఝ్ విద్యాలయంలో పండిత పద్మనాభాచార్యుడు వీరి తండ్రికి పరిచితుడే, అందువల్ల వారు వెంటనే పాఠశాలలో వీరిని చేర్చుకున్నారు. అక్కడ ఆర్తత్రాణుడికి ఈ చింత పట్టుకుంది - 'ఒకవేళ పంతులుగారు ఇంటికి కబురు చేశారంటే మరల తిరిగి వెళ్ళ వలసివస్తుంది' అని. అందువల్ల అక్కడ కూడా వారికి తెలియకుడ 'బాల్యాబేడా' వెళ్ళారు. అక్కడ ఐదు సంవత్సరాలు అధ్యయనము చేసి 'కావ్యతీర్థ' పరీక్ష ఉత్తీర్ణులయ్యారు.

కావ్యతీర్థ పరీక్షకు తయారయ్యే రోజుల్లోనే ఆర్తత్రాణుడి సహపాఠి గంగాధరమిశ్ర హఠాత్తుగ కలరా తగిలి చనిపోయారు. ఆర్తత్రాణుడి పట్ల ఆ అబ్బాయికి స్వంత సోదరుడిలాగ ప్రేమ వుండేది. ఆ అబ్బాయి మృత్యువు వల్ల వీరికి చాలా దుఃఖము కలిగినది, అప్పటి నుండే చిత్తములో వైరాగ్యము కలిగింది. ప్రపంచమంతా నశ్వరమని, నీరసమని అనిపించింది.

ఇంతలో అక్కడ వున్న రాజా వారు కృష్ణ చంద్రుడు, అతను వైష్ణవుడు. గోపీనాథ మందిరంలో ఉత్సవాల సందర్భంగా కలకత్తా నుండి బాల-సంగీత మండలిని పిలిపించారు. ఈ మండలి వారు ఎన్నో సుందరమైన నాటకాలను ప్రదర్శించారు.

ఒక బాలుడు శంకరుడి వేషాన్ని ఎంత బాగావేశాండటే చూసి ఆర్తత్రాణుడు ముగ్ధులయ్యారు. సిద్ధాసనంలో కదలక కూర్చున్న శంకరుడిని చూసి మొదటి సారిగా సమాధినిష్ఠపట్ల స్ఫూర్తి కలిగింది. శ్రీకృష్ణుడి గోపాల లీల, వన భోజన లీల వీరిపైన ఎంతో ప్రభావం చూపించాయి. గదిలోకి వచ్చాక ఆ చింతనలో మునిగి భావసమాధి కలిగింది. మూడు రోజులు ఏమీ తినకుండా వీరు ఇలా భావమగ్నస్థితిలో వుంటే తోటి విద్యార్థులు వీరికి ఏదో జబ్బు చేసిందనుకున్నారు. వారికేం తెలుసు?! ఇది రోగము కాదని, భవరోగ నివారణమని!

విద్య పూర్తయిన తర్వాత ఆర్తత్రిణుడు ఇంటికి తిరిగి వచ్చారు. పైతృక వృత్తి చేస్తున్నాగాని వీరి మనస్సు భక్తి, వైరాగ్యం మరియు యోగము వీటి వైపే లాక్కుని పోతోంది. ఆ సమయంలో ఒరిస్సాలో భయంకరమైన దుర్భిక్షము ప్రకోపించింది. ఆకలితో సంతప్తులై ప్రజలు క్రిమి కీటికాలలాగ చనిపోయారు. కొందరు పెరుగులో కొందరు నీటిలో మట్టిని కలుపుకుని త్రాగేవారు. కొందరు విషము త్రాగి కాల గర్భంలో కలిసిపోయారు. ఆర్తత్రాణుడు, ఆర్తత్రాణుడే కదా! వారు దుఃఖితులకు సహాయం చెయ్యాలని నడుంబిగించారు. ఎంత ప్రయత్నించినా తను ఆశించినంతగా సేవ చెయ్యలేక పోతున్నానే అని వారి చిత్తము అత్యంత వ్యథితమయినది.

క్షుధాపీడితుల, క్షుధానివారణకు ఉపాయమేమిటి? అని ఆలోచిస్తూ, ఆలోచిస్తూ ద్రౌపదీదేవి దగ్గర వున్నటువంటి అక్షయపాత్రలాటిది ఏదైన వుంటే నేను నిరంతరము వీరందరికీ తిండిపెట్టవచ్చుకదా అనిపించింది. భగవదారాధనవల్ల అటువంటి పాత్ర పొందవచ్చు అని నమ్మి ఆత్రత్రాణుడు చైత్ర కృష్ణ పంచమి సం.1951న ఒక చెంబు, పదకొండు రూపాయలు మాత్రము తీసుకుని ఇంటినుండి బయలుపడ్డారు. జగజ్జననిని గురించి అనుష్ఠానం చేసి అటువంటి పాత్ర సంపాదించి ప్రజల దుఃఖాన్ని నివారిస్తాను అని అనుకున్నారు. కామరూప కామాఖ్య దారి(ఆసామ్) పట్టారు.

పూరీ నుండి కలకత్తా అటు నుండి గోఆలంద్ మరి అటునుండి గోహాటీ. కామాఖ్య దేవి క్షేత్రము దర్శించి ఆర్తత్రాణుడి చిత్తం ప్రసన్నమయింది. సిల్‌హట్‌లోని ఒక బెంగాలీ సజ్జనుడు వీరి అనుష్ఠానము కోసము కావలసిన ద్రవ్యమును ఏర్పాటుచేశారు. వీరి విధి పూర్వకంగా నవదుర్గా అనుష్ఠానం మొదలుపెట్టారు.

అనుష్ఠానం బాగా జరుగుతూ వుంది. స్వప్నంలో దేవి దర్శనం కూడా కలిగింది. అపుడే ఒక రోజు ఒక మహాత్ముడి ద్వారా "వివేక చూడామణి" శ్రవణం చేసే సదవకాశం లభించింది. అది విన వీరికి చిత్తంలో ఎటువంటి స్ఫురణ కలిగిందంటే "ఒక వేళ దేవి నా కోరిక ప్రకారం ఒక పాత్ర ఇచ్చినా, ద్రౌపది దగ్గర వున్న అక్షయ పాత్రలాంటిది నాకు లభించినా దాని వల్ల ఏమవుతుంది? ఎందరు అన్నం కోసం నా వద్దకు రాగలుగుతారు? నేను మాత్రం ఎన్ని రోజులు జీవిస్తాను? నేనయినా అమరుడనవను కదా? అంతే కాకుండా అన్నం దొరికినంత మాత్రానే లోకుల సమస్త దుఃఖాలు మాసిపోతాయా? ఇలా ఆలోచించి సకామ అనుష్ఠానము సరి అయినది కాదు అని ఆర్తత్రాణుడికి అనిపించింది. సకల కోరికలు త్యాగం చేసి జగజ్జనని భజన చెయ్యాలి అని నిశ్చయించుకుని అనుష్ఠానము వదలి కాశీకి బయలుదేరారు. మాత అన్నపూర్ణ, విశ్వనాథుల దర్శనం చేసుకుని వైద్యనాథ ధామం గుండా వెళ్ళి ఇంటికి తిరిగి వచ్చారు.

అనుష్ఠానం వల్ల ఆర్తత్రాణుడి మనసులో మాతృభక్తి, వైరాగ్యము దిన దిన ప్రవర్ధమానమయింది. ఇంతలో వారిని పెంచిన స్నేహమయి మేనత్త చనిపోయారు. వారి పట్ల ప్రేమ వల్లనే వీరు మాటి మాటికి ఇంటికి తిరిగి వస్తూ వుండేవారు. సరే ఈ బంధనమూ పోయింది అనుకున్నారు ప్రసన్నంగా. ఇంట్లో వారేమో వీరిని వివాహబంధంతో కట్టిపెట్టాలని తొందరపడుతున్నారు. కానీ ఒక జ్యోతిషుడు 32 సంవత్సరాలు మాత్రమే ఆయుస్సువున్నదని చెప్పగానే వారు వివాహప్రయత్నాలు మానేశారు. వీరికి చాలా సంతోషం కలిగింది.

ఆర్తత్రాణుడు, జగన్నాథపురీ వచ్చి అక్కడి గోవర్ధన పీఠాధీశ్వరుడైన జగద్గురు శంకరాచార్య స్వామి శ్రీమధుసూదన తీర్థతో నైష్ఠిక బ్రహ్మచర్య దీక్షతీసుకున్నారు. వీరికి బ్రహ్మచారి వాసుదేవ స్వరూప్ అని కొత్త పేరు పెట్టారు. తండ్రికి, మామకు దీనివల్ల చాలా దుఃఖము కలిగింది. కానీ ఏమి చెయ్యగలరు? జగద్గురువు గారన్నారు, 'ఒక వేళ నేను దీక్ష ఇవ్వకపోతే వేరే ఎక్కడైన వెళ్ళి దీక్ష తీసుకునేవాడు కదా? నా దగ్గరనే వుంటే మీకు కూడా అనుకూలంగా వుంటుంది' అని ఆలోచించి దీక్ష ఇచ్చాను. అని చెప్పి వారిని సమాధాన పరచారు.

ఇప్పుడు బ్రహ్మచారి వాసుదేవ స్వరూపుడికి సిద్ధగురువను వెతికి పట్టుకోవాలన్న తపన ఎక్కువైంది. కాశీ నుండి రామేశ్వరం వరకు మొత్తం భారతదేశమంతా వెతికారు. ఈ అన్వేషణలో వారికి నానా ప్రకారాల అనుభవాలు కలిగాయి. కొందరు ఊర్ధ్వరేతసులవడానికి శ్రీధితసఖియా - నెయ్యి చక్కెరతో తినమన్నారు. ఇంకొందరు ఇంకొకటి ఇలాగ... ఒక్కొక్కరు ఒక్కొ విధంగా సలహాలిచ్చారు. కొందరు వనమూలిక ఇస్తామన్నారు. అలాటివాటి వల్ల చమత్కారాలు చేసి లోక ప్రతిఫష్ఠ పొందాలన్న కోరిక కలిగితే ఇక ఈ ప్రతిష్ఠ గర్వము వీటివల్ల మాయా మోహాలలో చిక్కుకుపోతే ఏమి లాభం? అని అనుకున్నారు.

గోఆలంద్‌లోని ఒక చోట వీరికి స్త్రీలు చుట్టుముట్టారు. వీరు వారికి సాష్టాంగ ప్రణామం చేసి 'తల్లులారా! నాకు బజారుకు వెళ్లడానికి మార్గం చూపించండి' అన్నారు. మాతృభావం వల్ల వారి దృష్టి మారిపోయి ఆదరంగా వీరికి దారి చూపించారు. గారోపర్వతంపైన ఒక సిద్ధుడు కలిశాడు. వారికి జపవిధి, మంత్రము అడిగితే వారు ఎవరైతే నా కూతురును వివాహమాడతారో వారికి కట్నంగా నేను నా విద్యను ఇస్తాను' అన్నారు. అటు నుండి తిరిగి కామాఖ్య మందిరంలో జగదంబ దర్శనం కోసం బడపేటా వచ్చారు. అక్కడ భగవాన్ కాలియకాంతుడి దర్శనం చేసుకుని కొన్ని రోజులు అక్కడనే వుండి సాధనలో ప్రవృత్తులయ్యారు. ఈ విషయం మణిపూర్ రాజమాతకు తెలిసింది. వారు ఎంతో బ్రతిమాలి వారిని రాజమహల్‌కి తీసుకెళ్ళారు. అక్కడ విరక్తుడైన వారి రాజకుమారుడితో పరిచయం చేశారు. రాజ కార్యములు నిర్వహించు కొమ్మని వీరు చెబితే రాజ కుమారుడు ఇలా అన్నాడు, 'మహరాజ్‌జీ! (ఉత్తర భారతంలో గురువుగారిని అలా సంబోధిస్తారు) ఈ సంసారము అజగరము వంటిది. ఇది నోరు తెరుచుకుని కూర్చుని వుంది. రాగ-ద్వేషాలనే పళ్ళతో మనల్నందరిని నమిలి మ్రింగేస్తోంది. నేను అటువంటి రాగ-ద్వేషపూరితమైన వ్యవహారంలో పడదలచుకోలేదు'.

ఇపుడు బ్రహ్మచారి వాసుదేవ స్వరూప్‌కి 22 సం॥లు వచ్చాయి. బడపేటాలోని శివమందిరం యొక్క వృద్ధమహంత్ చాలా వ్యాధి గ్రస్తుడయ్యాడు. ఆ మహంత్ 'శిష్యులు రామేశ్వర యాత్రకు వెళ్ళివుండిరి. అస్వస్థులై ఒంటరిగా వున్న వారిని

చూసి వాసుదేవస్వరూప్ వారికి సేవ చెయ్యడం ప్రారంభించారు. వీరి ప్రేమ పూరితమైన సేవతో సంతుష్టులై వారు మందిర ధర్మాధికారులను పిలిపించి ఈ బ్రహ్మచారియే ఈ పీఠానికి ఉత్తరాధికారి అవుతాడు. వారినే నా తర్వాత మహంత్‌గా చెయ్యండి' అన్నారు.

పదిరోజుల తర్వాత వారి శరీరం శాంతమయింది. వారి ఆజ్ఞ ప్రకారం వాసుదేవ స్వరూపుడిని మహంత్ పదవిపైన అభిషిక్తుడిని చేశారు. కానీ వీరి మనసేమో ఈ మాయలో లిప్తమవకుండ జపము, అనుష్ఠానము, ఉపాసన-పూర్వంలాగే చేస్తుండేవారు. 'శత చండీ' అనుష్ఠానం చేశారు. దీనివల్ల వారికి 'వాక్‌సిద్ధి' కలిగింది. పరచిత్త జ్ఞానము కలిగింది.

పరచిత్త జ్ఞానము వల్ల వీరికి చాలా విక్షేపము కలిగింది. ఏ వ్యక్తి ఎదుటికి వచ్చిన వారి దోషం స్పష్టంగా కనిపించేది. 18 రోజులు జరిగేటప్పటికి ఈ సిద్ధి వల్ల వారికి చాలు చాలు నిపించింది. వారు జగదంబను ప్రార్థించారు 'అమ్మా! ఈ విక్షేపము నుండి నన్ను ముక్తుడిని చెయ్యి' అని. తల్లి దయవల్ల దాని బాధ తప్పింది.

ఆ వృద్ధ మహంత్ యొక్క శిష్యుడు రామేశ్వరం నుండి తిరిగి వచ్చాడు. ఈ పీఠానికి ఉత్తరాధికారిని నేనంటూ గొడవ చేశాడు. బ్రహ్మచారి వాసుదేవ స్వరూప్ స్వయంగా వారిని సమర్థిస్తూ వీరినే మహంత్‌గా చెయ్యమని చెప్పారు. నాకు ఈ గద్దె వద్దు అన్నారు. కానీ ట్రస్టీలు వీరిని వదలడానికి తయారుగా లేరు. అలాంటపుడు ఒక రోజు ఎవరికి చెప్పకుండా వీరు బడపేటా వదలి వెళ్ళిపోయారు.

మరల సిద్ధయోగుల అన్వేషణ మొదలుపెట్టారు. ఆసామ్, భూటాన్‌లలో చాలామంది హఠయోగులని చూశారు. నిర్వికల్ప సమాధి స్థితిని పొందిన యోగి కోసం చూశారు. కూచ బీహార్‌లో ఒక హఠయోగి కలిశారు. వారు వాసుదేవ స్వరూపుడి చేత ఆసనాలు, త్రాటకము, ధ్యానము, ధారణ మొదలైనవి అభ్యసింపజేశారు. సమాధి స్థితిని కూడా పొందారు. కాని ఆఖరున ఈ యోగి కూడ నిర్వికల్ప సమాధి పొందలేదని తెలిసిపోయింది.

బాలేశ్వరమనే వూరిలో ఒక ఇంట్లో నిప్పంటుకుంది. ఆ ఇంట్లో వారు బయటికి రాగలిగారు కానీ ఆ ఇంట్లోని నవవధువు మాత్రము లోపలే వుండిపోయింది. అందరూ వ్యాకులతతో బాధపడుతూ అరుస్తున్నారేకాని ఎవ్వరూ ఆ మంటల్లో వెళ్ళడానికి సాహసం చెయ్యలేకపోయారు. అపుడా దయనీయమైన స్థితిని చూసి ఆ చెలరగిన మంటల్లో దూరి ఆ నవవధువుని బయటికి తీసుకువచ్చారు. కానీ తాను బ్రహ్మచర్య వ్రతంలో వున్నందున స్త్రీ స్పర్శ కూడదు కదా. అందుకని వీరు మూడు రోజులు రాం(త్రింబవళ్ళు ఉపవశించి ప్రాయశ్చిత్తం చేసుకున్నారు.

రామేశ్వరధామములో పది రోజులుండి సిద్ధయోగుల అన్వేషణ చేశారు. తర్వాత పండరపురము, పూనా, బొంబాయి మీదుగా హరిద్వారము, ఋషీకేశము వచ్చారు. ఎక్కడా తమ మనసుకు నచ్చినటువంటి యోగుల దర్శనం కలగలేదు. సుదీర్ఘ తీర్థాటన తర్వాత మరల గోవర్ధనమఠానికి తిరిగి వచ్చారు.

జ్యోతిషులు వీరు అల్పాయుష్కులని చెప్పారు. అందువల్ల వీరికి అనిపించింది 'ఈ శరీరము ఎప్పుడు పోతుందో తెలియదు. అందువల్ల సన్యాస దీక్ష తీసుకోవడమే మంచిది, అని ఆచార్య చరణులతో విన్న వించుకున్నారు. వారు కూడ సహర్షంగా వీరిని స్వీకరించారు. ముప్ఫై రెండు సంవత్సరాల వయసులో విక్రమ నామ సంవత్సరం (1964)లో వీరు సన్యాసం స్వీకరించారు. ఇప్పుడు వారికి యోగపట్టము ఇచ్చారు. 'దండీ స్వామి శ్రీ పూర్ణానంద తీర్థ'అని. కానీ వీరు ఉడియా బాబాజీ అన్న పేరుతో మహరాజశ్రీ ప్రఖ్యాతులయ్యారు. ఆచార్య చరణులకు వీరే ఆచార్య పీఠాన్ని సంబాళించుకోవాలని వుండేది. కానీ మఠము యొక్క వైభవము వీరిని ఆకర్షించలేక పోయింది. వీరు దానిని వదలి వెళ్ళిపోయారు. వెళ్తూ వెళ్తూ దండకమండలములను కూడా సాగరుడికి సమర్పించారు. ఎపుడైతే అన్నీ త్యాగం చేశామో ఇక జన్మకర్మ సన్యాసులకు తుష్టి కలిగించే ఈ ధర్మధ్వజం మాత్రము ఎందులకు అని అనుకున్నారు.

పూరి నుండి రాణిగంజ్, అటు నుండి వైద్యనాథధామ్, మరల అక్కడి నుండి కాశీ వెళ్ళాలనుకున్నారు మహరాజజీ. ఒక బ్రహ్మచారి అన్నారు, కాలినడకన వెళ్ళాలంటే చాలా దూరమవుతుంది. రైలులో వెళ్ళండి అని సలహా ఇచ్చాడు. సరే అనుకుని స్టేషనుకు వెళ్ళారు. అక్కడ ఆ బ్రహ్మచారి వీరికి తెలియకుండా పానీయంలో భంగు

కలిపి త్రాగించారు. ఎప్పుడూ మాదక ద్రవ్యములను సేవించలేదు. వీరికి రైలు మారాలి కానీ వీరు మెలకువ లేకుండా మత్తుగా పడివున్నారు. కాశీ వెళ్ళాల్సింది, ఛాప్రా వెళ్ళారు. టికెట్ కలెక్టరు కాశీ టికెట్టు చూసి అగ్గిమీద గుగ్గిలమయ్యాడు. చాలా కోపంతో ఇలా అన్నాడు 'నీకు ఈ రైలు కాశీ వెళుతుందా ఛాప్రా వెళుతుందా అన్నది కూడా తెలియదా? పెద్ద సాధువటమరి' టికెట్టు కలెక్టరు చేసిన అవమానం చాలా మనసుకు తగిలింది. స్టేషను నుండి బయటికి వచ్చి గంగాతీరమునకు వెళ్ళి అక్కడ గంగా జలము చేతిలో తీసుకుని 'ఇక ఎప్పుడూ ఏవిధమైన వాహనముపైన కూర్చోను' అని సంకల్పం చేసుకున్నారు.

ఇక మహారాజశ్రీవారి పాద యాత్ర మొదలైంది. ఇక ఛపరా నుండి కాశీకి బయల్దేరారు మహరాజ్‌జీ. గంగా నది తీరతీరాల నుండి నడుస్తూ గాజీపూర్ చేరుకున్నారు.

ఎవరినీ ఏమీ అడిగేదిలేదు. అయాచిత వృత్తి యాదృచ్ఛికంగా ఏది దొరికితే అదే. అలాగే అక రోజు ఏదో పండు దొరికింది. అది చాలా చేదుగా వుండింది. అది తినంగానే వారికి కలరా సోకింది. వాంతులు, విరోచనాలతో సుస్తీపడ్డారు. మూర్ఛావస్థ వచ్చింది. డబ్బు లేక సంస్కారం చేయలేనటువంటి శవాలు నీటిలో కొట్టుకుని కొట్టుకుని ప్రవహించి ఒక చోట కూడినవి ఆ గుంపులో వీరుకూడా పడివున్నారు. సాయంకాలం ఎవరో శవసంస్కారం చేయడానికి వచ్చిన వాళ్ళు వీరు వేదనతో మూలగడం చూసి దగ్గరికి వచ్చి చూశారు. వీరి శరీరంలో ప్రాణం వుంది. వారు వీరికి స్నానం చేయించి, బట్టలు శుభ్రం చేసి అక్కడ తీరం దగ్గర వున్న ఒక వట వృక్షం క్రింద పడుకోబెట్టారు. పెరుగు తెచ్చి తినిపించారు. అదీ అరగలేదు. వాంతి అయిపోయింది. రాత్రంతా అర్ధ మూర్ఛావస్థలోనే వున్నారు. ఉదయం సూర్యోదయంతో పాటు వీరి శరీరంలో నవజీవనం కలిగింది. దగ్గరలోనే ఒక ఉదాసీన బాబా గారి స్థానమున్నది. వారి దర్శనార్థము వెళితే వారు వీరికి పెరుగు-ఖిచిడి (పొంగలి) తినిపించారు.

తర్వాత ఒక పరమహంస ఆశ్రమమం చేరారు. వారన్నారు 'ఇది మీకు కొత్త ప్రదేశం, కొత్త భాష, ఇక్కడి భోజనపానాదులు, ఆచారవ్యవహారాలు మీకు తెలియదు.

ఇక్కడ మీరు అయాచిత వృత్తితో వుండాలంటే చాలా కష్టం. అందువల్ల మాధుకరి వృత్తితో వుండటం మంచిది' అన్నారు. వారి సలహా ప్రకారం మాధుకరి వృత్తి చేస్తే మానాప మానాలు, ప్రియ, అప్రియ వచనాలు, ఆకలి దప్పులు మొదలైన ద్వంద్వాలను సహించుకోవడానికి అభ్యాసమవుతుంది అని అనుకున్నారు. తితిక్ష, తపస్సు వృద్ధి అవుతుంది. మరి ఆ విశ్వంభరుడి విధానము కూడా అనుభవమవుతుంది.

సైద్‌పూర్ నుండి ముందుకు నారాయణ నదికి కుడివైపు నడవడం ప్రారంభించారు. రాజవారీ స్టేషను దగ్గర ఒక దక్షిణాది స్వామి స్థానం కనిపించింది. దాని మహంతు రోగగ్రస్తుడై మంచం పట్టాడు. వారిని ఆ నిస్సహాయ స్థితిలో చూసి వారికి సేవ చేయడం మొదలెట్టారు. వారు చాలా జబ్బు పడ్డారని ఆశ్రమ ప్రబంధన సమితి మహారాజశ్రీని మహంత్ చెయ్యాలని నిశ్చయించారు. ఆ మహంతు అనుమతి తీసుకుని వీరిని విధివత్ మహంత్ పదవిపై అభిషిక్తుడిని చేశారు. మహరాజశ్రీ వారి వ్యవహారము, పూజాపారాయణ, సాధన, వీటిని చూసి అక్కడ ప్రజలు చాలా సంతుష్టులయ్యారు. ఏకాదశి రోజు శంకర భగవానుడికి అలంకారము రుద్రాభిషేకము, సంకీర్తన మొదలైన కార్యక్రమాలు మొదలుపెట్టారు. దీనితో అక్కడి ప్రజలలో చాలా ఉత్సాహం కనిపించింది. మెల్ల మెల్లగా దక్షిణాది స్వామికి స్వస్థత చేకూరింది. వారికి ఎపుడైతే ఏకాదశికి ఈ కార్యక్రమాలు మొదలెట్టారని తెలిసిందో అప్పుడు వారికి చాలా కోపం వచ్చింది. ఒకరోజు ఎవరో మహాత్ములు వచ్చారు. వారి దర్శనానికి నేను వెళ్తున్నాను.' అని మహరాజశ్రీ అనగానే వారు అన్నారు 'మహంత్‌లకు ఒక మర్యాద వుంది. వారు ఇతరుల దగ్గరికి వెళ్ళకూడదు. ఎవరికైన రావాలని వుంటే వారే వస్తారు!

మహరాజశ్రీ వారికి ఈ విధమైన కట్టడి నచ్చలేదు. ఆ రోజు రాత్రే వారు అక్కడి నుండి కాశీవైపు పాదయాత్ర చేశారు. గోవర్ధన పీఠము యొక్క వైభవము ఎవరిని బంధించ లేకపోయినదో వారిని ఈ చిన్న ఆశ్రమ-మహంత్ పదవి బంధించగలదా?

ఈ రోజుల్లో మహరాజశ్రీలో తత్త్వజిజ్ఞాస తీవ్ర రూపం దాల్చింది. కొత్త ప్రదేశం, కొత్త భాష. రొట్టె తినే అలవాటు లేదు, తింటే అరగదు. రోజు రోజుకు శరీరం చిక్కి శల్యమయింది. కాశీలో అన్నపూర్ణ, విశ్వనాథుల దర్శనం చేసుకుని గంగాతీరంలో వుంటూ రోజులు గడపసాగారు. తర్వాత ఒక మహాత్ముడు బలవంత చేస్తే అపుడు

అక్కడికి ఏడు మైళ్ళదూరంలో గంగాతీరంలో వున్న ఒక ఆశ్రమంలో చాతుర్మాస్యము చేశారు. అక్కడ చాలా మంది మహాత్ములుండేవారు. వేదాంత చింతనలో గడిపేవారు. గీతా, బ్రహ్మ సూత్రాలు, ఉపనిషత్తులు మొదలైన వాటిపైన విచారణ, విమర్శలు జరుగుతూండేవి. మహరాజశ్రీకి వీటిపట్ల (చర్చల) విశేషమైన అభిరుచి వుండేది కాదు. వారి హృదయంలో తత్త్వవిచారపు జిజ్ఞాస ఉగ్రరూపము ధరించింది. వారికి శాంతి దొరకలేదు.

'నేను ఎవరిని? ఈ ప్రపంచానికి కర్త ఎవరు? ఈ జగత్తు ఏమిటి? వస్తుస్థితి ఏమిటి?' రాత్రింబవళ్ళు అలాంటి ప్రశ్నలను చింతన చూస్తూ వుండేవారు. కొందరు ప్రస్థాన త్రయం అధ్యయనం చెయ్యమని సలహా ఇచ్చారు. కానీ బండి ముందుకు సాగలేదు. అలాగే తిరుగుతూ తిరుగుతూ ప్రయాగ క్షేత్రానికి వచ్చారు. ఆ సమయములోని తన స్థితిని వర్ణిస్తూ మహరాజశ్రీ ఇలా చెప్పారు. 'అపుడు ఆ సమయంలో నా స్థితి పిచ్చికుక్క స్థితిలాగ వుండేది. ఎవరినీ లెఖ్ఖ చేసేవాడిని కాదు. ఖండించడమే పని. ఆందోళనయే ఆందోళన. అన్ని నమ్మకాలూ సమాప్తమైపోయాయి.'

కఠోర సాధన చేసేవారు. విరక్తికి చరమసీమ, పాదయాత్ర. ఏ చెట్టు కిందో పడివుండడం. దొరికితే తినటం లేక పోతే నిరాహారం. పెనుగాలులు, తుఫాను, వర్షాల యాతన. ఒకరోజు చాలా ఉద్వేగము కలిగింది. జీవనమే భారం అనిపించింది. ఎందుకీ బ్రతుకు? అని అనిపించింది. ఇంత వరకు సర్వ సాక్షాత్కారము కలగలేదు. ఇటు వంటి జీవితం కంటే మృత్యువే మేలు.

తన వెంటవున్న ఒకే ఒక్క వస్తువు సొరకాయ బుర్ర కూడ గంగానదిలో విసిరేసి తను కూడా గంగానదిలో దూకాలనుకున్నపుడు హఠాత్తుగా భగవాన్ శంకరుడి వాణి వినిపించింది, 'ఆగు. చూడు చచ్చి ఏమి సాధిస్తావు? విచార చంద్రోదయ మవుతుందేమో, ఈ సంతప్త జీవితంపైన కూడ అమృత దృష్టి పడవచ్చు.'

మహరాజశ్రీ ఈ అంతర్ధ్వని కారణంగా గంగానదిలో ప్రాణత్యాగం చెయ్యాలన్న విచారాన్నయితే వదిలి వేశారు కాని హృదయములో చాలా అశాంతి వుండేది. దగ్గరలోనే ఒక పురాతన శివ మందిరం వుండేది. వీరు వెళ్ళి అందులో పడుకున్నారు.

శ్రద్ధా, విశ్వాసము, ఆశ అన్నీ సమాప్తమయ్యాయి. వీరు శివలింగంపైన కళ్ళు పెట్టి పడుకున్నారు. కాని శంకరుడు ఆశుతోషుడు కదా. మహరాజశ్రీకి ధ్యానంలో వారి ఎదురుగా ఇద్దరు మహాత్ములు కనిపించారు. ఒకరు సదాశివుడు, మరొకరు వసిష్ఠ మహాముని. గౌరవర్ణంతో భస్మ త్రిపుండ, రుద్రాక్షలతో విభూషితులైన దివ్య మూర్తులు దర్శనమిచ్చారు.

నమస్కరించి జిజ్ఞాసువు తన ప్రశ్నలను వారి చరణాల వద్ద నివేదించారు. ప్రశ్నలకు వెంట వెంటనే సమాధానాలు కూడా వచ్చాయి. ఒక దానికంటే ఒకటి అఖండమైన, దృఢమైన జవాబులు. అన్ని సంశయాలు ఒకటి ఒకటిగా తీరిపోయాయి. ఈ క్రింది రెండు శ్లోకాలు గుర్తు పెట్టుకోమని చెప్పారు.

నేతి నేతీతి నేతీతి శేషితం యత్పరం పదమ్ ।
నిరాకర్తుమశక్యత్వాత్తదస్మీతి సుఖీభవ ॥

జడతా వర్జయిత్వైతాం శిలాయా హృదయం చయత్ ।
అమనస్కం మహాబాహో తన్మయో భవ సర్వదా ॥

ఇది లేదు, ఇదిలేదు అలా స్థూలసూక్ష్మ కారణ ప్రపంచాలను నిషేధించిన తర్వాత ఏదైతే నిషేధించలేనటువంటి పరమపదము మిగిలివున్నదో, అదే నేను. అని తెలుసుకుని నీవు సుఖివిగా. ఈ అజ్ఞాన రూపమై జడత్వము వదలి శిలా హృదయ సమానంగా - అంటే ఘనీభూతమైన అమనస్కత ఏదైతే వుందో అందులో సర్వదా తద్రూపుడవై శుద్ధ చిన్మాత్రుడివిగా వుండు.

ఎటువంటి అమృతమయమైన సమాధానము. మహరాజశ్రీ కృతకృత్యులైనారు. వారి ఉద్వేగము, ఆందోళన శాంతించింది. జ్ఞాన-విజ్ఞాన రసధార ప్రవాహితమైనది. దానిని వివేచన చేస్తూ వారు ఇలా అంటారు. 'వైరాగ్యము యొక్క ఫలము బోధ, బోధయొక్క ఫలము ఉపరతి. రెంటికీ అంతరం ఇదే - వైరాగ్యము కలిగిన తర్వాత విషయముల పట్ల గ్లానికారణంగా భోగాసక్తి కలుగదు. ఉపరతి కలిగిన తర్వాత వస్తువు ఎదుట వున్నకూడా భోగప్రవృత్తి కలుగదు. దీని తర్వాత ఉపరతి వల్ల ఫలము-ఆనందము, ఆనందము యొక్క ఫలము శాంతి.

ఇపుడు వారి జిజ్ఞాస సమాప్తమయినది. అనంత రస పిపాస జాగృతమయింది. అనంతంలో కలిసిపోవాలన్న ఆకాంక్ష తీవ్రమయింది. ప్రేమరసమే జీవనరసమై అంగాంగాల్లో తొణికిసలాడింది.

గంగాతీరం వెంట నడుస్తూ కాన్పూర్ వైపు ప్రయాణించారు. ఒక దగ్గర ఊబిలో ఇరుక్కుపోయారు. ఎంతపైకి రావాలనుకున్నా అంతలోపలికి కూరుకుపోతున్నారు. ఇక అంత్యకాలమే అని అనుకున్నారు. అపుడు సహజ భావంలో స్వరూప స్థితులయినారు. జీవన్మరణాలను గురించిన చింతయితే లేనే లేదు. వారి స్థితి 'నాభినందతి మరణం నాభినదంతి జీవనం' అన్నట్లుంది. అపుడే కొందరు వ్యక్తులు పరుగెత్తుకుంటూ వచ్చారు. వారు ఒక వస్త్రమును విసిరివేసి 'బాబా! దీన్ని పట్టుకోండి' అన్నారు. బాబా పట్టుకున్నారు. అపుడు బాబాను ఊబి నుండి బయటకు లాగారు.

కాన్‌పూర్ నుండి వారు విఠూర్ వెళ్ళారు. జ్ఞానాశ్రమ్ స్వామి వారి దర్శనం చేసుకుని బరువాఘాట్ చేరారు. కొన్ని రోజులు అక్కడనే వున్నారు. ఆ స్వామి ప్రాణాయామంలో చాలా కుశలురు. ప్రాణాయామం నేర్చుకోవడానికి చాలా నెలలు వారి దగ్గరరే వున్నారు. శీతాకాలంలో ప్రాణాయామాల అభ్యాసము మొదలు పెడుతూండగానే స్వప్నములో జగదంబ దర్శనమిచ్చి 'ఈ పద్ధతి నీకు అనుకూలించదు, నీకు రాజయోగము అభ్యసించడమే మంచిది. ఇపుడు నీవు ఏది చేస్తున్నావో దానిని మార్చవలసిన ఆవశ్యకత లేదు' అని ఆదేశమిచ్చింది.

ఒక సంవత్సరము అక్కడవున్న తర్వాత మహరాజశ్రీ గంగాతీరానికి పై భాగమువైపు వెళ్ళారు. అక్కడ 30 సంవత్సరాలు ఒక వట వృక్షము క్రింద వున్న బర్‌గదియా బాబా దగ్గరికి వెళ్ళారు. ఇంకా అన్య సంత్‌మహాత్ములతో సత్సంగము చేస్తూ ఫరూఖాబాద్ వెళ్ళారు. అక్కడి నుండి గంగానది దాటి ఢాయిఘాట్ వెళ్ళారు. అక్కడ స్వామి ఆత్మానంద్ గారితో సత్సంగము చేసి మరల గంగదాటి ఇటువైపు ప్రయాణించ సాగారు.

ఆషాఢ మాసము. రాత్రి సమయం. దూర దూరం వరకూ ఎక్కడా ఒక పల్లె అయినా కనిపించలేదు. ఎక్కడ జనసంచారము కూడా లేదు. ఆకలి వేస్తోంది. మరో

ఉపాయం లేదు. అందుకని మహరాజశ్రీ ఒక శిశుంపా వృక్షము క్రింద సిద్ధాసనము చేసుకుని కూర్చున్నారు.

కొద్దిసేపట్లో ఆకాశంలో చంద్రోదయమయినది. ఇంతలో ఎక్కడి నుండో ఇద్దరు అందమైన బాలురు నవ్వుతూ తుళ్ళుతూ బాబాగారి దగ్గరికి వచ్చారు. 'బాబా! రొట్టె తింటారా?' అని అడిగారు.

వీరు అన్నారు 'సరే పిల్లలూ! మీ ఇల్లెక్కడ మీ జాతి ఏమిటి? వారు నవ్వుతూ 'మేమిక్కడ దగ్గరి పల్లెలో వుంటాము బాబా. మేము వైశ్యులము' అన్నారు. బాబా 'మీరు ఇంత రాత్రి ఒంటరిగా ఎందుకు తిరుగుతున్నారు?' బాలురు 'అలాగే ఆడుతూ ఆడుతూ ఇటు వచ్చాము.' అప్పటి వరకు బాబా బ్రాహ్మణుల యింటిలోనే భిక్షను స్వీకరించేవారు. కానీ ఈ బాలురను చూసి ముగ్ధులై వీరి బిక్షను స్వీకరించారు. విధి నిషేధముల శృంఖలం తెగిపోయింది.

కొద్ది సేపట్లో పిల్లలు రొట్టె, అరటి కాయ కూర తీసుకువచ్చారు. వీరు భోజనం చేశారు. పిల్లలు ఆడుతూ వున్నారు, బాబా భోజనమయిన తర్వాత మేము వెళ్ళమా అని అడిగి, బాబా సరే నంటే వెళ్ళిపోయారు.

మహరాజశ్రీ కాసేపు నిద్రించి లేచేటప్పటికి బ్రహ్మ ముహూర్త సమయానికి ఆ బాలురు మరల హాజరయ్యారు. అరె! ఇంకా తెల్లవారనేలేదు మీరు అపుడే ఎలాగవచ్చారు? అని బాబా అడిగారు. మేము ఆడుకోవడానికి వచ్చాము. అది సరే! మీకు త్రాగడానికి ఏమైనా కావాలా? అని అడిగారు. బాబా సరే నంటే వెళ్ళి ఒక మట్టి కుండలో మజ్జిగ తీసుకు వచ్చి బాబాగారి తుంబాలో పోసి వెళ్ళిపోయారు.

సూర్యోదయమైన తర్వాత బాబా దూరదూరం వరకు చూశారు. ఎక్కడా ఏదీ వూరున్నట్లు కనిపించలేదు. మార్గ మధ్యములో ఒక మహాత్ముడితో ఈ ప్రసంగమును గురించి చెబితే వారు 'ఇది విశ్వంభరుడి లీల' అని అన్నారు.

ఆనందంలో తేలుతూ మహరాజశ్రీ ముందుకు సాగారు. 'హరి ఆశిక్ కా మగ్ న్యారాహై' అనే పాటను మెల్లగా పాడుకుంటుంటారు. వారి శ్రీముఖం నుండి వెలువడి ఆ పాట ఆ వాతావరణంలో కలిసిపోయింది.

జిన్ ఖాన్ పాన్ నహి భావై హై । నహి కోమల్ వసన్ సుహవై హై ॥
సబ్ విషయభోగ్ నిత్ ఖారాహై, హరి ఆశిక్ కామగ్ న్యారా హై ॥
తిన్ సబ్‌సే నాతా తోడాహై, విషవిషయం సేమన్ మోడా హై ॥
నహి శృతికే కింకర్ హోతేహై, మన్ వాక్ అగోచర జోవే హై ॥
తిని విధి నిషేధ్ కోజారాహై । హరి ఆశిక్ కామగ్ న్యారా హై ॥
జైసా తను చలే చలాతే హై, జబ్ హరి దేవేతబ్ ఖాతే హై ॥
తిన్‌కే సంగ్ ఫిర్‌తా ప్యారా హై, ప్రియ సహత సభీ జగ్ జీతే హై ॥
జో ప్రేమ పియాలపీతే హై, ప్రియ సమేత సభీ జగ్ జీతేహై ॥
కుచ్ కరనా నహీ విచారా హై, హరి ఆశిక్ కా మగ్ న్యారాహై ॥

గఢీరామ్‌పూర్‌లో బ్రహ్మచారి మోతీరామ్ ఒక పాఠశాల నడిపేవారు. వారు బ్రతిమాలుకుంటే మహరాజశ్రీ వారు అక్కడ చాతుర్మాస్యం చేయడానికి ఒప్పుకున్నారు. విద్యార్థులకు ప్రేమతో చదువు కూడా చెప్పేవారు. ఆవూరి వారి బలవంతపై అక్కడ వారు రెండు సంవత్సరాలు వున్నారు. తర్వాత ఎటా జిల్లాలోని సహవాజపురములో కొన్ని రోజులు, మోహన్‌పూర్‌లో కొన్ని రోజులు ఆనందంగా వున్నారు. గ్రామీణులతో చాలా ఆత్మీయత ఏర్పడింది. వారంతా మహరాజశ్రీ వారు ఇక ఇక్కడనే వుండిపోతారు అని అనుకున్నారు. కానీ 'రమ్‌తా జోగి, బహతా పానీ, ఇన్‌కో కౌన్ సకే ఠహరాయ్?'

శ్రీ మహరాజశ్రీ వారి తీర్థాటనము, సత్సంగము, చింతన, మననము, సాధన చాలా సంవత్సరాల వరకు అలాగే సాగింది. ఈ యాత్రా క్రమములో వారు గంగా తీరములో వున్న రామ్‌ఘాట్ చేరారు. అనూప్ శహర్ నుండి రామ్‌ఘాట్ వరకు గల గంగానదీ తీరము పైననే వారు ఎక్కువగా నివసించారు. ముఖ్యంగా రామఘాట్ మరియు కర్ణవాస్‌లలోనే ఉండేవారు. ఇక్కడ దాదాపు పది సంవత్సరాల కాలం వీరి తీవ్ర సాధన జరిగింది.

ఆనందామృతంలో మునిగిన మహరాజశ్రీ వారు విక్రమనామ సం॥ 1972లో ఆషాఢమాసములో మొట్టమొదటి సారిగా రామ్‌ఘాట్ వచ్చారు. రాగ, విరాగాలు, ప్రేమ, ఉపరతి, తితిక్ష ఈ భావాలన్నీ వారు ముఖ కమలంపై నర్తిస్తుండేవి. రామ్‌ఘాట్ యొక్క రమణీయ మనోహరమైన గంగాతటము, అక్కడి భూదేవి యొక్క అద్భుత

దీప్తి వారిని ముగ్ధులను చేశాయి. అక్కడ మహాదేవుడి దర్శనం చేసుకుని ఇమ్లీవాలీ కుటీరంలో ఆసనం జమాయించారు.

మోహనపురంలో వున్నప్పుడే వారు సంప్రజ్ఞాత-అసంప్రజ్ఞాత సమాధుల యొక్క స్పష్ట అనుభవం పొందివున్నారు. రాత్రింబవళ్ళు సమాధిస్థితులై వుండేవారు. ఇరవై నాలుగు గంటలూ ఆనందమే ఆనందము.

ఇమ్‌లీవాలీ కుటీరంలో ప్రేమరసానందానుభూతిలో వుంటూ, వారు చాంద్రాయణాది అనేక వ్రతములను ఆచరించారు. బుద్ధ భగవానుడి లాగ వారు ప్రచండ తపస్సులో సంలగ్నమయ్యారు. చిదానంద సింధువులో వారు మునిగి తేలుతూ వుండేవారు. ఆ ఆనందంలో అపుడపుడు ఇలా పాడుకునేవారు.

తదానైవ బాలో యువా భోగలోలస్తథా నైవ వృద్ధః సమాసన్న కాలః ।
నవా సాధుశీలోఽప్యథాసాదు శీలః చిదానంద సింధౌ యదాహం నిమగ్నః ॥

తదా నైవ బద్ధో నముక్తో నరాగీ విరాగీ న సంగీ త థానో వియోగీ ।
న యోగీ న భోగీ న సంసార రోగీ చిదానంద సింధౌ యదాహం నిమగ్నః ॥

తదా నైవ జాగ్రత్సుషుప్తిన్న చాస్తిన వా స్వప్న యేషా తురీయాపి కాచిత్ ।
నహి చోన్మనీనోగతాయాతనామ్నా చిదానంద సింధౌ యదాహం నిమగ్నః ॥

తదా నాసనం ప్రాణ రోధో నిరోధీ నవా ధారణానో న వా ధ్యానమేకమ్ ।
తదా కారకాణాం సమాధిర్నకశ్చిత్ చిదానంద సింధౌ యదాహం నిమగ్నః ॥

తదా నాప్య బేధో నబేధో నబోధో చాబోధ ఏష వినోదో న ఖేదః ।
అహో నా ముకుందో నచానందకందో చిదానంద సింధౌ యదాహం నిమగ్నః ॥

ఈ చిదానంద సింధువు యొక్క ఆ ఆనందం ఏమని చెప్పగలము? 'యథావస్థితోఽహం తథైవాస్మి సిద్ధః' అలాగని ఈ స్థితిని వర్ణించవచ్చు.

ఈ రోజుల్లో మహారాజశ్రీ వారు రోజంతా సిద్ధాసనంలో కూర్చునే వుండేవారు. రాత్రి కూడా పడుకునేవారు కాదు. కూర్చుని కూర్చుని ఎపుడైన అలసిపోతే అలాగే

మోకాళ్ళ ముందువైపు వంగి కొంచెం విశ్రమించేవారు. ఈ ప్రకారంగా సంవత్సరాల కొద్దీ వారు అలాగే పడుకోకుండానే విశ్రాంతి తీసుకునేవారు.

స్త్రీల సంపర్కము నుండి దూరంగా వుంటము వారి నియమము. 'వర్జఇత్వా స్త్రియః సంగం కుర్యాదభ్యాసం సమాదరాత్' అన్నది వారు విశ్వసించేవారు. 'ఎవరైన స్త్రీ నా దృష్టికి ఎదురుగా వచ్చిందంటే నేను ఈ స్థలం వదిలిపెట్టి వెళ్ళిపోతాను' అని అక్కడి వారికి వారు చెప్పి వుంచారు.

వారు సమాధి స్థితిలో ఎంత లీనమైపోయేవారంటే ఒక్క క్షణము బహిర్ముఖత కూడా నచ్చేదికాదు. ఒక ముద్ద తీసుకుని నోట్లో పెట్టుకోవడం కూడా భారంగా వుండేది. రెప్ప వేయడం కూడా కష్టమనిపించేది. అన్నాహారాలు వదిలివేశారు. వ్రత అనుష్ఠానాలే ఎక్కువగా చేస్తుండేవారు. ఈ విధంగా చాలాకాలం కఠోర సాధన జరుగుతూ వుండేది. జనసందోహం నుండి కూడా దూరంగా వుంటూ ఏకాంతములో సాధన చేశేవారు. ఇందుకోసమని చాలాసార్లు వీరికి తమ స్థానాన్ని మార్చవలసివచ్చేది.

బ్రహ్మనిష్ఠ విరక్తసంత్ మహాత్ముల, పరమహంసల శృత-లక్షణాలు వీరిలో ప్రకటమయినవి.

'శాంతా దాంతా ఉపరతాస్తితిక్షవః సమాహితా ఆత్మరతయ ఆత్మక్రీడా ఆత్మవిధునా ఆత్మానందాః ప్రణవమేవ పరం బ్రహ్మాత్మప్రకాశం శూన్యం జానంత స్తత్రైవ పరిసమాప్తా'

శ్రీ మహరాజశ్రీ వారి సాధనా సౌరభము మెల్ల మెల్లగా నాలుగుదిక్కుల వ్యాపించింది. ఆ సౌరభానికి ఆకృష్టులై ప్రజలు వారి దగ్గరికి రావడం మొదలుపెట్టారు. అనేక రకాల భక్తులు పరుస కట్టారు. మంచివారు వచ్చేవారు, చెడ్డవారు వచ్చేవారు. సత్పురుషులు వచ్చేవారు. దొంగలు, బందిపోట్లు వచ్చేవారు. కొందరు ధూపదీపాలతో నైవేద్యాలతో షోడశోపచార పూజలు చేస్తే కొందరు వారిపై నాగాంజలులు వేశేవారు. ఒకసారి ఒక సింహము అటుగా వచ్చింది. జనం భీతి చెందారు. మహరాజశ్రీ అన్నారు 'అన్నా! భయమెందుకు? అది చాముండేశ్వరి దర్శనం కోసం వచ్చింది. దర్శనం చేసుకుని వెళ్ళిపోతుంది! అన్నారు. అది అలాగే వెళ్ళిపోయింది.

ఒక సారి వేసవిలో ఒక డాకూ - సర్దార్ వీరి దర్శనం కోసం వచ్చారు. ఆ డాకూపైన 10వేల రూపాయలు (పట్టిచ్చినవారికి) బహుమానం వుంది. చెట్టుకు తుపాకీ ఆనించి ప్రణామం చేయడానికి వచ్చారు. యోగక్షేమాలయ్యాక మెల్లగా బయట పెట్టాడు 'మహరాజశ్రీ! దొంగతనం చెయ్యడానికి వెళ్తున్నా' అని.

బాబా 'ఒకమాట చెబుతా వింటావా'

డాకూ 'ఏమిటి మహరాజజీ'

బాబా 'చూడు, స్త్రీలను తాకవద్దు'

డాకూ 'సరే నేను ప్రతిజ్ఞ చేస్తున్నా స్త్రీలపైన చెయ్యి వేయను'

ఒక జమీందారుడి ఇంట దోపిడీ చేశారు. లూఠీ చేసిన సొమ్ముతీసుకుని వూరిబయటకు రెండు మైళ్ళు వచ్చాక చూస్తే వాళ్ళ వెంటవున్న దొంగలు జమీందారు కూతురుని మంచంతో సహా ఎత్తుకుని వచ్చేస్తున్నారు. అది చూసి ఆ దొంగల సర్దారు గర్జించాడు 'ఎందుకు తీసుకువచ్చారు? తిరిగి తీసుకుపొండి'. దొంగలన్నారు 'ఇపుడక్కడికి వెళితే చంపేస్తారు' వూరంతా ఏకమై మమ్మల్ని అంతం చేస్తారు. అయినా సరే ఆ సర్దారు 'పద నేనూ వస్తాను' అన్నారు. మంచంతో పాటు ఆమెను వూరి దగ్గర వదిలి దొంగల ముఠా తిరిగి వచ్చింది. డాకూ సర్దార్ డేరాకి వచ్చాక పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. చిత్తము అత్యంత వ్యధితమయినది. 'ఎలాంటి జీవితమిది? లోకులు ఆక్రందనలు చేస్తుంటే వారిని బాధించి ధనం కొల్లగొడతాము. మాతోటివారేమో స్త్రీలపై అత్యాచారం చేస్తారు' ఇలా ఆలోచిస్తు పరివర్తనము కలిగినది. వాడు శాశ్వతంగా ఈ దుర్మార్గాన్ని వదిలిపెట్టాడు. మహరాజశ్రీ వారి ప్రేరణతో అలాగ ఎంతో మంది దోపిడీలు మాని సత్పథంలో అడుగుపెట్టారు.

'రామఘాట్‌లో శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్ వచ్చి వున్నారు. వారిలో యతికి వుండవలసిన అన్ని లక్షణాలు వున్నాయి' అని విని అక్కడి 'నరవరం'లోని పండితులు చాలా మంది వచ్చి మహరాజశ్రీని దర్శించారు. అక్కడి సాంగవేద విద్యాలయము యొక్క అధ్యాపకులు, వారి విద్యార్థులు ఎపుడూ వస్తూ సత్సంగము చేస్తూ వుండేవారు.

సం.1915లో మహరాజశ్రీ వారు నగరము నుండి కర్ణవాసము వచ్చారు. అక్కడ (ఝూడియోం) ఉంటూ సాధన చేసేవారు. అక్కడ వారికోసం ఒక గుహ, ఒక కుటీరం తయారు చేశారు. అక్కడ కొన్ని రోజులున్న తర్వాత మహరాజశ్రీ అక్కడికి 5 మైళ్ళ దూరంలో వున్న భృగుక్షేత్రంలోని భేరియా గ్రామమునకు వచ్చారు. అక్కడ అచ్యుతముని లాంటి విరక్త, త్యాగీ, విద్వాన్ మహాత్ముల సత్సంగం లభించింది. ఏ రోజైతే మహరాజశ్రీ తూర్పు నుండి భృగుక్షేత్రం వచ్చారో అదేరోజు హరిబాబా పశ్చిమము నుండి విచరణ చేస్తూ అక్కడికి వచ్చారు. ఇద్దరు మహాత్ముల కలయిక ఇద్దరు శరచ్చంద్రులు పరస్పరం ఆలింగనము చేసుకున్నట్లున్నది. ఈ కలయిక అత్యంత ప్రేమ పూర్ణము, సౌహార్ద్రపూర్వము - ఆ భావం దినదినాభివృద్ధినొందింది.

ఏ సంవత్సరం మహరాజశ్రీ రామఘాట్ వచ్చారో అదే సంవత్సరము వారు గంగాతీరంపై లక్ష్మణ ఝూలా వరకు భ్రమణం చేశారు. అనూప శహర్ నుండి లక్ష్మణ్ ఝూలా వరకు జరిగిన యాత్రలో ఎందరో మహాత్ములు, సంత్‌లు, సాధకులు, విద్వానులు వీరి సత్సంగం చేశారు. అక్కడక్కడ వేల సంఖ్యలో వీరి సత్సంగం చేయటానికి జనులు వచ్చేవారు. మహరాజశ్రీ అనేవారు 'కాశీ నుండి లక్ష్మణ్ ఝూలా వరకు మా ఇల్లులాగ అయిపోయింది.'

సం.1922 పుష్యమాసం మాట. పూజ్య హరిబాబాజీ తిరుగుతూ తిరుగుతూ ఆవూరు వచ్చారు. అక్కడ దరిదాపుల్లో అంతా గంగానది వున్నది. వరదలొస్తే ప్రతీ సారి అంతా జలమయమవుతుంది. ఒకసారి ఎంతో వరద వచ్చింది.! గంగానదీధార ఒకటి వెళ్ళి మహేబా నదిలో కలిసి పోయేటప్పటికి చుట్టప్రక్కల 40మైళ్ళ క్షేత్రము దాదాపు 700 గ్రామాలు జలమమయమయ్యాయి. గ్రామీణ జనతా త్రాహి త్రాహి అన్నారు. ఇక్కడి దయనీయస్థితి చూసి హరిబాబా కోమల చిత్తము వ్యధిత మయిపోయింది. వారు గంగానదిపైన సేతువు కట్టడానికి సంకల్పంచేశారు.

ఒకరోజు హరిబాబావారు కొందరు భక్తులతో వచ్చి 'నేను గంగానదిపైన ఆనకట్ట కట్టడానికి నిశ్చయించుకున్నాను. ఈ పని ఈ రోజే మొదలు పెట్టాలి. ఈ పని చేస్తునపుడంతా ప్రతిపని భగవన్నామము తీసుకునే చెయ్యాలి. ఆ ఆనకట్ట సాక్షాత్తు

భగవత్స్వరూపమనుకుని మనోవాక్కాయ కర్మల, ధనము అన్నీ భగవత్సేవకే అన్న భావంతో అందరూ కలసి పనిచెయ్యడమే పరమ ధర్మంగా భావించాలి. అన్నారు.

మహాత్ముని ప్రేరణ వల్ల తక్షణమే కార్యము మొదలైంది. 'శ్రీరామ్ జయరామ్ జయజయరామ్' అన్న సంకీర్తన చేస్తూ గంగానది పైన 'ఆనకట్ట' పని మొదలుపెట్టారు.

హరిబాబాజీ ఘంటవాయిస్తూ సంకీర్తన చేసేవారు, మరి అందరితో 'ఇది సాక్షాత్తు భగవంతుడైన అంతర్యామి పని. సర్వజ్ఞుడి వద్ద ఏదీ కపటం పనికిరాదు. కుకర్మ కూడదు. భక్తుడికి ఏ ధ్యేయము వుంటే అది పూర్తవుతుంది. ఇక్కడికి వచ్చి మట్టి వేయడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోతాయి! అని చెబుతూ వుండేవారు. విద్యుత్ గతితో పని పురోగమించింది. రాముడి సేతు బంధం లాగ, శ్రీరామ్ జయరామ్ జయజయరామ్ అంటూ హిందూ గ్రామాలలో, 'తేరీ జాత్ పాక్ హూ' అంటూ ముస్లిం గ్రామాలలో హరిబాబా చందాలు ప్రోగుచేశారు. కొందరు ధనికులు (ఖుర్జా, ఉఝియానీపూరి సేఠ్‌లు)ఖర్చంతా తామే ఇవ్వడానికి తయారయ్యారు. కానీ హరిబాబా ఒప్పుకోలేదు. జనతా జనార్ధనుల చెమటోడ్చిన పవిత్ర ధనము ఇందులో ఖర్చు పెట్టాలని, పవిత్రమైన శ్రమ అనే పునాది పైన పవిత్ర కార్యము జరగాలని హరిబాబా ఉద్దేశ్యము.

సంకల్పము ప్రకారము రామనవమికి హరిబాబా మట్టిపని పూర్తి చేశారు. హరినామ ధ్వనితో ఆకాశము మోగిపోయింది.

భృగు క్షేత్రంలో మహరాజశ్రీతో హరిబాబా కలిసి వుండిరి. కీర్తన ఘంట వినిపించగానే మహరాజశ్రీ అనేవారు 'పదండి పదండి హరిబాబా కీర్తన మొదలెడతారు' అని. తనూ స్వయంగా బయల్దేరేవారు. హరిబాబా 'మొదట్లో సేతుబంద్ కోసం చుట్టు ప్రక్కల గ్రామాల్లో సంకీర్తన చేస్తుంటే గంగాతీర వాసులైన సంత్ మహాత్ములంతా వ్యతిరేకించారు. కేవలం ఉడియాబాబాజీ ఒక్కరే మంచి మనసుతో హరినామ సంకీర్తనను సమర్థించారు. అంతే కాదు స్వయంగా ప్రచారం చేశారు. వారు లేకపోతే ఈ సంకీర్తన ప్రచారం జరిగేదేకాదు. ఎపుడో ఆగిపోయి

వుండేది. శ్రీ ఉడియాబాబాకు నాపైన ఎంత ప్రేమ చూపించారో, ఈ విశ్వంలో మరెవ్వరూ అంత చూపలేరు అన్నారు.

సేతవు మీద ప్రతి శివరాత్రికి ఆ రోజున మహరాజశ్రీ వారికి పూజ జరిగేది. హరిబాబా ప్రసన్నత కోసం మహరాజశ్రీ ఎక్కడ వున్నా ఆ సమయానికి అక్కడికి తప్పక వచ్చేవారు. అన్య మహాత్ములతో కూడా వారు ప్రేమగా వుండేవారు. వారు పిలిస్తే అపుడపుడు విభిన్న స్థానాలలో కూడా వెళ్ళి సత్సంగము చేసేవారు.

బృందావనమయితే మహరాజశ్రీ వారికి గోలోక ధామమే. ఎపుడు 'బృందావనం పోదాం' అని అంటూ ఉండేవారు. అక్కడ శ్రీబిహారీజీతో ఒకమూల ఏదో చిన్న ఆశ్రమము కట్టుకుని వుందాం అనేవారు. భగవాన్ శ్రీకృష్ణుడి ఆనందలీలా విహార స్థలము పట్ల వారు ఆకర్షితులై అక్కడికే వెళ్ళారు. సం.1994 విక్రమనామ సంవత్సరం శ్రీ బృందావనంలో 'శ్రీకృష్ణాశ్రమము' ప్రతిష్ఠ జరిగింది. శిలాన్యాసము పరమసంత్ గ్వారియాబాబా చేశారు. ఆ ప్రతిష్ఠా మహోత్సవము నుండి ఆశ్రమములో ఆనందరస వర్షం మొదలయింది. వ్రజమాధుర్యము ఉల్లసితమయినది. శ్రీకృష్ణాశ్రమ స్థాపన తర్వాత మహరాజశ్రీ ఎక్కువగా ఇక్కడనే వుండేవారు.

తెల్లవారు ఝామున 3గం॥ల నుండి రాత్రి 11గం॥ల వరకు శ్రీ కృష్ణాశ్రమములో సత్సంగధార ప్రవహిస్తుండేది. రాసలీల యొక్క నిర్వహణ ఈ ఆశ్రమంలో ఎంతో మర్యాదాపూర్వకంగా జరుగుతుంది అది ఇప్పటికి ఆ ఖ్యాతి వున్నది. నిరాకారము, సాకారము రెండు రకాల ఉపాసనా పద్ధతులకు వ్యవస్థ బాగుగా వున్నది. శ్రీమహరాజశ్రీ అన్ని కార్యక్రమాలకు స్వయంగా ఉపస్థితులయివుండేవారు. వారి అంతరంగ భక్తులు కూడా ఈ రహస్యాన్ని తెలుసుకోలేకపోయారు. మహరాజశ్రీ ఏమిటని? వారు శైవులా? శాక్తులా? రామోపాసకులా? కృష్ణోపాసకులా? వేదాంతులా? అని!

పరబ్రహ్మ చర్చ మొదలయిందంటే మహరాజశ్రీ వారు మూర్తి మంతులైన బ్రహ్మనిష్ఠలా అనిపించేది. సంకీర్తన జరిగే సమయంలో ప్రేమ సమాధిలో మునిగిపోయేవారు. రాసలీలలో కూర్చుంటే అందులోనే మగ్నం అయ్యేవారు. కథా-ప్రవచనాలు జరిగితే ప్రధాన శ్రోత రూపంలో కూర్చుని వీటి రసాస్వాదన చేసేవారు.

అనేక రూప రూపాయ విష్ణవే ప్రభవిష్ణవే!

మహరాజశ్రీవారు ఎవరికి ఎలాంటి నిష్ఠవుంటే దాని కనుగుణంగా ఉపదేశము ఇచ్చేవారు. సాకారోపాసకులకు సాకారోపాసనలో ప్రవృత్తుల్ని చేసేవారు. నిర్గుణోపాసకులకు నిర్గుణ తత్త్వం తెలియజెప్పేవారు. ఈ రెండు మార్గాల సాధకులను ఒకరి నుండి ఒకరిని వేరుగా వుంచేవారు. ఎవరి నిష్ఠ ఎలాగుంటే, వారు ఆ మార్గంలోనే ముందుకు వెళ్ళాలి. సాధారణ జనులకు యోగ వాసిష్టము లాంటి గ్రంథాలు అర్థం చేసుకోవడం కఠినమవుతుంది. వారి కొరకు మహరాజశ్రీ రామాయణము, గీత, భాగవతము, భక్తమాల లాంటి గ్రంథాల కథలను చెప్పించేవారు. ఆశ్రమములో అపుడపుడు రామలీల, రాసలీల, చైతన్యలీల మొదలైనవి జరుగుతూండేవి. దానివల్ల భక్త సముదాయముపైన ఉత్తమ ప్రభావము పడుతూండేది.

మహరాజశ్రీ వారికి భోజన-పానాదుల (అందరికి సమకూర్చడంలో) పనిలో చాలా అభిరుచి వుండేది. ఎపుడైనా ఉత్సవాలు, అనుష్ఠానాలు జరిగితే చాలా జనం ఏకత్రితమయ్యేవారు. ఆ జన సమూహములో ఎవ్వరూ ఆకలితో ఉండిపోరాదని, అందరికి అన్ని పదార్థాలు అందాలని ఈ విషయాలపట్ల మహరాజశ్రీ చాలా ధ్యానం పెట్టేవారు. వారు ఇలా అనేవారు 'తినే ఆహారం జీవుడిది, తినిపించే ఆనందం భగవంతుడిది'.

శ్రీ ఉదియాబాబాజీ మహరాజశ్రీ వారి శ్రీకృష్ణాశ్రమము యొక్క కీర్తి చాలాగొప్పది. భక్తులు, సాధకులు అలా వస్తూనే వుండేవారు. అందరు మహరాజశ్రీతో లాభాన్వితులై, వికాసమార్గంలో పురోగమించారు. ఎవరికి ఏ యోగ్యత వుందో, ఎవరికి ఏ అభిరుచి వుందో దాని ప్రకారం వారు వారికి మార్గదర్శనం చూపి ముందుకు నడిపించేవారు. జీవితంలో పవిత్రతకు మహరాజశ్రీ చాలా ప్రాధాన్యత ఇచ్చేవారు.

వైరాగ్యముతో బాటు అభ్యాసమునకు కూడా మహరాజశ్రీ ప్రాముఖ్యత ఇచ్చేవారు. అభ్యాస సంబంధమైన చర్చవచ్చినపుడు వారు తన అనుభవాన్ని ఇలా చెప్పేవారు.

అతి వాహిక దేహో౽యం శుద్ధ చిద్వ్యోమకేవలం ।
ఆది భౌతికతాం నీతం పశ్యాభ్యాస విజృంభితం ॥

ఇది అభ్యాసము యొక్క క్రీడనే! శుద్ధచిదాకాశ రూపమైన ఈ దేహము దృఢ అభ్యాసము, అజ్ఞానము కారణంగా భౌతిక రూపములో ఇది పిశాచములాగ నిలిచిపోయింది. అందువల్ల దీనికి విపరీతంగా నిరంతరము అభ్యాసము చెయ్యడం అవసరం, శిథిల అభ్యాసముతో (ఒకసారి చేసి, ఒకసారి చెయ్యక) పని జరగదు. సావధాన చిత్తముతో నిరంతము తత్పరత కలిగి అభ్యాసము చేస్తూ వుండాలి.

అభ్యాసానికి మూడు శ్రేణులున్నాయి

1. స్థూల శరీరముతో మనము వేరు అని తెలుసుకోవడము. ఈ అభ్యాసము పుష్టి చెంది సూక్ష్మ శరీరముతో అభిమానమేర్పడుతుంది.

2. దాని తర్వాత శబ్దాధి విషయములపట్ల ఉపరతులై (శాంతులై) అసంగత్వం యొక్క అనుభవం కలగాలి. ఈ అభ్యాసము వల్ల దృష్టి సూక్ష్మ శరీరము నుండి తప్పుకుని కారణ శరీరములో స్థితమవుతుంది.

3. తర్వాత సుఖ-దుఃఖాల నుండి మనం వేరు అన్న అనుభవం కలగాలి. ఈ అభ్యాసముతో అంతఃకరణ చతుష్టయము నుండి తప్పుకుని శుద్ధ ఆత్మలో మనకు స్థితి కలుగుతుంది.

అభ్యాస, వైరాగ్యాలు లేనిదే జీవితం వ్యర్థము. సత్సంగము మాత్రము చేస్తు అభ్యాసము చేయకపోతే ఇక లాభమేమి? ఇది ఎలాగుంటుందంటే, ఎవరైనా రామాయణము మాత్రము చదువుతారు. కానీ రామభక్తుడు మాత్రము కాదు. ఇంకా భాగవతం పారాయణ చేసేదేకాని కృష్ణభక్తుడు కాదు. నిరంతరం అభ్యాసం చేస్తుండం వల్ల వాసనలు పూర్ణంగా నశించిపోతే అపుడు అనుభవము ప్రాప్తిస్తుంది. కేవలం శాస్త్రం చదవటం వల్ల ఏమీ జరగదు. వాసనలు చిత్తములో ఉండగా శాంతి దొరకదు. వాసనారహితమైన చిత్తమే పరమతత్త్వమును చింతన చేయు యొగ్యతను పొందును. నిరంతరం అభ్యాసము చేస్తూ వుంటేనే చిత్తములో వాసనలు నిర్మూలమవుతాయి. తత్త్వోపలబ్ధి కలుగుతుంది. వాసనల ఉచ్ఛేదన కోసము సదా విషయములపట్ల

వైరాగ్యము వుండాలి. సర్వదా భగవదాకార వృత్తి వుండాలి. సంయమముతో ఏదో రెండు మూడు విషయాల పట్ల ఆసక్తి పోతుంది. కానీ సంపూర్ణంగా విషయరాగాలు పోవాలంటే భగవత్స్వరూపముతో రాగం (ఆసక్తి) కలిగితేతప్ప పోవు. అభ్యాసము యొక్క ప్రభావము వల్లనే తల్లి, చెల్లెలు వీరి దగ్గరున్నపుడు కామ-భావన కలుగదు. ఎందుకంటే తల్లీ, చెల్లెలు అన్న భావం దృఢంగా వున్నది కాబట్టి.

మహరాజశ్రీ జిహ్వ చాపల్యాన్ని అన్ని అనర్థాలకు మూలం అనే వారు. వారు ఇలా చెబుతూండేవారు. 'నేను రాజా కృష్ణచంద్రుడి పాఠశాలలో చదువుకునే రోజుల్లో, ఒకరోజు అక్కడి విద్యార్థులు వంటవాడిని ఖిచిడి చేసి ఇవ్వలేదని కొట్టారు. అప్పటి నుండి నేను ఈ మాట మూట కట్టుకున్నాను (గుర్తుపెట్టుకున్నాను) జిహ్వాచాపల్యమే అన్ని అనర్థాలకు మూలమని. 'జితే రసం జితం సర్వం' మరియు 'జిహ్వోపస్థ జయీ ధృతిః' అప్పటి నుండే నేను రసనేంద్రియము, జననేంద్రియములపై విజయం పొందాలని నిశ్చయించుకున్నాను. ఎందుకంటే ఎవరైతే ఈ రెంటిని జయిస్తారో వారు 'సర్వజిత్'లవుతారు.

అందరికీ పనికివచ్చే సాధన క్రమాన్ని గురించి చర్చిస్తూ మహరాజశ్రీ 'దుర్వాసనా-ప్రతీకార-దశకము'యొక్క ఈ శ్లోకములను వల్లిస్తూ వుండేవారు.

జిహ్వోపస్థసుఖభ్రమం త్యజ మనః పర్యంతదుః ఖేక్షణాత్ ।
పారుష్యం మృదుభాషణా త్యజ వృథాలాపా౽౽శ్రమం మౌనతః ॥

దుస్సంగం త్యజ సాధుసంగమ బలాద్ గర్వం తు భంగేక్షణాత్ ।
నిందాదుఃఖమనింద్య దేవమునిభిర్నిందాకథాసంస్మృతైః ॥

ఓమనసా! అన్ని విషయాలలోను దుఃఖాన్ని చూసి, జిహ్వ ఉపస్థేంద్రియముల సుఖ భ్రాంతిని వదిలివెయ్యి, మధురమైన వాక్కులతో కటువాక్యాలను వదలిపెట్టు. మౌనం ద్వారా వ్యర్థాలాప శ్రమ నుండి ముక్తుడివికా. కుసంగతిని వదిలిపెట్టు. సత్సంగము, సాధు సంగము చెయ్యి. అవమానముపైన దృష్టి పెట్టుకుని గర్వాన్ని వదిలివెయ్యి. ఈమాట సదా గుర్తుపెట్టుకో. అందుకని నీనింద వల్ల కల్గిన దుఃఖాన్ని వదిలివెయ్యి. గొప్ప గొప్ప దేవతలను, మునులను కూడా నిందిస్తుంటారు.

సాధకులకు ఆసనస్థిరత, చిత్తము యొక్క నిస్సంకల్పతా పరమ ఆవశ్యకములు. అని మహారాజశ్రీ వారు మరీ మరీ చెబుతుండేవారు. మనసు మరియు ప్రాణము వీటి సంబంధాన్ని గురించి చాలా చెప్పేవారు - శరీరంలో వాయువు, కఫము వీటి కారణంగా శీరరము భారమనిపిస్తుంది. పిత్తమెక్కువైతే శరీరము తేలికవుతుంది. పిత్తము యొక్క వేడియే విద్యుత్తు. ఆసనము, ప్రాణము స్థిరమయితే శరీరములో విద్యుత్తు ఉత్పన్నమవుతుంది. శరీరంతో ఏదైన క్రియ జరిగినపుడు ఈ శక్తి బయటికి పోతుంది. ఈ శక్తిని ఆపడం వల్ల శరీరము నిరోగమవుతుంది.

ఆసనము స్థిరము కావడానికి ఇలా సంకల్పము చేసుకోవాలి. 'శేష భగవానుడు పృథ్విని ధారణ చేసుకున్న తర్వాత ఆవగింజంతైన కదలరు మెదలరు. అలాగే నేను స్థిరంగా వుంటాను నేను శరీరం, ప్రాణం వీటికి సాక్షిని, ద్రష్టను. శరీరము, ప్రాణము భగవంతుడి విభూతులు. నేను తటస్థుడనై వాటిని దర్శిస్తున్నాను'అని.

శరీరము, మరియు ప్రాణము యొక్క గతి వీటి ద్రష్టగా మనము అభ్యాసం చేసుకోవాలి. ప్రాణగతిని చూడడానికి నాభిపైన దృష్టి పెట్టాలి. శరీరము కదలక పోతే ప్రాణగతి తీవ్రమవుతుంది. ఒక వేళ శరీరము కదలలేదు, మరి ప్రాణగతి తీవ్రమయి నిద్రా, తంద్రాస్థితి వస్తుందంటే మనసులయమవుతోందని తెలుసుకోవాలి. మనసు ప్రాణములో లయమయితే తమోగుణము వృద్ధి అవుతుంది. మనసులో ప్రాణము లయమవుతే సత్వగుణము వృద్ధి అవుతుంది. తమోగుణమెక్కువైతే ప్రాణగతి తీవ్రమవుతుంది. సత్వగుణము వృద్ధి అయితే ప్రాణగతి స్థిరమవుతుంది. ఎపుడైతే మనసు ప్రాణము ద్వార కర్మ చేస్తుందో అపుడు రజోగుణము వృద్ధి అవుతుంది. అపుడు ప్రాణగతి సామాన్యంగా వుంటుంది, కాని మనసులో సంకల్ప-వికల్పాలు లేస్తూ వుంటాయి. ఈ సంకల్పాలను ప్రక్కకు నెట్టి మనసును లక్ష్యంపై స్థిరం చేయడం వల్ల మనసు శాంతమవుతుంది.

ఆసనం స్థిరము చేసుకోవాలి. ప్రతీ పనీ చేసేందుకు, కూర్చోవలసి వచ్చి నపుడంతా ఆసనం స్థిరం చేసుకుని కోర్చోవాలి. ఎంతవరకు నొప్పి పుట్టదో అంత వరకు ఆసనము మార్చకూడదు. కొన్ని రోజులు అభ్యాసం చేస్తే ఆసనం స్థిరమవు తుంది. ప్రాణములు స్థిరమవగానే అన్ని వికారాలు స్వతహాగా శాంతమవుతాయి.

ఆకలి దప్పుల బాధ శుద్ధమవుతుంది. బ్రహ్మచర్య పాలన దానంతట అదే జరుగుతుంది. ప్రాణములు స్థిరమయినపుడు మనిషి పసి బాలుడివలె నిర్వికారు డవుతాడు. ద్రష్ట కావాలంటే ఈ పద్ధతి చెప్పేవారు మహరాజశ్రీ. 'శరీరము, ప్రాణము భగవంతుడిది అని నమ్మటమే ఉచితము. మనము శరీరము, మరియు ప్రాణము వీటి కంటే వేరు. వీటిని భగవంతునికి అర్పించి, నేను సాక్షి మాతృడిని అని అనుభవంలోకి తెచ్చుకోవాలి. ఎరుపు-ఆకుపచ్చ, నలుపు, పసుపు - దృశ్యములేవైతే కనిపిస్తున్నాయో వాటి అన్నిటికంటే నేను వేరు, అన్ని విధాల రూపాలకంటే కూడా నేను భిన్నుడను అని ఈ విధంగా భావించాలి. ఇంత మాత్రం చేశాక తర్వాత సుఖ దుఃఖాదులు, రాగద్వేషాలు, హర్షశోకాలు ఇవన్నీ మనఃకల్పనలే వాటితో కూడా నేను సర్వదా భిన్నుడను అని ఈ విధంగా భావించాలి.

దీని కోసం మనసు, శరీరము, వాక్కు వాటి మూడిటి వ్యవహారం పట్ల దృష్టి పెట్టాలి. మనసు ఎటువంటి సంకల్పాలను చేస్తుంది? అవి ఎలావున్నాయి? పవిత్రమైనవా? అపవిత్రమైనవా? ఇది మనోవ్యాపారం పట్ల దృష్టినుంచడం, అదే విధంగా శరీరాన్ని స్థిరం చేయడానికి ప్రయత్నించాలి. వాక్కును కూడా సంయమములో పెట్టుకోవాలి. మనసు, శరీరము, వాణి వీటికి పరస్పర ఘనిష్ఠ సంబంధమున్నది. మూడిటిలో ఏ ఒక్కటి చంచలమైనా మిగిలిన రెండూ చంచలమైపోతాయి. అందువల్ల మూడిటిని స్థిరము చేయడానికి ప్రయత్నించాలి. ఏ విధంగానైన వ్యర్థ చేష్ట చేయకూడదు. శరీరాన్ని అకారణంగా వూపడం, కదల్చడము, ఏదో గడ్డిపోచ తుంపడం, అలాంటి అన్య వ్యర్థక్రియలు వదిలిపెట్టాలి. వాణితో వ్యర్థంగా మాట్లాడకూడదు. మనసుతో అసత్ చింతన చెయ్య కూడదు. ఇలాగ (వ్యర్థమైన) నిష్ప్రయోజనమైన పనులను వదిలిపెట్టడం వల్ల మనసు స్థిరమయిపోతుంది.

సంపూర్ణ సృష్టిని ఉదాసీన దృష్టితో చూడటం వల్ల వాసనాక్షయము కలిగి నిర్వికల్ప సమాధి కలుగుతుంది. ప్రపంచ నిషేధము రెండు రకములుగా వుంటుంది. వివేకవంతుడిది, బోధవంతుడిది. వివేకి దానిని అనాత్మ అని తెలుసుకుని తనకంటె భిన్నమయినదిగా అనుభవంలోకి తెచ్చుకోవడానికి (ప్రపంచాన్ని) నిషేధిస్తాడు బోధవాన్ ప్రపంచము యొక్క అవాస్తవికతను చూస్తాడు. అందుకని దానిని నిషేధిస్తాడు. వివేకి

యొక్క నిషేధంలో ప్రపంచము యొక్క పృథక్ సత్తా వుంటుంది. బోధవాన్ దాని అసత్తును చూస్తాడు.

చంచలమైన మనసును వశం చేసుకునే ఉపాయం అడగగా మహరాజశ్రీ ఇలా చెప్పారు. 'జైసే ఉడి జహాజ్‌కో పంఛీ పుని జహాజ్‌పై ఆవై' మనసుకు ఒక వేళ ఆలంబనము దొరకనియెడల అది శాంత మవుతుంది. మనసుకు రెండేమార్గాలు - ఒకటి విషయచింతనము, రెండోది బ్రహ్మచితనము. ఒకవేళ అది బ్రహ్మచింతనములో వుండగలిగితే సరే మంచిదే. లేదంటే అది విషయచింతన చెయ్యడం మొదలుపెడుతుంది. అందువల్ల విషయ చింతన నుండి తప్పించి మరల మరల బ్రహ్మచింతనములో వుండేలా చేయాలి.

శృతి అంటుంది 'సర్వం ఖల్విదం బ్రహ్మ నేహ నానాస్తి కించన' బ్రహ్మాతిరిక్త మయినది వేరే ఏదీ ఇక్కడ లేదు. మాటిమాటికి ఇలా చింతన చెయ్యడం వల్ల విషయ చింతనకు స్థానమెక్కడ వుంటుంది? విషయాలపట్ల వైరాగ్యము గలగడానికి 'జన్మ-మృత్యు-జరా-వ్యాధి-దుఃఖ-దోషాను దర్శనము' అని చెప్పినారు. జన్మ మృత్యు జరావ్యాధి మరియు దుఃఖముల గురించి సతతము చింతన చెయ్యడం వల్ల నిజమైన వైరాగ్యము కలుగుతుంది. తర్వాతేమో అడుగడుగునా శృతి వాక్యము యొక్క అనుభూతి కలుగుతుంది.

శుద్ధిని గురించి ప్రశ్నించితే మహారాజశ్రీ ఇలా అన్నారు. 'హింస, అసత్యము, వ్యభిచారము వీటి త్యాగము వల్ల శరీరము శుద్ధమవుతుంది. భగవన్నామ జపముతో వాక్కు శుద్ధమవుతుంది. దానము చెయ్యడం వల్ల ధనం శుద్ధమవుతుంది. ధారణ, ధ్యానముల వల్ల అంతఃకరణ శుద్ధమవుతుంది.' అనేవారు. వాక్కుకు నాల్గు దోషాలున్నాయి. 1.ఆజ్ఞాపించేలాగ మాట్లాడడము, 2.గట్టిగ అరచి మాట్లాడడము, 3.అశ్లీలములైన శబ్దములు మాట్లాడడము, 4.కటువుగా మాట్లాడడము. ఇక వాక్కుకు 5 గుణాలు కూడా వున్నాయి. 1.హితము (మంచికోరి) మాట్లాడటం, 2.మితభాషణము 3.శాంతంగా పలుకడం, 4.మధురంగా మాట్లాడడము, 5.ప్రియముగా (ప్రేమగా) మాట్లాడడము. వాక్కు యొక్క దోషాలను దూరం చేసి గుణాలను వికసింప చేయడం వల్ల వాక్శుద్ధి కలుగుతుంది.

రాగద్వేషాల నుండి ఎలా తప్పించుకునేది అని అడిగితే మహరాజశ్రీ సాధకులకు విస్తారంగా తెలియజెప్పేవారు. రాగద్వేషాలంటే ఏమిటి? వాటిని ఎలా దూరం చెయ్యగలుగుతాము? వారు ఇలా అనే వారు, 'మనిషి ఏ సమయంలోనయితే నీతిని మరచి సదాచార నియమాలను వేటిని లెక్ఖచెయ్యడో అపుడే వాడు రాగద్వేషాలకు వశీభూపతుడవుతాడనుకోవాలి. రాగ ద్వేషాలకు మూలము అహంకారమే. వాటిలో నుండే స్వపర భేదము కల్గుతుంది. మమత్వము, మమతయే రాగ మనబడుతుంది. పరత్వమే ద్వేషమనబడుతుంది'.

ఒకవేళ ఏ వస్తువుపట్ల నయిన మనసు అంత కూరుకు పోయిందంటే (అసక్తమయిందంటే), ఏ విధమైన అవమానము, నిరాదరణ దుఃఖము కలిగినా కూడా మనసు తప్పుకోదంటే దానితో రాగమేర్పడినదని అనుకోవాలి. గోపికలకు శ్రీకృష్ణ భగవానుడి పట్ల అలా వుండేది. అలా కాకుండా ఏ వస్తువు పట్లనయిన మనసు తప్పుకుందంటే, అందులో దోషమే దోషము కనిపిస్తుంది. అందులో కొంచెం కూడా గుణము కన్పించలేదంటే అది ద్వేషము కలిగిందని అనుకోవాలి. ఏ విధంగానైతే కంసుడికి శ్రీకృష్ణుడి పట్ల వుండేదో అలాగ. రాగద్వేషాల ఉత్పత్తి గుణదోషాల చింతన వల్లనే కలుగుతుంది. వీటిలో విషయ చింతన వుంటుంది. ఇదే సంసారాసక్తికి కారణమవుతుంది. నిందాస్తుతులు చెయ్యము అని ప్రతిజ్ఞ చెయ్యడం వల్ల రాగద్వేషాలను దూరం చెయ్యవచ్చు. పూర్ణజ్ఞాని, భక్తుడు రాగద్వేషాల నుండి ముక్తుడవుతాడు. వారిని ధ్యానించడం వల్ల కూడా రాగ ద్వేషాల నుండి ముక్తులగుదుము. రాగ ద్వేషాలు పోగానే మనసు తేలికవుతుంది. అందులో సత్వ గుణము ప్రధానంగా కలుగుతుంది. రాగద్వేషయుక్తుడైన వ్యక్తి జీవితంలో ఉన్నతమైన బంగారు బాటలో అడుగిడలేడు. నిర్వికల్ప తత్త్వము యొక్క సాక్షాత్కారము రాగ, భయ, క్రోధాల నుండి ముక్తులైన వాళ్ళకే కలుగుతుంది.

వీతరాగ భయ క్రోధ మునిభిః వేదపారగైః ।
నిర్వికల్పో హ్యయం దృష్టః ప్రపంచోపశమో౽ద్వయః ॥

రాగ ద్వేషాలు భక్తుడిలోను వుండవు, అటు జ్ఞానిలోను వుండవు అనేవారు మహారాజశ్రీ. కారనమేమిటంటే భక్తుడికి ప్రత్యేక విధానములోను భగవంతుడి ఆదేశమే

కనిపిస్తుంది. మరి జ్ఞానియేమో ప్రారబ్ధ భోగమనుకుంటాడు. అందువల్ల ఇద్దరిలోను రాగమూ వుండదు, ద్వేషము వుండదు. రాగద్వేషాలకు మూలకారణమైన అవివేకము వివేకము వల్ల క్షీణించిపోతుంది. అపుడు ఇక వారిలో రాగద్వేషాలు ఎక్కడ వుంటాయి? రాగనివృత్తి మాత్రం కేవలం వివేకంవల్ల కలుగదు. వివేకం వల్ల రాగద్వేషాల నుండి తప్పుకోవడానికి ఒక యుక్తి దొరుకుతుంది. దాని పూర్ణనివృత్తి కలిగేది భగవత్ప్రేమ లేదా ఆత్మప్రేమ వల్లనే. భగవంతుడి పట్ల రాగము (ప్రేమ కలిగినా) కలిగినా, ఆత్మ ప్రేమ కలిగినా లౌకిక ప్రేమ (రాగము) తొలగిపోతుంది. లోహం తోనే లోహం విరిగుతుంది.

ధ్యాన విషయంలోని మర్మము తెలుపుతు మహారాజశ్రీ ఇలా అనేవారు ధ్యాన సమయంలో ముఖ్యంగా తన ఇష్టదైవము యొక్క స్వరూపాన్ని గురించిన చింతన చెయ్యాలి. ఒకవేళ స్వరూపధ్యానములో చిత్తము స్థిరము కాకపోతే భగవంతుడి లీలనే భావన చేసేది. ఏడవాలనుకున్నా భగవంతుని ఏ లీలనయినా తలచుకుని దుఃఖించనీ. నవ్వాలన్నా భగవంతుని లీల నాశ్రయించుకునే నవ్వనీ. రామాయణములో రాముడి లీలలున్నాయి. భాగవతంలో కృష్ణుడివి. ఆ లీలలను చింతన చెయ్యడము కూడా ధ్యానమే.

సాకార రూపుడైన భగవంతుని స్వరూపాన్ని ధ్యానించాలను కుంటే మొదట రెండు చేతులు మోకాళ్ళపైన పెట్టుకుని సుఖాసనములో స్థిరముగా కూర్చోవాలి. నాసికాగ్రముపైన దృష్టిని స్థిరము చేయాలి. మనసును విషయాలనుండి వేరు చెయ్యాలి. ముందువెనుకల మాటలను చింతన చేయకూడదు. తర్వాత తన ఇష్టదైవం యొక్క మనోహరమైన అంగాలలో మనసును తిరగనివ్వాలి. క్రమశః ఒక్కో అంగం నుండి ఇంకో అంగం పైకి చిత్తాన్ని నిలపాలి (కరపాదముఖోదరాది) తర్వాత ఏకాగ్ర చిత్తంతో అలాగే చూస్తూ వుండేది. ఇష్టదైవము కంటే అతిరిక్తమయినదేదీ చింతన చెయ్యకూడదు.

ప్రతి దినము ఇలా అభ్యాసము చెయ్యడం వలన కొద్ది రోజుల్లోనే ప్రసన్నతా, ఆనందము ఆవిర్భవిస్తాయి. క్రమశః శరీరంలో స్తబ్ధత, రోమాంచము, స్వేదము, కంపము మొదలయిన లక్షణాలు ప్రకటమవుతాయి. ధైర్యపూర్వకంగా అలా చేస్తూ

వుంటే సఫలత ప్రాప్తిస్తుంది. భగవత్స్మరణ, సదాచారము, నిరభిమానంతో భగవత్కృప కలుగుతుంది. అందులో సఫలత కలుగుతుంది. అపుడు జగచ్చింతన స్వతఃగానే వదిలిపోతుంది. ధ్యానము యొక్క అభ్యాసము ఎక్కువయితే చిత్తము భగవత్ప్రేమలో మునిగిపోతుంది. ఇదే సాధన యొక్క పూర్ణపదము. ఇదే భగవత్ సాక్షాత్కరము.

జ్ఞానము మరియు భక్తి వీటి చర్చ జరిగేటప్పుడు మహరాజశ్రీ అనే వారు - జ్ఞానానికి అత్యంత వైరాగ్యవంతుడే అధికారి. నిర్మల బుద్ధి కలిగిన సాధకుడు భక్తికి అధికారి అవుతాడు. భక్తి సాధకుడు భక్తులతో సత్సంగము చెయ్యాలి. భగవంతుని గుణానువాదం చెయ్యాలి. వారికి అద్వైత వాద గ్రంథములను చదవడం కాని, వినడం కాని అవసరము లేదు. భగవంతుని సోపాధిక రూపము, నిరుపాధిక రూపము రెండు రూపాలు కూడా స్వయం ప్రకాశమే. ప్రేమి ఏ విధంగా, ఏ రూపంలో ప్రేమించినా, భగవంతుని ప్రేమిస్తాడు. భగవంతుడు భక్తులను ఆనందపరచడానికి వారి వారి భావనానుసారం విభిన్న రూపాలలో భాసిస్తాడు. వస్తుతః వారు సచ్చిదానంద స్వరూపమే.

ఒకసారి ప్రవచనంలో నేను ఇలా చెప్పాను. 'జీవుడు తనను భగవంతుడికి భోగ్యుడని తెలుసుకుంటే దానికి భక్తి అని పేరు. భక్తుడి దృష్టి తన సుఖమువైపు ఎపుడూ వుండదు. అతడెపుడూ తన ప్రియతముడైన ప్రభువు సుఖమే కోరుతాడు.' ప్రవచనం ముగించిన తర్వాత మహరాజశ్రీతో ఈ ప్రసంగంపై చర్చ జరిగింది. అపుడు వారు అన్నారూ, 'చూడు తమ్ముడూ! జీవుడి పరమ ప్రేమాస్పదుడు కేవలం తన ఆత్మయే, భ్రమతో అన్యులను తన ప్రియతములని భావించవచ్చు. జీవుడు చైతన్య స్వరూపుడు, అందుకని జీవుడు ఎపుడూ, ఎవరికీ భోగసదృశము అవలేడు. నిజం చెప్పాలంటే తనే అన్నిటికి భోక్త, ద్రష్ట అయివున్నాడు. ఏ జీవుడయితే విషయాలను భోగిస్తాడో వాడిని సంసారి అంటారు. మరి ఎవడైతే భగవద్భోక్త అవుతాడో వాడు భక్తుడవుతాడు. ఇదేవిధంగా సమాధి భోక్తను యోగి అంటారు. ఎవరైతే భోక్త, భోగ్యము రెండిటిని ఖండిస్తాడో (బాధ్ కర్‌దేతీ హై) అతడు జ్ఞాని. నేను భగవంతుని భోగ్యము అని అనుకునే భావనలో ఏ దివ్యరసానుభూతి, అలౌకిక మయిన అనుభవమున్నదో భక్తుడు దాని (ఆరస) భోక్త అవుతాడు. 'నేను భోగ్యము' అన్న భావనయే వాడికి

భోగ్యము అవుతుంది. అందువల్ల 'ఆత్మనస్తుకామాయ సర్వం ప్రియం భవతి' అని శృతి సమానరూపముతో సమస్తజీవుల స్వభావాన్ని నిర్దేశిస్తూ వున్నది.

'జ్ఞాని' ఎవరు? అని అడిగితే మహరాజశ్రీ వారు ఇలా చెప్పేవారు. 'ఎవరికైతే దృష్ట-శృత వస్తువుల పట్ల కూడా మోహము లేదో వాడే జ్ఞాని. సంపూర్ణ ప్రపంచముతోనే కాక భగవంతునితో కూడా వైరాగ్యమే కలగాలి. ఎవరికైతే మలవిక్షేపాలు నివృత్తమయినాయో, అత్యంత వైరాగ్య వంతుడో వాడే జ్ఞాని. జ్ఞాని యొక్క ధారణను గురించి సరిగా చెప్పలేక పోతాము (అనిర్వచనీయము) ఇంకా అర్థమయ్యేట్లు చెప్పాలంటే అల్పజ్ఞానం (మందజ్ఞాని) కలిగినవాడికి సంసారము మిథ్య అనే ధారణ వుంటుంది. మధ్యమజ్ఞానికి సంసారము స్వప్నతుల్యమని ధారణ వుంటుంది. ఉత్తమ జ్ఞానికి సంసారము యొక్క అత్యంతాభావము, సంసారము అన్నది లేనేలేదు అన్న ధారణ వుంటుంది.

మహరాజశ్రీ అనేవారు 'జ్ఞానము రెండు రకములుగ వుటుంది. ఒకటి కేవలం శృతజ్ఞానము. రెండవది అనుభవము ద్వారా కలిగిన జ్ఞానము. మొదటిది 'బోధ' అని పించుకోదు. అనుభవగమ్య జ్ఞానమునకు రెండు మాటలు కావాలి వివేక స్ఫురణ, చిత్తశుద్ధి. వివేకము రెండు రకాలు. నిత్యానిత్య వస్తు వవేకము, తత్త్వవివేకము. నిత్యానిత్య వివేకమయితే అజ్ఞానము వున్నపుడు కూడా కలుగుతుంది. వస్తుతః అనిత్య వస్తువులోనే నిత్యము, అనిత్యము అని రెండు భాగాలుగా తీసుకుంటారు. చిత్తమునకు కార్యావస్థా, కారణావస్థా అని రెండు స్థితులు. ఇందులో కారణావస్థను నిత్యమని కార్యావస్థను అనిత్యమని అంటారు. కానీ నిజం చెప్పాలంటే ఈ రెండూ కూడా అనిత్యమైనవే. తత్త్వవివేచన చేసేటప్పుడు సంపూర్ణ ప్రపంచము నుండి సాక్షి వేరుగానే వుంటాడు. కాని దీనిని కూడా పూర్ణబోధ అని చెప్పలేము. కారణమేమిటంటే ఇందులో కూడా తన కంటే అన్యమైన భిన్న వస్తువు యొక్క అస్థిత్వం వున్నది. సాక్షి-సాక్ష్య వివేకము చేసిన తర్వాత - ఈ ప్రతీయమాన మైన దృశ్యము (జగత్తు) ఏదైతే వుందో అది వేరువేరుగా వున్నదా? లేదా ఒకటేనా అని కూడా విచారణ చెయ్యాలి. ఎపుడయితే అది ఒక్కటే అని నిశ్చయమయినదో అపుడే దాని అత్యంతాభావము యొక్క 'బోధ' కలుగుతుంది. అద్వైత స్థితి కలుగుతుంది.'

'జీవన్ముక్తి' అంటే ఏమిటి? అని అడిగినపుడు మహరాజశ్రీ అనేవారు, 'ఏవిధంగానయితే అజ్ఞాత భాషలో (నీకు తెలయని) నిన్ను ఎవరైనా నిందించనీ, స్తుతించనీ నీ చిత్తము కొంచెము కూడా చలించదో, అదే విధంగా ఒకవేళ ఎవరైన నీకు తెలిసిన భాషలో నిన్ను నిందా, స్తుతి చేస్తే అపుడు కూడా నీ చిత్తము ప్రభావితముకాదో అపుడు నీవు జీవన్ముక్తుడవని అంగీకరిస్తాము.

జీవన్ముక్తుడు, జ్ఞాని, అంటే వారే - ఎవరిలో జీవ, బ్రహ్మ ఏ ద్వివిధమైన అహంభావము వుండదో, వ్యవహారములో వారు సరిగానే వుంటారు. కానీ పరమార్థ దృష్టిలో అంతా అత్యంతా భావమే చూస్తారు. దృశ్యంలో మధ్యత్వ భావం కూడ నివృత్తమవుతుంది. ఇది జరగలేదు అన్న రెండు రకాల భావాలనుండి నివృత్తుడైన వాడే జ్ఞాని ఇది జరిగింది అనుకుంటే వ్యావహారిక సత్తాలో రాగము కలుగుతుంది. ఇది జరుగలేదనుకుంటే వ్యావహారిక సత్తాలో ద్వేషము కలుగుతుంది. జ్ఞాని రాగద్వేషాలకు అతీతుడుగా వుంటాడు.

బృందావనంలో శ్రీకృష్ణాశ్రమములో పూజ్య మహరాజశ్రీ వారి సన్నిధిలో నిత్యనిరంతరము ఆనందమే, ఆనందము వర్షిస్తూ వుండేది. మన ఈ ఆశ్రమము సాక్షాత్తు వైకుంఠము అని వారు అనేవారు. వారి జీవన-దర్శనము, బ్రహ్మ-దర్శనము అభిన్నము ఎంత పెద్ద అవమానమైనా సరే, ఎంత గొప్ప సన్మానాలయినా సరే వారిని ప్రభావితం చెయ్యలేక పోయేవి. ఉదారతా, క్షమ, అక్రోధము మూర్తీభవించినట్లుం డేవారు. మీరు ఎక్కడికయినా తీసుకువెళ్లండి, ఎలాంటి పరిస్థితులలోనైన వుంచండి కాని నాకు క్రోధమన్నది ఆవగింజంత అయినా కలుగదు అని చెబుతుండేవారు. ఎంత పెద్ద విపత్కరమయిన సంఘటన అయినా, బాహ్య ఘటనలు వారిని స్పృశించ లేకపోయేవి.

ఒకసారి స్వర్గీయ పండిత్ సుందర్‌లాల్ గారు అత్యంత కాతరులై ఇలా అన్నారు 'బాబా అంతా పాడైపోతున్నారు. కొంచెం విచారించండి' అని. అపుడు మహరాజశ్రీ అన్నారు 'పంతులూ! నేను నా స్వభావాన్ని పాడు చేసుకోనా? ఈ మూర్ఖులను దండంతో శిక్షించమంటారా? నేను యం.ఎ. క్లాస్ విద్యార్థులకు మాస్టారిని. సూచనగా చెబుతాను. చేస్తేచేయనీ లేకపోతే చావనీ. విస్తరి వడ్డించి సిద్ధంగా వున్నది. దానిని తినడం,

అరిగించుకోవడమన్నది వారి పని. పండిత్‌జీ' 'వీరు బాబాకాదు. వీరు మనకు తల్లి.' అనేవారు పండిట్‌జీ.

కుపుత్రో జాయేత క్వచిదపి కుమాతా నభవతి

భక్తులు, శ్రద్ధాళువుల బలవంతంపైన మహరాజశ్రీ వారికి ఒక రోజుకి ఎన్నోసార్లు ఎంగిలి పడవలసి వచ్చేది. ఎంత ప్రయత్నించినా, ఆపినా జనం వినిపించుకునేవారు కాదు. దీని దుష్పరిణామము శరీరముపైన పడుతూనే వుంది. వారు అతిమూత్ర వ్యాధితో పీడితులయ్యారు. శరీరము వాచి పోయింది. దినదినమునకు పరిస్థితి విషమించిపోయింది. పూజ్యా మాతా ఆనందమాయిమా అన్నారు 'తండ్రీ! మీరు సంకల్పము చేసుకుంటే బాగయిపోతారు అని. కానీ వారెందులకు సంకల్పము చేసుకుంటారు?

హోశియార్‌పురములో వుంచి అక్కడ స్వస్థత చేకూర్చాలన్న కార్యక్రమము తయారు చేశారు. పంజాబ్ యాత్ర కూడా చేశారు. కానీ 'సర్‌హింద్' నుండి బృందావనం వాపసు వచ్చారు. శరీరస్థితి రోజురోజుకీ క్షీణించసాగింది.

విక్రమ సం॥ చైత్ర కృష్ణ చతుర్దశి 2005వ సంవత్సరం శ్రీ ఆనందమయిమా కాశీ వెళ్ళారు. శ్రీ హరిబాబాజీ ఝూసీ వెళ్ళేటపుడు మహరాజశ్రీ బయటి వరకు వచ్చి వారికి వీడ్కోలు ఇచ్చారు. ప్రాతఃకాలీన ప్రవచనములో 'జాతస్యహి ధృవో మృత్యుః ధృవం జన్మ మృతస్యచ' గీతా శ్లోకముపై వ్యాఖ్యానము చేశారు. మధ్యాహ్నపు సత్సంగములో 'భాగవత కథ' పారాయణ జరుగుతూ వుంది, మహరాజశ్రీ వారు సమాధిస్థులై కూర్చుని ప్రవచనం చేస్తున్నారు. దాదాపు పాతికమంది దాక శ్రోతలు ఎదురుగా కూర్చుని వున్నారు.

అపుడు హఠాత్తుగ వెనుక నుండి ఒక పిచ్చివాడిలాగ వున్న ఠాగూర్ దాస్ అనే వ్యక్తి వచ్చి బడితెతో తీవ్రంగా మహరాజశ్రీవారి శిరస్సుపైన ముమ్మార్లు కొట్టారు.

నాలుగు అంగుళాలలోతు గాయం. మొదటి వేటుకి మహరాజశ్రీ వారి చేయి సిరసుపైకి వెళ్ళింది మరియు వారి ఒక వేలు కూడా తెగిపోయింది. అరవలేదు.

పిలవలేదు. తల్లడిల్లలేదు. అలాగే వున్నారు. జనం డాక్టరు కోసం పరురెత్తారు. మహరాజశ్రీకి కొద్దిగ స్పృహ రాగానే 'ఏం జరుగుతూ వుంది?' తన శరీరంపైన కాదు మరి ఎక్కడో అన్యత్ర దెబ్బతగిలినట్లుగ అడిగారు. ప్రణవోచ్చారణ చేస్తూ కళ్ళు మూసుకున్నారు ఇక మరల తెరవలేదు. మహాత్ములు శరీరాన్ని యమునాదిలో జలసమాధి చేశారు. ఎటువంటి పవిత్ర జీవనమో! నిర్యాణము పవిత్రమైనదే.

విక్రమ సం. 2019, శివరాత్రికి మహరాజశ్రీ యొక్క అర్చన విగ్రహము ప్రతిష్ఠ మహోత్సవము జరిగినది. చాలా మంది చూసిన వారంతా కూడా ఇది మూర్తి కాదు సాక్షాత్తు శ్రీ ఉడియా బాబాజీ మహరాజశ్రీయే అనేవారు. వారు తమ మధుర మందస్మిత వదనంతో అందరికి అభయమొసగుతున్నట్లు వుండేది.

అహం త్వాం సర్వపాపేభ్యో మోక్షఇష్యామి మా శుచః ॥

అటువంటి పుణ్య శ్లోకుడయిన శ్రీ మహరాజశ్రీ వారి శ్రీచరణాలకు మా కోటి కోటి ప్రణామములు.

స్వామి శ్రీ కరపాత్రజీ మహరాజ్

తేజము ఒక్కటే. అదే తేజము జలాది క్రమముతో (తేజము, జలము, పృథ్వి) ఘటము అవుతుంది. ఘటములో జలము, మరియు జలములో సూర్యుడు మొదలగు రూపాలు కూడా తేజమునకు చెందినవే. అనేక ఘటములలో అనేక ప్రతిబింబాలు కూడా తేజమే. ఆ ప్రతిబింబముల వల్లనే తేజములో బింబత్వము యొక్క కల్పన కలుగుతుంది. బింబ ప్రతిబింబముల ఏకత్వమును అర్థము చేసుకోవడము సులభము. కానీ ఘటము, జలము మరియు తేజము వాటి ఏకత్వాన్ని అర్థం చేసుకోవడము క్లిష్టము. ఇదే ప్రకారంగా ఆత్మ-పరమాత్మల యొక్క ఏకత్వాన్ని బింబప్రతిబింబ రూపంతో అర్థం చేసుకోవడము అత్యంత సులభసిద్ధము. కానీ అచేతనరూపంలో ప్రతీయమానమై యున్నటువంటి ప్రపంచమును పరమాత్మతో ఒకటిగా అనుభవములో తెచ్చుకోవటము కష్టము. అందువల్ల పరమాత్మునితో ప్రపంచము యొక్క ఏకత్వాన్ని అనుభవములోకి తెచ్చుకోవాలంటే, బాధ ప్రక్రియను ఆలంబనం చేసుకోవలసి వస్తుంది. వస్తుతః ఒక్కడే పరమాత్ముడు మాయాత్మకమైన జ్ఞానశక్తి, క్రియాశక్తి వీటి కలయికతో వివిధ నామరూపాలకు ఆధారమవుతుంది. అదే శివ, విష్ణు, బ్రహ్మలవుతారు. అదే తన అనిర్వచనీయమైన శక్తి ద్వారా రామకృష్ణాది రూపములుగా ప్రకటమవుతుంది. భక్త జనులు వారి వారి భావనాను సారంగా దాని నుపాసిస్తారు. పేర్లు అనేకమయినా, కల్పనలు అగణితమయినా పరమాత్మ పరమార్థతః ఒక్కడే. ఏఏ భావముతో ఉపాసన చేస్తారో తత్తత్ రూపాలు తనే అయి అనుభవ గమ్యుడవుతాడు. నామరూప క్రియలు అనేకమైనను పరమాత్మలో అనేకత్వం లేశ మాత్రంగా కూడా లేదు. అద్వితీయుడు, నిర్గుణుడు పరమాత్ముడు - ఇదే శ్రీ కరపాత్రజీ మహరాజ్‌వారి సమన్వయ దృష్టి. అది శృతి, స్మృతి పురాణములకు సర్వధా

అనురూపమైనది. సమ్మతమయినది. ఈ దృష్టితో శాస్త్రముయొక్క ఏ అంశమయిన అసంగతము కాని, త్యాజ్యము కాని కాదు. అనిర్వచనీయమైనటువంటి 'మాయ' అన్ని బేధములను సంబాళించుకుంటుంది. పరమార్థతత్త్వం-ఎక్కడికక్కడే నిర్గుణము, నిర్వికారము, నిర్విశేషము మరియు నిర్ధర్మకము.

శ్రీకరపాత్రజీ మహరాజ్‌తో 40-45 సంవత్సరాల వరకు సత్సంగము, వార్తాలాపము చేయగలిగిన సౌభాగ్యము లభించింది. ఒక్కసారి నా హృదయపటలం పైన వారి జ్వాజ్వల్యమానమైన స్మృతులను దర్శించడానికి ప్రయత్నిస్తున్నాను.

మొట్టమొదట గంగాతటము వద్ద ఒక కౌపీనధారి మహాత్ముడు విచరణ చేస్తున్నాడు అని లోకులలో చర్చ వ్యాపించింది. వారి వద్ద వస్త్రము మాత్రమే వున్నది. కేవలం కౌపీనాచ్ఛాదన మాత్రము. పాత్ర ఏదీ లేదు. బ్రాహ్మణుల ఇళ్ళ నుండి చేతులతోనే భిక్షతీసుకునేవారు. ఏమీ సంగ్రహము లేదు. పరిగ్రహము లేదు. ఎవరూ శిష్యులు-సేవకులు లేరు. మా సత్సంగ ప్రియ మిత్రులమంతా వారి దర్శనమునకై ఉత్సుకులమయ్యాము. కాని దర్శనమునకు ఒక ప్రతిబంధకమేర్పడింది. మా మామగారు పండితశ్రీ చంద్రధర శర్మ గారికి మిత్రుడు వారు స్వయంగా పాలు, పెరుగులపైన తమ జీవనయాపన చేసేవారు. చాలా నిశ్చింతగ ఆనందంగా వుండేవారు. వారు మమ్ములను పిలిచి అడిగారు, 'మీరంతా ఎక్కడికి వెళ్తున్నారు?' అని అపుడు మేము ఆయువ అవధూత యొక్క మహిమను గురించి వారికి వినిపించాము.

'మీరు కొన్ని రోజులు ఆగండి. ముందు మేము చూసి వస్తాము తర్వాత మిమ్ములను పంపిస్తాము' అన్నారు మామగారు. అలా మా దర్శనము ఆగిపోయింది. కానీ మనసులో లాలస మాత్రమలాగే వుండిపోయింది. కొన్ని రోజుల తర్వాత శ్రీకరపాత్రజీ మహరాజ్ వారు దండగ్రహణము చేశారు. దిగదిగంతాలలో వారి పాండిత్య ప్రకాశము వ్యాపించి పోయింది. వీరు నరవరములోని షడ్దర్శనా చార్యుడు స్వామి శ్రీ విశ్వేశ్వరాశ్రమ్‌జీ వారి వద్ద విద్యాధ్యయనము చేశారని మాకు తెలిసింది. శ్రీ ఉడియా బాబాజీతో సత్సంగము చేసేవారు. మరియు స్వామి శ్రీ బ్రహ్మానంద సరస్వతి మహరాజ్ (అప్పటికి వారు జ్యోతిష్పీఠాధీశులు అవలేదు) వారితో దండగ్రహణము చేశారు. వారు సనాతన ధర్మ పద్ధతికి పూర్ణ సమర్థకులు. శాస్త్రముల

అక్షర, పంక్తి మాత్రముపైన నిష్ఠ వుండేది. తర్వాత తమ అద్భుత ప్రతిభ, ప్రసన్న గంభీర విద్య ద్వారా అన్నిటిని సమన్వయ పరచేవారు. యుక్తి యుక్తమని ప్రతిపాదించేవారు. ఇక మాకు వారి దర్శనేచ్ఛ, ఉత్కంఠ చాల ఎక్కువయిపోయింది.

స్వామి శ్రీకరపాత్రజీ మహరాజ్‌జీ పేరు ఇపుడు స్వామి శ్రీహరిహరానంద సరస్వతి అయింది. నేను ఝూసీలో బ్రహ్మచారి శ్రీ ప్రభుదత్తజీవారి సంవత్సర వ్యాప్త సంకీర్తన యజ్ఞంలో భాగవతప్రవచన చేస్తూంటిని. ప్రసంగము పదకొండవ స్కంధముపైన జరుగుతూ వుండినది. అనిర్వచనీయమైన మాయ యొక్క యోగంతో పరమేశ్వరుడే ప్రపంచరూపంలో భాసిస్తున్నాడు అని నేను ప్రతిపాదించాను. జీవుడు అనాది. ప్రపంచములో దీని అధ్యాసకూడ అనాదియే. ఈ అధ్యాసకారణంగానే జీవుడు తనను కర్తగా అనుకుంటాడు. అకర్త ఆత్మలో కర్తృత్వబుద్ధియే అధ్యాస అంటే. అధ్యాసయే బంధనము దీని కారణంగానే జీవుడు లోక-పరలోకము, పునర్జన్మలనే సంకటములలో చిక్కు పడిపోయాడు. ఈ జీవుడిని ముక్తుడిని చెయ్యడానికే శాస్త్రము విధి-నిషేధమనే విభాగమును తయారు చేసినది. ఈశ్వరానుగ్రహముతో, ఈ జీవుడు విహితమున అనుష్ఠానము చేస్తాడు. నిషేధమును త్యాగము చేస్తాడు. దీని వల్ల అంతఃకరణ శుద్ధి కలుగుతుంది. శుద్ధ అంతః కరణములో భగవత్స్వరూపజ్ఞానము (బోధ) కలగడానికి యోగ్యత వస్తుంది. యోగ్యుడైన అధికారి తన మరియు పరమాత్మ స్వరూపాల ఏకత్వసిద్ధిని అనుభవంలోకి తెచ్చుకుంటాడు. 'అధ్యాసము' అంటే అనాత్మలో ఆత్మయొక్క భ్రమ నశించిపోతుంది. ఏదైతే మాయామయ ప్రపంచము మొదట సత్యము, అజ్ఞాన దృష్టితో మాయగా వుండినదో, జ్ఞాని దృష్టిలో అది దాని అస్థిత్వాన్ని నిలుపుకొనలేదు. అపుడిక ఈ నామరూప క్రియాత్మక ప్రపంచము కూడా ప్రత్యక్ష చైతన్యాభిన్న పరబ్రహ్మ రూపముగానే అనుభవంలోకి వస్తుంది.

భాగవత ప్రవచనము తర్వాత శ్రీకరపాత్రజీ మహరాజశ్రీ వారు ఎపుడైతే గంగాతటముపై నున్న విరక్త మహాత్ములను కలుసుకోవడానికి బయలుదేరారో ఇక అపుడు నేను కూడా వారి వెనకాలే బయల్దేరాను. ఆ రోజుల్లో వారు నన్ను ప్రశంసించారు. శాస్త్రానుకూలము, యుక్త సంగతము అని చెప్పారు. తర్వాత వారు నన్ను ఇలా ప్రశ్నించారు 'నీవు శ్రీకృష్ణ లీలలను గురించి చాలబాగ చెబుతావని

విన్నాను. నీవు సిద్ధాంతపరముగా నిరూపణ చేస్తావా? లేక పరతత్త్వపరంగానా?' నేను పరతత్త్వరూపముగా అన్నాను. అంటే 'నీ నోట నెయ్యి, చక్కెర' అని అన్నారు. విరక్తులలో వీరి బ్రహ్మవిద్య, దర్శనశాస్త్రములు, వీరి అద్భుత ప్రతిభ వీటి ప్రతిష్ఠ పెరిగిపోయింది. వారపుడు ఉదయించే సూర్యునివలె ప్రకాశిస్తుండిరి. ఆ రోజులలో గీతాప్రెస్ సంస్థాపకులైన సేఠ్‌జయదయాల్ గోయెంకా గారు ప్రభుదత్త బ్రహ్మచారిగారి ఆహ్వానంపై సంకీర్తన ఉత్సవం కోసం ఝూసీ వచ్చారు. అక్కడ శ్రీ కరపాత్రజీగారితో కలిశారు. సేఠ్‌జీ ఇలా ప్రశ్నించారు. 'జ్ఞాని యొక్క జీవితంలో కామ, క్రోధాది దోషాలు ఉంటాయా? ఉండవా?' సేఠ్‌జీ అనే వారు 'ఒక వేళ జ్ఞాని జీవితంలో ఈ వికారాలు ఉన్నాయి అంటే, ఇంకా దుఃఖ నివృత్తి కలుగలేదు కదా అపుడు ఎవరైనా ఇక తత్త్వజ్ఞానము కోసము ఎందుకు ప్రయత్నిస్తారు?' ఈ ప్రశ్నను వారు మొదట కుంభమేలాలో వచ్చిన అన్య మహాత్ములను కూడా అడిగారు. మహామండలేశ్వరులు శ్రీజయేంద్రపురీజీ మహరాజ్‌వారు ఈ వికారాలకు కారణము అవిద్యాలేశము అని చెప్పారు. ఒక దొన్నెలో మొదట చంపాపుష్పములు వుంచిన తర్వాత కొద్ది సేపటికి వాటిని తీసివేసినా దొన్నెలో కొంచెం సుగంధము మిగిలే వుంటుంది. అలాగే జ్ఞాని యొక్క అంతఃకరణలో అవిద్యాలేశము వుంటుంది. దానివల్ల వికారములు కలిగినవని చూస్తాము. సేఠ్‌జీకి ఈ సమాధానము రుచించలేదు. వారు అనే వారు అవిద్య ఒక వేళ సద్వస్తువయితే అది అద్వైతమవుతుంది. ఒక వేళ అవిద్య అసద్వస్తువయితే దానితో బంధనసిద్ధి కలుగదు. అందువల్ల అజ్ఞాని, అజ్ఞానంలో వున్నపుడే అవిద్యను గురించి కల్పన చేస్తాడు. తత్త్వజ్ఞానము కలిగిన తర్వాత అవిద్య లేదు, అవిద్యాలేశమూ లేదు.

శ్రీ ఉడియా బాబాజీ మహరాజ్ వారు ఇలా అనేవారు 'తత్త్వజ్ఞుడి స్వదృష్టితో అవిద్య తత్కార్యము కాదు. భ్రాంతి దృష్టివల్లనే (అవిద్య) కల్పితము. అందువల్ల అవిద్య మరియు తత్కార్యము వీటి యొక్క స్థితి అనిర్వచనీయమేకాని, వాస్తవమయినది కాదు.

సేఠ్‌జీ కరపాత్రజీవారితో ప్రశ్నిస్తూ తత్త్వజ్ఞుడి జీవితంలో వికారాలు అంగీకరిస్తే సమాజములో హాని కలుగుతుంది అని ప్రతిపాదించారు.

శ్రీకరపాత్రజీ ఇలా నిరూపణము చేశారు. ఔపనిషత్ మహావాక్యము ద్వారా అఖండ సాక్షాత్కారము కలిగిన తర్వాత అవిద్య నివృత్తమవుతుంది. ఇది సరే కాని ఎంత వరకు ఈ శరీరము వున్నదో అంత వరకు యవ్వనము, వార్ధక్యము, రోగము వస్తూనే ఉంటాయి. స్వప్న, సుషుప్తి అవస్థలు కూడా వస్తూ వుంటాయి. సాక్షి యొక్క బ్రహ్మవిద్య కేవలం భ్రమని పోగొడుతుంది. కాని భాసమానమైన వాటిని పోగొట్టదు. అందువల్ల సాక్షి-భాస్య అంతఃకరణలో ఒకవేళ తత్త్వజ్ఞానము కలిగిన తర్వాత కూడా వికారాలు వస్తున్నా, దానివల్ల ముక్తిలో ఏమీ విఘ్నము కలుగదు. ఎందుకంటే ఆత్మ నిత్య ముక్త-స్వరూపము. అవిద్యా నివృత్తి ఇక్కడ కేవలం ఉపలక్షణం. సమాజమునకు ఇదే హితకరము- తత్త్వజ్ఞాని జీవనంలో కూడా వికారాలు కలగవచ్చు. అంధశ్రద్ధతో జ్ఞానిని నిర్వికారుడనుకుని మోసపోకూడదని తెలుసుకుని వుండాలి. దీనివల్ల సాంప్రదాయానికి ఏమి హాని కలుగదు, పైగా సత్యవాది అవడం వలన సమాజంలో ప్రతిష్ఠ పెరుగుతుంది. కాని ఈ మాట సేఠ్‌జీ ఒప్పుకోలేదు.

మేము ఈ విషయం శ్రీ ఉడియా బాబాజీని డిగాము. అపుడు వారు 'నిర్వికారతా, వికారతా అజ్ఞాని యొక్క దృష్టి కోణమే. వాస్తవంగా మన స్వరూపము నిత్య, శుద్ధ, బుద్ధ, ముక్తమే!'

శ్రీకరపాత్రజీ మహరాజజీ యొక్క నిర్భయ నిరూపణము వల్ల కుంభమేలాలో వారి ప్రతిష్ఠ పెరిగింది. వారి విద్యాయశస్సు నాలుగు దిక్కుల వ్యాపించింది. నా చిత్తముపైన వారి వైరాగ్యము, త్యాగము, విలక్షణ ప్రతిభ, మరియు శాస్త్రజ్ఞానము వీటి యొక్క ప్రభావము బాగా పడినది. నా మనసులో వారిని మాటిమాటికి కలుసుకోవాలని, దర్శించాలని, సత్సంగం చేయాలనీ ఆకాంక్ష ఎక్కువకాజొచ్చింది.

ఆగ్రా జిల్లాలో ఖాడా అనే పేరుగల చిన్న వూరు వున్నది. ఆ రోజుల్లో కర్ణవాసములోని స్వామి వివేకానంద్ వారి ప్రభావంతో వేదాంత విచారణ చేసేవారు చాలా మంది జ్ఞాననిష్ఠ సజ్జనులు అక్కడ వుండిరి. వారిలో ఛోఖీలాల్‌గారు, భూరేలాల్‌గారు, ప్యారేలాల్‌గారు, వీరి పేర్లు నాకు గుర్తున్నాయి. వారంతా శ్రీ ఉడియా బాబాజీతో సంప్రదించి వారి వూరిలో బ్రహ్మసూత్రాలుపైన ఒక విశాల (సత్సంగ) ఆయోజనము చేయనిశ్చయించిరి. బాబాకూడా రావడానికి అంగీకరించారు. ఆవూరి

వాళ్ళు శ్రీకరపాత్రజీ మహరాజశ్రీ వారితో విన్నవించుకున్నారు. వారు కూడ రావడానికి అంగీకరించారు. శ్రీ ఉడియాబాబాజీ వారితో అన్నారు 'శాంతను (స్వామి అఖండానంద సరస్వతి పూర్వాశ్రమ నామము)ను కూడా తీసుకుపోదాము' మేలాలో వచ్చిన గొప్ప గొప్ప మహాత్ముల నందరిని ఆహ్వానించారు సప్తాహం రోజులు గొప్పగా బ్రహ్మసూత్ర-సత్రము జరిగింది. అందులో శ్రీ ఉడియా బాబాజీ మహరాజే కాకుండా దండీస్వామి, శ్రీవిశ్వేశ్వరాశ్రమ్‌జీ, (కరపాత్రజీ దర్శన శాస్త్రాలను అధ్యయనం చేసిన గురువుగారు) 10-20వేల వరకు జనం కదిలి వచ్చారు. అక్కడి ప్రజలు శ్రీ ఉడియా బాబాజీ తో జరిపిన వేదాంత సంబంధమైన ప్రశ్నోత్తరాలు 'జ్ఞాని-జ్ఞాననిష్ఠా' అన్న శీర్షికతో అక్కడ ప్రచురితమైనది. శ్రీ కరపాత్రజీ వారు ఏడు రోజులు సప్తాహంలో కేవలం 'శ్రీభగవానువాచ' అన్న దానిపైన మాత్రమే ప్రవచనము చేశారు. భగవద్గీతలోని 15వ అధ్యాయముపై వారు ప్రవచనము చేయవలసి వుండినది. అందులో వారు విభిన్న మతముల(అభిప్రాయాలు)ననుసరించి భగవత్స్వరూప నిరూపణము చేశారు. సమగ్ర ఐశ్వర్యము, ధర్మము, యశస్సు, శ్రీ జ్ఞానము మరియు వైరాగ్యము ఇవన్నీ శ్రీకృష్ణుడిలో ఏవిధంగా మహా భారతాది గ్రంథాలలో వర్ణించారో అవన్నీ వినిపించారు. ఇంకా సంపూర్ణ విశ్వము యొక్క ఉత్పత్తి, వినాశము, గతి, అగతి, అవిద్యా, విద్య ఎవరికి తెలుసో వారినే భగవంతుడని చెప్పగలము అని అన్నారు. ఈ లక్షణములను విస్తారంగా వినిపించడంలోనే ఏడు రోజులు గడిచిపోయాయి. అక్కడ నాకు 'పంచదశి' పైన ప్రవచనము చెప్పే బాధ్యతను అప్పజెప్పారు. నేను కూడా వారిని చూసి 'తృప్తిదీప' ప్రకరణము యొక్క 'ఆత్మానంద చేత్ విజానీయతామ్' అన్న వచనముపై ఏడు రోజులు ప్రవచనము చేశాను.

ఆమహోత్సవములో విశేషత ఏమిటంటే అందరి ప్రవచనాలలో అందరూ కూర్చునేవారు. అందరూ అందరివి వినడం, మరల వారి వారి విడిదుల్లో కూర్చుని ప్రవచనాలపై టీకా-టిప్పణి కూడా చేసేవారు. ఇంత గొప్పగొప్ప మహాత్ములు, విద్వానులు ఒక చిన్న వూరిలో ఏకముకావడం ఒక అద్భుత విషయము.

శ్రీకరపాత్రజీ మహరాజ్ వారు తమ విలక్షణ ప్రతిభతో మహాత్ములను అందరిని చాల ప్రభావితం చేశారు. వారు ఇలా అనేవారు 'ఒకవేళ ప్రత్యక్ష, ప్రమాణ,

అనుమానాది ప్రమాణముల వలన ప్రత్యగాత్మ స్వరూపబోధ కలిగితే వేదాలయొక్క ప్రమాణికత నష్టమయిపోతుంది. ఏ ప్రమాణాంతరముల వలన అనధిగతము, అబాధితము అయిన వస్తువు యొక్క సంశయరహితమైన (బోధ) జ్ఞానము కలుగుతుందో దాన్నే ప్రమాణము అంటారు. నిత్య పరోక్షమయిన స్వర్గాదిఫలము, యజ్ఞ-యాగాది ధర్మానుష్ఠానాల వలన ఎలా కలుగుతుందన్న సంగతి వేద-శాస్త్రములు కాకుండా వేరుగా ఇక వేటి తోను తెలుసుకోలేము. యజ్ఞ-యాగాది రూప ప్రత్యక్ష ధర్మమునకు పరోక్ష ఫలమునకు గల సంబంధమును చెప్పడంలోనే శాస్త్రముల సార్థకత. ధర్మము యొక్క జ్ఞానము కేవలము లౌకిక దృష్టితో కలుగదు.

ఇంకొక విషయమేమిటంటే నిత్య అపరోక్ష-ఆత్మ కేవలం అజ్ఞానము కారణంగానే అప్రాప్తములాగ అనిపిస్తుంది. అది కూడా శాస్త్రముల కంటె వేరే ఏ ప్రమాణముల ద్వారానూ తెలియబడదు. ఎలాగైతే శబ్దాది విషయములు, చెవులు, కళ్ళు వీటి ద్వారానే తెలియబడతాయో - అలాగే ఆయా విషయాలలో అన్ని ప్రమాణాలు స్వతంత్రమైనవే. ఇదే విధముగ ప్రత్యక్చైతన్యాభిన్న పరమాత్మ-తత్త్వమును గురించి తెలియజేయుటకు కూడా శాస్త్రమొక్కటే ప్రమాణము. ప్రత్యక్షాది ప్రమాణాలు శాస్త్రోక్తమైన విషయాలను సమర్థించేటట్లయితే వాటిని కూడా అంగీకరించవలసినదే.

ఇలాగే మునుపు బ్రాహ్మణ మహా సమ్మేళనము జరిగినపుడు భారత వర్షపు ధురంధర విద్వానులైన శ్రీలక్ష్మణశాస్త్రి ద్రావిడ్, శ్రీపంచానన్ తర్కరత్న, శ్రీచిన్నస్వామి, శ్రీ అనంతకృష్ణశాస్త్రి సమ్మిళితమైన ఆ సభలో ఈ చర్చలు విని వుంటిని. కాని శ్రీకరపాత్రజీ వారి నవనవోన్మేష శాలిని ప్రతిభ సాధారణ జనులకు కూడా శృతి - స్మృతులపై విశ్వాసము కలిగించగలిగినది.

శ్రీకరపాత్రజీ అనేవారు వేదము భేదమును ప్రతిపాదించేది కాదు. ఎందుకంటే బేధము ప్రత్యక్షాది ప్రమాణములతోనే తెలిసిపోతుంది. ఇక వేదము కూడా దానినే ప్రతిపాదిస్తే అది ప్రమాణమనిపించుకోదు. అనువాదమనిపించుకుంటుంది. మరో కారణము బేధము యొక్క అధికరణము ఏమిటి? బేధమా అబేధమా? బేధములో భిన్నత వుండనే వున్నది, దాని అధికరణము కూడా వుండాలిగదా! అబేధరూపమైన అధికరణములో ప్రతీతమయ్యే బేధము మిథ్యయే, ఎందుకంటే బేధము ఎక్కడ

లేదో, అక్కడ అది కనిపిస్తూవుంది. తనలో లేనిదే అధికరణంలో ఏవస్తువు కనిపిస్తుందో అది మిథ్య. వేదములు బేధమును ప్రతిపాదించిన యెడల, దానిని మిథ్యాభాషి అని చెప్పవలసి వస్తుంది. శృతులలో బేధము యొక్క నిందవున్నది. బేధము అర్థమయ్యే వాడికి భయము వుంటుంది. పరమార్థవస్తువుని అన్యమనుకుంటే పశుత్వం ప్రాప్తిస్తుంది. అది ఐంద్రియకము వినశ్వరము అయినా అవుతుంది, లేక కల్పనామాత్రమయినా అవుతుంది.

గొప్ప గొప్ప మహాత్ములు, విద్వానులు వీరందరి యెదుట వేదశాస్త్రములను యుక్తి సిద్ధంగా తెలియజెప్పడానికి శ్రీకరపాత్రజీ వారి ప్రతిభ ప్రస్ఫుటితమయిపోతూ వుండేది. అందరు ముగ్ధులైపోయేవారు.

శ్రీకరపాత్రజీ వేదాలు అపౌరుషేయములని దృఢంగా చెప్పేవారు. వేదముల కర్తను గురించి ఎక్కడ వేదాలలో వర్ణన లేదు. వేదము అవిచ్ఛిన్న సాంప్రదాయము వల్లనే ప్రాప్తమవుతుంది. అన్య ప్రమాణములు అనధిగత, అబాధిత వస్తువు యొక్క ప్రతిపాదకములు, జ్ఞానాత్మకము కాబట్టి వేదముల వాస్తవిక స్వరూపము ప్రత్యక్చైతన్యాభిన్నము అనాత్మ అయితే వేదములు కూడా అనాత్మకోటిలోకి చేరిపోతాయి. ఏ వ్యావహారిక వస్తువైనా బ్రహ్మ జ్ఞానమునకు అవ్యవహిత-పూర్వక్షణము పర్యంతము బాధితము కాదు అని గుర్తుపెట్టుకోవాలి. అందువల్ల ఎవరికైతే బ్రహ్మజ్ఞానము కలుగలేదో వారికి వ్యావహారిక వస్తువును మిథ్య అనే అధికారం లేదు. వర్ణాశ్రమోచితమైన పనులను బ్రహ్మజ్ఞాన పర్యంతము చేస్తూనే వుండాలి. ఎవరైతే వర్ణాశ్రమ, మర్యాదను ఉల్లంఘించి సంకీర్తనం చెయ్యడము, ఇష్టము వచ్చినట్లు అనుష్ఠానము చెయ్యడము, మంత్రోపదేశము ఇవ్వడము ఇలాంటివి చేశావారో వారిపట్ల శ్రీకరపాత్రజీ వారికి చాల కఠోరమైన దృష్టికోణము వుండేది. వారు బహిరంగంగా వారిని ఖండించేవారు.

శ్రీహరబాబాజీ సంకీర్తనకు ముందు ప్రణవోచ్చారణ చేశేవారు. పండిత శ్రీమదనమోహన మాలవ్యగారు హరిజనులకు సామూహికంగా ప్రణవము, స్వాహా మొదలైన మంత్రాలను ఉపదేశించేవారు. శ్రీకరపాత్రజీ వీరిరువురిని విరోధించారు. శ్రీ ఉడియాబాబాజీ దగ్గరికి సందేశము పంపించారు 'హరిబాబాగారిని ప్రణవోచ్చారణ

చెయ్యవద్దని చెప్పండి'. బాబా అన్నారు - 'ఎవరైనా వచ్చి అడగకుండానే నేనంతట నేను ఎవరికీ ఉపదేశము ఇవ్వను. 'న సృష్టః కస్యచిత్ బ్రూయాత్' (మనుస్మృతి) ఒక వేళ శ్రీహరి బాబాజీ వచ్చి నన్ను అడిగితే అపుడు నేను వారికి చెప్పగలుగుతాను. వారు మహాత్ములు. వారు ఏది చేస్తున్నారో దానిలో హస్తక్షేపము చెయ్యవలసిన పనేమున్నది?' ఈ జవాబుతో కరపాత్రజీవారు అసంతుష్టులయ్యారు. విద్యార్థిగా వున్నపుడు 'నరవర్'లో (నరోరా) చదువుకునేటపుడు రామ్‌ఘాట్, కర్ణవాసమునకు ప్రతి సెలవు రోజు బాబా దగ్గరికి వచ్చి సత్సంగము చేసేవారు. వారికి బాబా అంటే అమితమైన శ్రద్ధ వుండేది. కానీ శాస్త్ర నిష్ఠ కారణంగా వారి వ్యవహారంలో కొంచెం మార్పు వచ్చింది.

పండిత మదన మోహన మాలవ్య గారితో ఇదే విషయంపైన ఋషీకేశ్‌లో శాస్త్రార్థము జరిగింది. చాలా రోజుల వరకు శ్రీకరపాత్రజీ మరియు శ్రీమదనమోహన్ మాలవ్యగారు ఇద్దరు వారివారి పక్షమును బలపరుస్తూ మాట్లాడారు. మాలవ్యగారు పురాణాలలో వున్న భగవన్నామము, మంత్రము, పూజ వీటిపైన చెప్పేవారు. శ్రీకరపాత్రజీ ధర్మశాస్త్రం, మరియు మీమాంస దృష్టితో వాటిని ఖండించేవారు. ఇద్దరికి ఇద్దరు తమ తమ నిశ్చయము పట్ల దృఢంగా వున్నారు. ఈ శాస్త్రార్థములో మధ్యస్తులుగా ఇద్దరు వ్యక్తులను ఎన్నుకున్నారు. 1.శ్రీజయదయాల్ గోయెంకాగారు (గీతా ప్రెస్ సంస్థాపకులు), 2.కాశీ విద్వాన్‌సేఠ్ శ్రీ గౌరీశంకర్ గోయెంకాగారు. గౌరీశంకర్‌గారు స్పష్టంగా కరపాత్రజీ వైపు తన నిర్ణయము చెప్పారు. కాని సేఠ్ జయదయాల్ గారు 'ఒకరకంగా చూస్తే మాలవ్యగారి పక్షము సరిఅయినది అనిపిస్తోంది, శాస్త్రీయ దృష్టితో చూస్తే కరపాత్రజీ సరిఅనిపస్తోంది' అన్నారు. దీని వలన శ్రీకరపాత్రజీ కొద్దిగ అప్రసన్నులయ్యారు. అయినా శాస్త్రార్థములో వారే విజయులయ్యారు. ఆ సమయంలో ఈ వాదన ఇక అంతకంటే ముందుకు సాగలేదు.

ఆ రోజుల్లో నేను 'కల్యాణ్' సంపాదక విభాగములో పనిచేస్తుండేవాడిని, (నిష్కామకర్మ) అపుడు సేఠ్ జయదయాల్ గారు 'విద్య, అవిద్య, సంభూతి, అసంభూతి' అని ఒక వ్యాసము వ్రాశారు. దానిలో ప్రత్యక్షంగా శంకర భాష్యము యొక్క ఖండన జరిగింది. వారు తన ఈ రచనలో 'విద్య' అన్న పదానికి బ్రహ్మవిద్య

అని, 'అసంభూతి' అన్న పదానికి భగవంతుడని అర్థం చెప్పారు. నాకు గుర్తున్నంత వరకు రెంటి సమన్వయమునే ప్రతిపాదించారు శ్రీకరపాత్రజీ గారు మాకు ఈ లేఖను 'ఖండిస్తూ' ఒక లేఖను ప్రచురించమని పంపించారు. కాని ఆ లేఖ 'కల్యాణ్'లో ప్రచురించబడలేదు. దీనితో వారు అసంతుష్టులై 'కల్యాణ్'కు లేఖలు (రచనలు) పంపటం మానేశారు. ఎక్కడి నుండి అయినా తన లేఖను తీసుకుని ఉదహరించ డానికి కూడా వారు ఒప్పుకోలేదు. వారు తమ నిష్ఠలో చాలా దృఢత్వం కలిగివున్నారు. నేను భాయిజీతో (శ్రీహనుమాన్ ప్రసాద్‌పొద్దార్) అన్నాను 'శంకరభాష్యము సర్వదా యుక్తి సంగతము. అనుభవ సిద్ధముగా కరపాత్రజీ దానిని ఉచిత రీతిలో సమర్ధించారు. వారి లేఖను ప్రచురించక పోవడం సరికాదు' అని అన్నాను. భాయిజీ అన్నారు 'పోనీ మీరు వ్రాయండి ప్రచురిస్తాము'.

అసలు సంగతి ఏమిటంటే అవిద్యారూపమైన కర్మతో విద్యయొక్క సముచ్చయము వున్నదే, విద్య దేవలోకాదిని పొందే ఉపాసనా విద్యనా? లేక బ్రహ్మవిద్యనా? సామాన్య దృష్టితో దాని అర్థము బ్రహ్మ విద్యనా? సామాన్య దృష్టితో దాని అర్థము బ్రహ్మ విద్య అనిపిస్తుంది. కాని అక్కడ 'అవిద్య' అంటే అంధతమస్సులో ప్రవేశముకలుగుతుందని, విద్యవల్ల అంతకంటే అధికమైన నిబిడమైన అంధతమస్సులో ప్రవేశము కలుగుతుందని చెప్పారు. (ఈ మాటపై తొందరగా దృష్టిపోదు) ఈ మాట 'బ్రహ్మవిద్య'తో ఎక్కడ పొంతన కురదు. అందువల్ల ఇక్కడ 'విద్య' అన్న శబ్దానికి అర్థము దేవలోకాలను పొందే ఉపాసనా విద్య అనే అనుకోవాలి కానీ బ్రహ్మ విద్య మాత్రము కాదు. అదీకాక ఇక విద్యయొక్క సముచ్చయము అవిద్యతో కలిసినది. కాన ఇది అమృతము కాదు. ఇదే విషయం 'సంభూతి', 'అసంభూతి'కి కూడ వర్తిస్తుంది. భగవదోపాసన, సంభూత్యోపాసన యొక్క ఆపేక్ష మరింత అంధకారం లోనికి తీసుకుపోయేది కాకూడదు! కేవలం శబ్దజాలంలో పడి శాస్త్రసిద్ధాంతాన్ని ఉపేక్షించరాదు.

బ్రహ్మవిద్య, ఉపాసనావిద్యలో స్పష్టముగా బేధమున్నది. బ్రహ్మవిద్య వస్తుతంత్రము, ఉపాసనా విద్య కర్తృ తంత్రము. కర్మానుష్ఠానము వలన అంతః కరణ శుద్ధి కలుగవచ్చు. దేవలోకాల్లో వుండే భోగాధిక్యత పట్ల వైరాగ్యము కలుగవచ్చు.

పరమార్థ వస్తుసాక్షాత్కారము బ్రహ్మవిద్య-స్వరూపము. హేతువు, ఫలము వీటిలో ఈ రెంటికీ భిన్నత్వమున్నది. ఈ మాటలన్నీ 'ఈశావాస్యోపనిషత్' యొక్క ఉపసంహారములో (భాష్యము) ఆచార్య శంకరుడు స్పష్టము చేశారు. నేను శ్రీకరపాత్రజీ వారి అభిప్రాయములను సమర్థించడానికి 'కల్యాణ్'లో ఈ లేఖ వ్రాశాను. లేఖకుడు - ఒక విద్వాంసుడు అనే పేరుతో ప్రకాశితమయింది.

శ్రీకరపాత్రజీ నా పట్ల ప్రసన్నంగా వుండేవారు. స్నేహ భావముండేది. 'కల్యాణ్' పత్రికలలో నావి వందల కొద్ది వ్యాసాలు ప్రకాశితమయ్యాయి. భాగవత-భూమిక (అదిఇపుడు భాగవత దర్శనములో ప్రకాశిత మయినది) భాగవత అనువాదము, సాధనాంకం. మొదలైన వాటిలో నా రచనలు చూసి వారు చాలా ప్రసన్నులయ్యేవారు. ప్రశంసించే వారు కూడా. నేను వారి సిద్ధాన్తమును సరిగా అర్థం చేసుకున్నాను. ధర్మము, పరబ్రహ్మ రెండూ శాస్త్రైక గమ్యములే. నిత్య-పరోక్షము, నిత్య-అపరోక్షము అయిన వస్తుసాక్షాత్కారములో వాక్యమే ప్రమాణము. అంతేకానీ ప్రత్యక్ష, అనుమానాదులు కాదు. అవి సహాయకారులు కావచ్చు, కానీ శాస్త్ర విరుద్ధమయినచో అవి తుచ్ఛములు, అకించిత్కరములు.

'కల్యాణ్' సంపాదకీయ విభాగములో ఒకరినొకరు సంప్రదించుకుని ఇలా నిశ్చయించినారు. కరపాత్రజీవారు నాతో ప్రసన్నంగా, స్నేహంగా వుంటారు కాబట్టి నేను వెళ్ళి వారిని ఒప్పించాలని. నన్ను బల్దియా పంపారు. అక్కడ భృగుముని ఆశ్రమంలో శ్రీకరపాత్రజీ విడిదిచేసి వున్నారు. కాశీ పండితరాజ శ్రీసభాపతి ఉపాధ్యాయ్‌వారు అక్కడికి వచ్చివుండిరి. సత్సంగ చర్చ ముగిసిన తరువాత నేను వారితో 'కల్యాణ్'కు మీ లేఖలు (రచనలు) ఇవ్వండి అని ప్రార్థించాను. వారు నవ్వుతూ ప్రసన్నంగా మాటాడుతున్నారు. 'సేఠ్ జయదయాల్ గారిలో ఏమి విశేషత వున్నది, హనుమాన్ ప్రసాద్‌కి భగవద్దర్శనము కలిగిందా?' అని అడిగారు. వారి భక్తులు, నాకు ఏవిధంగా చెప్పారో ఆ విషయాలను నేను వీరికి చెప్పాను. సేఠ్‌జీలో విచారము (వివేకము) ఉదారత ప్రధానంగా వున్నాయి. వారు జాతి విశేషము కంటే కర్మ విశేషమునే అంగీకరించేవారు. బ్రాహ్మణులతో సకామ అనుష్ఠానము చేయించేవారుకాదు. ఇక భాయిజీలో భక్తి మరియు సహృదయత ప్రధానంగా వుండేవి.

వారు ఇచ్చేటపుడు యోగ్యుడు, అయోగ్యుడు అని చూసేవారు కాదు. బ్రాహ్మణులతో సకామ అనుష్ఠానము చేయించేవారు. రాసలీల, నామ జపము వీటిపై భాయిజీకి చాలాశ్రద్ధ వుండేది. సేఠ్‌జీ నిష్కామ కర్మపైన ఎక్కువ మొగ్గుచూసేవారు.' అని నేను చెప్పాను. శ్రీకరపాత్రజీ 'నేను నా రచనలను ఇప్పుడు కూడా 'కల్యాణ్' పత్రికకు పంపలేను. కానీ ఎక్కడైన ప్రకాశితమైన నా రచనలు మీకు నచ్చితే మీరు ప్రచురించుకోవచ్చు.' మాకు ఇది కూడా వారి అనుగ్రహమే అనిపించింది.

శ్రీకరపాత్రజీ వారు కాశీకి చెందిన శ్రీబ్రహ్మానందజీ మహరాజ్‌గారితో సన్యాసము తీసుకున్నారు. అప్పటి వరకు స్వామి బ్రహ్మానందజీ జ్యోతిష్పీఠ శంకరాచార్యులవలేదు. వారు శ్రీకరపాత్రజీకి గురువని నాకు వారిపట్ల చాలా శ్రద్ధకలిగింది. నేను కూడా అక్కడికి వెళ్ళి వస్తుండేవాడిని. నేను కూడా సన్యసించాలని నిశ్చయించుకున్నాను. కానీ 'కల్యాణ్' సంపాదకీయ పరివారంలో కార్యరతుడనై వున్నందున రెండు మూడు సంవత్సరాలు ఆలస్యమయినది. అప్పటి వరకు వారు జ్యోతిష్పీఠ శంకరాచార్యులయ్యారు. నేను దండగ్రహణం చేసిన తర్వాత మొదటి దినాల్లో ఋషీకేశ్‌లో వున్న కోయల్‌ఘాటీలో కరపాత్రజీ వారి దర్శనము చేసుకున్నాను. అక్కడ వారు నన్ను తమ ఆసనంపై కూర్చోబెట్టుకుని శ్రీకృష్ణ లీలలపై ప్రవచనం చెప్పమన్నారు. నేను చాలా సంకోచముతో వారి ఆజ్ఞను స్వీకరించాను.

నాకు గుర్తుంది. నేను వారి ఎదుట ఇలాగే వినిపించాను 'పరబ్రహ్మ పరమాత్మ మాయాశక్తి యొక్క యోగము వలన విశ్వమునకు కర్త, భర్త, హర్త అవుతాడు. అలాగే తన స్వరూపభూతమైన అనిర్వచనీయమైన ఆహ్లాదిని శక్తి యొక్క యోగము వలన లీలాపురుషోత్తముడిగా అవతారము ధరిస్తాడు. నిరాకారుడైనను అవిద్య కారణంగా ఆత్మలో శక్తి యొక్క జన్మ కలుగుతుంది. నిర్గుణుడు, నిర్వికారుడు అయిన ఆహ్లాదినీ శక్తి ద్వారా లీల జరుగుతుంది. ఒకవేళ భగవంతుడి ఈ లీలలు లేకపోతే జీవుడికి ప్రపంచాసక్తి వదలడానికి ఆధారమే వుండేది కాదు. ఎలాగైతే అనిర్వచనీయమైన అవిద్యానివృత్తికి - అనిర్వచనీయమైన విద్య కావాలో అలాగే, ప్రపంచాసక్తి వదలడానికి భగవదాసక్తి అపేక్షితము. భక్తి వలన సాంసారికమైన మమత పోతుంది. తత్త్వజ్ఞానముతో పరిచ్ఛిన్నతలో అహం పోతుంది. మహావాక్యము ద్వారా

బ్రహ్మాకారత ఉదయించినపుడు తక్షణమే అవిద్యానివృత్తి కలుగుతుంది. ఇదే విధంగా, దేవకి, యశోదల ద్వారా భగవంతుడు ప్రకటమయినపుడు ప్రపంచాసక్తి నశించి పోతుంది. నేను శ్రీహరిసూరి గారి భక్తిరసాయనమును ఆధారంగా తీసుకుని భగవంతుడి జన్మలీల వినిపించాను. శ్రీకరపాత్రజీ మహరాజ్ చాలా ప్రసన్నులయ్యారు.

నేను ఒకసారి పాదయాత్ర చేస్తూ హరిద్వారము నుండి బృందావనం వస్తున్నాను. అపుడు మేరఠ్‌లో శ్రీకరపాత్రజీ వారి అధ్యక్షతన ఏదో యజ్ఞము జరుగుతూ వున్నది. అక్కడ శ్రీగిరిధరశర్మ, శ్రీఅఖిలానంద మొదలైన విద్వాంసులు కూడా వచ్చియుండిరి. నేను అక్కడ 'పూతన ఉద్ధారము' ప్రసంగముపై ప్రవచనము చేసి, వారినివాస స్థానమునకు వెళ్ళి అక్కడ వేదముల యొక్క అపౌరుషేయతను గురించి ప్రశ్నించాను. మంత్రముల యొక్క ఆనుపూర్వీ అనాది, నిత్యము అన్నది నాకు విశ్వాసము కలగుటలేదు. అపుడు వారు నన్ను, పండిత నకచేదరామ్ ద్వివేదీ ద్వారా లిఖింపబడి హిందూ విశ్వ విద్యాలయం ద్వారా ప్రకాశితమైన సనాతన ధర్మోద్ధారమనే గ్రంధాన్ని చదవమని చెప్పారు. నేను ఆ పుస్తకము మునుపే చదివి వుంటుని, కానీ ఈ దృష్టితో కాదు. తర్వాత నవ్వుతూ వారు ఇలా అన్నారు. 'జ్ఞానస్వరూపమైన ఆత్మలోనే వాస్తవిక నిత్యత్వం వుంటుంది. వేదముల యదార్థ పరమార్థము ఆత్మయే. మరి ఇక వేరే అన్ని అనాత్మ పదార్థాల నిత్యతా ఆరోపితము, కల్పితమే. ఈ మాట నాకు బాగా మనసుకు పట్టింది.

అపుడపుడు వారి అనుగ్రహమును స్మరించుకుంటూ వుంటే హృదయం నిండిపోతుంది. వారు కాశీలోని నగవాలో వున్న గంగాతరంగములో వుండేవారు. నేను పగలు 11గం॥ల కంతా వారి దగ్గరకు వెళ్ళాను. నేను వారిని ఇలా ప్రశ్నించాను. అన్ని ఆస్తిక దర్శనాలు చూస్తే కూడా భగవంతునికి పూర్తిగ మహత్వము ఇచ్చినట్లు అనిపించదు. న్యాయవైశేషికములలో ఆత్మఒక ద్రవ్యము - జ్ఞానాధికరణము. అది రెండు విధములు జీవాత్మ, పరమాత్మ! యోగదర్శనములో ఈశ్వరుడు సమాధి కొరకు సాధన మాత్రమే. నిరోధదశలో ద్రష్ట యొక్క స్వరూపంలో ఈశ్వరుడి చర్చలేదు. అనుమానము ద్వారా ప్రకృతి సిద్ధిస్తుంది కానీ ఈశ్వరుడు కాదు. పూర్వ మీమాంసలో కర్మయే ప్రధానము. అదే అపూర్వమై ఫలమిస్తుంది. వేదాంత దర్శనములో మాయ

యొక్క ఉపాధి వలన బ్రహ్మలో ఈశ్వరత్వము వున్నది. అటువంటి స్థితిలో మీరు కొన్ని మీ అనుభవాలు చెప్పండి?' ప్రశ్న విని ప్రసన్నంగా లేచి కూర్చున్నారు. 4 గం॥ల వరకు అర్థమయ్యేలాగ చెబుతూనే వున్నారు. ఆ రోజు భిక్ష కొరకు కూడా వెళ్ళలేదు.

ఎలాగైతే చెవులు, చర్మము, కళ్ళు మొదలైన ఇంద్రియాలు వాటి వాటి విషయాలైన శబ్ద, స్పర్శ, రూపము మొదలైన వాటికి ప్రమాణమో, (అంటే చెవులతో చూడలేము, కళ్ళతో వినలేము) అలాగే అన్ని శాస్త్రాలు వాటి వాటి ప్రమేయములు వేరువేరుగ వుంటాయి. పరమ ప్రమేయమైన అద్వయితత్త్వ సాక్షాత్కారమునకు సహకరిస్తాయి. వైశేషిక దర్శనము వేరు వేరు పదార్థాలలో వున్న విశేషము, భేదము ఏదైతే వుందో దాని నిరూపణము చేస్తుంది. కేవలం పదార్థమును గురించి తెలుసు కోవడము మాత్రమేకాదు. విషయ భేదము లేకపోతే భేదసంస్కారము ఎలా కలుగుతుంది. అందువల్ల ప్రత్యేక పదార్థములో ఒక విశేషత వుంటుంది. దాని 'ప్రమా' ప్రత్యక్షాది ప్రమాణములవల్ల అది తెలుస్తుంది! ప్రమేయమును ప్రతిపాదిస్తుంది అది వైశేషిక దర్శనము. ప్రమాణములను నిరూపిస్తుంది న్యాయధర్శనము. ఇది పరస్పరం ఒకటి కొకటిగా వుంటాయి. వీటిలో ఆత్మను కూడా ద్రవ్యమునకు అంతర్గతముగానే నిరూపిస్తారు. ద్రవ్య, గుణాశ్రమయిన ఆత్మ ఇవి రెండు రకాలు ఆత్మ, పరమాత్మ. వారు అనుమానంతో పరమాత్మను జగత్తుయొక్క నిమిత్తకారణమని నిరూపించారు. దీని పరమ తాత్పర్యము భావపదార్థసిద్ధి ద్వారా 'ఏకం సత్' వైపు వారి సంకేతము. ఆ 'ఏకం సత్' అన్నది వీరికి ముఖ్యముకాదు. అనుమానము ద్వారా ఈశ్వరుడిని నిరూపణ చేశారు. అది ఉపాస్యము. ప్రాయఃనైయ్యాయి కులందరూ తమ తమ గ్రంధారంభాలలో ఈశ్వర వందనం చేశారు. ఉదయనా చార్యుడయితే భక్తి భావమును బాగా నిరూపణ చేశారు.

ఆత్మ-అనాత్మ యొక్క వివేకము సాంఖ్యధర్శనము ముఖ్యంగా ప్రతిపాదిం చినది. అందులో తత్త్వబాహుళ్యములను నిరాకరించి ఒకే ప్రకృతిలో అన్నిటి సమావేశము చేశారు. ఉపాధిగత కారణాలవల్ల ద్రష్ట బేధ కల్పన చెయ్యబడినది. జన్మ-మరణ- కరణాది భేదము దృశ్యములోనే వుంది. దృశ్యగత భేదముతో ద్రష్టలో

భేదకల్పన అసంగతమని స్పష్టంగా తెలుస్తుంది. అయినా త్వం పద వాచ్యార్థ శోధనమునకు ఉపయోగపడుట వలన అది కూడా బ్రహ్మాత్మైక్య బోధకు సహాయకారియే. మలిన ప్రకృతి భోగము నిస్తుంది. శుద్ధ ప్రకృతి అపవర్గము నిస్తుంది. ద్రష్ట యొక్క స్వరూపంలో భోగము, అపవర్గము అన్న భేదము లేదు. యోగదర్శనము సాంఖ్యోక్తమైన తత్త్వాన్ని సాక్షాత్కరింపజేసుకోవడానికి, ఆత్మైక్యత సాధించడానికి ప్రయోగాత్మకంగా ప్రశిక్షణనిస్తుంది. అయినా ప్రకృతి అనుమానంతో సిద్ధించినా నిరోధకాలంలో దాని అపరోక్ష సాక్షాత్కారము కలుగుతుంది. ద్రష్ట కూడ ఉత్థాన కాలంలో ప్రతీత మవుతుంది. ఈశ్వరుడు అనాది గురువు, సమాధికి ఆలంబనము కూడా. సాంఖ్య మరియు యోగము ఇవి రెండూ ఒక జోడి. సాంఖ్యోక్త సిద్ధాంతము సాధ్యము.

ఈ నాలుగు దర్శనాలు ప్రత్యక్షము మరియు అనుమానము ముఖ్యంగా వీటి గురించి గట్టిగా చెబుతాయి. వ్యావహారికంగా ఎలాగ జగత్తు అనుభవంలోకి వస్తుందో దాన్ని గురించే చెబుతాయి. ఎవరైతే వ్యావహారిక భేదము మరియు కారణరూపమైన ప్రకృతులను అంగీకరించరో, వారు వారి మాన్యతలకు అనుగుణంగా ప్రత్యక్షానుమాన, సమాధుల ద్వారా వాటి వ్యావహారికతను నిరూపణ చేస్తారు. వీరు వాక్యప్రమాణము లకు ప్రాధాన్యతను ఇవ్వరు. ఈ దర్శనములలో వాక్య ప్రమాణము గౌణము.

జ్ఞానము యొక్క ఆది, అంతములు అనుభవంలోకి వచ్చేవికావు. ఎందుకంటే అది విషయమైతే పూర్వసిద్ధ జ్ఞానము ద్వారానే అవుతుంది. అందువల్ల జ్ఞానము జీవుడు, కాని ఈశ్వరుడి ద్వారా కాని నిర్మిత మైనది కాదు. స్వయం ప్రకాశమయినది. అది ఘట-పటాదులవలె వేద్యము కాకపోయినను, సాక్షాత్తు అపరోక్షము. ఏదైన ఘట-పటాదులు, భావ-అభావము వ్యష్టి-సమిష్టి ఈ విషయములన్నీ జ్ఞానము ద్వారానే తెలుసుకోబడతాయి. జ్ఞానము ఒకవేళ అన్యమైతే దానిని ప్రకాశింప జేసేది ఏమిటి? పరిచ్ఛిన్నత అని అనుకుంటే అది ఎవరికి ప్రతీతము (తెలుసుకోబడుతుంది) అవుతుంది. జ్ఞానంతో వేరైనపుడు, ఆత్మలో జడత్వము వస్తుంది, మరి ఆత్మనుండి జ్ఞానము వేరైతే జ్ఞానము జడము అవుతుంది. నిర్వికార ఆత్మ యొక్క బోధనే మహావాక్యములు ప్రతిపాదిస్తున్నాయి. ఇదే తత్త్వములో ఈ ప్రపంచము ఎక్కడి

నుండి వచ్చింది? దీనిని చెయ్యడానికే శృతి అనిర్వచనీయమైన మాయను అధ్యారోపితము చేసినది. ఈ అఘటిత-ఘటనాఘటన పటీయసీ మాయ ద్వారా పరమార్థ బ్రహ్మసత్తా కంటె కించిత్ న్యూన సత్తాగా ఈశ్వరుడిని నిరూపణ చేశారు. దానిలోనే నిమిత్తము, ఉపాదానము రెండూ వున్నాయి. బింబ-ప్రతిబింబ భావంతో అవే ఈశ్వరుడు-జీవుడు. భగవంతుడు, వారి ఉపాసన, జీవుడి ముక్తి కేవలము వేదము, వేదానుసారమైన శాస్త్రములతోనే తెలుసకోబడుతుంది. అంతఃకరణశుద్ధి కలిగిన తర్వాత, ప్రపంచోన్ముఖతను వదలిపెట్టి, భగవదోన్ముఖమైతే అపుడు ఈ జ్ఞానము కలుగుతుంది. ఈ అంతఃకరణశుద్ధి యొక్క సాధన పూర్వమీమాంసా దర్శనములో యజ్ఞ యాగాది రూపంగా ఉపదేశించబడివుంది. దీని అర్థము అన్ని దర్శనాలు కూడా పరంపరగా జీవేశ్వర వివేకము ద్వారా ప్రాతి భాసిక సత్యము యొక్క మిద్యాత్వమును నిరూపణ చేస్తాయి. అలాగే పరమార్థ సత్యము-బ్రహ్మ జ్ఞానముతోనే ప్రపంచము యొక్క మిథ్యత్వము నిరూపించబడుతుంది. బ్రహ్మజ్ఞానమునకు అవ్యవహిత పూర్వక క్షణములో కూడా ప్రపంచము అబాధిత సత్యముగానే గోచరిస్తుంది. బ్రహ్మజ్ఞానము కంటే ముందు, ప్రపంచము మిథ్య అని చెప్పడానికి ఎవరికీ అధికారము లేదు. ప్రపంచము వున్నది అంటే అనిర్వచ నీయమైన మాయ అంటే భగవంతుడి వైభవము-విలాసము! అందు వలన వేదాంతము వలననే ఆఖరున సత్యబోధ కలుగుతుంది.

శ్రీహరిబాబాజీ మహరాజశ్రీ వారి ప్రణవ-సంకీర్తనమును పట్టించుకుని శ్రీకరపాత్రజీ వారు పరమపూజ్య శ్రీ ఉడియాబాబావారి దగ్గరికి రావడం మానేశారు. నాకు ఈ మాటగుచ్చుకునేది. మొదట ఎంతో ఆదరభావంతో బాబాదగ్గరికి వచ్చేవారు సత్సంగము కోసము అటువంటిది ఇపుడు దర్శనం కోసం కూడా రావడం లేదు. ఈ విషయం నాకు అసమంజసమనిపించేది. నేను ఒక రోజు శ్రీఉడియాబాబాగారితో ఇలా అన్నాను. 'బాబా! వారు రాకపోతే ఏమయింది? విద్వాన్, త్యాగి, మహాత్ముడు, కదా తమరే వారి దగ్గరికి వెళ్తే మాత్రం ఏమిటి?' బాబా అన్నారు, 'ఎందుకు వెళ్ళకూడదు? నీవు ఎపుడు చెబితే అపుడు వెళదాము.' నేనన్నాను, 'బాబా! వారు ఈ మధ్య బృందావనంలోనే వున్నారు. ధర్మ సంఘ విద్యాలయములో వున్నారు. తమరు

పదండి వెళదాము.' బాబా ఒక బాలకుడి మాటపైన కూడా ధ్యానముంచేవారు. వారి మనసులో ఏవిధమైన ఆగ్రహము లేదు. లేచి నిల్చున్నారు. 'చల్ బేటా' అన్నారు. నేను వారి వెనకాలే నడుస్తూ వెళ్ళాను. నేను మెల్లగా ఒక వ్యక్తితో కరపాత్రజీ వారికి సమాచారము పంపించాను. సమాచారము వినగానే శ్రీకరపాత్రజీ పాదుకలు కూడా వేసుకోకుండా మిద్దెపై నుండి దిగి వచ్చి నమస్కరించి బాబాను పైకితీసుకువెళ్ళారు. కొద్దిసేపు మాట్లాడుకున్న తరువాత బాబా ఆశ్రమానికి తిరిగి వచ్చారు. రెండవ రోజే శ్రీకరపాత్రజీ మరియు శ్రీకృష్ణబోధాశ్రమ్‌జీ బాబాను ఏకాంతములో కలవడానికి సమయం తీసుకుని వచ్చారు. ఒకటి, రెండు గంటల గోష్ఠి జరిగింది. అందులో నన్ను కూడా చేర్చు చేసుకున్నారు.

పైన చెప్పిన గోష్ఠిలో ప్రశ్న కోటి ఆహుతి యజ్ఞము, లక్షచండీ యజ్ఞము చేస్తాము, కానీ ధర్మరక్షణ జరగవలసినంత విశేషంగా జరగడం లేదు. దీనికి కారణమేమి? పూజ్య బాబా ముందు ఈ ప్రశ్న వుంచారు. బాబా 'సమయము విపరీతముగా వున్నది. కలియుగము. కాలానికి కూడ తనదైన ఒక అధికారముంది. లక్ష్యము ఎంత పెద్దదో దాని ముందు అనుష్ఠానము అంత పెద్దదేమీ కాదు. పెద్ద పెద్ద అనుష్ఠానాలలో అంగవైగుణ్యం కూడా జరుగుతుంది. యజమానుడు, ఆచార్యుడు పూర్తిగా అందరూ నియమాలను సరిగా పాటించలేకపోతారు. అన్న-ధనములు కూడా అనుష్ఠానమునకు ఎంత పవిత్రమైనవిగా ఉండాలో అంత ఉండడములేదు. అయినా ఫలితమయితే వుంటుంది. ధర్మహాని యొక్క వేగమయితే తక్కువ అవుతుంది. ఏదైనా ఎడ్లబండి గుంతలోపలికి దొర్లిపోతూ వుంటే మనవైపు నుండి మనము దానిని ఆపడానికి ప్రయత్నించాలి. మనవైపు నుండి మనం ప్రయత్నం చేసేది ఫలము భగవంతుడి వైపు నుండి వస్తుంది' అని అన్నారు. ఈ ప్రసంగము తర్వాత బాబా, కరపాత్రజీ ఇద్దరూ మరల కలుసుకోవడం ప్రారంభించారు.

ఢిల్లీలో గాయత్రి మహాయజ్ఞము జరిగింది. దేశంలోని పీఠాధీశ్వరులు, మండలేశ్వరులు, విద్వాంసులు ఆహ్వానింపబడ్డారు. గాయత్రి కోటి ఆహుతి యజ్ఞం జరిగింది. బ్రహ్మచారి జీవనదత్తజీని యజమానిగా చేశారు. దక్షిణము నుండి వచ్చిన విద్వాంసులు దీనికి ఒప్పుకోలేదు. యజమాని సపత్నీకుడై వుండాలని అపుడు

కుశ(దర్భ) కన్యతో వివాహం చేశారు. వచ్చిన అతిథులకు చాలా పెద్ద పెద్ద సింహాసనములను తయారుచేశారు. శ్రీ ఉడియాబాబాజీని చాలా ఆదరంతో తీసుకునివెళ్ళారు. నేను శ్రీకరపాత్రజీతో అన్నాను, 'బాబా సింహాసనముపైన అయితే కూర్చోరు. ఆసనము లేకుండా క్రిందనే ధూళిలోనే కూర్చుంటారు' కరపాత్రజీ నవ్వి ఇలా అన్నారు, 'సింహాసనముపై కూర్చోవటము కాని, ధూళిలో కూర్చోవడము కానీ రెండూ లోకసంగ్రహము కోసమే. లోకుల శ్రద్ధ ఒకసారి వైభవం వైపు వెళితే, మరోసారి త్యాగమువైపు వెళుతుంది. తత్త్వజ్ఞుడి దృష్టిలో రెంటికి తేడాలేదు. అక్కడ, ఎక్కడ, ఎలా కూర్చున్నా అక్కడ అదేసరి అనుకోవాలి. నాకు వారి ఈ దృష్టికోణము చాలా నచ్చింది.

ఆయజ్ఞ సమయంలోనే ఒక రోజు వారునాతో ఇలా అన్నారు. 'ఈరోజు నాతో పాటు నీవు కూడా భిక్ష తీసుకుందువురా!' ఒక బ్రహ్మచారి పెసరపప్పు ఖిచిడీ తయారుచేశాడు. ఉప్పు లేదు, నెయ్యిలేదు. పోపు కూడా లేదు. వారు అన్నారు, 'నాతో పాటు భోజనం చేస్తే ఇలాగే వుంటుంది. నీవు నీకు అనుకూలమైన భోజనం చెయ్యి.' వారి ఉదారత తలుచుకుని, తలచుకుని నేను ముగ్ధుడినవుతుంటాను.

ఒకరోజు నేను అడిగాను, 'ఫలానా వ్యక్తి పంచదశి యొక్క అభ్యాస వాదమును చాల విరోధిస్తున్నారు'. శ్రీకరపాత్రజీ అన్నారు 'ఒకవేళ వారు అద్వైత సిద్ధాంతమును ఉపనిషత్తుల పరమ తాత్పర్యమని అంగీకరిస్తే, ఇక అపుడు వారు ఆభాసవాదమును ఒప్పుకోనీ, ఒప్పుకోకపోనీ, ఇందులో ఏమీ తేడా రాదు. ప్రతిబింబ, అవచ్ఛేద, దృష్టి-సృష్టి ఏవాదమయినా సరే, సిద్ధాంతతః బ్రహ్మాత్మైక్యబోధ కలగాలి. దానివల్ల అవిద్య నివృత్తి కలుగుతుంది. ఇది కూడా వారి ఉత్తమ భావనకు ఒకనిదర్శనము.

అదే యజ్ఞములో ఆర్యసమాజము వారితో శాస్త్రార్థము ఆయోజనము చేశారు. ఆర్య సమాజము వారివైపు నుండి శ్రీరామచంద్ర దేహలవీ ప్రముఖుడు. సనాతన ధర్మము వారి వైపు నుండి శాస్త్రార్థ మహారథి శ్రీమాధవాచార్యుడు, సనాతన ధర్మమంచెపై శ్రీకరపాత్రజీ మహరాజ్, గిరిధరశర్మగారు, శ్రీ అనంత కృష్ణ శాస్త్రి, పండిత్ అఖిలానంద గారు మొదలైన దిగ్గజ విద్యాంసులు విరాజమానులై వుండిరి. నేను సరిగా శ్రీకరపాత్రజీగారి వెనకనే కూర్చున్నాను. యజ్ఞంలో శ్రీకరపాత్రజీ మహరాజ్

సరళ భావంతో శ్రౌత-సూత్రముల ననుసరించి శాస్త్రార్థమునకు సన్నద్ధులైనారు. సనాతనధర్మ విద్యాంసులు 'మీరు చూస్తువుండండి, మేము శాస్త్రార్థం చేస్తాము' అని ప్రార్థించారు. వారు నవ్వి మిన్నకుండిపోయారు. శ్రీగిరిధర్‌శర్మగారు, అఖిలానంద శర్మగారు, శ్రీమాధవాచార్యులు పరస్పరము మాట్లాడుకుని ఆర్యసమాజమువారిని ప్రశ్నించారు, 'వేదాలలో గోవధను గురించిన మాట ఎక్కడ వ్రాసివుంది?' శాస్త్రార్థము లిఖితరూపంగా జరుగుతూ వుండేది. తరువాత చదివి జనులందరికి వినిపించేవారు. ఆర్య సమాజము వారు మంత్రములు, మరియు గ్రంథాలపేర్లన్నీ వ్రాసుకుని వచ్చారు. ఎక్కడెక్కడ శాస్త్రాలలో గోవధను గురించి వ్రాశారో, జన సమూహములో అది చదివి వినిపించారు. పండిత్ అఖిలానందగారు లేచి నిలుచుని ఇలా అన్నారు, 'చూడండి సోదరులారా! ఆర్యసమాజము వాళ్ళు అంటున్నారు - వేదాలలో గోవధ వ్రాసి వుందని. ఎంత దుఃఖకరమైన విషయము!' ఇంకేముంది, ఇంత మాత్రము వినగానే జనతా సమూహమంతా ఆర్యసమాజమునకు విరుద్ధమయిపోయింది. చప్పట్లు కొట్టడం మొదలెట్టారు. ప్రజలు ఇక వారిని మాట్లాడనివ్వలేదు. వారు చెబుతూనే వున్నారు. ఇదిమా అభిప్రాయము కాదు. అది వారి అభిప్రాయమే కానీ అక్కడ వినేవారెవ్వరు? పండిత మాధవాచార్యుల వారు అన్నారు 'మహరాజ్! వీరితో ఇలాగే శాస్త్రార్థము జరుగుతుంది. పూర్వోత్తర మీమాంస ప్రకారము అధికరణరచన జరగదు. శ్రీకరపాత్రజీ యొక్క సరళత, సనాతన ధర్మావలంబుల, ఆర్య సమాజము వారి శాస్త్రము యొక్క మంచి నమూనా చూడటానికి దొరికింది.

బొంబాయిలో ఒక విశాలమైన ఆయోజనము జరిగింది. మేరైన్‌డ్రైవ్ సెకసరియా బిల్డింగు నుండి బొంబాయి జింఖానా వరకు అంతా ఖాళీ మైదానమే. శ్రీకరపాత్రజీ వారు స్వామి మస్త్‌రామ్‌జీని పంపి నన్ను అక్కడికి పిలిపించారు. నా ప్రవచనాలు ప్రారంభమయినవి. 'కల్యాణ్' పరివారములో వున్నందుకు బొంబాయిలో నాకు చలా మంది పరిచితులున్నారు. బొంబాయివాలే కృష్ణానంద్‌జీని (బ్రహ్మలీన) కూడా ఆహ్వానించారు. వారి కోసం వేరుగ సంకీర్తన మండపము తయారుచేశారు. ఉత్తర భారతీయుల సమూహము వారి వెంట వుండినది. అఖండ భగవన్నామ ధ్వనితో దరిదాపులన్నీ మారుమ్రోగిపోయాయి. కొందరు హరిజనులను ఉత్తేజపరిచాయి. వీరు హరిజనులను అసహ్యించుకుంటారని, అస్పృశ్యులని అనుకుంటారని. శ్రీకరపాత్రజీ

వారు స్వయంగా వారితో మాట్లాడి వారికి నచ్చజెప్పి వారికి ఒక సంకీర్తన మండపం వేరుగా తయారుచేయించారు. వారు కూడా నామ సంకీర్తనము మొదలుపెట్టారు. వేర్వేరు సాంప్రదాయాల ఆచార్యులు గుమిగూడారు. ఇదంతా చెప్పడంలో అభిప్రాయమేమిటంటే శ్రీకరపాత్రజీ వారిలో అందరినీ సంఘటితము చేసే విశేషమైన ఒక శక్తి వుండేది. వారు తమనైపుణ్యముతో, బుద్ధి కుశలతతో, తన సౌజన్యంతో విరోధులను కూడా తన కనుకూలంగా చేసుకునేవారు. వారికి నాపట్ల సహజమైన స్నేహముండేది. వారు ధర్మసంఘములోనే సంత్-సమ్మేళనమును సంఘటితపరిచారు. దానికి అధ్యక్షులు వేద భగవానుడు, ఉపాధ్యక్షుడిగా నాపేరు కూడా వుండినది. జనులు నన్ను వ్యాఖ్యానము చెయ్యమని బలవంతం చెయ్యగా నేను సంకోచపడ్డాను. అపుడు వారు నన్ను చూసి ప్రజలతో ఇలా అన్నారు. 'వీరు మాకు నిధి లాంటివారు. వారికెలాగ అనుకూలమైతే అలాగే. వారిని సంకోచములో పడవేశే ఆవశ్యకతలేదు.

సం.1947 వసంత ఋతువులో శ్రీకరపాత్రజీ, బృందావనం వచ్చారు. వారు 'రమణరేతి'లోని శ్రీరాధాకృష్ణ ధానుకావారి బంగళాలో విడిదిచేశారు. వారు ఆ రోజుల్లో 5 లేక 7 రోజులు గంగాజలము మాత్రము తీసుకుని తర్వాత భిక్ష స్వీకరించేవారు. నాకు ఇంత మాత్రమయితే అవశ్యము గుర్తుంది. వారు ఆ బంగళాలో ఒక సాధారణ ఆసనంపైన కూర్చుని వుండేవారు. నేను వారికి భాగవతం ప్రవచనము వినిపించేవాడిని. ప్రతి దినము సాయంకాలము ఇదే నియమము అయింది. వారు విని విని ప్రసన్ను లయితే నా హృదయము ఆనంద సముద్రములో తేలియాడేది. సిద్ధాంతతః అద్వైతము, భావతః భక్తిని ప్రతిపాదించడము వారికి చాల ప్రియము. వారు అపుడపుడు పులకించిపోయేవారు. వేదాలను మొదలుకుని అవకహడీ చక్రము, హనుమాన్ చాలీసా పర్యంతము వారికి తెలుసు. అన్నిటిని ఒప్పుకునేవారు. సమర్థించేవారు. వారికి నా నుండి భాగవతం వినే ఆవశ్యకత ఏమీ లేదు, కానీ అది వారి స్నేహమే, నాకు ఆదరము ఇస్తూ వుండిరి. 'అమానీ మానదో మాన్యః'కి ప్రత్యక్ష నిదర్శనము వారు.

శ్రీకరపాత్రజీ, అన్యశాస్త్రాలతో సమానంగా రస శాస్త్రములో కూడా సాటిలేని మేటి. వారు రస తత్త్వమును నిరూపణ చేస్తుంటే గొప్ప గొప్ప రసమనీషులు కూడా

ఆశ్చర్యచకితులయ్యేవారు. అనుమాన, ప్రత్యక్ష, అపరోక్షవాదులైన ఆచార్యులను ఖండన చేస్తూ శ్రీమధుసూదన సరస్వతి ద్వారా విరచితమైన భక్తిరసాయనములో ప్రతిపాదింపబడిన రస తత్త్వమును సమర్థించేవారు. లోకవిలక్షణము, విచక్షణము అయిన ప్రతిభను ప్రకాశింపజేస్తూ వారు రసనిరూపణము చేస్తుంటే ముగ్ధులు కాని రసమర్మజ్ఞులెవరు? వారు అనే వారు, 'స్థాయీభావావచ్ఛిన్న చైతన్యము, ఆలంబన విభావావచ్ఛిన్న చైతన్యముతో ఏకమయినపుడే రసానుభవము కలుగుతుంది. కానీ స్థాయీ భావావచ్ఛిన్న చైతన్యము యొక్క ఆవరణ భంగము జరుగదు. అది అయితే బ్రహ్మైత్మైక్యబోధ కలిగిన తరువాతనే జరుగుతుంది. వస్తుతః ఉపనిషత్తుల్లో రస, ఆనంద, సుఖ-భూమా మొదలైన పేర్లతో రసరూపమయిన ఆత్మనే నిరూపణ చేశారు. అదే తన అనిర్వచనీయమైన హ్లాదినీశక్తితో కలిసి ఆస్వాదనకు విషయమవుతుంది. వస్తుతః రసంలో ఆస్వాద్య, ఆస్వాదక (భేద) భావము లేదు. రస-రసిక ఏకత్వంలోనే రసానుభూతి వుంది.

శ్రీకరపాత్రజీ వారికి నాపైన ఎంత స్నేహము వుండేదో దీనికి రెండు ఉదాహరణలు మీ ఎదుట పెడుతున్నాను:

1. బొంబాయి వారైన శ్రీప్రేమ్‌పురీజీ మహరాజ్ మరియు దైవీ సంపద్ మహామండలేశ్వరుడైన స్వామి శుకదేవానందజీ మహరాజ్ గారు వీరితో అత్యంత స్నేహ సంబంధం వున్నందు వల్ల, నేను భారత సాధు సమాజమునకు అధ్యక్షపదవిని స్వీకరించాను. ఆరోజుల్లో ఆ సంస్థ గృహమంత్రి శ్రీగుల్జారిలాల్ నందా గారి ప్రేరణ ఈ సంస్థ కార్యకలాపాలతో సంబంధము వుండినది. నేను అధ్యక్షుడినవడం శ్రీకరపాత్రజీ గారికి నచ్చలేదు. నేను తరువాత వారి దర్శనమునకై వెళితే వారు నాపైన విరుచుకుపడ్డారు. 'నీవు ఈ సర్కారీ సంస్థలో ఎందుకు చేరినావు?' ఒక గంటసేపు వారు నాకు నచ్చజెప్పారు. ఇక ఆఖరికి ఇలా అన్నారు-'సరే మంచిదే, ఏం ఫరవాలేదు. నేను ఇపుడు ఇలా అంటాను-ఎలాగైతే కాంగ్రెసులో ఒక విద్వాన్ సంపూర్ణానంద వున్నారో అలాగే భారత సాధు సమాజములో ఒక అఖండానంద వున్నారు. నాపైన వారి ఈ స్నేహము చూసి నేను ఏమి మాట్లాడలేకపోయాను.

నిశ్శబ్దంగా ప్రణామము చేసి వచ్చేశాను. అప్పుడు నుండి సాధుసమాజము పట్ల (ఆసంస్థ) ఉదాసీనుడనయ్యాను. ఇక మరలా ఏ అధివేశనములోనూ కలవలేదు.

2. రెండవ ఉదాహరణము ఈ విధంగా వున్నది - స్వామి కరపాత్రజీ ప్రాయః ప్రతి సంవత్సరము ఒకటి, రెండు సార్లు బృందావన-ధామము తప్పక వస్తూ వుండేవారు, ఇక్కడ 'రాధాకృష్ణ తత్త్వము'పై ప్రవచనము చేసేవారు. చాలాసార్లు 'రాధా-సుధా-నిధి'పైన కూడా ప్రవచనము చేశారు. ఇక్కడి రసానుభూతిలో వారిది చాలా గంభీర ప్రవేశము, అనుభవము ఉండేది. ఇది చూసి ఇక్కడి రసికభక్తులు ముగ్ధులయిపోయేవారు. బాబా శ్రీ ప్రియాశరణజీ మహరాజ్ యొక్క ప్రవచనానికి ఎంతమంది వచ్చేవారో, అంతకంటే ఎక్కువగా శ్రీకరపాత్రజీ వారి దగ్గర జనం వచ్చేవారు. నేను అపుడపుడు వెళ్తూ వుండేవాడిని.

ఒకరోజు వారు నాతో అన్నారు, 'నీవు నేను వ్రాసినటువంటి 'శ్రీభక్తి-రసార్ణవ' గ్రంథమును (సంస్కృతము) హిందీలో అనువాదం చెయ్యి. ఎందుకంటే ఈ పనినీవు తప్ప అన్యులు ఎవరూ చెయ్యలేరు.' నేను అన్నాను 'మహరాజ్! మీరు అలా ఎందుకంటున్నారు?' వారు అన్నారు 'బృందావన రసమాధుర్యం, మరియు అద్వైత సిద్ధాంతము రెండూ తెలిసిన వారే దీనిని అనువదించగలరు. 'నేను వారి ఆజ్ఞను మన్నించి చాలా వరకు భక్తి-రసార్ణవమును అనువాదము చేశాను. అదేపేరుతో వివిధ పత్రికలలో ప్రకాశితమయినవి. వారు నాతో చాలా ప్రసన్నంగా వుండేవారు. నేను వారిని మా గురుతుల్యులుగా భావించేవాడిని. బ్రహ్మ మరియు ధర్మము వీటి యొక్క నిరూపణము వారు ఎలాగ నిరూపణము చేశేవారో, దానిని నేను సంపూర్ణంగా అంగీకరించేవాడిని.

వృందావనంలోని శ్రీమస్త్ రామ్ బాబాగారు నాతో శ్రీకరపాత్రజీతో ఇద్దరితోనూ అత్యంత స్నేహంగా ఉండెడివారు. కాశీలోని సాధుబేలా ఆశ్రమములో ఒకసారి విద్యార్థుల శాస్త్రార్థంలో పోటీ జరిగినది పురస్కార పతకము ఇవ్వవలసి వున్నది. శ్రీమస్త్ రామ్ బాబా గారు 'ఈ పతకమును శ్రీ కరపాత్రజీ పేరుతో ఇవ్వాలని సంకల్పము' అన్నారు. నేను వారికి స్వర్ణ-రజత పతకములకు అయ్యే ఖర్చు ఇచ్చాను.

వారి వలన శ్రీకరపాత్రజీ యొక్క విశేషాలు నాకు నావి వారికి తెలుస్తూ వుండేవి. ఏదో ప్రసంగ వశమున శ్రీకరపాత్రజీ వారు భాగవతకథాప్రవచనమును గురించి నన్ను చాలా అధికంగానే ప్రశంసించారు. ప్రశంసలో చాలా అతిశయోక్తి వుండినది. మస్త్ రామ్ బాబా గారికి ఈ మాట నచ్చలేదు. వారు వచ్చి నాతో ఈ సంగతి చెప్పారు. నేను అన్నాను, 'వారు చెప్పేది సరియే. ఎందుకంటే నేను భాగవతము 7రోజులలో చెప్పగలను. కానీ వారు చెయ్యలేరు. ఎందుకంటే ఒక శ్లోకముపైన వ్యాఖ్య చెయ్యడానికి వారికి సంవత్సరాలు కావలసి వస్తుంది'. మస్త్‌రామ్ బాబా గారు శ్రీకరపాత్రజీ వారితో చెబితే వారు నవ్వి 'అవును. నిజమేగా అంతే' అని అన్నారు.

స్వామి శ్రీకరపాత్రజీ భక్తి రసముపై ప్రవచనము చెయ్యడం మొదలుపెడితే, అది దర్శన శాస్త్రప్రసంగమయినా, బృందావన మధుర భక్తిరసమైనా వారుతమ అద్భుత ప్రతిభతో, విద్వజ్జనుల మనసులకు పట్టేలాగ మనోహరమైన, అపూర్వమైన అభిప్రాయములను చెప్పేవారు. శ్రోతలు ఆశ్చర్యమయ ఆనందంలో మునిగిపోయేవారు. ఉదాహరణగా చూడండి -

'నటవరవపు:' యొక్క వ్యాఖ్య ఈ విధంగా చేశేవారు. శ్రీకృష్ణుడి అమృత వపు (వం=అమృత బీజము, పుష్ణాతి) 'నట', 'వర' రెండూ ఒకటే. 'నట' విప్రలంభ-శృంగారము విరహానికి ప్రతినిధిత్వము. 'వర' సంభోగ శృంగారము అంటే ప్రభుప్రాప్తికి ప్రతినిధిత్వము. శ్రీకృష్ణుడు ఈ రోజు 'నట,వర' రెండూ దర్శనం చేయిస్తున్నారు. ఎంత ఆశ్చర్యము. ఒకే శబ్దంలో (నటవర) విరహము, సంయోగము రెండిటి ఆనందమూ! ఇదే వృందావనపు మధురరసము 'మిలే రహత్ మానో కబహు మిలేన!"

పిపాస విరహము లాగ, తృప్తి సంయోగములాగ వుంటుంది. ప్రేమ ఈ రెంటికి యుగపత్ (ఒకేసారి) నివాసము వుంది. తృప్తి పిపాసను అధికం చేస్తుంది. పిపాస తృప్తిని అధికం చేస్తుంది. పిపాస తృప్తి యొక్క ఆనందాన్ని అధికము చేస్తుంది. ఇదే రాధాకృష్ణ స్వరూపము, అనాది కాలంగా అనవరతము ఈ లీల జరుగుతూ వుంది. కానీ ఒకరినొకరు గుర్తించలేరు. ఎక్కడైతే అనుభవము సాక్షాత్తు అపరోక్షమో - అక్కడ పూర్వానుభూతమైన గుర్తింపు ఎలాస్ఫురిస్తుంది? అనుభవము ఎపుడయితే పరోక్షమో-అక్కడ పూర్వానుభూతియైన గుర్తింపు ఎందుకు కలుగుతుంది? అనుభవము ఎపుడైతే

పరోక్షమో అపుడేమో తర్వాత దాని స్ఫూర్తి కలుగుతుంది. ఇక్కడ సాక్షాత్ అపరోక్షరసములో స్మృతి ఎందుకు?

లాల్ ప్రియామే భఈ న చిన్హారీ

నటవరవపుః అంటే ఇదే!

సప్త సముద్రాలను గుర్తించి శాస్త్రాలలో ఏదైతే వర్ణన ఉందో అవి భౌతికమయినవి. భగవన్నామోచ్చారణము వల్ల అవి ఇంకి పోతాయి. వానరులు వాటిని దాటగలరు కూడా, కాని భగవంతుడు స్వయంగా దివ్యాతి దివ్య ప్రేమామృత మహా సముద్రము. గోపికలు ఆ దివ్యసింధువు యొక్క తరంగము. ఎలాగైతే తరంగములో జలమే వ్యాపించి వుంటుందో అలాగే గోపికల రోమ రోమములో భగవంతుడు వ్యాపించి వున్నాడు. కానీ తరంగాలు, రోమాలు ఇవన్నీ బహిరంగాలు. ఆ అమృత సముద్రములోని శీతలత, మధురిమ, అమృత సముద్రపు ఆ తియ్యందనము అదే వృషభానునందిని శ్రీరాధారాణి ఈ హ్లాదినీ సారసర్వస్వమే సచ్చిదానంద ఘనుడైన భగవాన్ శ్రీకృష్ణుడిని ఆహ్లాదితము చేస్తుంది. పరమానంద రసఘనుడిని మధురాతి మధురం చేస్తుంది.

స్వామి శ్రీ కరపాత్రజీ మహరాజ్‌వారి ఈ రసరీతి యొక్క పరిపాటిని అత్యంత దక్షతతో ప్రామాణికతతో స్పష్టం చేశేవారు. అక్కడ వారు 'రసోవైసః' 'ఏకం జ్యోతిర్భూద్వేధా రాధా-మాధవరూపకమ్' అని ఈ వేద, వేదాంతోక్తులను కూడా లలితమైన వాక్యకదంబములతో, తన వచనామృతము ద్వారా సంపూర్ణముగా చరితార్థము చేశేవారు. క్లీం బీజము, మరియు కృష్ణ నామము యొక్క రసాత్మకతను, దార్శనికతను ఒకేసారి వర్ణన చేశేవారు. అది ఎంతటి అనుపమైన రీతిలో చేశేవారో రసికవృందము వారి శబ్దములతోనే దాని రసాస్వాదనము చేయండి.

'శ్రీరాధా మాధుర్యాధిష్ఠాత్రి శక్తి ఆ శక్తి మాధుర్య సారసర్వస్వ శ్రీకృష్ణచంద్రుడి అమృతమయ ముఖచంద్రములో అధర సుధారసములో విరాజమానమై వుంటుంది. శ్రీకృష్ణుడు ఆ అధరసుధను తన వంశి ఛిద్రములో నిక్షిప్తము చేస్తాడు. అదే వ్రజాంగనల హృదయములలోనికి (వంశీధ్వని ద్వారా) నింపుతాడు. ఆ అధరసుధయే వ్రజాంగనల

ముఖకమలముపైన వచ్చినది. వారి అంతరాత్మలో, అంతఃకరణములలో, ప్రాణాలలో, రోమ రోమములో వ్యాపించింది. ఎక్కడ వృషభానునందిని యొక్క సంచారము వున్నదో అక్కడనే శ్రీకృష్ణ పరమానందుని రమణము (లీల) జరుగుతుంది. పూర్ణతమ పురుషోత్తముడైన భగవంతుడు తనదే అయిన మాధుర్యాధిష్ఠాత్రిశక్తిని ఆస్వాధిస్తాడు. పువ్వులకు స్వయంగా ఆ గ్రహణశక్తి వుంటే అవి ఎలా గ్రహిస్తాయో అలాంటిదే ఈ రమణము. ఈ లీల.

'క్లీం'ను కామ బీజమంటారు. అందులో 'క' అంటే అర్థము - శ్రీకృష్ణుడు పరమానందకందుడు వ్రజేంద్రనందనుడు. 'ల' అంటే రాధారాణి ఋషభానునందిని సర్వేశ్వరి. 'ఈ' అంటే అర్థము (తంత్రములలో) 'కామకళ' దాని తాత్పర్యము ఏమిటంటే ఉత్కంఠభరితమైన ప్రీతి. ఇక బిందువు యొక్క అర్థము రసోద్రేకము - శ్రీ రాధాకృష్ణుల పరస్పర సమ్మేళనము వలన ప్రాదుర్భూతమైన రసోద్రేకము. ఇదే 'క్లీం' బీజాక్షరానికి అర్థము. రాధాకృష్ణుల ఇరువురి సంబంధము అవిచ్ఛేద్యము. అవిభాజ్యము, అఖండితము. కాంచన ఖచితమైన మరకతమణి లాగ. ఇంకా దీని కంటే గొప్ప సంబంధము జల తరంగములు. తరంగములకు జలముతో ఎపుడు విప్రలంభము (వియోగము, విచ్ఛేదము) కలుగదు.

'శ్రీకృష్ణ' శబ్దమునకు అర్థము సదానందముని చెప్పేవారు - 'కృషిర్భూర్వాచకః శబ్దఃణశ్చ నివృత్తి వాచకః' - 'భూ' సత్తా, మరి, 'ణ' నివృత్తి ఆనందము. ఇంక 'చ' సత్తా, ఆనందము - శ్రీకృష్ణ పదానికి అర్థము, శ్రీకృష్ణ తత్త్వములో శ్రీకృష్ణ, శ్రీరాధా ఇద్దరూ వస్తారు. ఆ సత్తు మహాసత్తారూపము, అది లేకపోతే అంతా అసత్తే. ఇదే స్వప్రకాశమయిన సత్‌నుండే అందరి సత్తువున్నది. అదే శ్రీకృష్ణుడు. నివృత్తి అంటే నిరుపద్రవ, నిర్విశేష స్వప్రకాశ ఆనందమే శ్రీరాధ. ఈ సత్తు, ఆనందము ఇవి ఎపుడూ వియుక్తము కావు. అందువలన శ్రీరాధారాణి, శ్రీకృష్ణుడు పరస్పరము అంతరాత్మగా వున్నారు. ఉభయ-ఉభయ భావాత్మ, ఉభయ-ఉభయ రసాత్మ - రాధాకృష్ణులు చంద్రుడిలోచంద్రిక, సూర్యుడిలో ప్రభా అలాగే పరమరసామృతమూర్తి శ్రీకృష్ణుడిలో వ్రజాంగనలు. ఇంతకంటే అంతరంగమైన సంబంధము అమృతములోని మాధుర్యము లాగ పరమరసామృతమూర్తి శ్రీకృష్ణునిలో మాధుర్యాధిష్ఠాత్రి శ్రీరాధారాణి,

అమృతము నుండి మాధుర్యమును వేరు చేస్తే ఇక అమృతత్త్వము ఎక్కడ? వేదాంతులు 'గుణ-గుణి' రెంటి తాదాత్మ్యతను అంగీకరిస్తారు. అందు వలన సత్తు, ఆనందము రాధా కృష్ణులు ఒక్కటే. సదానందరూపుడైన పరమాత్ముడు ఒక్కడే రెండు రూపాలుగ శ్యామతేజము కృష్ణుడు గౌరతేజమురాధ - రాధామాధవులుగా ప్రకటమయినారు. ఇద్దరిలో పరస్పర అంతరంగత వున్నది.

'తమాల శ్యామలత్విట్ యశోదాస్త నందయ' శ్రీకృష్ణుడు అని కూడా కొందరు అంటారు. అయినా విరోధము ఏమీ లేదు. సత్తా, ఆనందము వీటి రెండిటి ఏకత్వమున్నది.

సాధారణ శృంగారములో భావన అభిమాన మాత్రముగా వుంటుంది. ఇక్కడ స్వరూపపరివర్తనము కూడా వున్నది. శ్రీకృష్ణుడు, రాధారాణి, వ్రజాంగనలు వీరి సతతలీలా భూమి శ్రీవృందావన ధామము. అచింత్య, అనంత, అద్భుత ప్రేమానంద రస సింధువులో క్షణక్షణము ఆవిర్భూతము, తిరోభూతము అవుతూ (వస్తూపోతూ) వుంటారు. ఉన్మజ్జనము-నిమజ్జనము చేస్తుంటారు. ఆ స్థితిలో ఒక సారి శ్రీకృష్ణుడు రాధారాణి రూపంలో ప్రకటమవుతాడు. మరోసారి రాధారాణి శ్రీకృష్ణరూపంలో ప్రకటమవుతుంది. అందుకే ఉభయోభయభావాత్మ అంటారు. తాత్పర్యమేమిటంటే సాధారణ నాయకుడిలో ఉత్కృష్టరసము వ్యక్తము కాదు. కాని నిఖిలరసామృత మూర్తి శృంగారరసాత్మకుడైన శ్రీకృష్ణుడే రసస్వరూపుడు. వీరి సంపర్కము వలన ఉత్కంఠమైన అద్భుతమైన అనంత ఆనందరసము ఉద్భూతమవుతుంది. పరస్పర భావోత్పత్తి జరుగుతుంది.

నిరతిశయము, స్వప్రకాశము, సదానంద స్వరూపము రాధామాధవరూపమైన శ్రీకృష్ణతత్త్వము. తారతమ్యము లేకపోయిన కూడా వ్రజము, వనము, నికుంజము ఉత్తరోత్తరముగా ఉజ్వల అభివ్యక్తి యొక్క రస రహస్యాన్ని శ్రీస్వామీజీ ఇలా వ్యక్తపరిచేవారు. -

'కృషిర్భూవాచకః శబ్దః ణశ్చ నివృత్తి వాచకః' శ్రీకృష్ణుడు వేద వేద్యుడు, పరిపూర్ణుడు, స్వప్రకాశుడు, సదానందరూప పరబ్రహ్మ తత్త్వమే. పరబ్రహ్మ

నిరతిశయము అయినందు వలన తారతమ్య విహీనము. అయిన వ్రజభూమి శ్రీవృందావన ధామములో వారు ఎలా మధురానుభూతి కలిగిస్తారో అలాగ మరి అన్యత్ర ఎక్కడా లేదు. అందుకనే భావుకులు ద్వారాక లోవున్న మధురలో వున్నా, వ్రజస్థ, బృందావనస్థ, నికుంజస్థ, ఆది భేదములను శ్రీకృష్ణుడిలో అంగీకరిస్తారు. వ్రజేవనేముని కుంజే చ శ్రేష్ఠ్యముత్తరోత్తరం'.

అభిప్రాయమేమిటంటే ఒకటే స్వాతి బిందువులో స్థల వైచిత్ర్యము వల్ల ఎలా విచిత్ర పరిణామము కలుగుతుందో - శుక్తిలో మౌక్తికము, వెదురులో వంశలోచనము, గోకర్ణములో గోరోజనము, గజకర్ణంలో గజముక్త రూపంగా పరిణితి చెందుతుంది. అలాగే వేదాంత వేద్యమైన తత్త్వము సర్వదా ఒక్కటే అయిన ఉపాధిభేదము వలన తారతమ్యము గోచరించును. సూర్య తత్త్వము కాష్ఠ-కుడ్యాది అస్వచ్ఛ పదార్థములపైన అంతగా అభివ్యక్తము కాదు. అదే నిర్మల జలము, అద్దము మొదలైన వాటిపైన అయినట్లుగా. అలాగే రాజస, తామస స్థలములలో బ్రహ్మతత్త్వము అభివ్యక్యం అంతగా కాదు. అదే నిర్మల విశుద్ధ స్థలములలో అయినంత. ఈ నిర్మలత పార్థివ ప్రపంచములో స్పష్టంగా అవగతమవుతుంది. అలాగే త్రిగుణాత్మక ప్రపంచములో గుణ వైచిత్ర్యముల వలన ఒక్కో దగ్గర ప్రత్యక్షానుమానము ద్వారా, ఒక్కో దగ్గర. ఆగమ, శృతార్థపత్తి ద్వార తారతమ్యోపేతమై జాతమవుతుంది (తెలుస్తుంది). ఒక్కోసారి ఏదైన ఒక ప్రదేశానికి వెళ్ళినపుడు అకస్మాత్తుగా చిత్తము ప్రసన్న మవుతుంది. మరి ఇంకో చోటికి వెళ్ళినపుడు చిత్తక్షోభము కలుగుతుంది. ఈ స్థలవైచిత్ర్యము మనకు అనుభవమవుతూనే వుంటుంది. వ్రజ, వన, నికుంజములో క్రమశః ఒక దానికంటే మరోదానిలో వైచిత్ర్యము వుంటుంది. అందుకని అక్కడ పూర్ణతర, పూర్ణత రూపాలలో ఒకే శ్రీకృష్ణుడి యొక్క పరమానంద స్వరూపము ప్రకటమవుతుంది. ఎవరి కృపాకటాక్షమును బ్రహ్మేంద్రాది దేవతలు కూడా కోరతారో, ఆ వైకుంఠ ధాత్రి అయిన మహాలక్ష్మి కూడ సేవించడానికి ఉవ్విళ్ళూరుతుందో అటువంటి సర్వోత్కృష్టమగు విరాజ మానమయిన వ్రజభూమిని ఎవరు వర్ణించగలరు? 'శ్రయత ఇందిరా శశ్వదత్రహి' విశుద్ధ మాధుర్య భావము యొక్క ప్రాకట్యము శ్రీ బృందావన ధామము లోనే అంటారు. ఐశ్వర్యశక్తి మూర్తిమతియై ఇక్కడ ప్రభువును సేవించే సదవకాశము

కొరకు ప్రతీక్షిస్తుందన్నది సరే. కాని ప్రభువు కూడా ఇక్కడ 'మృద్భక్షణ'లీలలో తన ముఖములో బ్రహ్మాండమును చూపి ఆ ఐశ్వర్యశక్తిని స్వీకరించారు.

ఇక్కడ నిత్యనికుంజము బృందావనము కంటే అంతరంగమున తీసుకుంటారు. నిత్య నికుంజములో శ్రీ వృషభానునందిని స్వరూపము మహాభావ పరివేష్ఠితమైన శృంగారస్వరూపుడు శ్రీకృష్ణ చంద్రుడు, పరమానంద కందుడు. నిత్యము రసాక్రాంతమై వుంటారు. ఇక్కడ ప్రియ-ప్రియతముల సర్వాంగీణ సంయోగము తెలుస్తూంటుంది. సన్నిపాత జ్వరము వచ్చిన రోగి చల్లనీళ్ళు త్రాగేటప్పుడు వాడికి అదే సమయంలో దప్పిక కూడ అనుభవంలోకి వస్తుంది. సారసపత్ని లక్ష్మణాకు కేవలం సంయోగ జన్య ఆనందమే అనుభవమవుతుంది. చక్రవాకము వియోగజన్య తీవ్రతాపము తర్వాత హృదయములోనే వున్న అనుపమ ఆనందరసమును అనుభవిస్తుంది. కానీ నిత్య నికుంజములో శ్రీనికుంజేశ్వరి తన ప్రియతమ పరమ ప్రేమాస్పదుడైన ప్రభువు శ్రీవ్రజరాజ కిశోరుడు శ్రీకృష్ణుడితో సారసపత్ని లక్ష్మణ కంటె శతగుణితమైన (నూరింతలు) వియోగజన్య తీవ్రతాపము యొక్క అనుభవము తరువాత పునః దివ్యరసానుభూతిని పొందుతుంది.

వేరే సంయోగ-వియోగాలు రెండూ కూడా కాలపరిధులకు కట్టుబడి నటువంటివి. కాలావభేదములో ఇవి ఉద్బుద్ధము, ఉద్వేలితముకావు. ఇక్కడ ఇవి పరస్పర విరుద్ధ ధర్మాశ్రయములు 'అణోరణీయాన్ మహతోమహీయాన్'. ప్రభువు శ్యామసుందరుడిలోనయితే రెండూ (సంయోగవియోగ) శృంగార రసాలు కూడా కాలానికి కట్టుబడినవి కాకుండా వ్యక్తమవుతాయి. శ్రీకృష్ణుడు ఎవరు? కృష్ణ-విషయ-సంయోగ వియోగాత్మకమై ఉద్వేలితమైన శృంగార రస మహాసముద్రములో నుండి వెలికి వచ్చిన నిర్మలము నిష్కళంకము అయిన పూర్ణచంద్రుడు-అతడే శ్రీకృష్ణ చంద్రుడు. అదే విధంగా రాధారాణి కూడా చంద్రుడే. ఏ చంద్రుడు!? శ్రీ కృష్ణచంద్రుడిలో రాధారాణి విషయమైన సంయోగ-వియోగాత్మక ఉభయవిధ శృంగారరసమహాసముద్రము నుండి ఆవిర్భవించిన నిర్మల నిష్కళంక పూర్ణచంద్రుడే శ్రీరాధారాణి.

ప్రేమానంద-సుధా-సార సర్వస్వమూర్తియే శ్రీకృష్ణుడు. వారి హృదయముల నుండి పూర్ణమైన అనురాగము రస-సార-జలనిధి నుండి సముద్భూతమైన నిర్మల నిష్కలంక చంద్రస్వరూపము వృషభానునందిని శ్రీరాధారాణి. వారి హృదయమే వృందావనము.

ఈ వృందావనము వ్రజాంగనా వృందమునకు జీవనము. 'వ్రజాంగనా వృందస్య జీవనం వృందావనం.' రసిక వృందము (సమూహము), మరియు గుణ వృందము యొక్క రక్షణ దీనివల్లనే కలుగుతుంది. అంటే రసికజనుల ఏకమాత్ర జీవనాలంబనము శ్రీవృందావన ధామము-

'వృందస్య గుణసమూహస్య, గుణిసమూహస్య అవనం యస్మాత్ తత్.' 'వృందాయాయోవ్యనం వృందావనమ్' వృంద యొక్క (తులసి) స్థితి ఏమిటంటే ఎల్లవేళలా శ్రీకృష్ణుడి చరణారవిందములలో సుశోభితమవడమే! ప్రభువు సాలగ్రామముగా విరాజమానుడయితే, అపుడు తులసీగా సేవిస్తుంది. (వృంద) ఎపుడైతే ప్రియతముడు ప్రాణధనుడు పూర్ణతములైన పురుషోత్తముడి రూపంలో ప్రభువు అవతరించినపుడు బృందావన రూపంలో ప్రకటమవుతుంది ఇక్కడ వున్న ఈ యమునానది. బృంద యొక్క హృదయములోని ప్రేమానంద రస సరిత. ఇక్కడి వృక్షములు, వృందయొక్క రోమంచము, ఈ భూమి బృందదేహము.

ఈ విపినరాజము యొక్క మహిమ అద్భుతము. శ్రీవ్రజ భక్తుల చరణ కమలముల రజము యొక్క స్పర్శ కాంక్షిస్తూ 'నోద్ధవోఽణ్వపి మన్యూనః' అను విధంగా మహాభాగవతుడైన ఉద్ధవుడు కూడా శ్రీవృందావన ధామములో తృణము లుగా మొక్కలుగా పుట్టాలని కోరుకుంటారు- 'వృందావనేకిమపి గుల్మలతౌషధీనామ్'

శ్రీమత్ ప్రబోధానంద సరస్వతి మొదలైన మహానుభావులు శ్రీవృందాన ధామమున బహిర్భూతమయిన అనంత చింతామణుల సంగతే కాక శ్రీహరినికూడా ఉపేక్షించమని సలహాఇస్తారు, 'మిలంతు చింతామణి కోటికోటయః, స్వయం హరిర్ద్వారముపైతి సత్వరః'.

భగవదాకార వృత్తిలో భగవత్తత్త్వము ప్రకటమవుతుంది. దానిని కూడా బృందావనమంటారు. ఈ విధముగా సాభాస అవ్యాకృతము మరియు సాభాసచరమా వృత్తిని కూడా బృందావనమని అంటారు. అందు వలన మహానుభావులు బృందావన ఉపాసకులు అయినా కూడా ప్రసిద్ధ బృందావనంలో ప్రారబ్ధవశంగా కొందరు అక్కడ వుండలేకపోతారు. వైకుంఠము వ్యాపకము. కారణ తత్త్వస్వరూపమయిన బ్రహ్మవ్యాపక మయినందువలన తత్త్వరూప బృందావనము ప్రకటనమవుతుంది. ఆ శక్తి దానికున్నది. కాబట్టి వారు ఎక్కడున్నా ఉపాసన చేయగలుగుతారు.

భావుకులైన భక్తులు వ్రజతత్త్వమును హితతమము, వేదవేద్యము అయిన ప్రేమ తత్త్వము యొక్క స్వరూపమును ఈశరీరముగనే భావిస్తున్నారు. ప్రేమ తత్త్వము యొక్క వ్రజధామరూపమైన ఈ శరీరములోని ఇంద్రియములు-వ్రజ నవయువతీ జనులు. మనస్సు స్వరూపరసికేంద్రవర్గ-మూర్ధన్యమణి శ్రీవ్రజరాజ కిశోరుడయిన శ్రీకృష్ణ చంద్రుడు. ప్రాణరూపా, ప్రజ్ఞారూపా గోపికల మకుటమణి అయిన శ్రీరాధారాణి 'యోవై ప్రాణః సాప్రజ్ఞా' అటువంటి స్థలములలో క్రియాశక్తి ప్రధాన ప్రాణము, జ్ఞానశక్తి ప్రధాన ప్రజ్ఞ వీటి ఐక్యత వివక్షితము కాదు. ప్రేమమయమైన వ్రజము (వృందావనం) ప్రేమోద్రేకముతో వ్రజాంగనారూపము అవుతుంది. 'తదాత్మికాః' 'కృష్ణోహం' 'మధురిపురహమితి' ఇద్యాతి వచనముల ననుసరించి శ్రీకృష్ణభావరస-భావితా అయి వ్రజాంగనలు నందనందన స్వరూపులవుతారు. రసిక శిరోమణి శ్రీకృష్ణ ప్రేమోన్మాదములో నిజప్రేయసి శ్రీవృషభానునందిని - స్వరూపమయిపోతారు. శ్రీరాధికా ప్రేమ స్వరూపముతో సాక్షాత్తు తన ప్రియతముడిలో నిమగ్నమవుతుంది. ఈ విధంగా సాక్షాత్తు వేదాంత వేద్యుడు పరమరసాత్మక సుధాజలనిధి యొక్క దివ్య వికాస ప్రేమతత్త్వము అందులోనే పర్యవసితమవుతుంది. ఇదే విధముగా అనాది రససాగరములో ప్రియ-ప్రియతముడు, వారి అనుచరుల, పరికరముల రసమయ లీలాధామము అప్రాకృత శ్రీవ్రజ భూమి కూడా రసమయమే, సౌఖ్యసుధాసింధుసార-సర్వస్వము. 'యత్ర ప్రవిష్టః సకలోఽపి జంతుః ఆనంద సచ్చిద్ఘన తాముపైతి' అంటే వృందావనధామములో ప్రవేశించినంత మాత్రముననే కీట పతంగాదులు కూడ సచ్చిదానంద ఘన స్వరూపులైపోతారు.

వృందావనమును, భావుకులు సచ్చిదానంద రససార-సరోవరము నుండి సముద్భవించిన సరోజ స్వరూపమని అనుకుంటారు. సరోజములో వున్న కేసరములు వ్రజ-గోపికలు, తదంతర్గత పరాగమునకు శ్రీవృషభానునందినీ అని అంగీకరిస్తారు. ఈ తారతమ్యాలన్నీ భగవత్స్వరూపములోనే దివ్యలీలాశక్తి ద్వారా సంపన్నమవుతాయి. ఈ సంసారము దివ్యలీలా శక్తి ద్వారా సంపన్నమవుతుంది. ఈ సంసారము (జగత్తు) కూడా పరబ్రహ్మస్వరూపములో మాయాకృత విలాస-విశేషమే నేత్రములకు, సూర్యుడికి మధ్య మేఘములు మొదలైన ఉపాధులు సూర్యుడిని ఎలాగ కప్పివేస్తాయో అపుడు దూరవీక్షణాదుల వల్ల సూర్యుడిని చూడగలుగుతాము. అదే ప్రకారము సత్వాదిమయి మాయాశక్తి స్వరూపమును అమృతము చేసి ప్రపంచమును ప్రకాశింపజేస్తుంది. కానీ అచింత్యమైన, దివ్య పరమాంతరంగమైన లీలాశక్తి స్వరూపము ఏ విధమైన ఆవరణము లేకుండానే అనేక విధములైన మాధుర్యమయ భావనలను అభివ్యక్తము చేస్తుంది. అందువల్ల బ్రహ్మవిద్ - వరిష్ఠుడు కూడా పూర్ణఅనురాగ రససార సముద్రము నుండి ఉద్భవించిన సరోజ రూపమైన ప్రభువులో తమ మనసనే భ్రమరమును రమింపజేయుటలో లోకోత్తర రసానుభూతిని పొందుతారు.

భావుకులయొక్క భావనారాజ్య శూన్యనికుంజములోనే ప్రియతమ ప్రభువు సంకేత సమయమున కేతెంచును, అన్యులెవరి ఎదుటనూ రారు. అలాగే వేదాంతులకు కూడా భగవద్వ్యతిరిక్తమైన దృశ్యపదార్థముల సంసర్గముతో శూన్యమై, నివృత్తికమై, నిర్మలమైన అంతఃకరణలోనే 'తత్‌పదార్థము' యొక్క ప్రాకట్యము జరుగుతుంది.

అన్ని కర్మలను వదిలి, ప్రతీక్షించడమే భగవత్సంగమమునకు కారణమవుతుంది. వేదాంతులకు కూడా మనోవాక్కాయ కర్మలను నిరోధించి ప్రతీక్షించడం వల్లనే తత్‌పదార్థము త్వంపదార్థముల రెండిటి తాదాత్మ్యత ప్రాప్తిస్తుంది.

నామము, రసము, ధామము మరియు రాధాకృష్ణుల ప్రేమ వీటి దివ్య నిరూపణతో పాటు మహాత్మ్య ప్రకాశము, మంగళాచరణ శ్లోకముల వ్యాఖ్య, శుకాగమనము, శుకపరీక్షిత్ సంవాదము, ప్రహ్లాద-బాలచరితము, పురుషోత్తముడైన

శ్రీకృష్ణ చంద్రుడి, లీల యొక్క మార్మిక దిగ్దర్శనమును 'భాగవతసుధ'లో మనోహరముగా స్వామీజీ అభివ్యక్తము చేసిరి.

ధర్మము మరియు బ్రహ్మ - వీటి మర్మజ్ఞుడైన శ్రీస్వామీజీ భక్తిసుధ, భక్తిరసార్ణవము మరియు భాగవతసుధ అన్న గ్రంథముల ద్వారా లోకోత్తర అమలాత్ములైన మునీంద్రులు, పరమహంసల జీవనములను ఎలా చిత్రించారో తాను స్వయంగా అలాగే మూర్తీభవించినట్లుండేవారు. జీవిత చరమాంకములో దేశకాల కలనా విముక్తము, అఖండ బోధ రూపశివతత్త్వము అయిన శ్రీవారణాసి కేదార ఖండములో వుండేవారు. భాగవత కథామృతపానములో వారికి తనివి తీరేది కాదు. రోమాంచితము, ప్రేమాశ్రువులలో పరిప్లుతమయిన వారి స్వరూపము, ఆ మంగళమయ దర్శనము భావుక-రసిక రసజ్ఞుల హృదయములలో స్ఫురిస్తూ వుండుగాక! అరసికుల హృదయాలను గురించి వారు ఇలా అనేవారు -

'కొందరు అంటారు - ద్వైతము మిథ్య అన్నవాళ్ళు భక్తి చేయ్యలేరు. సగుణ-సాకారము ఎవరి దృష్టిలో సర్వదా మిథ్య, అసత్ అయినదో వారి భక్తి విడంబన మాత్రమే. కానీ అది కూడా సరికాదు. బ్రహ్మను సత్యస్యసత్యము అన్నారు కదా దీని ఆధారంగా సత్తాత్రైవిధ్య యొక్క కల్పన కూడా అవుతుంది. ఈ మిథ్యా శబ్దము లోకులను భ్రమింపజేస్తుంది. శుక్తి-రజతాదిలో కూడా ప్రాతిభాసిక సత్యము కలదు. ఘటాదులు అబాధిత సత్తా కావడం వలన అవి వ్యవహారిక సత్యములు. ఘటాదులు కూడా వాటి కారణములైన మృత్తికాదుల కంటె మిథ్య, న్యూనసత్తాగా వున్నవి. ఇదే విధంగా క్రమేణ పెరుగుతు పెరుగుతూ భగవద్గుణాదులు మిగతా అన్నిటి కంటే సత్యము, ఉత్కృష్టములైనవి. 'మాం భజంతి గుణాః సర్వే' ప్రకారము గుణగణములు శేషము, భగవంతుడు శేషి. సర్వాంతరతమ - భగవత్సర్వరూపము వీటి అన్నిటి కంటే కూడా ఉత్కృష్టమైన సత్యము. అబాధితము. ఇలాగ భగవత్స్వరూపము కంటె గుణాదులు కించిత్ న్యూనసత్తా అయిన ఫరావాలేదు. ఎందుకంటే భగవంతునితో సమానమైన సత్తా లేదు కాబట్టి భగవంతుడి అద్వితీయత సిద్ధిస్తుంది.

అచింత్య - ఆనంద - సుధాసింధు అయిన భగవంతుడి యొక్క మాధుర్య సమాస్వాదనము కేవలము వృత్తి శూన్యమైన అంతఃకరణములో జరుగదు. అక్కడ

కూడా తత్త్వజ్ఞులైన భావుకులు భగవంతుడి దివ్యలీలాశక్తి సహాయంతో అనుభవిస్తారు. స్వచ్ఛమైన ఉపాధిలో భేదము వలన ఉపాధి యొక్క మాధుర్య-విశేష ప్రాకట్యములో కూడా తారతమ్యము వుంటుంది. ఇంద్రియముల కంటె కూడా శుద్ధ నివృత్తిక అంతఃకరణము యొక్క స్వచ్ఛత విశేషమే అయినా కూడా భగవత్ లీలాశక్తి యొక్క విశేషమే అనంత గుణిత స్వచ్ఛత గలిగినదువతుంది. అది రజస్తమగుణాది రహితమయినది. అదే అశేష-విశేషాతీత పరమానందాత్మక శుద్ధ స్వరూపము యొక్క అచింత్య అనంత ఆనందమయ సౌందర్య సుధానిధి పరమదివ్య శ్రీకృష్ణ విగ్రహములో అభివ్యక్తమవుతుంది. పువ్వులలో ఎలాగైతే కంటకాదులను ఉత్పన్నము చేసే శక్తులకంటె సుకోమల సుగంధిత పుష్పములను ఉత్పన్నము చేసే శక్తులు అత్యంత ఉత్కృష్టము, విశుద్ధము అయివున్నవో, అదే విధముగా ప్రపంచోత్పాదినియైన శక్తి కంటే భగవంతుడి మంగళమయమైన మూర్తి యొక్క స్ఫురణ కలిగించే శక్తియే పరమ విలక్షణమైనది. వాటి ద్వారా భగవంతుడు అచింత్య సౌందర్య మాధుర్య సుధానిధియైన మంగళాకృతిని ధరిస్తారు. ఆ దేహము సోపాధిక చేతన యొక్క కార్యము అయినా ప్రాకృతిక కార్యముల కంటే విలక్షణమయినది. తామస, రాజస ఆది దేహముల కంటే విశుద్ధ సత్వమయ శరీరములలో విశేషత వుంటుంది. అశుద్ధ (తామస) సత్వ ప్రధానమయిన ప్రకృతితో చైతన్యము ఆవృతమయి వుంటుంది. కానీ, విశుద్ధసత్వ ప్రధాన ప్రవృత్తి మాత్రం మాయతో నిరావరణమై వుంటుంది (ఆవరణ వుండదు). సూర్యుడు మేఘముతో కప్పబడతాడు. కానీ దూర వీక్షణ యంత్రము నేత్రమునకు, సూర్యునికి మధ్యన వుండిన యెడల అపుడు అది కప్పబడలేదు (ఆవృతంకాదు) స్పర్శ విహీనమయిన ఆకాశము స్పర్శవాన్ వాయువు రూపంలో ప్రకటమయినా కూడా తన ఆకాశరూపంలోనే వుంటుంది. అలాగే అనేక రూపములలో పరమాత్ముడు ప్రకటమయినా పరమాత్ముడు తన నిర్గుణ నిరాకార రూపములోనే వుంటాడు (తన స్వస్వరూపములోనే) సమాన సత్తా వున్న భావాభావములే విరోధములవుతాయి, విషమ సత్తా వున్న భావాభావములు కాదు, ఎందువలన అంటే పరమార్థికసత్తా కంటే కించిత్ న్యూనసత్తాయే ఆ దివ్యశక్తి యొక్క వ్యావహారిక రూపము. దానివల్లనే అవతారములు కలుగుతాయి. బ్రహ్మలో పారమార్థిక దృష్టితో 'అజాయమానత' వున్నా వ్యావహారిక దృష్టితో 'జాయమానత' కలుగుతుంది.

అద్వైత నిష్ఠలో యోగ్యత కలగడానికి మొదట (రామకృష్ణాధి) భగవంతుడిపై భక్తి చేయవలసి వస్తుంది, ఆఖరికి భక్తి, జ్ఞాని యొక్క స్వభావ మయిపోతుంది. ఇదే మాట త్రిపురారహస్యములో చెప్పబడివుంది 'విభేదభావమాహత్య సేవ్యతేత్యం తత్పరైః' పరమ ఆప్తకాముడు, పూర్ణకాముడైన జ్ఞాని ఫలాపేక్షలేకుండా సహజంగా (స్వభావంగా) భగవంతుని ప్రేమిస్తారు. శుకమహర్షిని గురించి ఇలా చెబుతారు 'పరనిష్ఠితోపి నైర్గుణ్యే' నిర్గుణ బ్రహ్మలో పరినిష్ఠితుడైననూ హరి గుణములతో ఆ కృష్ణుడై 'శ్రీమద్భాగవతమును' అధ్యయనము చేశారు. కుంతీ దేవి ఇలా అన్నది 'అమలాత్ములైన పరమహంస మునీంద్రులకు భక్తియోగ విధానముతో శ్రీపరమహంసలను చేయుటకై నిర్గుణ నిరాకార పరబ్రహ్మ సగుణ సాకారరూపంలో ప్రకటమయ్యాడు (అవతరించాడు) 'తథా పరమహంసానాం' భగవంతుడి అవతారము యొక్క ముఖ్య ప్రయోజనము అమలాత్ములైన పరమహంసల కొరకు భక్తి యోగవిధానమును చేశెను. ఈ ఉద్దేశ్యపూర్తి కొరకై తన మహామాయాశక్తిని (అనంతశక్తుల పుంజము) స్వీకరిస్తాడు. అందులో అనంత కోటి బ్రహ్మాండములు' దానిలో భోగ్యము, భోక్త వాటి నియామకమైన ప్రపంచమును ఉత్పన్నము చేసే అనంత శక్తులు వున్నాయి. అలాగే అనంత కోటి బ్రహ్మాండ నాయకుడైన భగవంతుడి దివ్య మంగళ విగ్రహములో ఆవిర్భవించడానికి అనుకూలమైన ఒక పరమ శుద్ధ అంతరంగ శక్తి వున్నది. అది భగవంతుడి అనిర్వచనీయ ఆత్మయోగభూతమైన మహాశక్తికి అంతర్గతమయిన కారణముగా అనిర్వచనీయము. అందులో అన్య ప్రపంచోత్పాదనకు అనుకూలమైన శక్తులకు సమానమైనప్పటికీ కూడా వాటి కంటే ఎక్కువ శుద్ధమయినవి ఇవి. ఈ విలక్షణమైన శక్తినే పరాశక్తి అని, అంతరంగశక్తి అని కూడా అంటారు. ఆ శక్తి కూడా భగవంతుడిలో అప్రవిష్టంగా వుంటూనే ప్రాకట్యానికి నిమిత్తమవుతుంది. అగ్ని యొక్క ప్రకాశకత్వము, దాహకత్వము అభివ్యక్తమవడానికి దీపశిఖాధిరూపముగా అభివ్యక్తమవడానికి నిమిత్త మాత్రములు. తరంగయుక్తమైన సముద్రము, నిస్తరంగయుక్తమైన సముద్రము రెండు సముద్రమే. తరంగాలకు కేవలము వాయువే నిమిత్తము. అటులనే విశుద్ధ లీలాశక్తి యొక్క నిమిత్తము వలన శుద్ధపరబ్రహ్మ అనంత కల్యాణగుణగణ విశిష్టసగుణ బ్రహ్మగా అభివ్యక్తమవుతాడు, కానీ వస్తుతః ఆ శ్రీ విగ్రహము శుద్ధ పరమానంద స్వరూపమే.

అందుకే భగవంతుడి సగుణరూపము 'ఆనంద-మాత్ర కరపాదముఖోదరాది, ఆనందమాత్రైక రసమూర్తయః' అని అంటారు. అందువల్ల వారి మహిమలు గొప్ప గొప్ప మునీశ్వరుల మనసులను కూడా మోహితము చేస్తాయి. బాలయోగులైన సనకాదులు వైకుంఠ ప్రవేశము చేసినపుడు అక్కడ ప్రభువు యొక్క చరణారవింద మకరందము నాఘ్రాణించినంతనే ప్రశాంతములైన వారి చిత్తములు క్షుబ్ధమయినవి. ముక్తి-భుక్తి-స్పృహ రహితులయిన భక్తులకే భగవంతుని నిర్విశేష స్వరూపము సంతృప్తిని కలిగించలేక పోయినది. వారి కోసము భగవంతుడు రామ కృష్ణాది అవతారములెత్తవలసి వచ్చింది.

శ్రీమద్భాగవతము, శ్రీరామచరితమానసము ఇదే ఆధారంతో భక్తి, విరక్తి మరియు భగవత్ప్రబోధముల సామంజస్యమును తెలియబరుస్తున్నాయి. వేదములు, ఉపనిషత్తులు మరియు అన్య పురాణములు కూడా అదే విధముగా సమన్వయము చేస్తున్నాయి. సంత్‌జ్ఞానేశ్వర్, నివృత్తినాథ్, ముక్తాబాయి, తుకారామ్, ఏకనాథ్ సమర్థ రామ్‌దాస్ మొదలైన వారు అద్వైతవాదులు అయినా అనన్య వైష్ణవులు.

ఈ విధముగ 'నిత్యా-సరస్వతి సార్థసమన్వితాసీత్' ఈ సూక్తి శ్రీ స్వామి కరపాత్రజీ మహరాజ్ వారిపట్ల పూర్తిగా చరితార్థమయినది. వేదవాణి, తదనుకూల సమస్తశాస్త్రాలు ఎలా సమన్వయము చేస్తాయో వారు తమ వాణి ద్వారా, లేఖిని ద్వారా వ్యక్తము చేశారు. అవి 'ఆత్మసాత్' చేసుకోతగినవి.

శ్రీ కృష్ణానందజీ మహరాజ్

గడియారం ముల్లు ఎలాగ మారుతూ వుంటుందో అలాగే ఈ మనయొక్క గతి కూడా పరివర్తితము అవుతూ వుంటుంది. భేదమేమిటంటే గడియారం ముల్లు కేవలం ముందుకు నడుస్తుంది, కానీ మనసు ముందకు-వెనకకు, క్రమమన్నది లేకుండా అన్ని దిక్కుల తిరుగుతూ వుటుంది. మనసునకు ఏవిధమైన స్వరం, తాళములు, పాద-విన్యాసములు నియమము లేదు. క్షణక్షణము మారుతూ వుండే మనసుకు సమానంగా కణకణమూ మారుతూ వుటుంది. కానీ భ్రమవశమున అవి స్థిరమని అనుకుంటాము. స్వామి కృష్ణానందులవారి సంస్మరణలు వ్రాయవలెనని కూర్చున్నాను, కానీ అనేక మంది కృష్ణానందస్వాముల చిత్రపటములు మనసులో తేలియాడినవి. అయితే రండి 'ఈ మహాత్ములందరివి కొద్ది కొద్దిగా ఒక్కోక్షణము చూద్దాము. వీరి స్మృతుల దృశ్యములు మనఃపటలమున మెరిసిపోతున్నాయి. వీరి దర్శన రస శీకరములు తొణికిస లాడుతున్నాయి.

శ్రీహరిబాబాజీ గంగాతటముపైన ఏనుగంత ఎత్తు, ఎడ్లబండ్లు తిరిగేందుకు వీలయినంత వెడల్పు గల 23 మైళ్ళ పొడవున సేతువును నిర్మించి, ఆ చుట్టుపట్ల 700 గ్రామాల జనులను పశువులను, సంపదలను కాపాడినారు. పల్లె పల్లెల్లో గ్రామ గ్రామాలలో శ్రీహరినామ సంకీర్తము యొక్క పావన ధ్వని యొక్క శిక్షా-దీక్షను ఇస్తూ ఒక దివ్య వాతావరణమును సృష్టి చేశారు. ఆదరణీయులైన ప్రభుదత్తజీ బ్రహ్మచారిగారి సంవత్సర వ్యాప్తమయిన నామ-యజ్ఞములో పాల్గొనుటకై ఝూసీ వచ్చాను. శ్రీహరి బాబాగారి శరీరము జబ్బుపడింది. ఆఖరికి లేవడం కూచోవడం కూడా కష్టమయ్యే పరిస్థితి ఏర్పడింది. అతిసారవ్యాధి, ప్రకోపించింది. మాట కూడా పడిపోయింది. అదే సమయంలో శ్రీచైతన్య మహాప్రభువు యొక్క భక్తుడు, భగవంతునిలో తన్మయుడు

మధురరసోపాసకుడు, అయిన శ్రీకృష్ణానంద స్వామి సఖీవేషంలో భగవత్ రాగరంజితమైన ముఖమును చీర చెరుగుతో కప్పుకుని అక్కడికి వచ్చారు. వారిని చూసి శ్రీహరిబాబాజీ గారు లేచి కూర్చున్నారు. భగవత్ ప్రేమలో ఇద్దరూ మునిగిపోయారు. రోగం పారిపోయింది. ప్రేమగా ఒకరితో ఒకరు సంభాషించుకుంటున్నారు. ప్రభు దర్శనమాత్రము శాంతరసము. సర్వభావంతో మగ్నమై, మైమరచి సేవలో సంలగ్నమయి ప్రియతముడైన ప్రభుసేవలో కేవలం సేవయే సుఖమని భావించడము-దాస్యరసము. ప్రభువు తన హృదయంతో ఆలింగనం చేసుకోవడం, భుజముపైన చెయ్యివేసి తనతో స్నేహం చెయ్యడం సఖ్యరసము. భక్తుడి హృదయములో ఉదయించిన స్నేహచంద్రుడి వలన మంగళకరమయిన వాత్సల్య రసము ఆవిర్భవిస్తుంది. ఐశ్వర్యభావం తిరోహిత మవుతుంది. తల్లి ఒడిలోని బిడ్డవలె, భక్తుడి హృదయములోని ప్రేమ తరంగములో ప్రియతముడైన ప్రభువు శిశువుగా మారి మునిగి తేలుతూంటారు. స్నేహమనే క్షీరసాగరంలో యశోదా మాత ఒడిలో లాలించబడటము-ప్రియతమ శిశులీల. ప్రేమ ప్రాబల్యము భావ శాబల్యము. భావోదయము, భావసంధి, భావశాంతి. క్షణక్షణము పరమానందరస కాంతి యొక్క మెరుపులు. చిన్నవి పెద్దవి అని ఏమీ లేదు. ఒకటి నుండి అనేకము, అనేకము నుండి ఒకటి. వివేకము-అవివేకము రెండూ కలిసిపోయి ఏకమయిన మధుర రసము!

చాల సంవత్సరముల తర్వాత ఒక రోజున నేను శ్రీహరిబాబాగారిని ఈ విషయమై అడిగాను -

అది ఏమి చమత్కారము! మీరు అంతటి బాధను మరచిపోయి సత్సంగ రంగములో రంగరించుకునిపోయి రాత్రి అంత ఒక్క నిముషము ఒక ఉన్మాదస్థితిలో గడిపివేశారు. శ్రీహరి బాబాజీ నవ్వేశారు. వారు ఇలా అన్నారు, 'నాకు శ్రీకృష్ణానందజీని చూసి చైతన్య మహాప్రభువు యొక్క లీల-జగన్నాథ పురీలో శ్రీరామానందరాయ్ గారితో శ్రీకృష్ణ ప్రేమరసాస్వాదనమును గురించిన చర్చ గుర్తుకు వచ్చింది. మనసు లీనమయిపోయింది. దేహ భావము నశించిపోయింది. వారు ప్రొద్దుట వెళ్ళిపోయాక మరల తిరగబెట్టింది.

శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారి సంకీర్తన - యజ్ఞములో ఇంకొక మహాత్ముడు శ్రీకృష్ణానందస్వామి వచ్చారు. పేరు అయితే అదే. కానీ ప్రీతి - రీతి విలక్షణము. వారు విరక్తులు, సంయములు. ఏ ఆడంబరము లేకుండా సాదాగా సన్నగా వుండేవారు వారు. నిర్వానసులు. భావనలో బృందావనవాసులే. నేను భాగవత ప్రవచనము చేస్తూ వుంటిని. ప్రసంగ వశాత్తు నేను భక్తి రసామృత సింధులోని కొన్ని శ్లోకాలు వినిపించాను. ప్రవచనమయిన తరువాత వారు నన్ను తన దగ్గరికి రమ్మన్నారు. చాలా ప్రసన్నంగా ఉన్నారు. నాకు రెండు శ్లోకములు తన స్వహస్తాలతో వ్రాసి యిచ్చారు. అవి శ్రీ రాధా-సుధానిధి గ్రంథములోనివి. అంత వరకు నాకు ఈ రసనిధి (గ్రంథము)ని గురించి తెలియదు. ఆ శ్లోకములివి :-

అలం విషయవార్తయా నరక కోటి భీభత్సయా
వృధా శృతి కథాశ్రమో బత బిభేమి కైవల్యతః ।
పరేశ-భజనోన్మదా యది శుకాదయః కిం తతః
పరంతు మమ రాధికాపదరసే మనో మజ్జతు ॥

చాలు చాలు విషయ వార్తలు చాలించు. వాటి చర్చకూడా నరక కోటి సమానమైన భయానకమైనవి. శృతి కథలో పరిశ్రమించడం వృధా శ్రమ. కైవల్యముక్తి? అయ్యో! అయ్యో! అదంటే భయం! శుకదేవాది మహా పురుషులు కూడా రపమేశ్వరుడి భజన రసమును పానము చేసి ఉన్మత్తులైనారు. అయితే ఏమిటి? మీకు కావలసిన దేమిటి? శ్రీవృషభాను నందిని, నిత్యాకిశోరి శ్రీ రాధారాణి చరణారవింద మకరంద సుధలో నామనోమధుపము శాశ్వతముగా మునిగిపోయినది.

దుకూలం బిభ్రాణమథ కుచతటే కంచుకపటం
ప్రసాదం స్వామి న్యాః స్వకరతలదత్తం ప్రణయతః ।
స్థితాం నిత్యం పార్శ్వే వివిధ పరిచర్యైక చతురాం
కిశోరీ మాత్మానం కిమపి సుకుమారీం ను కలయే ॥

నేను శ్రీ రాధారాణి సహచారిని. చీర రవికె శృంగారించుకున్నాను. శ్రీరాధారాణి తన కరకమలములతో నాకు ప్రసాదము ఇచ్చింది. చాలా ప్రేమతో! ప్రేమయే ప్రేమ!

నేను నిత్యము వారి దగ్గరనే ఉంటాను. అన్ని విధాల సేవచేస్తాను నేను నిపుణురాలిని. నేను ఒక సుకుమారియైన కిశోరిని - అలా నాకు అనుభవం కలుగుతూ ఉంది.

ఆ మహాత్ముడు చాలా నిస్పృహుడు, ఇచ్చిపుచ్చుకోవడాల ఝుంజాటం లేదు. వారి ముఖ కమలంపై శుభ్రమందహాసం, ప్రేమార్ద్రములయిన నేత్రములు మధుర వాక్కులు - ఆ రూపం అపుడపుడు గుర్తుకు వస్తుంది. తర్వాత వారిని నేను కలుసుకోలేదు. ఎక్కడి నుండి వచ్చారో ఎక్కడికి వెళ్ళారో వారి సంగతి ఏమీ తెలియలేదు. ఇప్పటికి 47-48 సంవత్సరాలు జరిగిపోయినవి దాదాపుగా!

ఇక మూడవవారు శ్రీకృష్ణానంద స్వామి 'టాట్‌వాలే'. నేనయితే 'టాట్' (గోనెపట్టా) కట్టగా చూడలేదు. కానీ మొదటవారు అలాగే వుండేవారు కౌపీనాచ్ఛాదన మాత్రంగా వస్త్రము ధరించేవారు. చలికాలంలో దుప్పటి కప్పుకునేవారు. ఏకాంత ప్రియులు. 5, 6 భూమికలలో వున్న జీవన్ముక్త మహాత్ములపైన వారికి అమిత శ్రద్ధ. శ్రీహరి బాబాజీ గారి దగ్గరకు వస్తూ పోతూ వుండేవారు. వ్యాఖ్యానం మొదలు పెట్టారంటే - అద్వైతసిద్ధి, ఖండన ఖండఖాద్యము, చిత్సుఖి వీటిపైన వివరంగా సంస్కృతములో చెప్పేవారు. అద్వైత నిరూపణ చేసిన తర్వాత భక్తి, నామ-సంకీర్తనము వీటితో ఉపసంహారము (వ్యాఖానం) చేసేవారు. ఒకసారి ఢిల్లీలోని ఒక భక్తుడి ఇంటికి వెళ్ళినపుడు 'అరే! ఎవరైనా నా ధ్యాన సమయంలో గట్టిగా మాట్లాడితే నేను చచ్చిపోతాను' అన్నారు. భక్తుడు చేతులు జోడించాడు 'తండ్రీ! అలాగయితే మీరు ఎక్కడయిన వేరే చోట వుండండి మా ఇంట్లో పిల్లా-పాప ఉంటారు మరి' అన్నాడు. అపుడు వారు నవ్వుతూ 'అలాగకాదు ఎవరైనా కోపంతో గట్టిగా మాట్లాడితే అని చెప్పాను' అన్నారు.

పంజాబ్‌లో 'గదాపూర్' అని ఒక గ్రామము వుంది. అక్కడ ఒక మహాత్ముడు వుండేవాడు. శ్రీకృష్ణానందస్వామికి వారిపైన శ్రద్ధ వుండేది. వారు ఆరవ భూమికలో వున్న మహాత్ములు. తన కుటీరంలో ఏకాంతంగా శాంతంగా నిస్సంకల్పులై కూర్చుని వుండేవారు. ఎవరైనా మాట్లాడిస్తే మాట్లాడడం లేకపోతే మౌనంగా వుండడము. నిస్సంకల్పంగా వుండేవారు. శ్రీ కృష్ణానందస్వామిగారు శ్రీహరిబాబాజీని బలవంతంగా వారి దగ్గరికి తీసుకెళ్ళారు. ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. ఒక గంట కూర్చుని

బాబాగారు లేచి వచ్చేశారు. ఆ మహాత్ముడితో శ్రీకృష్ణానందగారు అన్నారు, 'హరిబాబాగారు చాలా గొప్ప మహాత్ములు. బృందావనం నుండి ఇక్కడికి మీ దగ్గరకు వచ్చారు. మీరు మాట్లాడనేలేదు అన్నారు. అపుడా మహాత్ముడన్నారు 'సరే మంచిది ఈ సారి వస్తే నాకు చెప్పండి.'

స్వామి కృష్ణానందజీ, శ్రీహరిబాబాగారిని మరల ఇంకోసారి అక్కడికి తీసుకువెళ్ళారు. ఆ మహాత్ముడు అన్నాడు 'ఇపుడు సంకీర్తనము వదిలి ఆత్మ-పరమాత్మ చింతన చెయ్యి'. హరిబాబాజీ మౌనంగా వుండిపోయారు. వారికి ఆ మాటనచ్చలేదు. వారి దృష్టిలో జీవన్ముక్తి యొక్క సర్వోచ్ఛస్థితి కలిగినవారికి ఈ సమాధి. విక్షేపాలు-రెండూ ఒకటే ఏమీ భేదము లేదు. సేతువు కట్టేటపుడు వారు మట్టిపని చేసేవారు. పిల్లలతో 'కబడ్డీ' ఆడేవారు. గ్రామ ప్రజలతో బాగా కలిసి పోయేవారు. ఆఖరికి శ్రీకృష్ణానందజీకి కూడా హరిబాబా గారి పట్ల శ్రద్ధ కలిగింది. సంకీర్తనము, రాసలీల, భగవత్‌గుణ గానము మొదలైన వాటిలో వారు కూడా లీనమయ్యేవారు. అక్కడక్కడ ఉత్సవాలు చెయ్యడం కూడా మొదలుపెట్టారు.

ఒకసారి ఖన్నా నగరంలో చాలా పెద్ద ఉత్సవం చేశారు. స్వామి శ్రీకృష్ణానందజీయే (ఆయోజనము) ఏర్పాటుచేశారు. పరమ పూజ్య శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్, శ్రీహరిబాబాజీ, శ్రీ ఆనందమయిమా, మేము అందరము కలసి దాదాపు 25మంది దాకా వారి వెంట బస్సులు, మోటార్ల ద్వారా కురుక్షేత్రము మరియు అంబాలాలో ఉత్సవములు జరుపుతు వెళ్ళాము. చాలా ఆనంద ప్రదంగా జరిగింది. శ్రీకృష్ణానందజీ స్వామియే ఏర్పాట్లన్నీ చేశారు.

ఖన్నా నగరంలో ఒక మహాత్ముడుండేవారు. పేరు త్రివేణిపురీజీ. నగ్న ప్రాయంగా వుండేవారు. జనంలోకి వచ్చేటప్పుడు ఒక నల్లటి కంబళి కప్పుకునేవారు. బాలకవత్ క్రీడించేవారు. కాపలా కాసేవారు. సమాధిలోనూ వుండేవారు. శ్రీకృష్ణానందజీ వారిని గురుతుల్యులుగా భావించేవారు.

ఖన్నా నగరంలో ఒకరోజు శ్రీఉడియాబాబాజీ, శ్రీహరిబాబాజీ, శ్రీఆనంద మయిమా వీరితో శ్రీతివేణిపురీజీ కూర్చుని వుండిరి. ఎవరో ఒక భక్తుడు వచ్చి

యాలకుల పొట్లం తెచ్చిపెట్టాడు. నేను ఆ పొట్లము చేతితో తీసుకుని శ్రీత్రివేణిపురీజీని 'ఇది ఏమిటి' అని అడిగాను. వారు నవ్వి ఇలా అన్నారు 'ఇదీ బ్రహ్మమే'. నాకు అపుడు ఒక గతస్మృతి మనసులో మెదిలింది. - కర్ణవాసములో ఉన్నప్పుడు శ్రీఉడియాబాబాజీ గంగాఒడ్డున రెండు చేతులతోను ఇసుక తీసుకుని అన్నారు. 'శాంతను! ఎప్పటి వరకు ఈ ఇసుక కూడా సాక్షాత్తు బ్రహ్మమే అని తెలియలేదో అప్పటి వరకు పూర్ణజ్ఞానం కలుగలేదని అర్థం'. నిజంగానే! మహాత్ముల దృష్టిలో ద్వైతముగాని వికల్పముగాని లేదు. లేకపోతే రాగ-ద్వేషముల ఆత్యంతిక నివృత్తి కలుగజాలదు, దుఃఖము తొలగదు.

నా మనసులో శ్రీత్రివేణీ పురీజీ పట్ల శ్రద్ధ కలిగింది. అందువలన మరుసటి రోజు బ్రహ్మముహూర్తములోనే వారి దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. నాకు శ్రద్ధ వలన కలిగిన ఉద్రేకమో లేక వారి సంకల్పము యొక్క స్ఫురణమో, లేక అకస్మాత్‌గా కగలిగిన ఘటనా విశేషమో ఏదైనా అనుకోండి - నాలో ఆనంద సరిత గంగా ప్రవహిస్తోం దనిపించింది. రససముద్రము తరంగాయమానమైనట్లు ఆహ్లాదవర్షం కురుస్తున్నట్లు, సుఖము, ఆనందము ఉవ్వెత్తుగ పొంగుతున్నట్లుగా ఒక మధు! మధురమైన అనుభవం. ఇలా 20-25 నిమిషాలవరకు అలాగే ఆ అనుభవం వుండినది. మరల సామాన్య స్థితికి వచ్చిన తర్వాత శ్రీత్రివేనీ పురీజీ అన్నారు 'కేవలం పృథ్వి లేదు అని అనుకో - అరణ్యం లేదు, పర్వతం లేదు, నగరం లేదు, వూరు లేదు, వాడ లేదు, ఇల్లు వాకిలి లేదు, ప్రాణుల శరీరాలూ లేవు, రజత - కాంచనాలు లేవు. అన్నీ మట్టిబొమ్మలే. మట్టేలేకపోతే ఇక నాది, నీది అని ఏముంది? అపుడిక పంచీకృత జలము, అగ్ని, వాయు, ఆకాశము కూడా లేదు. కేవలము చిదాకాశము! ఆత్మ ప్రకాశము! ఆత్మ ప్రకాశముఅను, లేదా ఆత్మోల్లాసమనూ ద్వైతము, త్రైతము ఏమీ లేదు.'

టాట్ వాలే కృష్ణానందజీని మేము అవధూత కృష్ణానందజీ అనేవారము. వారు ఒకసారి శ్రీహరిబాబాజీని హరిద్వారము దగ్గరనున్న 'బహదూరాబాద్'కు తీసుకెళ్ళారు. అక్కడ నారాయణస్వామి అనే మహాత్ముడుండేవారు. వారికి 'చాణోద్'లో

భగవద్దర్శనము అయింది. శ్రీహరిబాబాజీ రాక వారికి అత్యంత ఆనందాన్ని కలిగించింది. వారు బాబాతో అన్నారు, 'ఈ రోజు నాకు నారాయణుడు దర్శనమిచ్చి ఘంటలు, జేగంటలు వదిలి హరిబాబాజీని వేదాంత-చింతనము చెయ్యమను. నివృత్తి పరాయణులై శాంత భావంతో వుండమను అని చెప్పారు.' అపుడు శ్రీహరిబాబాజీ అన్నారు, 'నారాయణుడికి నేను ఘంటవాయిస్తూ హరి సంకీర్తనము చేస్తాను, చేయిస్తాను అని తెలిసింది కదా చాలా సంతోషము. కానీ వారు స్వయగా నన్ను ఎందుకు ఆజ్ఞాపించరు. మీ ద్వారా ఎందుకు చెప్పిస్తున్నారు? మీరు వారికి చెప్పండి వార్నే స్వయంగా నన్ను ఆజ్ఞాపించమని.' అని అన్నారు.

అవధూత శ్రీకృష్ణానందజీ గొప్ప సంగీత ప్రియుడు. వారు వ్రజభూషణుడు అనే ఒక సంగీతజ్ఞుడిని తన వెంట పెట్టుకున్నారు. వారు స్వరతాళయుక్తంగా భగవత్సంబంధమైన గీతములను ఆలాపించినపుడు వీరు ఆనందంతో వూగిపోయేవారు. రోమాంచిత శరీరముతో అశృనేత్రాలతో వారి మనసు ఆనందమగ్నమయ్యేది.

సరే! ఇపుడిక బంబయివాలే కృష్ణానందజీని గురించి చర్చించుకుందాము. ఈ పేరులోని చమత్కారము అదే! ఎందరో 'కృష్ణానంద' అనే పేర్లున్న మహాత్ములందరూ గుర్తుకు వస్తున్నారు. ఒక సంబంధజ్ఞానము వేరొక స్వ-సంబంధులను గుర్తుచేస్తుంది. మనసు యొక్క గతి-మతి-రతి విలక్షణము. అందులో అమృతము-విషము రెండూ కలిగిన పాత్రవంటిది మనసు. దానిలో అమృతము నింపుకుని త్రాగు, త్రాగించు. అది అందుకోసమే వున్నది. ఆ! అలాగే ఈ కృష్ణానంద్‌జీ కూడా ఆనందాన్ని వర్షింపజేసే ఒక మహాత్ముడు.

నాకు వారి గృహస్థాశ్రమము పేరు-వూరు సరిగా తెలియదు. వారు ప్రయాగ దగ్గర వున్న సుల్తాన్‌పురములో జన్మించారనుకుంటాను. వారు సరయూపారీణ బ్రాహ్మణులు. సరళస్వభావులు. మొదట వారు బొంబాయిలోని ఒక సేఠ్ దగ్గర పనిచేశేవారు. వారు చాలా నిజాయితీ పరులని సేఠ్‌కి చాలా నమ్మకముండేది. సేఠ్ వారికి ఒక్కోసారి 5, 6లక్షల వరకు డబ్బులిచ్చి పంపిస్తూ వుండేవారు. ఫలానా వారికి ఇవ్వమని వారి పనిలో ఎపుడూ ఏ విధమయి లోపము రాలేదు.

ఒకసారి వారు 10వేల రూపాయలు పోగొట్టుకున్నారు. సేఠ్‌జీ చాలా కోపగించుకున్నారు. 'నేను నీ జీతంలో కట్టేసుకుంటాను' అన్నారు. 150 రూపాయల జీతం-అందులో సగం సేఠ్‌తీసుకుని మిగిలినది ఇచ్చేవాడు. దానితోనే ఎలాగో గడుపుకునేవారు.

భగవంతుడి ప్రేరణ వలన ఒకరోజు భాయిజీ శ్రీ హనుమాన్ ప్రసాద్ పొదార్‌జీ (కల్యాణ్-సంపాదకులు)వారు ఈ సేఠ్‌కి మంచి మిత్రులు, వారు వీరి దగ్గరికి వచ్చినపుడు ఒకసారి మాటల సందర్భములో ఈ డబ్బు సంగతి చెప్పారు. భాయిజీ అడిగారు 'వారు నిజాయితీ పరులా కాదా?' అని. సేఠ్ అన్నారు, 'వారు ఎన్నో సంవత్సరాల నుండి నా దగ్గర పని చేస్తున్నారు. లక్షల కొద్దీ రూపాయలతో వ్యవహారం. ఎప్పుడూ ఏ పొరపాటూ జరగలేదు. నిజాయితీపరుడు, నమ్మకస్తుడని నేను అనుకుంటున్నాను.' అపుడు భాయిజీ అన్నారు, 'ఒకవేళ ఆ వ్యక్తి దొంగయినా, అవిశ్వసనీయుడయినా మన దగ్గర పనికి పెట్టుకోకూడదు, ఎందుకంటే మరల ఎపుడయినా గడబిడ చెయ్యవచ్చు. ఒకవేళ అతను నమ్మకస్తుడయితే తన జీతంలో కోత వెయ్యడము అనుచితము! తర్వాత వారు నిజాయితీ పరులని నిశ్చయించి వారిని పిలిచి 'ఇక మీదట మీ జీతం తగ్గించము, ఇంత రకు తక్కువ ఇచ్చినది అంతా కూడా మీకు పూర్తిగా ఇచ్చివేస్తాము. నీ నిజాయితీపైన మాకు సందేహము లేదు.' అన్నారు సేఠ్. ఆ బ్రాహ్మణుడు అక్కడనే భగవంతుడికి సాష్టాంగదండ ప్రణామములాచరించి కన్నీటితో ఇలా అన్నారు, 'మీ ఋణము తీర్చడానికే నేను ఇక్కడ పనిచేస్తు వుంటిని' ప్రభువు ప్రేరణ వలన మీరు నన్ను ముక్తుణ్ణి చేశారు. ఇక ఇపుడు నేను పనిచెయ్యను!' వారు అక్కడి నుండి బయలుదేరి గంగా, తటము సమీపించారు. ఇదీ శ్రీకృష్ణానందజీ పూర్వాశ్రమ జీవనము.

బులంద్ శహర్ జిల్లాలో కర్ణవాసము, అనుపశహర్ మధ్యలో 'భేరియా' (భృగు క్షేత్రము) అనే పేరుగల సుప్రసిద్ధ క్షేత్రము వున్నది. మొదట్లో అక్కడ చాలా గొప్ప గొప్ప మహాత్ములుండే వారు. భారతదేశంలోని సుప్రసిద్ధ విద్వాన్, మహాత్ముడు అయిన శ్రీఅచ్యుతమునిజీ అక్కడే పడవలో నివసించేవారు. వారు మొదట ఆర్య సమాజములో ఒక ప్రఖ్యాత ప్రాధ్యాపకులుగా వుండేవారు. తర్వాత అద్వైత వేదాంతి

అయ్యారు. వారు సకల శాస్త్రముల మర్మములను తెలిసినవారు. అపుడపుడు అక్కడ శ్రీఉగ్రానంద్‌జీ, శ్రీ బంగలీబాబా, శ్రీఉడియాబాబాజీ వస్తుండేవారు. వేదాంత సంబంధమైన గూఢ ప్రశ్నల యొక్క సమాధానముండేది. ఒకసారి ఎవరో శ్రీ అచ్యుతమునిజీని అడిగారు, 'మీరు చక్కగా కూర్చుని సూర్యడిలో ఏమి చూస్తారు?' వారు అన్నారు 'అంతఃకరణా విచ్ఛిన్న చైతన్యము, సూర్యావిచ్ఛిన్న చైతన్యము వీటి ఏకత్వాన్ని చూస్తుంటాను'. ఒకసారి శ్రీహరిబాబాజీ శ్రీ అచ్చుతమునిజీతో ఇలా అన్నారు 'మహారాజ్! వృత్తి ఎల్లవేళలా స్వరూపములోనే స్థితమయివుండనీ అలా కృప చూడండి'. వృద్ధావస్థలో వున్న శ్రీమునిజీ వంగుని కూర్చున్నారు. లేచి చక్కగా కూర్చుని ఇలా అన్నారు 'అరే! హరి! నీవు సోమరివి కావాలనుకుంటున్నావా? కృప ఎందుకు? నీవే స్వయంగా 'వృత్తి'ని స్వరూపములో స్థిరమయ్యేలా చెయ్యి లేదా ఆవృత్తిని వదిలివెయ్యి.' ఆ రోజులలో శ్రీలాలాజీ యాజ్ఞిక్, శ్రీభూదేవ శర్మ మొదలైన గొప్పగొప్ప వేదాంతులు మునిజీతో సత్సంగము చేయడానికి వచ్చేవారు.

బొంబాయి నుండి వచ్చిన సరళ చిత్తుడు, నిజాయితీ పరుడైన ఆ బ్రాహ్మణుడు కూడా అక్కడికి వచ్చి, ఒక నివృత్తి-పరాయణుడైన దండీస్వామితో దండగ్రహణము చేశారు. అప్పటి నుండి వారి పేరు 'శ్రీకృష్ణానందాశ్రమ్' అయింది. భగవత్ప్రేరణతో వారు 'బాంధ్'పైన శ్రీహరి బాబాజీ దగ్గరికి వచ్చారు. నామసంకీర్తనములో వారి నిష్ఠ దృఢమయినది. వారు చేసే ధీరగంభీర నామ-ధ్వని దిగంతాలలో వ్యాప్తి చెందినది. భగవద్విముఖులైన జీవులను కూడా సుముఖులుగా చేసింది. 90సం॥ల వృద్ధావస్థలో కూడా వారి ఉదాత్త స్వరలహరి దూర దూరము వరకు ప్రతిధ్వనిస్తూ వుండేది.

స్వామి శ్రీకృష్ణానందజీతో మొదటిసారి బొంబాయిలో కలిశాను. వేలాది ఉత్తర భారతీయులు వారి సంకీర్తనలో పాల్గొనేవారు, వారంటే చాలా శ్రద్ధ వుండేది అందరికి.

ఆ సమయంలో శ్రీశాంతిబాయి, కలకత్తాలో వున్న శ్రీనివాసపోద్దార్ యొక్క స్వంత సోదరి నన్ను భాగవతం వినిపించమని అడిగారు 'నేను గృహస్థులకు భాగవతం వినిపించను' అన్నాను. ఈమాట శ్రీకృష్ణానందజీకి తెలిసింది వారు వచ్చి 'నేను శ్రోతగా వుంటాను' అన్నారు. 'సింహానియాబాడి'లో చాలా గొప్పగా ఏర్పాట్లు చేశారు. 'భాగవతకథ' కోసం ఆ సమయంలో స్త్రీలు సత్సంగమునకు వచ్చేవారు కాదు.

అందుకని వారికి ప్రత్యేక స్థలము ఏర్పాటు చేశారు. రాజస్థానీ, గుజరాతీ, ఉత్తర్ ప్రదేశీయులు వందలాది జనం పాల్గొన్నారు. స్వామీజీ వారి సంకీర్తనము జరిగేది. జనం భక్తిభావంతో తన్మయులైపోయేవారు. ప్రపంచ విస్మరణ పూర్వకముగా భగవంతుడిలో మనసు లగ్నమవడమే ఇదే జీవుడికి పరమ కల్యాణ భాజనము.

ఒకసారి నేను కర్ణవాసములో జ్వరపీడితునయ్యాను. చాలా రోజుల వరకు రోజూ జ్వరం కొద్దిగా వస్తూనే వుండింది. ఒక రోజు స్వామి కృష్ణానంద్‌జీ వచ్చారు. నా ఆసనంపైన కూర్చున్నారు. కుశల ప్రశ్నల తర్వాత 'ఒకవేళ రేపు గనుక మీకు జ్వరం వచ్చిందంటే నేను గంగలో దూకి ప్రాణత్యాగము చేస్తాను' అన్నారు. నాకు భయం వేసింది. ఈ మహాత్ముడు నిజంగా అన్నంత పని ఎక్కడ చేస్తాడో అని! కానీ రెండో రోజు జ్వరం రాలేదు. నాకు స్వస్థత చేకూరింది. ఇక అప్పటినుండి మేము కర్ణవాసములో బొంబాయిలో. ఉత్సవాలలో కలుస్తూ వుండేవాళ్ళము.

ఆ మహాత్ముడు చాలా సరళ హృదయుడు. ఎవరైనా వచ్చి 'అరె! స్వామీజీ మీకు జ్వరం వచ్చింది అని చెబితే వెంటనే రగ్గుకప్పుకుని పడుకునేవారు. ఎవరి మాటనైనా విశ్వసించేవాడు. తాను స్వయంగా ఎవ్వరిని మోసము చెయ్యడు, ఇతరులలో కూడా కపటము చూడడు. ఎప్పుడుకానీ ఇతరులను నిందించేవాడు కాదు. ఇతరులలో దోషములను చూచేవారు కాదు. ఒకవేళ ఎవరైనా వచ్చి వర్ణన (దోషాల) మొదలు పెడితే వారిని ఆపేవారు. తన చెవినపడినా చెవులు మూసుకునేవారు. 'భగవంతుడి నామము జపించండి! హరే రామ! హరే!' అని అనేవారు.

ఒకసారి శ్రీకరపాత్రజీ బొంబాయి మరీన్ డ్రైవ్‌లో లక్ష-చండీ యజ్ఞము ఆయోజనము చేసినపుడు బృందావనము నుండి శ్రీమస్త్ రామ్ బాబా (పరమహంస ఆశ్రమ్)ను నాదగ్గరకు పంపినారు. వారికి శ్రీకరపాత్రజీ పైన చాలా శ్రద్ధ వుండేది. నేనంటే వారికి చాలా ప్రేమ. నేను పరమహంస ఆశ్రమములో వుండేటపుడు వారు అపుడపుడు నాకు తన స్వహస్తాలతో భోజనము తయారు చేసి పెట్టేవారు. మస్తరామ్ బాబాగారికి ఒకవైపు భగవంతుడంటే పూర్ణఅనురాగం, మరోవైపు సంసారం పట్ల వైరాగ్యము వుండేవి. చాలనిష్కర్షగా, స్పష్టంగా మాట్లాడేవారు. ఎవరితోనూ సంబంధం

లేదు. వారికి ఎవరైనా ఏదైనా ఇచ్చినా వారు మహాత్ములకు పెట్టేవారు. నన్ను తన అనుచరులను తీసుకుని వారు బొంబాయి వచ్చారు.

ట్రైన్‌లో జరిగిన సంఘటన ఇప్పటికీ గుర్తువస్తుంది. దానిని వ్రాసిన తర్వాత ముందుకు వెళ్ళడము మంచిది - నేను ఖండవాలో వున్న కన్వయ్యాలాల్ భక్తునికి టెలిగ్రామ్ ఇచ్చాను. స్టేషనులో భోజన వ్యవస్థ చూడమని. కన్వయ్యాలాల్ 20, 25 మంది మహాత్ములకు పూరి-కూచ, రబరీ, మిఠాయిలు అన్నీ తీసుకుని వచ్చారు. మేము 4, 5గురు మాత్రమే వుంటిమి. ట్రైన్‌లో వున్న యాత్రికులకు తినిపించాము. ట్రైన్ కదిలిన తర్వాత ఒక పంజాబి సజ్జనుడు నా దగ్గరికి వచ్చి 'స్వామీజీ చూడండి భగవంతుడి లీల! నాకు ఇంటి నుండి వున్న పళాన బయలు దేరవలసి వచ్చింది. బజారు వస్తువులు తినను. కాని భగవంతుడు నాకోసం భోజనం పంపించాడు' అన్నాడు. కళ్ళలో అశృవులు! గొప్ప భావుకుడు!

వారు ఒక కథ చెప్పారు - ఒక మహాత్ముడు ఘోరారణ్యములో వుండేవారు. వారికి ఎవరో ఒక చంటి బిడ్డని తీసుకువచ్చి ఇచ్చారు. వారు పూరి నుండి భిక్ష తీసుకువచ్చి ఆ బాలుడిని పోషించారు. 18, 20సం॥ల వయసు వచ్చే వరకు ఆ బాలుడు పూరిలోకి వెళ్ళనేలేదు. స్త్రీని ఎపుడూ చూడనే లేదు. ఆ బాలుడికి మహాత్ముడు తనను ఎలా పోషిస్తున్నాడో కూడా తెలియదు. మహాత్ముడు చాలావృద్ధుడు, మరణించాడు. ఆ రోజు ఒక ముదుసలి గడ్డి, పుల్లలు ఏరుకుంటూ అక్కడికి వచ్చింది. ఆమె ఈ యువకుడైన సాధువుకు రెండు రొట్టెలు తినడానికి ఇచ్చింది. అలాగే రోజూ తెచ్చి ఇస్తూ వుండేది. కొన్ని సంవత్సరములు ఇలా గడిచిపోయినవి. ఆ వృద్ధురాలు జబ్బుపడింది. ఆవిడ తన కూతురు (యువతి)ని రొట్టెలు ఆ సాధువుకు ఇవ్వడానికి పంపింది. ఆ సాధువు ఆమెను చూసి 'నీవెవరు? ఆతల్లి ఎందుకు రాలేదు?' అని అడిగాడు. తన పరిచయము తెలిపిన తర్వాత సాధువు 'ఆ అమ్మ వేరుగా వుండేది. నీవు వేరే తరహాగా వున్నావు' నీ వక్షస్థలం ఎత్తుగా ఎందుకున్నది?' అయువతి 'ఇందులో పాలు వుంటాయి. పిల్లలకు పాలు తాగటం కోసం' అని చెప్పింది. అపుడు ఆ సాధువు 'నీకు పిల్లలున్నారా?' అని అడిగాడు. 'ఇంకా నాకు వివాహం కాలేదు. పిల్లలెక్కడి నుండి వస్తారు?' అన్నది. ఆ సాధువు 'ఇపుడు ఇంకా నీకు వివాహము

కాలేదు, అయినా భగవంతుడు పాలకోసం ఏర్పాటు చేసివుంచాడు. పిల్లలు రాకముందే వ్యవస్థ చేశాడు. అదే భగవంతుడు నాకు రొట్టెలు పంపిస్తాడు నీవు రేపటి నుండి రావద్దు' అన్నాడు.

ఆ యాత్రికుడు 'అవశ్యము భగవంతుడు ఆ సాధువుకు రొట్టెలు పంపించివుంటాడు. అదే భగవంతుడు ఈ రోజు నాకు భోజనం పంపించాడు.' అని అన్నారు. ఆ యాత్రికుడు మరల నాకు ఎపుడూ కనిపించలేదు. కానీ అతడి మాటలు నాకు అపుడపుడు గుర్తు వస్తూంటాయి.

బొంబాయి వెళ్ళిన తర్వాత శ్రీకరపాత్రజీగారి విశాలయజ్ఞములో సురక్ష కోసము, విరోధులెవరూ విఘ్నము కలిగించకుండా ఏర్పాటు చూడవలసి వచ్చింది. నేను స్వామి శ్రీకృష్ణానందజీతో సంపర్కము పెట్టుకున్నాను. వారు యజ్ఞభూమిలోనే ఒక విశాల సంకీర్తన-మండపం ఏర్పాటుచేశారు. భగవంతుని చిత్రపటమును స్థాపించారు. ఎంత అందంగా అలంకరించారంటే ఆ దృశ్యం చూడడానికి వేలకొలదీ జనం వచ్చేవారు. వేలకొద్దీ ఉత్తర భారతీయులు ప్రతిదినము కీర్తన చెయ్యడానికి వచ్చేవారు. శ్రీకృష్ణానందజీ వారు తమ ఆసనమును అక్కడనే జమాయించారు. ఎక్కడ భగవన్నామము వుంటుందో అక్కడ భయము వుండదని వారి విశ్వాసము. శ్రీకృష్ణానందజీ గారు చెప్పినంత మాత్రాన ఒక గంటలోనే దాదాపు 5వేల వరకు భక్తులు వచ్చి చేరేవారు. చాలా గొప్ప గొప్ప మహాత్ములు యజ్ఞమునకు వచ్చారు. శంకరాచార్యులు, వల్లభచార్య, శ్రీగిరిధర్మశర్మగారు, పండిత ప్రవరశ్రీ చంద్రశేఖర శాస్త్రి (ఇపుడు వారు పూరి శంకాచార్యులు) మొదలైన వారంతా యజ్ఞమండపమునకు విచ్చేశేవారు. శ్రీకృష్ణానందజీ యొక్క ప్రభావము చూసి అందరూ చకితులయ్యేవారు. భగవన్నామ ధ్వని గగనస్పర్శియై అవభృతస్నాన పర్యంతము మారు మ్రోగిపోయింది.

శ్రీకృష్ణానందజీ, శ్రీ ఉడియాబాబాజీని, శ్రీహరిబాబాజీని సాక్షాత్తు శివుడు, విష్ణువు అని భావించేవారు. వారు ఈ ఇరువురు మహాత్ముల చమత్కారములను కూడా చెబుతూ వుండేవారు. ప్రతి సంవత్సరము హరిబాబాజీ వారి ఉత్సవంలో కలుసుకునేవారు. పూర్తిగా బాధ్యత తీసుకుని నడిపించేవారు. వారు అపుడపుడు

ఎలాంటి ఆశ్చర్యకరమైన చమత్కారములను గురించి చెప్పేవారంటే లోకులకు తొందరగా విశ్వాసము కలుగదు.

స్వామీ కృష్ణానందజీకి, శ్రీహరిబాబాజీ మీద-భగవన్నామము మీద ఎంత శ్రద్ధ విశ్వాసము వుండేవంటే రెండు ఉదాహరణలు చూడండి -

చచ్చిన మనిషీ మళ్ళీ బ్రతికాడు-

బాంధ్‌కి దగ్గర వున్న గంవా అనే ఇలాఖాలో రమేశ్వలాల్ అగ్రవాల్ ఉండేవారు. వారి తండ్రి వారి పుత్రులు అంటే వారి పరివారమంతా కూడా శ్రీహరిబాబాజీకి అనన్య భక్తులు. శ్రీరామేశ్వలాల్‌జీ జబ్బు చేసి మరణించాడు. శవాన్ని ఇంట్లో నుండి తీసుకుని వచ్చి బయటపెట్టారు. శ్రీహరిబాబాజీ అక్కడికి వెళ్ళారు. వెంట స్వామీ కృష్ణానంద్‌జీ కూడా వున్నారు. బాబావారి అనుచరులు ఘంట వాయస్తూ కీర్తన చేశారు. శవం చుట్టు తిరుగుతూ కీర్తన చేశారు. గంటలు గడిచినా సంకీర్తనము ఆపలేదు. ఇంతలో శవము కదిలింది. లేచి కూచ్చుంది, నిల్చుని కీర్తన చెయ్యడం మొదలెట్టింది. రామేశ్వలాల్‌జీ జీవితుడయ్యారు. కీర్తన చేసేవారిలో శ్రీకృష్ణానందజీ కూడా వున్నారు. రామేశ్వలాల్‌జీ పుత్రుడు ధీరేంద్రలాల్‌జీ ఉత్తరప్రదేశ్ పోలీస్ శాఖలో ఒక ఉన్నత పదవిలో వున్నారు.

సరళ విశ్వాసము -

స్వామి శ్రీకృష్ణానంద్‌జీ యొక్క సరళ విశ్వాసమునకు ఇంకో ఉదాహరణ -

'బాంధ్' పైన ఉత్సవము జరిగేటపుడు శ్రీఉడియా బాబా గారితో నేను కూడా అక్కడికి వెళ్ళి వుంటిని. అక్కడ దాదాపు 10, 20వేల మంది చేరారు. ఒక రోజు స్వామి కృష్ణానంద్‌జీ నన్ను దగ్గరికి పిలిచి ఇలా అన్నారు 'పండిత్‌జీ! ఈ రోజు రాత్రి గుప్తరూపంలో పండిత జవహర్‌లాల్ నెహ్రూజీ ఇక్కడికి వచ్చారు. తిరిగి-తిరిగి అంతా చూశారు. ఎవరితోను కలవలేదు. ఇద్దరు బాబాలకు నిశ్శబ్దముగా నమస్కరించి వెళ్ళిపోయారు. నేను ప్రత్యక్షముగా నా కళ్ళతో ఇదంతా చూశాను.' బహుశ కల వచ్చిందేమో, తంద్రావస్థలో చూశారేమో. కాని తను మాత్రం నిజమనే నమ్మేవారు.

నేను తర్కవితర్కము చేయడం మొదలు పెడితే వారు అన్నారు 'నీకు తెలుసా నెహ్రూజీ ఎవరో? ఒక దివ్యపురుషుడు. ఒక గొప్ప సిద్ధ మహాత్ముడు వారి రూపములో జన్మించారు'. 'అదెలాగు?' అన్నాను. వారు అన్నారు, 'మొదట పండిత మోతీలాల్ నెహ్రూగారికి పుత్రులు లేరు. పండిత మదనమోహన మాలవ్యాజీ గారికి మనసులో కూడా ఈ అభావం గుచ్చుకునేది. ఒక సారి వారు మోతీలాల్‌జీని బద్రీనాథ్ వెళ్ళేదారిలో వున్న గరుడ చట్టీకి తీసుకెళ్ళారు. అక్కడ ఒక సిద్ధ సంకల్పుడైన మహాత్ముడుండేవాడు. వారు ఆరవ భూమికలో వున్నారని జనులు విశ్వసించేవారు. వారు స్వయంగా ఎవరితోనూ మాట్లాడే వారుకాద. భక్తులే వారి స్నానపానాదులను చూసుకునేవారు. పండిత శ్రీమదన్ మోహన్ మాలవ్యాగారు 'ఎలాగైన మోతీలాల్ నెహ్రూగారికి ఒక పుత్రుడు కలగాలి వారి వంశము అలా లోపమవడానికి వీలులేదు' అని ఆ మహాత్ముడితో అన్నారు, ప్రార్థించారు. ఆ రోజుల్లో మదన మోహన్ మాలవ్యా గారంటే అందరి మనసుల్లోనూ చాలా ఆదరభావముండేది. అక్కడ వున్న భక్తులు కూడా వారి సంకల్పాన్ని పూర్తి చెయ్యండి అంటూ ఆ మహాత్ముని బలవంతం చేశారు. మహాత్ముడన్నారు 'అరే! తమ్ముడూ! నేను ఎక్కడినుండి తెచ్చేది కొడుకుని! వారి భాగ్యములో పుత్రుడు లేడు.' మాలవ్యాగారన్నారు 'మహరాజ్! మీరు భాగ్యమును కూడా మార్చగలరు. మా కోరికను తీర్చండి. మహాత్ముడు ఇలా అన్నారు, 'దేశంలోని ఒక విశిష్ఠమైన వ్యక్తివి సదాచారివి ఒక కోరికతో నీవు నాదగ్గరికి తీసుకువచ్చావు! కాబట్టి ఇక నేనేవీరి పుత్రరూపములో జన్మిస్తాను!'

కొద్ది రోజులలోనే మహాత్ముడి శరీరము రాలిపోయింది. పండిత్ మోతీలాల్ గారింట్లో జవహర్‌లాల్ నెహ్రూ రూపంలో జన్మించారు. పండిత్ జవహర్ లాల్ గారి దృష్టి విశ్వజనీనమైనది. వారు ఒక దేశం, ప్రాంతం, జాతి, సంప్రదాయకత, వర్గం, భాష మొదలైన సంకీర్ణతలలో ఆబద్ధులు కారు. వారు సిద్ధ పురుషులు. మహాత్ములు అన్ని చెయ్యగల సమర్థులు. చూడండి మరి వారు జన్మించిన తర్వాత నుండి వారి తల్లి శ్రీమతి స్వరూపరాణి ఎంతో దైవభక్తురాలైంది. త్రివేణి (సంగమము)లో నావపైన కూర్చుని భగవన్నామ జపము చేస్తువుండేది.

శ్రీ స్వామి కృష్ణానంద్ ఇలా చెబితే నేనువిని ఆశ్చర్యచకితుడనై వారి సరళ వచనాలను వింటూ వుండిపోయాను. వారి చిత్తములో ఎంత విశ్వాసము!

మూర్తీభవించిన అసంగత -

ఎక్కడైనా సరే అడవిలోగానీ, జనం మధ్యగానీ, ఒక్కలాగ వుండేవారు. ఎన్నోసార్లు చూశాను ఏక్కడైనా ఒక బావి దగ్గర వెళ్ళి కూర్చుండిపోయేవారు. భక్తులే వచ్చి చిన్న పాకవేసి వెళ్ళేవారు. రామాయణ పారాయణ, భగవన్నామ సంకీర్తనము ఉచ్ఛస్వరంతో చేశేవారు. గ్రామీణులు వారి వారి ఇళ్ళ నుండి తయారు చేసిన భోజనాలు తెచ్చుకునేవారు. స్వామీజీ అందరికి పంచి తినిపించి, తనుతినేవారు. వారి మనసుల్లో జీతి, మత బేధముండేది కాదు. పాపికానీ, పుణ్యాత్ముడుకానీ, శూద్రుడు కానీ, బ్రాహ్మణుడు కానీ అందరికీ నమస్కరించేవారు. అందరిలోను భగవంతుడే. అన్ని రూపాలు భగవంతుడివే. ఎవ్వరితోనూ రాగద్వేషాలు లేవు. సద్భావ నిధి లాగవుండే వారు. అందరిని ప్రశంసించేవారు, కానీ ఎవరినీ నిందించేవారు మాత్రం కాదు. నింద వినేవారు కూడా కాదు. భగవంతుడి పట్ల అచంచల విశ్వాసము వుండేది.

ప్రతి సంవత్సరము మకర సంక్రాంతికి ప్రయాగ చేరుకునేవారు. ఒక నెల రోజులుండేవారు. అక్కడ గంగా స్నానం చేసిన రోజు చేసేవారు లేని రోజు లేదు. ఏర్పాట్లు ముందే ఏమీ చేసుకునేవారు కాదు. వారి భక్తులు వచ్చేవారు. భగవన్నామ సంకీర్తన, అందరి భోజనాలు అన్నీ మొదలయ్యేవి. సమాధిలో, ధ్యానంలో కూర్చునే వారుకాదు. వైరాగ్య ప్రదర్శన కూడా చేశేవారు కాదు. తను ఎవరి పూజను స్వీకరించేవారు కాదు. అందరి యెడల సమభావము, సద్వ్యవహారము, ఆదరము చూపించేవారు. అంత జనమధ్యంలో వున్నా కూడా మూర్తీభవించిన 'అసంగుడి లాగ వుండేవారు. ఇప్పుడు అలాంటి సత్పురుషుల దర్శనము దుర్లభము.

దండీ స్వామి శ్రీ కృష్ణానంద సరస్వతి

(కైవల్యధామ్, కాశీ)

మాన్యులెవరు?

శ్రీ విష్ణు సహస్రనామములలో వరుసగా భగవంతుడివి మూడు పేర్లు వస్తాయి- అమానీ, మానదః, మాన్యః భృగుమహర్షి భగవంతుడి వక్షస్థలముపైన పదాఘాతము చేశాడు. భగవంతుడు వెంటనే లేచి ఋషి చరణాలను సంవాహనము చేయ మొదలెట్టాడు 'మీ చరణములు ఎంత సుకుమార సుకోమలమైనవి. ఎక్కడయిన దెబ్బ తగలలేదు కదా?!' అని అన్నారు. స్వయంగా తనకు జరిగిన అవమానమును మరచి ఋషిని ఇంత గౌరవించడం! - ప్రభువు యొక్క అచింత్య కల్యాణగుణము! ఎంతటి అద్భుతం! ఇదే కారణముగా వారు ముల్లోకాలలోను అందరి కంటే అధిక ఆదరణీయులైనారు. దీనివల్ల సాధారణ జనులకు నేర్చుకోవడానికి ఒక శిక్షణ! స్వయంగా అహంకారం వుండకూడదు. ఇతరులను ఆదరించవలెను. అలాంటి గుణ సంపన్నుడైన వ్యక్తి ఏ లోకములోనైనా మాన్యుడవుతాడు. ఆదరింపబడతాడు.

పైన చెప్పబడిన ప్రవచనము స్వామీ కృష్ణానంద సరస్వతి వారిది. స్వనామ ధన్యుడైన శ్రీలక్ష్మణ శాస్త్రి ద్రవిడ (పండితరాజ రాజేశ్వర శాస్త్రిగారి తండ్రిగారు) చాలా మందితోపాటు స్వామి వారి ఈ ప్రవచనము విన్నారు. వారు స్వయంగా సంస్కృతములో వ్రాసిన ఒక వ్యాసములో ఈ విషయము పేర్కొన్నారు.

వైదుష్యము-

శ్రీస్వామీ కృష్ణానంద సరస్వతి ఎవరు? అంటే నేను వారిని చూడలేదు. నేను

పుట్టకమునుపే విక్రమనామ సంవత్సరం 1965 మార్గశిర శుక్ల ద్వితీయమునాడు వారు బ్రహ్మలీనులైరి. నా అధ్యయన కాలములో పండిత-సమాజములో వారి అఖండ ప్రతిభ, అఖండ పాండిత్యము, ఉజ్వల చరిత్ర, త్యాగ-వైరాగ్యములు, వారి నిర్భయతను గురించి చర్చ జరుగుతూ వుండేది. ఆ రోజుల్లో సంస్కృత విద్వాంసులలో ఈ చర్చ జరుగుతుండేది - శ్రీ శివకుమార శాస్త్రి యొక్క గురువు శ్రీ బాల - శాస్త్రిగారు, మరి వారి గురువ శ్రీరాజా రామశాస్త్రి వారి పాండిత్య ప్రతిభల పట్ల ముగ్ధులయ్యేవారు. పండిత-మండలిలో వారిని ఎపుడూ ప్రశంసిస్తూండేవారు. ఒకసారి ఇలా జరిగింది ఎవరో ఒక ప్రసిద్ధుడైన విద్వాన్ వేద విరుద్ధమైన ఒక వ్యాసం వ్రాసి దానిపైన శ్రీబాలశాస్త్రిగారి హస్తాక్షరం తీసుకున్నారు. కానీ శ్రీ స్వామీ కృష్ణానంద్‌జీ దానిన ఖండిస్తూ వ్రాసి శ్రీబాలశాస్త్రిగారికి చూపించారు, వినిపించారు. శాస్త్రిగారు ఆ వ్యాసమును గురించి చాలా ప్రశంసచేసి దానిపైన హస్తాక్షరము చేసి ఇచ్చారు. శ్రీస్వామీజీవారి వేదాంత చింతన అనుపమానమైనది. వారు భగవాన్ శ్రీ ఆది శంకరాచార్యుల వారి సిద్ధాంతమును ఒక్కొక్క అక్షరము శృతి సర్వస్వమని నమ్మేవారు. దాన్ని సమర్థించడానికి అనుభవ-రసముతో ఓతప్రోతమైన ఎన్నో యుక్తులను వందలాదిగా చూపెట్టేవారు. వారి పాండిత్యము ధన్యము! వారి ప్రతిభ ధన్యము!

ఇక ఇపుడు వారి పవిత్రమైన విచిత్ర చరిత్రమును వినండి -

జన్మ -

స్వామీజీ 1885వ సంవత్సరంలో కర్ణాటకములోని ఒక చిన్న గ్రామమయిన 'పంపా'లో జన్మించారు. వీరు పూర్వజులు కూడా గొప్పగొప్ప మహానుభావులున్నారు. వారిలో ఒకరు సాయందేవుడు. శ్రీదత్తాత్రేయ అవతారమని ఖ్యాతిగాంచిన, అనేక ప్రౌఢ గ్రంథములను రచించిన శ్రీ స్వామి నృసింహ సరస్వతిగా నలుగురు పట్ట శిష్యులలో ఈ సాయందేవుడు ఒకరు. వారి ప్రతిష్ఠ, విద్య, ప్రతిభ, సిద్ధి అందరికి తెలిసినవే. స్వామీ కృష్ణానందజీ పితామహుడు శ్రీరాయభట్టుగారు వీరు కుమశీకరపు రాజుకి గురువు. స్వామీజీ పితామహి పితామహుడితో పాటు సహగమనము చేసినది. అటువంటి ధర్మప్రాణులు వారు. స్వామీజీ వారి తండ్రిపేరు రాముడు. తల్లిపేరు

జానకి. తల్లికి జయ అన్న పేరు కూడా వుండినది. తల్లి అత్యంత పతి-పరాయణురాలు. వీరే స్వామీజికి జన్మనిచ్చారు.

అధ్యయనము అంటే ఉత్సుకత మెండు -

బాల్యావస్థలో ఆయన పుట్టిన వూర్లో, తన శాఖకు చెందిన వేదాధ్యయనము ముగించి, సిద్ధాంతకౌముది, ఆదివ్యాకరణ గ్రంథాలను అధ్యయనము చేయసాగారు. పదునాలుగు సంవత్సరముల వయసు వచ్చేటప్పటికి వారికి అక్కడి శాస్త్రాభ్యాసము అయిపోయినది. ఇక అక్కడి అధ్యయనము, అధ్యాపనముతో తృప్తి కలుగలేదు. వారి మనసులో అధికంగా శాస్త్రఅధ్యయనము చేయవలననే ఉత్సుకత మిక్కుట మయింది. ఏం చెయ్యాలి? ఎక్కడికి వెళ్ళాలి? తల్లి దండ్రుల ఆజ్ఞ దొరకడము సంభవము కాదు. అలాంటపుడు 'కాశీ' వెళ్ళాలన్నా ఎలా వెళ్ళాలి? కానీ శాస్త్ర అధ్యయ నము పట్లవున్న ఆ ఉత్కంఠ వారిని అక్కడ ఎక్కువ రోజులు ఆపలేకపోయినది. వారు తల్లితండ్రుల అనుమతి తీసుకోకుండానే కాశీకి బయలుదేరారు. జ్ఞానపిపాశులు, జిజ్ఞాసులు, ధర్మాన్ని, ధర్మశాస్త్రాన్ని కూడా మించిపోతారు. నిరంతర గంగాతరంగ చుంబితమైన విశ్వనాధుడి రాజధానియైన వారణాసి క్షేత్రము విద్యలకు పుట్టినిల్లు. అక్కడ విద్వాసుల అనాది పరంపర కలదు. విద్యానులు వేద శాస్త్రములలో నిష్ణాతులు. అక్కడి సందు గొందులలో కూడా సరస్వతి దేవి యొక్క ఉల్లాసమయ నృత్యము, చూడగలము వినగలము.

ఈ బాలక-చూడామణి కర్ణాటక నుండి కాశీ వచ్చిన సమయములో అక్కడ చాలా గొప్ప గొప్ప విద్వానులు విరాజమానులై వుండేవారు, మహా మహోపాధ్యాయ శ్రీ శివకుమారశాస్త్రిగారి గురుదేవులు శ్రీబాలశాస్త్రిగారు, వారి గురువులైన శ్రీరాజా రామశాస్త్రిగారు వుండిరి. వీరు వారణాసి రాజకీయ, సంస్కృత మహా విద్యాలయములో ప్రధానాధ్యాపకుడుగా వుండిరి. స్వామీ కృష్ణానందజీ, శ్రీ బాల శాస్త్రి గారి వద్ద అధికాంశము శాస్త్ర అధ్యయనము చేశారు. వారి నవనవోన్మేషశాలిని ప్రతిభ రోజు రోజుకి ప్రస్ఫుటమవుతూ వుండేది. శ్రీబాల శాస్త్రిగారు వీరి అద్భుత-ప్రతిభను చూసి నీవు బృహస్పతితో సమానమైన మేధావివి. ప్రతిభాశాలివి అయిన నీవు మా

గురుదేవులైన రాజారామశాస్త్రి గారివద్ద శాస్త్రరహస్యములను తెలుసుకో, ఎందుకంటే అటువంటి ప్రతిభ కేవలం పాణిని, పతంజలి, గౌతముడు, కపిలుడు, మొదలయిన వారిలోనే వుంటుంది. నీవు మా గురుదేవుల వద్ద అధ్యయనము చేస్తే అధీత-అనధీత మయిన అన్ని శాస్త్రములు నీకు కరతలామలకములయి, వాటి తాత్పర్యములను అర్థములను ప్రకాశింపజేస్తాయి. నిజంగా బాలశాస్త్రి గారిదెంత ఉదారత! సరళత! నిరభిమానత! మరియు వారి గురుభక్తి ప్రశంసనీయమైనది! ఆదర్శవంతమైనది! తన దగ్గరున్న విద్యార్థిని మరియొకరి దగ్గరికి అధ్యయనము కోసం పంపడమనేది సామాన్యమైన మాట కాదు. ఈ బాలశాస్త్రిగారే కాశీలోని ప్రఖ్యాత విద్యాంసులైన శ్రీశివకుమార శాస్త్రి, శ్రీ తాంత్యాశాస్త్రి, శ్రీదామోదర శాస్త్రి, శ్రీగంగాధర శాస్త్రి మొదలైన వారి గురుదేవులు.

ఈ యువక-చూడామణి శ్రీరాజారామశాస్త్రి గారివద్ద అధ్యయనము చేయసాగాడు. వారు ఏ శాస్త్రమునైనా ఒక కథలాగ తెలియజెప్పడంలో సమర్థులు. పరిష్కారములో వారి పటుత్వం అత్యంత శ్లాఘనీయము. వారిని గురించి ఒక మాట చాలా ప్రసిద్ధి కెక్కినది అది - వారు ఒకసారి మహారాజాధిరాజు ప్రార్థించడము వలన నేపాల్ వెళ్ళారు. నేపాల్‌లో చాలా గొప్ప గొప్ప విద్వాంసులుండేవారు. శాస్త్రార్థములో వారిపైన విజయము పొందినవారికి సర్వోత్తమ పదవిని ఇచ్చేవారు. అభ్యాగతులు వారు ఏఏ శాస్త్రములలో శాస్త్రార్థము చేస్తారో అది నగాడా మోగించి చెప్పవలసివచ్చేది. పండిత ప్రవరుడైన శ్రీరాజా రామ శాస్త్రిగారు చతుర్దశ శాస్త్రముల దృష్ట్యా నగాడాను మ్రోగించారు, మరల మరల చలా సేపటి వరకు మ్రోగిస్తూనే వున్నారు. 'పండిత్‌జీ! మీ అభిప్రాయమేమిటి?' అని రాజు గారు అడిగారు. నేను సకల శాస్త్రాల శాస్త్రార్థము కూడా చేయగలను. మరియు అఖాడాలో మల్లయుద్ధము కూడా చేయగలను. నిజంగానే వారు హృష్ట, పుష్ట, బలిష్ట దేహము కలిగిన అద్భుత శక్తి శాలికూడా. వారు శాస్త్రార్థములో విజయులైనారు. మల్లయుద్ధంలో కూడా విజయులైనారు. వారికి అక్కడ సర్వోత్తమ విద్వానులు అన్న సత్కారము లభించినది. వారే చాలా ప్రేమగా ఈ యువ-చూడామణికి సమగ్రశాస్త్రముల అధ్యయనమును, తాత్పర్యమును గ్రహింపజేశారు.

<u>వైరాగ్యము -</u>

ఈ యువక-చూడామణి తల్లితండ్రులు కొడుకు ఇంత గొప్ప పండితుడైనాడని విని వారిద్దరూ కాశీ వచ్చారు. ఇంటికి వచ్చి వివాహము చేసుకొమ్మని కోరారు. కానీ వీరికి కాశీ అంటే ఎంతో శ్రద్ధాభక్తులు. ఇంటికి మరలడానికి నిరాకరించారు. ఇక వివాహమంటే వీరికి మొదటే ఇష్టము లేదు. సాంసారిక భోగములయందు వారికి అతిశయమైన విరక్తి! సాంసారిక బంధనాలలో ఎంతటి దుఃఖము కలదో వారెరుగుదురు. భోగమే రోగముగా పరిణమిస్తుంది. ఎదుటి వాడిలోని ఆధిక్యత చూసి తాపము కలగవచ్చు. భోగాధిక్యత వలన మరల మరల వాటి సంస్కారములే బలపడతాయి. భోగవాసనలు ఎక్కువైతే అశాంతి ఎక్కువవుతుంది. భోగాసక్తి వలన ఇతరులకు అన్యాయము కలుగవచ్చు. భోగకౌశలము ఎక్కువై రాగ-అనురాగములలో కొట్టుకుపోయి ఇక మనిషి ఎప్పటికీ వీటి నుండి విముక్తుడయ్యేను! ఇలా అనుకుని యువ-చూడామణి తండ్రి ఆజ్ఞను ఒప్పుకోలేదు. వివాహమాడ నిరాకరించారు. ఆ తల్లిదండ్రులకేమో కొడుకు పై అత్యధికమైన ఆసక్తి వుండేది. ఇక వారు కూడా కాశీలోనే వుండిపోయారు. నీవు ఇంటికి రాకపోతే. మేము ఇద్దరమూ ఇక్కడనే వుంటాము. ఒకవేళ నీవు సన్యసించాలను కుంటే మావి రెండు మాటలు వినాలి. ఒకటి కాశీలో ఒక దేవాలయము నిర్మించాలి. ఇంకొకటి నీవు అటువంటి ఒక గ్రంథ రచన చేయాలి. దేనివలన సదా నీ యశస్సు అనే సంతానపరంపర కలుగుతుందో అలాంటి గ్రంథ రచన చెయ్యి! అని వారి తండ్రిగారన్నారు. తల్లిదండ్రుల ఈ మాటలను వారు ఒప్పుకున్నారు.

<u>గీతాసార-సంక్షేపము -</u>

శ్రీకృష్ణానంద సరస్వతిజీ విక్రమనామ సంవత్సరం 1950లో గోదావరి నదీ తరంగాలతో తరంగాయమైన నాసిక క్షేత్రములో నివసించారు. అక్కడ జిజ్ఞాసువుల కొరకు గీతా సారసంక్షేపము ఈ విధముగా ప్రస్తుతిచేశారు -

గీతా ప్రథమ అధ్యాయములో జగదేక వీరుడైన పార్థుడి సాధన - సంపాదన యొక్క వర్ణన వున్నది. వారి వివేకము జాగృతమైనది. రాజ సుఖము, భోగముల

యందు లాలసలేదు. ఆత్మ దేహాతిరిక్తమని తెలుసుకుని, సంసార-వ్యవహారముతో భిన్నుడై ధనుర్బాణములను త్యజించాడు. నిజంగానే అటువంటి వివేక విచార సంపన్నుడయిన నరుడికి నారాయణుడే సారథి అవుతారు.

ద్వితీయ అధ్యాయము ఆరంభములో అర్జునుడు శ్రీకృష్ణుడి సముఖంలో ఎంతో శిష్టతతో స్పష్టంగా చెప్పేశాడు. నాకు ప్రేయము వద్దు, శ్రేయము కావాలి అని. శ్రేయము యొక్క సాధన సాధ్యముల విషయంలో తన కార్పణ్యతని, మోహాన్ని అంగీకరించి శ్రీకృష్ణ శరణాగతిని కోరినాడు. సర్వతోభావేన శ్రీకృష్ణుడి యందు ఆత్మ సమర్పణము చేయడం వలననే తనకు లక్ష్యం ప్రాప్తిస్తుందని అర్జునుడు తన దృఢమైన నమ్మకాన్ని ప్రకటించాడు.

శ్రీకృష్ణుడు గీతను ముగించేముందు అర్జునుడి సర్వ ధర్మ పరిత్యాగ పూర్వకమైన, ఏకమాత్రమైన, స్వశరణాగతినే ఉపదేశించారు. స్వధర్మాన్ని పరిత్యజించడమెట్లు అన్నదే ప్రశ్న! అధర్మ త్యాగాన్ని శాస్త్రము చెబుతుంది. కానీ ధర్మ త్యాగము? ఇది ఒక విలక్షణమైన విచక్షణమైన ఉపదేశము. దీని బీజము, మూలము ఏమిటి? ధర్మము ఏదయినా దానికి కర్త, క్రియ, ఫలము వుంటుంది. ఈ విధముగా ధర్మానుష్ఠానములో సంసార ప్రవాహము అక్షుణ్ణముగా ఉంటుంది. మొదలు కూడా వుండినది. ముందు కూడా వుంటుంది. ఎవరికైతే అంతిమ జన్మ అవుతుందో వారి కొరకు ఈ ప్రవాహము సమాప్తమయిపోతుంది. అనాత్మనే త్యాజ్యము. ఆత్మకాదు. ఆత్మయే శరణము. అధిష్ఠాన చేతనమే ఆత్మ. అనాత్మకాదు. ఆత్మ సత్యము వీటిని త్యజించగలమా లేదు లేదు. అది సరే అపుడు ఏది లేదో దాన్ని త్యాగము చెయ్యడమా? అదెలాగు? శుక్తి - రజత త్యాగము వంద్యా పుత్రుల సంబంధ త్యాగము? ఇది ఉపహాసాస్పదము. ఇక ధర్మ-పరిత్యాగము, స్వశరణాగతి ఈ మాటల కర్థమేమిటి? అది ఏమిటంటే ఏదైతే వంద్యా పుత్ర సమానమైన అసత్తువున్నదో మృగతృష్ణ జలములాగ, ఆకాశపు నీలిమలాగ దానికి జననంలేదు మరణంలేదు భావము, అభావము లేదు. అది సరే-అపుడు సన్మాత్రమైన ఆత్మ దానికి భావాభావమున్నదా? జననమరణములున్నవా? అదే నండి బాబూ! అది భావాభావములకు జనన మరణములకు అధిష్ఠానమైన స్వరూపచైతన్యమే అది. ఇపుడు చెప్పండి దేనిని త్యాగము చెయ్యాలి? కేవలము

నిత్య పరిత్యక్తము యొక్క పరిత్యాగ జ్ఞానము (బాధ్) నిత్యశరణుడికి శరణాగతి, అశరణాగతి యొక్క భ్రమ నివృత్తి - నిత్య నివృత్తి యొక్క నివృత్తి. ఇదే జ్ఞాన స్వరూపము యొక్క జ్ఞానము. అపుడు సర్వధర్మ పరిత్యాగములోని రహస్యము తెలిసిపోతుంది. ఉపదేశమాత్రముననే కృతార్థత కలిగినది.

అర్జునుడు స్వీకరించాడు, ఓహో! అజ్ఞానమెక్కడ వున్నది? నష్టము! అదృష్టము! నాకు ఎక్కడా కనిపించడములేదు. స్మృతి! అది ఎక్కడ లభించింది? పూర్వలబ్ధమే కదా? మిథ్యాప్రపంచములో సంశయమేల? నిత్య - శుద్ధ - బుద్ధ - అద్వితీయ సాక్షాత్ అపరోక్ష ఆత్మలో సంశయమెక్కడ? సరే! సూర్యకిరణముల జల ప్రవాహము (మృగతృష్ణ) ప్రవహించనీ! దానిని ఆపవలసిన ఆవశ్యకత యేమున్నది? మంచిది కృష్ణా! ప్రియమిత్రమా! సారధి నీవు ఎలా చెబితే అలాగే చేస్తాను. ఇక ఇపుడు గురుదేవుల ఆజ్ఞాపాలనలో ఏ విధమైన సంకోచము లేదు.

ఇది చతుః శ్లోకీ - గీత - 1.కార్పణ్యదోషోపహతః స్వభావః, 2.సర్వధర్మాన్ పరిత్యజ్య, 3.నాసతో విద్యతే భావః, 4.నష్టో మోహః స్మృతిః లబ్ధ్వా - ఇది నాసిక్ క్షేత్రములో వారు చేసిన ప్రవచన జ్ఞానము యొక్క శ్రేష్ఠ స్వరూపము.

స్వామీజీ స్వయంగా విచక్షణుడు. వారి తెలివి తేటలు విలక్షణమైనవి, సూక్ష్మమైనవి, వస్తు గ్రాహ్యములు. కాశీలోని పంచ గంగా ఘాట్‌లో సాయంకాలం విరాజమానులయ్యేవారు. కొంత మంది జిజ్ఞాసువులు గుమిగూడేవారు, వారిలో కాశీలోని పెద్ద పెద్ద దురంధరులైన విద్వానులు కూడా వుండేవారు. స్వామీజీ విద్యానులకు కూడా అశృతపూర్వమైన (కనివినీయెరుగని), కల్పనాతీతమైన భావములను తెలియజెప్పేవారు. తెలియజెప్పే విధానము అత్యంత సరళము, గంభీరములైన అభిప్రాయములను తేట తెల్లం చేసేటటువంటిది.

ఉదాహరణకు -

వారు చెప్పినదేమిటంటే భగవాన్ శ్రీకృష్ణుడు చెప్పిన జ్ఞానము యొక్క స్వరూపమేమిటి? అద్వైత బ్రహ్మవాదమా? భేద బ్రహ్మవాదమా? లేక దేహ బ్రహ్మవాదమా? లోక వ్యవహారములో ఈ మూడు విధాలు కన్పిస్తుంటాయి. చార్వాక,

సౌగత, అర్హత మొదలైన స్థూల, సూక్ష్మాది దేహమునే తత్త్వమని నమ్మేవారు. కొందరు భూత చతుష్టయ పర్యవసానమైన ద్రవ్య ప్రధానము కొందరు దర్శ-పర్యవసాయమైన ఆత్మ తత్త్వము యొక్క సంకోచ, విస్తారములను నమ్మేవారు. మరి కొందరు కాల - పర్యవసాన తత్త్వము యొక్క క్షణికత, శూన్యత తెలిసినవారు. వస్తుతః ఇదంతా దేహ - తత్త్వము యొక్క వివిధ పరికల్పనలు మాత్రమే. 'గీత' యొక్క దృష్టి వీటిని ఏ శ్రేణిలో పెట్టవలసి వస్తుంది? వస్తుతః ఇవన్నీ తామస-జ్ఞాన కక్ష్యలోనే (తరగతి) వుంటాయి. పరిచ్ఛిన్నతా మరియు వినాశము కార్యముననే జరుగుతుంది. భగవాన్ శ్రీకృష్ణుడు అన్నారూ...

యత్తు కృత్స్నవదేకస్మిన్ కార్యే సక్తమహైతుకమ్ ।
అతత్త్వార్థ వదల్పం చ తత్తామసముదాహృతమ్ ॥

జ్ఞానమంటే ఏమిటి? శృతి, స్మృతి, యుక్తి మొదలైన ప్రమాణాలు లేకపోయినా ఒక కార్యరూప పరిచ్ఛిన్నతలోనే ఆసక్తమై పోవడమా? ఇది ఆ బాధిత తత్త్వమును స్పర్శించలేదు. అల్పగ్రాహి. అందుకని తమోగుణి.

భేదగ్రాహ్యమయిన జ్ఞానము రాజస జ్ఞానము. అది ఒక కార్యములో ఆసక్తము కాదు, కానీ భిన్న భిన్న వస్తువుల యదార్థతా దర్శనములోనే సంలగ్నమైనది. ఇది భూమి, ఇది జలము, ఇది అగ్ని, ఇది సామాన్యము, ఇది వేశిషము, పదార్థములు ఏడు లేదా పహారా? ఇరవైఆరా? లేదా 33నా? 24గా, లేక 25 లేక 26? ప్రకృతి వున్నదా లేదా వికృతి వున్నదా? ప్రకృతి-వికృతి : పురుషుడు అనేకులు. కర్త కర్మ కర్మఫలము వివిధములు. ఎక్కడ ద్వైతంలో ఇరుక్కున్నామో అక్కడ రజోగుణము వెల్లివిరిసింది. అపుడు జ్ఞానము కూడా రజోగుణి అయింది. ఈ జ్ఞానము శ్రీకృష్ణుడికి అభీష్టము కాదు. అది మాత్రం నిశ్చయము తమో గుణ జ్ఞానం దూరము నుండే పరాస్తమయినది. ధ్యానపూర్వకముగ చదవండి -

పృథక్త్వేన తు యజ్జ్ఞానం నానాభావాన్ పృథగ్విధాన్ ।
వేత్తి సర్వేషు భూతేషు తజ్జ్ఞానం విద్ధి రాజసమ్ ॥

ఇందులో (న్యాయ, వైశేషికము, సాంఖ్యము, యోగము, పూర్వ మీమాంస

అన్ని వర్గాలు వచ్చేస్తాయి. మూడవ జ్ఞానము సాత్వికము. ఇది శ్రేష్ఠ జ్ఞానము. గీత యొక్క ప్రతిపాద్య జ్ఞానము, మరియు శ్రీకృష్ణుడికి అభీష్టమయిన జ్ఞానము. ఇది ఏమి? దీని ద్వారా ఏమి తెలుస్తుంది? ఏమి అనుభవం కలుగుతుంది? ఈ జ్ఞానము ద్వారా అన్ని భూత-భౌతిక పదార్థములలోని ఒక అద్వితీయ అధిష్ఠాన రూపవస్తువు యొక్క సాక్షాత్కారము కలుగుతుంది. దాని మిథ్యాత్వము ఎప్పటికీ నిశ్చయము కాదు అంటే అవ్యయము. ఈ దృశ్య ప్రపంచము విషయము, కరణము, దేవత, జీవుడు అని విభక్తమయినది. కానీ జ్ఞాన తత్త్వము అవిభక్తమయినది. దానిలో విభాగము లేదు. 'వాసుదేవ స్వరం' యొక్క పూర్వవర్తి. చూడండి -

సర్వ భూతేషు యేనైకం భావమన్యయమీక్షతే ।
అవిభక్తం విభక్తేషు తజ్ఞానం విధి సాత్వికమ్ ॥

జ్ఞానం ప్రకాశకము, ఏకము, అధిష్ఠానము. అవ్యయము, అబాధితము, అవిభక్తము, అంటే విభాగము, భేదము మిథ్య. శంకరాచార్యులవారికి జయమగుగాక! ఉపనిషత్తులు, గీతా, బ్రహ్మసూత్రములు వారి వాక్కులోనే పలుకుతున్నాయి. శాక్తులు, శైవులు, గాణపత్యులు, సౌరులు, వైష్ణవులు అందరూ ఈ భావాత్మక అద్వైత ఉపాసకులే. శంకర పరమార్థ అద్వైత బోధకములో ఇదే గీతయొక్క పరమ సిద్ధాంతము. దీనిదే ఈ సంగీత (గీత) -

'తదేకో౽విశిష్టః శివః కేవలో౽హమ్, విశ్వం దృశ్యమాన నగరీ తుల్యం ।' ధన్యము! ధన్యము!! ఇందులో ఈ జ్ఞానములో దేనిలోనైతే తామస రాజస మరియు సాత్వికతా భేదములు కూడా అభేదము యొక్క బోధకములే.

గీతయొక్క తాత్పర్యము -

సరే! ఈ సంగతి కూడా గమనించండి.

పరమార్థ తత్త్వమును తెలుసుకున్న తర్వాత పునఃమోహము కలుగదు. అంటే అర్జునుడికి కలిగిన మోహము అజ్ఞానమూలకమయినది. అజ్ఞానం వలన ఏ జ్ఞానము లభిస్తుందో అది మిథ్య, మరి జ్ఞానము వలన దేని నివృత్తి కలుగుతుందో అది కూడా మిథ్యయే. జ్ఞానం వలన కలిగేదేమిటి? అన్ని ఉత్పత్తి వినాశశీల పదార్థములు

కూడా ఆత్మలోనే కనిపిస్తాయి. 'భూతాని అశేషేణ ఆత్మని ద్రక్ష్యసి.' ఇపుడు నిన్ను నీవు దేహములో చూచుకుంటావు. జ్ఞానము కలిగిన తర్వాత దేహమును నీలో చూచుకుంటావు. దేహము వలన ఆత్మ ప్రకాశింపబడదు. ఆత్మ వలన దేహము ప్రకాశింపబడుతుంది. కేవలము దేహమే కాదు, సమగ్ర ప్రపంచము కూడా, ఇది ఏమి ఆశ్చర్యము! 'దహర' అంటే హృదయముతో అవిచ్ఛిన్న - చైతన్యములోనే ఈ సమస్త ఆకాశాది ప్రపంచము భాసమానమవుతూ వుంది. అందులోనే దాని వలననే స్పందనమైనదేదయితే వున్నదో, ఉదయాస్తశీల మయినదేదయితే వున్నదో అది అంతా కూడా దృశ్యమే అది స్వయంగా దాని బలంతో లేదు. ద్రష్ట యొక్క దృష్టి, అందు వలన దృశ్యమునుకు స్వతంత్ర సత్తా లేదు. అది పరతంత్రము. జననమరణముల కారణముగా ఎవరైతే ద్రష్టలో అనేకతవున్నదని కల్పన చేస్తారో వారు దాని స్వరూపముతో అనభిజ్ఞులు. కనురెప్పలతో సమానంగా లేస్తూపడుతూ వున్న ప్రపంచము దృష్టి యొక్క - కొన మీదే ఊగుతున్నది.

అయితే రండి! ఈ తత్త్వమును పొందండి. దీనిని పొందుట వలన లాభమేమి? అనాది కాలము నుండి సంచితమయిన కర్మ-కోటి యొక్క సత్తానే లేకుండా పోతుంది. క్రియమాణము దృష్టము-నష్టము. ప్రారబ్ధము కూడా భస్మీ భూతము. ఆ! భస్మమును ధరించవచ్చును. అది భాసిస్తుంది. జ్ఞానము యొక్క మహిమను తెలుపుతుంది. బ్రహ్మసూత్రములు పూర్వార్థము యొక్క వినాశము ఉత్తరార్థము యొక్క ఆశ్లేషమును తెలుపుతాయి. యాజుష శృతి ఇలా చెబుతుంది, 'జ్ఞానీ పురుషుడికర్మ ప్రభావంతో పెరగడు, తరగడు, అసలు అక్కడ కర్మ ఎక్కడుంది? ఈ కారణం వలననే తత్త్వజ్ఞుడు పాపి కంటే పాపియైన వాడిని కూడా జ్ఞాననౌకపై ఆరూఢమవమని ఆహ్వానిస్తుంది. 'అపి చేదసి పాపేభ్యః' దీని వలన నిష్కర్ష ఏమిటంటే సాత్విక జ్ఞానము (అభేద జ్ఞానము) ఆత్మ, బ్రహ్మ యొక్క భేదజ్ఞాన భ్రాంతిని నివారిస్తుంది. ఇదే గీత యొక్క సిద్ధాంతము.

స్వామి కృష్ణానంద సరస్వతి గారు తన వ్యాఖ్యానములో శాస్త్రార్థమును ప్రాచీన పరంపరను అనుసరించియే నిరూపణము చేశేవారని ఏమీ లేదు. అపుడపుడు వారు తమ నవనవోన్మేషశాలిని ప్రతిభతో అపూర్వమైన అర్థమును ఆవిష్కరింప

జేశేవారు. దీనికోసం చూడాలనుకుంటే 'గీతార్థ-పరామర్శ' అన్న వారి గ్రంథము చూడవచ్చు. ఏ ఉద్దేశ్యముతో శాస్త్రము ప్రవృత్తమయినదో అదే దాని తాత్పర్యము. అటువంటప్పుడు అదే దృష్టి కోణముతో గీతార్థమును నిర్ణయించవలెను. ధర్మరాజ్యము ఉండాలి. ధర్మప్రేమి అయిన అర్జునుడికి విజయము కలగనీ! శ్రీకృష్ణుడి సహాయముతో ధర్మప్రేమి అయిన అర్జునుడికి అటువంటి లౌకిక వ్యవహార జ్ఞానము ప్రాప్తించనీ, దేని మూలము తత్త్వజ్ఞానమో లోకవ్యవహారము యొక్క మూలము నీతి! వున్న సమస్యలను పరిష్కరిస్తూ లక్ష్యసిద్ధి కొరకు చేసే యుక్తినే నీతి అంటారు. నీతియే యోగము. శ్రీకృష్ణుడు అన్నాడు 'అర్జునా! లెమ్ము! యోగమును ఆశ్రయించుము'. 'యోగమాతిష్ఠోత్తిష్ఠ' ఇక్కడ యోగశబ్ధము యొక్క అర్థము పతంజలి మొదలయినవారు చెప్పిన యోగమని ఎలాగ అనుకుంటాము? పతంజలి యోగము యుద్ధసాధనము కాదుకదా! కాదు కాదు! ఇక్కడ యోగమంటే అర్థము 'నీతియోగము'. ఎందుకంటే 'నీతి'ని అనుష్ఠించడము వలననే జయము కలుగుతుంది. దుష్ట నిగ్రహము జరుగుతుంది. పూర్వాచార్యులు యోగ శబ్ధమునకు భిన్న-భిన్న స్థలములలో భిన్న-భిన్న అర్థములు చెప్పారన్న దాన్లో సందేహములేదు. అవన్నీ కూడా యదార్థమే. కానీ గీతయొక్క విశిష్ఠ అర్థము వాటి వలన బోధపడదు. భగవాన్ శ్రీకృష్ణుడి వాక్యములు కాల్పనికముకాదు. అవి ఉపనిషద్రూపములు, వేద రహస్యములు 'గీత'ను బ్రహ్మవిద్య అని చెప్పడంలో అభిప్రాయమేమిటంటే, ఎవరు బ్రహ్మ విద్యను పొందలేరో, వారికి ధర్మ సంస్థాపనాధికారము లేదు. ఎవడు నీతిజ్ఞుడుకాడో వాడికి విజయప్రాప్తి యొక్క అధికారము కూడా లేదు. అందువలనే 'గీత'లో యోగ శబ్ధములకు అర్థము 'నీతి'అని 'యుక్తి'అని. గీతాశాస్త్రము అంటే బ్రహ్మ విద్యా మూలకమైన నీతి శాస్త్రము. నిశ్చయముగా తెలుసుకోండి, నీతి కూడా 'బ్రహ్మ' సమానముగా గంభీరమైనది. అందువలన భగవద్వచనాలను ఆశ్రయముగా తీసుకుని అర్జునుడు జయమును పొందగలిగాడు. 'యత్పరః శబ్దః స శబ్దార్థః' అర్జునుడి యుద్ధవిముఖతను దూరం చెయ్యడానికి గీత ప్రవృతమయినదననది నిశ్చయమే. దీని తాత్పర్యము అదే. 'సర్వధర్మ పరిత్యాగ' ప్రసంగములో ఇదే తెలుస్తుంది, నీతి విరుద్ధ ధర్మములను పరిత్యాగము చేయవలెనని. 'మా వ్రజ' అంటే అర్థము 'హే అర్జునా! నన్ను తెలుసుకో, నేను నీ సహాయకారిని. అన్ని

కష్టనష్టాలను నేను దూరం చేస్తాను. దీనికోసమే నేను అవతరించాను. నేను కాలుడిని - నీవు యుద్ధము చెయ్యి, చెయ్యకపో, నేను నీవు లేకుండానే అందరిని సంహరించగలను. యశశ్వివి కమ్ము. శతృవుపై విజయాన్ని సాధించు. వీరంతా మొదటనే నాచే చంపబడి, చచ్చివున్నారు. నీవు నపుంసకుడివి గాకు. హృదయ దౌర్భల్యతను వదలిపెట్టు. లెమ్ము నిల్చొమ్ము'. శ్రీకృష్ణానందస్వామీజీ వారి వ్యాఖ్యానము ఇలా సాగేది. శ్రీకృష్ణుడి ఈ అభిప్రాయమును ధ్యానంలో వుంచుకుని గీతావ్యాఖ్యమును చేయాలి అనేవారు స్వామీజీ.

శ్రీకృష్ణుడి అభిప్రాయము ఇది - ఆధ్యాత్మ జ్ఞానమును సంపాదించి, నీతిని అనుసరించి వ్యవహరించాలని వారి అభిప్రాయము. అన్ని కర్మలను నాలో సమర్పణము చేయి. ఎలాగ? అధ్యాత్మజ్ఞానము ద్వారా ఆశ మరియు మమతను వదిలిపెట్టు. చింతా జ్వరమును వదలి యుద్ధము చెయ్యి. ఇది కర్మ బంధనము నుండి ముక్తిని కలిగించే మార్గము. ఎవరైతే అలాగ చెయ్యరో వారు వినాశమార్గములో పోతారు. శాస్త్రము, నీతి వీటిలో విరోధము లేదు. శాస్త్రము నీతి వీటికి విర్ధుమైనది చాతుర్యము కాదు. ఎవరి నీతి, జ్ఞానముతో సంపుష్టమయినదో వాడే చతురుడు. ఇపుడు చెప్పండి! జ్ఞానము పొందిన తరువాత ప్రారబ్ధశేషమును ఒప్పుకుంటారా? లేదా? నశ్చయముగనే ప్రారబ్ధానుసారమైన జీవితములో కూడా నీతిని అపేక్షిస్తాము. నీతి యుక్తమయిన జ్ఞానము సశక్తమయినది. అదే జీవశక్తి యొక్క పూర్ణ సుఖమును ఇస్తుంది. 'సదృశం చేష్టతే' అని చెప్పినపుడు జ్ఞాని కూడా తన ప్రకృతి ననుసరించి వ్యవహరిస్తాడు. ఇక్కడ ప్రకృతి అన్న దానికి అర్థము ప్రారబ్ధ ప్రాప్తకర్మను ఆచరిస్తాడు - జ్ఞాన సంపన్నుడయి సావధానుడయి కర్మచేస్తాడు. అదే జీవన్ముక్తుడి వ్యవహారము. అప్రాప్తములో ప్రవృత్తి, ప్రాప్త త్యాగము, ఇది విద్వానుడి లక్షణము కాదు. శాస్త్రము నీతిరహితమైన ధర్మము పరధర్మము మరియు అది భయావహము. వివస్వానుడి నుండి ఇక్ష్వాకు మొదలైన రాజర్షుల పరంపర ఇదే ధర్మరహస్యమును అర్థం చేసుకున్నది. 'నీవు నా భక్తుడివి, నా స్నేహితుడివి, అందుకే నేను నీకు చెబుతున్నాను'. 'రాజర్షయో విదుః' ఈ ధర్మమునకు అధికారి రాజర్షి. ఎందుకంటే ఇది నీతిశాస్త్రము, నీతి సంపన్నమవడం వలన రాజు, విద్యా సంపన్నుడవడం వలన ఋషి. నీవు భక్తుడివి

కాబట్టి జ్ఞానము, సఖుడివి కాబట్టి నీతి. అర్జునా! ధ్యానంతో విను! గీతపైన వ్యాఖ్యానము చేసేవారు ఈ భావాలను గ్రహించాలని మా అభిప్రాయం.

'గీత' యొక్క చింతన-మననము వలన అర్జునుడి ఉపసంహారములో ఆధ్యాత్మ విద్య - నీతి శాస్త్రము రెండూ స్వీకరించాడని స్పష్టమవుతుంది. మోహనాశము అంటే ఆధ్యాత్మ విద్యాప్రాప్తి కలిగిందని. స్మృతి లాభము అంటే మమత్వ కారణముగ మరణినటువంటి నీతిశాస్త్ర ఉపలబ్ధి. (నష్టో మోహః స్మృతిర్లబ్ధ్వా) భగవత్ప్రసాదము వలన రెండూ లభించాయి. అందువలన సందేహము నివృత్తమయినది. ప్రారబ్ధశేషము అనుభవించవలసినపుడు విద్వానుడైనా నీతిననుసరించే జీవనయాపన చెయ్యాలన్నది సిద్ధాంత సమ్మతము. ఆధ్యాత్మిక విద్యలోనే మానవత సాఫల్యము. క్షత్రియత్వము యొక్క సఫలత నీతి శాస్త్రములో 'కరిష్యేవచనం తవ' గురు చరణాలలో ప్రణిపాతము. నీతి-బ్రహ్మవిద్యలోని ఏకవాక్యతయే 'గీతా'శాస్త్రము యొక్క అపూర్వత! రెండూ విరుద్ధములని అనిపించినా తాత్పర్యము ఒక్కటే. ఇది గురుకృప లేకపోతే సంభవము కాదు. సఞ్జయుడు మాటి మాటికి రోమాంచితుడై, ఆనందితుడు అవుతాడు. ఆహా! ఆశ్చర్యము! ఆశ్చర్యము!

ఇక ఇపుడు ఒక 'శంక-సమాధానము' కూడా వినండి. ఒకవేళ గీత బ్రహ్మవిద్యా మూలక నీతి శాస్త్రమయితే సముచ్చయవాదమనే ప్రసంగ మవుతుంది కదా! బ్రహ్మవిద్య మరియు కర్మ! ఈ శంక సరి అయినదికాదు. జ్ఞానాగ్ని దగ్ధ ప్రారబ్ధకర్మ శేషము జ్ఞాని పురుషుడి అలంకరణ. ఓహో! ఈ జ్ఞాని యొక్క సంచితము, క్రియమాణము అన్ని భస్మమయిపోయినవి. వీరు పాప-పుణ్యముల నుండి ముక్తులు. వీరి జీవితంలో కర్మ జరుగుతున్నట్లు కనిపించేది - అది ఇతరుల దృష్టిలోనే, అది ఫలోత్పాదకము కాదు. బ్రహ్మసూత్రము యొక్క 'తదధిగమాధికరణ' స్పష్టంగా చెబుతుంది. - తత్త్వజ్ఞానము కలిగిన తరువాత పూర్వ కర్మల వినాశము, ఉత్తర కర్మల అలిప్తము (అశ్లేషము) జరుగుతుంది. అదే శ్రీకృష్ణ భగవానుడు అన్నాడు. 'కరిష్యత్యవశోఽపి తత్ జ్ఞానీ' కృతకృత్యుడవుతాడు. వారి యొక్క భాసమానమైన శరీరములతో జరిగే భాసమాన కర్మలు, అవి బంధన హేతువులు కాదు, మరియు

జ్ఞాన విరోధము కూడా కాదు. అవన్నీ జ్ఞానమనే ప్రచండ అగ్నిలో స్వాహా అయి భస్మమయిపోయినవి. సంజయుడు గీత తాత్పర్యము చెప్పినపుడు 'యత్ర యోగేశ్వరః కృష్ణ....' అది నీతి శాస్త్రము యొక్క తాత్పర్యమే. యోగేశ్వరుడు శ్రీకృష్ణుడు గురువు. పార్థుడు శిష్యుడు. ధృవశ్రీ, ధృవ విజయ, ధృవ భూతి మరియు ధృవనీతి. ఇందులో భూతి శబ్దమునకు అర్థము బ్రహ్మవిద్య అని. ధృవ అన్న శబ్దము నాలుగు పదములకు విశేషణము.

చూడండి వక్త ఎవరైనా కానీ-శ్రీకృష్ణుడు, శంకరాచార్యుడో, లేక మండన మిశ్రుడో ఎవరైనా కానీ మేము అందరికి నమస్కరిస్తాము. శ్రోతలు ఎవరైనా వారందరికి మా నమస్కారములు. కానీ ఏదైతే యదార్థ పరమార్థమో సాక్షాత్ అపరోక్షమో అదే శ్రవణము, వర్ణనము చేయదగినది.

జ్ఞాన నిష్ఠ శ్రీ గణేశానంద అవధూత

ఏకాదశి, సంక్రాంతి, గ్రహణము మొదలైన పర్వదినాలలో నేను మా పితామహుడితో కలసి గంగా స్థానము కోసము వెళ్ళి వస్తూండేవాడిని. గంగా నది మా వూరికి రెండు మూడు మైళ్ళ దూరంలో వుండేది. దానాపూర్ దగ్గర దంభారీ ఘాట్ వున్నది. ఒక గుట్టపైన ఒక పెద్ద మఱ్ఱిచెట్టు వుండేది. దాని నీడలో ఒక శివాలింగం స్థాపితమైవుండేది. అక్కడి నుండి చూస్తే దూర దూరము వరకు గంగా నది, పులినము (ఇసుక ఒడ్డు) దర్శనమవుతూండేది. మంచి పలాశ వృక్షములు గల్గిన అడవి వుండేది. మా పితామహులు స్నానానంతరము నన్ను అక్కడ కూర్చోబెట్టి, తాను స్వయంగా సంధ్యావందనము, జపము, పారాయణ చేసుకునేవారు. గాయత్రి జపము యందు వారికి చాలా శ్రద్ధ వేండేది. నేను అక్కడ వటవృక్షపు ఛాయలో కూర్చున్నపుడు ఒక సుందరుడు, ఆరోగ్యవంతుడు అయిన ఒక యువకుడు భగవతి భాగీరథితో శ్రద్ధాపూర్వకముగా అవగాహన చేసి గంగాజలము తీసుకుని శంకరుడికి అభిషేకము చేశేవాడు. వారు మా పితామహుడికి పాదాభివందనము చేశేవారు. నాతో 'నమస్కారాలు' అనేవారు. శివతాండవస్తోత్రము 'జటాకటాహ సంభ్రమ...' అంటూ స్తుతించేవారు. వారి పేరు 'గణేశ్ ప్రసాద్ రస్తోగి' పరిచయమయింది. మాటిమాటికీ వారిని కలవడం జరిగింది. నేను 'లఘుకౌముది' చదువుకోవడానికి ధానాపూర్ వెళ్ళేటప్పుడు వారి బట్టల దుకాణమునకు కూడా వెళ్ళేవాడిని. గణేశ్ ప్రసాద్ గారు దుకాణంలో కూర్చుని 'జ్ఞాన - వైరాగ్య - ప్రకాశము', 'దృష్టాంత - ప్రకాశము' లేక హిందీలో 'పంచదశి' చదువుతూ వుండేవారు. నేను వెళితే నన్ను చదివి వినిపించమనేవారు. నేను వారికి చాలా సేపటి వరకు చదివి వినిపిస్తూండేవాడిని. ఈ విధంగా యువావస్థలోనే వారి చిత్తము వేదాంత సంస్కారముతో నిండిపోయినది.

వారు ముప్వురు అన్నదమ్ములు. గౌరీశంకర్, రామ్‌నాథ్, గణేశ్ ప్రసాద్. వారి బట్టల దుకాణము బాగా నడిచేది. అంగడి కూడా బాగా ఎత్తుగా, అందంగా కట్టివుండిరి. మా పితామహుడు అపుడపుడు బట్టలు కొనుక్కోవడానికి వారి దుకాణానికి వెళ్తూవుండేవారు. ఇపుడయితే గుర్తువచ్చినపుడు ఆశ్చర్యము వేస్తుంది - ఫలానా ఫలానా బట్టలు కావాలి అని చెబితే వారు వాటిని కట్టి పెట్టేవారు. ఒక కాగితంపైన లెఖ్ఖ వ్రాసి పెట్టేవారు. మా పితామహుడు అపుడే కానీ, తర్వాత కానీ డబ్బు చెల్లిస్తూండేవారు. బేరసారాలన్న మాటే వుండేది కాదు. వ్యాపారి, మరియు గ్రాహకుడు వీరి సౌజన్యము, నమ్మకము ఇపుడు ఎక్కడ దొరుకుతుంది?! ఈ ప్రసంగములో నాకు ఇంకొక మాట గుర్తుకువస్తోంది. వీరి ప్రక్కనే ఒక ముస్లిం సజ్జనుడు పీర్ మహమ్మద్ వారి చెప్పుల దుకాణము వుండేది. నేను ఇంకా చిన్న పిల్లవాడిని అపుడు. చెప్పులు నచ్చినవి చూసుకుని, వేసుకున్నాను. వారు 3రూపాయలు వెల అని చెప్పారు. నేను ఇచ్చేశాను. దాని తర్వాత వారు తనంతట తానే 8 అణాలు తిరిగి ఇచ్చేశారు. నేను 'ఎందుకు?' అని అడిగాను. 'నేను అనుకున్నా మీరేమైనా బేరమాడితే అర్థరూపాయ తగ్గించవచ్చు అనుకున్నాను. మీరేమో బేరము చెయ్యలేదు. మరి అన్యాయంగా మీ దగ్గర అర్ధరూపాయి ఎక్కువ ఎందుకు తీసుకుంటాను?' అన్నారు. ఇదంతా 62, 63 సంవత్సరాల క్రిందటి మాట. వ్యాపారి, గ్రాహకుడు యొక్క చిత్తము ఎలా వుండేదో ఒక నిదర్శనము. గణేశ్ ప్రసాద్ వారి సోదరుడు గౌరీ శంకర్ ప్రసాద్ రస్తోగీగారు కూడా అలాంటి మనోవృత్తి కలిగినవారే.

దుకాణంలో కూర్చుని వేదాంత గ్రంథాలు చదువుతూ, చదువుతూ గణేశ్ ప్రసాద్ గారి మనసులో వైరాగ్యము కలిగింది. తల్లి, భార్య, కొడుకు అందరూ వున్నారు. వ్యాపారము కూడా బాగానడిచేది. ఏమీ కొదువ లేదు. కానీ వారికి ఇవేవీ తృప్తినిచ్చేవి కాదు. గంగ ఒడ్డుకు వెళ్ళిపోయేవారు. చాలా సేపటివరకు తిరిగి వచ్చేవారు కాదు. శంకరుడిని ఇలా ప్రార్థిస్తుండేవారు 'హే ప్రభూ! నా చిత్తమును కామవాసనల నుండి ముక్తము చెయ్యి. మీరు కాముడికి శత్రువులు. మీ దృష్టి పడగానే కాముడు భస్మమయిపోతాడు. ఒకసారి నా చిత్తముపైన కూడా అటువంటి దృష్టిని వేయండి'. వారికి ఎపుడైనా వైరాగ్యపు ఆవేశం కలిగినపుడు ఇల్లువాకిలి వదిలిపెట్టి వెళ్ళిపోయేవారు. ఆ రోజుల్లో చిత్రకూటములో పీలీకోఠీలో వారు స్వామి

అఖండానందజీ మహరాజ్‌ని దర్శనము చేసుకున్నారు. వారు ఒక ఉత్తమకోటికి విలక్షణ మహాత్ములు. 'శివోऽహం' 'శివ్యోహం' అనే మాట తప్ప వారి దగ్గర వేరే మాట వుండేదే కాదు. వారు జపము, తపము, పూజలు వీటిని ఉపదేశించేవారు కాదు. చక్కగా ఒకే మాటలో దెబ్బకొట్టేవారు 'నీవు పరమానంద స్వరూపుడివి. నీలో దుఃఖలేశము కూడా లేదు' నీవు దుఃఖితుడవు కాదు. దుఃఖము యొక్క ద్రష్టవి. నీవు అజ్ఞానివి కాదు అజ్ఞానానికి సాక్షివి. నీకు జనన మరణములు లేవు. నీవు అజరుడివి. అమరుడివి. అజన్ముడివి'. వారు ఇలాగే ఉపదేశము ఇస్తూ వుండేవారు. వారి శిష్య-మండలి కూడా చాలా పెద్దది. పల్లె పల్లెల్లో తిరిగి తిరిగి 'శివోऽహం' అంటూ ఢంకా బజాయించినట్లు చెబుతూండేవారు. గణేశప్రసాద్ గారికి ఇదే సత్యమైన సిద్ధాంతము అని ఒక దృఢ నమ్మకము కలిగినది. అన్ని శృతులు మతములు, గతులు అన్నిటి సారము ఇదే.

బుద్ధిలో నిశ్చయము కలిగినా కానీ వైరాగ్యము దృఢముకాలేదు. చాలాసార్లు ఇల్లు వదలి వెళ్ళేవాడు. కాషాయ వస్త్రాలు కూడా వేసుకునేవాడు. కానీ మరల కొన్ని రోజులకు తిరిగి వచ్చేస్తూండేవారు. మా దగ్గర 'సత్సంగ' గోష్ఠి కూడా జరుగుతూండేది. వారు అపుడపుడు వస్తూ వుండేవారు. మా అమ్మను 'అత్తా' అని పిలిచేవారు. ఎందుకంటే మా అమ్మగారు వారి వూరి అమ్మాయి, అదీకాక వారి తల్లితో కూడా చాలాస్నేహము వుండేది. సత్సంగములో లీనమయిపోయేవారు. ఒక్కోసారి పశ్చాత్తాపముతో 'హా! అయ్యో! ఈ సంసార విషయభోగాలు, మమకారాల సుడిలో చిక్కుకునిపోయి వీటి నుండి బయట పడలేక పోతున్నాను'. ఒక్కోసారి బాగా ఏడ్చేశేవారు. ఒక్కోసారి 'శివోऽహం' 'శివోऽహం' అంటూ అరిచేవారు. రెండు వృత్తులు ప్రబలముగా వుండేవి. జపము, ఉపాసన అన్నీ వదిలేశారు. చిత్త-వృత్తి ఆత్మలో స్థిరము కాలేదనే వారికి చింతగా వుండేది ఆ రోజుల్లో వైరాగ్యము దృఢము కాలేదు. కానీ ఆత్మయే బ్రహ్మము ఇదియే పరమసత్యము. మరి అలాంటపుడు సాక్షాత్కారము అపరోక్ష అనుభవము కావాలి కదా!

వారు మా ఇంటికి వస్తూండేవారు. ఒక్కోసారి రోజంతా ఉండిపోయేవారు. భగవద్గీత, భాగవతము వినేవారు. సుదర్శన సింహ్ (చక్రజీ) శ్రీకృష్ణ లీలవిని

మైమరచిపోయి రోమాంచితమైన అశృపూర్ణమైన నేత్రాలతో భావావేశ స్థితిలోకి వెళ్ళిపోయేవారు. అపుడు మా తల్లిగారు చాలా సంతోషపడేవారు వారి స్థితిని చూసి. కానీ గణేశ్ ప్రసాద్ గారు మాత్రము నవ్వేశేవారు. రెండు మూడు గంటల తర్వాత చక్రజీ మామూలు స్థితిలోకి వచ్చాకా వారిని పరిహాసం చేశేవారు. వారు మూర్తిపూజ, లీల వీటన్నిటిని చిన్నపిల్లల ఆటగా భావించేవారు. చక్రజీ కూడా ఒక్కోసారి 'నీవు ఎలాగైతే 'శివోऽహం' 'శివోऽహం' అంటావో అలాగే 'గార్ధభోహం' 'గార్ధభోహం' అని కూడా ఎందుకు అనకూడదు? అని అనేవారు. కానీ గణేశ్ ప్రసాద్ గారి విశేషత ఏమిటంటే వారు ఎప్పుడూ ఏ ఘటనతోకానీ తనకు అవమానం జరిగిందని అనుకునేవారు కాదు.

గణేశ్‌గారి మనసులో వైరాగ్యము అంకురించినది. అపుడపుడు పల్లవితము, పుష్పితము అయ్యేది కానీ ఫలితము కలిగేలోగానే మనోవృత్తి మారిపోతూండేది. వైరాగ్యములో స్థాయీభావము చాలా అవసరము. దీనిలోనే శాంతరసము యొక్క అనుభూతి కలుగుతుంది. కానీ స్థాయీభావము కలగడములో వారు మాటి మాటికీ విఫలులయ్యారు. ఒకరోజు సూర్యాస్తమయ సమయంలో నేను గంగ ఒడ్డున కూర్చుని వున్నాను. సూర్యుడి ఎర్రటి కాంతిలో క్షితిజము కూడా ఎర్రగా ప్రకాశిస్తోంది. ప్రకృతి శాంతముగా వుండినది. గంగాజీ కూడా ప్రకృతి లాగే (శాంతంగా) మెల్ల మెల్లగా ప్రవహిస్తోంది. నేను తటస్థుడినై కూటస్థభావముతో అక్కడ దగ్గరలోనే కూర్చున్నాను. కొంచెం సేపటికి గణేశ్‌జీ వెక్కి వెక్కి ఏడవటం మొదలు పెట్టారు. 'నాకు కుటుంబం పట్ల వుండే మోహము చాలా దుఃఖాన్ని కలిగిస్తోంది. వదిలిపెట్టాలనుకుంటాను. అపుడపుడు వదిలి వెళ్ళిపోతాను, మరల తిరిగి వస్తాను, నాకు ఏదైనా ఒక యుక్తి చెప్పండి నేను శాశ్వతముగా ఈ బంధనము నుండి విముక్తుడను అవడానికి' అని అన్నారు. నేను వారికి ఒక యుక్తి చెప్పినాను. అది కొత్తదేమీ కాదు. విష్ణుపురాణములో వ్రాసివుంది. సత్పురుషుల ఆచరణనను సాధకుడు నిందించరాదు, కానీ ఇతరులు తనను అవమానించి, తనతో ఉండటానికి కూడా ఇష్టపడని విధముగా ఏదైనా ఆచరించాలి. గణేశ్‌జీకి ఈ మాట మనసులో నాటుకుపోయింది.

ఒక రోజూ నేను కానూన్‌గోసాహెబ్ వారి ఇంటికి వెళ్ళినపుడు గణేశ్‌జీ చాలా

జబ్బుపడినట్లుగా తెలిసింది. 'పండిత్‌జీ నాకు విషము త్రాగించారు. అందులో కానూన్‌గోసాహెబ్ గారి సలహా కూడా వున్నది. ఇక ఇపుడు నేను చనిపోతాను, లేదా పిచ్చివాడినయినా అవుతాను' అని అరుస్తున్నాడట. వారి ఇల్లు కానూన్‌గోసాహబ్ వారి ఇంటికి దగ్గరనే, వెంటనే మేము వారి ఇంటికి వెళ్ళాము. వారు మంచంపైన పడివున్నారు. మొదట మమ్ములను బాగా కోప్పడ్డారు. తర్వాత నాతో మాట్లాడాలని మిగతా అందరిని అక్కడినుండి వెళ్ళిపొమ్మన్నారు. 'చాలు ఇక! ఇపుడు నేను మాత్రం వదలను. పరివారమే నన్ను వదలాలి' అని అన్నారు. మేము వచ్చేశాము. వారు ప్రొద్దున్నే గంగొడ్డుకి వచ్చి అక్కడ వున్న వటవృక్షము క్రింద కూర్చున్నారు. మద్యాహ్నమపుడు విజాతీయులు నివసించే ఒక పల్లె దగ్గర్లోనే వున్నది. వారి వద్ద భోజనము తీసుకోవడము సమాజములో నిందనీయముగా భావించేవారు. అలాంటి చోట గణేశ్‌జీ భిక్ష తీసుకుని తిన్నారు. రెండు, మూడు రోజులలో ఆ మాట వూర్లో, ఇంట్లో అంతా తెలిసిపోయింది. అందరూ వారు భ్రష్టులయిపోయారని అనుకున్నారు. ఇంతలో ఒక రోజు వారు తమ ఇంట్లో ప్రవేశించబోతుంటే భార్య లోపల గదిలోకి వెళ్ళి దాక్కుంది. తల్లి వచ్చి కోప్పడ్డారు. 'ఇక ఇపుడు నీవు ఇంట్లోకి రావద్దు, ఇంట్లో పిల్లాపాపలకు పెళ్ళిళ్ళు ఎలా అవుతాయి?' అని అన్నారు. వారు తిరిగి గంగ ఒడ్డుకు చేరుకున్నారు, వారి తల్లి మా ఇంటికి వచ్చారు. మా అమ్మ అంటే వారికి చాలా ప్రేమ. ఆడబడుచు లాగ అనుకేనవారు. వారు నాతో 'పండిత్‌జీ! మీరు గణేశ్‌కి చెప్పండి. ఇక ఎప్పుడూ మా ఇంటికి రావద్దని. లేకపోతే రస్తోగి కుటుంబంలోని మాకు అప్రతిష్ఠ కలుగుతుంది. మమ్ములను జాతి బహిష్కారం చేస్తే మా పిల్లలకు పెళ్ళిళ్ళు ఎలా చెయ్యగలుగుతాము?' అని అన్నారు. నేను వారి మాటలను గణేశ్‌జీతో చెప్పాను. వారు ఒక మట్టిపాత్ర తీసుకుని అక్కడి నుండి వెళ్ళిపోయారు. బిక్షాటన చేస్తూ జీవితము గడిపారు.

ఈ రోజు ఇపుడు ఇలా ఆలోచిస్తుంటే, 85 సంవత్సరాలు వచ్చే వరకు కూడా వారు ఎవరిని శిష్యులుగా చేసుకోలేదు. కుటీరము కూడా లేదు. ధనము కూడా పెట్టుకునేవారు కాదు, మానాపమానాలను లెక్క చేసేవారు కాదు. ఎవరితోనూ రాగ-ద్వేషాలు అన్నది లేదు. బాలుడి వలె తన జీవనము కొనసాగించారు. ఇపుడు వారి జీవితంలోని కొన్ని విశేషాలు వాటంతట అవే స్మృతిపథంలో మెదులుతున్నాయి.

ప్రయాగలో అర్ధకుంభమేలా జరిగింది. విరక్తుల గుంపు ఒకటి గంగ ఒడ్డున దూరముగా వుండినది. శ్రీ ఉడియాబాబాజీ, శ్రీకరపాత్రజీ గారి వెంట నేను కూడా విరక్తుల దర్శనము కోసం వెళ్లాను. విరక్తులలో వేదాంత చర్చ బాగా జరిగింది. తత్త్వజ్ఞానము కలిగిన తర్వాత జ్ఞాని యొక్క జీవన్ముక్తికి జీవన సిద్ధికి అవిద్యా లేశమును అంగీకరించాలా వద్దా?' అని ప్రశ్న. పరస్పరము సత్సంగము జరిగిన తర్వాత శ్రీఉడియా బాబాజీ 'జ్ఞాని దృష్టిలో ప్రారబ్ధము లేదు, అవిద్యాలేశము లేదు. అది అయితే అజ్ఞానుల దృష్టిలో వారి తృప్తి కోసము కల్పించబడినదే' అని అన్నారు. అదే సత్సంగములో ఒక మట్టి పాత్రతో అవధూత వేషంలో వున్న గణేశ్‌జీని అక్కడ చూశాను. విరక్తులు వీరిని చాలా ఆదరముతో చూశేవారు. గౌరవర్ణము, స్వస్థ శరీరము, అపరిగ్రహము, నిర్భయత చూచి నాకు చాలా బాగనిపించింది. ఆ రోజులలో నా మనసులో వైరాగ్యము యొక్క రూపురేఖ అలాగే వుండినది.

నేను శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారి గారి సంవత్సర వ్యాప్త సంకీర్తన యజ్ఞంలో ఝూసీలో శ్రీమద్భాగవత కథ ప్రవచనము చేస్తువుంటిని. గణేశానంద్‌జీ అపుడపుడు అక్కడికి వచ్చేవారు. వారికి నాయందు ఆదరము, ప్రేమ మెండుగా వుండేవి. నా మాటను వారు ఒప్పుకునేవారు. లంగోటిని కప్పడానికి పై నుండి ఒక వస్త్రము కట్టుకోమని చెప్పాను. వారు అలాగే చేశారు. ఒక రోజు నేను వారితో ఇలా అన్నాను. నేను ఇక్కడ భాగవతము చబుతున్నాను. కానీ నా దగ్గర టీకాలేదు! వారు ఒక గృహస్థుడికి చెప్పి స్వయంగా మేలాలో వెళ్ళి 'వంశీధరి' టీకా తెచ్చి ఇచ్చారు. బహుశ అంత బరువు వారు ఎపుడూ మోసి వుండరేమో. దగ్గర డబ్బు కూడా పెట్టుకునేవారు కాదు. కానీ వారు నా కోసమే ఈ పని చేశారు. నేను ప్రయాగ నుండి గోరఖ్‌పూర్ కల్యాణ్ పరివారములోకి వెళ్ళిపోయాక ప్రాయః వారితో సంపర్కము తెగిపోయింది. వారు గంగ ఒడ్డున తిరుగుతూ వుండేవారు. ఒకోసారి వూర్లో ఒకోసారి చెట్టు క్రింద వుండేవారు.

ఎపుడైనా నాతో కలిస్తే రెండు దోహాలు చెబుతుండేవారు -

నాకఘుహువా, నహై కఘు, నా కఘు హోవన్ హార్ ।
అనుభవ్ కా దీదార్ హై, అపనారూప్ అపార్ ॥

పాయా కహీ సోబావరా, ఖోయా కహీ సో కూర్ ।
పాయా ఖోయా కుఛ్ నహి, జ్యోకా త్యో భర్‌పూర్ ॥

వారి నిష్ఠ అద్వైత వేదాంతములో అత్యంత దృఢముగా వుండేది. వారు ధర్మము, యోగము, భక్తి వీటిని గురించి ఇష్టపడేవారు కాదు. నేను స్వయంగా కల్యాణ పరివారములో వుంటున్నాను. అక్కడ భక్తి, భక్తుల చర్చ, వాటి లేఖనము, స్వాధ్యయములో నా సమయం అధికంగా గడుస్తూండేది. అక్కడ భాయిజీ లాంటి భక్తులు వుండేవారు. గోస్వామి చిమన్ లాల్‌జీ లాంటి విద్వానులుండేవారు, వారంటే నా మనసులో చాలా ఆదరభావం వుండేది. కానీ గణేశానంద్‌జీ ఈ మాటలన్నిటినీ నవ్వులాటగా ఎగరగొట్టేవారు. ఇదంతా కేవలం వర్తి భావుకత మాత్రమే! అనేవారు. మాటి మాటికీ భగవంతుడు వచ్చి దర్శనము ఇస్తాడా? అదెలాటి భగవంతుడు? భగవంతుడు దృశ్యమయితే దాని ప్రకాశము నేను కదా. దృశ్య వస్తువు చేతన యొక్క ప్రకాశములోనే భాసిస్తుంది. (అధిష్ఠానము) చేతనము మన ఆత్మయే. మీరు దృశ్య భగవానుడిని గురించి ఎందుకు చర్చిస్తారు? స్వయం ప్రకాశము, అధిష్ఠానమును గురించి చర్చించండి.

నేను సన్యాసినయి కర్ణవాసములో వుంటుండగా గణేశ్‌నంద్‌జీ అక్కడికి వచ్చారు. వారు తమ మట్టి పాత్రలో భిక్ష తెచ్చుకుని తినేవారు. అపుడపుడు భిక్షపెట్టిన వాళ్ళ ఇంటి ముంగిట్లోనే నిల్చుని తినేవారు. నేను భోజనము చేయడానికి కూర్చున్నపుడు నా పళ్ళెము దగ్గర వచ్చి కూచునేవారు. నేను భోజనం చేసేటపుడు తనకు పెట్టమని అడిగేవాడు నేను ఇవ్వకపోతే ఊ ఊ అని కాళ్ళు చేతులు కొట్టుకునేవాడు. వారు స్వాదు భోజనం కోసం అలా చేస్తారని లోకులు అనుకునేవారు. కానీ వారిది బాలవత్ చేష్ట. వారు భిక్షలో దొరికిన ఎండు రొట్టెని కూడా చాలా ఆనందంగా తినేవారు.

నేను బృందావనములో వున్నపుడు వారు వచ్చి నాదగ్గర వుంటుండేవారు. భోజనం యొక్క క్రమము అలాగే వుండేది. ఒకసారి వారు నాతో ఇలా అన్నారు. 'తీర్థ స్థానమును దర్శించడము కూడా తమోగుణమే. అని ఈ శ్లోకం చెప్పేవారు-

ఇదం తీర్థ మిదం తీర్థం భ్రామ్యంతి తామసా జనాః
ఆత్మ తీర్థం న జానంతి కథం మోక్ష శృణు ప్రియే. (దేవి భాగవతము)

శంకరుడు పార్వతీ దేవితో 'దేవీ' తమో గుణము గల్గిన జనులు ఇక్కడ తీర్థస్థానము అక్కడ తీర్థము (పుణ్యక్షేత్రం) అని భ్రాంతితో తిరుగుతారు. తీర్థము కేవలము మన ఆత్మయే, దానిని తెలుసుకోలేరు. వారికి ఎపుడైతే దృశ్యము పట్ల ఆసక్తి వుందో ఇక దృశ్యము నుండి ముక్తి ఎలా దొరుకుతుంది? అన్నారు. నేను అన్నాను, బృందావనంలో నీవు ఇలా మాట్లాడితే వారు నిన్ను కొట్టేస్తారు అన్నాను. 'కొడితే కొట్టారు నేను నిజమే చెబుతాను' అన్నారు. నేను కోపగించుకున్నాను. 'సరే మీకు నచ్చకపోతే నన్నేం చెయ్యమంటారు?' అన్నారు. నీవు బద్రీనాధ్ వెళ్ళు' అన్నాను. వెంటనే తన భిక్షాపాత్ర తీసుకుని కాలినడకన బద్రీనాధ్ వెళ్ళారు. యాత్ర పూర్తి చేసుకుని తిరిగి వచ్చాక 'అక్కడ అలక్ నందాలో స్నాం చేశారా?' అని డిగాను 'లేదు' అన్నారు. 'వేణ్ణీళ్ళ కుండంలో స్నానం చేశారా?' బద్రీనాధుని దర్శనం చేసుకున్నారా? అంటే 'లేదు' అన్నారు. మీరు వూరికేనా బద్రినాధ్ వెళ్ళమన్నారు. నేను వెళ్ళి వచ్చాను. బద్రీనాధుని నేను కదా! అన్నారు.

మేము ఒక సారి హరిద్వారము నుండి బృందావనమునకు పాదయాత్ర చేస్తూ వచ్చాము. వెంట చాలా మంది హృష్ట బలిష్ఠులైన సాధువులు కూడా వున్నారు. కుట్టిన బట్టలు ఎవరమూ వేసుకునే వాళ్ళముకాదు. పల్లెల్లో భిక్ష తీసుకుని తినేవారము. ఆనందముతో స్వామి గణేశానందజీ అందరినీ నవ్విస్తూ నవ్వుతూ మా వెంట వెంట వస్తూండేవారు. కాలువ వెంబడి వున్న పచ్చని వృక్షములతో శోభిల్లే గ్రామాలను చూస్తుంటే మనసు ప్రసన్నమయిపోయేది అపుడు ఒక గృహస్థుడు మా ఎదుటి నుండి వస్తున్నాడు. 'మహాత్ములారా మీరు ఏ పొలము గోధుమలు తింటారు? (కిస్ ఖేత్‌కీ గేహూ ఖాతేహో) అని అడిగాడు. అవధూత గణేశ్‌జీ 'నిశ్చింత అనే గోధుమ మేము తింటాము' అన్నారు. ఈ రోజు ఎవరి ఇంటిపైన దండెత్తుతున్నారు? అని అడిగాడు ఆ గృహస్తుడు. అవధూత 'ఈ రోజు మీ ఇంటికే దండెత్తుతున్నాము' అన్నారు. నిజంగానే ఆ గృహస్తుడు చాలా సంతోషముతో అందరిని తన ఇంటికి తీసుకువెళ్ళి రుచిగల భోజనము కొసరి కొసరి ప్రేమగా తినిపించారు. రాత్రి అందరికీ

పడుకోవడానికి సదుపాయాలు చేశారు. సాధువులంటే వారి హృదయమంలో శ్రద్ధ జాగృతమయింది.

అవధూత గణేశ్‌జీ కాలువ (నహర్) ఒడ్డున బాగా తిరిగి వున్నారు. అందుకని అక్కడక్కడ వారంటే శ్రద్ధ కల్గినవారు ఉండేవారు. ఒకరోజు వారు 'మీరు వెళ్తూ వుండండి. నేను ఇంకో మజిలీలో వచ్చి మిమ్ములను కలుసుకుంటాను. మేము డాక్‌బంగ్లా చేరుకోగానే అక్కడికి కొందరు గృహస్థులను తీసుకువచ్చారు' వారు నాకు సాష్టాంగ దండ ప్రణామాలు ఆచరించారు. వారితో అవధూత 'వీరు మా గురువగారు. మీరందరూ చెప్పులు అవీ దూరంగా వదిలి, సాష్టాంగ ప్రణామము చెయ్యండి'. ఈ రోజు ఇక్కడనే భిక్ష తీసుకోమని ప్రార్థించండి' అన్నారు. వారు అలాగే చేశారు. ఆరోజులలో మా వెంటవున్న కొందరు బ్రాహ్మణుల ఇళ్ళల్లోనే భిక్ష తీసుకుంటూ వుండిరి. అందుకని ఒక బ్రాహ్మణుడి ఇంటిలో అందరికి భోజనము తయారు చేయించారు. వూరిలో సత్సంగము ఏర్పాటు చేశారు. అందరూ వచ్చారు. గణేశ్ జీనాతో 'ఇక్కడ మెరుగుపెట్టి మాట్లాడకండి. ఇక్కడ వున్నదున్నట్లు వేదాంతము చెప్పండి. అద్వైత నిష్ఠమహాత్ముడు స్వామీ శ్రీఉగ్రానందజీ ఇక్కడ వుండేవారు. అన్నారు. నేను 'మీరే వినిపించండి' అన్నాను. వారు 'విచార సాగరములోని దోహాలు చెప్పారు.

జో సుఖ నిత్య ప్రకాశ విభు నామరూప ఆధార ।
మతి నలఖే జెహి మతి లఖె సో మై శుద్ధ అపార ॥

జా కృపాలు సర్వజ్ఞకో హియ ధారత ముని ధాన ।
తాకో హోత ఉపాధితే మోమే మిద్యాభాన్ ॥

బోధ చాహి జా కో సుకృతి భజత రామ నిష్కామ ।
సోహే మేరీ ఆత్మా కాకో కరూ ప్రణామ్ ॥

గణేశానందగారికి అద్వైత సిద్ధాంతము తప్ప మరి వేరే ఏదీ నచ్చేదికాదు.

ఒక రోజు కాలువ ఒడ్డున 'ఖిచిడీ' తయారు చేస్తున్నారు. ఛోటేజీ బ్రహ్మచారి బ్రాహ్మణుల ఇల్లు దొరకనందున తనే స్వయంపాకం చేసుకుంటున్నారు. పాత్రలో ఖిచిడి వుడుకుతూ వుండగా ఇంతలో వర్షము వచ్చింది. ఎవరో ఒక అపరిచితుడు

వచ్చి గబుక్కున ఆ పాత్రతీసి నీడలో పెట్టాడు. పాపం వాడికి ఏమి తెలుసు? వేరే ఎవరైనా ముట్టు కుంటే బ్రహ్మచారి తినరని! వారు ఆకలితోనే వుండిపోయారు. తినలేదు. ఇక అవధూత గణేశ్‌జీ బ్రహ్మచారికి (ఇపుడు వారి పేరు లీలానంద్) చూపించి చూపించి ఖిచిడీ తినేశారు. వారి మనసులో జాతి - ప్రాంత భేదము వుండేదికాదు. శ్రీ ఉగ్రానంద స్వామి వారు ప్రభావము బాగా తెలిసిపోయేది వారిపైన. నేను ఒక్కోసారి నవ్వుతూ 'అవధూత గారూ! సృష్టి ఎలా జరిగింది?' అని అడిగితే ఎపుడూ ఒకే జవాబు దొరికేది. 'సృష్టి అన్నది అసలే లేదు. ఎపుడూ లేదు. ఉండబోదు ఒక శుద్ధ - బుద్ధ - ఆత్మయే అద్వితీయ బ్రహ్మ!' అనేవారు. చాలా మస్తీలో వుండేవారు. ఒక రోజు వారి మట్టి పాత్ర పగిలిపోయింది. అది తీసుకోవడానికి 'చునార్' వచ్చారు. అక్కడి పాత్రలు తనకు నచ్చేవి. క్షణంలో ఏడ్చేశేవారు. క్షణములో నవ్వేవారు. ఒక క్షణము ఆదరంగా వుంటే మరోక్షణం కేకలు వేశేవారు. ఒక్కోసారి మఠ, మండలీయ మహాత్ములపైన కటాక్షం విసిరేవారు. వీరంతా సంగ్రహ-పరిగ్రహములు, రాగద్వేషములు కలిగినవారని, వేదాంతమంటే వీరికి ఏమీ తెలియదనీ అనేవారు. ఇంకోసారి బిక్షు శంకరానంద్‌పైన విరుచుకుపడేవారు. ఎందుకు మీరు మఠాధీశ్వరులను నిందిస్తారు? ఎవరిష్టము వచ్చినట్లు వారు వుంటారు. ఈ మిధ్యా ప్రపంచములో ఏది మంచి? ఏది చెడు? అని అంటుండేవారు.

మాలో ఎవరైనా భజన - ధ్యానము చేయడానికి కూర్చుంటే వారు గట్టిగా నవ్వుతూ అష్టావక్ర గీతలోని శ్లోకములు చెప్పేవారు -

త్యజైవ ధ్యానం సర్వత, మాకించిత్ హృది ధారయ ।
ఆత్మ త్వం ముక్త ఏవాసి కిం విమృశ్య కరిష్యసి ॥

ధ్యానం వదిలిపెట్టు, నీవు స్వయంగా ముక్తుడివి.

అయమేవ హితే బంధః, సమాధి మనుతిష్ఠసి.

తన స్వరూపము యందు నమ్మకము లేక ఏదో సాధన - సాధ్యముల యందు, ధ్యాన - సమాదుల యందు నమ్మకము పెట్టుకోవడము కూడా బంధనమే.

ఎవరో అడిగారు 'పదండి అవధూతగారూ! ఈ ద్వైత - అద్వైత శాస్త్రార్థము జరుగుతోంది. గొప్ప - గొప్ప విద్వాన్‌లు వచ్చారు'.

అవధూత అన్నారు-

అద్వైతం కేచిద్ ఇచ్ఛంతి, ద్వైతమిచ్ఛంతి చాపరే ।
సమం తత్త్వం నవిందంతి, ద్వైతాద్వైత వివర్జితమ్ ॥

ద్వైత-అద్వైతములు కూడా మత వాదములేగదా. ద్వైత-అద్వైతములను రెంటిని ప్రకాశింపజేసే స్వయంప్రకాశ అధిష్ఠానము ఏదైతే వుందో అదే సత్యము. అదే ఆత్మ!

ఒకసారి వారి పుత్రుడు హరిప్రసాద్ రస్తోగి, ధానాపూర్ నుండి బృందావనం వచ్చారు. అవధూత వారి పట్ల ధ్యానముంచలేదు. వారు ఎవరికో చెప్పి రోజు అవధూతగారికి పాలు తెచ్చి ఇచ్చే ఏర్పాటు చేశారు. అవధూతకు ఈ సంగతి తెలిసి చాలా కోప్పడ్డారు. పాలు తీసుకోవడం ఆపివేశారు. స్వయంగా తాను బృందావనము వదిలి ఎక్కడికో వెళ్ళిపోయారు. ఇలా జరిగినందు వలన ఇక వారి కుటుంబీకులు మరల వారితో సంపర్కము పెట్టుకోలేదు. ఎందుకంటే తాము రాకపోతే కనీసం వారైనా స్వామీజీ దగ్గర బృందావనంలో వుంటారు కదా అని. ధానాపూర్‌లో వారిది ఒక ప్రతిష్ఠితమైన సంపన్న కుటుంబము.

ఎవరైన తనతో ఎక్కువ సంపర్కము పెట్టుకోకుండా వుండేట్లుగా అవధూత గారు వుండేవారు. నా దగ్గరకు వచ్చి కూర్చుని తినే పళ్ళెములో నుండి తీసి ఇవ్వమని అడిగేవారు. ప్రేమానంద 'దాదా'కు ఈ మాట నచ్చేది కాదు. వీరు స్పృశ్యాస్పృశ్యము లను పాటించరని (కర్మ కాండలననుసరించి) బ్రహ్మచారి లీలానంద్‌కు కూడా ఇష్టముండేది కాదు. ఇక వేరే కొందరేమో వీరికి భక్తి - భగవానుడు అంటే ఉపేక్షా భావం వుందని అది నచ్చక దూరంగా వుండేవారు. శ్రీ ఉడియాబాబాజీ, శ్రీహరిబాబాజీ భక్తులు కూడా వీరు తమ గురు జనులకు ప్రణామము చెయ్యరని వారితో మాట్లాడేవారు కాదు. ప్రణామము నాకు తప్ప వారు మరెవ్వరికీ చేసేవారు కాదు. 'ఓం నమో నారాయణాయ' కూడా చెప్పేవారు కాదు. ఆత్మయే ఆత్మ, ఆత్మ కంటే వేరు అయినదంతా మిథ్యనే. ఎవరు ఎవరికి నమస్కరించేది అని అనేవారు.

నేను సన్యాసము తీసుకునే ముందే 'కల్యాణ్' పత్రికా సంపాదకీయ విభాగమును విడిచిపెట్టాను. కానీ నేను అనువదించిన 'శ్రీమద్భాగవతము' పైన ఒక శోధా పూర్ణ ప్రబంధము వ్రాసి వుంటిని. అది భాగవతాంకములో వచ్చింది. అది పాఠకులకు ఎంతో నచ్చింది. అది శ్లోకములతో పాటు ప్రకాశనము చేస్తే పాఠకులకు ఉపయోగపడుతుందని ఆ పనిమీద వారు నన్ను బృందావనము నుండి గోరఖ్‌పూర్ తీసుకువెళ్ళారు. నా వెంట అవధూతజీ కూడా వచ్చారు. వారు అక్కడ కూడా భిక్షాటనంతో జీవించేవారు. రోజంతా నిశ్శబ్దంగా మౌనంగా తన ధ్యాసలో ఆనందంగా వుండేవారు. అపుడపుడు చిన్న పిల్లలతో ఆడుకునేవారు. వారిని పిలిచి 'పద్మాసనము వెయ్యండి. వీపు, వెన్నెముక చక్కగాపెట్టి కూర్చోండి. చేతులు మోకాళ్ళ మీద పెట్టుకోండి. అర్ధనిమీలిత నేత్రాలతో కూర్చోండి. కదలకూడదు. ఇటు అటు చూడకూడదు'. పిల్లలు కూడా సంబరంగా అన్నీ చేసేవారు. అవధూతజీ 'దీనిపేరే సమాధి' అని చెప్పేవారు. పిల్లలు తిరిగి ఇంటికి వెళ్ళిన తర్వాత వారి తల్లిదండ్రులు అమ్మమ్మగానీ మీరు ఏం చేస్తున్నారు. అంటే మాకు అవధూతజీ సమాధిలోకి వెళ్ళడం నేర్పుతున్నారు, అనేవారు. అందరూ నవ్వేశేవారు. కానీ ప్రబుద్ధ వ్యక్తియే సమాధి విక్షేపము రెండూ కూడా ఆధ్యారోపమే అని అర్థం చేసుకునేవాడు. అక్కడ ఎవరైనా అవధూతకి నమస్కారం చేస్తే వీరు గట్టిగా 'శివోఽహం' 'శివోఽహం' అనేవారు. అక్కడ కూడా ఎవరితోనూ సరిగా కలవలేకపోయారు.

వారు స్వతంత్రులుగా, స్వావలంబులుగానే వుండేవారు. కుటియాలేదు. పైసా లేదు. శిష్యులూ లేరు. 85 సంవత్సరాలు దాదాపు వయసు వుంటుంది. అయినా తన పనులన్నీ తనే స్వయంగా చేసుకునే వారు. వృందావనంలోనివారు వారంటే అంత ఇష్టపడేవారు కాదు. ముఝఫర్ నగర్‌లోని పరమేశ్వర రదయాల్, శ్రీహరిశ్చంద్ర వారికి సేవచేయాలన్న దృష్టితో వారి సత్సంగ - భవనమునకు తీసుకెళ్ళారు. ఇక వారు చాలా సంవత్సరాల వరకు అక్కడే వుండిపోయారు. కానీ మృత్యు పర్యంతము ఇదే మాట చెబుతూ వుండేవారు 'దృశ్యము ఎక్కడుంది? దేహము ఎక్కడుంది? శరీరములో రోగము, అశక్తత ఎక్కువైనపుడు కూడా వారు 'శివోఽహం' 'శివోఽహం' అనే అంటూండేవారు. సత్సంగీయులు, బలవంతం చేసి అడిగేవారు

'మీకు ఏమిటి బాధ' అని 'కష్టము అన్న దానికి అస్థిత్వమే లేదు' అని అనేవారు. ఎవరో అడిగారు మీ అంతిమ సంస్కారము ఎలాగ చెయ్యాలి' అని. 'సంస్కారము, వికారము అన్నది ఏమీలేదు. 'శివోఽహం' 'శివోఽహం' నామరూపాలు నశించిపోతాయి. తత్వము - తత్వముగానే వుంటుంది' అని అంటుండేవారు.

పరమహంస శ్రీ జగన్నాధపురీజీ
(నేపాలి బాబా)

మనోగతి యెలా? ఎక్కడిది?

కళాకారుడు నా రేఖా చిత్రాన్ని గీచాడు. కొన్ని క్షణాలలోనే తయారుచేసి నా చేతుల్లో పెట్టాడు. దానిని చూచి మా తండ్రిగారి ముఖాకృతి గుర్తుకు వచ్చింది. చాలా సంవత్సరాల క్రిందటి మాట! నేను, వారిని ఏడు సంవత్సరాల వయసు వరకు చూచాను. నా ఆకృతి వారి ఆకృతి బాగా కలుస్తుందని ఈ సంగతెపుడూ ఆలోచించలేదు.

ఇపుడు నాన్న గారి ఆకృతి పూర్తిగా మనసులో రూపుదాల్చింది. గౌర వర్ణము, స్వస్థత, సుందరము అయిన శరీరము, పీట మీద కూర్చుని శంకరుడికి పూజ చేసేవారు, శివలింగముపైన బిల్వదళముల రాశి, తడిపిన అక్షతలు తర్వాత ప్రసాదం బెల్లం. ఘంట చప్పుడు వినగానే నేను ప్రసాదము కోసము పరుగెత్తేవాడిని. వారు ప్రేమతో నాకు ప్రసాదము ఇచ్చేవారు.

అదే సమయంలో నేపాలిబాబా వచ్చారు. వారిది అత్యంత ప్రభావపూర్ణమైన వ్యక్తిత్వము. స్వస్థము, సుందరము అయిన శరీరముతో గంభీరముగా వుండేవారు. నాన్న గారు లేచి నిల్చుని చేతులు జోడించి నమస్కరించారు. పరమహంసగారిని కూర్చోబెట్టారు. స్వాగత-సత్కారములయ్యాయి. పరమహంసగారు తన సంచి విప్పారు. అందులో నుండి ఎండుకొబ్బరి (గోలా), దుశ్శాలువ మరియు నేపాలి నాణెములు తీశారు. 'మీ అమ్మాయి వివాహము వున్నదికదా! తీసుకోండి! వీడ్కోలిచ్చేటప్పుడు

ఇవ్వండి.' అన్నారు. ఇది నేపాలి బాబా యొక్క ప్రేమ. అదే సంవత్సరము నాన్న గారికి పెద్ద కుమారుడైన రామమనోరథ్ ద్వివేది పదిహేను సంవత్సరముల వయసులో (అప్పటికే పెళ్ళి కూడా అయినది) హఠాత్తుగా మరణించారు. ఆడపిల్ల పెళ్ళి చెయ్యాలి. కానీ ఎవరి మనసులలోనూ ఉత్సాహము, ఆనందము లేదు. మంగళమయమైన నేపాలి బాబాగారి ఆశీర్వాదప్రభావం అవశ్యం వుండినది.

నేపాలి బాబా (పరమహంసంజీ) నేపాలి శాసకులలో ప్రభుత్వపు ఐదుగురు సదస్యులలో వీరు ఒకరు. వారు మా నాన్నగారి కంటే వయసులో పెద్దవారు. మా పితామహుల కంటే చిన్నవారు. మా వూరి నుండి రెండు మైళ్ళ దూరంలో 'ఖడాన్' మరియు 'కన్వర్‌పూర్'లకు మధ్య వారికి ఒక కుటీరము కట్టించారు. వారు సాధారణముగా ఆ విశాల వట వృక్షము క్రింద గడ్డితో కప్పబడిన ఆ కుటీరములోనే వుండేవారు. ఈ రెండు గ్రామముల వారు కూడా వారికి వంతులు వేసుకుని తయారైన భోజనాన్నే భిక్షగా తెచ్చి ఇస్తూండేవారు. వారు శాంతంగా, సౌమ్యంగా, ఆనంద మగ్నులై వెదురుతో తయారు చేసిన ఆ ఆసనంమీద కూర్చునేవారు. ఈ రెండు గ్రామాలవారు కూడా మా పరంపరలోని శిష్యులే. నేను మా పితామహుడి వెంట అక్కడికి వెళ్తూ వుండేవాడిని. నేపాలీ బాబాగారు లేచి నిల్చునేవారు. నన్ను చాలా ప్రేమగా తాకేవారు. బాబాజీ, బాబాజీ అని అంటూ తనతోపాటు కూర్చోబెట్టుకునేవారు. మిగతా అందరూ క్రింద కూర్చునేవారు. ఇలా చాలా సార్లు జరిగింది.

పరమహంసజీ యొక్క కుటీరమునకు కొద్ది దూరంలో ఒక అఘోరి సాధువు వుండేవారు. వారి 'ధుని' ఎప్పుడూ జ్వలిస్తూనే వుండేది. ఎవరి దగ్గరకయిన వెళ్ళడం, మాట్లాడటం వారికంత నచ్చేదికాదు. ఎక్కడ నుండి అయిన, ఎవరి నుండి అయిన ఏదైనా కొంచెం తినడానికి దొరికితే అది తినేవారు. వారికి ఒక నియమము వుండేది. రోజూ వారు తన మట్టిపాత్ర తీసుకుని మూడు మైళ్ళ దూరములో వున్న ధానాపూర్ ఛావనీకి తప్పక వెళ్తూండేవారు. రోజు రోజు వారు ఎందుకు వెళ్తున్నారని అడిగితే 'అక్కడ నాకు శ్రీరామచంద్రుడి దర్శనము కలిగింది. రాజ్యాభిషేకము జరుగుతూ వుంది. నలుగురు సోదరులూ వున్నారు. శ్రీ సీతా రామచంద్రులు సింహాసనముపై విరాజమానులైయున్నారు. ఇపుడు కూడా వెళ్తాను. అదే దృశ్యము కన్పిస్తుంది.

వెలిగిపోయే ఆ అపురూప దర్శనము చాలా ఆనందం కలిగిస్తుంది. వారు నియమము ఎపుడూ తప్పలేదు.

కాన్వర్‌పూర్ మరియు ఖడాన్ పూర్లలోని చెరువునీటి కోసము పరస్పరము వైమనస్యము వుండినది. నేపాలి బాబాగారి సేవలో ఈ రెండు గ్రామాలవారు కూడా శ్రద్ధతో సేవా తత్పరులై వుండేవారు. ఒకసారి కాన్వర్‌పూర్ ఠాకుర్ సీతారామసింహ్ భూమి విషయమై తగాదాపడి పట్‌వారి జుగల్ కిశోర్‌లాల్ మీద కేసు పెట్టారు. చిన్న కోర్టులోనేమో ఇద్దరికి శిక్షపడింది. ఠాకుర్ సాహెబ్ ఏమో తన పరువుకే దెబ్బ ఇది అనుకున్నారు. వారు చాలా పేరు ప్రతిష్ఠలు గలిగిన గొప్పవ్యక్తి. రాత్రివేళ వారి మొత్తము కుటుంబమంతా నేపాలి బాబా కుటీరం దగ్గరికి వచ్చారు. బాబాగారి కాళ్ళుపట్టుకుని ఏడవడం మొదలుపెట్టారు 'బాబా! మేమందరము చచ్చిపోతాము' (మర్యాదపోతే) బాబా వారిని బాగా కోప్పడ్డారు. తర్వాత మౌనంగా వుండిపోయారు. కానీ వచ్చిన వారెమో ఏడుపు ఆపలేదు. బాబా అన్నారు 'సరే! వినండి. ఏ రోజు కోర్టులో జడ్జి మీకు తీర్పువినిపిస్తాడో ఆ రోజు ఒక ఫకీరు సాధు వస్తాడు. వారిని విశ్వసించి వారు ఏమి చెబితే అది చేయండి. వారేమీ మీకు కష్టమయిన పని చెప్పరు. కానీ భయపడకండి, సంకోచపడకండి. ఠాకూర్ సాహెబ్ ముక్తులవుతారు అన్నారు. ఆ ఫకీరు ఏదో సాధారణమైన పని చేయించారు. జడ్జి అంతకు ముందు రోజు వరకు కూడా ఠాకూర్ సాహెబ్‌కి విరుద్ధంగా వుండేవారు. కానీ తీర్పు వ్రాసేటపుడు వారికి కడుపులో బాగా నొప్పి వచ్చింది. వారి చేతి నుండి కలం జారిపోయింది. ఆఖరికి వారు ఠాకూర్ సాహెబ్‌ని వీరి అపరాధము నిరూపించబడలేదు అని అంటూ వారిని వదలి పెట్టారు. పట్‌వారి యొక్క అపరాధము నిరూపించబడినది వారికి శిక్షవేశారు. ఇది ఏమి చమత్కారమో ఎవరికీ అర్థము కాలేదు. యిలాంటి చమత్కారములు చాలా విన్నాము. చూశాము. ఎవరైతే ఈ ఘటన తెలిసిన వారు వున్నారో వారు ఇప్పటికీ మహాత్ముల పట్ల శ్రద్ధాభక్తులు కలిగి వుంటారు. ఠాకూర్ పరివారంలో చాలా శ్రద్ధవున్నది. ఒకసారి ఠాకూర్ శ్యామనారాయణ సింహ్ యొక్క మానసికస్థితి చెడిపోయింది. అపుడు మోకల్‌పూర్ బాబా వారి అనుగ్రహంతో వారికి నయమయింది. శ్రద్ధలో ఆశ్చర్యజనకమయిన శక్తి వున్నది.

'ఖడాన్' గ్రామములో ఠాకుర్ మాధవ్‌సింహ్ అనే వయోవృద్ధుడు వుండేవాడు. ఆయన లోకుల వివాదాలలో పంచాయితీ చెప్పేవారు. పరమహంసజీ అంటే వారికి చాలా శ్రద్ధ వుండేది. 70-75 మంది సభ్యులుగల వీరి ఉమ్మడి కుటుంబపు పాలన పోషణ అంతా వీరే చూచుకునేవారు. వారు ఇంట్లోని చిన్న పిల్లల వరకు అందరి భోజనము అయ్యాకనే తను తినేవారు. వారు ఇలా అనేవారు - 'జీవితము యొక్క గతి ఎవరికీ తెలియదు. మంచితో చెడు, చెడుతో మంచి జరుగుతూ వుంటుంది. ఎవరినీ ఎక్కువగా పొగడకూడదు. వారినే మరల నిందించవలసి వస్తుంది. ఎవరినీ ఎక్కువగా నిందించకూడదు. మరల వారినే పొగడవలసి వస్తుంది. ఏదైనా ఎవరైనా ఒక ప్రతిజ్ఞ చేశారు అంటే దానిని తప్పక పూర్తి చెయ్యాలి అని వారి సిద్ధాంతము. ఎవరికైన సహాయము చేయడానికి ఒప్పుకుని మరల నిరాకరించరాదు. లేదా నిరాకరించినా తర్వాత మరల సహాయం చేసినా అది ఫరవాలేదు. దానివల్ల హాని ఏమీకలుగదు. నేపాలి బాబాగారి ప్రభావం వారిపైన బాగా వుండేది.

'ఖడాన్' గ్రామములో ఠాకుర్ లక్ష్మన్ సింహ్, హర్‌గేంద్ సింహ్, దీపనారాయణ సింహ్ అని చాలా ప్రతాపవంతులైన పురుషులుండేవారు. వారి వంశంలో కూడా రెండు తరాల వరకు పరమహంసజీపైన భక్తి అలాగే వుండినది. ఠాకుర్ గిరిజాసింహ్‌కి గోస్వామి తులసీదాస్ గారు రచించిన 12 గ్రంధాలు కంఠస్థము వచ్చేవి. 'వినయ-పత్రిక' లోని భజనలు పాడుతూ పాడుతూ వారి నేత్రాల నుండి అశృవులు కురిసేవి. భావావేశములోకి వెళ్ళేవారు. భగవాన్ శ్రీరామచంద్రుడి భక్తుడు. అక్కడి వాతావరణములో ఒక నిర్మలమైన ప్రభావము దృష్టిగోచరమయ్యేది.

ఒకటే వట వృక్షం తన ఊడలతో నాలుగు దిక్కుల వ్యాపించివుంది. దాని నీడలో వేల కొద్దీ జనం కూర్చోగలిగేవారు. అందు వలన అక్కడ సభలు కూడా జరుగుతూ వుండేవి. వేరే వూరి వాళ్ళు కూడా వచ్చేవారు. ఈ దివ్య పురుషుడి (పరమహంసజీ) దర్శనము వలన ఎవరికి ఆనందము కలుగదో చెప్పండి! 'కాదిరాబాద్' యొక్క ఠాకుర్ సాహబ్ ప్రసిద్ధ నారాయణ సింహ్ చాలా సరళమైన వ్యక్తి, వారి ఈ గుణమువలననే రాజనీతి, సామాజిక మరియు వ్యావహారిక రంగములలోనే కాక అన్ని పనులలోను వారికి సఫలత లభించేది. నేపాలి బాబా

పరమహంసజీ వారి కారణముగా 'కంవయీ' ఠాకుర్ దశరథ సింహ్ ఒక సత్పురుషుడయ్యారు. భదాహు యొక్క ఠాకుర్ జుగల్‌కిశోర్ సింహ్ ఎంత ఉదారులైనారంటే వారు ఇతరులకు తినిపించి కావాలంటే తాను ఆకలితో ఉండిపోవడంలో సుఖం, సంతోషము ఉంది అనుకునేవారు. ఇంతకూ చెప్పవచ్చేదేమిటంటే పరమహంసజీ అక్కడ విరాజమానులై వున్నందుకు ఆ విశాల భూఖండముపైన వారి సద్గుణములతో సద్భావయుక్తమైన వాతావరణము ఏర్పడిపోయింది. ప్రజలు గ్రామగ్రామాలలో ఏకత్రితయై రామాయణ పారాయణలు చేయసాగారు. నేపాలి బాబా యొక్క కుటియా దగ్గర కూడా వచ్చి పారాయణం చేసేవారు. భండారా (భోజనాలు) కూడా చేసేవారు. పరమహంసజీ యొక్క ప్రభావం వలన చౌధరి వేణీ ప్రసాద్, శ్రీహరి నందన్ గారు ఎంత సజ్జనులు, సౌమ్యులు అయిపోయారంటే వారి ప్రత్యేక వ్యవహారములో కూడా శ్రద్ధ, సేవ కనిపించేవి. ఒకటి ఆలోచిస్తుంటే దానికి సంబంధించినవి ఎన్నో సంగతులు గుర్తువస్తాయి. ఈ మనసు ఎక్కడి నుండి ఎక్కడికి గెంతుతుందో తెలియదు. సంబంధంపైన సంబంధం జోడించుకుంటూ పోతూంటుంది. ఇది మీరు ఇపుడు చదువుతూనే వున్నారు.

నేను నా విద్యాధ్యయనము కోసము 'మహారాయీ' గ్రామము నుండి కాశి వెళ్ళిపోయాను. మధ్యలో అపుడపుడు వూరికి వస్తూ పోతూ వుండేవాడిని. పరమహంసజీ ఒక్కోసారి నేపాల్ కాని మరి ఎక్కడికైన అన్యత్ర వెళ్తూ వుండేవారు. దానితో కలుసుకోవడం తగ్గిపోయింది. కాశీ నుండి తిరిగి వచ్చిన తర్వాత ఒక రోజు ప్రాతఃకాలము బ్రహ్మముహూర్తములో ఆసనంపైన కూర్చుని మాలతో జపం చేస్తున్నాను. ఎంత ఎక్కువ చెయ్యగలిగితే అంత ఎక్కువ చేయడానికి ప్రయాస పడుతున్నాను. ఈ మధ్యలో పరమహంసగారు అన్నారు 'అదేమిటి! అలాగున ఎపుడైన జపము చేస్తారా?' నేను కళ్ళు తెరిచినాను. లేచి నమస్కరించాను. వారు నన్ను హృదయానికి హత్తుకున్నారు. శాంతంగా కూర్చోబెట్టి ఇలా చెప్పారు -'మంత్రము ఏదైనా అది భగవంతుడి పేరే! ఇష్టదైవము ఏదైనా ఆ మూర్తి భగవంతుడే! మంత్ర జపములో శీఘ్రత ఉండకూడదు. 'రామ్' అని ఉచ్చారణ చేసేటపుడు ఎంత గంభీరంగా చేయాలంటే 'రా' యొక్క ఉచ్చారణకు 'మ' కు కొద్దిగ సమయం వుండాలి 'రామ్' 'రా..మ్' అని ఇలాగ. సత్కార పూర్వకముగ ధీర-గంభీర భావంతో మంత్రము

యొక్క ఉచ్ఛారణ చేయాలి. దీని వలన మనసులో సంకల్పములు రావు. ఎపుడయితే మనసు ఖాళీ అవుతుందో అపుడు అందులో ఇష్టదైవము యొక్క ప్రకాశము కలుగుతుంది. వారు స్వయంగా రెండు, మూడు సార్లు తాను పలికి చూపించారు. అలాగ నేను అడగకుండానే వారు నాకు జపము చెయ్యడానికి ఆదేశము ఇచ్చారు. యధాశక్తి నేను వారు చెప్పినట్లు జపం చెయ్యడానికి ప్రయత్నించేవాడిని. తర్వాత మరల వారు ఎక్కడికో వెళ్ళిపోయారు.

నేను బ్రహ్మసలిల భాగీరథీ నదిలో స్నానం చేసి బయటికి వచ్చాను. దూర దూరము వరకు ఇటు, అటు విశాలమైన ఇసుక తిన్నెలు వ్యాపించివున్నాయి. గంగానది అవతలి ఒడ్డున ఇసుకలో ఒక పర్ణకుటీరము కనిపించింది. అక్కడ విచారిస్తే ఇపుడు అందులో 'శ్రీకృష్ణానంద సరస్వతి' వారు వున్నారని తెలిసినది. చాలా ప్రభావశాలి. బరౌనికి దగ్గర 'జాగతానంద ఆశ్రమము' వున్నది. శాంకర అద్వైతములో వారికి సంపూర్ణమైన నిష్ఠ వుండేది. విద్వానుడు, అనుభవి, వారి వద్ద ఎపుడూ 'అద్వైతం' జోరుగా సాగేది. 'భక్తి' చర్చ వుండేది కాదు. నాకు మనసులో అనిపించింది- 'భక్తిని నిరోధించే వేదాంతము అది ఏమి వేదాంతము' అక్కడి నుండి వెనక్కు తిరిగాను. దగ్గరలో వున్న 'పలాశ'వనములోకి వెళ్ళాను. ఒక దగ్గర ఎండిపోయిన కాలువ (వర్షాకాలపు కాలువ)లో ఆసనం వేసుకుని కూర్చున్నాను. సంక్షేపముగా సంధ్యా వందనము, గాయత్రి జపము చేసి 'కృష్ణ' 'కృష్ణ' అని దీర్ఘంగా ఉచ్ఛారణ చేయడం మొదలు పెట్టాను. మనసు ఇష్ట దైవము యొక్క ధ్యానంలో లీనమయింది. తన్మయత కలిగింది. ఒక చమత్కారము జరిగింది. నేను కూర్చున్న వాడిని కూర్చున్నట్లుగానే వున్నాను. కళ్ళు తెరుచుకునే వున్నాను. ఎదుట ప్రకాశ-పుంజము! అందులో ఒక గౌరవర్ణమూర్తి తెల్ల పూవులతో కిరీటము! హారము, కేయూరము, కంకణములు, కరఘనీ నూపురములో అన్నీ వున్నాయి. కానీ అన్ని పువ్వులతోనే! వస్త్రము కూడా పుష్పములతోనే. ఊయల అయితే లేదు కానీ, ఆ మూర్తి మాత్రము పైకి క్రిందికి ఊయలూగుతున్నట్లుంది. అధరములలో మందహాసము. నాసికాభరణం కూడా పుష్పమే. నేత్రాలలో ప్రేమ నిండి వున్నది. కనుబొమలు అనుగ్రహాన్ని వర్షిస్తున్నాయి. నాలో ప్రశ్న ఉదయించింది. 'ఇతడు మురళీకృష్ణుడయితే మరి తెల్లగా వున్నాడే?'

భగవద్వాణి వినిపించింది. 'నేను గౌరవర్ణుడను. నేను కృష్ణుడను. రూపము రంగు బేధమయినంత మాత్రాన నాలో బేధమేమీ లేదు. కావాలంటే పేర్లు వేరు వేరుగా పెట్టుకో' ఆ సమయములో దేశము, కాలము, నా శరీరము, పేరు మొదలైనవి ఏవీ స్ఫురించడము లేదు. మనసు యొక్క రూపము కూడా నేను ఏదైతే చూస్తున్నానో అదే! కొంతసేపటికి సావధానుడనయ్యాను. పరమహంస 'నేపాలీ బాబా' ఎదుట నిలుచుని నవ్వుతున్నారు. వారు అన్నారు 'భక్తి అందరిని భగవన్మయులను చేస్తుంది. మనసు భగవంతుడు. మనసు యొక్క విషయము కూడా భగవంతుడే.

గోరఖ్‌పూర్ 'కల్యాణ్' (పత్రిక) పరివారములో వెళ్ళిన తర్వాత అపుడపుడు ఇంటికి వస్తూ వుంటిని. పరమహంసజీ సమాచారము తెలుస్తూండేది. ఒక రోజు 'ఖడాన్' గ్రామము నుండి ఒక సజ్జనుడు వచ్చాడు. 'పరమహంసజీ గారి స్థితి (ఆరోగ్యము) ఏమీ బాగాలేదు. బహుశా శరీరము ఇక ఉండదేమో. మీరు రండి' అని చెప్పారు. నేను వెంటనే లేచి బయలుదేరాను. పరమహంసజీ కళ్ళుమూసుకుని పడుకుని వుండిరి. శ్వాస నిదానంగా ఆడుతూవుంది. ముఖము పైన శాంతత! సౌమ్యత! ప్రకాశిస్తున్నాయి. నిర్భావము, నిస్సంకల్పము, వారి స్థితి! అపుడపుడు పెదవులు కదిలించేవారు. ఓం, ఓం అని ఓంకారాన్ని ఉచ్ఛరిస్తున్నారేమోనని అనిపించేది.

సన్యాసియొక్క మృత్యు సమయంలో ఏం చేయాలో గ్రామీణులకు తెలియదు. వారు గోదానము చేయించారు. అక్కడ ఎకత్రితమయిన ప్రజలు నాతో పరమహంసగారి సంచిని విప్పమన్నారు. అందులో ఒకటో రెండో రుద్రాక్షలున్నాయి. గండకీ శిల వున్నది. నాలుగయిదు నేపాలీ నాణాలు, భస్మము మరియు నేపాలీ సదస్యుడు అని తెలిపే ఒక కాగితము ప్రమాణ పత్రము వుండినవి. అందులో మహావాక్యము వ్రాసి వున్నది. 'ఇవి మీరు తీసుకోండి' అని అక్కడి ప్రజలు అన్నారు. 'వారు నాకు ఇవ్వనిదే నేను ఎలాగ తీసుకుంటాను' అని నేను అన్నాను. అంత తోగత్వా (ఆఖరికి) వారి శరీరముతో పాటే గంగానదిలో వాటిని ప్రవాహితము చేశాము. అన్ని నామ-రూపాలు వాటి మూల తత్త్వముతో ఏకమవుతాయి. మేఘము, తరంగము, జ్వల, ప్రాణము, ఇవేవీ పంచభూతములతో వేరుకాదు. చైతన్యముతో చైతన్యము వేరు కాదు. ఈ ఏకత్వమే అంతిమ సత్యము.

ఇక అక్కడ మొదట్నుంచి వున్నది రిఖాయిరామ్ బాబా - వీరు పరమహంసజీ రాక ముందు కూడా అక్కడే వుండేవారు. తర్వాత కూడా అక్కడనే వున్నారు. ఆ ధునీ అలాగే జ్వలిస్తూండేది. రోజు అలాగే నియమము తప్పకుండా ధానాపూర్ వెళ్ళిరావడము జరుగుతూండేది. ఇది 1938వ సం॥ నాటి మాట. వారు మా ఇంటికి వచ్చారు. 3 రోజులు వున్నారు. 'ధుని' వెలుగుతూ వుండేది. సాయంకాలము ధానాపూర్ వెళ్ళి వచ్చేవారు. వెళ్ళిపోయేముందు నన్ను పిలిచి ఇలా అన్నారు - 'బాబాజీ! ఇక్కడ రండి!' నన్ను అందరూ బాబాజీ అని అనేవారు. నేను దగ్గరకెళ్ళి నిలుచున్నాను. వారన్నారు - 'చూడు! పృథ్వి అఘోరము. మలమూత్రవిసర్జన చేసినా, లేదా పూజ చేసినా ఎపుడూ చెడుగా అనుకోదు. జలము, అగ్ని, వాయువు, ఆకాశము కూడా అఘోరములే, ఎపుడూ మంచి, చెడులను విభేదించదు. అందరికి సమానరూపముల లభిస్తుంది. మనసు అఘోరము. మంచి-చెడులు మనసులో వస్తూ-పోతూ వుంటాయి. ఆత్మ అఘోరము. అది మంచి-చెడు రెంటిలోనూ ఒకటిగానే వుంటుంది. మంచి-చెడు, సంస్కార-వికారాల వలన కలుగుతాయి. అవి ఏవీ తత్త్వములో వుండవు. ఇక ఆత్మ-పరమాత్మాలో ఎలా వుంటాయి? అఘోరము శివుడు, ఆత్మ, పరమాత్మ, బ్రహ్మ. ఇక నేను వెళ్తున్నాను. మరల తిరిగిరాను'. ఇక వీరినెపుడూ చూడలేదు. సరే! ఇక ముందుకు పోదాము.

కాన్వర్‌పూర్, ఖడాన్ గ్రామాలు ఇపుడు కూడా వున్నాయి. ఛిన్న-భిన్నమయిన వట వృక్షము కూడా వుంది. కుటీరము వున్న విశాలప్రాంగణలో ఇపుడు స్కూల్ తయారైనది. ఇపుడు కూడా శూరులైన క్షత్రీయులు అక్కడ వున్నారు. కానీ పరమహంసజీ లేరు. రిఖాయిరామ్‌బాబా లేరు. ప్రపంచము మారిపోయింది. శరీరము మనసు కూడా మరిపోయింది. నేనయితే నేనే. గృహస్తు, సాధువు, తండ్రి, పుత్రుడు, ముదుసలి, యువకుడు అన్నీ నామ మాత్రము గానే. మనసు యొక్క రూపములే. మనసు యొక్క నిర్మాణమే. నా రేఖా-చిత్రములో నుండి ఇవన్నీ బయటికి వచ్చాయి. నా మనసును చూసుకుని చూసుకుని ఆనందిస్తున్నాను. ఉపలబ్ధియే ఆనందము.

స్వామి శ్రీ ప్రేమపురీజీ మహరాజ్

దూరం నుండి అనుకునే వాడిని అగ్ని అని, దగ్గరకు వెళ్ళాక తెలిసింది రత్నమని. పాషాణమనే భ్రమ వుండినది. స్పర్శిస్తే అది గులాబీ పువ్వు. లోకులు అనేవారు వజ్రమని, కలుసుకున్న తర్వాత అనుభవమైంది! ఆశ్చర్యము! ఆస్వాధ్య నవనీత కోమల వెన్నముద్ద. వస్తుతః అలాగే వుండే వారు శ్రీ సామి ప్రేమపురీజీ మహరాజ్! వారి క్రోధములో కూడా హితభావన వుండేది. వారి విదిలింపులలో కూడా ఒక స్నేహభావం వుండేది. వారి కఠోరతలో కూడా ఒక ఆర్ద్రతా, మాధుర్యము గుప్తంగా వుండేవి. వారి హృదయంతో మా హృదయము ఎపుడూ ఏకమయినదో అపుడు వారిని గురించి విన్నటువంటి అన్ని భ్రాంతులు, కర్పూరము లాగ ఎగిరి ఎటు విలీనమయ్యాయో తెలియలేదు. వారు నిజముగా ఒక విలక్షణులైన విచక్షణ కలిగిన మహాపురుషులు.

స్వామి ప్రేమపురీజీ మహరాజ్ తత్త్వసాక్షాత్కారం కోసము హిమాలయములలో విచరణ చేశేవారు. వివేక వైరాగ్యములు, షట్-సంపత్తి మరియు తీవ్ర ముముక్షా మొదటి నుండే వుండేది. సద్గురు శ్రీ ప్రకాశానందపురీజీతో వేదాంత శ్రవణము పూర్ణముగా చేసినా కూడా ఇంకా ఆవరణ భంగము కాలేదు. ఉపనిషత్తులయొక్క ప్రమాణము, ప్రమేయము బ్రహ్మాత్మైక్యము వీటిని గురించి ఏ సంశయము లేదు. అయినా కూడా మనన నిధి ధ్యాసనము చేస్తుండేవారు. 'అది ఎలాంటి ప్రతిబంధమో! తెలియదు దాని కారణంగా అనుభవములో స్పష్టత, స్ఫుటత రావడములేదు'. ఈ చింతతో వ్యాకులతతో వేగిపోయేవాడు. యదార్థ పరమార్థము యొక్క ప్రేమ కలిగాలి, పరిచ్ఛిన్నతయొక్క, సంసారము యొక్క భ్రమ నివృత్తమవాలి - ఈ ఉత్కంఠత కారణంగా వారికి నిద్ర పట్టేదికాదు. అన్నిటి కంటే గొప్ప దుఃఖము అజ్ఞానము.

ఎందు కంటే అజ్ఞానములోనే అంధకారము, మృత్యువు యొక్క నివాసము వుండేది. ఈ అజ్ఞానము నుండి ముక్తి పొందాలంటే దీర్ఘకాలము వరకు ప్రయత్నించిన సఫలత లభించలేదు. అపుడు స్వామీజీ ఇలా నిశ్చయించుకున్నారు - ఇలాంటి శరీరాన్ని పట్టుకుని ప్రయోజనమేమిటి? దేని వలన పూర్ణ ఆనందము, పూర్ణ జ్ఞానము యొక్క ప్రకాశము లేదో! దానిని గంగానదిలో విసర్జించితే? ఈ సంకల్పముతో వారు ఆదిబద్రి దగ్గరవున్న గంగాతటమునకు వచ్చి కూర్చున్నారు. 'ఆవేగము, ఉద్వేగము, లేక భావావేశముతో శరీర త్యాగము చెయ్యడము ఉచితము కాదు అని నిశ్చయించుకుని - మూడు రోజులు ఉపవాసము చేసి తర్వాత ఈ శరీరమును గంగానదిలో సమర్పణ చేస్తాను' అని అనుకున్నారు.

మూడవ రోజు వారి దగ్గరికి ఒక కాషాయాంబరధారిణియైన వృద్ధమాత వచ్చింది. వారి ముఖంపైన తేజస్సు వుండినది. కల్యాణమయమయిన వాణిలో ప్రభావము వుండినది. గంభీర స్వరముతో అడిగినది - 'మీరు ఇక్కడ ఎందుకు కూర్చున్నారు?' స్వామీజీ నిష్కపట భావంతో (అది వారి స్వభావము) ఇలా అన్నారు - 'నేను బంధనము నుండి ముక్తుడనవడానికి దేహ పరిత్యాగము చేయాలనుకుంటున్నాను' మాతాజీ నవ్వేశారు. 'అలాగా! అదా సంగతి! మంచిది! త్యాగము! దేహ త్యాగము తాదాత్మ్యత్యాగము వలన కలుగుతుంది. బుద్ధి పూర్వకముగ మరణించడము వలనయితే తాదాత్మ్యత ఇంకా దృఢమవుతుంది. సరే మంచిది స్వామీజీ! మీరు విచారణ చేసి నాకు తెలపండి మీకు బంధనము ఎక్కడ వున్నదో? ధనము, స్త్రీ, పుత్రులు, పరివారము - వీటి బంధనము వున్నదా? బంధనములో విశేషముగ రెండు పదార్థాలుంటాయి. బంధు మరియు ధనము. వీరు వీటినన్నిటిని పరిత్యజించి వచ్చారు. సరే! మీకు ముక్తియొక్క అనుభవము కలుగడము లేదా? మీరు ఒకటి రెండు రోజులు బాగా ఆలోచించి, చింతన చేయండి. నేను మరలా మీ దగ్గరికి వస్తాను. మీరు నాకు మీ 'బంధనం' చూపెట్టండి. ఒక వేళ బంధనము ధృశ్యమయితే నేను దాని అత్యంతాభావమును మీలోనే చూపెడతాను. ఎపుడైతే మీకు మీలోనే బంధనము యొక్క అత్యంతాభావమును చూస్తారో, ఇక అపుడు ఏ అధికరణములో ఏ వస్తువుయొక్క అత్యంతా భావము వుంటుందో, దానిలోనే ఆ వస్తువు కనిపించిందంటే అది మిథ్య అన్నమాట ఈ సంగతి మీకు మొదటే తెలుసు.

బంధనమన్నది కేవలము మిథ్య. ఆత్మ అబాధిత సత్యము (అకాట్యము). ముక్తి ఎక్కడి నుండో వస్తుంది లేదా అది లభ్యమవడానికి కొంచెం ఆలస్యమవుతుంది, అని ఇలా అనుకోవటానికి ముక్తి ఏమైనా అన్యమయినదా? దూరం అనుకోవడానికి, వస్తుతః బంధనము యొక్క అత్యంతాభావోపలక్షితమయిన ఆత్మయే ముక్తి! నేను మరల వస్తాను. నీవు బంధనం చూపించు. నేను నీకు ముక్తి చూపిస్తాను. మీరే-మీరు భేదమెక్కడ? ముక్తి-బంధనము అన్న భేదము మిథ్య, కల్పితము. అని చెప్పి ఆ మాత అదృశ్యమయిపోయనది.

స్వామీజీకి కళ్ళు తెరిచినట్లయింది. వారికి ఒక అనుశిష్ఠము స్పష్టము అయిన ప్రకాశము యొక్క దర్శనము కలుగసాగినది. అది క్లిష్టము కాదు. శ్లిష్టము కాదు. అవినాశి 'ఇష్ట' మరియ 'మిష్ట' (ఆనందము) స్వామీజీకి అనుభవము కలిగినది. బంధనము-ముక్తి వీటి భేదము కేవలము అజ్ఞానమూలకమే అని! అజ్ఞాన నివృత్తి మహావాక్య జన్యమయిన బ్రహ్మాత్మైక్య జ్ఞానముతోనే జరుగుతుంది. జ్ఞానముతో అజ్ఞాన నివృత్తి కలిగిన తర్వాత, స్వతఃసిద్ధము స్వయం ప్రకాశమయనిది అవినాశి ఆత్మతత్త్వమే. దానిలో ఏదో చెయ్యటము, చేయించటము ఇలాంటివి ఏమీ లేవు. (స్వతఃసిద్ధము)

స్వామీజీతో చాలా మొదట్లోనే కలుసుకున్నాము కానీ దూర దూరంగానే, వారు నా కంటే 30 సం॥లు వయసులో పెద్దవారు. వారు మహామండలేశ్వరుడుగా కూడా వుండేవారు. వారు అందరిని అపుడపుడు చాలా కోప్పడతారని, అరుస్తారని విని వుండడము వలన వారి దగ్గరకు వెళ్ళడానికి సంకోచము కలుగుతుండేది. దైవీ సంపద్ మహా మండలి వారి స్పెషల్ యాత్రా ట్రైన్ దక్షిణ భారతము నుండి తిరిగి ఎపుడయితే బొంబాయి చేరిందో అపుడు బొంబాయి ప్రేమ కుటీర్ సత్సంగము వారు మమ్ములను ఆహ్వానించారు. వారిలో హరికిషన్ దాస్ అగ్రవాల్, బచ్చూభాయి డ్రేస్‌వాలా మొదలయినవారు ముఖ్యులు. స్వామీజీ స్వయముగా స్టేషనుకు వచ్చారు. మేమంతా చాలా సంతోషముగా 'ప్రేమ కుటీరము'కు వచ్చాము. అక్కడ ప్రవచనము జరిగింది.

నేను శాంకర వేదాంతము ప్రకారము 'తత్త్వ-జ్ఞానము' ప్రతిపాదన చేశాను. అది ఏమిటంటే తత్త్వము ఒక యదార్థ వస్తువు. అందువలన దాని సాక్షాత్కారము కేవలము ప్రమాణముతోనే జరుగుతుంది. ప్రమేయసిద్ధి ప్రమాణముతోనే

కలుగుతుంది. ఒకవేళ తత్త్వమును నిర్మాణము చెయ్యాలి అంటే, దానిలో కర్మ, ఉపాసన, యోగము మొదలైనవి సాక్షాత్ సాధనలు కావచ్చు. కానీ తత్త్వము అయితే స్వతఃసిద్ధము సాక్షాత్ అపరోక్షము అందువలన తద్విషయకమైన అవిద్యా నివృత్తియే అపేక్షితము. అది మహావాక్య జన్యమయిన 'ప్రమా' వలన కలుగుతుంది. 'ప్రమా' పూర్వజన్మ కర్మ వలన గానీ, ఈ జన్మలోని కర్మ వలన గానీ కలుగదు. వేదాంత ప్రమాణము వలననే కలుగుతుంది. అవిద్యా నివృత్తి కలిగిందంటే దాని ప్రయోజనము సిద్ధించినట్లు. అందువల్ల కర్మ యొక్క ఆవశ్యకత ఏమీ లేదు. కాబట్టి తత్త్వజ్ఞానము కర్మజన్యమయినది కాదు. కర్మ - జనకము కాదు. ఇది సంస్కారము కాదు. సంస్కారమును పోగొట్టేది. ఇది కర్మ, ఉపాసనా మొదలైన వాటి కోసం కూడా కాదు.

నా తర్వాత వచ్చిన వక్త మహాశయుడు నా ప్రవచనముపైన కటాక్షము విసురుతూ ఎలా చెప్పారంటే - తత్త్వజ్ఞానము అనంతరము నిష్కామ భావముతో అవశ్యము కర్మ చెయ్యాలి. వారు గీత యొక్క సిద్ధాంతాన్ని ఆధారంగా చెప్పారు. అలాగ ఆవక్తామహాశయుడితో మాకు బాగా స్నేహం. మేము నెలల కొద్దీ ఒకేచోట వుండేవారము. ప్రవచన సమయములో ఒక సిద్ధాంతమును ప్రదానముగా తీసుకుని నేను చెబితే, వేరొక దాన్ని ప్రధానంగా తీసుకుని వారు చెప్పేవారు. మేము ఇలాగే ఒకరినొకరు ఖండన-మండన చేసుకుంటూ వుండేవారము. భిన్న భిన్న అధికారులకు ఇద్దరి మాటలు ఇష్టమయ్యేవి. కానీ, స్వామీ ప్రేమపురీజీకి మా స్నేహితుడి మాటలు నచ్చలేదు. వారు తమ అధ్యక్ష భాషణములో సభలో వారి మాటలను ఖండించారు. నేను చెప్పిన గంభీరమైన వేదాంత చింతనము, స్పష్ట-భాషణము వారికి చాలా నచ్చింది. ఇక ఇక్కడ నుండి మాకు వారికి ఘనిష్టత మొదలయింది.

స్వామీ ప్రేమపురీజీ వారి ప్రేరణతో బొంబాయిలో వేదాంత-సమ్మేళనము ఏర్పాటు చెయ్యాలని నిశ్చయమయింది. స్వామీజీ నన్ను బృందావనము నుండి పిలిపించడానికి ప్రవీణ్ నానావటి గారిని పంపించారు. సమ్మేళనము జరిగింది. దేశములోని పెద్ద-పెద్ద వేదాంతులయిన మహాత్ములు, గృహమంత్రి గుల్జారిలాల్ నంద గారు వచ్చారు. స్వామీజీ ప్రత్యేకముగా అన్ని సమయములలోనూ నన్ను ముందువుంచేవారు. వారి నేత్రాలలో నేనంటే ఎంతో ప్రేమ మెరిసిపోయేది. వారు

నవ్వుతూ నాతో మాట్లాడినపుడు వారి బోసినోరు వారి ముఖమండలము ఒక విశేష ప్రకారమయిన వెలుగుతో మెరిసిపోయేది. సమ్మేళనము అయిన తర్వాత కూడా వారు నన్ను వెళ్ళనివ్వలేదు. ప్రేమ కుటీరములో, ఇంకా వేరే వేరే సేఠ్‌ల ఇళ్ళల్లో వ్యక్తిగతముగా కూడా నాతో ప్రవచనములు ఇప్పించారు. స్వామీజీ కొందరికి నన్ను గురించి 'వీరు శ్రీమద్భాగవతము చాలా బాగా చెబుతారు, గీతాప్రెస్ నుండి వీరి అనువాదము ప్రకాశితమయినది. చాలాబాగుంటుంది. మీరు వారికి చెప్పండి భాగవత కథ చెప్పమని' అన్నారు. స్వామీజీకి వేదాంతము కంటే వేరే ఏ చర్చ కూడా రుచించేదికాదు. కానీ వారికి నాపట్ల చాలా స్నేహభావము ఉండేది. అందుకని అంగీకరించారు కానీ, ప్రేమ కుటీరములోని వేదాంత హాలులో కాదు. తన ఫ్లాట్‌పైన వున్న హాలులో, సాయంకాలము అందులో వంద మందిదాకా శ్రోతలు వస్తూండిరి. మొదటిరోజే చమత్కారము జరిగింది. స్వామీజీ వారి నేత్రాల నుండి అశ్రువులు కురిశాయి. ఎవరైన చిన్నపిల్లవాడు ముగ్ధభావంతో కథ విన్నట్లుగా స్వామీజీ చాలా ప్రేమగా శ్రీకృష్ణలీల శ్రవణము చేయసాగారు.

కథా ప్రసంగములో మధ్యమధ్యలో వేదాంత చర్చ కూడా చేస్తుండేవాడిని. నేను ఇలా చెప్పేవాడిని - 'అధికాంశము వేదాంతులు దేహాదిరూప దృశ్యములతో తమ ద్రష్టా ఆత్మ యొక్క వివేకము విచారణ చేస్తారు. మరియు మహావాక్య జన్యమయిన చరమావృత్తితో ఆత్మను బ్రహ్మ అని కూడా తెలుసుకుంటారు. కానీ అపవాద సంస్కారము వారి బుద్ధిలో ఎంత ప్రబలమయిందంటే అన్వయ దృష్టి వారికి స్ఫురించనే స్ఫురించదు. వివేక విచారములు చేసేటపుడు వ్యతిరేక (అన్వయ వ్యతిరేకాలు) ప్రధానముగా వుండాలి. కానీ బోధ కలిగిన అనంతరము అన్వయ దృష్టి స్వయంగానే కలుగుతుంది. దాని అర్థము ఘటము, కుండలము వీటి కంటె, మృత్తిక, స్వర్ణము విలక్షణము. కానీ మృత్తిక స్వర్ణము కంటె వేరుగా ఘటము, కుండలములకు అస్థిత్వమే లేదు. అభిప్రాయము ఏమిటంటే బ్రహ్మాత్మ ఐక్యబోధ కలిగిన తర్వాత జగత్తు యొక్క సత్తా, స్ఫూర్తి కూడా అధిష్ఠాన చైతన్య స్వరూపమే అవుతుంది. అందువలన బోధవంతుడైన జ్ఞానికి దృశ్యము యొక్క ప్రతీతిని చూసి ద్వేషించవలసిన అవసరము లేదు. ఇంకా దృశ్యము కూడా తన ఆత్మస్వరూపమే. దీనివలననే ఉపనిషత్తులలో 'స', 'ఆత్మా', 'బ్రహ్మ', మరియు 'అహం' అన్న నాలుగు

పదాలను ప్రయోగించి పైన, క్రింద, ముందు, వెనుక అంతట బ్రహ్మమే అన్నారు. ఇది ఉపాసనాశ్రుతి కాదు. ఇది తత్త్వజ్ఞుడి దృష్టి యొక్క అనువాదము. కాబట్టి సంక్షేప శారీరకాకారుడు - సాధారణ బుద్ధితో పరిణామము, శుద్ధ బుద్ధితో వివర్తము మరియు బ్రహ్మ బుద్ధితో ప్రపంచమును తన స్వరూపముగా తెలిపినారు.

ఈ విధముగా కూడా ప్రతిపాదన చేస్తూవుంటిని - ఆకృతిహీనమైన సత్తా చిత్ స్వరూపముతో వేరు కాదు. భోగ్యహీనమైన ఆనందము కూడా చిత్స్వరూపముతో వేరు కాలేదు. దీని తాత్పర్యమేమిటంటే చిత్స్వరూపమే సమగ్రదృశ్యము, రసరూములో స్ఫురితమవుతూ వున్నది. సత్తా ప్రధానముతో శాంతి, సమాధి అని పేర్లు కలుగుతున్నాయి. చిత్ - ప్రధానముగా ద్రష్టా, ఆత్మ అనే పేర్లు కలుగుతున్నాయి. ఆనంద-ప్రదానముగా రసము, సుఖము అన్న పేర్లు కలుగుతున్నాయి. 'సత్'లో శాంతి-సమాధి, 'చిత్'లో దృశ్య-ద్రష్ట వివేకము మరియు ఆనందములో జీవన్ముక్తి యొక్క విలక్షణ సుఖము-భక్తి-భావము. బోధ కలిగిన అనంతరము ఆభాస, అవచ్ఛేదాది ప్రక్రియలు కానీ ప్రమాణ-ప్రమేయ విచారములకు కానీ ఏమీ ప్రయోజనము వుండదు. ఇవన్నీ జిజ్ఞాసువులకు తెలియజెప్పడానికి మాత్రమే వాటి ఉపయోగము. ఉపదేశము యొక్క ఒక శైలి మాత్రమే. స్వామీజీ మహరాజ్ వేదాంతములో చూడాంత విద్వానుడు. వారికి ఈ మాటలతో చాలా ఆనందము కలిగేది.

ప్రాతఃకాలము ప్రేమ కుటీరములో మాండూక్య ప్రవచనము, మరియు 'కారికల'పైన ప్రవచనము నడుస్తూవుండినది. ఈ సమయంలో స్పష్టముగా భిన్నభిన్న మతవాదులను నిరాకరణము చేసి బ్రహ్మయొక్క అద్వితీయతను, ఆత్మరూపతను నిరూపణము చేస్తువుంటిని. నా ప్రతిపాదనాశైలి వారికి బాగా నచ్చేది. ఆత్మాతిరిక్తమైన ఏకొంచెమైనా సరే అది దృశ్యము. అదృశ్యము, పరోక్షము మరియు కల్పితము. దృశ్యము జడము. కల్పితము ఆధ్యారోపము మాత్రమే. ఒకవేళ పరమాత్మ నాకంటే అన్యమయినదయితే అది జడము, కల్పితము, మిథ్య అవుతుంది. అది అచేతనము మూర్ఛితము అవుతుంది. ఒకవేళ నేను పరమార్థ సత్యము కంటే అన్యుడనైతే, భిన్నుడనయితే నేను మిథ్య, పరిచ్ఛిన్నుడను, కల్పితము అవుతాను. అన్నిటికంటే

నిరుత్తరమైనటువంటి ఆనంద-మంగళమయినటువంటిది - అది నాతో ఒకటై చేతనమవుతుంది. నేను దానితో ఏకమై అద్వితీయ బ్రహ్మనవుతాను. ఈ స్వతఃసిద్ధమైన సత్యమునే ఉపనిషత్తు బోధిస్తుంది. స్వామీజీ ఎదుట ఉపనిషత్తుల యొక్క వివేచనము చేయడంలో ఎంత ఆనందము కలిగేదంటే అది వర్ణనాతీతము!

మధ్య-మధ్యలో బృందావనము కూడా వెళ్ళి వస్తూండేవాడిని. స్వామీజీ వెళ్ళేరోజు నిండు సభలో ఏడ్చేశేవారు. శ్రోతలను కూడా ఏడిపించేవారు. తొందరగా తిరిగిరావాలని నాతో ప్రతిజ్ఞ చేయించుకునేవారు. ఒక సారి సభలో ఇలా అన్నారు - 'వెళ్ళు అని నేను చెప్పలేను. మరి నిన్ను ఆపనూ లేదు. వియోగము వలన దుఃఖము కలుగుతుంది - అని చెప్పడం, నీకు దుఃఖము కలిగించడమే. నేను చచ్చిపోతాను అని చెప్పడం అసత్యమవుతుంది. ఇపుడు నీవే చెప్పు ప్రియతమా! నీవు వెళ్ళేటపుడు నేను ఏమి చెయ్యాలి? కన్నీరు ఆపలేను. కన్నీటిని కార్చడము అపశకునము'. ఇలా సాగేది. స్వామీజీ అందరితోనూ నన్ను ప్రశంసిస్తూండేవారు. శ్రీ హేమలతా రతన్‌జీ భాయితో వారు అన్నారు - 'యాభై సంవత్సరముల నుండి సత్సంగము చేస్తున్నాను, కానీ సత్సంగము యొక్క ఆనందము ఇపుడు తెలిసింది'. ఎవరైనా మధ్యాహ్నమపుడు నేను విశ్రాంతి తీసుకునే సమయంలో వస్తే నా సేవకుడికి నిద్రలేపమని చెప్పేవారు. ఏకాంతములో వుండాలంటే మరి బొంబాయికి ఎందుకు వచ్చినట్లు? గంగా తటములోనే వుండవచ్చు కదా! అని కాకూభాయి ఇపుడూ భగవంతుని కృప వలన వారు జీవించియే యున్నారు. వారికి 4, 5గురు ఆడపిల్లలున్నారు. స్వామీజీ అన్నారు నన్ను చూపించి 'వీరు చాలా సిద్ధపురుషులు. వీరితో ఆశీర్వాదము తీసుకోండి. మీకు పుత్రప్రాప్తి కలుగుతుంది' స్వామీజీ యొక్క ఆశీర్వాదము వలన వృద్ధావస్థలోనే కాకుభాయికి ఇద్దరు పుత్రులు కలిగారు. ఒకరిపేరు జిజ్ఞాసు, మరొకరి పేరు 'ధర్మసుఖము' పేర్లు స్వామీజీయే పెట్టారు. వారు తమ ఆశీర్వాదమును నా ఆశీర్వాదముగా చెప్పేవారు. మోహన్‌లాల్ విషయంలోనూ ఇలాగే అయినది. నా పేరు తీసుకుని వారికి పుత్రుడు కలగాలని ఆశీర్వదించారు. ఇపుడు వారు పుత్రపౌత్రులతో సంపన్నముగా వున్నారు. అనేక రకములుగా వారు నా మహిమను పెంపుచేయడానికే ప్రయత్నము చేశేవారు.

వారి స్వభావములోని పరివర్తన చూసి నాకే ఆశ్చర్యము వేసేది. ఒక సారి కారులో వెళ్తున్నాము. వెనుక నుండి టాక్సీ వచ్చింది. దారిపైన వున్న నీరు, బురద ఎగిరి కారులోకి వచ్చి పడింది. కొంచెం ముఖముపైన కూడా పడింది. మా కారు డ్రైవరుకి చాలా కోపము వచ్చింది - 'అలాగా! ఆ టాక్సీవాడికి నా తడాఖాచూపిస్తాను' అన్నాడు. అపుడు స్వామీజీ 'అరేభాయీ! భగవంతుడి చరణామృతం చాలా సార్లు తీసుకున్నాము. ఈ రోజు కారు భగవానుడి చరణామృతము దొరికింది'. అని నవ్వేశారు. అందరూ నవ్వారు (కోపం మరచి).

ఎపుడైనా ఒక్కోసారి భోజనంలో వెంట్రుక వస్తూండేది. నాకు చిన్నప్పటి నుండి కూడా భోజనంలో వెంట్రుక కన్పిస్తే వాంతి వచ్చినంత పని అయ్యేది. నేను మనుస్మృతిలోని ఆ శ్లోకము కూడా గుర్తుపెట్టుకున్నాను - భోజనములో వెంట్రుక వస్తే, కొంచెము శుద్ధమైన మట్టి దానిపైనవేస్తే దాని దోషం పోతుంది. అయినా నాకు కొంచెము ఉద్వేగము కలుగుతూ వుండేది. స్వామీజీ అనే వారు 'చూడు వెంట్రుక తెల్లగా వుందా? నల్లగా వుందా? తెల్లగా వుంటే బసంత్ బహన్‌ది నల్లగా వుంటే జసు బహన్‌ది అయివుంటుంది' ఇద్దరూ పరుగు పరుగున వచ్చేశేవారు. నాదికాదంటే నాదికాదు అనేవారు, స్వామీజీ నవ్వుతూ వుండేవారు. నాకు కూడా నవ్వువచ్చేది. నా భోజనపు పళ్ళెము మార్చి వేరే పెట్టేవారు.

దైవీ సంపత్ - మండలి తీర్థయాత్ర స్పెషల్ ట్రైన్ యొక్క సఫలత చూసిన తర్వాత స్వామీజీ యొక్క భక్తులు కూడా అలాంటి యాత్ర చేయాలని నిశ్చయించుకున్నారు. పూర్తిగా తయారైనారు. దారి, యాత్రాక్రమము, రిజర్వేషన్ అన్నీ నిశ్చయమైయినవి. సంయోగవశాన నాకు ఒక కల వచ్చింది - మా తీర్థయాత్ర బస్సు తలక్రిందులై ఒక కాలువలో పడిపోయినట్లు. అంతా రైలు ప్రయాణమే. కానీ హిమాలయముల యాత్రకు మాత్రము బస్సువుండేది. ఆ స్థానము కూడా ధౌలిగంగకి దగ్గరలో వుండేది. నేను స్వామీజీకి నా స్వప్నమును గురించి చెప్పాను. వెంటనే వారు యాత్రను ఆపుచేయించారు. నాకయితే స్వప్నము పట్ల అంత మహత్వబుద్ధి లేదు. కానీ స్వామీజీ నా కలకు కూడా అంతటి విలువ ఇచ్చారు. దీనివలన చాలా మందికి అసౌకర్యం కూడా కలిగింది. కొన్ని రోజులయిన తర్వాత ఐదు, ఆరుగురు

భక్తులను తీసుకుని వారు యాత్ర చేశారు. అపుడు నాకు వారి వెంట ఎవరెవరు వెళ్ళారో గుర్తులేదు. కానీ ఇంత మాత్రము బాగా గుర్తు, నేను స్వామి ఓంకారానందజీని వారి సేవచేయుటకై వారి వెంట పంపించాను. ఓంకారానంద్ కొన్ని నెలలపాటు స్వామీజీతో వున్నారు. వారి శీల-స్వభావములు, ఆచార-విచారములు శ్రీఓంకార నాథ్‌జీని చాలా ప్రభావితుడిని చేశాయి. వారిపట్ల అత్యంత శ్రద్ధాళువులయినారు. స్వామీజీ ఈ మధ్యలో రెండు సార్లు బృందావనం వచ్చారు. బృందావనములో స్వామీజీ ప్రవచనము చెప్పేవారు కాదు. నా ప్రవచనాలు వినేవారు. వృద్ధావస్థలో కూడా వారి వ్యక్తిత్వము అత్యంత ప్రభావపూరితము, ఇతరుల హృదయాలలో శ్రద్ధా-ప్రేమలను కలిగించేసేవిగా వుండేది. వారికి గుండెనొప్పి వలన ఎక్కడము, దిగడము చలా కష్టముగా వుండేది. బొంబాయిలో హరికిషన్‌దాస్, బచ్చూభాయి డ్రస్‌వాలా, దాదాలోకూమల్ మొదలైన వారంతా చాలా ప్రేమగా వారి సేవ-శుశ్రూషలు చేశేవారు.

బొంబాయి సత్సంగీయుల బలవంతముపై ఒక సత్సంగ-భవనము నిర్మాణము చేయడానికి నిశ్చయము జరిగింది. ముంబాదేవి దగ్గరి మైదానములో ఒక విశాలమైన ఆయోజనము జరిగింది. నేను ధనమును ఉద్దేశ్యముగా పెట్టుకుని ఎపుడూ భాగవత-సప్తాహము చేయలేదు. అయినా స్వామీజీ యొక్క సంకల్పపూర్తి కొరకు నేను సప్తాహవాచనము చేశాను. చాలా జనం వచ్చారు. ధనము కూడా కూడినది. కానీ వారి జీవనకాలములో సత్సంగ-భవన నిర్మాణము జరగలేకపోయింది. వల్లభదాస్ మీరావాలే, కామ్‌దార్, రతన్‌జీ భాయి మొదలైన భక్తుల సహయోగము వుండినది కానీ ఈ సంకల్పము వారు బ్రహ్మలీనులైన తర్వాతనే పూర్తి అయినది.

నేను గృహస్థాశ్రమములో వుండేటపుడు మా మిత్రుడు శ్రీ ఝుగరూ సింహ కానూన్‌గో ఇతరుల దగ్గర డబ్బు తీసుకోవడము మానేశాడు. నా మనసుపై దాని ప్రభావము చాలా పడింది, నేను కూడా మా పరంపరలోని శిష్యులతో ప్రతిగ్రహము తీసుకోవడము వదిలేశాను. గృహస్థాశ్రమములోనే త్యాగము చేసినపుడు, ఇక సన్యాసాశ్రమములో ధనము స్వీకరించడమన్నది నాకు అసలు ఇష్టము వుండేది కాదు. నేను ప్రేమ-కుటీరములో పూజ - పత్రి ఇచ్చేటపుడు డబ్బులు పెట్టవద్దని చెప్పాను. స్వామీ ప్రేమపురీజీ అన్నారు 'నీవు తీసుకోవద్దు, మావాళ్ళెవ్వరయినా

తీసుకుంటారు, కానీ అలాగ ఆపుచెయ్యడము మంచిది కాదు. ఎందుకంటే ఎందరో రకరకాల మహాత్ములు ఇక్కడికి వస్తూంటారు. ఒక వేళ, లోకులు డబ్బు ఇవ్వడము మానేశారంటే వారికి కష్టము కలుగవచ్చు. అదీకాక ఎవరైతే తీసుకుంటారో వారిపట్ల అశ్రద్ధ కలుగవచ్చు. అందుకని వూరుకో. ఏమీ అనకు'. అని నచ్చచెప్పారు. ఇక్కడి నుండి మొదట బృందావనము వెళ్ళేటపుడు, వారు దేవీదయాల్ స్టీల్‌వాలా శ్రీహరికిషన్‌దాస్‌తో శ్రీబచ్చుభాయి డ్రెస్‌వాలాతో సంప్రదించి నాకు మూడువేల రూపాయలు ఇచ్చారు. ఇక ఇక్కడి నుండి నాకు పూజలో దక్షిణ స్వీకరించడము మొదలైంది. భాగవత ప్రవచనము చేసి భగవద్భక్తి కంటే అన్యమైనది ఏ భౌతిక వస్తువు యొక్క సంకల్పముగానీ నాకు అసలు ఇష్టమే వుండేదికాదు. కానీ స్వామీజీ యొక్క ప్రసన్నత కోసము నేను నా నియమాన్ని వదిలిపెట్టాను.

స్వామీజీ మహరాజ్ త్యాగ - వైరాగ్యముల మహిమను గురించి చాలా చక్కగ తెలిసినవారు. ఇదే కారణముగ వారి పూర్వీకులు ధ్రోలరాజ్యమును వదిలి రాజకోటలో వచ్చివున్నారు. ఎందుకంటే అక్కడ వుంటే రాజపౌరోహిత్యము చేయవలసి వస్తుందని. వారు శుక్లవంశ బ్రాహ్మణులు. వారి పితామహులు సన్యసించి కాశీలో వుండేవారు. అలాగే విద్యాభ్యాసము కూడా చేస్తుండేవారు. తన పితామహుడి మరణము తర్వాత, తన వివాహము, తర్వాత పత్ని-పుత్రుల మృతి, దాని తర్వాత స్వామీజీ జడేశ్వర మహాదేవ్ గురించి వారే స్వయంగా మార్మిక చిత్రణ చేశారు - అది వారి 'బ్రహ్మాస్మి-మాల' అనే పుస్తకము ప్రారంభములో ప్రకాశితమైనది. (ప్రచురింపబడినది). మరల కాశీలో అధ్యయనము, రాష్ట్రీయ-స్వతంత్రతా సంగ్రామములో కారాగారములో ఏకాంతవాసము, బ్రహ్మచింతనము, ఋషీకేశములో కైలాసాశ్రమములో శ్రీప్రకాశానందపురీజీ మహరాజ్‌తో అద్వైత-వేదాంతము యొక్క గహన గంభీర జ్ఞానము, తర్వాత అక్కడ మహామండలేశ్వరుడవడము - ఇవన్నీ కూడా వారి వివేక - వైరాగ్యాది సాధన - సంపాదనమునే సూచిస్తున్నాయి. మహా మండలేశ్వరుడి పదవిపై వుండి కూడా గుప్తరూపములో ఆదిబద్రి వెళ్ళి అక్కడ బ్రహ్మాత్మైక్యము యొక్క దృఢమైన అపరోక్ష-సాక్షాత్కారమును పొందిరి. అక్కడి వారిలో స్వామీజీ యొక్క ఖ్యాతి, ప్రతిష్ఠ, చాలా వుండినది. వారి చికిత్సాలయమును విద్యాలయమును నిర్మించారు. మరల వాటిని వదిలివేశారు. ఇదంతా స్వామీజీ మహరాజ్ చాలా మంది భక్తులతో 'మీరు

వీరి వద్ద (నావద్ద) వేదాంతము నేర్చుకోండి, భాగవతము వినండి' అని చెబుతూ వుండేవారు. వారు తమ కోసమై స్వయంగా ఏమీ చేసుకోరు, అంతా నాకోసమే అని నాకు అనిపిస్తూండేది. వారియొక్క స్నిగ్ధ వ్యవహారముతో నేను ముగ్ధుడినయ్యాను.

స్వామీజీ భక్తులలో ఒక సింధీ సజ్జనుడు వుండేవాడు. వారి పేరు లోకుమల్ దాదా. వారి జీవితము పౌరుషముతో కూడినది, ఆదర్శవంతమైనది. మొదట వారి దగ్గర ఏమీ సంపద లేకుండెను. ప్రొద్దున్నే ఒక వ్యాపారి దగ్గర బట్టలు తీసుకుని ఒక చాపపరుచుకుని ఒక చోట కూర్చునేవారు. రోజంతటికి కలిపి ఎంత అమ్ముడుపోతే దానికి లెఖ్ఖచెప్పి ఆ వ్యాపారికి ఇవ్వడము, మిగిలిన బట్టలను కూడా ఆయన దగ్గరే పెట్టడం-ఇలా చేస్తుండేవారు. భగవంతుడి కృపవలన వారికి ఎంత ఉన్నతి కలిగిందంటే ఇపుడు వారి వ్యాపారము విదేశాల వరకు వ్యాపించింది. వారు లక్షలాది రూపాయలు ధార్మికమైన పనుల కోసము వెచ్చించేవారు. లోకుమల్‌దాదా స్వామీజీని జీవిత కాలంలో సేవించడమేగాక, వారి శరీర-త్యాగము తర్వాత కూడా ముంబాదేవి మైదానములో ఒక పెద్ద ఎత్తున భాగవత - సప్తాహము జరిపించారు. ఖార్ (బొంబాయి)లో లోకహిత-కుటీరము అన్న పేరుతో ఒక విశాలమైన మహలు హాలు కట్టించారు. అక్కడ నిత్యము సత్సంగము జరుగుతు వుంటుంది. అక్కడ శ్రీజసుబహిన్‌జీ ఆనందపురీగా విరాజమానులై వున్నారు. లోకుమల్ దాదా, మరియు జసుబహిన్‌కు నాపట్ల శ్రద్ధాళువులయేలాగ చేశారు స్వామిజీ, స్వామీజీ మహరాజ్ యొక్క ఆలోచనలు - విచారములు చాలా ఉదారముగ వుండేవి. వారి సభలలో ఫాదరీలు, మౌల్వీలు, దస్తూర్‌లు, గ్రంథీలు వచ్చేవారు. అందరికి ఆదరసత్కారము వుండేది. అందరూ వారి వద్దకు వచ్చేవారు. అందరితోను విచారవినిమయము చేసేవారు. అన్ని మతములలోను, ఏ సదాచారము, సద్భావము, సద్విచారము ఉన్నదో దానికి స్వామిజీ విలువను ఇచ్చేవారు. కానీ, వారి నిష్ఠమాత్రము ఉపనిషత్ - సిద్ధాంతములోనే! ఒక వేళ ఎవరైనా వక్త శాంకర - సిద్ధాంతమునకు విరుద్ధముగా చెబితే మాత్రము వారిని ఆపు చేసేవారు. వేద దర్శనాచార్యులు మహా మండలేశ్వరులు స్వామి గంగేశ్వరానందజీతో వారికి చాలా గొప్ప స్నేహము వుండేది. ఇరువురు సుమారు సమవయస్కులే. 'పంచదేవ - మహాయాగము' జరిగిన సమయంలో స్వామీజీ అన్నారు 'ప్రేమకుటీర్‌లో సత్సంగము ఆగిపోరాదు.' ఆ రోజులలో అక్కడ నా ప్రవచనము

జరుగుతూ వుండినది. స్వామి సర్వానంద గారు స్వామీజీని ఒప్పించారు అయితే ఒక షరతుపైన ఒప్పుకున్నారు. పంచదేవ - మహాయాగపు విశాల పెండాల్‌లో మొదట ఒక ఘంటసేపు నా ప్రవచనము జరగాలని, దాని తర్వాత ఇతరులవి జరగాలని. స్వామి ప్రేమపురీజీ వారి విచారము నిశ్చయము, చాలా దృఢమైనవి. నిర్భయుడు. అలాంటి మహాత్ములు చాలా అరుదు.

వేదాంతము యొక్క దృష్టిలో తత్త్వజ్ఞాని పురుషుడిలో మూడు మాటలు అవశ్యము వుండాలి - అవి వారిలో సహజంగానే కనిపిస్తుండేవి.

1. ఒక విజ్ఞానముతో సర్వవిజ్ఞానము - దీని అర్థము ఇదే - అది విశ్వములోని ప్రత్యేక నామము, రూపము మరియు క్రియ తెలుస్తుంది. అంటే స్వయం ప్రకాశ-అధిష్ఠాన-స్వరూప బ్రహ్మాత్మ బోధతో అన్యపదార్థములు బాధితమయిపోతాయి.

2. సర్వత్యాగము యొక్క సామర్థ్యము - ఎందుకంటే అధిష్ఠానములో అధ్యస్త వస్తువు యొక్క సత్తానే లేదు, కాబట్టి అది నితాంత పరిత్యక్తము (సర్వదా త్యాజ్యము)

3. అభయ ప్రతిష్ఠ కలగడము - దానికి లోక - పరలోకములు, భావాభావములు, సుఖ-దుఃఖాలు, రాగ-వైరాగ్యములు, జీవ-ఈశ్వరులు, బంధ-మోక్షాదులు వీటి హ్రాస - వికాసముల భయము ఏమీ వుండదు.

నా దృష్టిలో ప్రేమపురీజీ మహరాజ్‌లో ఈ మూడు మాటలు వుండేవి. వారు ఒక తత్త్వజ్ఞులైన మహాపురుషులు.

స్వామి ప్రేమపురీజీ వారు చాలా మౌజీ (ఆనంద) మహాత్ములు. ఒక్కోసారి నవ్వుతూ నవ్విస్తూ, ఒక్కోసారి కొప్పడుతూ, ఒక్కోసారి గంభీరమైన విచార - వినిమయము చేస్తూ ఒక్కోసారి శాంతంగా వుంటూ వుండేవారు. వారి జీవితములో అన్నిటికి సమ్మతి వుండేది. ఎందుకంటే వారి సర్వాత్మబోధ అత్యంత దృఢమయినది. మరోవైపు వారి జీవితములో అన్నిటియొక్క నిషేదమూ వుండేది. ఎందుకంటే అన్నీ ఆత్మ స్వరూపము కాదు. ఆత్మ ఒక్కటే. అన్నీనేమో అనేకతయొక్క సమూహమాయె! ఆత్మ చేతనము. మిగిలినవన్నీ (అన్యము) దృశ్యము. ఆత్మ ఏకరసము. మిగిలిన వన్నియు (ఆత్మాతిరిక్తము) పరివర్తన శీలములు. కాబట్టి ఆత్మ పరమానంద -

స్వరూపము, సత్య స్వరూపము. మిగిలినదంతయు దుఃఖము, జడము మరియు వినశ్వరము నయి యున్నది. ఆత్మ అబాధిత-సత్యము. అన్నీ కూడా తన అత్యంతాభావము యొక్క అధిష్ఠాన చైతన్యములో ప్రతీయమానమయి నందున బాధితములు, మిథ్యయు అయినవి. సర్వాత్మ భావము యొక్క వాస్తవిక రూపము ఇదే. ఇదే యదార్థ పరమార్థము యొక్క సాక్షాత్కారము - ఇది ఔపనిషత్ జ్ఞానము వలన కలుగుతుంది.

జీవన్ముక్త - పురుషుడి జీవనము 'దగ్ధ-రథ-న్యాయము'లాగ వుంటుంది. ఎలాగైతే అర్జునుడి రథము కర్ణుడి అగ్ని బాణములతో దగ్ధమయిపోయివుండినది, కానీ శ్రీ కృష్ణుడు ఆ రథముపై అధిష్ఠితుడయి వున్నందు వలన అది దాని పని అది చేస్తుండినది. యుద్ధము సమాప్తము అయిన తర్వాత ముందు అర్జునుడు తర్వాత శ్రీకృష్ణుడు దిగారు, తర్వాత రథమూ లేదు, గుఱ్ఱాలూ లేవు, పగ్గాలూ లేవు. అదే తత్త్వజ్ఞాని యొక్క శరీర స్థితి కూడా. అది తత్త్వజ్ఞానముతో తత్కాలమే భస్మమౌతుంది. కానీ, ఆరబ్ధకర్మ - వేగము వలన శరీరము నడుస్తూ వుంటుంది. 'ఆరబ్ధ'కర్మ సమాప్తి అవగానే అది శాంతమయిపోతుంది.

ఒక అజ్ఞాతనామ(కుడైన)భక్తుడు

ఒక మహాత్ముడు ఇలా గానం చేశాడు 'తూ ప్రభు జీవే, మై మర్ జావూ' ప్రేమ మార్గములో 'నేను', 'హరి' అని ఇరువురు వుండటానికి వీలులేదు - అనే మాట ప్రసిద్ధమైనది. ఎపుడైతే నేను వున్నానో అపుడు హరిలేడు, ఎపుడు 'హరి' వున్నాడో అపుడు 'నేను' లేను. ఎలాంటి విచిత్రమైన విషయమిది! నదులు సముద్రములో కలసి తమ నామరూపములను ఎలాగ పోగొట్టుకుంటాయో అలాగే భక్తుడు కూడా భగవంతునితో కలసిపోయి తమ నామరూపములను పోగొట్టుకుంటాడు. ఎప్పటి వరకైతే పూజ ప్రతిష్ఠ, కీర్తి, నామ-రూపముల ఖ్యాతి ఇవన్నీ అభీష్ఠమో అప్పటి వరకు భగవంతుడి ఎదుట ఒక తెరవున్నట్లే, పూజారి తనను తానే చూసుకుంటాడు కానీ దేవతని చూడడు. ఈ కారణము వలననే చాలా మంది ప్రపంచం యెదుట భక్తులుగా ప్రకటించుకోకుండా అజ్ఞాతంగా వుండిపోతారు. వారే అజ్ఞాతనామ భక్తులు. శ్రీవృందావనధామములో అలాంటి భక్తులు చాలా మంది వున్నారు. అలాంటి ఒక భక్తుడిని గురించి నేను ఇపుడు చెబుతున్నాను. వారి స్మృతి నాకు మాటి మాటికి కలుగుతూవుంటుంది.

పూర్ణ పరబ్రహ్మ స్వరూపుడు శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్‌వారి ఛత్రఛాయలో జె.కె. గ్రూప్ వారి ద్వారా కైలాశేశ్వర్ మరియు పద్మావిహారీ మందిరముల నిర్మాణము జరుగుతూ వుండినది. ఆ ప్రాంగణములోనే నాకు ఉండటానికి కూడా ఏర్పాటు జరిగింది. ఆ స్థానము శ్రీవృందావన ధామములోని దావానల కుండము దగ్గర వున్నది. రాత్రి సమయములో నేను డాబాపైన పడుకుంటే ఒక వ్యక్తి (పగలెపుడూ కనిపించేవాడు కాదు) వచ్చేవాడు. బక్క చిక్కిన శరీరం, నల్లగా సన్నగా, పాత చింకిగుడ్డల లంగోటి కట్టుకుని, జడలు కట్టిన వెంట్రుకలతో వుండేవాడు. వచ్చి నా

మంచం దగ్గర కూర్చుని నా ఎదపైన తన తలపెట్టుకునే వాడు, వాడి కళ్ళవెంట అజస్రంగా అశృపాతం జరుగుతూ వుండేది. నేను పడుకునే వుండేవాడిని. అతడు ఏమీ మాట్లాడేవాడు కాదు. ఆ రోజులలో నా సేవలో ముఖ్యంగా లీలానంద బ్రహ్మచారి (ఛోటేజీ) ప్రేమానంద బ్రహ్మచారి (దాదా) వుండేవారు. వారు ఈ దృశ్యము చూడగానే అతడిని వారించేవారు. నచ్చచెప్పారు. కోప్పడ్డారు. కానీ ఏమి చేసినా అది అతడిపైన ఏమీ ప్రభావము చూపలేదు. కొన్ని రోజుల తర్వాత అయితే ఇద్దరు బ్రహ్మచారులు కలసి ఆ సన్నగా, బక్కగా వున్న ఆ వ్యక్తిని పట్టుకుని క్రింద దింపేసి వచ్చేవారు. కానీ ఆ వ్యక్తి ఎంత మొండివాడంటే అందరి కళ్ళు కప్పి ఎలాగోలాగ నా దగ్గరకు వచ్చేవాడు. నాకు అతనిపట్ల కుతూహలము కలిగింది. 'నీవు ఎవరివి? నీకు ఏమి కావాలి? నా దగ్గరకి ఎందుకు వస్తున్నావు? అని నేను అడిగాను. ఇంత వరకు నేనెపుడు తన మాటనే వినలేదు. ఎపుడూ మౌనముగా వుండేవాడు. నేను అడిగిన తర్వాత మౌనభంగము చేశాడు. 'నేను రైదాసును, అంటే మాదిగవాడిని' అన్నాడు. అప్పటి వరకు 'హరిజన' శబ్దము వాడుకలోకి వచ్చియుండినది. నేను అడిగాను 'వృందావనములో ఎప్పటి నుండి వుంటున్నావు?' చాలా సంవత్సరాలుగా అని జవాబిచ్చాడు. ఎక్కడ వుంటావు అని అడిగితే 'ఎక్కడైనా వుంటాను. ఎక్కడైనా తింటాను. వర్షము వచ్చినపుడు దావానల ఘాట్ దగ్గర వున్నవరండాలాంటి దాన్లో కూర్చుని భజన చేసుకుంటాను. అక్కడే పడుకుంటాను. లోకుల ఎదుట పడను. యధాశక్తి ఎవరినీ తాకను. మిమ్మలను చూస్తే నాకు ప్రేమ భావము కలుగుతుంది. అందుకనే మీ దగ్గరికి వస్తాను' అని అన్నాడు.

మొదటి నుండి త్యాగులు, విరక్తులు, అవధూతలంటే నా మనసులో ఒక 'మెప్పు' వున్నది, ఇక ఈ వ్యక్తి యొక్క నిరపేక్ష జీవనము నన్ను చాలాబాగా ఆకట్టుకున్నది. నిజంగానే వాడి మలిన వస్త్రాలతో కప్పబడిన ఆ శరీరములో కూడా ఒక మాధుర్యము నిండి వుండేది. నేను ఛోటేజీ, దాదాలకు ఇద్దరికి అతడిని వారించవద్దు అని చెప్పాను. అతడితో దుర్వ్యవహారము చేయకండి అని చెప్పాను. కానీ వారు నా మాటలను అంతగా పట్టించుకోలేదు. వారికి ఒక అస్పృశ్యుడి పట్ల ఏ విధమైన సానుభూతి వుండేది కాదు. ఈ ఘటన దాదాపు 1950వ సం॥పు మాట. శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్ వారి శరీరము అప్పటికి శాంతమయినది.

బహుశా ఆచారవంతులకు నా ఈ మాటలు నచ్చకపోవచ్చు - ఇలాగ హరిజనుడు వచ్చి నాగుండెలపైన తలపెట్టుకుని పడుకుంటున్నాడంటే. కానీ నేను ఈ విషయంలో ఒక మాట స్పష్టం చేయాలనుకుంటున్నాను. బాల్యావస్థ నుండి కూడా నా మనసులో హరిజనుల పట్ల ఏ విధమైన ఘృణకాని, ద్వేషము కానీ గ్లానికాని వుండేదికాదు. మా పితామహుడు తన సేద్యగాడిని 'దుఃఖువా' అని పిలిచేవారు. నాకు అపుడు ఏడు, ఎనిమిది సంవత్సరాలు వుంటాయి. నేను మాతాత పిలిచినట్లు 'దుఃఖువా' అని పిలిచాను. అపుడు 'నీవు చిన్న పిల్లవాడివి. నీవు అలాగ పిలవకూడదు' అని తాతయ్యగారు కోప్పడ్డారు. అన్నారు 'నేను, వాడు నాకంటే కొంచెం చిన్నవాడని అలా పిలుస్తాను. నీవు వాడికంటే చిన్న వాడివి కాబట్టి 'దుఖు బాబాయి' అని పిలవాలి' అప్పటి నుండి నేను జాగ్రత్తగా వుండేవాడిని. దుఖుబాబాయికి నలుగురు పుత్రులు. ఈశ్వర్, సహదేవ్, మహాదేవ్, బచ్చన్. నలుగురూ నన్ను అన్నయ్య అంటూ పిలిచేవారు. పొలం పనులు, ఇంటి పనులులలో ఎపుడూ చేదోడు వాదోడుగా వుండేవారు. మనసులో ఏమీ బేధభావము వుండేదికాదు. ఒకసారి వారి ఇంటికి నిప్పంటుకుంది. నేను ఆర్పడానికి పరుగెత్తాను. కానీ అక్కడికి బ్రాహ్మణులు ఎవరూ రాలేదు. దుఖుకాకా ఆ ఇంట్లోనుండి వేద గ్రంథము తెచ్చి చాలా సంకోచముతో నాకు ఇచ్చాడు. ఇదంతా ఎందుకు వ్రాస్తున్నానంటే పాఠకులు నా మనోవృత్తులను సరిగా అర్థము చేసుకుంటారని!

ఈ అజ్ఞాత నామ భక్తుడు వచ్చి నా దగ్గర కూర్చునేవాడు. వాడు తన జటలలో నుండి ఒక చిన్న పుస్తకము బయటికి తీశాడు. ఆ పుస్తకములో సంత్‌రైదాస్‌వి కీర్తనలు వ్రాసి వున్నాయి. వాటి అర్థము నన్నడిగేవాడు. ఆ పదాలన్నీ ఇపుడు 'వాణి'అన్న పేరుతో ప్రచురింపబడ్డాయి. నేను వాటి సారసంక్షేపాన్ని మీ ముందుంచుతున్నాను.

(1)

అన్నల్లారా! తమ్ముళ్ళారా! నేనిపుడిక ఓడిపోయాను. సంసారపు స్థితిగతి, లోకము, వేదము, ప్రశంస, పాట-ఆట, సేవ-పూజ వీటితో అలసి సొలసిపోయాను. కామ-క్రోధాలు దేహాన్ని అలసిపోయేలాగ చేశాయి. ఇక చెప్పమంటే ఇంకేం చెబుతాను? నేను భగవంతుడి భక్తుడనూ కాదు, అలా పిలిపించుకోవాలన్న కోరిక

లేదు. నేనిపుడు ఇక ఏ దేవుడి కాళ్ళు పట్టను. ఎందుకంటే నేను ఏది చేసినా అది తిరిగి నన్నే బంధిస్తోంది. కాబట్టి నేను ఏ భేద-భావనని నా దరిదాపులకు రానివ్వడం లేదు. మొదట నేను జ్ఞానచంద్రుడిని వెలిగించాను. కానీ తర్వాత దానిని ఆర్పేశాను. శూన్య-శయ్యపై చేరి నేను రెండూ వదిలివేశాను. రామ అనను రహీమ్ అనను. నేను స్నాన-సంధ్య, పూజ, జపము, తపము, తర్పణ మరియు హోమము అన్నీ వదిలివేశాను సేవ కూడా ఏమీ చెయ్యను. జ్ఞానము, ధ్యానము అన్నీ వదిలిపోయాయి. ఐదు జ్ఞానేంద్రియాలు ఎక్కడ అలసివున్నాయో అక్కడ నా స్థితివున్నది. దేనికోసమని అటు ఇటు పరుగులు పెట్టేవాడినో, అది నాలోనే ఈ ఘటంలోనే దొరికింది. నా ఐదు ప్రాణవృత్తులు, మనో వృత్తులు - నా సఖియలు. వారు నాకు ఆ ఖజానా, ఆ నిధిని చూపించారు. మనసు ప్రఫుల్లితమయినది. సంసారము నుండి వెనుతిరిగి తన స్వరూపములో లీనమయిపోయినది. అది నడుస్తూ నడుస్తూ అలసిపోయింది, ఇక ఇపుడు నడవచేతకాదు. అది సహజము, సాక్షాత్ అపరోక్షము, నిత్య ప్రాప్తము. దాని మహిమను ఏమని పాడుదును?

అబ్‌మై హార్యోరే భాయీ ।
థకిత భయో సబ్ హాల్ చాల్ తై, లోగన్ వేద బడాయి ॥పల్లవి॥
థకిత భయా గాయన్ అరునాచన్, థాకీ సేవా - పూజా
కామ-క్రోధ తై దేహ థకిత భయీ, కహౌ కహా లౌ దూజా ॥ 1 ॥
రామజన హోవూ న భగత కహోవూ, చరన్ పఖాలూ నదేవా
జోయి జోయి కరౌ వులటి మోహి బాంధే, తాతై పఖాలూ నదేవా ॥ 2 ॥
పహలే గ్యాన్ కా దియా చాదినా, పీఛై దీయా బుఝాయి
సూని సహజ మై దోవు త్యాగై, రామ కహౌ న ఖుదాయి ॥ 3 ॥
దూరి బసై షట్ క్రమ సకల, అరు దురివు కీన్హై సేవు
గ్యాన ధ్యాన దోవు దూరివు కన్హై, దూరివు ఛాడై తేవు ॥ 4 ॥
పాంచూ థకిత భయై జహా-తహా, జహా-తహా తిథిపాయి
జా కారని మై దోర్యో ఫిరాతౌ, సో అబ్ ఘట్ మై ఆయీ ॥ 5 ॥
పాంచూ మేరీ సఖీ - సహేలీ, తిన్ నిధి దయీ ది ఖాయీ
అబ్ మన్ ఫూలి భయౌ జగ్ మహిమా, ఉలటి ఆప్ మహ సమాయీ ॥6॥

చలత్ చలత్ మేరో నిజమన్ థాక్సో, అబ్ మో పై చల్యోన జాయీ
సోయి సహజి మిల్సో సోయి సన్‌ముఖ్, సహై 'రవిదాస్' బడాయి ॥ 7 ॥

(2)

ఎవరైనా పతివ్రతా సుమంగళి యే సంయోగరసమును అనుభవించగలదు. ఆమె అభిమానమును త్యజించి పరమానంద స్వరూపమైన పరమాత్మతో ఐక్యం అయిపోతుంది. ఆమె తనకు పరమాత్మునకు మధ్య కించిత్ కూడా తనువు, మనసు భేదము పెట్టదు. ఆమె అన్యులను చూడదు, వినదు, ద్వైతము ఆమెకు రుచించదు. ఎవరైతే హృదయములో ఎపుడూ బాధపడలేదో వారు పరుల బాధను ఎలా తెలుసుకుంటారు? అభిప్రాయము ఏమిటంటే సుఖము అనుభవింపనిదే ఆ సుఖానుభూతిని ఎలా తెలుసుకొనగలరు? ఎవరైతే నిరంతరము తమ పతి - పరమేశ్వరుడి యొక్క భక్తి చేయ లేదో ఆ అభాగ్యురాలు పక్ష - హీన పక్షిలాగ దుఃఖిస్తుంది. పరమాత్మతో కూడడము అన్న మార్గము చాలా కఠినమైనది. అక్కడ ఎవరు వెంట తోడు నీడై రారు. ఒంటరిగానే పయనించవలసి వస్తుంది. దుఃఖిస్తూ, రోదిస్తూ, నీ గుమ్మము దగ్గరకు వస్తారు. చాలా దప్పికగొనినా కూడా ఏమీ జవాబు దొరకదు. రవిదాసు భక్తుడ అంటున్నాడు హేప్రభూ! నేను నిన్నే శరణుజొచ్చితిని. నీకు ఏది సరి అనిపిస్తే అదే నాగతి!

సహకీ సార సుహాగిన్ జానై, తజి అభిమాను సుఖ రలీఆ మానై
తను మను దేయీ న అంతరు రాఖై, అవరా దేఖి న సునైన భాఖై ॥ 1 ॥
సోకత జానై పీరపరాయీ, జాకై అంతరి దరదు న సాయి ॥ 2 ॥
దుఖీ దుహాగని దుయి పఖ - హీనీ, జిని నాహనిరంతరి భగతి న కీనీ
పురస లాత కా పంథ్ దుహేలా, సంగనసాథీ గవను ఇకేలా ॥ 3 ॥
దుఖియా దరదబందు అరి ఆయియా, బహుతు పి ఆస జబాబు న పాయి ఆ
కహి రవిదాస సరన ప్రభు తేరీ, జివు జానహు తివు కరుగతి మేరీ ॥ 4 ॥

(3)

ఎపుడు నేను నేను (అహం) అని స్ఫురిస్తూ వుండినదో అపుడు నీకు అనుభవము

కలగలేదు. ఇక ఇపుడేమో నీవే నీవు వున్నావు, నేను లేను. మహాసముద్రములో తరంగాలే అలలే వుంటాయి. బడబానలము వుంటుంది. అక్కడ వేరు వస్తువు లేదు కేవలము జలమే, అలలు జలముతో వేరు కాదు. హే! మాధవా! ఏం చెప్పను?! ఈ భ్రమయొక్క స్వరూపము అలాంటిదే! ఎలా తెలుసుకుంటున్నామో అలాగ లేదు. ఒక రాజు సింహాసనంపైన పడుకుని బిఖారియైనట్లు కలగంటున్నాడు. తన రాజ్యము తనకు ఎప్పటిలాగే ఉన్నది. అయినా కానీ రాజ్యము పోగొట్టుకున్న దుఃఖము అతను అనుభవిస్తున్నాడు. నాగతి కూడా అలాగే వుంది. రజ్జు సర్ప భ్రాంతిలాగ ఈ సంసారము కనిపిస్తూ వుంది. ఇపుడు దీని మర్మమేమిటో తెలిసిపోయింది. స్వర్ణములో కంకణము కనిపించినట్లుగా ఆత్మలో ఈ అనిర్వచనీయ ప్రపంచము ప్రతీతమౌతోంది. ఈ అనేకమైన స్వరూపాలలో ఒక్కటే సత్యమున్నది - అదే అందరిలో ప్రకాశించేది. రైదాసు భక్తుడు ఇలా అంటున్నాడు ఆ పరమాత్ముడయితే సహజంగానే మనతో కలసి వున్నాడు. ప్రతీతిలో ఏం జరుగుతువుంటుందో అది జరగనీ (నా ప్రభువు నాతోనే వున్నాడు).

జబ్ హమ్ హోతే తబ్ తూ నహీ, అబ్ తూహీ మై నాహీ ।
అనల అగమ జైసే లహరి మహోధధి, జల కేవల జల మాహీ ॥ 1 ॥
మాధవ, క్రియా కహీయై భ్రమ ఐసా, జైసా మానియై హోయి న తైసా ॥2॥
నరపతి ఏకు సింఘాసని సోయి ఆ, సుపనే భయియా బిఖారీ ।
అభత రాజ బిఛురత దుఖ పాయియా, సోగతి భయీ హమారీ ॥ 3 ॥
రాజ-భుజంగ-ప్రసంగ జైసే యిహి, అబ్ కఛు మరము జనాయి ఆ ।
కనక కటక జైసే భూలి పరే, అబ కహతే కహనున ఆయిఅ ॥ 4 ॥
సరబే ఏకు అనేకై సు ఆమీ, సమఘట భోగ వై సోయీ ।
కహి రవిదాసు హథ పైనేరే, సహజే హోయి సు హోయీ ॥ 5 ॥

(4)

నీ ఘటములోనే అంటే ఘటము లాంటి ఈ శరీరములోనే పరమాత్మ యొక్క నివాసమున్నది. నీవు ఎక్కడెక్కడో ఎందుకు వెతుకుతూ తిరుగాడుతున్నావు? మృగము యొక్క నాభిలోనే కస్తూరి వుంటుంది, మరి అదేమో గడ్డీ-గాదములో దాని సుగంధాన్ని

వెతుకుతూ తిరుగుతుంది, ఇదే నీ స్థితి కూడా. కాలరూపుడైన వేటగాడు నిన్ను వెంబడిస్తున్నాడు. ఒక క్షణములో నీ ప్రాణములను హరించి వేయగలడు. నీ శరీరము లోపలనే ఇడ, పింగళ, సుషుమ్నా నాడులున్నాయి. వాటిపైన చిత్తము నిలువ దెందుకు? ఇదే శరీరములో సహస్రారములో భ్రమరగుహ వున్నది, అందులో భ్రమరముల ఝుంకారము వినిపిస్తుంది. మన హృదయము ఒక చిన్మయ సముద్రము, అందులో బహు మూల్యమయిన వజ్రం వంటి విశుద్ధ చైతన్యమనే వజ్రం నివసిస్తూ వుంది - ఇదీ మనోముఖి మనుషులకు అర్థము కాదు గురుముఖులకే అర్థమవుతుంది. గురువు యొక్క అనుగ్రహముతో ఎపుడైతే, వారి సంకేతం వైపు ధ్యానముంచెదవో, అపుడు ఆ రత్నము దొరుకుతుంది. ఈ భక్త రవిదాసు చెబుతున్నాడు సంత్‌మహాత్ములారా! ఈ పదము యొక్క అర్థమును గ్రహించండి. ఇది నిర్వాణ వాణి! ఎవరైతే ఈ రహస్యాన్ని వెదకి తెలుసుకుంటారో వారే జ్ఞానులు మహాత్ములు.

ఖోజత కిధు ఫిరై తేరే ఘట్ మహ సిరజన హార
కస్తూరీ మృగ పాన హైరే, డూండత్ ఘాస్ ఫిరై
పాఛ్ లాగో కాల పారథీ, ఛిన్ మహ ప్రాన హరై ॥ 1 ॥
ఇలా పింగలా సుషమణ నారీ, జామై చిత్త నథరై
సహస్రార మహ భంవర్ గుఫాహై, భంవరా గుంజ కరై ॥ 2 ॥
దిల్ దరియావ హీరా లాల్‌హై, గురుముఖ సమఝ్ పరై
మరజీ బాకీ సైన విచారై, తను హీరా హాథ్ పరై ॥ 3 ॥
కహిరవిదాస సుమురురే సంతో, ఇహు పర హై నిరవాన
ఇహరహిసి కోవు ఖోజై చుఝై, సోవు హైసంత్ సుజాన్ ॥ 4 ॥

(5)

ప్రియమైన సోదరులారా! ముకుంద-ముకుంద అని జపము చేయండి. ముకుందుడు లేకుండా ఈ జీవనము నగ్నము, అరక్షితము. ఆ ముకుందుడే ముక్తి దాత. ఆ ముకుందుడే మా మాత-పిత, ముకుందుడే మా జీవనము, ముకుందుడే మరణము. ముకుందుడి సేవకుడికి సదా ఆనందమే ఆనందము. ముకుందుడు!

కేవలము ముకుందుడే మా ప్రాణము. ముకుందుడి జపమే మా బుద్ధికి ఎల్ల వంటిది. మస్తకముపైన ముకుందుడి రేఖ-తిలకము గుర్తు ముహర్ పడిపోయింది. వైరాగ్యవంతుడే ముకుందుడి సేవ చేస్తాడు. ముకుందుడే దుర్బలుడికి బలము, దరిద్రుడికి ధనము, మరి భక్తులకి సర్వస్వలాభము అయివున్నాడు. ఎపుడైతే ముకుందుడు, కేవలము ముకుందుడు నాకు హితము (మేలు) చేస్తున్నాడో, అపుడు ఇక సంసారము నాకేమి హాని చెయ్యగలుగుతుంది? నా జాతి, వ్యక్తిత్వము అన్నీ ముకుందుడి దర్బారుకి చెందినవే! హే! ముకుందా! ఇపుడు నీవే నా యోగ - యుక్తివి! జ్ఞానము ప్రాప్తించింది. ప్రకాశము కలిగింది. నీవే కరుణించి ఈ క్రీత దాసుడిని స్వీకరించావు. రవిదాసు అంటున్నాడు - ఇక తృష్ణ వదలిపోయింది. ముకుందుడిని జపిస్తూ ఇక వారినే సేవిస్తూ వుంటాను.

ముకుంద ముకుంద జపహి సంసార
బిను ముకుంద ముకుతికైదాతా, సోయి ముకుంద హమరే పిత మాత ॥1॥
జీయత ముకుందే మరతముకుందే, తాకే సేవక కవు సదా ఆనందే
ముకుంద ముకుంద హమరే ప్రాన, జపి ముకుంద మసతకి నీసానం
సేవ ముకుంద కరై బైరాగీ, సోయి ముకుందు దురబల ధనులాధీ ॥2॥
ఏక ముకుంద కరై ఉపకారూ, హమరా కహా కరై సంసారూ
మేరీ జాతి హుయే దరబారీ, తుహీ ముకుంద జోగ జుగతారీ ॥3॥
ఉపజియో గిఆను హుఆ పరగాస, కరి కిరపాలీనే కీరదాస
కహిరవిదాస అబ్ త్రిసనా చూకీ, జపి ముకుంద సేవా తాహూకీ ॥4॥

ఆ రైదాస భక్తుడు తన పూరి పేరు నాతో ఎపుడూ చెప్పలేదు. పగటి పూట ఎపుడైన వచ్చేపోయే దారిలో ఎదురుపడినా, దారి వదలి ప్రక్కకు వెళ్ళిపోయేవాడు. మాట్లాడటమయితే ఎవరితోనూ వుండేదికాదు. నాతో కూడా ఎపుడూ ఇతరుల ఎదుట మాట్లాడలేదు. లోకులు ఎవరో పిచ్చివాడులే అనుకునేవారు. అతడు ఏమి తింటాడో, ఎక్కడ వుంటాడో ఆసంగతులు ఏవీ కూడా లోకులకు తెలియదు. వస్తుతః అందరూ తమ తమ పనులలోనే మునిగితేలుతూ వుంటారు. ఎవరు ఎవరిని గురించీ ఆలోచించే తీరిక ఎక్కడ?

శ్రీమద్భాగవతములో ఇలాంటి ఎన్నో ఉదాహరణలు వున్నాయి. వాటిలో భక్తి మహిమ వలన శ్వపచుడు కూడా శ్రేష్ఠతముడవుతాడని వర్ణన వస్తుంది. భక్తి ప్రారబ్ధమును కూడా మార్చివేస్తుంది. భక్తి మంతుడైన శ్వపచుడికి కూడా యజ్ఞము చేయకనే యజ్ఞఫలము లభించేట్లు చేస్తుంది. భక్తి బయటకి సర్వగుణ సంపన్నుడైనా బ్రాహ్మణుడు భక్తుడు కాకపోతే వాడి కంటే భక్తియుక్తుడైన చాండాలుడు కూడా శ్రేష్ఠుడే. భగవన్నామము ఎవరి జిహ్వాగ్రముపైన వుంటుందో వాడు శ్వపచుడయినా అందరికంటే శ్రేష్ఠుడే. వాడికి తపస్య, హోమము, వేదాధ్యయనము, వేదానువచనము అన్నిటి ఫలము లభిస్తుంది. భాగవత ధర్మము యొక్క ఆవిర్భావమే సకలసృష్టి కల్యాణము కొరకు జరిగినది. పుత్రులందరికి తండ్రి ఒడిలో కూర్చునే అధికారము వుంది. ఆ అజ్ఞాతనామ భక్తుడు నిజముగానే ఒక విలక్షణమైన భక్తుడు. అతడి కళ్ళ నుండి ప్రేమామృతము తొణికిసలాడేది. అతడి వాక్కులో మాధుర్యము వుండేది. వాడి ప్రవర్తనలో ఒక కోమలత వుండేది. శరీరము నుండి భక్తియొక్క ఒక ఉన్మత్త ధార ప్రవహిస్తూండేది. ఒకటి రెండు సంవత్సరములు గడిచిన తరువాత చాలా రోజుల వరకూ నాకు కనిపించలేదు. ఎక్కడికయినా వెళ్ళిపోయాడో లేక చనిపోయాడో తెలియదు అని అనుకున్నాను. కానీ చాలా సంవత్సరముల తర్వాత బృందావనపు సందుల్లో చూశాను. ప్రేమోన్మాదముతో నిండి తొనికిసలాడుతూ, ఆనందాన్ని విరజిమ్ముతూ అతడు ఆడుతూ పాడుతూ వున్నాడు. అతడిని ఎవరూ గుర్తు పట్టలేదు. కానీ నేను గుర్తుపట్టాను. ఇపుడు అతడు కృష్ణప్రేమలో పూర్తిగా మునిగిపోయాడు. అతనికి ఇపుడు ఎక్కడైనా మందిరములకు వెళ్ళే ఆవశ్యకతలేదు, ఎవరితో కలవడము అవసరము లేదు. భగవంతుని తప్ప మరెవ్వరినీ అతడు గుర్తుపట్టడములేదు. ఇతరులు కూడా అతడిని గుర్తించడములేదు. ఇప్పటికి ముప్ఫై సంవత్సరముల క్రిందటి మాట ఇది. ఇప్పుడతడు ఎక్కడున్నాడో, లేడో, ఈ సంగతి ఏమీ నేను చెప్పలేను.

మధయాపూర్ బాబా

భోజనము చేసేటపుడు కొంచెము ఉప్పుకావలని వారి వదిన గారిని అడిగారు. వదిన విసుగుగా జబాబిచ్చింది - 'నీవు 20 సంవత్సరము వాడివి అయ్యావు, సంపాదించి ఏమీ తీసుకురావడము లేదు. పైగా ఎప్పుడు పడితే అప్పుడు ఉప్పు కావాలి, బెల్లము కావాలి అని అడుగతూ కూచుంటావు'. యువకుడైన ప్రతాపుడు భోజనం దగ్గర నుండి లేచి నిలుచున్నాడు. వదినతో ఇలా అన్నాడు 'వదినగారూ! ఇక నేను ఏదైన సంపాదించి తెచ్చినపుడే ఇంట్లో భోజనం చేస్తాను' వారి వూరు వారణాసికి మూడు కోసుల దూరములో వుండేది.

ఇప్పటికి వంద సంవత్సరముల క్రిందటిమాట ఇది. ఆ యువకుడు వారణాసి నుండి బయలుదేరి ఎలాగో ఒకలాగ బొంబాయి చేరుకున్నాడు. ఆ సమయములో బొంబాయి మరీ ఇంత పెద్ద నగరము కాదు. భూలేశ్వర్‌కి దగ్గరలో ఒక బజారు వుండేది. అక్కడ రోజంతా పనికోసము ప్రయత్నించాడు. రాత్రి ఇక ఆకలితోనే ఒక శివమందిరములో వెళ్ళి పడుకున్నాడు. ఒక రోజు, రెండు రోజులు, మూడు రోజులు ఇలాగే గడిచిపోయింది. మూడవ రోజు రాత్రి ఒకలంగోటి ధారి మహాత్ముడు, నల్లగా వున్నాడు. ఆ వ్యక్తి చేతిలో దొన్నె దానిలో మిఠాయి వున్నది. దగ్గరికి వచ్చి 'నీవు ఆకలిగా వున్నావు. పట్టు తీసుకో ఇవి తిను, రేపు నీకు పని దొరుకుతుంది. ధనం దొరికితే అది నీది అని మాత్రము అనుకోవద్దు' అని చెప్పి నిశ్శబ్దంగా వెళ్ళిపోయాడు. అతడు ఎవరో మహాత్ముడు!

ఈ యువకుడికి ఒక మిఠాయి దుకాణంలో పని కుదిరింది. అక్కడికి వచ్చిపోయే వారికి నీళ్ళు ఇవ్వడం ఇలా చిన్న చిన్న పనులకు నౌఖరుగా కుదిరాడు. కొద్ది రోజుల

లోనే యువకుడు భాగస్థుడయ్యాడు. సంవత్సరం నిండీ నిండకనే ఆ దుకాణానికి ఉత్తరాధికారి రూపములో యజమాని అయ్యాడు. దుకాణ యజమాని చనిపోయాడు. అతడికి ఎవరూ లేరు. అందుకని అతడు ఈ యువకుడినే ఉత్తరాధికారిని చేశాడు.

ఇక ఇపుడైనా వదినగారికి ఏదైనా కొంచెం డబ్బు పంపించాలి అని అతడికి అనిపించింది. 5, 5 వేలు రెండు డ్రాఫ్టులు తీసి పంపాలని పోస్టాఫీసుకు వెళ్ళేముందే చాలా జబ్బుపడ్డాడు. మరణాసన్నుడయ్యాడు. ఆ మహాత్ముడే ఆ రోజు మరల వచ్చారు. అన్నారు 'చూశావా? నీది అని అనుకున్నావెందుకు? సాంసారికమైన వస్తువులను నావి అని అనుకోవడమే మృత్యువు. వస్తువులు మనవి ఎప్పటికీ కావు. 'నేను' చచ్చిపోతుంది. నీవు మూడు రోజులలోగా ఈ దుకాణము అంతా బీదలకు పంచిపెట్టు. లేకపోతే మరణిస్తావు.' అని మహాత్ముడు అన్నారు. యువకుడు అలాగే చేశాడు. మూడవ రోజున లంగోటి ధరించి మహాత్ముడి వెంట వెళ్ళిపోయాడు. 'కటనీ' (మధ్యప్రదేశ్) దగ్గర వైలోర్ గుహల వరకు యాత్ర సాగింది.

మహాత్ముడు ఆ యువకుని ఆ గుహలో వుంచాడు. స్నానం, భోజనం, లఘుశంక, శౌచము అన్నీ ఆ గుహలోనే జరిగిపోవాలన్నారు. నేను ఆజ్ఞ ఇచ్చే వరకు సూర్యుడి దర్శనము కూడా చెయ్యకు అన్నారు. పదకొండు సంవత్సరాలు ఆ మహాత్ముడు ఆ యువకుడికి అన్నపానాదులు దగ్గర నుండి, మలమూత్రాదుల బయట పడేశే వరకు సమస్తమూ తానే చూచుకున్నారు. పదకొండు సంవత్సరాల వరకు కూడా అసలు దీనిలో నుండి నేను ఎపుడైనా బయట పడతానా లేదా అన్న సంగతి కూడా ఆ యువకుడికి తెలియదు. అన్ని వాసనలు నశియించిపోయాయి. మమతాస్పదమయిన విషయమంటూ ఏదీ మిగలలేదు. 'అహం' గురువు పట్ల శరణాగతమయినది. అన్ని ప్రతిబంధాలు తొలగినవి. అవరోధమనే ఆనకట్ట తెగిపోయినది. చింతన ధార ఒకటి అతిప్రబలంగా బయల్వెడలినది. ఆ ధారలో 'ఇదం' రూప జగత్తు లోపించింది. 'అహం' రూప జగత్తు అన్ని ఆవరణల నుండి ముక్తమయినది. పరమాత్మతో కలసిపోయినది. విషయము స్ఫురించేది కాదు. ఇంద్రియముల ప్రవృత్తి లేదు. వాసనలు శాంతమయినవి. వృత్తులు అచలమయినవి. ఆత్మ పరమాత్మతో అభిన్నుడు! ఇదే దశ సాధారణంగా ఎపుడు వుంటూ వుండేది.

పదకొండు సంవత్సరముల తర్వాత తనకిష్టము లేకపోయినా బయటికి రమ్మని ఆజ్ఞ అయింది. సూర్య-దర్శనము కలిగింది. వృక్షములు, కొండలు, వాగులు, నడుస్తూ-తిరుగాడుతూ వుండే ఈ ప్రాణులు అన్నీ దృష్టి గోచరమయ్యాయి. 'ఇక ఇపుడు నీవు భ్రమణము చెయ్యి' అని ఆ మహాత్ముడు ఆజ్ఞ ఇచ్చాడు. వారు వారణాసి దగ్గర వున్న తన జన్మభూమికి వచ్చారు. ఆ వూరి బయట, బావి దగ్గర, ఒక గుడిశె వేసుకుని అందులో వుండేవారు. ఒకటిన్నర ఛటాకులు తూకం చూచుకుని ప్రతిదినము తినేవారు. శరీరము కృశించి పోయినది. ఉదయం 10 గంటల నుండి మరల ప్రొద్దున 6 గంటల వరకు ఆ కుటీరము మూసి వుండేది. ప్రొద్దున 6గంటల నుండి 10 గంటల వరకు కుటీరము తెరచి వుండేది. అదే సమయములోనే నిత్యకర్మలు, సత్సంగము, భోజనము అన్నీ జరిగిపోయేవి. వులన్ లంగోటి వేసుకునేవారు. కంబళిపైన పడుకేనేవారు. నిద్రపోయే అలవాటు పోయింది. పసివాడి లాంటి స్వభావము.

మేము దర్శనము కోసము వెళ్ళినపుడు, చిన్నపిల్లాడిలాగ ప్రవర్తించేవారు. ఇంకా సరిగా చెప్పాలంటే వానరుడిలాగ కూడా వుండేది ఆ స్వభావము. మాట్లాడుతూ మాట్లాడుతూనే ఎగిరి గంతేసేవారు. పరుగులు పెట్టేవారు. ఒక్క దూకుదూకి చెట్టుపైన ఎక్కి, రెండు కాళ్ళూ వేళ్ళాడేసుకుని కొమ్మపైన కూర్చునేవారు. ఆకులు తుంచి పీపీలు చేసి వూదేవారు. దర్శనం కోసం వచ్చినవాళ్ళతో భోజన-పానాదులు, వుండటానికి వ్యవస్థ ఇలాంటి విషయాలను గురించి మాట్లాడేవారు కాదు. సాంసారిక చర్చ వారికి అసలు ఇష్టము వుండేదికాదు. వారి ముఖతః విన్న మాటలను కొన్నిటిని నేను మీకు చెబుతాను 'కోరికలు వాటంతటవే వస్తాయి. వాటికని ప్రయత్నించవలసిన అవసరము లేదు. మంచి సంస్కారములు వుంటే మంచి కోరికలు, చెడు సంస్కారములు వుంటే చెడు కోరికలు వస్తాయి. ఏమీ చెయ్యలేని స్థితిలో కూడా కోరికలు పుడుతూనే వుంటాయి. అందువలన ఇచ్ఛ అన్నది సాధన కానేరదు. ఒక విశేషమైన లక్ష్యమును ఆధారముగా పెట్టుకుని విచారణ చేయడము, విశేషమైన ప్రణాళికతో విచారణ చేయడము వలన అది సాధన అవుతుంది. విచారణలో లక్ష్యము యొక్క ప్రాముఖ్యత వుంటుంది. ఏ వస్తువును గురించి నీవు విచారిస్తున్నావు? ధనమా? జనమా? భవనమా? ఇవన్నీ కూడా సంసారికమైన విచారణలు. భోగ్య

విషయములు, కర్తవ్యములు, గమనాగమనములు వీటన్నిటి యొక్క విచారణలు సాంసారికమైనవే. కుండను గురించి కాదు, మట్టిని గురించి విచారణ జరగాలి. కార్య జగత్తును గురించి కాదు, ఉపాదాన వస్తువు యొక్క విచారణ జరగాలి. ముత్యము అందముగా వుంటుంది, దానితో ఆభరణము తయారవుతుంది. జలము మధురముగా వుంటుంది. (తృప్తినిస్తుంది రెంటితో (జలము, ముత్యము) రెండూ ప్రయోజనాలు సిద్ధిస్తాయి. కానీ తత్త్వదృష్టితో చూస్తే రెండూ జలమే. ఇంటినే కాల్చేసే అగ్ని వలన దుఃఖం కలుగుతుంది. చలిని పోగొట్టే అగ్ని వలన సుఖం కలుగుతుంది. కానీ తత్త్వదృష్టితో చూస్తే రెండూ అగ్నియే. శీతల మందసుగంధ వాయువు సుఖమును కలిగిస్తుంది. తీవ్ర ప్రచండ వాయువులు, తుపాను గాలులు దుఃఖమును కష్టాన్ని కలిగిస్తాయి. మన ప్రయోజనానుసారముగా వస్తువులో భేదము చూడటము మిథ్యా వికల్పము మాత్రమే. తమ తమ స్వార్థము, ప్రయోజనమును ఉపేక్షించి (ప్రక్కకుపెట్టి), వస్తువు యొక్క అసలైన నిజమైన స్వరూపమును గురించిన చింతన పరమార్థమువైపు తీసుకువెళ్తుంది. స్త్రీ, పురుషుల శరీరాలు ఆకృతులు వేరు వేరుగా వుంటాయి. ప్రయోజనములు కూడా వేరు వేరుగా వుంటాయి. కానీ ఇద్దరూ పంచభూతములతో చేయబడినవారే! ఇద్దరి ఆత్మ ఒక్కటే. ఏకత్వమును చింతన చేయడము వలన వాసనావేగము శిథిలమవుతుంది. 'ఇదం' మారుతూ వుంటుంది. 'నేను' మారదు. నేను సుఖిని, నేను దుఃఖిని, ఇలా ఈ 'నేను' కూడా మారుతూ వుంటుంది, కానీ 'నేను' అన్నదాని సాక్షి మాత్రము ఒక్కటే. శరీరము బయట, లోపల కూడా స్థానము మారుతూ వుంటుంది. వయోవస్థలు మారుతూ వుంటాయి. ఇంద్రియముల విషయము కూడా పరివర్తన శీలమే. దేశ-కాల-వస్తువుల పరివర్తనములో కూడా అపరివర్తన శీలము ఆత్మ ఒక్కటే. ఒకటి అంటే ఎలాగ? అది రెండుగా అవదు. ఒకటి అంటే - దేనితో అనేక(భాగ)ములు కావో! ఒకటి అనడము కంటే దాని బదులు అద్వయము అన్న శబ్దము ఇక్కడ ఉపయుక్తముగా వుంటుంది. అద్వయ వస్తువు ఆత్మయే. ఒకవేళ అద్వయము ఆత్మకంటే అన్యమయినది అనుకుంటే అది విషయము, జడము, ప్రత్యక్షము, పరస్పర విరుద్ధము అవుతుంది. లేకపోతే పరోక్షము కల్పితమవుతుంది. అద్వయము తన ఆత్మ స్వరూపములోనే అద్వయముగా వుంటుంది. ద్వైతము ఆత్మ సత్తా లాగ సత్తు కాదు.

ఆత్మ సత్తా స్వప్రకాశచేతనము అన్య సత్తుపైన ప్రకాశము జడము. ఈ విధముగా ఆత్మానుకూల చింతనము చేయడము వలన ప్రతిబంధాలన్నీ దూరమైన ఆత్మజ్ఞానము కలుగుతుంది. ఈ చింతనము పది, పదిహేను నిమిషములు జరిగిన సర్వోత్తమమే. ఘంట, రెండు ఘంటల వరకు ఈ చింతన ధారాప్రవామమయితే ఇక చెప్పనక్ఖరలేదు. సమాధి, భావము వీటిలో అజ్ఞాన-నివృత్తి చేయగలిగే శక్తి లేదు. సమాధిలో వృత్తియే లేనపడు ఇక నివర్తకమెలాగ? భావమయితే భాసమాన ప్రత్యక్షములను విరుద్ధముగా వుంటుంది. అందువలన సంసారముతో సంసారిక బంధన నుండి ముక్తులయ్యేందుకు లక్ష్యాను సారముగా చింతన జరగాల్సిన ఆవశ్యకత వున్నది. భిన్న-భిన్న శబ్దాలు లేక ఒకే శబ్దాన్ని మాటి మాటికి ఉచ్చారణ చేయడం జపము. అది భావము కాని, విచారమును జాగృతము చేయడంలో సహకరిస్తుంది. శబ్దము యొక్క అర్థజ్ఞానము లేకపోతే దానివలన లయము కలుగుతుంది, లక్ష్యము యొక్క సాక్షాత్కారము కలుగదు. కాబట్టి జపములో కూడా అర్థము యొక్క చింతన ఆవశ్యకము.

ఉదాహరణకు ఎవరైనా 'ఓం' అన్న శబ్దమును జపించేటపుడు మూడు అవస్థలు (జాగ్రత, స్వప్న, సుషుప్తి) మూడు గుణాలు (సత్త్వరజస్తమ) మూడు శరీరాలు (స్థూల, సూక్ష్మ, కారణ) ముగ్గురు దేవతలు, త్రిపుటి ఇవన్నీ వదిలి పైన అమాత్రలో స్థితము కావలసి వుంటుంది. శరీరములో కూడా మూడు రకములుగా ప్రణవమును చూడగలుగుతాము - నడుము వరకు ఒకటి, భుజముల వరకు రెండవది, భృకుటితో కలసి తల వరకు మూడవది. మొదటిది రెండవదానిలో, రెండవది మూడవదానిలో లయము అవుతుంది. మూడవదాని లయము యొక్క సాక్షియే ద్రష్ట. మూల అజ్ఞానము నివృత్తమయ్యే వరకు కూడా ద్రష్ట పరిచ్ఛిన్నుడుగానే వుంటాడు. 'ఓం' యొక్క జపము చేస్తే దాని అర్థచింతనము ఎలా జరగాలంటే దాని ఉచ్చారణ మరచిపోతాము.

వేదాంత పరంగా 'ఓం'కారము యొక్క ఉచ్చారణ, లయమైనపుడు పరమేశ్వర భావన ఇది ముఖ్యము కాదు. దాని ద్వారా సూచింపబడిన అర్థచింతనమే ప్రధానము. 'అ'కారము అంటే జాగ్రదవస్థ యొక్క ఉపాధితో కూడిన చేతనము. జాగ్రతవస్థ

అంటే - సకారణ పాంచభౌతిక సృష్టి. ఇది ఎంతో, అంత పెద్ద చేతనమును విశ్వవైశ్వానరము అంటారు. వస్తుతః అది విరాట చైతన్యమే. వైశ్వానర చైతన్యమును విరాట చైతన్యములో లీనము చేయరాదు, పైగా రెంటి యొక్క ఏకతను అర్థము చేసుకోవాలి. భ్రమ వలన భేదము కలుగుతుంది, జ్ఞానము వలన ఏకత! దీనినే 'అ'కారము ద్వారా తెలియజేస్తారు.

స్వప్నావస్థ యొక్క ఉపాధితో కూడిన చైతన్యమును తైజసహిరణ్యగర్భము అంటారు. సూక్ష్మసమిష్ఠితో సమానమైన చైతన్యము యొక్కపేరే అది 'ఉ'కారము ద్వారా దీనినే తెలియజెబుతారు. ఎలాగైతే స్వప్నము యొక్క దృశ్యములు ద్రష్టయొక్క విలాసములో, అలాగే జాగ్రతసృష్టి జాగ్రద్ద్రష్ట యొక్క విలాసము. విలాసములో భేదము వుంటుంది కానీ, ద్రష్టలో భేదము లేదు. ఒక శరీరము యొక్క జాగ్రదవస్థని జాగ్రతమనరు. ఎలాగైతే స్వప్నములోని సకల శరీరములు, పంచభూతములు, స్వర్గనరకములు, దేవత-ఈశ్వరుడు అన్నీ స్వప్నమో! అలాగే జాగ్రదవస్థయొక్క దృశ్యములన్నీ కూడా దృశ్యములే. అవస్థ ఏదైనా సరే, ద్రష్ట ద్రష్టయే! ఈ అర్థము అంతా 'ఉ'కారము ద్వారా సూచింపబడినది.

సుషుప్తి అవస్థలో వ్యష్ఠి-సమిష్ఠి భేదము తెలియదు. అందువలననే సుషుప్తి-మహాప్రళయము వీటిలో భేదము లేదు. సుషుప్తి ఉపాధితో ఉపహిత చైతన్యమును 'ప్రాజ్ఞ' ఈశ్వరుడంటారు. అందులో విషయములేదు, కర్మలేదు, ప్రమాణము లేదు, భేదము లేదు. ఆ అవస్థను ఉపాధితో ఉపహిత చైతన్యమును 'మ'కారము ద్వారా సూచిస్తారు. ఉపాధులు మూడు, అందుకని మూడు రకములుగా తెలియజెప్పారు. ఇపుడు ఏదైనా విషయం విడదీసి చెప్పడానికి ఎ, బి, సి అనో; క, ఖ, గ అనో గుర్తుపెట్టుకుంటారో అలాగే తత్త్వము యొక్క కాల్పనిక విభజన కోసం ఈ సంకేతము లుపయోగించడం జరిగినది. గురు శిష్యుల పరస్పర వార్తాలాపముల కొరకు ఇది ఒక శైలి. ఇందులో యదార్థత ఏమీ లేదు. ఇది సాధన పాదము. వస్తు పాదము కాదు.

ఎపుడైతే ఔపనిషత్ జ్ఞానము ద్వారా అజ్ఞాన భ్రమ తొలగి ఆత్మరూపంతో పరమ తత్త్వము యొక్క అనుభవము కలుగుతుందో, ఇక అపుడు ఈ కాల్పనిక విభజన

ఇవి ఏమీ వుండవు, వీటి నుండి విముక్తి (బాధ్) కలుగుతుంది. విచారణ యొక్క ఈ శైలి, వలన వచ్చేది, పొయ్యేది అంటూ ఏమీ లేదు. ప్రతీతి ఎలాగుందో అలాగే వుంటుంది. అజ్ఞాన కాలంలో ఎలాగుందో జ్ఞానం కలిగిన తర్వాత కూడా అలాగే వుంటుంది. ప్రబలమైన వేగవతి అయిన ఔపనిషద్విచారధార కేవలము భ్రమను పోగొడుతుంది. ఒక్కోసారి మొదటి తరంగములోనే లేక, చాలా తరంగాల తాకిడికైన భ్రమ నివృత్తి జరుగుతుంది. భ్రమ నివృత్తి కంటే వేరుగ ఆత్మతత్త్వములోగానీ, ప్రతీతిలోగానీ ఏమీ పరివర్తన కలుగదు. నిర్మాణ విభాగం శ్రమతో కూడినది. మనసు, ఇంద్రియముల నిర్మాణ విభాగము కేవలము దృశ్య విషయకము. మహావాక్యము కూడా భ్రమ నివర్తకము కావుననే మహావాక్యమును ప్రమాణము అంటారు. ప్రమాణము విషయజ్ఞాపకము కాదు. అవిద్యానివర్తకము మాత్రమే. ఇదే వేదాంత విద్య యొక్క విశేషత.

ఆమహాత్ముడు ఉదయం 6గం॥ల నుండి 10గం॥ల వరకు మాత్రమే కలిసేవారు. ఆ సమయంలోనే వారి స్నాన పానాదులు, భోజనాదులు, సత్సంగం అన్నీ అవుతుండేవి. ఒక్కోసారి మాతో పాటు చెట్టు నీడలో నేలపైనే కూర్చునేవారు. ఒక్కోసారి ఎగిరి చెట్టుపైన కూర్చునేవారు. కొమ్మపైన కూర్చుని రెండు కాళ్ళు వేళ్ళాడేసి వానర చేష్టలు చేసేవారు. వారు స్వభావముగా చాలా వినోది. భలే నవ్వించేవారు. వారిని కలిసి ఇప్పటికి 40సం॥లకు పైగానే అయినది. వారు చెప్పిన రెండు మూడు సంస్మరణలు ఇలాగున్నాయి.

1. వారు పంజాబులో ఒంటరిగ విచరణ చేసేవారు. లంగోటి తప్ప ఇక వస్త్రము వుండేది కాదు. అపుడు వారి శరీరావస్థ 35-40 సం॥ల వయసు వుండవచ్చు. ఒక స్త్రీ వారిని భోజనానికి ఆహ్వానించింది. వారు భోజన సమయానికి వెళితే అక్కడ ఆ స్త్రీ తప్ప వేరే ఎవరూ లేరు. బాగ ప్రేమగా భోజనం పెట్టింది. తర్వాత అన్నది - 'ఈ ఎండలో మధ్యాహ్నం వేళ కదా ఇక్కడే విశ్రాంతి తీసుకుని వెళ్ళండి'. కానీ స్త్రీ ఒంటరిగా వున్నచోట ఆ మహాత్ముడు విశ్రాంతి తీసుకోవడానికి ఇష్టపడలేదు. ఆమె ఇంటి తలుపు లోపలి నుండి మూసివేసింది. మొదట చాలా అనునయ వినయములతో ప్రార్థించింది, తర్వాత పిస్తోలు బయటికి తీసింది 'నా కోరిక తీరుస్తావా లేదా? లేకపోతే

మీరు నన్ను బలాత్కరించ ప్రయత్నించారని గట్టిగా అరచి అందరికి చెబుతాను' అని అన్నది. మహాత్ముడు దిగ్భ్రాంతి చెందాడు. ఒక్కక్షణము ఆగి నవ్వుతూ ఇలా అన్నాడు 'సరే నీ ఇష్టమే కానీ!' అని వెళ్ళి మంచం పైన కూర్చున్నారు. ఆమెతో ఇలా అన్నారు 'నాకు త్రాగటానికి నీళ్ళు కావాలి' ఆమె నీళ్ళు తీసుకురావడానికి బయటికి వెళ్ళింది. అపుడు ఆ మహాత్ముడు వాకిలి దగ్గర మల విసర్జన చేసి దానిని తన శరీరముపైన అంతా రాసుకున్నారు. ఆమె నీళ్ళు తీసుకుని వచ్చి చూసింది. గ్లాసు చేతుల్లోంచి జారి క్రింద పడిపోయింది. ఆమెతో వారు ఇలాగన్నారు 'ఇపుడు అరచి అందరినీ పిలవనైనా పిలు, లేదా పిస్తోలుతో కాల్చనయినా కాల్చు'. ఆమె భయపడి ఇంటి వాకిలి తెరిచింది. వారు బయటపడ్డారు. సమయస్ఫూర్తితో వారికి పని జరిగింది. అటువంటి వారినే 'ప్రత్యుత్పన్నమతి' అంటారు.

2. మధ్య ప్రదేశ్‌లో ఒక రాజ్యము వుంది. అక్కడ ఒక మహాత్ముడిని జైల్లో వేశారు. వారయితే స్వయంగా ఎపుడూ గంజాయి త్రాగలేదు. కానీ వారి పూలతోటలో గంజాయి మొక్కలున్నాయి. ఇదే వారి అపరాధము. ఎపుడయితే మన మహాత్ముడికి ఈ సంగతి తెలిసిందో వారు ఒంటరిగానే వందల కొద్దీ మైళ్ళు ప్రయాణించి అక్కడికి చేరుకున్నారు. రాజుగారి ఉద్యానవనంలో వెళ్ళి కూర్చున్నారు. లంగోటీ మాత్రమే ధరించేవారు. ధూళి ధూసరితమయిన శరీరం! రాజుగారు అక్కడ వ్యాహ్యాళికని వచ్చారు. రాజుగారి అనుచరులు వచ్చి 'నీవు ఇక్కడి నుండి తప్పుకో. రాజుగారు వస్తున్నారు' అన్నారు. వారు అక్కడి నుండి కదలడానికి ఏమాత్రం తయారుగా లేరు. రాజుగారు తిరుగుతూ తిరుగుతూ అక్కడికి వచ్చారు. వారు మహాత్ముడిని ఇలా అడిగారు 'నీవు ఎవరు?' మహాత్ముడు 'నేను నీకు ఎలాగ కన్పిస్తున్నాను?' రాజు 'ఒక మనిషి'. మహాత్ముడు 'నీవు మాదిగవు' (అంటే తోలుపని చేసేవాడు) రాజుగారి సేవకులకు చాలా కోపం వచ్చింది వారు వారిని బలవంతంగా అక్కడి నుండి లేవదీయడానికి ప్రయత్నించారు. మొండికెత్తేటప్పటికి వాళ్ళు ఈడ్చుకుపోవాలని చూశారు. దాంతో మహాత్ముడు తిట్టడం మొదలుపెట్టాడు. కావలి వాడు వారిని పట్టుకుని పోలీస్‌స్టేషన్ తీసికెళ్ళాడు. డిప్టీకలెక్టర్ దగ్గర హాజరు పరిచారు. వారు అడిగారు 'మహాత్మా! మీరు రాజుగారిని మాదిగ అని ఎందుకన్నారు?' మహాత్ముడు 'ఎందుకంటే వారు నాతోలు చూసి నన్ను మనిషి అనుకున్నారు. ఎవరైతే చర్మాన్ని

గుర్తించగలరో వారు మాదిగలే కదా! శరీరము 'ఆత్మ' కాదు'. ఆ డిప్టీకలెక్టర్‌కి సత్సంగ సంస్కారము వుండినది. వెంటనే వారిని కుర్చీలో కూర్చోబెట్టి కుశల ప్రశ్నలు మొదలు పెట్టారు. ఆఖరికి వారు ఇలా అడిగారు 'మహాత్మా! మీరు ఈ గడబిడ అంతా ఎందుకు చేస్తున్నారు? అసలు మీకు ఏమి కావాలి?' అని. అపుడు మహాత్ముడు ఇలా అన్నారు. ఒక మంచి సాధువు మీ జైల్లో వున్నారు. నేను వారిని కలుసుకోవాలనుకుంటున్నాను. నన్ను జైలుకు పంపించండి. నేను కొన్ని రోజులు వారితో పాటు వుండాలను కుంటున్నాను'.

డిప్టీకలెక్టర్ రాజుగారితో చెప్పి ఆ సాధువుకు జైలు నుండి విడుదల చేయించాడు. మహాత్ములిద్దరూ ఆనందంతో నవ్వుతూ వెళ్ళిపోయారు. తన మిత్రుడిని జైలు నుండి తప్పించడానికి, తనతో కలవడానికి వారు స్వయంగా ఎంత కష్టమైన సహించారు.

వారు అంటూ వుండేవారు -

ప్రతి ఎముక కూడా శివలింగరూపమే. ఎముకల వలనే శరీరము సంఘటితమై యున్నది. అందువలన ఈ శరీరము కూడా శివమయమే. ఎలాగైతే తండ్రి, గురు, పతి వీరందరినీ పరమేశ్వర బుద్ధితో సేవిస్తామో సుశ్రూష చేస్తామో అలాగే ఈ శరీరమును కూడా ఈశ్వరబుద్ధితో పవిత్రజలము, ఫలము, పుష్పము అర్పించాలి. దీనిని తిరస్కరించరాదు. శరీరము కేవలము పరమేశ్వరాభివ్యక్తి కలిగే స్థలమనే కాదు, అది శివరూపమే. వస్తుతః సమగ్ర సృష్టి శివ రూపమే.

పరిశీలనగా చూస్తే శరీరంలోని ప్రతి అవయవపు ఒంపు 'రేఫ'రూపమే. ఎక్కడెక్కడ శరీరము ఒంపు వుందో అక్కడ కూడా 'ర' అక్షరము అవుతుంది. ఇది 'రామ' శబ్దము యొక్క 'ర'. దేదీప్యమానమైన అగ్ని బీజము 'ర' యొక్క సమూహమే. ఇందులో సమస్త పాప-తాపాలను సంహరించే సంపూర్ణ శక్తి వున్నది. దీనిని హీనబుద్ధితో చూడక మంత్రమూర్తిగా తెలుసుకోవాలి.

పాప పుణ్యాలు ప్రత్యక్షాది ప్రమాణాల వలన తెలుసుకోలేము. ఇవి శాస్త్రైక గమ్యములు. వాటి నివృత్తి కూడా శాస్త్రైకగమ్యమే. ఎవరైన భగవన్నామమును ఉచ్చరించిన శాస్త్రానుసారము ప్రాప్తించిన పాపము శాస్త్రప్రకారంగానే నివృత్త

మవుతాయి. శాస్త్రానుసారము భగవన్నామోచ్చారణతో పాపనివృత్తి కలిగిన తర్వాత ఆత్మయొక్క నిష్పాపత, నిష్కళంకత యొక్క జ్ఞానం కలుగుతుంది. తర్వాత కూడా తను పాపిని అన్న అభిమానము వున్నదంటే శాస్త్రంపట్ల అవిశ్వాసము, భ్రమయే కారణము. ఒక సారి తన స్వరూపము వైపు, లేదా భగవదున్ముఖము అయిన తర్వాత తనను తాను పాపి-పుణ్యాత్మ, సుఖి-దుఃఖి, స్వర్గీయ-నారకీయ అని అనుకోవడములో ఏమీ కారణము కనిపించదు. ఏదైతే ఒక తృణము, కణము కంటే క్షుద్రమైనదో, ఒక్క క్షణమాత్రములోనే నివృత్తము చేయగలమో, దానిని ఒక కొండలాగ మోస్తూ మన తలపైన మోస్తూ తిరగడం ఉచితము కాదు. కేవలము అవిచారములోనే అశాంతి వున్నది. విచార ధారా ప్రవాహములో అశాంతి అంతా కొట్టుకుపోతుంది.

మోకల్‌పూర్ బాబా

నేను నిజంగా ఒక విషయంలో మాత్రము చాలా భాగ్యవంతుడిని. నాకు కొంచెం అర్థం చేసుకునే వయసు వచ్చినప్పటి నుండి నేను ఎవరో ఒకరు మహాత్ముల ఛత్రఛాయలోనే వుంటూవచ్చాను. సంత్ మహాత్ముల కృప నాపైన బాగా వున్నది. వారు నన్ను తమవాడిని అనుకున్నారు. ఈ రోజు ఏమహాత్ముని గురించి వ్రాస్తున్నానో వారికి నాపైన చాలా ప్రేమ, చాలా రోజుల వరకు నేను వారి సంపర్కములో వున్నాను. అయినా నేను వారి సాంగత్యములో అంత లాభాన్వితుడిని కాలేకపోయినా, వారి పవిత్ర స్మృతి ఎన్నడో ఒకనాడు నన్ను పవిత్రుడిని చేస్తుంది. సందేహం లేదు.

దాదాపు 1930వ సం॥ అనుకుంటాను అప్పటి మాట. కాశీకి 6, 7 మైళ్ళ దూరంలో గంగ ఒడ్డున ఒక సిద్ధపురుషుడు వున్నాడని విన్నాను. వారి కుటీరమునకు నాలుగు దిక్కులా గంగాదేవి చుట్టివుంటుంది. వారు ఎవరితోనూ సంబంధం పెట్టుకొనకుండా ఏకాంతంగా వుండేవారు. ఎవరైన రోగి, దుఃఖంతో వారి దగ్గరికి వస్తే వారికోసం ఏదో (గడ్డిపోచలు) తృణము తీసి ఇచ్చేవారు. వాడికి బాగయిపోయేది. ఆ రోజులలో సిద్ధులను గురించి నా మనసులో మహత్వ బుద్ధి వుండేది కాదు, అయినా వారి సిద్ధులను గురించి విని వారిని దర్శించవలెనని ఒక మిత్రుడిని వెంట తీసుకుని వెళ్ళాను. మొదటి సారి వారు తమ కుటీరంలో కనిపించలేదు. ఎన్నో వూళ్ళల్లో తిరుగుతూ తిరుగుతూ గంగ ఒడ్డున ఏకాంత ప్రదేశంలో కూర్చుని వుండగా మొదటిసారి వారిని కలిశాము. వారి మాటల వలన తేలినదేమిటంటే మేము వారి దర్శనము కోసము పడే అవస్థలు చూచి ఇక మాకు దర్శనము ఇవ్వడానికే మా కోసము అక్కడ కూర్చున్నారు! వారు పల్లెటూరి భాసలో మాతో ఇలా అన్నారు - 'భగవంతుడి లీల విలక్షణమైనది! చూడు! ఈ శరీరాన్ని ఎక్కడి నుండి ఎక్కడికి

తెచ్చి పడేశాడు. మిమ్మలను కూడా ఎంత తిప్పి తిప్పి నా దగ్గరికి చేర్చాడు! ఏం! మీరు నా దగ్గరికి నేరుగా రావచ్చు కదా!' ఇందులో కూడా ఏదో రహస్యముండి వుంటుంది, ఇందులో కూడా ఆ భగవంతుడి లీల ఏదో వుంటుంది' ఆ రోజు కొందరు రైతులు అక్కడికి పెరుగు తీసుకుని వచ్చారు. బాబా మా ఇద్దరికి బాగా పెరుగు తినిపించారు. ఇది వారి మొదటి స్వాగతము, 'సరే మంచిది. ఇక వెళ్ళండి. మరల ఎపుడైన రండి' అన్నారు.

రెండోసారి మేము ముగ్గురు మిత్రులము వెళ్ళాము. దారిలో నా మనసులో అనేకరకములయిన ఆలోచనలు తలెత్తాయి. నేను ఇలా ఆలోచిస్తున్నాను - నాకయితే సిద్ధులతో అవసరము లేదు, బాబా నేమో ఏమీ ఉపదేశములు ఇవ్వరు, మరి నేనెందుకు వీరి దగ్గరికి వెళ్తున్నట్లు? కానీ ఇలా ఆలోచించేటపుడు కూడా బాబాగారి జ్యోతిర్మయ ముఖ మండలము, వారి సౌమ్య స్వభావము నాకళ్ళకు కట్టినట్లుండేది. నేను ఏదో ఒక దివ్య అకర్షణతో వారివైపు ఆకర్షితుడనయ్యాను.

ఈసారి వెళ్ళగానే బాబా ఉపదేశము మొదలు పెట్టారు. వారు ఇలా అన్నారు - 'నీవు భగవంతుడిని నిరాకారుడనుకుంటే నిరాకారుడు, సాకారుడనుకుంటే సాకారుడు. నిరాకారుడి సంకల్పము వలన ఒక జల బిందువు సృష్టింపబడింది, లేదా సాకారుడి స్వేదము నుండి ఒక జల బిందువు పుట్టింది. దాంతో సకల జగత్తు సృష్టింపబడింది. దానిని కొందరు 'మూల ప్రకృతి' అంటారు. కొందరు 'కారణవారి' అంటారు, నేను 'గంగాజీ' అంటాను. ఆ జలమే - కఫము. దానిలోని గతి - వాతము. దాని పెట్టు - పిత్తము. ఈ మూడు ధాతువుల వలన సృష్టి యొక్క నిర్మాణము జరిగినది. వాస్తవముగా ఈ సకల నామరూపములు 'గంగాజీ'వే.

గంగాజీ లోనే గడ్డి, మరియు మాంసము రెంటి యొక్క సృష్టి జరిగింది. గంగాజీయే మట్టి నుండి గడ్డి అయింది, వనస్పతి, ఓషదుల వలన మాంసము అయింది. మాంసమయమే అన్ని శరీరాలూ, మరల మాంసము కరిగి మట్టి అవుతుంది. మట్టి నుండి మరల గడ్డి మొలుస్తుంది. ఈ క్రమము చాలా రోజులుగా జరుగుతూనే వుంది. వేరుగా కూచుని తమషా చూస్తుంటాడు' సాధారణంగా బాబా భగవంతుడిని జాదుగర్ (బాంగర్) అని అంటుండేవారు. వారు దీని వ్యాఖ్యానము

కూడా చేసేవారు. అంటారు 'ఎవరైతే తనలో తనే తనకు తానే సంతుష్టుడో వాడికి ఇన్ని ఉపాధులు తయారు చేసే అవసరమేమిటట? నిష్కారణంగా ఇంత పెద్ద జంజాలం పెంచటమన్నది మరి అది వాడి 'బాంగర్‌పన్' యే కదా? మరల నవ్వుతూ ఇలా అడిగేవారు 'నేను అన్నది అనుచితమా? ఏమి? చెప్పు? గంగామాతయే ఈ కనిపించే దంతాను, ఈ భేదాలు కూడా తను తయారు చేశినవే. వీటిని గంగామాత కంటే భిన్నంగా చూడటము అజ్ఞానమే అవుతుంది. మనము అందరమూ గంగాజీలోనే పుట్టాము. గంగాజీలోనే వుంటున్నాము. ఆడుతున్నాము, తింటున్నాము, గంగామాత ఒడిలోనే పడుకుంటున్నాము, తనలోనే కలసిపోతున్నాము. గంగాజీని గురించే ఆలోచించు. గంగాజీనే తెలుసుకో, అపుడిక నిన్ను నీవు తెలుసుకోగలవు, అందరినీ తెలుసుకోగలవు'.

రోజు చూస్తూనే వుంటావు కదా! పంచ భూతముల సృష్టి ఎలా జరుగుతుందో! నీవు ఒక ఆసనము పైన శాంతంగా కూర్చుని వున్నావు. నేను దీనికి ఆకాశము అను కోమంటాను. ఇక ఇపుడు నీవు ఏదో అనివార్య కారణము వలన పరుగెత్తావు, దీనిని నేను వాయువు అంటాను. పరుగెత్తడము వనల కలిగిన వేడి వుందే అది అగ్ని. వేడి వలన చెమట పడ్తుంది అది జలము. అది ఆరి మురికి అవుతుంది అది మట్టి అవుతుంది. ఇది నీకు నిత్యము కలిగే అనుభవము. కానీ నీవెపుడూ ఈ విధంగా ఆలోచించలేదు, పై పైనే జీవించేస్తుంటారు. చూడు! చూడు! నీకు సృష్టి రహస్యము చిటికె వేసేంతలోనే తెలిసిపోతుంది.'

వారు ఉపదేశము చేసే భాష, శైలి విలక్షణమైనది. గ్రామీణుల గ్రామ్యభాషలోనే ఉత్తమోత్తమమైన తత్త్వమును గురించి చెప్పెడివారు. వారి భాష వ్యాకరణం ఎపుడూ ఉత్తమ పురుషము, మధ్యమ పురుషము వాడేవారు కాదు. కేవలము అన్యపురుషములే ప్రయోగము చేశెడివారు. ఎపుడైనా ఏదైనా మాట కాస్త గట్టిగా చెప్పాలనుకుంటే పక్కా గ్రామ్యములో చెప్పేవారు. వాస్తవముగా వారికి సంసారములోని అన్ని క్రియాకలాపాలు, కర్త-భోక్త అన్యమయిపోతుంది. అది వారి ఆత్మ అయిపోతుంది. అక్కడ అదే రకంగా చెప్పడం జరుగుతుంది.

మేము మాటిమాటికి వారి దగ్గరికి వెళ్తుండేవారము. ప్రతిసారి ఏదో ఒక ఉపదేశము చేస్తూనే వుండేవారు. ఒక్కోసారి నా తలపైన పువ్వులుంచి నమస్కరించేవారు, ఒక్కోసారి ఎంత తిరస్కరించేవారంటే ఇక ఆ కుటీరంలో ఉండలేకపోయేవాళ్ళం. అదంతా కూడా వారికి మాపైన వున్న అపార స్నేహమే అని మాకు అనుభవమయ్యేది.

ఒక్కోసారి వారి దగ్గర కూర్చున్నపుడు మనసులో ఏదైనా భోజన విషయం వస్తే, అది ఆ ఋతువులలో దొరికేది కానప్పటికీ ఎవరో ఒకరు వచ్చి ఆ వస్తువు అక్కడ తెచ్చి ఇచ్చేవారు. వారుమాకు ఇస్తుండేవారు ఇదినా స్వంత అనుభవము.

ఒకసారి బాబాగారు అన్నారు - 'మీరు మాటి మాటికీ నాదగ్గరికి వస్తూవుంటారు. నేను కూడా మీ దగ్గరికి వస్తాను పదండి'. ఒక రోజు నిశ్చయమైనది. బాబా వచ్చి మావద్ద గంగ ఒడ్డున ఒక నెల రోజులు వున్నారు. మేమందరము రమారమీ రాత్రింబవళ్ళు అక్కడే వుండేవాళ్ళము. వేల వేల సంఖ్యల్లో స్త్రీ పురుషులు గుంపులు గూడేవారు. బాబా నవ్వుతూ, నవ్వుతూ అందరి మధ్య తిరుగుతూ అందరి మనోకామనలు పూర్తిచేస్తుండేవారు. ఉపదేశాల శృంఖల మొదలయింది. పెద్ద పెద్ద విద్వానులు, ధనికులు, అందరూ వచ్చేవారు. బాబా అందరితోనూ సమానంగా వ్యవహరించేవారు. ఎవరైనా పూలు, పళ్ళు తెస్తే వెంటనే దర్శనార్థులకు పంచి పెట్టేవారు. వారిలా అనే వారు-'ఆత్మకాని పరమాత్మకాని ఏదైతే వున్నదో అది వున్నది. దాన్ని ప్రత్యేకముగా పొందడమంటూ ఏమీలేదు. కొంచెం ఆలోచించండి' ప్రయత్నించి బంధనమును తెంపాలి అంటే అది మరల బంధనము అవవచ్చు. ఒకవేళ సాధన ద్వారా సంసారాన్ని నశింపజేయాలంటే అది మరల పుట్టుకురావచ్చు. ఏమీ లేకనే ఇంత ప్రపంచవిస్తారము కలిగింది, ఇక నీవు ఇంకేదో చేయాలని అనుకుంటే అది ఎప్పటికీ నశించదు. దీని సమస్య ఇంకా ఇంకా ఎక్కువనే అవుతుంది. నీవు అజ్ఞానంతో ఈ సంసార బంధనము తయారు చేసుకున్నావో కేవలం దానిని జ్ఞానము ద్వారా ఖండించు, అజ్ఞానము ధ్వంసమవుతూనే జ్ఞానము యొక్క ఆవశ్యకత లేదు. అపుడు నీకు అర్థమవుతుంది-బంధనము లేకపోయినా నన్ను నేను బద్ధుడిని అని అనుకున్నావని. సంసారము, బంధనము ఇవి నీ కల్పనలోని భూతములు. వీటిని అట్టేపెట్టుకుని వీటికి భయపడుతూ వుండు, లేదా కావాలనుకుంటే వీటి నుండి ముక్తువవికా.

'భగవంతుడు ఎవ్వరికీ దూరంగా లేడు. వారు అందరికి చెందినవారు. అందరిని తన ఒడిలో తీసుకుని వున్నారు, అందరి హృదయాలలోనూ (ఒడిలో) వారే వున్నారు. నీవు ఎప్పటి వరకు తనని గుర్తించవో అంత వరకు అతను నీకు అపరిచితుడు, వారు దగ్గరగా వున్నా నీవు వారిని పొందలేవు. ఎపుడైతే నీవు భగవంతుని తెలుసుకుంటావో ఇక అపుడు ప్రతిదినము అనికాదు, ప్రతిక్షణము కూడా అనేక రూపాలలో నీ దగ్గరికి వస్తున్నాడు, నీతో క్రీడిస్తున్నాడని తెలుసుకుంటావు. నీవు భగవంతుని పొందడానికి ఏదైనా ఘోర అరణ్యములోనికి, లేదా పర్వతముపైకి వెళ్ళాలనుకుంటున్నావా ఏమిటి? ఒకవేళ అతనిని నీవు ఇక్కడ పొందలేకపోతే గుర్తించలేకపోతే అక్కడికి వెళ్ళి గుర్తుపట్టగలవు అని ఎలా కల్పన చేసుకోగలుగుతావు? మొదట నీ హృదయ మందిరములో ఆ భగవంతుని దర్శనము చేసుకో, తర్వాత అంతా ఆయన హృదయమే అయిపోతుంది'.

భగవంతునికి ఆత్మ సమర్పణ చేసుకోవాలి. కానీ ఈ ఆత్మ భగవంతునికి సమర్పితము కాలేదా ఏమిటి? సంపూర్ణ ప్రకృతి, సంపూర్ణ ప్రకృతి యొక్క వికృతి మరియు సంపూర్ణ జీవులు భగవంతునికి సమర్పితయ్యేవున్నవి. వారి ఇచ్ఛా, వారి శక్తి, వారి ప్రేరణ లేక ఒక తృణమైన కదలదు. అన్నీ వారు ఆడించినట్లే ఆడుతున్నాయి. అపుడు ఆత్మసమర్పణ యొక్క అర్థమేమిటి? ఆత్మసమర్పణకు అరథమేమిటంటే 'నేను సమర్పితుడను కాలేదు అన్న భావన సమూలంగా పెకిలించి పారవేయడమే. వారు ఆడించినట్లుగా మనం ఆడుతున్నామాయె! మరల అనుకుంటున్నాము నేను స్వతంత్రముగా ఆడుతున్నాను అని! ఈ మూఢ నమ్మకాన్ని పోగొట్టుకోవాలి. ఈ మాన్యత ఎందుకు కలుగుతున్నదంటే ప్రపంచ స్వరూపమును గురించిగానీ, మన జీవన స్వరూపమును గురించి గానీ సరియైన విచారణ లేకపోవుటయే దీనికి కారణము. ఇది అర్థము చేసుకునే వరకు దీని నుండి ముక్తి లేదు. ఇది కావాలంటే సద్గురువు వలన తెలుసుకో లేదా భగవంతుడు స్వయంగా తెలియజెప్పినా సరే.

ఈ సారి ఈ విధంగా బాబా ఉపదేశించిన సంగతులు ఆధ్యాత్మిక సాధకులు ఎవరికైనా సంపూర్ణముగా ఉపయోగపడేవే. ఇంకా చెప్పాలంటే ఇక్కడ స్థలా భావము, మరియు నాకు అన్ని మాటలు పూర్ణతః గుర్తుకూడా లేవు. ఆ రోజులలో అక్కడ

చలా ఆశ్చర్యకరమైన ఘటనలు కూడా జరిగాయి. మా వూరి దగ్గర మా మిత్రుడు ఒకడుండేవారు, ఇప్పటికీ అతను జీవించి వున్నాడు స్వస్థుడైవున్నాడు. కానీ ఆ రోజులలో అతడు పిచ్చివాడైవుండెను. జనులు వాడిని పట్టుకుని వచ్చి బాబా ముందర నిలబెట్టారు. 5 నిమిషాలలో వాడు ఆరోగ్యవంతుడయ్యాడు. ఇది నాకళ్ళతో చూసిన ఘటన. ఒక రోజు అనావృష్టి కారణంగా గ్రామీణులు అందరూ కలిసి మొండిగా బాబాను ఎండలో కూర్చోబెట్టారు. మేమంతా వారికి చాలా చెప్పి చూశాము. ఆపాలని ప్రయత్నించాము కానీ మాదొక్క మాట కూడా సాగలేదు. బాబా కూడా వచ్చి కూర్చున్నారు. ఒక గంటలో ఆకాశంతా మేఘావృతమయింది, విపరీతంగా వర్షము కురిసింది. ఒకసారి నావల్ల ఏదో అపరాధము జరిగిపోయింది. ఆ సంగతి నాకు తప్ప మరెవరికీ తెలియదు. నేను బాబా దగ్గరికి వెళ్ళగానే వారు అంతా విప్పి చెప్పారు, నన్ను వెంటనే గంగాస్నానము చేసి ప్రాయశ్చిత్తము చేసుకోమని చెప్పిపంపారు.

వారు మోకల్‌పూర్‌లో 40 సంవత్సరాల నుండి వుండేవారు. కానీ అక్కడ ఎవరికీ వారిని గురించి ఏజాతివారని, ఎక్కడివారని, ఏ ఆశ్రమానికి చెందినవారని గానీ, వారి పేరు - ఏ వివరాలు ఎవరికీ తెలియదు. బాబా మావూరి దగ్గర గంగ ఒడ్డున వున్నపుడు అక్కడ ఒక ప్రఖ్యాత వైద్యుడు ఇంకా ఇద్దరు ముగ్గురు శాస్త్రులు కలసి వారి సంగతులు తెలుపమని బాబాను బలవంతము చేశారు. అసలు సంగతేమిటంటే నేనేమో బ్రాహ్మణుడిని, నేను వెళ్ళి ఎవరో బ్రాహ్మణేతరుడిని సేవిస్తున్నానేమో అన్న సందేహము. కానీ బాబా సంగతేమో ఎవరికి తెలియదు, లోకులు రకరకాలుగా మాట్లాడుకునేవారు. మేము కూడా ఒకరోజు బాబాను తన జీవిత విశేసాలు ఏవైనా కొన్ని మాటలు చెప్పవలసిందిగా బ్రతిమలాడాము.

బాబా అన్నారు - 'ఈ విశాలసృష్టిలో ఒక వ్యక్తి యొక్క జీవితానికి ఏమీ ప్రాముఖ్యత వున్నది? ప్రతి రోజు అసంఖ్యాకముగా క్రిమి కీటకాదులు పుడుతుంటాయి చస్తుంటాయి. కొన్నిటికయితే ఒక్క రోజులోనే ఎన్నో జన్మలు! అలాగే నేను ఒక కీటకాన్ని. నాజన్మ, నా జీవితము ఏదో గొప్ప సంగతి కాదు. నాకు ఏజాతి - గీతి లేదు నేను భగవంతుడికి చెందిన వాడిని. అంతా భగవంతుడిదే. అందరిజాతి ఏదైతే వున్నదో అదేనాది కూడా. అందరిదీ ఒక జాతి. అందరిదీ ఒక వరుస. నేను

బ్రాహ్మణుడిని, క్షత్రియుడిని అయి ఏమి చేసేదున్నది? మీకు ఏది ఇష్టమయితే అది అనుకోండి' అన్నారు. కానీ ఈ సమాధానము ఎవరినీ సంతృప్తిపరచలేదు. చాలా మంది బాబా వెంటపడి అలా అడుగుతూనే వుండేవారు. బాబా నవ్వుతూ ఇలా అన్నారు - 'సరే మంచిది ఈ రోజు చెబుతాను వినండి ఈ కీటకము యొక్క జీవనము. శాస్త్రములలో నయితే 'ఆత్మచరితం న ప్రకాశయేత్' అని నిషేదించారు కానీ మీరు వినాలని ఇంత ఉవ్విళ్ళూరుతుంటే వినండి మరి' అంటూ బాబా చెప్పడము మొదలుపెట్టారు -

'వింధ్యాచలము మరియు ప్రయాగ వీటి మధ్యనున్న ఒక వూరు మా తల్లితండ్రుల జన్మభూమి. నా తండ్రి సరళస్వభావుడు, భగవద్భక్తుడు. ఇంట్లో వారు వారిని భాగమివ్వకుండా వెర్రిబాగులవాడని తరిమివేశారు. మా తల్లి కూడా వారిననుసరించింది. వారు ఇరువురూ వింధ్యాచలములోని ఒక ధర్మశాలలో వుండి భిక్షా వృత్తితో జీవించేవారు. బ్రాహ్మణుడుకాబట్టి ఎవరి క్రింద నౌఖరి చేయడం వారికి సరి అనిపించలేదు. కొన్ని రోజుల తర్వాత ఆ ధర్మశాలలో నేను జన్మించాను. పన్నెండు సంవత్సరముల వరకు భిక్షావృత్తితో వారు నన్ను పోషించారు. వారిరువురూ ఒకేసారి ఈ ప్రపంచాన్ని వదలడముతో నేను ఒంటరివాడిని, అనాథను అయ్యాను. భగవంతుడు తప్ప నాకు అన్యరక్షకులు లేరు. నా తల్లిదండ్రులు నన్ను భిక్షావృత్తితో పెంచినప్పటికీ నాకు మాత్రము భిక్ష అడగడము ఇష్టము వుండేది కాదు. వింధ్యాచలములో చాలా మంది యాత్రికులు వచ్చేవారు. నేను వారి మూటలు మోస్తూ వారిచ్చింది తీసుకునేవాడిని. ఈ విధముగా చాలా సంవత్సరములు గడిచినవి. ఒక రోజు ఒక సాధువుల బృందము కావడిలో నీళ్ళు మోసుకుని రామేశ్వరము వైపు ప్రయాణించడము నేను చూశాను. ఆ రోజుల్లో రైళ్ళు లేవు. అందరూ కాలినడకనే యాత్ర చేసేవారు. నాకు వెళ్ళాలని మనసులో కోరిక గలిగింది. రామేశ్వరము దర్శనము చేసుకుందామని అనిపించింది. కుటుంబ మోహమయితే లేదాయె. తిరిగి రావాలా వద్దా అన్న ప్రశ్నేలేదు. నేనుకూడా ఒక కావడిలో గంగాజలము తీసుకుని వారివెంట బయలుదేరాను.

వారి వెంట రామేశ్వరము మొదలైన తీర్థ క్షేత్రములు సంవత్సరాల కొద్దీ తిరిగాను. ఒకసారి నర్మదానది పరిక్రమ చేసేటపుడు ఒక వృద్ధ బ్రహ్మచారి దర్శనము కలిగింది. వారు నాపైన కృపజూపి నన్ను వారి దగ్గరనే పెట్టుకున్నారు. విద్యాధ్యయనము, యోగాభ్యాసము చేయించారు. నిరంతరం జపము జరుగుతూ వుండేది. వివేక విచారములు చేయగలిగే యోగ్యత పెరిగి, నా చిత్తవృత్తులు నిరుద్ధములయినవి. పదహారు సంవత్సరములు అభ్యసించిన తర్వాత ఆ బ్రహ్మచారిగారు నాకు విచరణ (భ్రమణము) చేయడానికి అనుజ్ఞనిచ్చారు. నేను దాదాపు భారతదేశములోని అన్ని క్షేత్రములను తిరిగాను. ఈ యాత్రలలో నాకు అనేక ప్రకారములయిన అనుభవములు కలిగినవి. అందరితోనూ ఏదో ఒకటి నేర్చుకున్నాను. ఒకసారి నాకు భగవతి గంగామాత దర్శనము కలిగింది. అప్పటి నుండి నేను ఉన్మాదుడిలాగ రాత్రింబవళ్ళు గంగా గంగా అంటూ అరుస్తూ వుండేవాడిని. శరీరంపైన బట్టలు వున్నాయా లేదా అన్న ధ్యాస కూడా నాకు వుండేదికాదు. ఆద్యశక్తి జగన్మాత గంగామాతయే అని అనిపిస్తుండేది. నేను గంగ ఒడ్డున స్మరణ, ధ్యానము వీటిలో లీనమయి ఆమాతకు శరణాగతుడనై తిరుగుతూ వుండేవాడిని.

'మోకల్‌పూర్' ప్రదేశము నాకు చలా ఇష్టమయింది. అది నాలుగు వైపుల నుండి చుట్టబడి గంగామాత గర్భములో వున్నట్టుంది. నాకు మా అమ్మఒడిలో వుండటమే ఇష్టము అయింది. ఇప్పటికి 40, 50 సంవత్సరములుగా మోకల్‌పూర్‌లోనే వుంటున్నాను. ఇక్కడికి వచ్చాక సంత్ మహాత్ముడు కచ్చాబాబాగారికి నాపైన చాలా కృప కలిగింది, ఇక ఇపుడు నేను ఎలావున్నానో, ఎవరినో అది మీ ముందే వున్నాను. భగవంతుడి సృష్టిలో ఎలాగైతే అనేక ప్రాణులున్నాయో అలాగే వారిలో నేను కూడా ఒకడిని మీరు నన్ను ఎత్తైన ఆసనముపైన కూర్చోబెట్టినపుడు అక్కడ కూర్చుంటాను. లేకపోతే క్రింద కూర్చుంటాను. ఇక నా అనుభవమేమిటంటారా! ఇదంతా భగవంతుడి లీల! భగంతుడి కృప! అంతా భగవంతుడే! కేవలం భగవంతుడే!

ఎపుడైనా చాలా జనసందోహము ఎక్కువైతే బాబా అడవిలోకి పారిపోయేవారు. అక్కడ గంటలకొద్దీ అలా తిరుగుతూ వుండేవారు. తరువాత ఈ జనానికి గుంపుకి గాభరాపడి మా దగ్గర నుండి వెళ్ళిపోయారు. 80 సం॥ల వయసు వచ్చినా వారి

శరీరములో ఎంత బలము వుండేదంటే వారు గనుక పరుగెత్తారంటే గొప్ప గొప్ప నవయువకులు కూడా పరుగెత్తి వారిని పట్టుకోలేకపోయేవారు. వారిది చాలా నియమబద్ధమైన జీవితము. గడియారము లేకపోయినా అన్ని పనులు సమయానికి జరుగుతువుండేవి. రెండు పూటలా స్నానం చేసేవారు. ఎటువైపునుండి గాలి వీస్తుందో అటు వైపుగా కూర్చునేవారు. ఎవరి శరీరాల నుండి వచ్చే గాలిని తన శరీరమునకు తగలనిచ్చేవారు కాదు. ఎవరైనా రోగులు వస్తే వారి చికిత్స కూడా విలక్షణముగా వుండేది. ఫలానా ఫలానా 5 వృక్షములకు ప్రణామము చెయ్యి, బాగవుతుంది అని అనేవారు. ఫలానా దేవతకు ఏడుసార్లు పరిక్రమ చెయ్యి. నీ పురోహితుడికి సుష్టుగా తినిపించు, బాగయిపోతుంది. నీ రోగము పారిపోతుంది అని చెప్పేవారు. మరి కొందరికేమో నీవు పాపం చేశావు, మరి అనుభవించేదెవరు? అని అనేవారు.

ఒక మాస్టారుగారు, వారు ఇప్పటికి జీవించివున్నారు. వారికి ఆస్థ్మా ఎంత భయంకరంగా వుండేదంటే వారికి మాట్లాడటానికి కూడా కష్టమయ్యేది. శరీరము ఎండిపోయింది. తిరగాడటానికి కూడా శక్తి వుండేది కాదు. ఒకరోజు ఎలాగో ఓపిక చేసుకుని వారు బాబా దగ్గరకు వచ్చారు. బాబా అన్నారు 'ఈ జామపండు తిను' ఆ మాస్టారు భయపడిపోయారు. ఒణికిపోయారు. బాబా బలంతంగా రెండు సేర్ల జామపండ్లు తినిపించారు. దానిపైన చాలా చాలా పెరుగు తినిపించారు. తర్వాత కర్ర తీసుకుని లేచారు పరుగెత్తు బాగా రెండు కోసులయిన పరుగెత్తు లేకపోతే నీప్రాణం పోతుంది అని న్నారు. ఆ రోజు నుండి వారి 'దమా' రోగం బాగయిపోయింది. వారు ఇప్పటికీ స్వస్థులైవున్నారు. ఒక స్కూల్లో మాస్టరీ చేస్తూ బాబాగారి గుణకీర్తనము చేస్తుంటారు. అలాగ ఎంతో మందికి బాబా వలన మంచి జరిగింది.

ఒకసారి బాబా మా ఇంటికి వచ్చారు. ఈ సారి రావడమే ఆఖరు అయింది! మరల రావడం కుదరలేదు. బాబా నాతో మాటిమాటికీ 'నీవు ఉపదేశకుడివి కాకు' అని చెబుతూ వుండేవారు. నేను సంస్కృతంలో ఒక పుస్తకము వ్రాశాను. దాదాపు 200, 250 వరకు శ్లోకాలుండేవి. దాని పేరు 'తత్త్వ-రసాయనము'. బాబా దృష్టి దానిపైన పడింది. బాబా అన్నారు 'ఇన్ని గ్రంధాలు పడివున్నాయి, చదివేవారు లేరు, ఇక నీవు ఈ క్రొత్త భారం పెంచుతున్నావా? నీకు కాగితాలు నలుపు చెయ్యాలన్న

సరదానా ఏమిటి?' నేను ఇక ఆ పుస్తకాన్ని తీసుకెళ్ళి గంగానదిలో పారవేశాను, ఇక తర్వాత ఎపుడూ వ్రాయకూడదు అని నిశ్చయించుకున్నాను. నాని నిశ్చయంతో ఏమవుతుంది?, నిశ్చయమయితే ఇంక ఎవరిదో పని చేస్తుంది. బాబా సంస్మరణ నేనే వ్రాయవలసి వస్తుందని ఎవరికి తెలుసు?

బాబా వారి దర్శనం కోసము పెద్ద పెద్దవాళ్ళు అంటే మదనమోహన మాలవ్య గారి లాంటివారు, గోపీనాథ కవిరాజ్ లాంటి పెద్దపెద్ద విద్వానులు, రాజులు, ధనవంతులు కూడా వస్తూండేవారు. 1937వ సం॥, డిశెంబరు, అప్పటి మాట - బాబా అన్నారు 'ఒక యజ్ఞము చెయ్యాలి. 5 రోజుల వరకు హవనం అలా జరుగుతూనే వుండాలి. మధ్యలో ఏమైన విఘ్నము వచ్చినా సరే యజ్ఞము నిలిపివేయరాదు. యజ్ఞము చేయగా మిగిలినది హిందూ విశ్వవిద్యాలయం, కాశీ వారికి దానము ఇవ్వాలి. నేను మరణిస్తే నన్ను కచ్చా బాబా సమాధి దగ్గరనే సమాధి చేయండి. యజ్ఞము ప్రారంభించారు. రెండో రోజుననే బాబా నిద్రించారు. మరి ఇక లేవలేదు.

ఆఖరిరోజులలో బాబా సంకీర్తనము పట్ల చాలా ప్రాముఖ్యత చూపారు. జాల్వాపుర్ పరగనా ప్రజలను ఎకత్రితము చేసి అందరితో కీర్తన చేయించేవారు, పరిక్రమ చేయించేవారు. వారు ఇలా అనేవారు - 'ఈ కలియుగ జీవులతో ధ్యాన-సమాధులు ఇవన్నీ అయ్యేపని కాదు కేవలం భగవన్నామము యొక్క ఆశ్రయముతోనే మంగళకరమైన సాధన చేయగలరు'. వారు కచ్చాబాబాని సాక్షాత్తు విశ్వనాథ స్వరూపులుగా తలచేవారు. కచ్చాబాబా అనేవారు 'వీరు నా కంటే కించిత్తు తక్కువ కాదు' అని. అయినా మహాత్ములలో పెద్ద, చిన్న అన్న ప్రశ్నేమీ వుండదు, వారి లీల వారికే తెలియాలి!

కాశీలో ఒక మహాత్ముడుండేవారు. వారి పట్ల మా అందరికి శ్రద్ధా-భక్తులుండేవి. వారు ఇలా అన్నారు 'మోకల్‌పూర్ బాబా కారక పురుషుడు. వీరి వలన జగత్తులో శాంతి, సుఖము విస్తరిల్లింది. కాశీకి ఈశాన్యదిశలో వుంటూ వీరు కాశీని రక్షిస్తున్నారు'. నేను ఇక్కడ వారి మాటలలోని భావాన్ని మాత్రమే వ్యక్తంచేశాను. కాశీలోని సంత్ మహాత్ములలో వారికి చాలా ఉన్నత స్థానము వుండేది. బాబాగారి మాటలు నాకు సరిగా గుర్తులేవు. ఎవరో ఎక్కడో దుఃఖితులవుతే వారి కోసము బాబా వ్యాకులుడవడం

మేము చూశాము. దైవీ శక్తులతో వారికి ఘనిష్ఠ సంబంధము వుండేది. అన్ని చోట్ల నుండి వారికి సూచనలు అందుతూ వుండేవి. ఆ రోజులలో భూత, ప్రేత, పితరయోనులను నేను విశ్వసించేవాడిని కాను, అపుడు బాబా తన జీవితములోని అనేక సంఘటనలు నాకు చెప్పి నచ్చజెప్పారు. 1916వ సం॥లో గంగానదిలో చాలా భయానకమైన వరద వచ్చేట్లు వుందని వారు రెండు, మూడు రోజుల ముందుగానే అక్కడి వూరి ప్రజలను వరద ప్రదేశము నుండి దూరంగా పంపించారు. బిహార్ భూకంపము వచ్చినపుడు ప్రజలందరికి చెప్పి చందాలు వసూలు చేసి పంపారు. వరద సంగతి అడిగితే వారు నాతో ఇలా అన్నారు - 'గంగాదేవి స్వయంగా వచ్చి తన శ్రీముఖముతో తానే నాకు చెప్పింది' అని. వారి హృదయములో అపారమైన కరుణ వుండేది. జీవుల పట్ల ఒక స్వాభావికమైన కృప వుండేది, అదే సంత్ మహాత్ముల యొక్క విశేషమైన గుణము! మా పైన వారి కృప నిరంతము వర్షిస్తూనే వున్నాకానీ, అయినా ఇంకా విశేషకృపతో వారు మాకు అటువంటి యోగ్యతని ప్రదానం చెయ్యాని దానివల్ల శుద్ధ అంతఃకరణతో వారి కృపాధిక్యముతో లాభాన్వితులమయి వారి ఛత్రఛాయను నిరంతరం అనుభవించగలగనీ.

సంత్ స్వయంగా భగవంతుడే! భగవంతుడి కంటే గొప్పవాడు సంత్! చెప్పండి! సంత్ భగవాన్‌కీ జయ్!

సమర్ధ స్వామి యోగానంద పురీజీ

వారు ఇలా అన్నారు 'పండిత్! నీవు వేదాంత-శ్రవణమునకు అధికారివి. నేను నీకు ఔపనిషద్ అద్వైత సిద్ధాంతమును ఉపదేశిస్తాను'. నేను వినయంగా చేతులు జోడించి 'స్వామీజీ! నా సంకల్పము ఇలాగున్నది -

'భరి లోచన విలోకి అవధేసా ।
తబ సునిహౌ నిర్గున్ ఉపదేసా ॥ (రామచరితమనసము)

మొదట నాకు ఈ నేత్రాలతోనే సగుణ-సాకార భగవంతుని దర్శనము కలగాలి. ఇష్ట సాక్షాత్కార పర్యంతము ఉపాసన చేసి తరువాత వేదాంత-శ్రవణము చేస్తాను' అని నివేదించుకున్నాను.

'ఆత్మ సాక్షాత్కారమే యదార్ధ జ్ఞానము. ఆత్మ పరమాత్మ సత్యము. ఉపాసనలో ఏ సాకార-నిరాకార రూపముయొక్క భావన చేస్తామో అది గురువు, శాస్త్రము యెడల శ్రద్ధ వలన కలుగుతుంది. అందు వలన నీవు మరల బాగా ఆలోచన చేసుకుని నీ నిశ్చయాన్ని దృఢము చేసుకో' అని వారు నాకు తెలియజెప్పారు.

నేను మరల సాకారోపాసన పట్ల నా శ్రద్ధను నిశ్చయంగా చెప్పాను. వారు చిరునవ్వు నవ్వుతూ అంగీకరించి ఇలా అన్నారు 'మొట్టమొదట నీవు గాయత్రి-పురశ్చరణ చెయ్యి. యజ్ఞోపవీత సమయములో ఆచార్యుడు ఏ మంత్రమునిచ్చారో, దానిని విధిపూర్వకముగా అనుష్ఠానము చెయ్యకపోతే మనము కర్తవ్య చ్యుతుల మవుతాము. కావున వేరే మంత్రము, దేవత యొక్క ప్రసన్నత పొందటం కష్టమవుతుంది. శ్రీ శంకరాచార్యుడి గాయత్రి - పురశ్చరణ పద్ధతి ననుసరించి

సంక్షేపముగా వారు నాకు పురశ్చరణ ప్రక్రియను గురించి తెలిపారు. ఒక పూట భోజనం, రెండోపూట కేవలం పాలు. జపము - అనుష్ఠానము చేయడానికి దాదాపు ప్రతి రోజు ఆరు గంటలు సమయం పట్టేది. మనసులో ప్రసన్నత ఉండేది కాదు. ఏమి చెయ్యాలన్నా ఉత్సాహము వుండేది కాదు. ప్రాపంచిక విషయాలలో అభిరుచి వుండేది కాదు. జపము చేస్తూ చేస్తూ మనసు స్తబ్ధమయిపోయేది. నేను స్వామీజీతో అన్నాను 'సామీజీ! మనసు లీనమవడంలేదు. కేవలం జిహ్వ కదులుతుంది. మాల(జపమాల) చేతిలో తిరుగుతూవుంది. అంతే!' అపుడు వారు అన్నారు 'మంత్ర జపము జిహ్వతోనే జరుగుతుంది. ధ్యానము మనసుతో జరుగుతుంది. వాక్కుతో జపము జరగాలి. మంత్రములో వున్న అక్షరాలలో అచింత్యమైన శక్తి వుంటుంది. వాటి ఉచ్చారణ వలన శరీరములోని ఒక్కొక్క నాడీ చైతన్యమవుతుంది, జాగృతమవుతుంది, లోపలవున్న నాడులను భౌతికమైన ఏ మంత్రుల సహాయంతో జాగృతము చెయ్యలేము. వాటిని శాస్త్రోక్తములైన శబ్దముల యొక్క ధ్వనియే పరివర్తనము చేయగలదు. శబ్దముల యొక్క సూక్ష్మస్పందనము వలన అణువణువునా ఒక విధమైన రాసాయనిక ప్రక్రియ ఉత్పన్నమవుతుంది, దీనితో శరీరములో ఒక దివ్యత్వం వస్తుంది. ప్రాణములు స్థిరములవుతాయి. మనసు ప్రసన్నతతో ఉల్లాసముతో పరిపూర్ణమవుతుంది. జపము సాధన, ప్రసన్నత దాని అవాంతర ఫలము. భగవదనుగ్రహము పరమ ఫలము. మొదటే ఫలము కోరవద్దు. సాధన చెయ్యి. మనసు లగ్నమయితే జపము జరగడం కాదు, పజము చేస్తే మనసు లగ్నమవుతుంది.

జపము చేసేటప్పుడు భూమి, ఆసనము, శరీరము, మరియు ధరించే వస్త్రము పవిత్రమైనవిగా వుండాలి. సాధ్యమైనంత వరకు కుట్టినవికానీ, ఇతరులవి కానీ వస్త్రములు ధరించరాదు. అనుష్ఠానము మొదలుపెట్టే ముందే అశ్వద్ధ (పీపల్) పత్రముపైన మాల నుంచి సంస్కారము చెయ్యాలి. జప సంఖ్య గణన వుండేది. ఎలాగైతే ధనం కూడబెట్టేవాడు ఎంతెంతగా ధనం కూడబెడుతూ వుంటే అంతగా సంతోషపడుతుంటాడో, అదే ప్రకారముగా జపము చేసేవారికి కూడా తనహీన భావనను పోగొట్టుకోవడానికి జపము సరిగా జరిగినపుడు సంతోషము హర్షము కలుగవలసినదే.

ఏ విధంగానూ తొందరపాటు కూడదు, అందరికీ తెలిసేలాగ చెయ్యకూడదు. తన మాలను ఇతరులకు చూపించకూడదు. ఎవరి ఎదుటా కూడా మంత్రమును ఉచ్ఛరించరాదు. యశము, కీర్తి, ప్రతిష్ఠ, సత్కారము మొదలైన లౌకిక విషయములను కోరుకోరాదు. ఇష్ట దేవత పట్ల విశ్వాసము వుండాలి. ఒకవేళ స్వప్న దర్శనము, ఏకాగ్రత, తన్మయత కలుగకపోతే కూడా, మంత్ర ప్రభావము అంతర్దేశములో గంభీరంగా సంచితమవుతూ వుంది అని తెలుసుకోవాలి. చిన్న చిన్న అలలుగా (అనుభవాలు) ఎగసి పడలేదు. దాని వలన కూడా వున్నట్టుండి మంచి పరిణామమే కలుగవచ్చు.

గాయత్రి పునర్చరణ పూర్తి అయింది. దీనితో స్వామీజీ చాలా ప్రసన్నులయ్యారు. ఇక ఇపుడు వారు నాకు శ్రీకృష్ణ మంత్రము దీక్ష ఇచ్చారు. దీక్ష అన్న శబ్దమునకు అర్థము- దానము, మరియు క్షేపము, గురువు యొక్క అనుగ్రహము, శిష్యుడి యొక్క శ్రద్ధ కలిసి 'దీక్ష' అవుతుంది. దీక్ష కూడా అనేక రకాలు - మానసీ, స్పర్శి, చాక్షుషి, క్రియావతి మొదలైనవి. స్వామీజీ నాపై అన్ని రకాలుగా అనుగ్రహము కురిపించారు. నేను శ్రీకృష్ణ మంత్రమును విధి పూర్వకముగా అనుష్ఠానము చేయమొదలుపెట్టాను. భూత-శుద్ధి, న్యాసము, ధారణ అన్నీ సక్రమంగా జరిగాయి. భోజన-శయనాదులు నియమితములు. నేను ఉదయమే ఐదు మైళ్ళ దూరంలో వున్న స్వామీజీ కుటీరమునకు వెళ్ళేవాడిని. కుటీరము శుభ్రము చేసేవాడిని, తోటకు నీరు పెట్టేవాడిని. స్వామీజీ తన గురుదేవుల చిత్రపతము (ఫొటో)లోనే బ్రహ్మ, విష్ణు, మహేశుడు, రాముడు, కృష్ణుడు మొదలైన వారందరి పూజలు చేసేవారు. దాదాపు రెండుగంటలకు సహేపుర్ గ్రామము నుండి వారికి భోజనము వచ్చేది. వారు భోజనము చేసేవారు. బ్రాహ్మణులు, క్షత్రియుల ఇళ్ళల్లో ఒక్కొక్కరి ఇంటి నుండి ఒక్కోరోజు భోజనం వచ్చేది. నిర్ణీత సమయానికి వాళ్ళంతట వాళ్ళు 'భిక్ష' తీసుకుని వచ్చేవారు. నేను ఎపుడైనా స్వామీజీ ఆజ్ఞతో ఆ వూరి యదునందన్ పండిత్ వారి ఇంట్లో భోజనం చేసేవాడిని. క్షత్రియ గృహాలలో ఆపక్వాహారము తీసుకునేవాడిని. కానీ ఎపుడో నెలకోసారి అలాగ జరిగేది. మామూలుగానయితే నేను ఇంటికి తిరిగి వెళుతూ వుండేవాడిని.

శ్రద్ధ, విశ్వాసాలతో విధి పూర్వకంగా యధాశక్తి అనుష్ఠానము జరుగుతూ వుంది. ఒకటి పూర్తయింది, రెండవది మొదలు పెట్టాను. అలాగే మూడవది, నాలుగవది కూడా పూర్తి చేశాను. స్వామీజీ యొక్క ఆజ్ఞ ఏమిటంటే కలియుగములో జపసంఖ్య నాలుగంతలు చెయ్యాలి అని స్వామీజీ దగ్గర విధివిధానము నేర్చుకుని చక్కగా అనుష్ఠానము చేశాను.

ఎపుడైనా నేను నిరాశతో, విషాదగ్రస్తుడనయ్యానంటే అపుడు స్వామీజీ చాలా వాత్సల్యంతో నన్ను ఉత్సాహపరిచేవారు. 'క్లైబ్యం మాస్మ గమః' నపుంసకుడివి కాకు. ఏమీ ఫలితముకనిపించడము లేదా అంటావా? అయితే ఏమిటి? సాధన యొక్క ఈ ఘనఘోర అంధకారమయమైన నిశిరాత్రి అంతమవుతూ వుంది అనుకో. ఈ అంధకారము శాశ్వతము అనుకోకు. ఇపుడు ఇంకా కొంచెం శేషము వుంది. అంతే రాత్రి గడిచిపోతుంది - రెండు ఘడియలు మిగిలి వుంది. సూర్యోదయమవుతుంది. హృదయకమలము వికసిస్తుంది. అని అనేవారు.

ఒకసారి స్వామీజీ కుటీరము నుండి గంగ ఒడ్డునే నడుస్తూ మా వూరికి బయల్దేరాను. దారి చాలా దూరం అవడంతో బాగా ఆలశ్యమయింది. చీకటి పడింది. స్నానం చేయడం కోసం గంగలో దిగాను. లోతు ఎక్కువగ వుండింది. ఈతరాదు. మునిగిపోతున్నానని అనిపించింది. అంధకారంలో గంగానదిలో మునిగిపోయే సమయంలో ఎవరో వచ్చి నామెడ పట్టుకుని బయటికి తీసుకువచ్చి ఇసుకలో కూర్చోబెట్టినట్లు అనుభవమయింది. అక్కడ ఎవరున్నారు? ఏదో ఒక అద్భుత శక్తి కాబోలు! నేనయితే స్పష్టంగా దానిని చూడలేకపోయాను.

స్వామీజీ పేరు శ్రీయోగానందపురి - వారు ఒకసారి కర్ణవాసములో చాతుర్మాస్యము చేయడానికి వెళ్ళారు. నేను కూడా వారితో పాటు వెళ్ళాను. వారు పక్కాఘాట్ దగ్గర వున్న రాధాకృష్ణ మందిరము పైపైపు వుండేవారు. వారికి భిక్ష కూడా ఎక్కడినుండో వస్తూ వుండేది. నేను సాధారణంగా బొగ్గుల పొయ్యిలో ఖిచిడీ చేసుకునేవాడిని. పప్పు, బియ్యం, బంగాళాదుంపలు, నెయ్యి అన్నీ సమంగా వేసి తగినంత ఎసరు పెట్టి తయారు చేసేవాడిని. పై నుండి ఉప్పు తప్ప ఇంకేమీ వాడేది లేదు. ఖిచిడీ

తయారవుతూ వుండేది. నేనంత నేను జపం చేస్తూ వుండేవాడిని. ఇలా జరుగుతుండగా ఒకసారి నేను జపం చెక్యడానికి కూర్చున్నపుడు మాతల్లి, నాభార్య నా కళ్ళకు కట్టినట్టుండేవారు. వారి కళ్ళ నుండి అశ్రుప్రవాహం - వారు నాకోసం అత్యంత వ్యాకులత చెందుతున్నట్లు అనిపించేది. నేను స్వామీజీతో ఈ విషయం నివేదించాను. దానికి వారు ఇలా అన్నారు 'ఇవన్నీ అనుష్ఠానములో విఘ్నాలు. ఎపుడయితే సాధకుడు సిద్ధి పొందే సమయం వస్తుందో అపుడు దేవతలు మాత, పత్ని, పుత్రుడు మొదలైన వారిలాగ వేషధారణ చేసుకుని విఘ్నము కలిగించ ప్రయత్నిస్తారు. వీటితో చాలా జాగ్రత్తగా వుండాలి. మీ వారంతా మీ ఇంట్లో సుఖంగా వున్నారు. నీవు వారి విషయంలో చింత పెట్టుకోకు' అన్నారు. వారు ఎంత నచ్చజెప్పినా ఎందుకో నా మనసుకు సమాధానము కలుగలేదు.

ఆ రోజులలో పక్కాఘాట్ దగ్గర శివమందిరము పైభాగాన శ్రీ నిర్మలానందజీ మహారాజ్ వుంటుండేవారు. ప్రక్కనే శ్రీ వివేకానందజీ కూడా వుండేవారు. నేను అపుడపుడు స్వామి నిర్మాలానందజీ దగ్గరికి వెళ్తూ వుండేవాడిని. వారు భావవికాసాన్ని గురించి తెలియజబుతూ వుండేవారు. వారు ఇలా చెప్పారు, 'ఎలాగయితే నీవు ఈ 5, 6 అడుగుల, శరీరాన్ని శాంతనుద్వివేది (స్వామి అఖండానందుల వారి పూర్వాశ్రమ నామము) సరయూ పారీణ బ్రాహ్మణుడను అని అనుకుంటున్నావో అలాగే ఈ భారతవర్షము మొత్తము నీ స్వరూపము అని భావిస్తే భావపరివర్తనము కలుగుతుంది. హిమాలయములు నీ శిరసు. కన్యాకుమారి కాళ్ళు, కరాచీ, దార్జిలింగ్ నీ రెండు చేతులు వ్రజము (బృందావనము) నీ హృదయము. అక్కడే భగవంతుడు శ్రీకృష్ణుడి లీల జరుగుతూ వుంటుంది'. పరిచ్ఛిన్న దేహంలో నాటుకున్న ఈ 'నేను' అన్న భావమును కొట్టివేయడానికే వారు అలాటి మాటలు చెప్పేవారు. స్వామి వివేకానందజీతో గంభీరమైన వేదాంత విషయములు చర్చ జరుగుతుండేవి. మా స్వామిజీ కూడా వచ్చి అపుడపుడు చర్చలలో పాల్గొనేవారు. స్వామీ నిర్మలానందజీ మా స్వామీజీని గురుతుల్యులుగా భావించేవారు.

నా మనసు కర్ణవాసము నుండి విసిగిపోయింది. ఇంటికి వెళదామన్న సంకల్పము కలిగింది. మార్గ మధ్యములో వున్న రామ్‌ఘాట్ వెళ్ళి అక్కడ శ్రీ ఉడియా

బాబాజీ దర్శనం చేసుకోవాలి అని అనిపించింది. స్వామీజీ నా మనస్థితిని అర్థం చేసుకున్నారు. వారి అభిప్రాయంతో ఎవరైనా సాకార దర్శనము కోసము అనుష్ఠానము చేసేటపుడు వేదాంతులతో సాంగత్యము కలిసి తిరిగడం, వార్తాలాపం ఇలాంటివన్నీ పెట్టుకోకూడదు. ఎందుకంటే ఒకవేళ వారు గనుక ఇష్టదైవము యొక్క ఆరాధన విషయంలో మిధ్యత్వమనే సంస్కారము గనుక కలిగించారంటే (వేశారంటే) జప-తపములన్నీ శిథిలములవుతాయి. స్వామీజీ నాకు ఏదో ఒక వస్తువును ఇచ్చి ఆ మర్నాడే కాశీలో వున్న మాతాజీకి ఇవ్వమన్నారు. ఈ 'మాతాజీ'ని గురించి నేను 'చంద్రమాపండిత్' సంస్మరణలో చర్చించాను. సరే ఇక రామఘాట్ వెళ్ళి శ్రీ ఉడియా బాబాజీని దర్శించే కార్యక్రమము ఆగిపోయింది. అక్కడి నుండి నేరుగా కాశీ వెళ్ళవలసి వచ్చింది. వేదాంత-చర్చల నుండి తప్పించడానికే నిశ్చయంగా ఇలా చేశారు. ఇది వారి అనుగ్రహమే.

మా వూరు వచ్చి చూస్తే ఇంట్లో వారంతా సుఖంగా, క్షేమంగా వున్నారు. నేను ఎక్కడికి వెళ్ళినది వారికి చెప్పివుండలేదు. కాబట్టి ఇంట్లోని వారంత నేను మా పరంపరాగత శిష్యులైన మహాకవి జయ ప్రకాశసింహ్, శీతల్ సింహ్, పరమేశ్వర్ సింహ్ మొదలైన వారి వద్దకు, ఇమామ్‌గంజ్ జిల్లా వెళ్ళాను కాబోలు అని ఊహించుకున్నారు. అక్కడి నుండి తిరిగి వచ్చేటపుడు చాలా సామానులు దక్షణ తీసుకువస్తాను అని అనుకున్నారు. ఎపుడైతే నేను ఖాళీ చేతులతో తిరిగి వచ్చానో, మరి సాధన చెయ్యడానికి స్వామీజీ దగ్గరికి కర్ణవాస్ గంగ ఒడ్డున వెళ్ళాను అని తెలిసిపోయిందో అపుడు అందరూ చాలా దుఃఖించారు. ఏడవడం మొదలుపెట్టారు. నేను వెళ్ళిపోయానన్న దుఃఖము కాదు, నేను ఖాళీ చేతులతో తిరిగి వచ్చానన్న దుఃఖము! ఈ ఘటన నా మనసులో లోతుగా నాటుకుపోయింది. మనసులో వైరాగ్యము కలిగింది. సాంసారికమైన సంబంధాలన్నీ స్వార్థపూర్తితమయినవి. ప్రేమించదగినవాడు కేవలం భగవంతుడు ఒక్కడే.

నిష్కామ అనుష్ఠానము యొక్క ఫలము వైరాగ్యము, భగవత్ప్రేమయే. కానీ ఆ సమయంలో భగవంతుడి ఈ కృప అనుభవమవలేదు (అర్థమవలేదు) రోజు రోజుకూ ఉదాసీనత ఎక్కువైంది. కానీ అనుష్ఠానం మాత్రం వదలకుండా చేస్తూనే

వున్నాను. ఇంట్లో పని-పాట, ఆలన-పాలన నేను చూసుకునేవాడినికాను. అధ్యయనము కోసము కాశీ వెళ్ళి కొన్ని రోజులుండి వస్తూ వుండేవాడిని. మా వూరి నుండి కాశీకి కేవలం 6 అణాలు చార్జీ వుండేది. అధ్యయనం చేస్తున్నా నా అనుష్ఠానము మాత్రం నిర్విఘ్నంగా సాగుతుండేది. ఇంటికి వచ్చినపుడు అపుడపుడు స్వామీజీ దగ్గరికి వస్తుండేవాడిని.

కాశీలో నేను ఎవరి దగ్గర అధ్యయనము చేశానో వారిలో చాలా వరకు అందరూ అనుష్ఠానం పట్ల శ్రద్ధ కలవారే. పండిత్ రామభవనోపాధ్యాయుడు బలియా జిల్లా, సుఖ్‌పురా గ్రామ నివాసి. వారు మాతా అన్నపూర్ణ యొక్క అనన్య ఉపాసకులు. వారణాసి సంస్కృత విద్యాలయం (ఇపుడు దానిపేరు సంపూర్ణానంద విశ్వవిద్యాలయము)లో వరిష్ఠ ప్రాధ్యాపకుడుగా వుండేవారు. బడీపియరీ, గోవిందపురా ఈ రెండు చోట్ల నేను వారి దగ్గరనే వుండేవాడిని. రాత్రి రెండు గంటల నుండి ఉదయం ఎనిమిది గంటల వరకు విధి పూర్వకముగా జపము, పూజ, పారాయణ అన్నీ ముగించుకుని అపుడు మాకు చదువు చెప్పేందుకు తయారయ్యేవారు. వారి విద్యా వైభవము చూసి అనుష్ఠానము యొక్క ప్రయోజనంపై ఇంకా అధికంగా నాకు శ్రద్ధ కలిగింది. పండిత్ శ్రీ రామపరీక్షణ్‌శాస్త్రి బస్తీ జిల్లా వాస్తవ్యులు. కాశీలో ఈశ్వర గంగీలో వుండేవారు. వారు దాదాపుగా యాభై సంవత్సరాలు అయినా గడపదాటి బయటికి రాలేదు. వారి విద్య కూడా అనుష్ఠాన జన్యమయినదే. వారు అరుగుపైన కూర్చుని ఏశాస్త్రమయినా సరే సులభంగా బోధ పరుస్తు వుండేవారు. గొప్ప గొప్ప పండితులు, దేశ-విదేశాల నుండి విద్వానులు సమాధానాల కోసము వస్తువుండేవారు. నేను వారి దగ్గర కెళ్ళి బావిలో నుండి నీళ్ళుతోడివ్వడం, శౌచాలయం శుభ్రపరచడము ఇలాంటి సేవలు చేస్తూ చదువుకుంటు వుండేవాడిని. వారు వూరికే శాస్త్రాలను చదివించడమేగాక, శాస్త్రముల అభిప్రాయములను చక్కగా హృదయానికి హత్తుకునేలా తెలియజెప్పడంలో బహునిపుణులు. వారు నాతో వ్రాత పని చేయించేవారు. వారు చెబుతూవుంటే నేను వ్రాస్తూ వుండేవాడిని. దాదాపుగా అన్నీ - న్యాయ, సాంఖ్య, వేదాంత దర్శనము అన్ని విషయాలపైన వారు వేరు వేరుగా సూత్రగ్రంధాలు వ్రాయించారు. ఆకాశము, వాయువు, తేజము, జలము, పృథ్వీ

వీటి విషయంలో పరమాణు-దర్శనము, ప్రకృతి-దర్శనము, ఆత్మ-దర్శనము ఇలా 42 విషయాలు వ్రాయించారు. ఒక కావ్యము కూడా వ్రాయించారు. నాకు అనుష్ఠానము పట్ల శ్రద్ధ ఇంకా ఎక్కువ అయింది. అనుష్ఠానము చేస్తూ వుండేవాడిని.

నేను మా అమ్మమ్మగారి గురువైన శ్రీమనీషానంద సరస్వతీజీ వారితో యోగ భాష్యము, యాజ్ఞవల్క్య స్మృతి మితాక్షరి (వ్యవహారాధ్యాయము మాత్రము) చదివాను. వారు దాదాపు నగ్నంగా వుండేవారు. టేడీ నీమ్ దగ్గర శివహర్‌రాజా వారి పూన్యమహల్‌లో వుండేవారు. వారిని చూసి త్యాగవైరాగ్యముల శిక్షణ లభించింది. శ్రీ శంకర చైతన్య భారతీజీ మహరాజ్ గారి శ్రీ విద్య కూడా చాలా ప్రసిద్ధమైనది.

నన్ను మా గురువుగారైన పండిత్ శ్రీరామభవనోపాధ్యాయులు స్వామీ విశుద్ధానంద సరస్వతి వారి దగ్గరకు వెళ్ళవద్దన్నారు. వారనే దేమిటంటే సిద్ధుల వ్యూహంలో పడితే చదువు నష్టమవుతుందని. వారు ఇలాగే ఇంకా చాలా మంది విద్వానుల దగ్గరికి ఈ కారణంతోనే నన్ను వెళ్ళవద్దు అనేవారు. వారు అనుష్ఠానము చెయ్యడానికి బాగా ప్రోత్సహించేవారు.

నేను ఒక రోజు ఇంటి వద్దనే రాత్రి సమయంలో అనుష్ఠానంలో సంలగ్నుడనయ్యాను. స్వస్తికాసనములో కూర్చున్నాను. వెన్నెముక నిటారుగా వుంచి కుంభక ప్రధానమయిన ప్రాణాయామము కొంచెం చేసి, జపం చేశేటపుడు సువిధానుసారంగా నిమీలిత, అర్ధనిమీలిత, లేక కళ్ళు మూసుకుని చేసేవాడిని. మధ్య మధ్యలో శ్రీకృష్ణుడి స్మరణ కలిగేది. కానీ ధ్యానము కుదరలేదు. అకస్మాత్తుగా శరీరములో ఒక విశిష్ఠ స్పందన కలిగింది కళ్ళు, కటిప్రదేశం, నాభి, హృదయము, చేతులు, మెడ వీటి నుండి ఎవరో ప్రాణాలను పైకి లాగుతున్నట్లు అనిపించింది. శరీరము అంతా శూన్యమయింది. కేవలం శిరోభాగంలో ఒక జ్యోతిశ్చక్రం ఏర్పడింది. ప్రకాశమే-ప్రకాశము. మొదట మృత్యువేమో అన్న భయం కలిగింది. తర్వాత శరీర విస్మృతి కలిగింది. తర్వాత నేను ఒక దివ్య ప్రకాశములో కలిసిపోయాను. కొద్ది సేపటికి మరల శరీరమంతా జీవత్వముతో ప్రాణశక్తి సంచారము కలిగింది. ఈ విధముగా అనుభవము మాటిమాటికి కలగడంతో భయం పోయింది. ఇది సాధనలోని ఒక

స్థితి అని అనుభవము కలిగింది. ఈ స్థితి నుండి లేచిన తర్వాత అరే! ప్రకాశమే వుందికాని, ప్రియతముడైన ఇష్ట దైవము యొక్క దర్శనము కలుగలేదు కదా ఇది ఎంతటి దుఃఖకరము! అని అనిపించేది. ఒక్కోసారి దుఃఖము చాలా ఎక్కువయ్యేది. ఒక్కోసారి ఆర్తిగా ప్రార్థించేవాడిని హే ప్రభో! ఇక నీ దర్శనం లేకుండా నేను జీవించలేను. ఒక్కోసారి ఈ భావము కలిగిన శ్లోకము లేక కీర్తనలో పాడుకునేవాడిని. ఒక్కోసారి నా దీనత, హీనత, అసమర్థత చూసుకుని నాపైన నాకే గ్లాని కలిగేది. శ్రీచైతన్య మహాప్రభువు యొక్క శ్లోకము గుర్తువచ్చేది దేనిలోనయితే వారు సర్వత్యాగము చెయ్యనిదే పూర్ణరూపేణ సాధన భజన సంభవం కాదు అని చెప్పారో ఆ శ్లోకం భగవత్ప్రాప్తికై కలిగే లాలసలో అహంకార మమకారాలు విఘ్నములు. ఆఖరికి త్యాగము చేయవలెనని నిశ్చయించుకున్నాను.

ఏ రోజున నాలుగవ అనుష్ఠానము పూర్తి అయిందో ఆ రోజు గంగాజీ దగ్గర దంభారీ ఘాట్‌కి వెళ్లాను. బట్టలు, మాల అన్నీ ఒడ్డున పెట్టి స్నానం చేస్తున్నాను. ఇంతలో కాకి వచ్చి మాల ఎత్తుకుపోయి గంగానది మధ్యలో పడవేసింది. అనుష్ఠానము యొక్క పూర్ణాహుతికి కూడా త్యాగవైరాగ్యము లేకుండా పనిజరుగదు కాబోలునని అనిపించింది మనసుకు. తీవ్ర వైరాగ్యము లేక ఎవరికి ఇప్పటి వరకు భగవత్ప్రాప్తి లభించలేదు.

మరుసటి రోజు ప్రాతఃకాలము 4గం.లకు నిద్రలేచాను. నిత్య కర్మలు ముగించుకుని ఇంటి నుండి బయట పడ్డాను. ధోవతి, కుర్తా వేసుకుని వున్నాను, కానీ కాళ్ళకు చెప్పులులేవు. తలపైన ఏమీ పెట్టుకోలేదు. చేతులో ఒక లోటా (చిన్న చెంబులాటిది) జేబులో 5 అణాలు డబ్బు, నడుస్తూ నడుస్తూ మధ్యాహ్నమయిపోయింది. దాదాపు 20 మైళ్ళు నడిచి శివపురం చేరుకున్నాను. కాశీ దాటి వచ్చాను. బాగా ఆకలిగా, దప్పికగా వుంది. మార్గమధ్యంలో రైతులు తమ చేలు తడుపుకోవడానికి నీళ్ళు తోడుకుంటున్నారు. వెళ్ళి ఒక చెట్టు క్రింద విశ్రాంతి తీసుకున్నాను. చేతులు కాళ్ళు కడుక్కుని, నీళ్ళు తాగి ఇక బయలుదేరదామనుకుంటూ వుండగా మావూరి సజ్జనుడు ఒకరు కనిపించారు. చదువు సంధ్యవున్న మనిషి. వర్మా-శైలములో ఏదో అధికారి. వారు అక్కడికి వచ్చి నన్ను చూశారు 'ఇదేమిటి?

నీవు ఇక్కడ ఎలాగున్నావు, కాళ్ళకు చెప్పులు లేవు, భుజంపైన ఉత్తరీయం లేదు. ఎక్కడికి వెళ్తున్నావు?' అని అడిగారు. వారు ఇక తన ప్రయాణము ఆపుచేసుకుని నన్ను గుఱ్ఱపు బండిలో కూచోబెట్టుకుని బనారస్ తీసుకుని వెళ్ళారు. స్నానం భోజనం అన్ని సదుపాయాలు చేశారు. చెప్పులు, బట్టలు కొని నాకు తెచ్చి ఇచ్చారు. రాత్రి 'బాన్‌ఫాటక్' దగ్గర ఆడుతూవున్న ఒక సినిమాకు తీసుకువెళ్ళారు. 'శిరీ-ఫర్‌హద్' అనే సినిమా నడుస్తూవుంది. శిరిని పొందడానికి ఫరహద్ తన స్వహస్తాలతో కొండలను పగులగొడ్తాడు. వాటి నుండి పాలు నదుల్లా ప్రవహిస్తాయి. ఈ సినిమా చూసి నాలో రెండు రకములైన భావనలు కలిగాయి. ఒకటి మన లక్ష్య ప్రాప్తి కోసము ఎంతటి పౌరుషము, ప్రయత్నము చేయాలి, అని. రెండవది ఎంతనేను చెయ్యగలుగుతానో అంతే, అంతకంటే అధికంగా చేయలేను.

సినిమా నుండి తిరిగి వచ్చాకా ఆ గృహస్థు తన భార్యను 'నడిచి నడిచి కాలినడకన చాలా అలిసిపోయివుంటారు. కొంచెం కాళ్ళు పట్టమని' చెప్పారు. నాకు బాగా ఏడుపు వచ్చింది. నేనేమో బయల్దేరాను భగవద్దర్శనానికి - హిమాలయములలో వెళ్ళి తపస్సు చేస్తాను - అని. ఇదంతా ఏమిటి జరుగుతూ వుంది? నా వలన ఏమీ కాదా? ఏమిటి?

మరుసటి రోజు వారు నన్ను మా ఇంటికి పంపించారు. నేను నాగదిని నలువైపులా మూసివేసుకుని ఆలోచనలో పడ్డాను - ఇపుడు నేను ఏమి చేయను? జపము, ఉపవాసము, అనుష్ఠానము అన్నీ యథాశక్తి చేస్తూనే వున్నాను. త్యాగ వైరాగ్యము కోసము ప్రయత్నిస్తే ఈ గతి పట్టింది! సాధన ఇంకా ఇంతకంటే ఎక్కువ జరగలేదు. ఈ శరీరము భగవత్ప్రాప్తికి యోగ్యము కాదేమో అని అనిపించసాగింది. అపుడు ఇక దీనిని వదిలిపెట్టడమే సరియా? శరీరాన్ని వదలడం, వదలకపోవడం రెండూ గాఢమైన మమత్వమునే సూచిస్తాయి. ఉపాయం-ఉపాయంలో బలము ఎక్కడి నుండి వస్తుంది? నేను నా స్వశక్తితో భగవంతుడిని పొందగలనా? ఒక్కసారిగా ఈ 'నేను' అన్న దీని సాధన, ఉపాయము, యుక్తి శక్తులన్నీ ముక్కచెక్కలయ్యాయి. నా యొక్క 'నేను', 'అహం'ను నేను మరచిపోయాను. ఎలాగంటే ఎవరైనా తమ 'అహం'ను మనిషి అట్టే పెట్టుకుని, ఆత్మ బ్రహ్మ వీటి ఏకత - బ్రహ్మాత్మైక్య బోధ

కలిగింది, సాక్షాత్కారము కలిగింది అని అంటున్నాడంటే అది వట్టి మిధ్యాభిమానమే అవుతుంది. ఇదే విధంగా 'అంశ' తన శక్తిని వేరుగా ప్రయోగించి 'అంశీ' సాక్షాత్కారము కలిగిందని దంభాయి పలికితే అది కేవలము కల్పనామాత్రము అని పించుకుంటుంది. నా యుక్తి, వుక్తి, ప్రయుక్తి చాలుచాలు ఇక నాతో ఏమీకాదు. నిస్సాధనత, నిరభిమానత, ఈ స్థితి కలుగగానే ఆ ఘోరాంధకార గృహములో ఒక గొప్ప ప్రకాశము ఆవిర్భ వించింది. అందులో భూమి, ఇల్లు, వాకిలి, మంచం, శరీరము అన్నీ లోపించి పోయాయి. ఏ వస్తువు లేకుండా, ఏ సాధన లేకుండా, ఏ మనోవృత్తి లేకుండా,, ఏ కారణము లేకుండానే ఈ మహాప్రకాశము! ఈ అనుభవము ఏమిటి. ఇంకా మరీ ఆశ్చర్యం కలిగింది-నేను ఆనందంతో మత్తుడినయ్యాను. నేను చేతులు జోడించ లేకపోయాను. తల వంచి నమస్కరించ లేకపోయాను. దండవత్ చేయలేకపోయాను. హా! ఒక ప్రేరణ అయితే కలిగింది. అద్వైత సిద్ధాంతం కొరకు జిజ్ఞాస, మననము కొరకు ఉన్ముఖత కలిగింది. అక్కడ ఇంకేమీ లేదు. మరల అదే అంధకారము!

ఆనందంతో పొంగిపోతు బయటికి వచ్చాను. మొదట మా తల్లిగారు కనిపించారు. నేను 'చాలు ఇక నా పని నెరవేరింది' అన్నాను. ఆమె నా పాదాలకు నమస్కరించారు. పండిత అక్షయవట తివారీ గారు కలిశారు. వారు నా ఆనందస్థితిని చూడగానే స్వయంగా నా చరణాలను స్పృశించారు. ఎపుడైతే 'నేను' 'నాది' అన్న బలం విరిగిపోయిందో, యుక్తులు నిష్ఫలమయ్యాయో అపుడే ఆ స్థితిలో నుండి 'వుపేయము' యొక్క ఆవిర్భావము కలిగింది.

స్వామీ యోగానందజీ వారి దగ్గరికి వస్తూ పోతూ వుండేవాడిని. ఒకసారి జ్యేష్ఠమాసపు ఎండలో మధ్యాహ్నం పూట కాళ్ళకు చెప్పులు లేకుండా వారి దగ్గరకి వెళ్ళాను. వారు నవ్వుతూ 'బయట చాలా వేడిగా వుంది. లోపలికిరా అక్కడ శీతలతయే శీలత. చల్లగా వుంది'. అని నవ్వుతూ లోపలికి పిలిచారు. ఒక్కోసారి చాలా గంభీర శాస్త్రచర్చ చేస్తుండేవారు. శివరాత్రి అది పర్వదినాలయితే పూజ, పారాయణ వీటిని చేయించేవారు. ఒక్కోసారి శ్రీమద్భాగవతకథను మాధుర్య పరిపూర్ణతతో నింపి వినిపించేవారు. అపుడు ఈ జగత్తు యొక్క విస్మృతి కలిగేది. వారి శక్తి వంతమైన ఆ

కంఠం, ఆ వాక్కు ఇప్పటికీ నా చెవులలో మారుమ్రోగుతూ నా హృదయమును ప్రకాశవంతము చేస్తూవుంటుంది.

మా వూరి దగ్గర 5 మైళ్ళ దూరంలో ఒక 'సేహపూర్' అనే వూరు వున్నది. అక్కడ స్వామీజీ వుండేవారు. స్వాధ్యాయము, జపము, పూజ, ధ్యానము, చింతన వీటితో సమయం గడుపుతూ వుండేవారు. కాదిరాబాద్ యొక్క 'ఠాకుర్‌సాబ్' ప్రసిద్ధ నారాయణ సింహ నాతో వచ్చారు. వారితో వేదాంత సంబంధమైన సమస్యకు సమాధానం పొంది ఆ ఠాకుర్‌గారు ఇలా అన్నారు 'తసాతస్ రోస్ ప్రజ్ఞానఘనుడు' సహేపుర్‌లో స్వామీజీ వారికి చాలా మంది భక్తులు వున్నారు. కానీ వారిలో ముఖ్యులు పరమ శ్రద్ధాళువు రిజిస్ట్రార్ శ్రీ ఉదిత్‌నారాయణ్ సింహ్, వారి పరివారము, వారి జాతి వారు. వీరే స్వామీజీని ఈ వూరికి తీసుకువచ్చారు. అందరూ సేవలు చేస్తూ వుండిరి. శ్రీ ఉదిత్‌నారాయణ్ సింహగారి మిత్రుడు శ్రీ లీలాబిహారీ సింహ్ (భదాహుకి ఠాకుర్) నన్ను మొదట స్వామీజీ దగ్గరికి తీసుకువచ్చారు. స్వామీజీ నాకు వారివి అనేక గ్రంథాలు ఇచ్చారు. అందులో శ్రీ పార్థసారధి మిశ్ర వారి 'శాస్త్రదీపిక' మరి పంచదశియొక్క 'శ్రీ పూర్ణానందేందు టీకా' ముఖ్యమైనవి. శాస్త్రాలను వ్యావహారిక భాషలో సరళంగా అర్థమయ్యేలా తెలియజెబుతూ వుండేవారు.

ఒక సారి నేనూ, వారి వెంట వారణాసిలో వున్న 'కాశీదేవి మఠము'నకు వెళ్ళి వుంటిని. అక్కడ వారి గురుభాయి అయిన శ్రీజ్యోతిర్మయానందజీని కలుసుకున్నాము. వీరి ఇద్దరికి గురువుగారు శ్రీ నిత్యానందజీ మహరాజ్ గారు. శ్రీజ్యోతిర్మయానందుల వారు యోగ-సాధన చక్కగా అభ్యసించినవారు. వారు నాతో ఇలా అన్నారు 'ఒకవేళ నీకు ప్రపంచంలో ఇంకా ఏదో చెయ్యాలనీ, అనుభవించాలనీ, వుంటే అవన్నీ పూర్తి చేసుకుని, అటువైపునుండి నిశ్చింతుడవై అపుడు నాదగ్గరికి మాత్రం వచ్చేయ్! చిటికెవేసేంతలో నీకు తత్త్వజ్ఞానం కలిగిస్తాను.' అక్కడికి కనఖల్‌లోని మహామండ లేశ్వరుడు స్వామి శ్రీభాగవతానంజీ వచ్చారు. వ్యాకరణాచార్యుడు స్వామి రామానందజీవారు కూడా వచ్చారు. నేను ఎక్కువగా శ్రీదయాలుపురీజీ మహరాజ్ వారి దగ్గర కూర్చునేవాడిని. అక్కడ వేదాంత పరమైన గంభీర చర్చలు జరిగేవి,

వేదాంత దర్శనము సూత్రాలపై గంటల తరబడి ఉహాపోహలు జరుగుతు వుండేవి. స్వామి యోగానందజీ మహరాజ్ వారే అక్కడికి ఉత్తరం వ్రాసి నన్ను కన్‌ఖల్ పంపించారు. అక్కడ నేను వేదాంతం అధ్యయనం - అధ్యాపనం చేసేవాడిని. కన్‌ఖల్‌లోని శ్రీభాగవతానంద్ వారు చెప్పగా నేను భిక్షుశంకరానంద్‌గారి దగ్గరికి వెళ్ళి వేదాంత సత్సంగం చేశానో ఆ సంగతి భిక్షుశంకరానందగారి సంస్మరణలో చూడండి.

స్వామీ యోగానందజీ గురువుగారు శ్రీ స్వామీ నిత్యానందజీ, వారి గురువుగారు పరమహంస శ్రీరామకృష్ణ. అలా చూస్తే శ్రీ రామకృష్ణ మిషన్‌లో గురుశిష్య పరంపర పూర్ణతః స్వీకృతము కాదు, కానీ సాధన గురు-శిష్య పరంపర లేకుండా సాధ్యము కాదు. తూర్పు బంగాల్‌లో ఒరీసాల్ నగరంలో శ్రీయోగానందజీ వారు ఉత్తర ప్రదేశము వచ్చారు. తర్వాత వృద్ధ మాతాజీ కూడా వచ్చేశారు, వారిని గురించి నేను 'చంద్రమా పండిత్' వారి సంస్మరణలో వ్రాశాను.

శ్రీ స్వామీ యోగానందజీ వారి శిక్షా-దీక్షా, ప్రేరణా, ప్రోత్సాహము వలన నాలోని ప్రతిభ ప్రస్ఫుటితమైనది. ఈ రోజు నేను అతిశయమైన కృతజ్ఞతతో వారిని స్మరిస్తున్నాను.

స్వామి శ్రీ శరణానందజీ మహరాజ్

శ్రీ ఉడియా బాబాజీ ఆశ్రమములో పెద్ద ద్వారము వద్ద పైభాగాన డాబాలో సత్సంగము జరుగుతూవుండేది. బాబా చౌకి (చెక్క మంచం దివానులాటిది)పైన కూర్చునేవారు, మిగిలినవారంతా బాబాతో ప్రశ్నోత్తరాలు జరుపుతున్నారు. ఈ విషయంలో ఇద్దరు ఒకే రకముగా ప్రతిపాదన చేస్తున్నారు - భక్తి భావనలో వేదాంత విచారణ, వేందాత విచారణలో భక్తి భావము ఈ రెంటిని కలపరాదు. బాబానేమో 'విచారణ', 'భావము' అన్న శబ్దములు ప్రయోగించేవారు. ఆ నేత్రహీన మహాత్ముడేమో 'వివేకము' విశ్వాసము అన్న శబ్దములను ఉపయోగపించేవారు. నేను ఇంకా అప్పటికి సన్యాసినవలేదు. ఇరువురి మధ్య నేనేమీ మాట్లాడేవాడిని కాను. నా మనసులో నేను మధుసూదన సరస్వతి వారి 'శ్రీభక్తి రసాయనము'ను ఆ ప్రసంగముతో తులనాత్మకంగా పరిశీలిస్తున్నాను. అందులో ధృతచిత్తులు (కోమల హృదయులకు) భక్తి రసము మరియు అదృత చిత్తులకు వేదాంత విచారణకు అధికారులని చెప్పబడివున్నది. ఇదే వైదిక ధర్మము యొక్క వేశేషత! అందరికి ఒకే ఇష్టదైవము, ఒకే మంత్రము, ఒకే సాధనా పద్ధతి, ఒకే గురువు వుండకూడదు. వారి వారి యోగ్యతా నుసారముగా పాత్రతను బట్టి, స్వభావము, అభిరుచి, ప్రవృత్తి, హృదయములో వున్న పూర్వ సిద్ధ ఉపాసన, వాసనలు, వీటి అనుసారం భేదం వుండవలసిందే. ఇది ఒక విలక్షణమైన విషయము, దీనిని విచక్షుణులే తెలుసుకోగలుగుతారు. అందరినీ ఒకే పద్ధతిలో కట్టిపడేయా లనుకోవడము సర్వదా ప్రకృతి విర్ధుము. వారిరువురు మహాత్ముల విచారణలో శాస్త్రోక్తమైన భావాభివ్యక్తమునకు ఒక క్రొత్త భాష, భావము మరియు విచారము (చింతన), విశ్వాసము అన్న పేరు పెట్టారు, ఇదీ నన్ను చాలా ప్రభావితుడిని చేసింది. స్వతంత్ర చింతనకు ఒక దిశ నిర్దేశము తెలిసినది. ఆ కళ్ళులేని

సంత్ మహాత్ముడి పేరు శ్రీ స్వామి శరణానందజీ. తరువాత వారితో నాకు చాలా సంవత్సరముల వరకు సంపర్కము వుండినది.

ఇంకొకమారు ప్రశ్న ఏమిటంటే ఎవరైనా ఈశ్వరుడిని భగవంతుడిని విశ్వసించకపోయినా ఒప్పుకోకపోయినా కూడా సదాచారులు మరియు, జాగృతి కలిగిన చింతన శీలపురుషుడు యధార్థరూపముగా పరమార్థ సాక్షాత్కారము పొందగలడా? అని. ఆ సమయంలో ఈ చర్చ నాకు చాలా వితండమనిపించింది. లోక వ్యవహారములో అనుపయుక్తము మరియు సాధారణ జనులలో నాస్తికత పట్ల మహత్వబుద్ధి పెట్టడమే అవుతుంది కదా! కానీ వేదాంతము యొక్క ఆభాస, ప్రతిబింబ అథవా ఔపాధిక ఈశ్వరుడి అనిర్వచనీయతను నిరూపణ చేసేందుకు ఒక నవీన, ప్రశస్త మార్గము కూడా అస్పష్టంగా గోచరించింది. దృష్టి-సృష్టి వాదము, జీవ వాదము యొక్క మహత్వపూర్వమైన చింతనకు ఇది ఒక నవీన మార్గము దొరికినట్లు అయినది. ఈ విషయములో బాబా, మరియు శ్రీశరణానంద్‌జీ వారి సిద్ధాంతము ఒకటే లాగుననే వుండినది. బాబా ఔపనిషదరీతి ప్రకారము, స్వామీజీ తన స్వతంత్ర చింతన రీతితో ఒకే నిష్కర్షకు వచ్చారు. ఆస్థికత, నాస్థికత ఈ రెండూ కూడా భావము మరియు విశ్వాసము అనే అనవచ్చు. విచారణ, వివేకముతో ఆలోచిస్తే ఈ రెండునూ నిలబడలేవు. మన ఆత్మ, మన స్వస్వరూపమే ఒక అఖండ అబాధిత సత్యము, అందులో విచారణ, వివేకము యొక్క భావము, విశ్వాసముల సమాప్తమవుతాయి. అది ప్రమాణము, శ్రద్ధ యొక్క విషయము కాదు. ప్రమాత, ప్రమాణము, ప్రమేయము, శ్రద్ధాళు, శ్రద్ధ, శ్రద్ధేయుడు అన్నిటికి ఆధారభూతుడు స్వప్రకాశ అధిష్ఠానమయియున్నది. ఓహ్! ఆ సత్సంగము కూడా ఎంత ప్రభావ వంతముగా వుండేదో!

స్వామీ శ్రీశరణానందజీ మహరాజ్, సేఠ్ శ్రీజయదయాల్ వారి సత్సంగమునకు స్వర్గాశ్రమమునకు వచ్చారు. వారి భాష విలక్షణముగా వుండేది. అది గ్రహించడానికి మొదట-మొదట చాలా సార్లు వినవలసి వచ్చేది. స్వామి శ్రీరామసుఖదాస్‌జీ వారితో వారి విచార-విమర్శ జరుగుతు వుండేది. వారు ఎపుడయితే క్రొత్త-క్రొత్త పదాలు వాడేవారో, అపుడు చలా అద్భుతమనిపించేది, తర్వాత ఆలోచిస్తే ప్రాచీన శాస్త్రములలో

వాటి సంగతి-సమాధానం కుదిరిపోయేది. వారు 'అచాహ', మరియు 'అప్రయత్న' అన్న శబ్దాలు వాడేవారు. సీదాసాదా మాటల 'అచాహ' అంటే నిష్కామత. 'అప్రయత్న' అంటే నైష్కర్యము. నిష్కామత అంతఃకరణ శుద్ధి. అప్రయత్నము స్వరూపము యొక్క సహజస్థితి. మన యోగ్యతలను వ్యవహారంలో ఇతరుల సేవ కోసము వినియోగించకపోతే అది కేవలము మన సుఖము, సువిధ ఆనందము కోసమే అయినట్లవుతుంది. శ్రీరామ సుఖదాస్ గారు నాతో అన్నారు 'శ్రీస్వామీ శరణానంద్ యొక్క చింతన చాలా సూక్ష్మము గంభీరము అయినది' అని. ప్రతీ మాటని వారు తమ స్వీయచింతన ద్వారా తనదైన భాషలో వెల్లడించేవారు. విచారించి చూస్తే అది శాస్త్ర విరుద్ధము మాత్రము కాదు. ఆ! సేవ వలన భోగమే యోగమవుతుంది. 'అచాహ' వలన హృదయము శుద్ధమవుతుంది. 'అప్రయత్నము' వలన సహజస్థితి కలుగుతుంది. ఈ మాట అయితే పదహారణాల నిజము. ఇక్కడ సేవయే ధర్మము. ఈ విధముగా ధర్మము నిష్కామత, మరియు సహజ స్థితి వీటి సమన్వయము కుదురుతుంది.

స్వామీజీ ఏ విధమైన కులమత జాతి, సంప్రదాయాలు, వర్ణాశ్రమాలు మొదలైన వాటి పేర్లు ఎత్తేవారు కాదు. వారు మానవత కోసం మానవతను ప్రతిపాదించేవారు. మనిషిలో ఏవైతే అనుషంగికముగ వికారములు (దుర్గుణములు) వచ్చాయో వాటి నివారణ కోసము ప్రయత్నము చేయాలి, మరియు సహజంగా మానవతా వికాసము, ప్రకాశము కలగాలి. దీని కొరకు సంకీర్ణ విచారములను, భావనలను పరిత్యజించి, ఉదాత్తములైన విచారములను, భావనలను వికసింపజేయాలి. ఈ అభిప్రాయముతోనే వారి మార్గదర్శనములో సాధకులు 'మానవసేవాసంఘ్' అనే పేరుతో ఒక సంస్థను తయారు చేశారు. ఈ సంస్థకు స్వామీజీ వారి పూర్ణసహకారము వుండేది. కానీ బృందావనములోని సంస్థ యొక్క భవనములో కూడా వారు వుండేవారు కాదు. శ్రీ మా ఆనందమయిమా వారి ఆశ్రమములో వుండేవారు. వారి నిస్పృహత, త్యాగము విలక్షణమైనది.

వారి పూర్వాశ్రమము వూరు, పేరు, జాతి ఇవన్నీ నాకు తెలియదు. వారెపుడూ వీటిని గురించి చర్చించేవారు కాదు. వారు ఇరవైయవ శతాబ్దము ఆరంభంలో జన్మించారన్న సంగతి మాత్రము తెలుసు. పది సంవత్సరాల వయసు వచ్చీ రాకనే

వారు నేత్రహీనులయ్యారు. మొదట్లో తన నేత్రహీనత పట్ల తనపై తనకే చాలా గ్లాని-మ్లాని కలిగింది, కానీ మహాత్ముల సత్సంగముతో అది పోయింది. వారు మనసు భగవంతుడి భజనలో మగ్నమయింది. చదువు, సంధ్య లేకపోయినా పరమాత్మ చింతనవైపు వారి ప్రజ్ఞ అగ్రసరమయినది. ఎవరు ఎటు వంటి ప్రశ్న అడిగినా సరే వారు తక్షణమే జవాబు చెప్పి సమాధాన పరిచేవారు. అది నేను స్వయంగా నా కళ్ళతో చూశాను. నా చెవులతో విన్నాను. వారి బుద్ధి, తెలివి ఎంత ప్రశస్తమైనవి అంటే ప్రశ్న వినగానే వారికి ప్రశ్న కర్త యొక్క అజ్ఞానము, ఏ పొరపాటు వలన ఈ ప్రశ్న అడుగుతున్నారు అన్న సంగతి వారికి తెలిసిపోయేది. తక్షణమే వారు ఆ పొరబాటు పైననే దెబ్బ కొట్టేవారు ప్రశ్న దానంతటదే వీడిపోయేది. వారి బుద్ధి తర్క-కర్కశము కూడా. ఎవరి తర్కము వితర్కములు వారి ఎదుట నిలిచేవికావు. దానితోపాటు వారి హృదయము ఎంతో భావపూర్ణము, కోమలము. భగవత్చర్చ చేస్తూ చేస్తూ వారు భావమగ్నులయ్యేవారు, నేత్రాల నుండి అశృధారా ప్రవాహము అయ్యేది, కంఠము పులకించిపోతూ ఉండేది. వారి మాటాడే స్వరం మారిపోయేది.

ఒకసారి నేను వారి నోట ఒక కథ విన్నాను. ఏదో ఒక రాజకుటుంబములో ఒక రాజమాత వుండేవారు. వారి స్వజనులు, అందరూ మరణించారు. ఆమె దగ్గర ఒక ఇల్లు, ఒక ఎద్దు వుండేది. ఆ ఎద్దు పేరు 'సర్బ్బా'. ఆమె దాన్ని చూచుకుని దాని చాకిరితో చేనులో పండిన పంటతో జీవితం సాగించేది. కానీ వారి దూరపు సంబంధీకులు అది కూడా సహించలేకపోయారు. వారికి ఆ ఇల్లు ఎలా లాక్కుందామా అని వుండేది. ఒక రోజు వారు కొంతమంది కూలి మనుషులను తీసుకుని ఇంటిపై దండెత్తారు. ఆమెకు సహాయము చేసేవారు ఎవ్వరూలేరు. ఆ రాజమాత తన ఎద్దు 'సర్బ్బా' దగ్గరకెళ్ళి ఏడవడం మొదలు పెట్టింది 'పద! సర్బ్బా! ఇక మనకు వుండడానికి జాగా కూడా లేదు' అని. 'సర్బ్బా' కళ్ళు కోపంతో ఎర్రబారినవి. చాలా భయంకర రూపముతో కొమ్ములతో కుమ్ముతూ, అరుస్తూ ఆ గూండాలపైన విరుచుకుపడింది. వాళ్ళు ఆ ప్రదేశము వదిలి వెళ్ళేవరకు ఆ ఎద్దు ఇంటి చుట్టూ పరిక్రమ చేస్తూ పరుగులు పెడుతూనూ వుంది. కొందరిని కొమ్ములతో, కొందరిని కాళ్ళతో, కొందరిని తోసూస్తూ అలా కొట్టి కొట్టి అందరిని పరుగెత్తించింది, గాయపరిచింది. ఇంకేముంది! భయంతో ఎవరూ దాని దగ్గరికి రాలేకపోయారు. ఆ 'సర్బ్బా' ఎద్దుకాదు - అందులో

సర్వేశ్వరుడైన భగవంతుడి యొక్క ఆవేశము కలిగింది. భగవంతుడు ఒక అసహాయ, అనాథ యొక్క రక్షణ ఎలా చేస్తాడో, స్వామీజీ చెబుతూ చెబుతూ భావమగ్న మయిపోయేవారు, అశృప్రవాహం అయ్యేది. నిజంగా విశ్వాసములో ఎంత శక్తి వుంది! దీనిని సాధారణులు తెలుసుకోలేరు. విశ్వాసమే మానవజీవితానికి ఆధారస్థంభము.

క్రోధము, క్షోభ వీటి వ్యర్థతపై చర్చించేటపుడు వారు ఈ సంగతులు వినిపించారు. వారు ఒక సారి ఒంటిరగానే యాత్ర చేస్తున్నారు. చేతిలో కర్ర వున్నది. వెనుక నుండి ఒక ఎద్దులబండి వచ్చింది. తోసేసింది. వారు క్రింద పడిపోయారు. మనసులో బండివాడిపైన కోపము వచ్చింది - నేనంటూ చూడలేను కానీ వాడికయితే కళ్ళున్నాయి కదా! అని అనుకున్నాను. ఆ వూరివాడు ఒకడు చూసి బండివాడిని బాగా కోపడ్డాడు. తిట్టి బెదిరించాడు. కానీ ఇంకొంచెం ముందుకు వెళ్ళాక స్వామీజీ ఏదో ఒక చెట్టుకు కొట్టుకుని క్రింద పడిపోయారు. వారిలా అనేవారు - ఆ సమయంలో నా మనసుకెలాగనిపించిందంటే 'ఇపుడు కోప్పడు ఈ దుర్ఘటనకి విశేషంగా ఎవరు కర్తలు? అన్నిటికి ఎవరు కర్తలో వారే దీనికి కర్తలు! వస్తుతః ఎవరైతే తనను 'కర్త' అనుకుంటాడో వాడే ఇతరులను 'కర్త' అనుకుంటాడు. ఇదంతా ప్రభువు యొక్క లీల! ఏది ఏమైనా, ఎలా జరిగిన, ఏం చెప్పినా - అంతా ప్రభువు, భగవంతుడి నుండే వస్తుంది. క్రోధము, విరోధము వీటికి ఇక కారణమే లేదు!

స్వామీజీ వారే ఇంకోసారి ఇలా తెలిపారు - వారు తన భక్తులు కొందరితో కలసి ఉత్తరాఖండ్ యాత్ర చేస్తున్నారు. ఆ రోజులలో యాత్ర కాలినడకనే సాగేది. మార్గమధ్యములో స్వామీజీ ఆరోగ్యము దెబ్బతింది. రెండు మూడు రోజుల వరకు భక్తులు సేవ చేశారు. తర్వాత మెల్ల మెల్లగా ఒక్కొక్కరు తమ తమ యాత్ర పూర్తి చేసుకోవాలని వెళ్ళిపోయారు. ఆ కొండ ప్రాంతంలో ఎంత వరకని వారు తోడు వుండగలరు? స్వామీజీ ఒంటరిగా మిగిలిపోయారు. కొన్ని రోజుల తర్వాత వారికి ఆరోగ్యము కుదుటబడింది. తన దండ, కమండలములు తీసుకుని వారు ఒంటరిగానే యాత్ర సాగించారు. ఒక నేత్రహీనుడు అయిన వ్యక్తి ఒంటరిగా హిమాలయ యాత్ర చెయ్యడం ఎలా సంభవమయింది? వారు గుంటలలో పడలేదు. కొండలతో గుద్దుకోలేదు, కొట్టుకోలేదు, ఎంత ఆశ్చర్యకరమయిన సంగతి! వారి హృదయంలో

భగవంతుడి పట్ల ఎంతటి విశ్వాసము! నమ్మకము! భగవంతుడు తనను విశ్వసించిన భక్తుని ఎలా రక్షిస్తాడో ఎలాగ సహాయము చేస్తారో! ఇది ఒక ప్రత్యక్ష ఉదాహరణ.

ఈ విధముగా ఇంకొక సంఘటన వారి జీవన పరిచయములో కూడా వ్రాసివుంది. ఒకసారి మధుర నుండి ఆగ్రా వెళ్ళేటపుడు వారు ఒంటరిగానే కాలినడక యమునా తీరము వెంబడే వెళ్తున్నారు. ఒక చోట మట్టి గుట్ట విరిగి పడింది. వీరు వెళ్ళి నీళ్ళల్లో పడిపోయారు. నదిలో ప్రవాహము ఎక్కువ వేగంగా వుంది. చేతిలోని కర్ర పడిపోయింది. ఈతకొట్టడం వచ్చు కానీ చూడకుండా ఎటువెళ్ళాలో తెలియక ఎటువైపని ఈత కొట్టాలి? శరణ్యుడైన భగవంతుని స్మరించుకున్నారు. భగవంతునిపై భారము వేసి నీటిలో మునిగిపోతూ వున్న శరీరమును ఢీలా చేసి వదిలేశారు. తక్షణమే నీళ్ళలో నుండి ఎవరో తీసుకుని తనను ప్రక్కన పెట్టినట్లనిపించింది. లేవడానికి ప్రయత్నించి భూమికి చేయి ఆనించగానే ఒక కొత్త కర్ర చేతికి వచ్చింది. భగవంతుని శరణాగతవత్సలతను పొంది వారి హృదయం ప్రేమతో భక్తితో నిండిపోయింది. ఆ భగవంతుని మహిమతో అభిభూతుడై వారి ప్రేమలో పరవశమంది లేచి నడకసాగించారు.

ఇక ఇపుడు స్వామీజీ వారి ఉపదేశాల సారమును సంక్షేపముగా చూడండి. అవి మర్మసర్వములు. సాధన పథములోని పథికులకు హృదయంగమము చేసుకోదగినవి -

మనవాస్తవిక ఆవశ్యకతలు -

పరివర్తనశీలమైన వర్తమాన జీవనములో మొదటి ప్రశ్న ఏమిటంటే నిజముగా మన వాస్తవిక ఆవశ్యకతలు ఏమిటి? అని! ఆవశ్యకతలను తెలుసుకోకుండా, అర్థం చేసుకోకుండా వాటి పూర్తి కోసం సాధన పథమును నిస్సందేహముగా నిర్మాణము చేసుకోలేము. నిర్ణీత సాధనను అనుసరించలేకపోతాము. ఇపుడు సమస్య ఏమిటంటే? ఈ 'ఆవశ్యకతను' ఎలా నిర్ణయించగలము? ఈ నిర్ణయాన్ని వర్తమానములోనే చెయ్యాలి. దాని కొరకు మన వర్తమాన దిశను అర్థం చేసుకుని అధ్యయనం చెయ్యడం అత్యంత ఆవశ్యకము, మన అభిరుచి, యోగ్యత, ఆవశ్యకజ్ఞానము ఇవే వర్తమాన దశ యొక్క అధ్యయనము.

వ్యక్తిత్వములో ఆబద్ధుడైన ప్రాణి అప్రాప్త పరిస్థితుల కోసం ఎదురు చూస్తాడు, అవి తనవే అనుకుంటాడు. అయినా ప్రతి పరిస్థితి కూడా సతత పరివర్తనశీలమే, కానీ వ్యక్తిత్వముపైన వున్న మోహము మనలను పరిస్థితుల దాసత్వము నుండి ముక్తులమవనీయదు. ఈ దాసత వియోగము, హాని, అపమానము మొదలైన భయాలను కలిగిస్తుంది. మరి భయము ఎవరికీ ఇష్టమయినది ప్రియమైనదీ కాదు. ఇందు వలన మన వాస్తవిక ఆవశ్యకత అన్ని పరిస్థితులకు అతీతమైన జీవనము అన్నది స్పష్టమవుతుంది. దానిలో ప్రవేశము కొరకు యోగ్యత, సామర్థ్యము, అభిరుచికి తగినట్లు సాధన నిర్మాణము జరగాలి.

ఏ విధమైన ఇచ్ఛకూడా ఆవశ్యకతను నిర్మూలించలేదు. ఎందుకంటే ఆవశ్యకత దేనిదో అది స్వరూప ఐక్యతకు సంబంధించినది, ఇచ్ఛ కేవలం మనం అనుకునే ఒక మాన్యత. అందుకని ఆవశ్యకతా పూర్తి కోసము ఇచ్ఛా నిర్మూలనము అనివార్యము అవుతుంది. ఇచ్ఛా త్యాగము అంటే మన మాన్యతల సంబంధ త్యాగము. ఒక వేళ వివేకపూర్వకముగా దేహ భావమును త్యజించగలిగితే చాలా సులభముగా ఈ మాన్యతలు, అహం అన్నీ నశించిపోతాయి. అవి పోగానే అసంగతాపూర్వకముగా నిత్య-యోగము సహజముగ ప్రాప్తమవుతుంది. శరీరము, ఇంద్రియములు, ప్రాణము, మనసు, బుద్ధి మొదలైనవాటితో మన భిన్నత అనుభవములోకి వస్తుంది. వస్తు, వ్యక్తి, ఇచ్ఛలు నశించిపోతాయి. అవిపోగానే వాస్తవిక ఆవశ్యకత జాగృతమవుతుంది, దాని పూర్తికి అది సమర్థము అవుతుంది. వ్యక్తిత్వమనే మోహము కరిగిపోగానే మనము, సంసారము (జగత్తు) అన్న భేదము నశించిపోతుంది. ఇక మన దగ్గర మన మనసు బుద్ధి ఆది కూడా ఏమీ వుండదు. అవి అన్నీ అనంతుడితో అభిన్నములవుతాయి, అదే వాస్తవిక ఆవశ్యకత.

వివేకము, ప్రీతి వలననే వాస్తవిక ఆవశ్యకత సిద్ధిస్తుంది కానీ వేరు విధముగా కాదు. వివేకము, ప్రేమ ఇది శ్రమ కాదు, ఇవి సహజ స్వాభావిక విభూతులు. ఇవి ఆ అనంతుడి అహైతుక కృప వల్ల లభ్యమైనవి. మనం వారిచ్చిన విభూతులతోనే వారిని పొందగలుగుతాము. వాస్తవముగ వారు మనతో దేశ-కాలములకు దూరంలో లేరు, వారు మనలను వదిలిపెట్టలేదు. ఇంకా మనమే వారికి విముఖులమయ్యాము.

కానీ చూడండి వారి కృప! ఈ విముఖతను పోగొట్టడానికే మనకు ప్రీతి మరి వివేకమును ప్రదానముచేశారు. వివేకము వలన అస్వాభావికమైన ఇచ్ఛలు నివృత్తమవుతాయి. ప్రీతి వలన స్వాభావికమైన ఆవశ్యకతా పూర్తి స్వతః స్థితమవుతుంది. అందువలన జీవితములో అసఫలతకి స్థానమే వుండదు.

కర్తవ్య విజ్ఞానము : జీవన విజ్ఞానము -

ప్రాకృత విధానము అనుసారముగా పరహితములోనే మన హితము నిహితమయివున్నది. ఇది జీవితములో అనుభూత సత్యము. ఎపుడైతే మనము ఇతరులకు ఉపయోగపడతామో అపుడే మన పని కూడా జరుగుతుంది. ఈ దృష్టితో ప్రాప్త వస్తువు, యోగ్యత, సామర్థ్యము ద్వారా సర్వదా ఇతరుల మంచి కోసము కృషి చెయ్యడం ఆవశ్యకము. ఎవరైతే నిజజ్ఞాన ప్రకాశములో కర్తవ్య విజ్ఞాన రహస్యము విధివత్ అనుభవపూర్వకముగా తెలుసుకున్నారో వారే ఈ రహస్యాన్ని తెలుసుకోగలుగుతారు. కర్తవ్యపరాయణత వలననే సుందరమైన సమాజ నిర్మాణము జరుగుతుంది. కర్తవ్యము యొక్క ఉత్తర పక్షమే యోగము. యోగములో బోధ, ప్రేమ నిహితమై వున్నవి. అది సర్వతోముఖ వికాసమునకు మూలము. ఈ దృష్టితో కర్తవ్యనిష్ఠులై యోగవిత్తులవడం అనివార్యము. యోగంలో మానవుడు అని పేరుతో వేరుగా వుండదు.

ఈ రోజుల్లో కాల్పనిక విభజనమును తీసుకుని మానవుడు మానవతకు విముఖుడైనాడు. హింసాత్మకమైన పశువుల కంటే క్రూరుడైనాడు. ఇటువంటి భయంకర పరిస్థితులలో మనలోని నిద్రాణమైవున్న మానవతను మేలుకొలపాలి. అదే ఏకమాత్ర కర్తవ్యము. ఇతరుల హక్కులను కూడా పరిరక్షించినపుడే అది సాధ్యమవుతుంది. అంతేకాదు, ఇతరుల అధికారమును రక్షించడము కూడా మన హక్కు. ఎవరైతే ఈ సత్యమును అంగీకరిస్తారో, వారు చాలా సులభముగా రాగద్వేష రహితులై త్యాగము, ప్రేమ ద్వారా అన్నివేళలా అందరికీ ఉపయోగపడతారు. ఇదే మానవ జీవితము యొక్క ఉద్దేశ్యము.

ఎవరైతే అందరూ తనవారే అనుకుంటారో, వారు సుఖంగా వున్న వారిని చూసి ప్రసన్నులవుతారు, దుఃఖితులను చూసి కరుణితులవుతారు. ప్రసన్నులవడము వలన కామ(కోరిక)నాశము కలుగుతుంది. కరుణితులవడము వలన సుఖ-భోగములపై ఆసక్తి మిగిలియుండదు. ఇదే జీవన విజ్ఞానము. కోరికలు నశించినంతనే వాస్తవిక ఆవశ్యకత సఫలమవుతుంది. భోగాసిక్తి నశిస్తుంది. స్వతః నిత్య యోగము ప్రాప్తిస్తుంది.

ప్రాకృత విధానము ననుసరించి సుఖము-దుఃఖము రాత్రింబగళ్ళ వలె వచ్చిపోయే విషయాలు. అందరి జీవితాలలోనూ అంతో-ఇంతో సుఖదుఃఖాలు వుండనే వుంటాయి. కానీ సుఖ-దుఃఖాలు జీవితం కాదు, ఇంకా చెప్పాలంటే ఇవి సాధన-సామగ్రి అవుతాయి. సాధన సామగ్రిని సదుపయోగము చేసుకోవడంలో మనిషి స్వతంత్రుడు. సుఖము, దుఃఖితులకు పెట్టుబడి లాంటిది. మనకు లభించిన సుఖము దుఃఖితులకు ఉపయోగపడాలి. ఇదే భగవంతుడి మంగళమయ విధానం. దీన్ని ఆచరించడములోనే (పాటించడములోనే) సర్వతోముఖ వికాసము, హితమయి వున్నది. ఈ వికాసము దుఃఖమును సదుపయోగము చేసుకొనుటలో కూడా వున్నది. దుఃఖము యొక్క ప్రభావము మనలను సుఖలాలస నుండి ముక్తులను చేస్తుంది. తర్వాత మనము చాలా సులభముగా ఆ జీవనముతో అభిన్నులమవుతాము. ఎందులోనయితే అభావము, పరాధీనత, అశాంతి, నీరవత లేశ మాత్రమైన వుండదో! అటువంటి జీవనముతో మనము అభిన్నులమవుతాము.

అందువలన ఎవరు ఎంతమాత్రము సుఖముగా వున్నారో వారు అంత మాత్రము సేవ చెయ్యవలసిందే, మరి ఎవరు ఎంత మాత్రము దుఃఖితులో అంతమాత్రము త్యాగమును స్వీకరించవలసినదే, అపుడే వ్యక్తి, సమాజము వీటి అభిన్నత సిద్ధిస్తుంది. అభిన్నతలోనే యోగము బోధ, ప్రేమ వీటి అభివ్యక్తి కలుగుతుంది. జాగృతి చెందిన మనిషి జీవితంలో భోగము (సుఖలాలస) మోహము, ఆసక్తి వీటికి స్థానమే లేదు. తను కర్తవ్యనిష్ఠుడూ అంటే సేవ మరియు త్యాగము వీటిని సొంతము చేసుకుని సర్వదా ఉపయోగపడేలా (ఇతరులకు) జీవించాలి. ఈ అతి పవిత్రమైన ఉద్దేశ్యపూర్తి కోసమే మానవజీవనము లభ్యమైంది.

శరణాగతి తత్త్వము -

శరణాగతి సఫలతకు ఒక 'కీ' లాటిది. నిర్బలుడికి బలము, సాధకుడికి జీవనము, ప్రేమికుడి అంతిమ ప్రయోగము, భక్తుడి మహామంత్రము, ఆస్తికత యొక్క తిరుగులేని అస్త్రము, దుఃఖితుడి దయ, పతితుడి ఆర్తనాదము. అది (శరణాగతి) నిర్బలుడికి బలము, సాధకుడికి సిద్ధి. ప్రేమికుడికి ప్రేమపాత్రుడు, భక్తునికి భగవంతుడు, ఆస్తికుడి ఆస్తి, దుఃఖితుడికి ఆనందము, పతితుడికి పవిత్రత, భోగికి యోగము పరతంత్రుడికి స్వతంత్ర్యత, బద్ధుడికి ముక్తి, నీరసుడికి సరసత, మర్త్యుడికి అమరత ప్రధానము చేస్తుంది.

ప్రత్యేక వ్యక్తి ఎవరో ఒకరికి శరణాపన్నుడై వుంటాడు. ఆస్తికుడు ఒకరికి శరణాగతుడై కోరికలు నివృత్తమయి, ఆవశ్యకత పూర్తి అయి కృతకృత్యుడవుతాడు. నాస్తికుడు అనేకులను శరణని ఇచ్ఛాపూర్తిలోనే కొట్టుకుపోతాడు. ఇంతే తేడా.

శరణాగతి అన్నది ఒక భావము. అది కర్మ కాదు. ఆ భావము వర్తమానములోనే ఫలమునిస్తుంది. శరణాగతి కలుగగానే మొట్టమొదట 'అహం' పరివర్తితమవుతుంది. శరణాగతి అయ్యేకంటే ముందు ప్రాణియొక్క 'అహం' అనేక భాగములలో విభక్తమై వుంటుంది, శరణాగతి అయిన తరువాత ఒకే దానిలోనే విలీనమవుతుంది. అపుడు ఆ ప్రాణి యొక్క జీవితములో రెండు రకాల అనుభవాలు కలుగుతాయి. ఒకటి వారి వాస్తవిక జీవనము, రెండు దాని అభినయము. శరణాగతుడు వాస్తవిక జీవనము కేవలము శరణ్యుడి ప్రేమయే, అభినయము ధర్మానుసారముగా విశ్వసేవ చేయడము. అభినయకర్త ఎప్పుడూ తనను తాను మరువడు. అది నియమము. అందులో జీవనబుద్ధి వుండదు. అభినయము అయిపోయిన తర్వాత ఆ స్వీకృతభావము యొక్క అత్యంతాభావము కలుగుతుంది. అంతే ఆ సమయములో శరణాగతుడు అన్నివైపుల నుండి విముఖుడై శరణ్యుడివైపు వెడతాడు.

ఇపుడు ఆలోచించవలసిన దేమిటంటే మన శరణాగతికి కేంద్రము ఏది అని? ఏది ఆవశ్యకమో అదే కేంద్రము అవుతుంది. నిత్య జీవనము, నిత్య రసము, అన్ని విధాలా పూర్ణత, స్వతంత్ర్యత కలిగి వుండడమే ఆవశ్యకము. అందువలన మన

లక్ష్యము (కేంద్రము) అదే అవుతుంది. ఏదయితే పూర్ణమో, స్వతంత్ర్యమో దానికే మనము శరణాపన్నులము అవుతాము.

ఎవరైతే వర్తమాన జీవిత పరిస్థితులను సదుపయోగము చేసుకుని తనకు నిత్యజీవనము నిత్య రసము (ఆనందము) యొక్క ఆవశ్యకతను అనుభవంలోకి తెచ్చుకుంటారో వారే శరణాగతులు అవడానికి అర్హులు, యోగ్యులు. ఎపుడైతే బాలుడు తనకు కావలసిన వస్తువును తన స్వశక్తితో పొందలేకపోయాడో, వికలుడై తల్లి వైపు చూసి ఏడవడం మొదలుపెడతాడో అపుడు ఆ సమయంలో తల్లి తన మహిమ, తన మాధుర్యముతో బాలుడికి కోరుకున్న వస్తువును ప్రదానము చేస్తుంది. ఇదే విధముగా మనము కూడా ఇదే చెయ్యాలి. మనకున్న సర్వశక్తులు పవిత్రతతో, విశ్వాసంతో ఉపయోగించుకోవాలి. లక్ష్యము పట్ల ఎపుడూ నిరాశకు లోనుకాకూడదు. ఇంకా తన అనంత ఐశ్వర్య మాధుర్య సంపన్నమైన నిత్య సత్త ఏదైతేవుందో దానికి శరణాపన్నుడు అవ్వాలి. ఎపుడైతే శరణాపన్నుడవుతాడో అపుడు తమలోనే ఋషి జీవనం అనుభవంలోకి వస్తుంది, తనలోనే తన శరణ్యుని పొందుతాడు.

శరణాగతి రెండు విధములు, భేద భావము, అభేద భావము అని. భేద భావ శరణాగతి శరణ్యుడి స్వీకృతి మాత్రముతోనే కలుగుతుంది. అభేదభావ శరణాగతి శరణ్యుడి యథార్థ జ్ఞానము వలన కలుగుతుంది. అభేదభావ శరణాగతుడు శరనాగతుడవకమునుపే నిర్విషయుడు అవుతాడు. కేవలం లేశమాత్రముగా 'అహంత' మిగిలివుంటుంది. అది కూడా శరణ్యుడి కృపతో నివృత్తమవుతుంది. భేదభావము కలిగిన శరణాగతుడు శరనాగతుడవగానే 'అహం' పరివర్తనమవుతుంది. అంటే అనేకులకు కేకాఉండా ఒక్కరికే సొంతమవుతారు. ఎలాగ కర్రలు అగ్నితో అభిన్నములవుతూ పోతాయి, అలాగే శరణాగతుడి 'అహం' తద్రూపమవుతుంది. అహంతాసమూలంగా నష్టమయినపుడు భేదభావ శరణాగతుడు కూడా అభేదభావ శరణాగతుడవుతాడు. తను నిరంతరము అతని ప్రేమ కోసమే ప్రతీక్షిస్తాడు. సీమితమైన 'అహం'భావము నిశ్శేషమవగానే అలౌకికమైన ప్రేమమయుడైన 'విభు'డవుతాడు.

శరణాగతుడు, శరణాపన్నుడు వీరిలో కేవలం అంతరం ఇంతే శరణాగతుడు శరణ్యుడి ప్రేమ కోసము ప్రతీక్షిస్తాడు, శరణాపన్నుడు ప్రేమను ఆస్వాదిస్తాడు. భేద

అభేద భావ శరణాగతులలో కేవలము ఇంత మాత్రము అంతరం వుంటుంది - భేదభావ శరణాగతుడు మిలనం, విరహం ఈ రెండు రకాల రసానుభూతులను ఆస్వాధిస్తాడు, అభేద భావ శరణాగతుడు తనలోనే శరణ్యుడి అనుభవము కలిగి నిత్య ఏకరసతను అనుభవిస్తాడు.

శరణ్యుడికి శరణాగతుడు అయినపుడే శరణాగతి యొక్క సార్ధకత. ఎందుకనగా ప్రేమికుడి పూర్ణత ప్రేమ పాత్రుడు ప్రేమికుడయినపుడే సిద్ధిస్తుంది. శరణ్యుడి యొక్క మాధుర్య రసము ఎంత మధురమంటే శరణాగతుడు, ఆ భావాన్ని త్యాగము చేయలేనంతగా వివశుడవుతాడు. కానీ శరణాగతుడు స్వయముగా తనకు ఇష్టము లేక పోయినా శరణ్యుని తనతో అభిన్నము చేసుకుంటాడు. ఎలాగైతే దొంగకు ఇష్టము లేకపోయినా శిక్ష లభిస్తుంది - అలాగ!

మానవ జీవనము యొక్క సార్ధకత శరణ్యుడికి శరణాగతుడవడములోనే వున్నది. శరణాగతుడవడము వలన తొలగిపోనటువంటి దుఃఖము ఏదీ లేదు. శరణ్యుడికి శరణాగతుడవగానే నిత్య జీవనము సులభమయిపోతుంది. శరణాగతి తత్త్వమే సఫలతకు 'కీ' అన్నది నిర్వివాద సిద్ధము.

శిక్షా - దీక్షా

శిక్షణ మానవ జీవితమును సుందరముగా తీర్చిదిద్దుతుంది. అది ఒక రకమైన సామర్ధ్యము. సామర్ధ్యము అందరికి సహజంగా ప్రియమైనదే అయితే దాని దురుపయోగము మంగళకరము కాదు. అందువలన శిక్షణతోపాటు దీక్ష కూడా అత్యంత ఆవశ్యకము. సామర్ధ్యమును దురుపయోగము చేయకుండా వుండగలిగే చేతన అందులో లేదు. సామర్ధ్యము యొక్క సదుపయోగమునకై ప్రకాశము దీక్షతోనే లభిస్తుంది. దీక్షితుడైన మానవుడి ప్రత్యేక చర్య లక్ష్య ప్రాప్తి కోసమే నిహితమై వుంటుంది. అందువలన 'దీక్ష' యొక్క నిజమైన అర్థము-మానవ జీవిత చరమ లక్ష్యమును నిర్ణయించడమే. మానవ మాత్రుడి లక్ష్యము ఒక్కటే. అందువలన దీక్ష కూడా ఒకటే.

దీక్ష రెండు భాగాలు - కర్తృత్వము, అవసరము. ప్రాకృత నియమానుసారముగా కర్తృత్వమును పూర్తిచేయడము వలన స్వతఃఅవసరము, కోరిక (డిమాండ్స్) తీరిపోతాయి. మన కర్తృత్వమును పూర్తి చేయడానికి ఒక అవిచలమైన నిర్ణయము, మరియు మన అవసరాలు తీరడానికి ఒక అవిచల విశ్వాసము వుండాలి. ఈ దీక్ష తీసుకోకుండా ఏ మనిషి కూడా మనిషి కాలేడు. మనిషి కాకపోతే జీవితము తనకు, జగత్తుకు, సర్వధా, స్వప్రకాశుడికి ఉపయోగపడలేడు.

శిక్షణ వలన పొందిన సౌందర్యంతో మానవుడు తన కర్తృత్వమును పూర్తి చేస్తాడు. కర్తృత్వము అంటే ఏమిటి? మనిషి తన కర్తృత్వమును పూర్తి చేయలేక అసమర్థుడవడం అది కర్తృత్వమే కాదు. మన అవసరాలను తీర్చలేనటువంటిది కూడా కర్తృత్వము కాదు, మన కర్తవ్యము ఏమిటి? అన్నది మనిషి స్వయంగా విచారణ చేసుకోవాలి. వారు ఆ విషయములో అపరిచితులు కాకూడదు. కేవలము అసావధానత వలన అజాగ్రత్త వలన దాని విస్మృతి కలుగుతుంది. మన అవసరాల కోసం ఎపుడైతే అవిచలమైన విశ్వాసము కలుగుతుందో దాని కోసము ఉత్కంఠ లాలస ఎపుడు జాగృతమవుతుందో అపుడు కర్తృత్వము యొక్క స్మృతి జాగృతమవుతుంది. తెలుసుకున్న కర్తృత్వమునే మహాపురుషులు సమర్థిస్తారు. అదే దీక్ష.

శిక్షణ సామర్ధ్యమయితే, దీక్ష ప్రకాశము. అందుకని శిక్షణ యొక్క ఉపయోగము దీక్షకు అధీనము అవాలి. ఎవడయినా బలవంతుడు మనకు వినాశము కలిగించాలని, ఎవ్వరము కోరుకోము. కదా అందుకనే మన శక్తిని దురుపయోగము చేయకుండునట్లు వ్రతము స్వీకరించుటయే కర్తవ్యపథము యొక్క దీక్ష. ఎట్టి పరిస్థితులలోనూ నేను శక్తిని దురుపయోగము చెయ్యనని ఏ మానవుడైతే నిర్ణయము తీసుకుంటాడో వారికి సహజముగానే కర్తవ్యము యొక్క స్మృతి కలుగుతుంది. ఇదే దీక్ష యొక్క మహిమ. ఎవరైనా ఒక మనిషి తన నిజ వివేకముతో కానీ, ఎవరైనా కర్తవ్యనిష్ఠుడైన మానవుడి ద్వారా కానీ ఈ దీక్ష తీసుకోవచ్చును. కానీ దీక్షితులు కాకపోవడం చాలా పెద్ద పొరపాటు. దీక్షితులవకుండానే శిక్షణ ద్వారా మాత్రం ఘోర అనర్థము కూడా కలుగుతుంది. అశిక్షితులయిన మనుషుల వలన అంతటి క్షితి కలుగదు, ఎంత క్షితి దీక్షారహిత శిక్షితులవలన కలుగుతుందో అంత అశిక్షితులయినా దీక్షితులు

కాని వారి వలన కలుగదు. ఈ దృష్టితో చూస్తే శిక్షితులు దీక్షితులవడము అత్యంత ఆవశ్యకము. దీని వలన కర్తవ్య పాలనలో తాము పొందిన యొగ్యత సామర్థ్యము యొక్క సదుపయోగము కలుగుతుంది అది సుందర సమాజ నిర్మాణమునకు హేతువవుతుంది.

కర్తవ్యమునకు ఆది, అంతం వుంటుందని అందరికి తెలిసినదే. దేనికయితే ఆద్యంతములు కలవో అది నిత్యము కాదు. కానీ కర్తవ్యము యొక్క పరిణామము కర్తను రాగరహితము చెయ్యడంలో ఉపయోగపడుతుంది. రాగరహితమయినపుడు వస్తువు, అవస్థ, పరిస్థితి మొదలైన వాటి యందు అసంగత కలుగుతుంది - అదే విచార - వివేక పథము యొక్క దీక్ష. కర్తవ్య పరాయణత సుందర సమాజ నిర్మాణము కొరకు, మరి అసంగత స్వాధీనతా (స్వాతంత్ర్య) ప్రాప్తికి సమర్థములు. కానీ ఎవరి అహైతుక కృపవలన కర్తవ్యపాలనకు కావలసిన మూలసామగ్రి మరియు కర్తవ్యస్మృతి కొరకు వివేక రూప ప్రకాశము లభించినాయో, వారి పట్ల అవిచలమైన విశ్వాసము పెట్టడమే విశ్వాస సథము యొక్క దీక్ష. విశ్వాసపథము యొక్క దీక్ష విశ్వసించేవాడిని విశ్వాసపాత్రుడితో అభిన్నము చేస్తుంది. ఈ విధముగా కర్తవ్యపరాయణత వలన సుందర సమాజము యొక్క నిర్మాణము, అసంగత వలన స్వాధీనతా ప్రాప్తి కలుగుతుంది. విశ్వాసము, శ్రద్ధాపూర్వకముగా శరణాగతులైతే ప్రేమ జాగృతమవుతుంది. అంతేకాదు, కర్తవ్య పూర్తిలో అసంగత, అసంగత యొక్క పరాకాష్ఠలో శరణాగతి సహజంగా వస్తుంది. ఇది లేకుండా, స్వార్థము, జడత, సీమిత అహంభావము నశించదు. అందువలన స్వార్థ భావము, జడత్వము, సీమిత అహము దీక్షవలనే నశిస్తాయి. మనిషి యొక్క వ్యక్తిత్వమును అందముగా తీర్చిదిద్దుటకు శిక్షకుడి అవసరము వున్నది. కానీ వ్యక్తిత్వపు మోహమును పోగొట్టుటకు దీక్షితులు అవాలంటే మనిషికి తనవైపు చూడవలసి వస్తుంది. ఏకాంతమే దీక్షయొక్క పాఠశాల, పాఠమే మౌనము. శిక్షణ అనంతుడితో పొందిన సౌందర్యము, దీక్ష అనంతుడి ప్రకాశము. శిక్షణ మనిషి పదుగురికి ఉపయోగపడేలా చేస్తుంది. దీక్ష మనలను ఋణముక్తులను చేస్తుంది. ఋణముక్తులము కానిదే శాంతి, స్వాధీనత మరియు ప్రేమ సామ్రాజ్యములో ప్రవేశము సంభవము కాదు.

భిక్షు శంకరానందజీ మహరాజ్

నేను ప్రతి సంవత్సరము కన్‌ఖల్ వెళుతూ వుండేవాడిని. అక్కడ శ్రీ హరి భారతీ విద్యాలయములో మహామండలేశ్వరుడు (ఆరోజులలో ఇలాగే చెప్పేవారు) అనేక శాస్త్రములలో మహా పండితుడైన విద్వాన్ స్వామి శ్రీ భాగవతానంద సరస్వతీజీ మహరాజ్ వారు వుండేవారు. అక్కడ వారు అధ్యయనము చేయించేవారు. నేను వారి దగ్గర శాంకరభాష్యము చదివాను. అక్కడ కొందరు విద్యార్థులకు చదువుకూడా చెబుతూ వుండేవాడిని. వారిలో 'బరనాల'లోని 'ఆత్మారామ్' వైద్యుడు, డా॥తారాచంద్ పర్వతీయ, హరినందన్ శాస్త్రి, జీవానందుడు మొదలగువారు ముఖ్యులు.

నా యొక్క అశిష్టత -

'నేను ఒక రోజు స్వామీ భగవతానంద్ గారిని ఎవరైనా మంచి మహాత్ములు ఇక్కడ వుంటే నాకు చెప్పండి నేనువారి సత్సంగమునకు వెళ్ళాలనుకుంటున్నాను' అని అన్నాను. వారు నా ఈ అశిష్టత పట్ల రుష్టులవలేదు. నవ్వుతూ ఇలా అన్నారు 'నీ అభిప్రాయము ఎవరైన విరక్త మహాత్ములని కదా?' అన్నారు. నేను 'అవును' అన్నాను. వారు ఇలా అన్నారు 'ఇక్కడే దగ్గరలో సురతగిరి బంగళాకు రెండోవైపు అటల్ అఖాడా అని ఒక శిధిలగృహము వున్నది. అందులో భిక్షుశంకరానందగారు అనే పేరుగల మహాత్ములున్నారు. నీవు వారి సత్సంగము చేసి వస్తూవుండు' అని. ఇది 1930వ సం॥నాటి మాట.

ఆ సమయములో సురతగిరి బంగళా నుండి రోడ్డు వరకు ఏవి ఇళ్ళు తయారవలేదు. ఇపుడయితే అంతా నిండిపోయింది. ఒక జీర్ణ-శీర్ణ పురాతనమైన ఇల్లు వున్నది. పై కప్పుకూడా కొంచెము శిధిలమయి వున్నది. తేనెటీగలు, కీటకాలు

గూళ్ళు కట్టుకుని వున్నాయి. దుమ్ము-ధూళితో ఆ ప్రదేశము నిండి వుంది. భిక్షు శంకరానందజీ అక్కడే ఒక అరుగుపైన గోనెపట్టా పరుచుకుని వుండేవారు. శరీరముపైన లంగోటి మాత్రము వుండేది. నుదుటిపైన ముందువైపు వెంట్రుకలులేవు. ఉద్దీప్తమైన లలాటము. నవ్వుతూ అడిగారు 'ఎలాగ వచ్చావు?' నేనన్నాను 'మీ దర్శనము కొరకు వచ్చాను', వారు ఇంకా గట్టిగా నవ్వారు. వారు అన్నారు 'మీ దర్శనము చేసుకోండి. మీరే మీరు. దీనికోసమని రాకపోకల అవశ్యకత ఎక్కడ?' నాకు వేదాంత సంస్కారము వున్నది కనుక వారి మాట చాలా బాగనిపించింది.

అలమస్త్ ఫకీరు -

రోజుకి 24 గంటలలో వారు ఒక్కేసారి భిక్ష కోసము పూరిలోకి వెళ్ళేవారని తెలిసింది. కేవలం ఒకపూట తినేవారు. రెండోపూట కేవలము గంగాజలము త్రాగేవారు. సంచి (జోలె) గూటానికి తగిలించి వుండేది. ఒక పెద్ద మట్టి కుండ వుండేది. దానితోనే నీళ్ళు త్రాగేవారు. అది పగిలితే తీసి వేరేది మార్చేవారు. వారు సత్సంగ సమయములో సాధారణముగా 'ఆత్మ' శబ్దమునే ప్రయోగించేవారు, 'బ్రహ్మ' అనికాదు. ఆత్మాతిరిక్తము ఇక ఏమీ లేదు.

నా జీవితములోని సంఘటనలు వారికి తెలిసినపుడు వారు 'శ్రీమద్భా గవతము'ను గేలి చేశారు. భక్తి - భావము అంటే వారికి సర్వదా అయిష్టత. సగుణ-సాకారములు, ఉపాసనల చర్చలంటే వారికి ఇష్టము ఉండేది కాదు. నేను వారిని ఇలా ప్రార్థించాను 'మహరాజ్! బహుశ, మీరు భాగవతమును అధ్యయనము చెయ్యలేదనుకుంటాను. నేను ప్రతిరోజు కొంచెం కొంచెం మీకు వినిపిస్తాను! ప్రార్థనను అంగీకరించారు. నేను మొదట ఏకాదశ స్కంథము వినిపించాను. వారికి చాలా నచ్చింది. తర్వాత సప్తమ స్కందము వినిపించాను. ప్రహ్లాదుడి వివేకము, అవధూతస్థితి, గృహస్థులకు పరమాత్మ ప్రాప్తికై ఉపాయము మొదలైన సంగతులు విని వారయితే భాగవతభక్తులయ్యారు. వారన్నారు 'ఈ రచయితనే రాసలీల కూడా వ్రాశరు'. ఆశ్చర్యము! సరే అది కూడా వినిపించు' అన్నారు. నేను ధనపతిసూరి వ్రాసిన ప్రకారము నివృత్తి ప్రధానముగా రాసలీల వినిపించాను. శ్రీధర స్వామి వారి

అనుసారము నివృత్తి పరముగా వున్నది కూడా యుక్తి యుక్తము అని చెప్పాను. వారు చాలా ప్రసన్నులయ్యారు. నియమంగా దాదాపు 3 నెలలు వరకు శ్రవణము చేశారు.

అనుపమ దక్షిణ -

నేను కన్‌ఖల్ నుండి వారణాసి రావలసివుంది. అపుడు ఒకరోజు వారు అకస్మాత్తుగా నన్ను వారి శిథిల కుటీరములోపలికి పిలిచారు. వారు అరుగుపైన కూర్చున్నారు. నేను క్రింద కూర్చున్నాను. వారు నన్ను సావధాన చిత్తుడిని చేస్తూ ఇలా అన్నారు. నీవు స్వయంగా శుద్ధ-బుద్ధ సచ్చిదానంద-ఘన అద్వయతత్త్వము. నారాయణ! నీవు కావాలంటే తెల్లబట్టలలో వుండు, లేదా రంగు బట్టలలో వుండు, ఇంట్లో కానీ బయట కానీ, ఇది నిశ్చయము చేసుకో నేను జీవుడిని కాదు అని. దేహాభిమానమును పోగొట్టి దేహాతిరిక్తమయిన తత్త్వమును అర్థం చేసుకోవడానికోసమే ఈ జీవత్వము. ఏ విధమైన చిజ్జడ గ్రంధి లేదు, మరి అచేతనమైన పేరుతో మరో వస్తువు లేదు. అని ఇది నీవు నాకు భాగవతము వినిపించి నందుకు దక్షిణగా (ఈ ఉపదేశము) ఇస్తున్నానని వారు చెబితే చాలా చమత్కారముగా అనిపించింది. అపుడు నా నిశ్చయము ఇంకా దృఢమయిపోయినది. ఎందుకంటే భాగవతము ప్రకారము జ్ఞాన సందేశమే దక్షిణ. మీకు ఆశ్చర్యము కలగవచ్చుకానీ ఆ రోజు తర్వాత నాకు నేను జీవుడిని అన్న భ్రమ మరి కలుగలేదు. ఈ విషయము మొదటి లేఖగా మేరఠ్ నుండి ప్రకాశితమయ్యే 'సంకీర్తన' అన్న పత్రికలో కొన్ని సంవత్సరాల తర్వాత వ్రాశాను. నా సమస్త సమస్యలకు సమాధానము (లేక) ఆత్మ సాక్షాత్కారము అని. ఆ లేఖ పేరు.

పరిచయము సత్యనిష్ఠ -

అహమదాబాదులో చిన్న కుగ్రామములో ఒక బ్రహ్మభట్ట వంశంలో భిక్షుశంకరానంద జన్మించారు. వారు బాల్యావస్థ నుండి కూడా సత్యనిష్ఠులు. ఒక సారి ఏదైనా మాట చెప్పారంటే, దానిపై దృఢంగా వుండే వారు, తన ప్రతిజ్ఞను పూర్తిచేసేవారు. ఈ సంగతి వారి తల్లి తండ్రులకు, వారి బంధు బాంధవులకు అందరికీ

తెలుసు. ఎవరైతే సత్య-ప్రేమికలు కారో వారు సత్యసాక్షాత్కారము కొరకు తపస్య కూడా చెయ్యలేరు. ఎందుకనగా సత్యమును తెలుసుకొనడానికి తపస్యా, వివేక వైరాగ్యము, జిజ్ఞాస మొదలైన సాధనల ఆవశ్యకత ఎంతైనా వున్నది. వారి బుద్ధిలో ఆ సమయములో ఏదైనా ఒక మాట ఇది సత్యము అని నిశ్చయము అయినదంటే దాని కోసము వారి ఎంతటి పెద్ద త్యాగమునకైనా సిద్ధపడేవారు.

పువ్వుపుట్టగానే పరిమళిస్తుంది -

ఒకసారి భిక్షుజీగారి తండ్రిగారు 'బాబూ! దుకాణము కొరకు ఫలానా వస్తువు కావాలి, నీవు వెళ్ళి పట్నము నుండి తీసుకురా' అని రూ.250/- ఇచ్చారు. భిక్షుజీ ఇంటి నుండి బయలుదేరినపుడు మార్గమధ్యములో వారికి ఒక సాధుమండలి కలిశింది. వారు ఒక తోటలో బసచేసి వున్నారు. వేదాంత బ్రహ్మ యొక్క చర్చలో చాలా అభిరుచి కలిగింది, గంటల తరబడి అలా ధ్యానపూర్వకంగా వింటూవున్నారు. సత్సంగము అయిన తరువాత ఆ మహాత్ముడు అక్కడి వ్యవస్థాపకుడిని పిలిచి సాధు భోజనము కొరకు ఏమి ఏర్పాట్లు జరిగాయి అని అడిగారు. వారు ఏ ఏ వస్తువులు వున్నాయో ఏవేవి లేవో అన్ని చెప్పారు. భిక్షుజీ తన తండ్రి ఇచ్చిన రూ.250/-లు వారికి ఇచ్చేసి వట్టి చేతులతో ఇల్లు చేరుకున్నారు. 'బేరం తీసుకువచ్చావా' అని వారి తండ్రి ప్రశ్నించగా భిక్షుజీ అన్నారు 'నాన్నగారూ! మీరేమో నాకు సాంసారిక నాశవంతమైన సరుకులు అడిగారు, మరి నేనేమో ఆ డబ్బుతో పరమాత్మ యొక్క బేరం చేసుకువచ్చాను. అది అమరము! అజరము!' అన్నారు. వారి దృఢ నిశ్చయముతో పరిచయము వుంది కాబట్టి తండ్రిగారు కూడా ఇక ఏమీ అనలేదు. భిక్షుజీ మనసులో ప్రజ్ఞానఘన, అద్వితీయ బ్రహ్మ యొక్క చింతన కలిగింది.

త్యాగము చేయవలెనన్న నిశ్చయము -

భిక్షుజీ ఆలోచించేవారు - నేను సత్యము పట్ల ఇంత పట్టుదలతో వున్నాను కదా! కానీ నాకు అసలైన సత్యము - పరమార్థము అయితే తెలియనే తెలియదు. మనమందరము కూడా ప్రత్యక్ష, పరోక్ష పదార్థములును 'కాదు' (లేదు) అనవచ్చు,

కానీ మనసు మనం అయితే లేరు అని చెప్పలేము కదా! అపుడు ఆత్మ ఒక్కటే అఖండితమయిన సత్యమా? ఏమి? ఒకవేళ ఆత్మయే సత్యము అంటే దాని కొరకు అనాత్మయొక్క వివేకము, దానితో వైరాగ్యము, వైరాగ్యపు దృఢత కొరకు త్యాగము చేయవలసి వుంటుంది. త్యాగమే వైరాగ్యమునకు గీటురాయి. వైరాగ్యము లేకుండా వివేకము నిర్బలము. త్యాగము లేకుండా వైరాగ్యము నిర్బలము. వివేకము వలననే ఏమి త్యాగము చేయవలనన్నది నిశ్చయమవుతుంది. అనాత్మ వస్తువే త్యాజ్యమవుతుంది. అందువలన ఆత్మ-సత్యమును అనుభవములో పొందుటకు వివేక వైరాగ్యము, మరియు త్యాగము ఆవశ్యకములు.

భీష్మ-ప్రతిజ్ఞ -

ముందు చెప్పిన విచారధార హృదయంలో ప్రవహిస్తోంది. భిక్షుజీ యొక్క ప్రేరణతో వారి తండ్రి సత్యనారాయణ వ్రతం ఇంట్లో ఏర్పాటుచేశారు. ఆ రోజు బంధుబాంధవులు, సజాతీయులు, విజాతీయులు అందరూ ప్రక్కవూర్ల నుండి కూడా వచ్చి గుమిగూడారు. సత్యనారాయణ పూజ సమాప్తమయింది. వ్రత-కథ పూర్తయింది. ప్రసాదం పంచిపెట్టారు. తర్వాత భిక్షుజీ అక్కడ చేరిన ప్రజలతో ఇలా అన్నారు, 'మీరందరూ కొంచెం సేపు ఆగండి'. ఒక సభలాగ అయింది. భిక్షుజీ అందరి మధ్యలో తన శిఖను కత్తిరించివేశారు. యజ్ఞోపవీతము తీసుకుని చేతితో పట్టుకున్నారు. బిక్షుజీ లోకుల మధ్యలో ఇలా అన్నారు, 'పరంపరాగత ఆచార విచారాలను అనుకూలముగా ఇప్పటి వరకు నేను నా ధర్మాన్ని నిర్వర్తించాను, కానీ ఈ ధర్మపాలన వలన నా లక్ష్యము నాకు లభిస్తుంది అని విశ్వాసము నా హృదయములో కలగడం లేదు. అందుకని మీ అందరి మధ్య నేను వీటిని త్యజిస్తున్నాను. బాల్యావస్థ నుండి కూడా ఏ సత్యమునైతే నేను ప్రేమిస్తున్నానో, ఇంత వరకు ఏదైతే ఆచరించానో, దాని యదార్థ-స్వరూపమును సాక్షాత్కరింపజేసు కోకుండా, మధ్యలో ఎక్కడ ఆగను'. వారి ఈ ప్రతిజ్ఞను విని ఆ సభలోని వారిలో ఒక్కరుకూడా కాదనలేదు, వారి ప్రతిజ్ఞకు విపరీతముగా ఎవ్వరూ ఏమీ బలవంతం చెయ్యలేదు. వారి యొక్క సత్యనిష్ఠ యందు సమాజములో వారికి అంతటి పేరు వుండేది.

సత్యాన్వేషణ -

మరుసటిరోజున వారు సాబర్మతీ నదీ తీరము వద్దకు వచ్చి కూర్చుండిపోయారు. 'సత్యమంటే ఏమిటి?' అన్నదానిపై అనుసంధానము చేయసాగారు. సత్యము ఏకదేశీయము (ఒక స్థానానికి చెందినది) కాదు. దీని అభిప్రాయము ఒక స్థానము, లేదా ఒక దేశము వీటి భేదం వలన సత్యములో భేదము కలుగదు. అది ఇక్కడ-అక్కడ, ఎక్కడైన ఒక్కలాగునే వుంటుంది. సమయ భేదము వలన కూడా సత్యములో ఏమీ భేదము వున్నట్లు కన్పించదు. ఇపుడు-అపుడు, నేడు-రేపు, రాత్రి-పగలు ఏమీ కూడా సత్యమును ప్రభావితము చేయ సమర్థములు కావు. వస్తువులు యొక్క అనేకత కూడా ఆకార-ప్రకారములు, వికార-సంస్కారములు ఇవన్నీ కూడా ఒక్కటిగా కానీ, అన్నీ కలసి కానీ సత్యమును పరివర్తనము, పరివర్ధనము చేయజాలవు. సత్యము అధిష్ఠానము ఎలాగవున్నదో అలాగనే ఏకరసము! దానిపై అధ్యస్తము, విన్యస్తము, ఆరోపితము, కల్పితము అథవా శాస్త్రము, బుద్ధి మరియు ఆచార్యుల వలన నిర్దేశించబడిన ఏ వస్తు - నామ రూపములు కొంచెము కూడా దానిని కళంకితము చేయజాలదు. నిజముగా 'సత్యము' అదే!

చింతనధార యొక్క ఊర్ధ్వగామిత !

ఏ సత్యమునయితే ఎవరూ 'మిథ్య' అనలేరో, నిరూపించలేరో అటువంటి సత్యసాక్షాత్కారము యొక్క అనుభవము ఎలా కలుగుతుంది? ఇది జిజ్ఞాసువు యొక్క హృదయములో జ్వలితమైన ప్రశ్న. ఒకవేళ 'సత్యము' నితాంత పరోక్షమయితే అది కేవలం కల్పితమే అవుతుంది. ఒకవేళ అది ప్రత్యక్షము అయితే అది ఐంద్రియక ప్రత్యక్షము, సాక్షీవేద్యము అవడము వలన జడము అవుతుంది. దాన్ని అనుభవించేవాడు కూడా వృత్తికి పరాధీనుడే అవుతాడు. ఒక వేళ అది ఏదో ఒక యుక్తి లేదా వాక్యము లేక వృత్తి యొక్క సీమలోకి వస్తే అపుడు అది పరిచ్ఛిన్నమయిపోతుంది. ఒకవేళ 'సత్యము' జడము అయితే అది పొందేవాడు కూడా జడము అవుతాడు. ఒకవేళ అది కల్పితమయితే అకల్పిత సత్యము ఏది? ఈ విధముగా చింతనా ప్రవాహము సత్యమువైపు అగ్రసరమయినది. అది సముద్రములోకి ప్రవహించడము లేదు, సుమేరు పర్వతపు ఉత్తుంగ శృంగశిఖరముపై

ఆరూఢమయినది. ఇతరుల యొక్క చింతన (వివేకము), జిజ్ఞాసువు యొక్క అజ్ఞానమును తొలగించలేదు. స్వయం తనలో జరిగే 'చింతన'యే అజ్ఞానావరణమును క్షీణింపజేస్తుంది. 'సత్యము' యొక్క కించిత్ ప్రకాశము కూడా లోకత్రయము యొక్క త్రైకాలిక ఆనందముకంటే గొప్పది.

ఈ శరీరము ఏ ఉపాదానము వలన తయారవుతుందో దానితో దానికి విడదీయరాని, విచ్ఛిన్నము చేయలేనటువంటి సంబంధము వుంటుంది. మట్టితో తయారైన ఈ శరీరము మట్టి నుండి తయారైన ఆహారం కావాలంటుంది. రక్తము, రసము జలముపైన ఆధారపడి వుంటుంది. వేడిమి బాహ్య తాపము యొక్క తేజము, అగ్ని సూర్యుడిని అపేక్షిస్తుంది. ప్రాణములకు వాయువు కావాలి. ఆకాశము లేకుండా స్థలము, అవకాశము (స్పేస్) లేదు. ఏదో ఒక సంపూర్ణ, స్వయం ప్రకాశ మానమైన చైతన్యము లేకుండా ఈ శరీరములోని ప్రకాశమాన చైతన్యము ఎలా వుంటుంది? ఈ శరీరములోని పాంచభౌతిక సంబంధాలు కూడా ఎవరికైతే సరిగా అర్థము కాలేదో, వారు ఈ ఆత్మ చైతన్యము యొక్క అలౌకిక స్వరూపమును ఎలా తెలుసుకోగలరు? నియమము యొక్క దృఢత - ఏ తీరంలో కూర్చుని భిక్షుజీ ఆత్మచింతన చేశారో, ఆ సాబర్మతీ తటము ఇప్పటికీ ఎలాగున్నదో అలాగే వున్నది. శరీర రక్షణ కొరకు ప్రాణాలు - క్షుధా నివృత్తి కొరకు భోజనమును కోరాయి. ఈ రోజు అంటే విద్వత్ సన్యాసము మొదటి దినము ఏ పద్ధతిలో భోజన వ్యవస్థ సమకూరుతుందో అదే జీవన పర్యంతము ధారణ చెయ్యాలి అని నిశ్చయించుకున్నారు. కొద్ది సేపటిలోనే ఒక విరక్తసన్యాసి వూళ్ళో నుండి భిక్షతీసుకుని నదీతటమునకు వచ్చాడు. జోలెలో భిక్ష కొంచెం ఎక్కువ ఉండినది. మొదట ఎక్కువగా వున్న భిక్షను పంచిపెట్టవలసి వస్తుంది. తర్వాత మొత్తము జోలెను నదిలో ముంచి అంతా తినవలసి వస్తుంది. ఒక అపరిగ్రహి, శిఖా-సూత్రరహితుడు అయిన యువకుడు తన్మయుడై ఎదుట కూర్చుని వున్నాడు. 'నీవు కొంచెం ఈ భిక్షను తీసుకుంటావా?' అని ఆ సాధువు అడిగాడు. ఆ యువకుడు మౌనముగా స్వీకృతిని తెలిపి భిక్ష తీసుకున్నాడు. అదే ఆజీవనము భిక్షయొక్క నియమము అయిపోయింది- మాధుకరి ద్వారా క్షుధా నివృత్తి. ఒక రోజంతటికి ఒకేసారి. రెండవసారి ఏలక్కాయకూడా వేసుకునేవారు కాదు. నీరు రెండు సార్లు

త్రాగేవారు. వారు ఈ నియమాన్ని కఠినంగా పాలించేవారు. జీవితపు మధ్యాహ్న కాలములో కూడా ఈ నియమాన్ని అనుసరించి ఆహారం తీసుకునేవారు.

చింతన బాగా తీవ్రంగా జరుగుతూ వుండేది. చింతన బాహ్యాభిముఖము గనుక అయితే దేశ, కాల, వస్తువుల ఆది అంతం అన్వేషిస్తూపోతే అంధకారము కంటే వేరే ఏమీ లభించదు. చేతనను సాక్షాత్కరింపజేసుకోవడానికి ప్రవృత్తికాదు కావలసింది, నివృత్తికావాలి. బయట కాదు లోపల-చింతన యొక్క మూల భూతమైన అధిష్ఠానము, ప్రకాశమును స్పర్శించడము కాదు, దానితో ఐక్యముచెందడమువైపే ధ్యానముంచాలి. సంపూర్ణ పదార్థముల యొక్క మూలము భానాత్మకమైన (ప్రకాశమానమైన) ఆత్మయే. ఏదో తయారుచేసే ఉపాదానము కాదు. మనసును వెళ్ళనీయకండి, మన దగ్గరకే రానివ్వండి. మనసులో ప్రతిబింబించే విషయాలను చూడకండి, మన స్వప్రకాశమును చూడండి. జడతకాదు, జడత యొక్క జ్ఞానము.

విధివత్ సన్యాసగ్రహణము -

పర్వత సానువులు, పచ్చటి అరణ్యాలు వీటితో నిండిన గంగానదీ ధార వారిని తమవైపు ఆకర్షించాయి. వారు కాలినడకన సాబర్మతీ నది నుండి హరిద్వారము గంగా తీరమునకు వచ్చారు. ప్రవహించే ఆ ధార సమీపములోనే కూర్చున్నారు. అది ప్రవహిస్తూవుంది - వారు శాంతులై, తటస్థులై కూటస్థులై కూచుని వున్నారు. ప్రకృతి యొక్క చంచలస్వరూపాన్ని చూడండి, అది అనేకము, కానీ తాను ఒక్కడే. అది అనిత్యము, తను నిత్యుడు. అది దృశ్యము, తన ద్రష్ట. అందులో ప్రియత యొక్క ఆభాస వున్నది. తను ప్రేమస్వరూపుడు. ఏ ప్రయత్నము లేకుండగనే స్వరూపస్థితి లాగ కలిగింది. ఆరోజులలో గంగా తీరంలో జిజ్ఞాసువులు, విరక్తులు, త్యాగులు వీరి రాకపోకలు విశేషముగా వుండేవి. లోకులు ఈ యువకుడైన త్యాగిని చూశారు. కుతూహలము కలిగింది. ప్రజలు వీరి జీవనసరళిని చూచి వారి ఇతివృత్తము అడిగారు. కొందు విద్వాన్ మహాత్ములు కలిశారు. వారు ఇలా వీరిని పరామర్శించారు 'మీ త్యాగ వైరాగ్యాలు, చింతన ఇంత ఉత్కృష్టమైనదైనపుడు, ఇంత ఉత్తమోత్తమమైన దయినపుడు మీరు విధిపూర్వకముగా సన్యాసగ్రహణం చేసి ఈ విద్వత్ సన్యాసమును

వైదిక విధానములోకి చేర్చండి. సన్యాసమన్నది - ఎవరో ఆచార్యుడు ఏదో ఒక సమయములో ప్రారంభించిన సంప్రదాయము కాదు. ఇది వైదిక ఆశ్రమ-వ్యవస్థ. దీని వలన జీవన నిర్వాహము, తత్త్వజ్ఞానము లభించడములో కూడా అనుకూలత కలిగిస్తుంది. వారు విద్యానుల ఈ ప్రేరణను అంగీకరించి సురతగిరి దగ్గర వున్న బంగళాలో విధిపూర్వకముగా సన్యాసమును స్వీకరించారు. వారి పేరు శంకరానందగిరి అయినది. చింతన జరుగుతూనే వుండేది. భిక్షయొక్క నియమము కూడా అలాగే వుండేది. అప్పటి నుండి అటల్ అఖాడే దగ్గర వున్న శిథిలకుటీరములో వుండడం మొదలుపెట్టారు.

జిజ్ఞాసువులకు ఉపయోగపడే మాటలు -

ఎవరైనా జిజ్ఞాసువు సత్యానుసంధానములో నిమగ్నమైనపుడు వాడి ఎదుట అనేకరకములైన చింతనరీతుల, సత్యము యొక్క వివిధ రూపాలు ఎదుటికి వస్తాయి. ప్రతీ ప్రశ్న కూడా సమాధానము కొరకు ఒక అజ్ఞాత మార్గములో పయనించడం జరుగుతుంది, అలాంటప్పుడు ఒక్కోసారి అసత్యమును కూడా సత్యమని అనుకుంటారు. చింతన కాందిశీకమవుతుంది. దీని నుండి ముక్తులవ్వాలంటే (ఈ పరిస్థితి నుండి) ఉపాయమేమిటంటే మొదటి నుండి ఋషులు, మునులు, ఏరీతి-నీతిని అనుసరించారో మొదట వాటిని హృదయంగమము చేసుకోవాలి. పవిత్ర చింతనకు శుద్ధమైన ఆచరణయే హేతువు, అదీగాక శాస్త్రీయ మార్గము యొక్క జ్ఞానము, ప్రాచీన జిజ్ఞాసువుల అనుగమనమునకు కూడా హేతువవుతుంది. వివేక-వైరాగ్యములతో పాటు శమ, దమాది సంపత్తులు కూడా కావాలి, అదీ కాక సత్యసాక్షాత్కారము కొరకు తీవ్రమైన అభీప్స (కోరిక) కూడా ఆవశ్యకము.

శాస్త్ర అధ్యయనము రెండు రకములు. ఒకటి విధివత్తు పద్ధతి - విద్యాంసులతో పరంపరాగత అధ్యయనము. రెండవది తీవ్రముముక్ష వలన గురువు యొక్క శ్రీచరణాలలో శరణాగతులై, ఆత్మ మరియు బ్రహ్మ యొక్క స్వరూపమును, ఐక్య-బోధ కలిగించే శాస్త్రములను శ్రవణము చెయ్యడము. ముముక్షు జిజ్ఞాసువులకు శాస్త్రములు రెండు రూపములని తెలియాల్సిన ఆవశ్యకత వున్నది.

1. అపూర్వ వస్తువును ఉత్పన్నము చేసే విధిని ప్రతిపాదించేవి ఎలాగ యజ్ఞ-యాగాదులను ప్రతిపాదించేవి. వీటిని ప్రయత్న పూర్వకముగా సాధించడము వలన పరిమిత ఫలములు లభిస్తాయి. దీని వలన జిజ్ఞాసువుకు కేవలం ప్రయోజనం ఇంతే-అదేమిటంటే వారి అభీష్ట వస్తువు యొక్క నశ్వరరూపం తెలిపి సత్యాన్వేషికి వీటిపట్ల వైరాగ్యము కలిగించడమే. కృతకము, కృత్రిమము అయిన పదార్థములు ఎపుడో ఒకపుడు నశించిపోయేవే అని తెలుసుకుంటే చాలు. వాటికి ఒక పరిధి వున్నది.

2. శాస్త్రము యొక్క రెండవ ప్రకారము - వస్తుతః ఏదైతే సర్వదా విద్యమానము, ఏకరస పరమార్థవస్తువు ఏదైతే అజ్ఞానము యొక్క ఆవరణలాగ ప్రతీతమవుతుందో, అది నివృత్తమవనీ. నిత్య ప్రాప్త వస్తువు యొక్క ప్రాప్తి కలగనీ. సరిగ్గా మార్గదర్శనము ఎపుడు జరుగుతుందంటే సంత్-సద్గురువుల ద్వారా వేదాంత శాస్త్రము యొక్క శ్రవణ-మననములు జరిగినపుడే!

నిరభిమానత -

భిక్షుశంకరానందజీ వారు హరిద్వార్ 'కన్‌ఖల్'లోని ఎందరో మహాత్ములతో శ్రుతులు, దర్శన శాస్త్రములను అధ్యయనము చేశారు. వారు అధ్యయనము చెయ్యడానికి ఎవరి దగ్గరికైనా సరే వెళుతూ వుండేవారు. వారిక తన యొక్క గొప్పతనం, శ్రేష్ఠత పట్ల అహంకారముండేది కాదు. అహంకారము జిజ్ఞాసువును ఉత్తమమైన జ్ఞానము నుండి వంచితులను చేస్తుంది. వారు శ్రీమంగళగిరి మహరాజ్‌తో విధివత్ న్యాయ శాస్త్రమును అధ్యయనము చేశిరి. వేదాంత-శాస్త్రము యొక్క ఒక్కొక్క ప్రక్రియను గురించి తెలుసుకున్నారు. ఏకాంతములో కూర్చుని మనన-నిధిధ్యాసనలు చేసుకుంటూ వుండేవారు.

లక్ష్యమువైపు ఉన్ముఖమైన చింతన ధార -

దృశ్యమాన జగత్తు పరివర్తన శీలమైనది. నిత్యము క్రొత్త వికృతులు క్రొత్త సంస్కృతులు. చెట్లకు కాచిన కాయ పెరిగి పండు అయి, కుళ్ళిపోయి, నశించి

పోతుంది. శరీరము యొక్క దశ కూడా ఇంతే. సెలయేటి ధార అదే, అదే అనిపిస్తుంది, కానీ ప్రతీ క్షణము ఎన్నో కొత్త ధారలు వస్తాయి, పాతవిపోతాయి. మరి అపుడు ప్రపంచము 'భోగ్యము' ఎలా? నేను అదే భోగిస్తున్నాను అని అనుకోవడము ఒక వికల్పము మాత్రమే. ఇటు విషయములలో స్థిరత్వము లేదు, అటు ఇంద్రియము లలో సామర్థ్యము లేదు. మనసులో కూడా ఎపుడూ ఒకే అభిరుచి వుండదు, భోక్త కూడా నిత్య జాగరితుడు అవలేడు. సుషుప్తి భోక్తను శాంతపరుస్తుంది. అటువంటి స్థితిలో భోక్త-భోగ్యము అనే భావము కూడా నిస్సారమే.

దృశ్య పదార్థములలో అస్తి-అస్తి అను భావము భిన్న-భిన్నంగా ప్రకాశించుట వాటి పరిచ్ఛిన్నతనే తెలియచేస్తుంది. అవి వాటి ప్రకాశము కొరకు ఆత్మ-చైతన్యమునే అపేక్షిస్తాయి, అందువలన అవి జడములు. వాటితో తాదాత్మ్యం చెంది నేను కూడా జడుడిలాగ అవుతున్నాను. దృశ్యపదార్థము గురించి మనము ఎంతటి దివ్యమైన కల్పన చేసినా కానీ అది ప్రకాశ్యము కాబట్టి జడముగానే వుంటుంది, అవి ప్రకాశించడము, ప్రకాశించకపోవడమూ పరాధీనమే. ఇంద్రియక ప్రత్యక్ష్యము అవడము వలన పరిచ్ఛినము, దేశంలో పరిమితము మరియు నశ్వరము అవుతుంది. మానస-ప్రత్యక్ష- మనోరాజ్యము, స్వప్నసదృశము, మరియు గంధర్వ నగరము లాగ వుంటుంది. సుషుప్తి కాలములో వీటి అజ్ఞానము వుంటుంది. పరోక్ష కల్పన చేయడం వలన అది అజ్ఞాతమవుతుంది. అది వున్నది - అని అనుకోవడానికి కారణం కనిపించదు. వాటిని శ్రవణముద్వారా విని విశ్వసించవలసి వస్తుంది. కల్పన కూడా కేవలం సాక్షి-భాస్యమే. అటువంటపుడు దృశ్యంలో సత్యమును అన్వేషించడము అన్నది గోడలేకుండానే చిత్రం గీయడం వంటిది, ఆకాశ కుసుమాలతో మాల కట్టినట్లుంటుంది. ఎపుడైనా అన్యరూపంలో సత్య-సాక్షాత్కారము కలిగినట్లు అనిపిస్తే అదికూడా భ్రమ మాత్రమే అవుతుంది. అపుడు ఆత్మాతిరిక్తమయిన వేరే ఏదీ సత్యము కాజాలదు. ఆత్మ సత్తా లేకుండా భగవంతుడు, జీవుడు, జగత్తు, కారణ-కార్యము, వేద శాస్త్రములు, గురువు, శరీరము మొదలైన వాటి ప్రతీతి కూడా కలుగదు. అందువలన ప్రతీతి యొక్క మూల స్వరూపము మరియు ప్రకాశకము ఆత్మ చైతన్యమే. అది సత్యము అవాలి.

లక్ష్యప్రాప్తి, సత్యసాక్షాత్కారము -

సత్యముతో జ్ఞానము ఉత్పత్తి అవుతుందా లేక జ్ఞానముతో సత్యము ఉత్పత్తి అవుతుందా? ఏదయితే ఉత్పత్తి అవుతుందో దాని ప్రళయము (నాశము) కూడా జరుగుతుంది. ఉత్పత్తి - ప్రళయశీలమైన పదార్థములు అనిత్యములు మరియు మిధ్య అవుతాయి. అవి ఆత్మ స్వరూపజ్ఞానమూ కాదు, సత్యస్వరూప అధిష్ఠానము కాదు. 'సత్యము' జడము మరియు అభావము వీటి అధికరణ జ్ఞానములో ప్రతీతిగా మాత్రమే వుంటాయి, లేకపోతే 'శూన్యము'నకు సాక్షి ఎవరు? అందువలన సాక్షియే సత్యము మరియు అబాధితము అవుతుంది. ఇపుడు ప్రశ్న ఏమిటంటే 'సాక్షి' యొక్క అనుభవము ఎలా కలుగుతుంది? అని! 'ఇది సాక్షి' అనే అనుభవము వదతో - వ్యాఘాతము అవుతుంది. 'అది సాక్షి' అనుకుంటే అది కల్పన అవుతుంది. ఒకవేళ 'నేను సాక్షిని' అనుకుంటే అపుడు 'నేను' యొక్క పరిచ్ఛిన్నత మరియు సాక్షియొక్క పరోక్షత అసంభవము. అటువంటి స్థితిలో ఆత్మసత్యమే జ్ఞానస్వరూప అద్వితీయ సత్యము. ఆ! ఇదే మహావాక్యముల యొక్క తాత్పర్యము. మరి ఈ 'బోధ' మహావాక్మముల వలనే ఏల కలుగుచున్నది? 'తత్' మరియు 'త్వం' పదార్థముల ఏకత, అఖండత యొక్క బోధకములు ఏ భాషలోనైనా, ఏ వాక్యములోనైనా అవచ్చుకదా! అది 'తత్' యొక్క పరోక్షత, 'త్వం' యొక్క పరిచ్ఛిన్నత బాధితము చేయనే చేస్తుంది. కేవలము అఖండార్థ బోధయే అపేక్షితము, అది ఏ భాషలోనయినా కానీ, 'తత్'-'త్వం' పదార్థముల అభేదము యొక్క బోధకము అర్థాత్ భేదభ్రాంతిని నివారించేదిగా వుండాలి. ఆశ్చర్యము! ఆశ్చర్యము! మన ఆత్మ అద్వితీయ పరమార్థ సత్యము. ఆత్మ అంటే అద్వితీయ జ్ఞానము. సత్యము అంటే ఎప్పటికీ బాధితము కానిది. ఎక్కడ? ఎవరిని? ఎవరు వెతుకుతున్నారు? నిత్యప్రాప్తి యొక్క ప్రాప్తిని కోరుకుంటున్నారు. చాలు! ఇపుడిక ఏవిధమైన కర్తవ్యము, ప్రాప్తవ్యము, త్యక్తవ్యము మరియు జ్ఞాతవ్యము ఏమీ లేవు. అజ్ఞానము యొక్క నివృత్తితో ఉపలక్షితమైన ఆత్మయే మోక్ష-స్వరూపము. ఆత్మ నిజముగా పరమానంద స్వరూపము.

శ్రీభిక్షు శంకరానందుల వారి వైరాగ్యము మరియు బోధ (జ్ఞానము) వీటి ప్రతిష్ఠ విస్తరిల్లసాగింది. ఎందుకంటే అక్కడ దగ్గరలో వున్న విద్వాంసులు విరక్తులు

కారు, మరి ఎవరైతే విరక్తులో వారు విద్వాంసులు కారు. యదార్థ జ్ఞానము మరియు యదార్థ వైరాగ్యము ప్రాయః ఒకే చోట వుంటాయి. ఉపరతి కూడా వున్నదంటే ఇక చెప్పవలసినదేమి? సాధువులు, జిజ్ఞాసువులు అందరూ ఆ అటల్ అఖాడే శిధిలము వైపు ఉన్ముఖులయ్యారు. భిక్షుజీ ప్రవచనము-ఉపదేశము ఏమీ చేసేవారుకాదు. కానీ జిజ్ఞాసువుల సందేహాలకు సమాధానము ఇస్తుండిరి. కొందరు కొందరు 'విచార-సాగర్' చదువుకోవడానికి కూడా వచ్చేవారు. ఆ రోజుల్లోనే నేను సర్వశాస్త్రములలో మహావిద్యాంసుడయిన మహామండలేశ్వరుడు శ్రీ భగవతానందజీవారు చెప్పడము వలన నేను కూడా అక్కడికి వెళ్ళివస్తూ వుండేవాడిని, వారి అనుగ్రహము కూడా ప్రాప్తమయింది.

కేవలము ఆత్మ చింతన -

నేను ప్రతి సంవత్సరము ఎండాకాలములో 'కన్‌ఖల్' వెళ్తూ వుండేవాడిని. అధ్యయనము, అధ్యాపనము ఇవేకాక భిక్షజీ యొక్క సత్సంగము కూడా చేస్తూ వుండేవాడిని. వారు కర్మ-ఉపాసన మరియు యోగము వీటిని పరంపరా సాధనగా సమర్థించేవారు కాదు. భిక్షుజీ కేవలం సత్సంగము, విచారము (వివేకము) చింతనతోనే తత్త్వజ్ఞానము యొక్క ప్రతిపాదన చేశేవారు. దీని ప్రభావము ఒకరకంగా జిజ్ఞాసువులపైన పడింది - ఎలాగంటే మాకు ఏ సాధన చెయ్యకుండా తత్త్వసాక్షాత్కారము కలుగుతుంది అని. ఇంకొకటేమిటంటే వేదాంతులు ఉపాసన యోగము వీటిని ఉపదేశించి శిష్యులను తయారు చేసుకునేవారు, వీరికి ఇవన్నీ చేసిన తర్వాత తత్త్వజ్ఞానము కలుగుతుంది అని నచ్చజెప్పేవారు, ఇపుడు వారి దగ్గరికి సత్సంగీయుల రాకపోకలు తగ్గిపోయాయి. దీనికి మఠములలో ప్రతిక్రియ కనిపించింది. మఠాధీశులు దీని విరోధించారు. కొందరు సత్సంగీయులు ఇక్కడ-అక్కడ రెండుచోట్లా వెళ్ళేవారు, వీరు ఖండిస్తే వారితో వినేవారు. వారి ఖండన వీరితో వినేవారు. మాటామాటా పెరిగిపోయింది. కొందరు భిక్షుజిని అక్కడి నుండి పంపివేయాలని ప్రయత్నించ సాగారు. గుండాలు కొందరు ఇతరుల కళ్ళుగప్పి సత్సంగము జరిగేచోట మలమూత్ర విసర్జన చేశేవారు. మేము వాటిని శుభ్రము చేసేవాళ్ళము.

దోషములను పూర్తిగా నివారణ చెయ్యడం -

ఒక రోజు ఒక క్రొత్త సత్సంగి మొదట వచ్చాడు. వారు అక్కడ మల త్యాగము చేసినది చూశారు. వారు గప్‌చిప్‌గా మట్టి తెచ్చి దాన్ని కప్పివేశారు. సత్సంగము సమయంలో ఒక సజ్జనుడు వచ్చి ఆ మట్టిపైనే కూర్చోబోయాడు. వారి బట్టలన్నీ పాడయ్యాయి. భిక్షుజీ ఇలా అన్నారు 'దోషములను కప్పిపెట్టరాదు. వాటిని పూర్తిగా నివారణ చెయ్యాలి. లేకపోతే అవి విస్తరిల్లిపోతాయి, ఇతరులను కూడా మలినము చేస్తాయి. మాట అలా వచ్చిపోయింది. వైరాగ్యము మరియు తత్త్వజ్ఞానము యొక్క చర్చ విశదముగా జరిగింది. వారు ఏమనేవారంటే, 'వైరాగ్యవంతుడైన జిజ్ఞాసువుకు బోధ కలగడములో ఏమీ విలంబనము కాదు. ఒక్కటే ప్రతిబంధము-వైరాగ్యము యొక్క న్యూనత.' వైరాగ్యవంతుడి హృదయములో సత్యమును గురించిన జిజ్ఞాస కలిగితీరుతుంది.

వాత్సల్యము, మరియు పరాకాష్ఠను చేరుకున్న విరక్తి -

తర్వాత వచ్చే ఎండాకాలములో నేను వెళ్ళినపుడు భిక్షుజీ 'మౌనం'గా వున్నారు. సత్సంగము లేదు, సందడి లేదు. శిథిల గృహములో అరచేతి మందాన దుమ్ముపట్టి వున్నది. తేనెటీగలు, కీటకాలు అన్నీ గూళ్ళు కట్టుకుని వున్నాయి. ఇదంతా దుమ్ము ధూళి తీసి బయటపడవేసి అంతా శుభ్రము చేస్తాను నేను అని అడిగాను. కిరసనాయిల్ వేసి ఈ తేనెతెట్టలు, గూళ్ళూ ఇవన్నీ ఎగరగొట్టేస్తాను అన్నాను. వారు నన్ను వారించారు. నేను వారిని ఇలా ప్రార్థించాను - 'నేను సత్సంగము కోసమే వారణాసి నుండి ఇక్కడికి వచ్చాను. మీరేమో మౌనంగా వున్నారు. ఇక నేను తిరిగి వెళ్ళిపోతాను'. వారు మౌనం వదిలి మాట్లాడారు 'చూడు! ఈ శిథిలమైన కుటీరము, ఈ శరీరము, ప్రతీయమానమైన ఏ వస్తువైనా సరే, 'నేను' కాదు, 'సత్యము' కాదు అన్నది నాకు తెలుసు. కానీ ఈ చీమలు, తేనెటీగలు మొదలైన ప్రాణులు ఇవేమో ఇదే స్థానమును తమ ఇల్లు అని అనుకుంటున్నాయి, వాటి పట్ల వాటికి మమత వున్నది. అందువలన దీని యజమానులు వారే నేను కాదు. ఇక్కడి నుండి నేను బయటికి వెళ్ళడమే మంచిది, వాటిని వెళ్ళగొట్టడం మంచిది కాదు.' అన్నారు. వారి ఈ మాటలు విని నాకు చాలా సంతోషం కలిగింది. భిక్షుజీ యొక్క వాత్సల్యమును చూచి హృదయము ఆనందంతో

నిండిపోయింది. బహుశా ఆలోచన-ప్రత్యాలోచన వీటి ఝంఝాటం నుండి తప్పుకోవడానికే వీరు మౌనం స్వీకరించారేమో.

ఒక సంవత్సరము తర్వాత నేను వెళ్ళినపడు వారు ఆ శిథిలాలలో లేరు. చాలా కష్టం మీద వారి అడ్రసు తెలిసింది. పెద్ద కాలువ దగ్గరవున్న పుట్ట దగ్గర ఒక చిన్న తోటలో వారు వుండేవారు. అత్యంత కృశులు రుగ్ణులు అయివున్నారు. వారితో మాట్లాడాక తెలిసింది - ఎవరో ఈర్ష్యాళుడైన వ్యక్తి భిక్షలో వారికి విషము పెట్టారని! అక్కడి ప్రజలు వారిని ఆ శిథిలాల నుండి తీసుకువచ్చి సురక్షితమైన స్థానంలో వుంచారు. తరువాత ఆరు నెలలపాటు వారు అదే తోటలోనే వున్నారు. 'పడవల్' (ఒక కాయగూర) తప్ప ఇంకేమీ తినేవారు కాదు. నీరు కూడా 'పడవల్'వే త్రాగేవారు. 'పడవల్' (సంస్కృతంలో 'పటోల్')లో విషాన్ని జీర్ణింపచేశే అద్భుతమైన శక్తి వుంది. నేను యథాశక్తి వారికి సేవ చేస్తూ వుండేవాడిని. మెల్ల మెల్లగా వారు కోలుకోసాగారు. వారు ఇలా అంటూండేవారు 'ఈ మిథ్యా శరీరము దానంతటదే త్యజింపబడుతుంది. దీనికై ప్రయాసపడవలసిన అవసరమేమివున్నది? వుంటే వుండనీ, పోతేపోనీ! దీనిని అట్టిపెట్టుకోవాలనుకోవడము, వదలాలనుకోవడమూ రెండూ అజ్ఞానమే'. ఈ విషగ్రస్థులైనటు వంటి సమయములో కూడా వారి ఉన్నత లలాటము అద్దంలాగ వెలిగిపోతూవుండేది. ముఖంపైన ప్రసన్నత నాట్యమాడుతూ వుండేది. మాట మాటకూ ఏదో హాస్యం-వినోదం చేస్తునే వుండేవారు. తరువాత వారి దగ్గరికి వేరే ఇతర సాంప్రదాయములు వారు కూడా ప్రశ్నోత్తరాల కోసము వస్తుండేవారు.

దాని తర్వాత మరల ఇంకో సంవత్సరము నేను వెళ్ళినపుడు వారు ఒక సంచిలో వ్రాయడానికి, చదవడానికి కావలసిన సరంజామా తీసుకుని, కన్‌ఖల్‌కి దక్షిణదిశలో ఒక చిన్న కాలువ దగ్గర ఒడ్డున కన్పించారు. తెలిసిన వ్యక్తి ఒకరు నన్ను వారి దగ్గరకు తీసుకువెళ్ళారు. నేను తర్కవితర్కములు చేస్తే వారు న్యాయశాస్త్రము (న్యాయ దర్శనము) ప్రకారము పంచావయవ వాక్యమును ప్రయోగించి వాటిని (నా తర్కాన్ని) ఖండించేవారు. ఒకరోజు ప్రసంగములో వారు నాతో ఇలా అన్నారు - 'నీవు ఎలాగ చెబుతున్నావంటే, దానితో బౌద్ధమతము ప్రాప్తిస్తుంది' 'నాకు మత-మతాంతరాలలో ఏమి అభ్యంతరము లేదు. ఒక వేళ అదే సత్యమయితే నేను స్వీకరించడానికి

సంసిద్ధుడను' అని అన్నాను. దానితో వారు చాలా ప్రసన్నులయి ఇలా అన్నారు, 'అవును అలాగే వుండాలి'. జిజ్ఞాసువు దురాగ్రహి అయితే తనమాటే సరి అని పట్టుపడితే ఇక వాడి 'విపర్యయము' ఎప్పటికీ తొలగిపోదు. దాని తరవాత వారు శ్రుతి అనుకూలమైన యుక్తులతో నా ప్రశ్నను సమాధానపరిచారు. ఇపుడు ఇక వారు వేర్వేరు వృక్షముల క్రిందకు వెళ్ళి వుండడము మొదలుపెట్టారు. ఒక్కొక్కసారి ఒక్కొక్క దగ్గర కలిశేవారు. వర్షం వచ్చిబాగా తడిసిపోయారు. జ్వరం పెరిగిపోయింది, కానీ వారు తమ పట్టుదల వదలలేదు. మూర్ఛావస్థ రావడం మొదలయ్యేటప్పటికి వారిని బలవంతంగా ఒక పెద్ద ఇంటిలోని ఒక గదిలోకి (అది స్మశానమునకు దగ్గరగా వుండేది) తీసుకువచ్చారు. గది చాలా రోజులుగా ఖాళీగా పడివుంది. బాగా గట్టి ఇల్లే సురక్షితంగానూ వున్నది. ఆగదికి వెళ్ళడానికి 2, 3 వాకిళ్ళు దాటి రావలసివచ్చేది. గదిలోకి బాగా గాలివచ్చేది. దూర దూరాల వరకు గంగానదీమతల్లి దర్శనం అవుతుండేది. మంచిదయింది అక్కడ వుండటానికి వారు అంగీకరించారు. రోగము వృద్ధావస్థ కారణంగా శరీరము దుర్బలమయిపోయింది. కానీ వారి కంఠంలో ఆ వ్యంగ్యము, వినోదము, దృఢత అలా ఉట్టిపడుతూ వుండేవి. భక్తులు భిక్షను కూడా అక్కడికే తీసుకు వచ్చేవారు. దానితో మాకక్కడ అందరికి బాగా అనిపించింది. నేను 'కల్యాణ్' (ఆధ్యాత్మిక మాస పత్రిక) సంపాదక విభాగములో వుండేవాడిని. తరువాత సన్యాసినయ్యాను. అయినా వారి దగ్గరికి రాక-పోకలు, ప్రేమ-ఆత్మీయతలు ఎప్పటికీ అలాగే వుండేవి.

ఆ మధ్య కాలంలో మఠాలు, మఠాధిపతులపైన వారు చాలా పుస్తకాలు వ్రాసివేశారు. అన్ని ప్రచురితమయినాయి. సన్యాసులపైన దీని వల్ల మంచి ప్రభావము పడలేదు. చాలా మందికి వారిపైన కోపం వచ్చింది. సన్యాసులకు వారంటే నచ్చడం లేదు అని ఎపుడైతే తెలసిందో ఇక అపుడు కమ్యూనిస్టులు. ఆర్య సమాజస్తులు వీరి దగ్గరి రాకపోకలు మొదలుపెట్టారు వారు వీరిని ఇంకా ఉత్సాహితులని చేశారు. పుస్తక-ప్రకాశనములను కూడ ఇలాంటి వారే సహాయం చేసి వుంటారేమో అని నా అనుమానం!

నా దృష్టత -

వారు నన్ను చాలా ప్రేమించేవారు - ఇందులో సందేహమేమీ లేదు. కానీ నాకు వీరి ఈ విరోధ-కార్యము ఇష్టమయ్యేదికాదు. అందువలన ఒక రోజు వారితో ఇలా అన్నాను 'మీరు వాళ్ళను నిందించకుండా వుంటేనే మంచిది' వారు నవ్వి 'నీవు అలాంటి వాళ్ళ పక్షము ఎందుకు తీసుకుంటావు?' అని అడిగారు. నేను అన్నాను 'వారిని నిందించకుండా వుంటే, ప్రశంసిస్తే అపుడు ప్రజల హృదయాలలో వారిపట్ల శ్రద్ధ-భక్తి పెరుగుతుంది!' వారు అన్నారు, 'నేను అందుకే వారిని నిందిస్తాను, ఎందుకంటే పాఖండుల వల్ల లోకుల హృదయాలలో అంధవిశ్వాసము వుండకూడదు అని. వారు తమ మార్గములు తప్పకూడదనీ, సాధన మార్గములో అగ్రసరులవ్వాలని'.

నేను ఒక రోజు వారితో ఇలా అన్నా 'మీరు ఎవరినైతే అందరి మధ్య నిందిస్తు ప్రవచనము చేస్తారో వారు ద్వేషంతో ప్రేరితులవుతారు' వారు గట్టిగ నవ్వి ఇలా అన్నారు ఎవరైన ఒక వ్యక్తి ఆలోచించి, కూర్చుని, నిల్చుని, కోపముతో వ్యంగ్యముగా ఎలా మాట్లాడుతున్నారు? దీని వలన ఏమిటి? అతడు ఏమి చెబుతున్నాడు అది సత్యమా? కాదా? ఒకవేళ వారి వచనము సత్యమైనదైతే, సత్యమును బోధ కలిగించేదయితే, అపుడు వక్త యొక్క స్థితి, మాట భాష వీటిని చూడవలసిన అవసరము ఏమీ లేదు. నేను ఏదయితే చెబుతున్నానో అది సత్యము కాదా అని ఎవరైనా విచారించమను'. నేను చాలా దుస్సాహసముతో చిరునవ్వు నవ్వుతూ అన్నాను 'నాకయితే మీరు చెప్పిన మాటలు అసత్యము లనిపిస్తున్నాయి'. వారు నవ్వుతూ ఇలా అన్నారు, 'సరి! నీవు సత్యము చెప్పి చూపించు'. తరువాత వారు నాకు ఇలా నచ్చజెప్పారు 'పరమార్థ దృష్టితో నేను ఏదయితే చెబుతానో అది కూడా మిధ్యయే, మరి నీవు ఏమి చెబుతున్నావో అది కూడా అసత్యమే. ఎంత వరకు వ్యవహారము వుంటుందో అంతవరకే సత్యాసత్యముల భేదము వుంటుంది, మరి దానిని ఒప్పుకోవడము కూడా హితకరమే. ఈ భేదమే జిజ్ఞాసువును అభేదస్థితికి చేరుస్తుంది.

నేను, సుదర్శన సింహ 'చక్ర' మేమిరువురము ఎవరో ఒక ప్రసద్ధి సాధువు దగ్గరికి వెళ్ళి భిక్షుజీ దగ్గరికి తిరిగి వచ్చాము. వారిని ఆ సాధువారి (సాధువు) యొక్క జీవితానికి సంబంధించిన విషయాలు తెలిపారు. మేము 'బ్రహ్మాకారవృత్తి' తథా

'జీవన్ముక్తి యొక్క విలక్షణ సుఖము' వీటిని గురించి అడిగితే వారేమో ఏ ఏ రాజ మహారాజులు తమను ఎంత ఎంత సత్కారం చేశారో తెలిపేవారు. మేము చాలా త్రిప్పి త్రిప్పి ప్రశ్నలడిగేవారము, మరి అలాగే వెంటనే తమ అభినందన పత్రికలను గురించి చర్చించేవారు. ఈ సందర్భముగానే ఒక సారి ఆ సాధువు ఇలా చెప్పారు, 'మేము హిమాలయములలో ఘోరమైన తపస్సు చేస్తువుంటిమి. భగవాన్ శ్రీకృష్ణుడు నాయెదుట ప్రత్యక్షమయినాడు. నీ తపస్సు పూర్తయింది అని వారు చెప్పారు. ఇపుడు ఈ 'గీత' పుస్తకము తీసుకుని వెళ్ళి ప్రజలలో దీనిని ప్రచారము చెయ్యి, లోక సంగ్రహము చెయ్యి' అని. అపుడు నా మనసులో అనిపించింది, భగవంతుడు ఏ ప్రెస్సులో అచ్చయిన పుస్తకము ఇచ్చాడు చెప్మా?! భిక్షుజీ సమాధానం ఇచ్చారు నాకు కూడా భగవంతుడు శ్రీకృష్ణుడి దర్శనము లభించింది. వారు నాతో ఇలా అన్నారు నా పేరు చెప్పకుని 'గీత' ఇచ్చాను అని చెప్పకునే సాధువు బొత్తిగా మిధ్యావాది, అవిశ్వాసపాత్రుడు, మీరు వెళ్ళి ప్రజలలో ఆ సాధువు యొక్క ధూర్తతను అందరికి ప్రకటించండి' అని. నేను భిక్షుజీతో అన్నాను మీరు కూడా వృథి కబుర్లు ఎందుకు చెబుతున్నారు?' వారు నవ్వి ఇలా అన్నారు - సాధక బాధకాలు రెండూ సమసత్తలోనే వుంటాయి. స్వప్నములో కలిగిన దప్పికను స్వప్నజలమే తీరుస్తుంది, మరి జాగ్రత్తులోని దప్పిక జాగ్రత్తులోని జలముతో తీరుతుంది. అసత్యము అసత్యముతోనే ఖండించాలి. ఆ సాధువు కూడా తనకు కృష్ణ దర్శనము కలిగింది అని ప్రమాణము చూపించలేడు, నేను కూడా చూపించలేను. వారిది కల్పనయే, నాదీ కల్పనయే. మన జల్పన (వాగుటను) కూడా వేదాంతము అజ్ఞానమూలకమైన కల్పనలను శాస్త్రీయ కల్పనలతోనే ఖండిస్తుంది.

స్వతంత్ర్య చింతనము -

నేను 'కల్యాణ్' సంపాదక విభాగములో వున్నపుడు కూడా సేఠ్ జయదయాల్ గోయెంకా గారి సత్సంగము కొరకై 'స్వర్గాశ్రమము' (ఋషికేశ్) వెళ్ళేవాడిని - అపుడు కూడా మనసులో వారిని (భిక్షుజీని) కలుసుకోవాలన్న లాలసయే వుండేది. వారికి 'కల్యాణ'(పత్రిక) యొక్క ఈ ప్రచారం మాటి మాటికి భగవంతుడు దర్శనం ఇవ్వడానికి వస్తాడు అన్నమాట వారికి నచ్చేది కాదు. ఇలాంటి ప్రచారము వలన స్వతంత్ర్య

చింతన కుంటుపడుతుందనీ, మనుషులు పాఖండుల పట్ల అంధవిశ్వాసంతో ఇక ఆ ఊబి నుండి బయటికి రాలేకపోతారు అని వారి అభిప్రాయము.

నేను సన్యాసినయ్యాక కూడా భిక్షుజీ దగ్గరికి వెళ్ళివస్తూ వుండేవాడిని. 'ప్రాచ్య దర్శన సమీక్ష' వ్రాసినటువంటి స్వామీ శ్రీ శాంతినాథజీ మహరాజ్ యొక్క సేవకుడు రాబీహేమేన్‌దాస్. ఆయన వేదాంతములో మంచి విద్వానుడు. వారు భిక్షుజీ దగ్గరికి వస్తుండేవారు. వారితో గంభీరమైన తత్త్వ చర్చ జరుగుతువుండేది. హేమేన్‌దాస్‌జీకి నాపైన చాలా ప్రేమ. వారు శ్రీశాంతినాథ్‌జీ మరియు భిక్షుజీ వీరిద్దరి విచారములను (చింతనలను) సమీక్షిస్తూవుండేవారు. శాంతినాథ్‌జీ యొక్క విశేషత ఏమిటంటే వారు భిన్న భిన్న గ్రంథాలలో వున్న పూర్వపక్షపు యుక్తులన్నీ సేకరించేవారు. కానీ ఉత్తర పక్షపు యుక్తులు సేకరించేవారుకాదు. అందువలన ఖండనల సంగ్రహము జరిగేది కానీ మండనలు పాపం నేలపాలయ్యేవి. నేను వారితో ఒకటి రెండు సార్లు కలిశాను. సాక్షి అబాధితము అనే సిద్ధాంతముపైన నాకు వారికి వాదోపవాదము జరిగింది. కానీ వారికి చాలా తొందరగా కోపం వస్తువుండేది, విచారము ఆగిపోయేది. 'భోజా' భగత్‌కి (భక్తుడు) కూడా 'విచారసారము' బాగా తెలుసు. వారు కూడా తరువాత బృందావనమునకు వచ్చారు.

ఋషీకేశ్‌లో స్వామి స్వరూపానందజీ వుండేవారు. వారు వేదాంతములో దిగ్గజులు. వారు భిక్షజీ దగ్గరికి మాటిమాటికీ వస్తుండేవారు. సత్సంగము బాగా జరిగేది.

చేతనదేవుడి కుటీరము-

సన్యాసీ-మండలి నాతోనైతే ప్రసన్నంగానే వుండేవారు, కానీ భిక్షుజీతో కోపంగా వుండేవారు. నేను ఎవరైనా సన్యాసుల దగ్గర (అంటే వారితో పాటు) వున్నపుడు వారికి భిక్షుజీ దగ్గరికి నారాకపోకలు నచ్చేవికాదు. అందువలన నేను శ్రీచేతనదేవ్‌జీ కుటీరములో వుండడము మొదలెట్టాను. అక్కడ నాకు వుండటానికి వేరే ఏర్పాటు వుండేది. భోజనము కూడా విడిగా తయారుచేశేవారు, అక్కడి మహంత్‌జీ శ్రీగురు ముఖదాస్జీకి నేనంటే చాలా ప్రేమ, శ్రద్ధ వుండేది.

శాస్త్ర చర్చలకు సవాలు -

ఆ రోజులలోనే భిక్షుజీ శాస్త్రచర్చకై ఒక సవాలుగా ఒక కరపత్రము అచ్చువేయించారు. ఆ పేపరు ఇపుడు నాదగ్గర లేదు. కానీ గర్తుకు వున్నంతవరకు అందులో మూడు మాటలు ముఖ్యముగా వుండేవి. 1)తత్త్వజ్ఞానము కలుగకముందు అంతఃకరణ పరిపూర్ణముగా శుద్ధముగా వుండాలనే నియమము సరియైనది కాదు. 2)కేవలము ఉపనిషద్ వాక్యముల వలననే తత్త్వజ్ఞానము కలుగుతుంది అన్న నియమము కూడా సరికాదు. 3)తత్త్వజ్ఞానము కలిగిన తర్వాత జ్ఞాని శాస్త్రోక్త విధి - నిషేధపు పరిధిలోనే వుండాలి, అని అనుకోవడము కూడా వేదాంత-శాస్త్రమునకు విరుద్ధము.

నేను భిక్షుజీ దగ్గరికి వెళ్ళినపుడు ఇదేమిటి మీరు ఇలాగ చేశారు? అని అడిగాను. వారన్నారు పండితుల మస్తిష్కములు పని చేయ్యడం మొదలెడతాయి, మరేమో జిజ్ఞాసువులకు ఉత్సాహము కలుగుతుంది. తరువాత వారు చాలా రోజుల వరకు మెల్ల మెల్లగా వారి అభిప్రాయములను అర్థమయ్యేలా చేశారు.

అంతఃకరణ శుద్ధి ఎంతవరకు అపేక్షితము -

అంతఃకరణములో మూడు దోషములున్నాయంటారు. మలము, విక్షేపము మరియు ఆవరణ. ఇందులో ఆవరణనివృత్తి కేవలము తత్త్వజ్ఞానము వలననే కలుగుతుంది. అలాంటపుడు తత్త్వజ్ఞానము కంటే ముందుగా ఆవరణ భంగము జరగడానికి లేదు. ఆవరణ వున్నపుడు అంతఃకరణము పూర్ణశుద్ధము అని అనుకోలేము. ఇంకా కూడా మలవిక్షేపముల నివృత్తి తత్త్వజ్ఞానము కలుగక ముందు ఒక క్షణమా, రెండు క్షణాలా, లేదా ఒక సంవత్సరమా, రెండు సంవత్సరములా ఎంత సమయము వరకు, వుండాలా లేదా అని దీనికి కూడా ఏమీ నియమము లేదు. తత్త్వజ్ఞానమునకు అవ్యవహిత-పూర్ణక్షణమే కదా! ఆ ఒక్క క్షణముతో ఎపుడయితే ప్రయోజనపూర్తి కలుగుతుందో, అపుడు తత్త్వజ్ఞానమునకు కల్గిన ఉత్తర క్షణము (తక్షణము)లో పూర్వ పూర్వ వాసనల ప్రవాహము వుంటుందా వుండదా? ఒక వేళ ఉండేట్లయితే, ఆ వాసనలు బాధితములయినవి అయితే కానీ అంతః

కరణములో అశుద్ధిధార ప్రవహిస్తునే వుంటుంది. తర్వాత తత్త్వజ్ఞానమునకు పూర్వము అంతఃకరణ శుద్ధమయినది, అయితే అపుడు ఈ అశుద్ధి ఎక్కడి నుండి వచ్చింది? శ్రీవిద్యారణ్యస్వామి తన జీవన్ముక్తి వివేకములో తత్త్వజ్ఞానానంతరము అభ్యాసము యొక్క ఆవశ్యకతను ప్రతిపాదిస్తూ కొందరు కొందరికి వాసనాక్షయము, మనోనాశముతో పాటు తత్త్వజ్ఞానము కలుగుతుంది, కొందరు కొందరికి ముందు తత్త్వజ్ఞానము తర్వాత వాసనాక్షయము మనోనాశము కలుగుతుంది అని అన్నారు. కృతోపాస్తి, అకృతోపాస్తి అనే భేదము వుంటుంది. తత్త్వజ్ఞానము తర్వాత జ్ఞానరక్ష, తపము, విషమవాదాభావ దుఃఖ నివృత్తి మరియు జీవన్ముక్తి యొక్క విలక్షణ సుఖము అనుభవంలోకి తెచ్చుకోవడానికి అభ్యాసము యొక్క ఆవశ్యకత వున్నది. ఒక వేళ అంతఃకరణ పూర్ణంగా శుద్ధమయితేనే తత్త్వజ్ఞానము అవుతుంది అని అనుకుంటే తత్త్వజ్ఞానము కలిగిన తర్వాత అభ్యాసము యొక్క ఆవశ్యకత ఏమిటి! ఈ విషయంలో 'త్రిపురారహస్యము'లోని ఆ రాజు యొక్క ఉదాహరణ గుర్తుతెచ్చుకోవలసి వుంటుంది, ఎవరికైతే పతిత దశలో కూడా తత్త్వజ్ఞానము కలిగినదో ఆ రాజుది యోగవాసిష్ఠము కూడా చూడండి.

జ్ఞానములో భాషా భేదము బాధకము కాదు -

నిత్య పరోక్ష వస్తువు యొక్క జ్ఞానము వాక్యము ద్వారానే కలుగుతుంది. అది పరోక్షమే అవుతుంది అన్నది నిశ్చయమే. ఇదే విధముగా నిత్య అపరోక్ష వస్తువు కూడా ఒక వేళ అజ్ఞాతమవుతే, దాని యొక్క అజ్ఞాన నివృత్తి 'దశమస్త్వమసి' లాంటి వాక్యముల వలన కలుగుతుంది, అది అపరోక్షమే అవుతుంది. 'తత్త్వమసి' అది మహా వాక్యాలు అఖండార్థ భోధకములు. అదిసరే కానీ ఒకవేళ జిజ్ఞాసువుకు ఏదైనా వేరే భాషలో చెప్పి అఖండార్థబోధ కలిగించగలిగితే అందులో తప్పేముంది? జిజ్ఞాసువు యొక్క హృదయములో ఐక్యాకార వృత్తి క్షణమాత్రమైన ఉదయించడము అభీష్ఠము. వేదాంతములో ఎవరినైతే వేదాధ్యయనమునకు అనధికారిగా అనుకుంటారో వారికి కూడా ఇతిహాస-పురాణాలు మరియు భాషాగ్రంథాల ద్వారా తత్త్వజ్ఞానము కలుగుతుందని ఒప్పుకుంటున్నారు. భాషా-భేదము అకించిత్కరము. జ్ఞానము ఏదో ఒక భాషలోనే, అందునా వేద-వాక్యము లేదా సంస్కృతముతోనే కలుగుతుందని లేదు.

విధి-నిషేధము వాస్తవికతతో సంబంరధము లేదు -

పాప-పుణ్యమల కర్తృత్వము, సుఖ దుఃఖముల భోక్తృత్వము స్వర్గ నరకాదిలో గమనాగమనరూప సంసారిత్వము, తథాపరిచ్ఛిన్నత్వము యొక్క భ్రాంతి ఎపుడయితే నివృత్త మవుతుందో అపుడు విధి నిషేధము ఏ కర్తను తనకు ఆశ్రయముగా చేసుకుంటుంది? దాని నియామకుడెవరు? అందుకని దానిలో ఎన్ని రకాలైన ప్రవృత్తులు నివృత్తులు కన్పిస్తున్నాయో అంతా ఆభాస మాత్రమే మరి ఫలమును ఉత్పాదనము చేసే క్షమత వాటికి లేదు. అందుకని జ్ఞానీ, పురుషుడు ఎలాగైనా వుండనీ, వారు పరమాత్మలోనే వుంటారు. తత్త్వజ్ఞానులకు పాప-పుణ్యములంటవని శృతి చెబుతుంది. అది సుకృత-దుష్కృతములను రెంటిని విధూననము (నశింప) చేస్తుంది. పూర్వార్థము యొక్క వినాశము జరుగుతుంది, ఉత్తరార్థము యొక్క ఆశ్లేషము కూడా వుండదు. పుణ్యమునకు కూడా ఇదే గతి. కర్మ, దాని ఫలము యొక్క గతవిధులు, అజ్ఞానికి అజ్ఞాన దృష్టితోనే కానీ వాస్తవికతతో దానికి ఏమీ సంబంధము లేదు. ఇలాగ నాకు, భిక్షుజీకి మాటలు జరిగాయి. పంచపురీలో ఈ మాటపై వాద వివాదములు చెలరేగినవి, మరి శాస్త్రార్థమునకు సవాలు చేయబడినది. సమయము నిశ్చితమయినది. కానీ శాస్త్రార్థము ఏమీ జరుగనేలేదు. సమయానికి ఎవరూ రాలేదు. ఆ మాట అక్కడితో ఆగిపోయింది.

అన్నీ సాధనలు సమాదరణీయములు -

శాంకర సాంప్రదాయము యొక్క విశేషతయే అది అధికార భేదముననుసరించి అందరు సాధనలను అంగీకరిస్తారు. ధర్మము, ఉపాసన, యోగము అంతఃకరణ శుద్ధికి ఉపయోగములు. సాధన క్రమమును అంగీకరించకపోతే సాంప్రదాయ పద్ధతులు పరంపరలు సాగవు. ఇందువలననే వివేక వైరాగ్యము, శమదమాదిషట్ సంపత్తి, మరియు ముముక్షా ఇవి బహిరంగ సాధనములుగా అంగీకరిస్తారు. కరణ శుద్ధి బహిరంగము, లక్ష్య శుద్ధి అంతరంగము. శ్రవణాది లక్ష-శుద్ధి కొరకు. లక్ష్య స్వరూపము యొక్క అజ్ఞానము తద్విషయకమైన శ్రవణము వలన నివృత్తి అవుతుంది. సంశయ, విపర్యయ నివృత్తి మననము నిధిధ్యాసన వలన అవుతుంది. ఉత్తమ

అధికారి శ్రవణ మాత్రముతోనే కృతార్థుడవుతాడు. ప్రమాణ ప్రమేయ విషయములో సంశయ విపర్యయము గనుక వుంటే మనన నిధిధ్యాసనతో దూరమవుతాయి. అటువంటపుడు భిక్షుశంకరానందజీ వారి ఘోషణ చాలా విప్లవాత్మకమయినది. కానీ కొద్దిరోజులలోనే అంతా శాంతమయింది.

వారివి ఇలాగే చాలా సంగతులు వున్నాయి. మాటి మాటికీ స్మృతి పథములో వస్తూపోతూ వుంటాయి. అలాగే ఒక మాట వినండి

నీవు ఎక్కడ కూర్చున్నావు? -

నేను ఒకసారి రాత్రి సమయంలో రైలుబండిలో కూర్చుని వున్నాను. యాత్రికులు నిద్రిస్తువుండిరి. నేను ఎక్కడయితే కూచుని వున్నానో అక్కడ ఒక వ్యాపారి సజ్జనుడు పడుకునివున్నాడు. వారు పడుకుని పడుకునే నన్ను కాళ్ళతో తన్నడం మొదలెట్టాడు. నేను మౌనంగా కూర్చున్నాను. ఆఖరికి విసిగిపోయి అతను 'ఎవరో గాంధీమహాత్ముడి శిష్యుడిలాగ వున్నాడే' అని అనుకుంటూ వూరకున్నాడు. దీనితో నాకు మనసులో దుఃఖము కలిగింది. నేను భిక్షుజీని అడిగాను 'నాకు ఇంత దుఃఖము ఎందుకు కలిగింది?' వారు నవ్వుతూ ఇలా అన్నారు 'నీవు ఆ సమయములో అటువంటి స్థానములోనే కూర్చున్నావు ఎక్కడ అయితే నీకు అవమానము లభించడమే ఉచితమో, అక్కడ' 'అదెలాగు' అన్నాను. వారు 'ఎవరైనా మురికి కాలువలో లేదా పెంట కుప్ప మీద కూర్చుంటే వారిపైన మురికినే వేస్తారు కదా! నీవు ఎపుడైతే అస్తి, రుధిర మాంస, చర్మ, మలమూత్రములతో కూడినదైన ఈ శరీరమును 'నేను' అనుకుని కూర్చుంటే ఇక నీకు మరి ఏమి దొరుకుతుంది?' అని అన్నారు. ఎవరైతే నిన్ను అవమానించారో వారు నీ హితైషులు అనుకో. అతను నీకు ఈ విధంగా ఉపదేశించాడు అవును ఈ శరీరమును 'నేను' 'నాది' అని అనుకుని కూర్చోవద్దు అని. నిన్ను నీవు శుద్ధ-బుద్ధ-నిరంజనములోనే స్థిరము చేసుకో. ఈ మాట ఇది వ్రాసేనాటికి ఇప్పటికి 50 సం॥ల క్రిందటి మాట. కానీ అపుడపుడు గుర్తువస్తూ వుంటుంది.

ప్రబుద్ధానందుడి ద్వారా సేవ -

భిక్షుజీ శరీరమును వదిలే కొన్ని నెలల ముందు వారు చాలా అశక్తులయి వుండిరి. మోకాళ్ళ నొప్పులు చాలా ఎక్కువగా వుండేవి. ఏమీ ఆధారము లేకుండా నిలుచున్నారంటే శరీరము అలా కంపించిపోయేది. ఒకటి పెద్ద వెదురు కర్ర పెట్టుకున్నారు. దాని సహాయంతో లేచి తిరుగుతూ వుండేవారు. కానీ వారి ముఖమండలముపై అదే దివ్యతేజస్సు వుండేది. కళ్ళల్లో అదే మెరుపు, అభినయ-కళ (మిమిక్రి) అదే వినోదపూర్ణమైన వ్యంగ్యశైలి, హాస పరిహాసము. ఈ సారి నా వెంట ప్రబుద్ధానంద కూడా వున్నారు. తరువాత మేమంతా కారులో హరిద్వార్ నుండి ఢిల్లీ వెళ్ళేటపుడు ప్రబుద్ధానంద్ కొన్ని రోజులు భిక్షుజీ సేవలో వుంటే మంచిది అనిపించింది. నేను తనతో చెప్పి అక్కడనే కారునుండి దింపివేశాను. అతను వారి దగ్గరకి వెళ్ళాడు. రోజల్లా సేవ చేశాడు. వూరిలో భిక్ష తీసుకుని భోజనం చేసేవాడు. రాత్రి సమయములో భిక్షాజీ అన్నారు 'నేను రాత్రి ఒంటరిగానే వుంటాను. నీవు ఇక్కడి నుండి వెళ్ళిపో' ప్రబుద్ధానందుడు అన్నాడు 'మీరు రాత్రిపూట బయటికి వెళ్ళాల్సిన అవసరము మలమూత్ర విసర్జన... మీకోసము అలాంటపుడు నేను మీకు సహాయము చేస్తాను. మీరు నన్ను ఇక్కడనే వుండనివ్వండి' అని బ్రతిమిలాడు. భిక్షుజీ అన్నారు 'మంచిదే సరే! నా ప్రాణాలు పోయేపని అయితే నీవు అరచి వాటిని నిలబెట్టగలవా? అలాకాదు అంటే, ఇక్కడ నీవు వుండవలసిన అవసరం ఏమీ లేదు. నేను జీవితమంతా ఒంటరిగానే గడిపాను. రాత్రి సమయంలో నాదగ్గర ఎవరూ వుండరు. నీవు ఇక్కడి నుండి వెళ్ళిపో'. దాని తర్వాత ప్రబుద్ధానందుడు రోజు ప్రతి దినము రాత్రి సమయంలో దగ్గరలోనే వున్న స్మశానానికి వెళ్ళి పడుకునేవాడు. పగటిపూట వచ్చి సేవ చేసేవాడు. మధుకరితో జరుపుకునేవాడు. దాదాపు మూడు నెలలపాటు వారి దగ్గర వున్నాడు. వారి సత్సంగము, మాటలు, వ్యంగ్యము, వినోదము, పూర్వపు మహాత్ముల మాటలు వినేవాడు, మరియు వారి అద్భుతమైన ఆత్మనిష్ఠయొక్క చమత్కారం చూస్తుండేవాడు. అందులో శోకమోహములకు కొంచెము కూడా తావుండేదికాదు.

డయరీ-ప్రబుద్ధానంద యొక్క డయరీలో వ్రాసుకున్న మాటల సారము మీ ఎదుట పెడుతున్నాను.

1. భక్తుడు భగవంతుని అడిగాడు 'ఓ ప్రభూ! నాకేమైనా కొంచెం ఇవ్వండి' భగవంతుడున్నాడు 'అరే మూర్ఖభక్తుడా! నీవే నన్ను కూర్చోబెట్టావు - నా కల్పన చేశావు. ఇపుడు అదేమి నీకు ఒక్క కన్ను పోయిందా లేక రెండు కాళ్ళు పోయాయా నన్ను యాచిస్తున్నావు'.

2. **ఆపై లీపై, ఆపై పోతై, ఆపై కాడైహోయి ।**
ఆంధీ పడ్‌కీ బేటా మాంగే, అకల్ రాండ్ కీ ఖోయీ ॥

స్త్రీలు గోడ మీద ఒక బొమ్మ చిత్రిస్తారు. తరువాత సాష్టాంగముగ భూమిపైన పడి దానితో తమ మనసులోని కోరిక తీర్చమంటారు. ఈ మాటలో వారిని బుద్ధిహీనులుగా తెలుపుతాయి.

3. ఎంత వరకు 'అహం', 'మమ' నశించదో అంత వరకు జగత్తు అంతా సత్యమనే అనిపిస్తుంది. 'అహం', 'మమ' నశించిపోయాక బంధనము - మోక్షము వీటి భేదము కూడా సత్యము కాదు.

4. దృశ్యమును గురించి ఊహాపోహలు చేయనవసరం లేదు. కార్య కారణములు రెండూ తుచ్ఛమైనవే. సాక్షి ద్రష్టను గురించి చింతన చెయ్యి. అన్ని సమస్యలకు సమాధానము కలుగుతుంది.

5. ద్రష్టా దృశ్య భావము కూడా వ్యవహారికమే. సహస్ర సహస్ర ప్రయత్నములు చేసినా కానీ ద్రష్ట దృశ్యము కాలేదు. ఆత్మ దేవుడు నిత్య ప్రాప్తుడు. వారు అప్రాప్తులయితే కదా వారిని వెదికేది.

6. నీవు నీవు అని అంటూ అలసిపోయాము. 'నీవు ఎపుడూ కళ్ళ ఎదుటికి రాలేదు. ఎపుడైతే అంతర్ముఖమై చూశానో అపుడు 'నేను' అన్న కృత్రిమ వేషము వేసుకుని నీవే నిలుచున్నావు. వస్తుతః నీవు నీవు కాదు. నేను నేను కాదు. ఈ భేదభ్రమ తొలగినపుడు అది హేతురహిత, దృష్టాంతరహిత వాంఙ్మనసాగోచర స్వరూపము సాక్షాత్ అపరోక్షమే.

7. మాన్యత పరోక్ష జ్ఞానములోనే వుంటుంది. సాక్షాత్ అపరోక్ష జ్ఞానములో మాన్యత కొరకు స్థానమే లేదు. చెప్పబడిన దృష్ట శృతములన్నియు మిధ్యయే. అహం, త్వం, తత్ ఇవి కూడా ఒక వ్యావహారిక ప్రణాళికయే, పరమార్థము కాదు. మిధ్య మిధ్య అవడము వలన ప్రపంచము సత్యముకాదు. అఖండాత్మయే సత్యమయినది.

8. జనులయితే ఆదేశము, ఉపదేశము, నిర్దేశము, సందేశము ఇస్తూనే వుంటారు. దాని వలన ప్రపంచములో ఏదో కొద్దిగా పరివర్తనము కలిగించి అని ఏమీ కనిపించదు. అక్కడికక్కడే అదే దర్భ అదే గడ్డి ఎలాగున్నది అలాగే!

9. అన్ని విభేదాలు కూడా మనసు స్ఫురితమైనపుడే కలుగుతాయి. మనసు శాంతమయినపుడు ఏమీ తెలియదు. అందువలన అనుభవమన్న గీటురాయిపై భేద భావము సరిగా తెలియబడదు.

10. మధుర వాక్కులు, నియమయుక్త వ్యవహారము మరియు అందరికి ఏదో కొంత ఇవ్వడము - ఒక వేళ ఇవి నీ జీవితములో వుంటే, అపుడు సచ్చిదానంద ఘనుడు నీకు ప్రాప్తించినట్లే, దూరము లేదు.

11. **రూపన రేఖ నరంగ్ కఛు, తిహూ గుణసే ప్రభు భిన్న ।**
తిసహీ బుఝాయే 'నానకా' జిసుహోవే సుప్రసన్న ॥

12. స్వయంగా తత్త్వసాక్షాత్కారము జరగనంత వరకు, గురువు యొక్క వాణి కూడా పరోక్ష అర్థమునే తెలుపుతుంది, కానీ సాక్షాత్ కాదు.

13. **యహ మన బ్రహ్మ యహ మన శివ ।**
యహ మన పంచతత్త్వ కా జీవ ॥

14. **అంధలా నీచ జాతి పరదేశీ క్షిణ ఆవే క్షిణ జావై ।**
తాకి సంగతి నానక్ కరతా క్యోకర్ మూఢా పావై ॥

15. స్వరూపానందమే బ్రహ్మానందము. స్వరూపాతిరిక్తము వేరే ఏదైనా బ్రహ్మ వున్నది అన్న కల్పన కూడా అమంగళకరమే.

16. ఎలాగైతే నటుడు అభినయము చేసేటపుడు సంకేతముల ద్వారా ఆ భావయు యొక్క భావమునే ప్రదర్శిస్తాడు. అలాగే శృతి భావాభావ నిరూపణము చేస్తుంది. స్వప్నంలో దేశ-కాల-వస్తు-వ్యక్తి, క్రియ, అంతఃకరణము జీవుడు ఇవి ఏమీ వుండవు కానీ వీటి ప్రతీతి కలుగుతుంది. స్వల్ప కాలంలో, స్వల్ప దేశములో, స్వల్పవస్తువులు ఇంతలా అవడము సంభవము కాదు. కల చెదిరి పోగానే ఇక ఏమీ వుండదు. సుషుప్తి ఈ మాటను ఇంకా స్పష్టము చేస్తుంది.

17. మనసు అన్నదే లేనపుడు సాధన-సాధ్యము, ఆరాధన-ఆరాధ్యము, ఏమీ వుండవు. అందువలన ఇదంతా కేవలం మానసికమే. ఆత్మ-పరమాత్మల ఏకతా జ్ఞానము కలిగినపుడే మనసు నశిస్తుంది, లేకుంటే లేదు.

18. పరమార్థసత్యము ఆత్మలో, తూర్పు-పడమరలు, బాహ్య-అభ్యంతరములు మొదలైన 'దేశము' కాదు. భూత - భవిష్యాది 'కాలము' కాదు. ఏదైతే బాహ్యాభ్యంతరములాదిగా భాసించుచున్నదో అది అజ, అవినాశి పరమాత్మయే.

19. **పద్మే మూఢజనే దదాసి ద్రవిణం విద్వత్సు కిం మత్సరః**
నాహం మత్సరిణీ న చాపి చపలా నైవాస్తి మూర్ఖే రతిః ।
మూర్ఖేభ్యో నితరాం దదామి ద్రవిణం తత్ కారణం శ్రూయతాం
విద్వాన్ సర్వ జనేషు పూజితతనుః మూర్ఖస్య నాన్యా గతిః ॥

తల్లీ!లక్ష్మీదేవి! నీవు మూర్ఖులకు ధనము ఇస్తూ వుంటావు. విద్వానులతో నీకేమైన కార్పణ్యమా? ఈ ప్రశ్నకు లక్ష్మీదేవి ఇలాగ జవాబిస్తుంది, 'నాకు మూర్ఖుల పట్ల ప్రీతీ లేదు, విద్వానుల పట్ల ద్వేషమూ లేదు. నా భేద వ్యవహారమునకు కారణము వినండి, విద్వానులకు సర్వత్రసత్కారము దొరుకుతుంది. మూర్ఖులకు నాకంటే వేరే గతిలేదు.

20. హే దారిద్ర్య నమస్తుభ్యం సిద్ధోహం త్వత్ ప్రసాదతః ।
పశ్యామ్యహం జగత్-సర్వం నమాం పశ్యతి కశ్చన ॥

ఓ దరిద్ర దేవతా! నేను నీకు నమస్కరిస్తున్నాను. నీకు కృపాప్రసాదము వలన నేను సిద్ధుడిని అయ్యాను. నేను అందరినీ చూస్తాను, కానీ నన్ను ఎవ్వరూ చూడలేరు.

21. వస్తుతః అభావము అనేకము కాదు. ప్రాగభావము సాంతము. ప్రధ్వంసాభావము ఇది. అన్యోన్యాభావము సాది, సాంత ఉభయాత్మకము. ఇందు సమానము కూడా ఏవీ వుండవు. అందువలన ఈ అభావములను పదార్థములు అని అనుకొనుట సమీచీనము కాదు.

22. కేవలం అత్యంతా భావమే అటువంటిది, దేనినైతే అనాది, అనంతము అని అనవచ్చు. కానీ ఈ అత్యంతా భావమునకు ప్రతియోగి భావము ఏది? దేనికైతే అభావము కలుగుతుందో అదే అత్యంతాభావము యొక్క ప్రతియోగి. అటువంటి స్థితిలో ప్రతియోగి మరియు అత్యంతాభావము ఒకే దగ్గర వుంటాయి, ఒకేసారి ప్రతీతములవుతాయి. ప్రతియోగి త్రైకాలికము కాదు, అత్యంతాభావము త్రైకాలికము. అజ్ఞుడి దృష్టితో ప్రతియోగి పదార్థము, యదార్థముగా కనిపించినా, తత్త్వజ్ఞానం యొక్క దృష్టితో అది అనిర్వచనీయముగానే ప్రతీతమవుతుంది. ఎపుడైతే అనాది, అనంత, అత్యంతాభావము తన అద్వితీయ అధికరణ ప్రత్యక్చైతన్యాభిన్న బ్రహ్మతత్త్వముతో వేరు కాలేదో అపుడు బ్రహ్మాతిరిక్త వస్తువే వుండదు. అందువలన సాధారణ మనుష్యుల యొక్క దృష్టికి తత్త్వముయొక్క దృష్టికి ఇదే భేదము. మొదటి దానికేమో ప్రపంచమే సత్యము, తత్త్వజ్ఞానికేమో ప్రపంచము భాసమానమైనప్పటికీ ఆత్మాతిరిక్తమయిన సత్తా వుండదు. ఇందులో వ్యవహారము, ప్రతిభావసము మరియు పరమార్థ సత్తా యొక్క త్రైవిధ్యము కూడా కల్పితమే అవుతుంది. మాయ, జీవుడు మొదలైనవి కూడా అనాది కాదు, అనాదిత్వేన కల్పితములు. అందువలన ప్రత్యగాత్మయే సత్యము, అబాధితము, అద్వితీయము మరియు వ్యాప్త-వ్యాపక భావముతో రహితము. దీనికి దేనితోను అన్వయములేదు, దేనితోను వ్యతిరేకము లేదు. అన్వయ-వ్యతిరేకము ద్వితీయ వస్తువుతోనే అవుతుంది. ఎక్కడైతే ద్వైతము లేనేలేదో అక్కడ అన్వయ వ్యతిరేకము యొక్క కల్పన కూడా వుండదు.

వారి భక్తులు, వారి జీవనము -

ప్రబుద్ధానందుడు అక్కడ మూడు మాసములపాటు వున్నాడు. భిక్షఅడుక్కుని తినేవాడు, శ్మశానములో పడుకునేవాడు. రోజల్లా సేవ చేసేవాడు. భిక్షుజీకి లేవడం కూచోవడం కూడా కష్టమైనది. పడుకుని పడుకునే అన్ని పనులు జరుగుతూ వుండేవి.

వారి సేవకులలో బెంగుళూరుకు చెందిన కొందరు సేవికలు ముఖ్యులు. ఇపుడు నాకు వారు సరిగా గుర్తులేరు. భిక్షుజీ శరీరము వదిలిన తర్వాత వారు ఒక ఫొటో ఒక కాగితము ఇచ్చి వెళ్ళారు-పుస్తకము వ్రాయడానికి, కానీ ఆ ఫొటో బ్లాక్ తయారుచేసేట్టుగా లేదు, ఆ కాగితములో కూడా ఏదీమహత్వ పూర్వకమైన మాట లేదు. దానితో పాటు వారు తమ జీవితాలు, తమ ఫొటోలు ప్రచురించాలని అనుకున్నారు. అందువలన నేను వ్రాయలేదు. వారిచ్చిన వెయ్యి రూపాయలు కూడా నా దగ్గరే వున్నాయి. తర్వాత నాకు వారితో సంపర్కమే కలుగలేదు. భిక్షుజీ యొక్క స్మరణ ఇపుడు కూడా మాటిమాటికీ కలుగుతువుంటుంది. ప్రబుద్ధానందుడితో ఇంకా ఇతరులతో కూడా వారిని గురించిన చర్చ ఎన్నోసార్లు జరుగుతూనే వుండేది. వారు ఒక అద్భుతమైన సంత్ మహాత్ములు. వారి జీవనము ఏకరసము.

శ్రీ హరి బాబాజీ మహరాజ్

బాబా సర్వత్ర పరిపూర్ణముగా వున్నారు -

ఏ మహాపురుషులయితే పరబ్రహ్మ పరమాత్మతో అభిన్నులవుతారో, వారి స్థూలశరీరము వున్నా లేక పోయినా వారి విద్యమానతలో ఏ లోపమూ వుండదు. వారు స్థూల శరీరముతో కనిపించనపుడు, పరమార్థతః పరమాత్మరూపంతో సర్వత్ర విద్యమానులై, వర్తమానులై వుంటారు. అధికారతకలిగిన (యోగ్యత) వ్యక్తి ఎక్కడైనా కూడా వారిని దర్శించగలుగుతారు. వారి ఆకృతి సూక్ష్మరూపంలో వుంటుంది. మరి తన భక్తుల హృదయములో లింగశరీరము భంగమయ్యేంత వరకు వుంటుంది. ఇందులో సందేహము లేదు, శ్రీహరిబాబాజీ వారు ఈ రోజు ఎప్పటికీ కూడా బ్రహ్మరూపంతో, ఈశ్వరరూపముతో, ఆత్మ రూపముతో మరియు విరాట్రూపముతో సర్వత్ర పరిపూర్ణులైవున్నారు.

మృత్యువు వారి లీల -

వారు ఉపదేశాలలో కానీ, సామాన్య వార్తాలాపనలో కానీ ఎప్పుడూ కూడా మృత్యువును అంగీకరించలేదు. మహాత్ముడు శరీరముతో కూడా అమరుడే అని అనేవారు. వారు కల్పించటము, కల్పించకపోవడం అది కూడా ఒక దాగుడు మూతలాట లాంటిదే. వారు నిజమైన ఆటగాడు. ప్రకట రూపములో వున్నపుడు కూడా వారు కబడ్డీ లాంటి ఆటలు ఆడేవారు, ఇపుడు దాక్కుని (లీలా సంవరణం జరిగిన తర్వాత) కూడా ఒక లీలనే చేస్తున్నారు. వారి చిరునవ్వు, పెదవుల కదలిక, వారి ప్రేమ నిండిన వదనము, వారి కర-కమలముల స్పర్శ, వారి మధుర వాక్కులు

లోకులకు ప్రత్యక్షంలాగ అనిపిస్తుంది. వారి కరుణాకోమల కరకమలముల ఛత్రఛాయ ఇప్పుడు కూడా భక్తజనుల రక్షణకై, వారి మంచికై తత్పరమయివున్నది.

సమయ నియమము -

వారి జీవితంలో ఇది ఒక అద్భుత చమత్కారము. వారి ఒక క్షణము కూడా వ్యర్థమయ్యేది కాదు. రాత్రి ఉత్తరార్థములో 2.30, 3గంllలకంతా మేలుకునేవారు. 4గంllల నుండి సామూహిక సంకీర్తనము ప్రారంభమయ్యేది. 9గంllల నుడి రాసలీల చూచేవారు. వారు వ్యాహ్యాళికి బయటికి వస్తే లోకులు తమ గడియారములలో సమయాన్ని సరిచేసుకునేవారు. ఎవరైనా ఒక విలక్షణులైన మహాత్ములలోనే అటు వంటి సమయపాలన సంభవము. ఒకసారి ఇలా అన్నారు, 'కేవలము 29 నిమిషాలు మాత్రమే ప్రవచనము జరుగుతుంది'. దీని అభిప్రాయము ఏమిటంటే సర్వదా సావధానులై వుండాలనే. జీవితంలో అసావధానత, అనియంత్రణము ప్రవేశించ కూడదు. అనియంత్రణ అధర్మము. బృందావనములో ఒకసారి మహామహోపాధ్యాయ శ్రీగిరిధరశర్మ చతుర్వేది వ్యాఖ్యానము చేస్తూవుండిరి. సమయము దాటిపోయింది, బాబా ఆజ్ఞననుసరించి వారి సేవకులు గంటకొట్టారు. పండిత్ అఖిలానంద కవిరత్నకు కోపం వచ్చింది. కానీ ఏం చేస్తాము? మర్యాదను ఉల్లంఘించడము పాపం కదా!

మనసు యొక్క ఏకాగ్రత -

ప్రొద్దుట, సాయంకాలము వారు వ్యాహ్యాళికి వెళ్ళేందుకు బయలుదేరేవారు ఎక్కడ చెయ్యిపెట్టుకుని బయలుదేరేవారో తిరిగి వచ్చేటప్పుడు కూడా అక్కడే వుండేది. 5మైళ్ళు వెళ్ళారు వచ్చారు కానీ చెయ్యిమాత్రం అక్కడికక్కడే. అంతర్ముఖులై వుండేవారు. ముందు ముందు సేవకుడు వెళ్ళకపోతే మార్గము మరిచిపోయేవారు. కుడి, ఎడమలు చూచేవారు కాదు. ఎదుట కూడా దూరం వరకు దృష్టి సారించేవారు కాదు. ఎవరు వచ్చారు, ఎవరు పోతున్నారు అని ఏమీ ధ్యానం వుండేది కాదు.

గొప్పవారి పట్ల ఉపేక్ష -

అలాగ వారి జీవితంలో వినయము, చిన్న పిల్లల లాంటి సరళస్వభావము వుండేది. మేము చిన్నవారమయినా మేము వెళితే కూడా లేచి నిలుచునేవారు,

దండవత్ ప్రణామము చేశేవారు ఎంత చిన్న పని అయినా తన స్వహస్తాలతో చేసుకునేవారు. అందరితో కలసి కూర్చునేవారు. మూర్తిమాన్ నిరభిమానత అని అనిపించేది. కానీ ఎవరైతే తమను తామే స్వయంగా గొప్పవారమని బడాయిలు చెప్పుకుంటారో వారిని కన్నెత్తి కూడా చూచేవారుకాదు. బృందావనములో శ్రీ ఉడియా బాబాజీ ఆశ్రమములో భిన్న భిన్న సాంప్రదాయములకు చెందిన పెద్ద పెద్ద ఆచార్యులు వస్తుండేవారు, కానీ వారిని పట్టించుకునేవారు కాదు. హరిద్వారములోని సప్తసరోవము లోని సప్తఋషి ఆశ్రమమునకు దేశములోని ఒక ప్రసిద్ధ నాయకుడు వచ్చి ప్రణామము చేశారు, కానీ వారు కళ్ళుమూసుకుని కూర్చునేవారు. చెప్పినా కూడా వారు వారికి అభిముఖులవలేదు. జగత్తు ఎవరిని చాలా గొప్పవారు అని అంటుందో అటువంటి వారి పట్ల బాబాకు మహత్వబుద్ధి వుండేదికాదు.

గురు నిష్ఠా -

వారు బాల్యావస్థలో తన గురుదేవులైన స్వామి శ్రీసచ్చిదానందజీ మహరాజ్ శ్రీవారికి (హోశియార్‌పూర్‌లో) విసనకఱ్ఱతో విసురుతూండేవారు. ఈ అభ్యాసము వారికి ఎంతగా పక్కా అయిందంటే రామలీల, శ్రీచైతన్యలీల, రాసలీల మరియు శ్రీమద్భా గవత సప్తాహములలో కూడా గంటల తరబడి నిర్విరామముగా అలా నిలుచుని పంఖా విసురుతూనే వుండేవారు. ఒక రోజు అడిగితే వారు నాకు ఇలా చెప్పారు - రాముడిని చూడను, కృష్ణుడిని చూడను, అక్కడ గురుదేవుడు పడుకుని వున్నారని అనిపిస్తుంది, నేను సేవచేస్తున్నాను అంటే'.

అదే సంవత్సరము జన్మాష్టమి తర్వాత రెండు రోజులకు వృందావనం నుండి (ఆఖరుసారి) వెళ్ళేటపుడు వున్నట్టుండి వారి నోటి వెంట ఈ మాట 'నా జీవితంలో నా గురుదేవులపట్ల ఎటువంటి శ్రద్ధ కలిగిందో అలాంటి శ్రద్ధ మరల ఎవరిపైన కలగలేదు' అని వెలువడింది. ఒక్కోసారి వారు నెలమొత్తం పుర్తిగా నిరంతరం రామలీల చేశారు, కానీ వారికి ఆ రాముడు వేసిన పాత్ర నల్లగా వున్నాడా? తెల్లగా వున్నాడా అని తెలిసేది కాదు.

వారి జీవితంలో ఎలాంటి గురునిష్ఠను చూడగలిగాము అలాగ అన్యత్ర దుర్లభము. వారి ఏకమాత్ర గురువు శ్రీస్వామి సచ్చిదానందగిరియే. వారు మాటిమాటికీ గురుదేవుల ఉన్మనీస్థితిని వర్ణిస్తూ ప్రేమతో పులకితులయ్యేవారు. వారి స్థానమునే సేవించేవారు. వారి కృప వలననే బాబాకు అచంచలమైన బ్రహ్మనిష్ఠ ప్రాప్తించింది. వారు చెబుతూ వుండేవారు - మహారాజశ్రీ యొక్క దృష్టి, సంకల్పముతోనే లోకులకు ఆత్మసాక్షాత్కారము, జీవన్ముక్తి కలుగుతూ వుండేది. శ్రీ అచ్యుతమునిజీ మహరాజ్‌తో వారు కేవలం ప్రస్థానత్రయి అధ్యయనము చేశారు. మునిజీ వారికి పురుషప్రయత్నము చేయాలని ప్రేరణకూడా ఇచ్చారు.

పురుషప్రయత్నమునకై ప్రేరణ -

శ్రీ హరిబాబాజీ మహారాజ్ తను యుక్తవయస్కులుగా నున్నపుడు గంగ ఒడ్డున విచరణ చేస్తూ 'భేరియా' గ్రామంలో నున్న శ్రీఅచ్యుతమునిజీ మహరాజ్ వారి దగ్గరకు వెళ్ళారు. వారు మునిజీని ఇలా ప్రార్థించారు 'మహరాజ్! వృత్తి తన స్వరూపములోనే నిలిచివుండేలాగ నన్ను ఆశీర్వదించి కృప చూపండి. మునీజీ వయోవృద్ధుడు. విద్వాన్. భారతదేశపు సుప్రసిద్ధ సంత్‌మహాత్ముడు - కొంచెం వంగి కూర్చుని వున్నవాడు, వారి మనవి వినగానే లేచి సీదాగా కూర్చుని ఇలా అన్నారు - అరే! హరి! నీవు సోమరివి కావాలనుకుంటున్నావా ఏమి? కృపా భిక్ష అడగటమంటే అర్థం సోమరివి కావడమే. నీవు స్వయంగా నీ ప్రయత్నముతో (నీ పౌరుషముతో) వృత్తి యొక్క అస్తిత్వమునే నామరూపాలు లేకుండగా చేసేయ్!' అన్నారు.

శ్రీహరిబాబాగారు ఈ ప్రసంగమును ఎంతో ప్రేమతో ప్రసన్నతతో అపుడపుడు వినిపించేవారు. వేదాంతము వేదాంత గురువును శ్రీహరిబాబా వదిలిపెట్టాడు అని ఎవరైతే అనేవారో వారు మిథ్యావాదులు. బాబా బ్రహ్మనిష్ఠులై వుంటూనే లోకకల్యాణం కొరకు భక్తియొక్క ప్రచారము చేశారు, మరియు నామ సంకీర్తనము చేశారు.

పౌరుష ప్రకాశము -

శ్రీహరిబాబాజీ యొక్క జీవితములో పౌరుషమే కాదు, మహాపౌరుషము యొక్క ప్రకాశము వుండేది. వారు జనులలో కణ-కణములో భగవంతుడినే దర్శించేవారు.

వారి అన్నిపనులు భగవద్దృష్టితోనే జరిగేవి. రమారమి 700 గ్రామాలు, పశువులు, రైతులు గంగాజీ యొక్క వరదతో కష్టాలపాలవ్వడము ఎపుడైతే వారు చూశారో అపుడు వారే స్వయంగా గంప, పార తీసుకుని వంతెన కట్టకట్టే పనిలో మునిగి పోయారు. గుంపులు గుంపులుగా జనులు గుమిగూడారు. అన్న సత్రం మొదల యింది. ప్రజల మనోరథము తీరినది. చమత్కారముపైన చమత్కారము. శ్రీ ఉడియా బాబాజీ మహరాజ్ వారు వచ్చి అక్కడే విరాజమానులయ్యారు. 'వంతెన కట్టేటపుడు ఒక గంపమట్టి వేయడము భగవంతుడిసేవ, అలాచేస్తే ఏ కోరికలున్నా అవి నెరవేరతాయి' అని ఘోషణ చేయించారు. కేవలము పదినెలలలోనే అంత పెద్ద వంతెన నిర్మించగలిగారు, దానికి ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు అయివుండేది. ఆ సమయములో వున్న బ్రిటీషు సర్కారువారు కూడా తమ ఓటమిని ఒప్పుకున్నారు. దాని పొడవు 22మైళ్ళు దాదాపుగా వుంటుంది. బాబాగారు అన్ని వస్తువులను భగవద్రూపంగానూ, అన్ని పనులను భగవత్సేవగా భావించేవారు అలాగే చెప్పేవారు.

నింద వినవద్దు -

వారిలో ఒక అద్భుతమైన విశేషత వుండేది, వారు ఎవరిని గురించిన నింద కానీ అసలు వినేవారు కాదు. నిందించే వారితో ఇలా అనేవారు 'భగవన్నామము జపించు, లేదా బయటకు పోయి ఏదైనా పని చెయ్యి' ఒకసారి ఒక మాసపత్రికలో ధారావాహికంగా రెండు మూడు సార్లు సాధువులను గురించిన విమర్శ వచ్చింది. దానితో వారు దానిని చదవడమే మానేశారు. 'నిందాస్తుతులు రెండూ చెయ్యకూడదు అని అనేవారు. కానీ వారు ఎంత సాధారణమైన మనిషిలోని ఒక చిన్న సద్గుణమైనా సరే ప్రశంసిస్తుండేవారు.

పెద్దవారి ఆశ్రమము -

ఒకసారి వారు ఇలా అన్నారు 'మనకంటే పెద్దవారు దొరకకపోతే ఏ పశు, పక్షి లేదా రాయి కూడా మనకంటే గొప్పది అనుకుని దాని క్రింద వుండాలి. పెద్దల ఛత్రఛాయలో వుండడము వలన మనలో దంభము, అభిమానము మొదలైన దోషములు రావు. పూజ, ప్రతిష్ఠ కూడా వారికే చెందుతుంది. వారి జీవితములో ఇది

ప్రత్యక్షముగా చూశాం. వారు ఎపుడూ ఎవరో ఒక గొప్ప మహాత్ముల వెంటనే వుండేవారు.

వినోద స్వభావము -

సాధారణముగా జనులు బాబాను గంభీర ప్రకృతి గల వారిగా అనుకునేవారు. కానీ ఎవరైతే వారి దగ్గర వుండేవారో వారితో బాబా చాలా హాస్యం చేస్తూ వుండేవారు. భక్తులు కూడా వారిని నవ్వించడానికి రకరకాలుగా వినోదాలు చేస్తుండేవారు. ఒకసారి బాబాకు గంగానది దాటవలసి వచ్చింది. నావపైన వెళ్ళి కూర్చున్నారు. వారి వెంట ఇంకా 20, 25మంది జనం వున్నారు. పడవనడిపే నావికుడు అన్నాడు 'బాబా! మీది, మీ వెంట వున్నవాళ్ళది కిరాయి తీసుకోను. మీరు చెప్పండి మీ వెంట ఎవరెవరున్నారు?' బాబా అన్నారు 'తమ్ముడూ! నేను అయితే ఒక్కడినే. నా వెంట ఎవరూ లేరు'. నావికుడు మిగతా వారి దగ్గర డబ్బులు అడిగాడు, సంయోగవశాన ఎవరి దగ్గరా డబ్బులు లేవు. అందరు దిగి పోవలసివచ్చింది, బాబా ఒక్కరే నది దాటారు. వేరేవాళ్ళంతా వూరి నుండి డబ్బులు తెప్పించుకుని మరల నదిదాటారు. ఇది చాలా తమాషాగా జరిగింది.

ఇతరులతో అప్రభావితుడు -

టాట్‌వాలా నారాయణస్వామీజీ హరిద్వార దగ్గర బహాదురాబాదులో విడిది చేసి వున్నారు. శ్రీహరిబాబాజీ వారి దర్శనం కొరకు వెళ్ళారు. 'రాత్రి నాకు కలలో నారాయణుడి దర్శనం కలిగింది. వారు నిన్ను గుర్తుపెట్టుకున్నారు. నారాయణుడు ఆజ్ఞ ఇచ్చారు - హరిబాబాకు ఇక ఇపుడు సంకీర్తనము, ఉత్సవములు, జన సందోహంతో వైభవంగా చేసే ఈ పనులన్నీ వదులుకొని ఏకాంతములో వుండాలి, వేదాంత చింతన చెయ్యాలి. కాబట్టి నీవు ఇక అలాగే చెయ్యి,' అని శ్రీనారాయణ స్వామీజీ అన్నారు. అపుడు శ్రీహరిబాబావారు చాలా వినయంగా ఇలా జవాబిచ్చారు 'స్వామీజీ నేనుకూడా నా జీవితాన్ని కొద్దోగొప్పో భగవన్నామము తీసుకుంటూనే గడిపాను. ఒకవేళ వారు నాపై కృప చూపిస్తే, ఆదేశమిస్తే సీదా నాతో నేరుగా ఎందుకు చెప్పలేదు? మీ ద్వారా ఎందుకు (సందేశం) పంపించారు? ఏమి నేను వారి

స్వప్నాదేశమునకు కూడా అర్హుడిని కానా? మరి ఎపుడైతే ప్రభువుకు నాపై కృప వుంది, స్మరణవుంది, ఆజ్ఞ ఇచ్చారు మరి అపుడు వేదాంత-చింతన వలన ఏమి సిద్ధిస్తుందో అది వారు స్వయంగా చెయ్యలేరా ఏమి?' ఇలాగని బాబా వారికి ఆదరంగా ప్రణామము చేసి తిరిగివచ్చారు.

జీవన్ముక్తి యొక్క భూమికలు బాధితములు -

ఇదే విధమైన ప్రసంగము ఇంకొకటి జరిగింది. పంజాబ్‌లో ఎవరో చాలా ప్రఖ్యాతిగాంచిన మహాత్ముడు వుండేవాడు. వారు ఆరవభూమికలో ప్రవేశించిన మహాత్ములని జనులకు విశ్వాసము వుండేది. లోకులతో చాలా తక్కువగా కలిసేవాడు, మితభాషి, ప్రపంచ-విస్మృతిలో వున్నట్లుండేవాడు. ఎపుడైన మాటాడినా చాలా మెల్లగా నిదానంగా మాట్లాడేవారు. కుటీరము ఎపుడూ మూసి వుండేది. వారి శరీరము యొక్క సేవ కూడా వారి సేవకులు చేసేవారు. ఒక సాధువు ఆ మహాత్ముడిని చాలా ప్రశంసిస్తూ వారిదగ్గరికి హరిబాబాగారిని తీసుకువెళ్ళారు. వారు కూడా హరిబాబాతో అలాగే అన్నారు 'ఇకనైన జన-సంసర్గము, సంకీర్తనము మొదలైన ఈ విక్షేపాలను వదిలి బ్రహ్మాత్మైక్య చింతన చెయ్యి, స్వస్వరూపములో స్థితుడవు అయిపో' అని అన్నారు. బాబా అత్యంత వినయముతో వారి ఉపదేశమును విని వెళ్ళిపోయారు. వారి జీవనసరళిలో ఏ మాత్రము అంతరమేర్పడలేదు. వాస్తవానికి బాబామొదటే ఏడుభూమికలు దాటిపోయారు. వారిమనసులో వీటి పట్ల కూడా ఏమీ మహత్వ బుద్ధిలేదు. ఎవరిలో అవిద్యలేదో వారికి చింతన యొక్క ఆవశ్యకత యెక్కడ? సమ్యక్ బోధ కేవలము ప్రవృత్తినే కాదు, నివృత్తిని కూడా ఉపమర్దనము చేస్తుంది. వారి నవ్వడం - మాట్లాడడము, నడవడం, తిరిగడం అన్నీ లోక కల్యాణము కొరకు బ్రహ్మరూపముగానే వుండేవి. వారిని ఒక సాధకుడు అని అనుకుని వారికి ఉపదేశములనిచ్చేవారు, వారి వాస్తవిక స్వరూపాన్ని అర్థం చేసుకోలేదు.

వారివి అన్నీ విషయాలు మంచిగావుండేవి -

ఒకరోజు శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్‌తో ఎవరో ఇలా అడిగారు 'శ్రీహరిబాబాజీను ఫలానా పని చెయ్యకుండా మీరు ఆపండి' అని. మహరాజశ్రీ

అన్నారు 'బాబా సాక్షాత్ పరమేశ్వరుడు. వారు ఏమి చేస్తే అది సరియైనదే అవుతుంది. నేను ఎందుకు వారిని వారించాలి? నీకు ఏదైనా వారి మాటు నచ్చకపోతే నీవు స్వయంగా వెళ్ళి వద్దని చెప్పు' అన్నారు. ఒకసారి ఒక భక్తుడు వచ్చి మహారాజశ్రీతో ఇలా అన్నారు 'ఈ విషయంలో శ్రీహరిబాబాజీ ఇలా నిర్ణయం తీసుకున్నారు. మీరేమంటారు?' వారన్నారు 'బాబా ఏమి చెప్పినారో అది వేద వాక్యము. వారు చెప్పిన తర్వాత కూడా నీవు నన్ను అడగడానికి వచ్చావా?' మహారాజశ్రీ గుఱించి కూడా ప్రాయః బాబా కూడా అలాగే చెప్పేవారు. అసలు ఇద్దరూ ఒకటే, పరస్పరము ఒకరు మరియొకరి మాటలను తమవిగానే భావించేవారు.

విక్షేపము కూడా రామలీల -

ఢిల్లీలో ప్రతి సంవత్సరము విశాల రామలీల ప్రోగ్రాం ఏర్పాటు చేసేవారు. దానికి పది లక్షల దాకా జనసమ్మర్ధము వచ్చేది. విదేశీ రాజదూత వచ్చేవారు. మన రాష్ట్రపతి, ప్రధానమంత్రి కూడా వచ్చేవారు. కోలాహలము పరాకాష్ఠకు చేరుకునేది. భక్తజనులు బాబాను కూడా రామలీలకు తీసుకునివెళ్ళారు. వెంట వైంకుఠదాసు అనే సేవకుడు వున్నాడు. అతడు అన్నాడు 'బాబా! ఇక్కడ చాలా జనం, కోలాహలం, విక్షేపము, అశాంతి వున్నది' బాబా నవ్వుతూ 'పిచ్చివాడా! నీవు ఇక్కడికి వానర-రాక్షస యుద్ధము చూడటానికి వచ్చావా? ఏకాంత-శాంత-సమాధి ఆనందమును పొందడానికి వచ్చావా? ఈ అరుపులు, చప్పుళ్ళు ఈ కోలాహలమయితే ఇది యుద్ధభూమిది. ఇక్కడయే విక్షేపమునే భగవంతుడి లీలగా అనుభవం చేసుకోవాలి. మన మనసుని చూడవద్దు. భగవంతుని లీలలను చూడు' అది ఎంతటి అద్భుతమైన నిష్ఠ! అపరిపక్వ వేదాంతి, యోగి వారిని ఎలాగ అర్థం చేసుకోగలరు?

నియమపాలన -

అలాగ చూస్తే బాబా ద్వారా చాలా ప్రచార కార్యక్రమం జరిగింది. ఉత్తర భారతదేశములో వారు భగవన్నామముతో, పావన సంకీర్తనముతో వాతావరణమును పవిత్రము చెయ్యనివూరు, నగరము లేదనే చెప్పవచ్చు. వారి పవిత్ర ఆదర్శ చరిత్ర, ప్రేమమయ నామధ్వని చెవిన పడని ఆధ్యాత్మిక అభాగ్యులెవరూ వుండరు. ఇంత

అయినా కూడా వారిలో ప్రచార భావనలేదు. దీనికి ఒక ఉదాహరణము చూడండి. వృందావనములో శ్రీ ఉడియాబాబాజీ ఆశ్రమములో వీరు భగవద్గీతపై శ్రీధరీటీకా ననుసరించి ఉపదేశము చేస్తున్నారు. ఒక అపరిచిత వ్యక్తి మధ్యలో లేచి మాట్లాడాడు 'మహరాజ్! కొంచెం గట్టిగా మాట్లాడండి. వినిపించడము లేదు'. బాబా అన్నారు 'భయ్యా! మేము మా నిత్యనియములు పూర్తిచేయటం కొరకు గీతాపాఠము చేస్తాము. నీకు వినిపించకపోతే, నీ మనసును మరింత ఏకాగ్రము చెయ్యి, దగ్గరికి వచ్చి కూర్చో. ఇంకా సంతోషము కలుగక పోతే లేచి వెళ్ళిపో, మేము భగవంతునికి వినిపించడానికి పారాయణ, కీర్తన చేస్తాము. మనుష్యులకు వినిపించడానికి కాదు.

ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా -

ఎవరో ఒక ప్రేమీ భక్తుడు బ్రతిమాలితే వారి ఇంటికి భోజనం చెయ్యడానికి వెళ్ళారు. సంయోగవశంగా వారి పత్ని బయట వుడే రోజులు. అందుకని ఆ భక్తుడే స్వయంగా స్వహస్తాలతో భోజనం తయారుచేశాడు. బాబా భోజనానికి కూర్చునపుడు చూస్తే బంగాళాదుంపల కూర ఆముదముతో తయారుచేశాడు. బాబా ఆ భక్తుడికి ఏమీ చెప్పలేదు. 'చాలా బాగుంది' అని మెల్లమెల్లగా అంతా తినేశారు. ఆశ్రమానికి తిరిగి వచ్చాక విరోచనాలు మొదలయ్యాయి. సేవకులు ఎందు వలన ఇలా జరిగిందంటే 'విరోచనాలు అవడానికి మందు తీసుకున్నానన్నారు'. భోజనం పెట్టే ఆ భక్తుడు ఎక్కడ బాధ పడతాడో అని తనే ఇబ్బంది పడ్డారు చాలా సంకోచపడేవారు. శ్రీ ఉడియాబాబాజీ తో ముఖాముఖి మాట్లాడేవారుకాదు. వారు దగ్గర కూర్చునప్పటికి ఏమైనా అడగవలసి వస్తే ప్రక్కవారి ద్వారా అడిగించేవారు. బాబా వారిది చాలా కోమల హృదయము.

కేవలము గుణదర్శనము -

వృందావనధామములో ఒక విద్వాన్ ఇంట్లో కథా శ్రవణమునకు వెళ్ళేవారు. ప్రవచనకారుడు భక్తిరసాలు బాగా తెలిసిన వాడు. బాబా వెళ్ళి అందరికంటే వెనుక కూర్చునేవారు. చూపు క్రిందికే వుండేది. కథసమాప్తి అవగానే మౌనంగా లేచి వచ్చేవారు. వెంటవెళ్ళే ఒక సేవకుడు ఒక రోజు ఇలా అన్నారు 'భగవాన్! ఈ సజ్జనుడి కథ

ఉచ్ఛకోటికి చెందినది. కానీ వీరు చాలా దర్జాగా వుంటున్నారు. కూర్చునే దగ్గర హాలులో ఒక్కొక్క గూటానికి వేరు వేరుగా శాలువాలు, దుశ్శాలువలు వేలాడ తీసి వుంటాయి. ఇదేమిటో?' బాబా తన సేవకుడిని కోప్పడ్డారు. 'నీవు కథ వినడానికి వెళ్తున్నావా? ఇక్కడ-అక్కడ తగిలించి వుండే శాలువలు చూడటానికి వెళ్తున్నావా? నీ హృదయమును భగవన్మయము చేసుకో. జగత్తులో ఒక్క భగవంతుడే నిర్దోషుడు. అని అన్నారు.

పరోపకారము ఎలాగ?

ఈ మాట చాలా పాతది. కానీ బాబా స్వయంగా వినిపించారు. వారు కాశీ దగ్గర గంగాతీరంలో విరక్త భావంతో విచరణము చేసేటపుడు భిక్ష అడిగి తినేవారు, అపుడు తమ జన్మభూమి (వూరి) యొక్క పూర్వ పరిచితుడు వచ్చాడు. అతడు తన కష్టము చెప్పుకున్నాడు 'నాకు ఇంటికి వెళ్లడానికి రైలు కిరాయికి డబ్బులు లేవు. నీవు ఏదైనా సర్దు'. బాబా అతడికి 'లేదు' అని చెప్పలేదు. బాబా తన మనసులో ఇలా సంకల్పం చేసుకున్నారు ప్రతి ఇంటి నుండి ఒకపైసా తీసుకుంటాను అని. ఒక జోలె తయారుచేసి ఒక్కొక్క ఇంటి నుండి ఒక్కొక్క పైసా అడుక్కున్నారు. కొందరు ఇచ్చారు. కొందరు ఇవ్వలేదు. కొందరు అవమానించారు. వస్తుతః అవమానమును సహించడమే భిక్షాటనము యొక్క తత్త్వము. ఎపుడైతే దాదాపు 14, 15 రూపాయలు అయిందో అపుడు ఆజోలె అతడికి ఇచ్చివేశారు. అంతే చేత్తో పైసా ముట్టుకోలేదు. బాబా యొక్క ఈ ప్రేమ, తపసు, త్యాగము, సహిష్ణుత, సుశీలతా చూసి ఆ వ్యక్తి ఇక ఎల్లప్పటికీ బాబాపట్ల దాసుడైనాడు, ఇక ఆ జీవనము బాబా కోసమే వున్నాడు.

సమత-స్వచ్ఛత -

బాబా యొక్క అంతరంగ శిష్యులలో అన్ని జాతులకు చెందినవారు వుండేవారు. వారి దగ్గర వర్ణాశ్రమ, మతమతాంతరములన్న బేధమేమీ వుండేది కాదు. వారి సన్నిహిత శిష్యులలో విద్వానులు, అగ్రజాతివారు, అమాయకులైన అంత్యజాతివారు, ముస్లిములు, ఈసాయిలు కూడా సమ్మిళితులైవుండేవారు. శిఖ్ఖులైతే చాలా పెద్ద సంఖ్యలో వుండేవారు. వారు ఎవరికైనా పాదాభివందనము చేయ సంకోచపడేవారు

కాదు. అందరిని హృదయానికి హత్తుకునేవారు. అందరినీ ప్రేమించేవారు. వారికి పరిశుభ్రత చాలా ఇష్టము. వంతెనపైన పేడతో అలికి మట్టివేసి ఎపుడూ చేయిస్తూనే వుండేవారు. రోజంతా రాలిపడే ఆకులను లోకులు అలా వూడుస్తూనే వుండేవారు. ఒకవేళ వారు ఏదైనా క్రొత్తచోటికి వెళ్తే బ్రాహ్మణులయినా, సాహుకార్లయినా, పండితులయినా, శూద్రులయినా ఎవరైనా సరే అందరినీ శుభ్రము చేసేపనిలో నియమించేవారు. ఒకసారి మేము సిద్ధమహాత్ముడు శ్రీత్రివేణీపురీజీ మహరాజ్ వారి ఉత్సవములో ఖన్నా వెళ్ళాము. బాబా 'బాంధ్' నుండి వచ్చిన తన సేవకులనందరినీ శుభ్రము చేసే పనిలో నియోగించారు. అక్కడి తోవ అంతా అపరిశుభ్రముగా వున్నది. 'నాగఫని' లాంటి మొక్కలతో నిండిపోయివున్నది. బాబా తనసేవకులను దారి శుభ్రము చేయమన్నారు. నేను అటువైపు నుండి వెళ్ళినపుడు చూశాను పండిత్ ఛబికృష్ణ దీక్షిత్, ఠాకూర్ సాహబ్ బహదూర్ సింగ్ పారపట్టుకుని కచరా తొలగిస్తున్నారు. వారు నాకు నమస్కరించి ఇలా అన్నారు 'స్వామీజీ! మా జాతి మీకు తెలిసిపోయిందనుకుంటాను. చెబుతారు కదా అంత్యజులు ఎక్కడికి వెళ్ళినా వారికి ఇవే పనులే చేయవలసి వస్తుంది. మేము 'బాంధ్' నుండి వచ్చినవాళ్ళం, మాకు ఎక్కడికి వెళ్ళినా ఈ పార, గంప మా వెనకాల వెనకాల వస్తుంటాయి.' వీరు జీవన పర్యంతం తమ ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బాబాకి సేవచేశారు. బాబా 5మైళ్ళు, 7మైళ్ళు అలాగ శుభ్రం చేయించేవారు. 'శుభ్రతయే భగవంతుడు' అని అనేవారు.

పండిత్‌జీ దండవత్ (ప్రణామము) -

బాబా గారి దగ్గర ఒక రసిక విద్వాంసుడు శ్రీసుందర లాల్‌జీ వుంటుండేవారు. వారి రోమరోమముల నుండి బాబా పట్ల ప్రేమయే పొంగి పొరలేది. ఎంత సన్నిహితం అంటే ఏమాటయినా సరే ఖరాఖండిగా (నిస్సంకోచంగా) మాట్లాడేవారు. నిండు సభలో కూడా ఏదో మాటాడుతూనే వుండేవారు. 'ఇంత గుంపు, ఇంత పని, ఇంత ప్రపంచము కూడేసుకునే అవసరమేమున్నది' అని అడిగేవారు నిజంగానే వారి జీవితము త్యాగమయము. ఒక రోజు బాబా, వారు, ఇద్దరూ స్నానం చెయ్యడానికి గంగానదిలో దిగారు. ఈత కొట్టడములో ఇద్దరూ ప్రవీణులే. వేరేవారంతా ఇంకా

తీరాన్నే వున్నారు, అంతలో వీరు నదిదాటి ముందుకు వెళ్ళిపోయారు. బాబా 'పండిత్‌జీ! రండి ఇపుడు ఇక్కడి నుండి ఇలాగే హరిద్వారం వెళదాము'. పండిత్‌జీ అన్నారు 'చెంబులేదు, పంచలేదు, ఇక్కడి నుండి ఇలాగే ఎలాగ వెళ్తాము?' బాబా అన్నారు 'సరే మంచిది పండిత్‌జీ! ఇపుడు మీరు వెళ్ళండి. చెంబు, ధోవతి సంభాళించుకోండి. నేనయితే వెళ్తున్నాను. దండవత్! అనేసి వారు ఒంటరిగానే వెళ్ళారు. పండిత్‌జీ తిరిగి వెళ్ళారు అక్కడ కూడా వారు ఎవరికి తన పరిచయము చెప్పలేదు. గుప్తంగానే వున్నారు. ఒక సుప్రసిద్ధ సన్యాస ఆశ్రమ అధికారులు వారిని ఉదాసీన సంప్రదాయము వారు అనుకుని బయటికి పంపించారు. అడిగినపుడు స్పష్టంగా చెప్పేరు 'నాకు సన్యాసి ఉదాసి భేదము తెలియదు' వస్తుతః వారు భేద భావము సమూలంగా పీకి పారవేశినా, నిస్పృహత అనే ఆభూషణమును ధరించారనిపిస్తుంది.

వివిధ మతములలో సమత్వం -

వారు భక్తులలో ఏదైనా మత (అభిప్రాయ) భేదములు కలిగినపుడు వారి కార్యక్రమములో ఒక అసాధారణ ప్రణాళిక వుండేది. విభిన్న పక్షముల (వాదముల)ను వేరే వేరే చీటీలలో వ్రాసి భగవంతుని ఎదుట నుంచేవారు. ప్రార్థన కీర్తన అయిన తర్వాత ఒక అనభిజ్ఞుడైన బాలకుడితో చీటీ తీయించేవారు. అందులో ఏది వ్రాసి వుంటే దానిననుసరించి వ్యవహరించేవారు. సామాన్యంగా చూస్తే విచారవంతుల దృష్టిలో ఇది సరిఅని అనిపించకపోవచ్చు. ఏదైనా యుక్తి సంగతమైన ఉచితమైన వాదమును సంయోగం (లాటరీలాగ) పైన వదిలివేయడం ఎవరికి నచ్చుతుంది. నేను ఈ విషయాన్ని గురించి విచారించాను (చింతన). ఇది వారి 'సమతా' లక్షణము అని అనిపించింది. వారు జగత్తులోని వివిధ వివాదాస్పద విషయములను, వ్యక్తులను, స్థానమును మరియు కర్తవ్యములను అన్నిటిని సమదృష్టితోనే చూచేవారు. అందు వలన ఏది ఏమైనా అందులో జీవులకు హితమే వుండేది. ఇది వారి దృఢ నిశ్చయము. వారికి సర్వత్ర బ్రహ్మ దర్శనము కలుగుతుందా? ఈశ్వర దర్శనము కలుగుతుందా అన్నది వేరే ప్రశ్న, కానీ సృష్టిలోని విభిన్న మతమతాంతరాలలో సమత, అనుకూల పరమార్థమునే వారు దర్శించారు అన్నది మాత్రము నిశ్చయము.

ప్రణామము చేయు యోగ్యత -

నేను జ్యోతిష్పీఠాధీశ్వరులు శంకరాచార్యులు శ్రీబ్రహ్మానంద సరస్వతిజీతో దండసన్యాసము (స్వీకారం) చేశాను. అపుడు వారు నాతో 'ఎవరి వద్ద దండం వుండదో, దండీ సన్యాసులలో కూడా ఎవరి చాతుర్మస్యము, విద్యా ఎక్కువగా వుండదో వారికి ప్రణామం చెయ్యనవసరం లేదు' అన్నారు. నేను శ్రీ ఉడియాబాబాజీ పేరు తీసుకుని అడిగాను. అపుడు వారు 'వారయితే గోవర్ధన పీఠాధీశ్వరులైన శంకరార్యుల శిష్యులు, మరి మొదట దండిస్వామియే కదా, అందుకని వారికి ప్రణామము చెయ్యడంలో హాని ఏమి లేదు' అన్నాను. దాని తర్వాత నేను 'బాంధ్' (ఆనకట్ట) దగ్గరికి వచ్చాను. శ్రీహరిబాబాజీకి నమస్కరించాలా వద్దా అని శ్రీ ఉడియాబాబాజీని ప్రశ్నించాను. వారు ఇలా అన్నారు 'నిరభిమానత, వినయము సర్వోచ్ఛమైనటువంటి గుణములు. భాగవతములో వ్రాశారు కుక్క, ఎద్దు, గాడిద వీటికి కూడా సాష్టాంగ దండవత్ భగవత్‌బుద్ధితో నమస్కరించాలి అని. శ్రీహరిబాబాజీ ఒక ఉచ్ఛకోటి మహాపురుషుడు వేలాది జనం వారిని భగవద్‌బుద్ధితో చూస్తారు. వారు దైవీ సంపదకు ఖజానాలాంటివారు. వారు వర్ణాశ్రమాతీత పురుషులు. వారికి తప్పక నమస్కరించవలసినదే. నమస్కరించడమనేది మన సద్గుణము. అది మనలో వుండవలసినదే. నీవు ఎపుడూ వారికి నమస్కారం చేస్తున్నావు అలాగే ఇపుడు కూడా చెయ్యాలి.' శ్రీ ఉడియాబాబాజీ దృష్టిలో శ్రీహరిబాబాజీ తన స్వస్వరూపమే.

అన్నం బ్రహ్మ -

శ్రీహరిబాబాజీ భోజనం సంవత్సరాల కొద్దీ ఒకటే రకంగా వుండేది. పెసలు, కూరలు కలిపి ఒక్కసారె వుడికిస్తారు. మామూలుగా రొట్టెలతో తినేవారు. భోజనం వచ్చినపుడు తనకు కావలసినంత తన గిన్నెలో తీసుకుని తినేవారు. అంతా ఎంగిలి చేసేవారు కాదు. ఆఖరున గిన్నె కూడా కడిగి నీళ్ళు త్రాగేవారు. ఈ నియమము తీసుకోకపూర్వము కూడా సంవత్సరము వరకు కాని, 6నెలల వరకు కానీ ఒకటే రకం భోజనం చేసేవారు. ఒకసారి నాకు జలుబు చేసింది. ఒకసీసా 'కాష్ఠ-ఔషధి' పంపించారు త్రాగడానికి. 'అన్నం తింటే జలుబు తగ్గుతుంది. సృష్టిలో అన్నమే అమృతము' అని అన్నారు. ఒకటి రెండు సంవత్సరాల తర్వాత నాకు మరల జలుబు

చేసింది. మందు పంపుతూ ఇలా చెప్పిపంపారు 'రొట్టె తిను. ఇదే అమృతము' అని నేను అనుకున్నాను ఇదేమిటి ఒకసారి అన్నం అమృతము అంటారు, ఒకసారి రొట్టె అమృతమంటారు. దీనికి ఏమి కారణము? కనుక్కుంటే తెలిసిందేమిటంటే వారు ఎపుడు ఏది తింటుంటారో అపుడు వారు దానిని అమృతము అంటారు. అసలు అన్నం-బ్రహ్మ, దానిని నిందించకూడదు. బ్రహ్మ బుద్ధితో దానిని సేవన చెయ్యాలి. బ్రహ్మబుద్ధితో అన్ని రకాల భోజనము రోగములకు ఔషధి అవుతుంది.

సంకల్పము -

ఒకసారి నాకు వారు ఇలా అన్నారు 'రా! మనం ఒక్క సంవత్సరం వరకు సంకల్పం చేసుకుని బృందావనంలో వుందాం! నీవు శ్రీధరీ భాగవతము వినిపించు. నేను ఆది నుండి అంతం వరకు వింటాను.' నేను అన్నాను 'ఒక సంవత్సరము అనుష్ఠానమంటే విన్న వారంతా దూరదూరాల నుండి వచ్చేస్తారు. వారికి వుండటానికి, భోజనానికి వ్యవస్థ ఎలా చెయ్యగలుగుతాము!' బాబా అన్నారు 'ప్రతిరోజు భాగవత కథ జరుగుతుంది. హరినామ సంకీర్తనము జరుగుతుంది. నీవు చెబుతావు, నేను వింటాను. మరి ఇక భగవంతుడు తిండికి వుండడానికి వ్యవస్థ చెయ్యడా?' మేము నియమంగా కూర్చుని కథా ప్రవచనము చేశాము. అంత వ్యవస్థ దానంతటదే జరిగిపోయింది.

సంకల్పము యొక్క విఘ్నము -

ఈ అనుష్ఠానము మధ్యలో హైదరాబాద్ సింధ్‌లోని వేదాంత మర్మజ్ఞుడైన హేమన్‌దాస్, వారికి నాపై చాలా శ్రద్ధ-ప్రీతి, వారు కొలంబోకు చెందిన సేఠ్ జీవత్‌రామ్ వారిని తీసుకుని వచ్చారు. వారు శ్రీలంకకు వచ్చి అక్కడ హిందువులలో ధర్మ సంస్కృతిపై ప్రచారము చెయ్యమని బలవంతం చెయ్యసాగారు. మార్గ వ్యయము కొరకు డబ్బు కూడా జమ అయింది. మధుర మేజిస్ట్రేట్ ప్రమాణ పత్రము కూడా ఇస్తానని మాట ఇచ్చారు. ఎపుడైతే ఈ సంగతి బాబాకు తెలిసిందో అపుడు వారు 'ఇది అనుష్ఠానములో విఘ్నము. ఏదైతే సంకల్పించామో అది మధ్యలో వదలకూడదు' అన్నారు. నేను వారి ఆజ్ఞను మన్నించి శ్రీలంక యాత్ర చెయ్యలేదు.

సంకల్పము యొక్క నివృత్తి -

పదకొండు నెలలు నిండినిండగానే బాబా అన్నారు 'ఇపుడు ఎంత బాకీ వుందో అది రెండు పూటల చేసి 15 రోజులలో పూర్తి చేసెయ్. ఎందు కంటే నేను పూరీ వెళ్ళాలనుకుంటున్నాను' నేను అన్నాను '15 రోజుల కొరకు సంకల్పము ఎందుకు విడిచేది'. బాబా నవ్వుతూ నా వీపుపై చెయ్యి వుంచి ఇలా అన్నారు' సంకల్పము పూర్తి చెయ్యాలన్న దురాగ్రహము సంసారులకుంటుంది. సాధువు యొక్క సంకల్పము పూర్తికాకపోతే మంచిదే. ఎక్కడ మన సంకల్పము పూర్తికాలేదో అక్కడ మన ప్రియతముడైన ప్రభువు యొక్క సంకల్పము పూర్తవుతుంది.'

కేవలము రసాస్వాదనము -

బ్రిటీష్ శాసన కాలంలో గ్వాలియర్ రాజ్యానికి చెందిన 'కరహే' అన్నపేరు గల స్థానములో బాబా రామదాసు ఒక గొప్ప ఉత్సవమును ఆయోజనము చేశారు. 24 గంటలు వందల కొద్దీ కళాయిలలో (మూకుళ్ళతో) 'మాల్‌పూనా' తయారయ్యేది. పూర్ల నుండి లక్షల కొద్దీ జనము వస్తూపోతూ వుండేవారు. వసతి, భోజనం, భజన పెద్ద మేలాలాగ వుండేది. నేను కూడా శ్రీ ఉడియాబాబాజీ మహారాజాజీతో కలసి అక్కడికి వెళ్ళాను. అక్కడ లక్షలాది జనాన్ని చూసి నేను సామాన్యమైన ప్రవచనము ఇచ్చాను. సత్సంగము తర్వాత శ్రీహరిబాబాజీ నన్ను పిలిపించి అన్నారు, 'భయ్యా! కొంచెం నన్ను కూడా ధ్యానంలో పెట్టుకు, నీవు ప్రవచనము చెప్పేటపుడు నేను అక్కడ కూర్చుని వున్నానని మరచి పోయావా?' దీని అభిప్రాయము ఏమిటంటే వారు లోక-పరలోకము కోసమే, లేదా అంతఃకరణ శుద్ధి కోసమే ప్రవచనము వినే వారు కాదు. సదాచారము యొక్క ప్రచార ప్రసారము ఇష్టమైనా కూడా వారు స్వయంగా భగవాన్ రసాస్వాదనములోనే తమ సమయమును గడిపే వారు. వారికి భూత-భవిష్యములు, ప్రచారము, లోక-కల్యాణము కొరకు కాని ఏవాసనలు చేయాలనుకునేవారు కాదు వారికి తెలుసు కుక్కతోక ఎంత నిటారుగా చేసినా అది వంకరే అని. తనను తాను స్వయంగా పరమానంద-ప్రభువులో, ఆరసానందములో మగ్నమై వుండడమే వారి జీవన సాఫల్యము.

అద్వైత నిష్ఠ -

ఫిరోజాబాద్ (యు.పి.)లో ఉత్సవానికి వారి వెంట నేను కూడా వెళ్ళాను. బొంబాయివాలే ఎకృష్ణానంద్‌జీ వారి బలవంతంపైన నేను అక్కడికివెళ్ళడము అయింది. శ్రీరాధాకృష్ణ-మందిరములో విడిదిచేశాము. తిరిగి వచ్చేటప్పుడు వారితో పాటు ఒకే కారులో కూర్చున్నాము. మధురా పోలీస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనారాయాణసింమ్ మోటార్ డ్రైవ్ చేస్తున్నాడు. 2.30 గంటల యాత్ర సమయములో నేను వారిని చాల ప్రశ్నలడిగాను, వారు చాలా ప్రేమతో సమాధానాలు చెప్పారు. ఒక ఉదాహరణ చూడండి 'మీ నిష్ఠ ఏమిటి?' అని నేను అడిగాను. వారు 'నాది అద్వైత నిష్ఠ. నా గురుదేవులు శ్రీ సచ్చిదానందగిరిజీ యొక్క అద్వైత నిష్ఠ పరిపూర్ణము పరిపక్వము. వారి కృప వలననే నాలో అద్వైత నిష్ఠ కలిగింది, అది ఇప్పటికీ ఎప్పటికీ అఖండము' అన్నారు. నేను అడిగాను 'జనం అయితే మిమ్ములను భక్తి పరాయణులు, సంకీర్తన నిష్ఠులు అనుకుంటారు' వారు అన్నారు 'రెంటిలో విరోధము ఎక్కడుంది! ముక్తి లేదా అద్వైతము మన స్వ స్వరూపమే. భక్తి నిరంతరము హృదయంలో ప్రవహించే ఉల్లసితధార! శాంత రసము, ఉల్లసిత రసము వీటిలో తత్త్వతః ఏమీ భేదము లేదు. ఉల్లాసము పరమార్థికమా! వ్యావహారికమా! ఇందులో కూడా భేదము లేదు. ఎందుకంటే భగవత్ రసము యొక్క అవిచ్ఛిన్న ప్రకాశము (భాసమానత) వున్నది. హృదయము భగవత్‌రసములో ఉన్మజ్జనం నిమజ్జనం చెయ్యనీ, లేదా తన స్వస్వరూపంలో స్థిరమవనీ! రసికా చార్యులు కూడా ఇదే చెబుతారు 'భక్తిర్ముక్తైవ నిర్విఘ్న' అంటే ముక్తి తర్వాత భక్తి నిర్విఘ్నము నిరుపద్రవముగా వుంటుంది.

సకామ నిష్కామ -

చాలా మంది మహాత్ములు భక్తి నిష్కామంగా వుండాలి అనే చెబుతారు. నిష్కామత ఉచ్చకోటికి చెందినది అన్న దానిలో సందేహములేదు. శ్రీహరిబాబాజీ మహరాజ్ నిష్కామతను గురించిన ప్రశంస ఎవరికంటే తక్కువగా నేమీ చేసేవారు కాదు. కానీ సాధారణులకు అటువంటి స్థితి కఠినము అనేవారు. ఒకవేళ ఏదైనా ఎవరికైనా వాసనలు (కోరికలు) వుంటే వాటి కొరకు భగవంతుడినే ప్రార్థించాలి. ఎలాగ ధృవుడు, గజేంద్రుడు, ద్రౌపది వారిలాగ మొదట సకామభావంతో తర్వాత

నిష్కామభావంతో ప్రేమించాలి. సేవకుడు లేదా పత్ని - స్వామిని, యజమానిని వదిలి ఇంకెవరి దగ్గరకు అడగడానికి వెళ్తారు?' వారు వ్యక్తిగతంగా, సంఘపరంగా రెండు విధాలుగా కూడా సకామ అనుష్ఠానము చేయించేవారు, చాలా మందికి మనోకామనలు తీరేవి. ఎక్కడ భగవత్సంబంధమున్నదో అక్కడ సకామ-నిష్కామము అన్నదంటూ ఏమీ లేదు. 'ప్రేమ పత్తనం' అన్న గ్రంథంలో 'ప్రేమ నగరంలో నిష్కామత సకామత కంటే శ్రేష్ఠము. ప్రభువు పట్ల నిష్కామత సకామత కంటే నికృష్ణము. రససిద్ధ-పురుషుల సకామత-నిష్కామత రెండు ఒకటే తన స్వస్వరూపములో భాసించేవి, ఎందుకంటే వారికి అవి, ఇవీ నేను అన్నీ భగవత్స్వరూపముగానే వుంటాయి.

అవధ్ వీధులలో

అది ఒక సామాన్య స్వప్నమని ఒప్పుకొనడానికి ఈ రోజు వరకు కూడా నా అంతరాత్మ తయారుగాలేదు. 54, 55 సంవత్సరాలు గడిచిపోయాయి, మనసులో ఆ సుందర దృశ్యం, ఆ అనుపమాన దర్శనము యథాతథంగా ఇప్పటికి కళ్ళకు కట్టినట్లు వుంటుంది. నితాంత శాంత అంతఃకరణమును కూడా ఒక మారు స్పందింప జేస్తుంది. ఇంతకు సంగతేమిటంటే - నేను శ్రీఅవధధామములో అటు ఇటు తిరుగుతున్నాను. సంధ్యాసమయంలో మెల్లగా అంధకారం సర్వత్ర వ్యాపించింది. ఆ రోజులలో కరెంటు లేదు. ఏదో ఒక మందిరములో దర్శనము చేసుకుని బయటికి వచ్చాను. దారి తప్పాను. తూర్పువైపు జానకీఘాట్ వుంది, అటువెళ్లవలసింది, పశ్చిమము దిక్కుగా వెళ్ళాను. బాగా అలసి పోయాను. అపుడు ఏమిటి చూస్తున్నాను! ఎదురుగా ఒక ప్రకాశవంతమైన స్థానము కనిపించింది. కాళ్ళ మాధ్యలో చిన్న చిన్న జలాశయములు, విచ్చివున్న కమలములు (రాత్రిలో) వెన్నెల వెలిగిపోతూవుంది. పక్షులు విహరిస్తున్నాయి. నేను ఆశ్చర్యచకితుడనయ్యాను. అక్కడ ఎవరూ మనుష్యులులేరు. నేను కొంచెం సేపు వరకు ఆ దివ్యమైన సౌందర్యాని చూస్తూ వుండిపోయాను. ఆ రోజు మధుర రసాస్వాదనములో మునిగిపోయాను. అలాగే కూర్చున్నాను. ఎపుడు దుప్పటి పరిచానో ఎపుడు పడుకున్నానో తెలియలేదు. అలాగే నిద్ర వచ్చేసింది. ఉదయము లేవగానే అయితే అక్కడ ఏమీలేదు. ఆ విశాల రాతి ప్రాంగణము లేదు. చిన్న చిన్న జలాశయాలూ లేవు, పక్షుల జలవిహారమూ లేదు.

ఆశ్చర్య చకిత చిత్తుడనై జానకీ ఘాట్ తిరిగి వచ్చాను. అదేమిటి? నేను పడుకున్నదయితే తర్వాత జాగ్రదవస్థలోనే ఏదైన స్వప్న దర్శనమా అది? కాదు! కాదు! మనసు కదా? అంగీకరించడము లేదు. భగవద్ధామ ములో రాత్రి

సమయములో దారి - తెన్ను తప్పిన ఒక బ్రాహ్మణుడికి అది అతిథిసత్కారము! చమత్కారము!

కాశికి దగ్గరయినందు వలన, అయోధ్యలో అనేకులు పరిచితులు వున్నందు వలన అక్కడికి అపుడపుడు వెళ్తూ వుండేవాడిని మా వూరి దగ్గర విష్ణుపురా అనే వూరిలో ఒక బ్రాహ్మణుడు బైరాగి అయ్యాడు, జానకీఘాట్ దగ్గర పండిత్ శ్రీరామవల్లభ శరణజీ మహారాజశ్రీ వారి ఆశ్రమములో వుంటూ వుంటేవాడు. వారి పరిచయము వున్నందు వలన నేను అక్కడికి వెళ్ళి అక్కడనే వుండేవాడిని. ఎపుడైనా పండిత్‌జీ దగ్గర కూర్చునే సదవకాశము లభించినపుడు భక్తి-జ్ఞానముల చర్చ కూడా జరుగుతూ వుండేది. పండిత్‌జీ నాతో స్వయంగా చెప్పారు వారు. వారు బీహారు ప్రాంతంలో జన్మించారని. యుక్త వయసు వచ్చే వరకు కూడా చదవడం, వ్రాయడం ఏమీ నేర్చుకోలేదు. ఎవరో ఒక మహాత్ముడు వీరికి హనుమాన్‌జీ ఉపాసన చెయ్యమని చెప్పారు. వారు శ్రీహనుమాన్‌జీ యొక్క ఆజ్ఞననుసరించి కాశీకి వెళ్ళి ఏదో ఒక పురాతన గ్రంథాలయములో పెద్ద పెద్ద గ్రంథాలను దర్శించారు. కేవలము మూడు రోజులలోనే వారికి నిఖిలశాస్త్రముల రహస్యము హృదయంగమము అయినది, వారు గొప్ప విద్వాంసులు అయ్యారు. శ్రీసరయూ తీరంలో కుటీరము వేసుకుని వుంటున్న శ్రీరఘువరదాస్ మహరాజ్ దగ్గరికి నన్ను వారు వెళ్ళమన్నారు. శ్రీరఘువరదాస్‌జీ గారికి 18 పురాణములు కంఠస్థములు అనికూడా వారు తెలిపారు. ఆ మహాత్ముడు చాలా ఆనందంగా వుండేవాడు, మూర్తీభవించిన శాస్త్ర కోశము (డిక్షనరీ) అని అనిపించేది. వారు పండిత్‌జీని గురించి నాకు చాలా అత్యంత మహత్వపూర్ణమైన, ఉత్తమమైన మాటలను తెలిపారు. వాటి ప్రభావం నాపైనా చాలా లోతుగ, స్థిరంగా పడింది. ఒక సాధువు ఇంకొకసాధువును ఇంతగా ప్రశంసించగలడు అన్నది ఇది నాకు మొదటి అనుభవము.

పండిత్‌జీ దగ్గరికి తిరిగి వచ్చాక వారితో నాకు సాధువునవ్వాలని వుంది అని చెప్పాను. వారి జవాబు నాకు ఇప్పటికి అపుడపుడు గుర్తుకు వస్తువుంటుంది. పండిత్‌జీ నాతో ఇలా అడిగారు 'మా ఇల్లు గట్టిదా ఓటుదా'

నేను 'మట్టి గోడలు, గడ్డితో కప్పిన పైకప్పు'

పండిత్‌జీ - కుటుంబంలో ఎందరున్నారు?

నేను - నలుగురు, ఐదుగురుంటాము.

పండిత్‌జీ - భోజనం ఏం చేసుకుంటారు?

నేను - పప్పు - అన్నం, రొట్టెలు - కూర.

పండిత్‌జీ - సరే మంచిదే, అయితే విను! మామూలు సాధారణమైన ఇంటిని వదిలి నా ఆశ్రమానికి రావడం, నలుగురయిదుగురుగల కుంటుంబాన్ని వదిలి వందల కొద్దీ సాధువుల నడుమ వుండడము, రొట్టె-పప్పు బదులు లడ్డు, పూరీ తినడం అది ఏమి సాధుత్వం? త్యాగము-వైరాగ్యము, భగవద్భజన వీటి కోసమే సాధువులయ్యేది, అది నీవు ఇంట్లో వుంటూ కూడా చెయ్యగలుగుతావు. సాధువు అయ్యే సమయము వచ్చినపుడు సాధువు అవుదువుగానీ. కుతూహలముతో సాధువు కారాదు. సాధుతకు మూలములో దృఢత, సిద్ధాంతము యొక్క పునాది స్థిరముగా వుండాలి.

నేను మా ఇంటికి అపుడు తిరిగి వెళ్ళిపోయాను అని వేరుగా చెప్పనవసరము లేదనుకుంటాను.

రెండవసారి అయోధ్య వెళ్ళినపుడు పండిత్‌జీ దగ్గరనే దిగాను, కానీ సత్సంగము కోసము చాలా చోట్లకు వెళుతూ వుండేవాడిని, మహాత్ములను కూడా కలుసుకుంటూ వుండేవాడిని. ఒక మహాత్ముడుండేవాడు, వారిని శ్రీ అవధ ధామములో 'గౌవావలే సాధు' అనే పేరుతో జనానికి పరిచితులు. చిన్న కుటీరము నాల్గుదిక్కుల (సహన్) వారు చాలా వినోదస్వభావం కలవారు (హాస్యప్రియులు) వృద్ధులు. వేష భాషలు అకించనుడిలా వుండేవి. చందనం మాల (దండ) కూడా వారి దగ్గర వుండేదికాదు. వారి దగ్గరికి వెళ్ళి కూర్చున్నాను. వారు 'రామచరితమానస్' పై మంచి మంచి భావాలు చెబుతూవుండేవారు. ఒకసారి నేను గౌవావాలె సాధుబాబాను అడిగాను 'భగవంతుడి దర్శనం ఎలా కలుగుతుంది?' వారు కొంచెం రూక్షంగా అడిగారు 'నీవు ఎక్కడి నుండి వస్తున్నావు?' నేనున్నాను 'కనక భవనము నుండి'. వారు 'అవునా! అయితే అక్కడ కేవలం ధాతు-పాషాణమును దర్శించి వచ్చావా ఏమి? ఎలాంటి దర్శనం కావాలి? దీనిపై లక్షలాది జనుల శ్రద్ధవున్నదో, వేలాది జనులు ఎవరిని భగవంతుడు

అనుకుంటున్నారో, వందల కొద్దీ జనం ఎవరిపైన తమ జీవితాలే దిగదుడిచి వేశారో అటువంటి లోకాభిరాముడు శ్రీరాముడిని మేము ఎవరినైతే ప్రత్యక్షంగా భగవద్రూపము అనుకుంటున్నామో వారిని దర్శించి వచ్చావు, ఇంకా వేరే ఏదో దర్శనం కోరుకుంటున్నావా? వీరే సాక్షాత్తు భగవాన్ శ్రీరాముడు అన్నది విశ్వసించు'.

మూర్తిలో భగవంతుడున్నాడని అనుకోవడము కాదు, సాక్షాత్తు భగవంతుడే అన్నమాట నాకు చాలా రోజులకు అర్థమయింది.

శ్రీ అయోధ్యజీ, శ్రీ సరయూ పావన తీరంపై భగవంతుడిది ఒక చిన్న మందిరం వున్నది. అందులో శ్రీసద్గురు-సదన-బిహారీ భగవంతుడి దర్శనం కలుగుతుంది. మూర్తి యొక్క శిరసు కొంచెం ముందువైపు వంగి వున్నది. మూర్తి శిరసు మొదట చక్కగా వుండినది అని మహాత్ములు చెబుతారు. పండిత్ శ్రీ ఉమాపతి మహారాజ్ తనను గురు వశిష్ఠుడనే అనుకునేవారు తన వేసుకున్న మాల తెచ్చి శ్రీరామభద్రుడి మెడలో వేశేవారు. సాధువులలో దీనికి ప్రతీ క్రియకనిపించింది. విద్వాంసులు విరోధించారు. అందరూ సభచేశారు. జనం శ్రీ ఉమాపతిజీని ఇలా అడిగారు 'మీరు అయితే మిమ్మల్ని భగవానుడి గురువగా అనుకుంటారు కానీ, భగవంతుడు తనని మీ శిష్యుడిగా అంగీకరిస్తున్నారా లేదా?' పండిత్ ఉమాపతిజీ అన్నారు నేను నా భావము ననుసరించి నేను వ్యవహరిస్తున్నాను. వారు తమ కర్తవ్యాన్ని పాలిస్తారా, లేదా దానితో నాకేమి ప్రయోజనము?' సాధువులు వారి తర్కమును అంగీకరించలేదు. మా ఎదురుగా వెళ్ళి మా యెదుట మీ మెడ నుండి తీసిన మాలను భగవంతుడికి వెయ్యండి.

అలాగే చేశారు. భగవంతుడు పండిత్‌జీ ఎదుట తన శిరసును వంచారు. ఆ మూర్తి ఇప్పటికి అలాగే వంగి వున్నది. ఆ స్థానము శ్రీలక్ష్మణ్‌కిలాకి దగ్గరలోనే వున్నది.

పండిత్ శ్రీరామశరణ్ వల్లభ్‌జీ దగ్గర వున్నపుడు ఒకసారి నేను ఇలా అడిగాను 'సరయు స్నానము వలన ముక్తి దొరుకుతుంది అని మీరంటారు. ఉపనిషత్తులేమో జ్ఞానం లేక ముక్తి లేదు అంటాయి. ఇపుడు ఎలా సమన్వయం కుదురుతుంది?

పండిత్‌జీ అన్నారు 'నేను ముక్తుడిని అన్న సంవిద్‌యే జ్ఞానం ఒక వేళ సరయూ స్నానం వలన ఈ సంవిద్' నేను ముక్తుడిని 'అని కలిగిందంటే, జ్ఞానముక్తికి, ఈ ముక్తికీ విరోధమెక్కడ వుంది?'

నేను మిన్నకుండిపోయాను. నిజంగానే 'నేను ముక్తుడిని' అన్న విశ్వాసము జీవుడిని తన సాధనలో స్థిరం చేస్తుంది.

అద్వైత వేదాంతుల సిద్ధాంతం వేరు. వారు బ్రహ్మాత్మ ఐక్యబోధతోనే అవిద్యా నివృత్తి అవుతుందంటారు. అవిద్యా నివృత్తితో ఉపలక్షితమైన ఆత్మయే ముక్తి. వారి అభిప్రాయంలో ముక్తి సాధ్యము, ధ్యేయము కాదు. భక్తుల సాలోకాదిముక్తి వారి విశ్వాసము వలన ప్రాప్తమయినది.

వస్తుతః అద్వైతులతో సమానంగా భక్తి - సిద్ధాంతములో కూడా ఈశ్వరుడి అంశస్వరూపమైన జీవుడు నిత్యముక్తుడే. 'వారు కూడా అప్రాప్తమైనది ప్రాప్తించుట ముక్తి అనరు, నిత్య ప్రాప్తమైనది లభించుటయే ముక్తి అంటారు. భేదము ఏమిటంటే ఎవరైతే భగవంతునికి సమ్ముఖులో వారు ముక్తిని అనుభవం చేసుకుంటారు. ఎవరైతే విముఖులో వారు తమను బద్ధులుగా భావిస్తారు. బంధన్-ముక్తి ఇవి విముఖత - సుముఖత వలన కలిగేవే కానీ స్వరూపములో ఇవి లేవు. ఎవరైతే భగవంతుని చూస్తారో వారు నేను ముక్తుడిని, నీవు బద్ధుడు అని వేరు చేయడు, ఎందుకంటే వారి దృష్టిలో అంతా ప్రభువే, బంధనము - ముక్తి ఇదంతా లీలామాత్రమే.

నేను, భాయి సుదర్శన సింహ్ (చక్రీజీ) శ్రీసరయూ నదీ స్నానము కొరకు వెళ్తున్న సమయములో పరస్పరం చర్చించుకుంటున్నాము. శ్రీ సరయు తీరము మరియు శ్రీ గంగా తీరము వీటిలో వున్న భేదమేమిటి? భేదమేమిటంటే గంగాతీరములో విరక్త అవధూతలు విచరణ చేస్తారు. శ్రీసరయూ నది తీరములో భజన చేశే వారు వుంటారు. మేమిద్దరమూ శ్రీరామఘాట్‌లో స్నానం చేసి తిరిగి వస్తున్నపుడు నగరము బయట కొంతమంది వచ్చి 'ఈ దారి గుండా వెళ్ళకండి, అక్కడ ఆ శిధిలగృహంలో ఒక పిచ్చివాడున్నాడు, వాడు ఒక్కోసారి రాళ్ళు, ఇటుకలు విసిరి కొడుతూంటాడు'. అని చెప్పారు. మేము మంచి వయసులో వున్నాము, కొంచెం

వైరాగ్యము, కొంచెం భగవదాశ్రయ బలము అన్నీ కలసి మమ్ములను బలాత్ అక్కడికి తీసుకుని వెళ్ళాయి. ఆ పిచ్చివాడు చేతితో సంజ్ఞ చేసి మమ్ములను దగ్గరికి రమ్మని పిలిచాడు. తన రజాయి పరిచాడు కూర్చోవడానికి. ప్రేమ పూరితమైన దృష్టితో మావైపు చూసి మీ దగ్గర ఏమైనా తినటానికి వుందా?' అని మేము 'లేదు' అని చెప్పాము. 'మీ దగ్గర చెంబులో సరయూ జలము వున్నది కదా అదే ఇవ్వండి' అని అడిగాడు. నీరంతా త్రాగేశారు. నీరు త్రాగేటపుడు క్రిందపడి ఎక్కడయితే మట్టి తడిచిపోయిందో, అద కూడా వారు తిన్నారు. చక్రజీ దగ్గర 4, 5 అణాలు వుంటే అవి ఇచ్చాడు. ఇక అపుడు వాడు ముందు ముందు నడుస్తు వుంటే మేము వెనకన వెళ్ళాము. ఆ పిచ్చివాడిని చూచి లోకులు భయంతో ప్రక్కకు తప్పుకున్నారు. వాడి వెనుక వెనుక మేము వెళ్తుంటే చాలా ఆశ్చర్యంగా చూచేవారు, వెళ్ళవద్దని చెప్పేవారు. ఆ పిచ్చివాడు దిగంబరుడు దాదాపు 10-5 కుక్కలు చుట్టుకుని వెంట వున్నాయి. అలాగే ముందుకు సాగాడు. మిఠాయి కొట్టువాడికి 4, 5 అణాలు ఇచ్చి వాడితో మిఠాయి ఇప్పించుకున్నాడు. కుక్కలకు తినిపించాడు. ప్రేమగా మా వైపు చూస్తూ వెళ్ళిపోయాడు. మేము చాలా ఆలోచించి విచారణ చేసి ఈయన ఎవరో దత్తాత్రేయ లాంటి మహానుభావుడయివుంటాడని నిశ్చయానికి వచ్చాము, తర్వాత మా మనసులోని సంశయాన్ని తుడిచి వెయ్యడానికే వారు ఇలా మాతో ఇంతసద్భావ ప్రేమపూర్ణ వ్యవహారం చేశారు. నిజంగానే అది ఒక చాలా ఆశ్చర్యకరమైన ఘటన.

నాకు ఇపుడు అది ఏ సంవత్సరము అని గుర్తులేదు, ఆ సమయంలో శ్రీఅయోధ్య ధామములో తులసీ-చబుతరా (అరుగు) దగ్గర మహాత్ములది ఒక మహత్వ పూర్ణమైన సభ జరిగినది. అక్కడ ఒక పెద్ద విద్యాంసుడు కర్కశ-తర్కశాలి నిల్చుని వ్యాఖ్యానము ఇస్తున్నాడు. వారు ఎవరిదీ వినిపించుకునేవారు కాదు. ఆ తేజస్వీ వక్తా తన గంభీర భాషణ శైలితో 'శ్రీరామచరితమానస్' యొక్క అనేక ప్రసంగాలను ప్రక్షిప్తములని చెబుతున్నారు. వారు 'వాల్మీకి రామాయణము' కూడా ఒకటి రెండు ప్రసంగములు క్షేపకములని తెలిపాడు, మరి వాటిని వైష్ణవులు రామాయణములో నుండి తీసివేయాలని కూడా చెప్పాడు. గొప్ప-గొప్ప విద్వానులందరికీ వారి మాటలు అంగీకారము కాలేదు. ఆ వక్త పేరు శ్రీభగవదాచార్యజీ మహరాజ్. వారిలో యువావస్థ యొక్క తేజస్సు వుండేది. 'తత్త్వదర్శి'

అనే మాస పత్రిక ఒకటి వారు వెలువరించేవారు. అన్యమత ఖండన చాలా ఉత్సాహంగా చేసేవారు. శాస్త్రార్థములను సవాలు చేసేవారు. ఆ రోజు నాకు వారి యెడల అయిష్టత కలిగింది, తర్వాత సంవత్సరాలు గడిచినా వారిని కలుసుకోవడానికి నేను ప్రయత్నించలేదు.

శ్రీ భాగవదాచార్యులు ఎపుడైతే 'భారత-పారిజాతము' అన్న సంస్కృత మహాకావ్యము వ్రాశారో, దానిని నేను చదివాను, అపుడు నాకు వారి యెడల శ్రద్ధ జాగృతమయినది. వారు న్యాయ, వ్యాకరణ, వేదాంత, సాహిత్యములతో పాటు వేదాలను కూడా బాగా గంభీరంగా అధ్యయనం చేశారు. తరువాతి వారి అభిప్రాయము లననుసరించి వేదము, ఉపనిషత్తులు, గీత, బ్రహ్మ సూత్రములపై భాష్యము కూడా వ్రాశారు. వారు పౌరుషము, భగవత్కృప యొక్క మూర్తీభవించిన సమన్వయములాగ వుండేవారు. వారు ఎంతో కష్టపడి అధ్యయనం చేశారు. శ్రీరామానంద సంప్రదాయ మును స్వతంత్ర్య సంప్రదాయముగా చేయుటకై వారెంతో పరిశ్రమించారన్న సంగతి శ్రీరామానందీయ వైష్ణవులకు తెలియని సంగతి కాదు. వారికి వంద సంవత్సరాల ఇంకా ఎక్కువనే వయసు అయింది, వారిని నేను చాలా ఎక్కువగా కలుసుకుంటూ వుండేవారము. వారు నాకు ఎంతటి స్నేహాన్ని, ఆదారాన్ని ఇచ్చేవారంటే నేను వారి సహృదయతకు, వైదుష్యానికి సమ్మోహితుడ నయిపోయాను. వారు ఒక సారి నాకు ఇలా తెలిపినారు ఒకసారి నర్మదానది యొక్క శాంత, ఏకాంత వన ప్రదేశములో వెళ్ళి నితాంత నిరీహ భావంతో కూర్చున్నాను. పూర్ణ విశ్వాసముతో మనసులో దృఢ ప్రతిజ్ఞ చేసుకున్నాను 'భగవతీ శ్రీ జానకీజీ ఎప్పటి వరకు తన కరకమలములతో స్వయంగా నాకు భోజనం పెట్టదో అప్పటి వరకు అన్న పానాదులు స్వీకరించను'. ఆరవరోజు రాత్రి సమయంలో నేను మూర్ఛితుడిలాగ అయ్యాను. ఒక ఆభాసము కలిగింది 'శ్రీ సీతా మాత స్వయంగా తన చేతులతో పళ్ళెం తీసుకుని వచ్చింది. నాకు భోజనము పెడుతూ వుంది' ఇంతలో ఆ మూర్ఛ (స్థితి) విడిపోయింది. శరీరములో శక్తి సంచారము కలిగినది. ప్రసన్నత కూడా కలిగింది. కానీ అంతటితో నా ప్రతిజ్ఞ పూర్తయింది అని నేను అనుకోలేదు. 7వ రోజు రాత్రి మెలకువగా వున్నపుడే వాత్సల్యమయి కరుణామయి శ్రీ సీతాజీ కంచంలో భోజనం తీసుకుని వచ్చింది, తన చేత్తో తినిపించింది. నా తలపైన చేయి వుంచి ప్రేమగా నిమిరి ఆశీర్వదించింది.

నా జీవితములోని ఈ విశేష ప్రతిభ వుందే ఇది వారు ఇచ్చిందే'. ధర్భంగాలోని ఒక విద్వత్ పరీక్షలో వీరు ఒకేసారి, ఇద్దరు విద్వానులు చెప్పిన న్యాయ మీమాంస విషయములను రెండు చేతులతోనూ వ్రాశారు అన్న సంగతి బహుశా మీకు తెలిసేవుంటుందనుకుంటాను. వారి ధ్యానము, అవధానము ఎంత దృఢమైనదో!

బొంబాయి శ్రీస్వామి గంగేశ్వరానందజీ మహరాజ్ (వేద దర్శనాచార్య) వారు పంచమహా యజ్ఞమును ఏర్పాటు చేశారు. శ్రీ భగవదాచార్యులు కూడా వచ్చారు. వేదములయొక్క పౌరుషేయత అపౌరుషేయత, ఈ విషయంపై మా ఇద్దరికీ అభిప్రాయ భేదము కలిగింది. సభామంటపములోనే సంస్కృతములో శ్లోకములు వ్రాసి నేను వారి వాదనకు ప్రతివాదన చేశాను. వారు చాలా వినయంగా, సహృదయముతో తన విచారములను బయటపెట్టారు. తరువాత ఏ మాటపై నాకు దుఃఖం కలిగించారో దానికై క్షమాపణ అడిగారు. ఇదంతా చూచి నేను చాలా ముగ్ధుడిని అయ్యాను. ఆ శ్లోకాలు ఇపుడు నాదగ్గర లేవు. వారు తమ స్మారికలో కొన్ని శ్లోకాలు వ్రాశారు. అవి కూడా అసంపూర్ణంగా వున్నాయి. కానీ తరువాత వారి శతాబ్ది సమయంలో వారు నన్ను పిలిపించినపుడు, దేశములోని గొప్ప గొప్ప మహాత్ములు, విద్వానులు, నాయకులు మంత్రులు అందరూ అక్కడ ఏకత్రిత మయ్యారు. అక్కడ మహామండలేశ్వరుడు శ్రీ భాగవతానంద్‌జీ వారిని చాలా ప్రశంసిస్తూ 'వారు వ్రాసిన వేదాలపై భాష్యము సాత్వత సింహిత పక్షము ననుసరించి సరిగానే వుంది, బ్రహ్మసూత్రముల పైన మంత్ర సంహితములను అధికరణముగా చేసి నవీన భాష్యమును నిర్వాణము చేశారు, అలాగ ఇంత వరకు ఎవరూ, ఎక్కడా చెయ్యలేదు. తర్వాత నేను అధికారికంగా ఈ విషయాన్ని స్పష్టము చేస్తున్నాను. ఇది ఒక అభూతపూర్వమైనటు వంటి ఉద్భావన! 'విద్వానేవ విజానాతి, విద్వజ్జన పరిశ్రమమ్' విద్వానుడే విద్వానుల పరిశ్రమను అనుభవం చేసుకోగలుగుతాడు. ఈ స్వామి భాగవతానంద్‌గారు దాదాపు 14, 15 విషయాలకు ఆచార్యులని చెప్పనవసరం లేదనుకుంటాను, అంతే కాక సన్యాసులులో సర్వమాన్యులైన మహాన్ విద్వానుడు!'

శ్రీ భాగవతాచార్యులు కేవలము వేదశాస్త్రములయొక్క పారదర్శక విద్వానులేక, వారి సహృదయత, వారి సౌజన్యము కూడా అపూర్వమయినది. వారు శ్రీ జానకీ

మాతను గురించిన చర్చ రాగానే ఒక అలౌకిక రసానుభూతిలో మునిగిపోయేవారు. నేత్రాలలో అశ్రువులు, శరీరములో రోమాంచము, వాణి పులకితము అవుతూవుండేది. వారు 'ఆబూ'లోని 'చంపా' గుహలో వుండేటపుడు శ్రీజానకీజీనే వారి లలాటముపై తిలకము పెట్టినారని అక్కడి జనం చెబుతారు. వారి జన్మ శతాబ్ది జరిగాక కూడా వారు కర్రసాయంతో నా దగ్గరికి వస్తూవుండేవారు. నేను ఎక్కడ బస చేస్తే అక్కడికి వచ్చేవారు. ఒక రోజు వారు స్వయంగా తన చేత్తో ఖిచిడీ తయారు చేసి తినిపించారు. నేను అక్కడి నుండి బయలుదేరబోతే వారు బయటి వరకు వచ్చి సాగనంపేవారు. వారి దృష్టిలో ఎంత స్నేహం, వ్యవహారంలో ఎంతటి సౌజన్యము వుండేదంటే వారి వైదుష్యము చాలా వెనక్కుపడిపోయేది. వైష్ణవ-జనులు వారికి 'శ్రీరామానందాచార్య' పదవిని ఇచ్చారు. కానీ వారి జీవనశైలిలో ఏమీ మార్పు వుండేది కాదు. 'పండితరాజ్' మరియు 'సార్వభౌమ' బిరుదులు కాశీ విద్వానులు ఇచ్చారు. వారు వ్రాసిన గ్రంథములు, వారి పాండిత్యము, భక్తి భావము ఇవన్నీ సమాజసేవకు ఉజ్వల ప్రమాణములు.

శ్రీ భాగవదాచార్యుల వారిని గురించి స్మరిస్తూ నేను అసలు విషయము నుండి వేరయ్యాను. రండి! మరల తిరిగి వెళదాము!

రమారమీ 1935-36వ సం. ప్రసిద్ధ మహాత్ముడు శ్రీప్రభుదత్త బ్రహ్మచారిగారు ప్రతిష్ఠానపూర్(ఝూసీ)లో భగవన్నామ సంకీర్తనమనే సంవత్సరవ్యాప్తమైన ఆయోజనం చేశారు. నేను కూడా ఆ అనుష్ఠానములో మౌనంగా, పలహారంతో వుంటూ శ్రీమద్భాగ వతముపై ప్రవచనము చేస్తూ వుంటిని. బ్రహ్మచారీజీకి నాపై చాలా స్నేహం (ప్రేమ) వుండేది. వారు చాలా గొప్ప గొప్ప మహాత్ములు, మహా మండలేశ్వరులు, నాయకులను ఆహ్వానించి, వారి ఎదుట నా ప్రవచనము పెట్టించారు. నిజం చెప్పాలంటే బ్రహ్మచారీజీనే నన్ను సార్వజనిక కథావాచకుడిని చేశారని చెప్పవచ్చు. ఆ మహోత్సవములో శ్రీఉడియాబాబాజీ మహరాజ్ విచ్చేశారు. శ్రీ ప్రయాగ రాజమునకు 12 రోజుల పాటు ఉత్సవం చేశారు. శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్ వారు అక్కడి నుండే తన అనుచరులతో శ్రీ అయోధ్య ధామమునకు పాదయాత్ర చేశారు. వారు కాలినడకనే యాత్రలు చేసేవారు. మార్గమధ్యములో అనేక చమత్కారములు జరిగినవి.

శ్రీ అయోధ్యలో ఆ రోజులలో చాలా మంది వయోవృద్ధ సంత్ మహాత్ములు నివసిస్తుండిరి. శ్రీహనుమత్-నివాస్ దగ్గరనే శ్రీ ఉడియాబాబాజీకి వుండడానికి ఏర్పాటు చేశారు. గొప్ప గొప్ప సంత్‌లు కలుసుకోవడానికి వచ్చేవారు. ఇపుడు నాకు వారి పేరు గుర్తులేదు కానీ వారు ఒక సమిష్ఠి బంఢారం (విందు) చేశారు. అందులో వేలాది సంఖ్యలో అయోధ్యవాసులయిన సంత్‌లను దర్శించే సౌభాగ్యము కలిగినది.

ఒక ఘటన నాకు మాటి మాటికీ గుర్తు వస్తూ వుంటుంది. శ్రీఉడియాబాబాజీ వారి స్వాగతసత్కారము కొరకు 'మానసపీయూష' రచయిత శ్రీ అంజనీనందశరన్ గారు వచ్చారు. శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారు వారిని చూసి ఎదురెక్కి వెళ్ళారు. ఇరువురు ఒకరికొరకు నేలపైన సాష్టాంగ దండవత్ చేసుకున్నారు. ఒకరి తర్వాత ఒకరు వందలాది జనం పృధ్విపై సాష్టాంగ దండవత్ చేయడం మొదలుపెట్టారు. ఒక అద్భుతదృశ్యం ఉపస్థితమైపోయినది. శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్ నవ్వుతూ నిల్చున్నారు. అందరూ అలా పడివున్నారు. కాసేపటికి అందరూ సామాన్యస్థితికి వచ్చారు. మానవపీయూషకారుడు మహాత్ముడు అత్యంత వినయి, సరళుడు, మహాత్ములయందు మహా శ్రద్ధ కలిగినవాడు. వారు బాబాగారి దగ్గర కూర్చుని అనేక ప్రసంగములపై విభిన్న వ్యాఖ్యాతలయొక్క పరస్పర విలక్షణ భావములను వినిపించారు. వారు రామచరితమానసమును ఎంతో గంభీరంగా అధ్యయనము చేశారు. మరియు 'మానస' రహస్యములను ఎంత సాక్షాత్కరించుకున్నారంటే, వింటుంటే హృదయము పులకితము అయిపోయేది. ఈ యుగములో 'రామచరితమానసమే' వేదము, మరియు శివోక్తము అవడము వలన అది తంత్రము అని వారు చెప్పేవారు. అది ఒక ఆశీర్వాదాత్మకమయిన గ్రంథము. ఎవరయితే దీనిని ఆశ్రయిస్తారో వారికి భగవత్ప్రాప్తి అవశ్యముగా కలుగుతుంది.

ఆరోజులలో మహాత్మ శ్రీకాంతశరణ్‌జీ 'మానస తిలక్' కోసము సంగ్రహము చేస్తూవుండిరి.

అక్కడనే ఎవరో ఒక మహాత్ముడు ఈ ప్రసంగమును వినిపించారు. శ్రీఅవధ ధామములో ఒక మహాత్ముడి వద్ద సత్సంగము జరగుతూ వున్నది. ఒక భావుకుడైన సాధకుడు విసనకర్రతో వీస్తున్నాడు. పంకా విసరుతూ, విసరుతూ ఎంత భావ

విహ్వాలుడయ్యాడంటే వారి చేతి నుండి ఆ పెద్ద పంఖా జారి క్రింద పడిపోయింది. వారు మూర్ఛితులై పడిపోయారు. చాలా మంది మహాత్ములు లేచి నిలుచున్నారు. వారిని ప్రక్కకు తీసుకువెళ్ళి నీళ్ళు చల్లి, భగవచ్చరణామృతమును త్రాగించారు. వారు సావధానులయ్యారు (తేరుకున్నారు) జనులు 'ఏమయింది?' అని అడిగారు. 'పంఖా విసిరేటపుడు నాకు ప్రతి ఒక్కరి మహాత్ముల హృదయాలలో శ్రీ సీతా రామ లక్ష్మణ హనుమత్సమేతముగా విడివిడిగా వున్నట్లు నాకు అనిపించింది. వారు పరస్పరం ఒకరినొకరు చూచుకుని చిరునవ్వులు చిందిస్తున్నట్లు మాట్లాడుతూ, ఆనందిస్తునట్లుగా వుండినది ఇదంతా భగవంతుడి లీల. బస్! అంతే దాని తర్వాత నాకు ఏమి జరిగినది తెలియదు' అని తెలిపారు. మరల వారు పంఖా విసరడము కొరకు ప్రయత్నిస్తే మహాత్ములన్నారు 'ఇక ఇపుడు మీకు సేవాధికారములేదు. ధ్యానము, సమాధి లేదా తన్మయత ఇవన్నీ కూడా స్వసుఖము, ఆత్మసుఖము, భగవత్సుఖమును కూడా ఉపేక్షించి తత్సుఖీ భావంతో సేవ చేస్తారో, వారికే సేవాధికారము కలుగుతుంది. ఇక ఇపుడు మీరు ధ్యాన-భజనలలో తన్మయత యొక్క రసాస్వాదనము చేయండి. మిమ్ములను సేవ నుండి ముక్తులను చేస్తాము' అన్నారు. ఈ ప్రసంగము విన్నపుడు అదంతకదే ఒక మాట గుర్తువస్తుంది. ద్వారకలో సత్యభామ, శ్రీకృష్ణులకు పంఖావిసరుతూ విసరుతూ దారుకుడికి ఎపుడైతే రోమాంచితమయినదో, అశృపాతము, తన్మయతా సంచారము కలిగినదో అపుడు తను తనను తాను సావధానం (జాగ్రత్త) చేసుకున్నాడు, ఆత్మ సుఖమును ఉపేక్షించి భగవత్సేవలో సంలగ్నుడయ్యాడు. ఈ కథను భక్తి రసామృత సింధులో శ్రీరూపగోస్వామి జీవారు వ్రాశారు.

కల్యాణ్ సంపాదక పనులలో వ్యస్తుడనై, తర్వాత సన్యాసము స్వీకరించిన తర్వాత శ్రీ అయోధ్యకు వెళ్ళి రావడం చాలా మటుకు తగ్గిపోయింది. విశేష ప్రసంగమేమి గుర్తుకురావడం లేదు. 1950వ సం॥లో (రమారమి) కాన్పూర్ వాలీ మాతాజీ (సర్ పద్మపత్ సింఘానియా వారి తల్లి) వారు నన్ను అయోధ్య తీసుకువెళ్ళారు. వంతెనకు పైవైపున ఎక్కడైతే సరయూ నది యొక్క స్వచ్ఛమైనధార, ఇసుక తిన్నెలతోటి పులినము, విశాల భూభాగము ఒక దివ్యమైన కాంతితో

ప్రకాశిస్తున్నట్లుండేది. గంట, రెండు గంటలు అక్కడే గడిపాము. స్నాన-పాన-భోజనాదులు అన్నీ నదీతటము దగ్గరనే అయిపోయాయి. 'సర'అంటే రామచంద్రుడి వైపు వెళ్ళేది, 'యూ' అంటే అర్థము ప్రభువుతో కలిపేది. ఈ మానసనందిని సరయూ జనుల మనసులలో రామభక్తిరసమును నింపేది. స్వాభావికముగానే అక్కడ శ్రీవియోగి హరిగారి దోహాస్మృతి పథంలో మాటిమాటికీ మెదులుతుంది.

కలిత కంత ధను తూన కటి కర సర సరయూ తీర ।
సంగ సఖాన బానిక వహై బసతు దృగని రఘువీ ॥

ఓహో! ఇదే అదే సరయూ తటము! రఘువరుడు శ్రీరామచంద్రుడు భుజముపై ధనుషు, కటిభాగముపై తూణీరము, కమలము వంటి చేతిలో బాణము పట్టుకుని సఖులతో కూడి విహరించినచోటు ఇది.

కొంత సేపు మాతాజీతో పాటు, రామ కథా ప్రసంగము నడిచింది. సాయం కాలము కనక భవనములో శ్రీ సీతారాముల వైభవము యొక్క దృశ్యము ఒక్క క్షణము లభించినది. కానపూర్ తిరిగి వచ్చేశాము.

దైవీ సంపద్ మహామండల్ వారి యాత్ర 'చరిత్ర-నిర్మాణ తీర్థయాత్ర స్పెషల్' బయలుదేరిపుడు అందులో నేను కూడా వెళ్ళాను. శ్రీ అవధయొక్క మహాత్ములు చాలా ఉదారతతో ఛావని, ప్రమోదవనము, శ్రీజానకీఘాట్, హనుమాన్‌గఢీ, భగవదాచార్యుడు సభామండపములో స్వాగత సత్కారములు చేశారు. అవధ్ సంత్ మండలి ఆనందోల్లాసంతో తన్మయమై భగవన్నామ కీర్తనలో మునిగిపోయేవారు. ఈ యాత్రలోనే శ్రీసీతారామ శరణ్‌జీ, శ్రీలక్ష్మణ్ కిలాధీశ్‌తో కలవడం జరిగింది. వారు 'చావనీ'లో వాల్మీకి రామాయణముపై పాండిత్య పూర్ణమైన ప్రవచనము చేశేవారు. సద్గురు-సదనములో స్వయంగా వారు భోజనం తయారుచేసి, దేవుడికి నైవేద్యము పెట్టి, తరువాత మాకందరికీ ప్రసాదము పెట్టారు. నేను వారితో భాగవత చర్చ చేస్తూ వుంటిని. వారిలో విద్వత్తు, రసికతా రెండూ కలిసి వుండేవి. అప్పటి నుండి ఇప్పటి వరకు శ్రీ సీతారామశరణ్‌జీ తో మాటిమాటికీ కలుసుకోవము, రాకపోకలు జరుగతూనే వుండేవి. కాన్‌పూర్, వారణాసి, ఢిల్లీ, బొంబాయి,

వృందావనములలో ఎప్పుడెప్పుడు నా శ్రీమద్భాగవతము లేదా అన్య ప్రవచనములు జరిగేవో అపుడు వారు ప్రేమపూర్వకముగా ఒక శ్రోతగా ఉపస్థితులయ్యేవారు. స్వయంగా వారు బొంబాయి, బృందావనములో శ్రీమద్వాల్మీకి రామాయణము శ్రవణ సంబంధముపై చాలా సుందరము, మధురమైన భావమును వినిపించేవారు.

శ్రీ సీతారామశరణ్‌జీ మహరాజ్ నాకు శ్రీగుణరత్న కోశము నుండి ఎన్నో మధురములు భావపూర్ణములు అయిన శ్లోకములను వినిపించారు. నన్ను చదవమని కూడా కోరారు. వాటిలో ఉదాహరణకు కొన్ని శ్లోకములు ఇస్తున్నాను.

మాతా మైథిలి రాక్షసీ స్త్వయి తదైవార్ద్రాపరాధస్త్వయా
రక్షన్త్యా పరనాత్మ జాల్లఘుతరా రామస్య గోష్ఠీకృతా ।
కాకం తచ్చ విభీషణం శరణమిత్యుక్తిక్షమౌ రక్షతః
సానః సాంద్రమహాగసస్సుఖయతు క్షాంతిస్తవాకస్మికీ ॥

కాకి మరియు విభీషణుడు రాముడి శరణు వేడినపుడు తను రక్షణ ఇచ్చాడు. కానీ జనని జానకి రాక్షసస్త్రీలు తనను శరణు కోరలేదు, అయినా కూడా హనుమంతుడి నుండి రక్షించారు, ఇపుడు రాముడే తక్కువయ్యాడు. అలాంటి అహైతుకీ కృప ఆ మాతది. మేము చాలా పాతకులము. మమ్ము కూడా సుఖింపజెయ్యి.

పితేవత్వత్ప్రేయాంజనని పరిపూర్ణాగసి జనే
మితస్రోతోవృత్యా భవతి చ కదాచిత్కలుషధీః ।
కిమేతన్నిర్దోషః క ఇహ జగతీతి త్వముచితైః
రుపాయైర్విస్మార్యం స్వజనయసి మాతా తదసి నః ॥

లోకులలో దోషాలుంటాయి. పితృవాత్సల్యంతో హితభావనతో రాముడు వారిని కోపించినపుడు తల్లీ! మీరంటారు ఇదేమిటి ఈ జగత్తులో ఎవరు నిర్దోషులు? అని చెప్పి దోషాలను విస్మరింపజేసి మమ్ములను నీ స్వజనులుగా చేసుకుంటావు. అవును మరి! నీవు మా తల్లివి కదా!

శ్లో॥ **అధికయితవానబ్ధిం నాథోమమంథ బబంధతమ్**
హరధనురసౌ వల్లీభంజం బభంజ చ మైథిలి ।

అపి దశముఖీం లూత్వా రక్షః కబంధమనర్తయత్
కిమివన పతిః కర్తాత్వచ్చాటు చుంచు మనోరథః ॥

ఒకసారి సముద్రములో శయనించావు, ఒకసారి మంథనము, మరోసారి బంధనము (సేతువు) శంకరుడి ధనుసు అనాయసముగా విరిచావు. దశముఖ రావణుడిని ఖండించావు. ఓ సీతాదేవి! నీ ప్రేమలో మునిగి వారు ఏమోమి చేశారు! ఎన్ని చెయ్యలేదు?!

ఐశ్వర్యమక్షరగతం పరమం పదం వా
కస్మై చిదంజలిభరం వహతే వితీర్య ।
అస్మైన కించిదుచితం కృతమిత్యథాంబ
త్వం లజ్జసే కథయ కోయముదార భావః ॥

ఎవరైన ఒకసారి నమస్కరించగానే వారికి ఐశ్వర్యము, అక్షరగతి పరమపదము వరకు ఇచ్చేస్తావు, మరల నేను వీరికి ఇవ్వలేదు, అని సిగ్గుపడతావు ఓహో! సీతామాతా! ఎటువంటి అద్భుతమైన ఔదార్యము నీది! చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యము వేస్తుంది.

ఈ అయోధ్య స్మృతులలో ఒక మహాపురుషుడు - వారి సౌశీల్యము, సౌజన్యము మరియు వైదుష్యము మరువలేనిది. వారికి అవధ్‌లో ఒక సురుగన్న విద్యాలయంలో అధ్యయనము చేస్తున్నపుడు చూశాను. శ్రీ సంపూర్ణానంద విశ్వవిద్యాలయములో అధ్యాపనము చేస్తుండగా చూశాను. భారత సాధు సమాజ సమితిలో సమ్మిళిత మైనపుడు చూశాను. నేను వారి సరళ జీవనము, ఉన్నత విచారములను గౌరవించాను ఇప్పటికి గౌరవిస్తున్నాను. వారు ఎంతటి సరళ చిత్తులంటే వారికి తన పాండిత్యము యొక్క గొప్పతనం తనకు తెలిసేది కాదు. అవసరమయితే వారు అన్ని వేదాంత గ్రంథములను చదివించ (అధ్యాపనము)గలిగేవారు. సార్వభౌమ విద్వాన్ శ్రీవాసుదేవజీ మహరాజ్ వారిపేరు.

వారు ఒక రోజు ఏమీ సామాను, బట్టలు వెంటతెచ్చుకోకుండా, ముందు చెప్పకుండా ఎలాగున్నవారు అలాగ తనంతను నా దగ్గరకు వచ్చారు. ఆ రోజు నేను

ఇప్పటికి మరువలేను. వారి ఆత్మీయత చూసి నేను ఆశ్చర్యచకితుడనయ్యాను. వారికి జీవితంలో ఏ వస్తువు కానీ, వ్యక్తి కానీ ఏ ఆవశ్యకత లేదేమో! కొన్ని రోజుల వరకు వారు నాతోనే నాకుటీరములో చాలా సాధారణముగా వున్నారు. వారి జీవితములో అడుగడుగునా, ప్రతీ పనిలో కూడా మహాత్ముల లక్షణాలు వారిలో అభివ్యక్తమయ్యేవి. వస్తుతః మహాత్ముల జీవితము అలాగే వుంటుంది. వారు దివ్య అవధ ధామములోని ఒక దివ్య మహాపురుషులు. అలాగని నా విశ్వాసము.

సంత్ ఆత్మారామ వైద్య

రాత్రి సమయంలో మేము ముగ్గురం నలుగురం మిత్రులు కలసి కూర్చుని భగవన్నామ-సంకీర్తము చేస్తున్నాము. స్వర-తాళములతో ఝూంఝ వాయిస్తున్నారు. ఢోలక్ కూడా వాయిస్తున్నారు. తన్మయత లేదు, కాని కొంచెం - కొంచెం నిద్ర వస్తున్నట్లుంది. తలుపు తెరిచే వున్నది. ఒక వ్యక్తి ప్రవేశించాడు. వారి శిరసుపైన మెడలో, భజముమీద రుద్రాక్షమాలలే మాలలు వున్నాయి. చేతిలో కరతాళమున్నది నృత్యం చేస్తున్నాడు. మేము సావధానులమయ్యాము. మా సంకీర్తనము జరుగుతూనే వుంది, వారు నృత్యము చేస్తూనే వున్నారు. గంటలు గంటలు గడిచిపోయింది. ఇంకా తూర్పు తెలవారకముందు మసక మబ్బుల్లో వారు వెళ్ళిపోయారు. నేను, నా మిత్రులు వారిని ఒక సాధువనే అనుకున్నాము. కానీ మాలో ఒకడైన ఆత్మారామ్ వైద్య వారిని సాక్షాత్తే శంకరుడని అనుకుని ఆవ్యక్తిని వెంబడించి వెళ్ళారు, గంగాజీ ఒడ్డున క్రింద వున్న ఒక కాలువలోకి వెళ్ళిపోయారు. ఆ వ్యక్తి యెక్కడైనా దాక్కుని వుండవచ్చుకానీ ఆత్మారామ్ అనుకున్నాడు వారు అంతర్ధానమయ్యారని. వారి చిత్తములో శంకరుడి దర్శనము వలన కల్గిన ప్రసన్నత, అంతర్ధానమవడము వలన కల్గిన విషాదము ఇవి రెండూ చాలారోజులవరకు వుండేది. వారు ఈ సంఘటనను గురించి చర్చిస్తుండిరి. ఈ ఘటన ఝూసీ, ప్రయాగ సంకీర్తన భవనములో జరిగింది. దాదాపు 1935-36 ఆ సమయము కావచ్చు.

పండిత్ ఆత్మారాముడు సరళ స్వభావము కల్గిన ఒక సజ్జనపురుషుడు. నాకు, వారికి పరిచయము పైన చెప్పిన ఘటన కంటే చాలా ముందు కన్‌ఖల్, హరిద్వారం భారతీ విశ్వవిద్యాలయములో జరిగింది. నేను మహామండలేశ్వరుడైన శ్రీభగవతానంద్‌జీతో భాష్యం చదువుకుంటున్నాను. వేరే ఇతరులకు అన్య వేదాంత గ్రంథాలను

నేను చదివిస్తూ వుంటిని. అదే సమయములో బర్నాలాకు చెందిన పండిత్ శ్రీ ఆత్మారామ్, సంగరూర్‌కు చెందిన శ్రీజీవానందుడు, శ్రీవ్రజవల్లభుడు మరియు పండిత్ హరినందన్‌జీ అక్కడ బస చేసి వుండిరి. వారు కూడా వేదాంత శ్రవణము చేస్తూవుండిరి. పరస్పరము సత్సంగము జరుగుతూవుండినది. ఆత్మారామ్‌జీకి సంస్కృత శ్లోకములు చాలా కంఠస్థము వుండేవి. వారు వాటిని వినిపించుచుండిరి. నేను కూడా అదే చేస్తుంటిని. మరల వాటి అర్థముపై విచారణ జరిగేది. వారు సరళులు, సౌమ్యులేకాక, వినయవంతులు కూడా. ఏదైనా క్రొత్త అర్థము చెప్పవలసివస్తే వారు ఈ విధంగా తెలియజేశేవారు 'మీరు చెప్పినటువంటి అర్థమే సరియైనది, కానీ నాకు ఇలాగ అనిపిస్తుంది'. ఎవరు ఏది చెప్పిన వారు విశ్వసించకుండా వుండేవారుకాదు. అదెలాగంటే అలాగే నమ్మేవారు. ఒక రోజు భగవద్గీతా సంవాదముపై నేను వినిపించాను 'ఎవరైతే శ్రీకృష్ణుడు కర్మ-లేపముతో ముక్తుడు అని తెలుసుకుంటారో (అంటే కర్త కాదు, కర్మ-ఫల-భోక్త కాదు) అని అపుడు వారుకూడా స్వయంగా కర్తృత్వ, భోక్తృత్వముల నుండి ముక్తుడవుతారు. వారి నేత్రాలలో ఒకకాంతి తళుక్కుమంది. వారు ఇలా అడిగారు 'అదేలాగవుతుందండి? కృష్ణుడిని అకర్తగా, అభోక్తగా తెలుసుకుంటే మనము అకర్త, అభోక్తలము అవుతామా?' నేను వారికి ఇలా తెలియజెప్పాను. 'తత్త్వతః ఆత్మ అసంగము, నిర్వికారము, ఏకరసము, ఏదైతే శ్రీకృష్ణుడి ఆత్మయో అదే నా ఆత్మ, అందరి ఆత్మ కూడా. అంశ అని అనుకున్నాకూడా స్వరూపములో భేదమేమీరాదు. భేదమంతా ఉపాధి కారణంగానే కదా! ఉపాధి తన అభావము యొక్క అధికరణములో భాసమానమవడము వలన మిథ్య అవుతుంది. అందువలన ఆత్మనిత్య, శుద్ధ, బుద్ధ, ముక్త-స్వరూపమే! శ్రీకృష్ణుడి ఆత్మను తెలుసుకుంటే నీ ఆత్మను తెలుసుకోగలవు. ఇక అపుడు కర్మబంధన సంబంధము ఎక్కడ?!' ఇది విని వారు ఆనందంలో నిమగ్నులయ్యారు. వారు ఇలా చెప్పారు 'నిజంగానే కర్మ మరియు భోగము వీటితో ఆత్మకు ఎలాంటి సంబంధము లేదు'. ఇలాగ సరళ భావంతో అదే మాటను మాటి మాటికీ అనుకుంటున్నారు. ఇదే మహావాక్యము యొక్క తాత్పర్యము.

వారు సాధారణముగా నిశ్శబ్దముగా వుండేవారు. చాలా అవసరమయితే కొద్దిగా మాట్లాడేవారు. వాణి మధురముగా వుండేది. ఆక్షేపము ఎక్కడ? ప్రశ్న కూడా

అడిగేవారు కాదు. ఎపుడూ వారి నోటి వెంట ఎవరిని గురించి కూడా నిందవినలేదు. ఎవరైనా ఎవరినైనా రూక్షంగా మాటాడితే 'ఇది ఏమి లీల! జరుగుతోంది?' అనేవారు. నేను ఎపుడైన సాంసారిక మిధ్యాత్వమును నిరూపించమొదలిడితే వారు 'మీరు చెబుతున్నది సరి! మీకు కూడా అంతా మిథ్య అని అనిపిస్తుంది. ఇదంతా మనసు చేశే లీల. మీరు మాకు సెలవివ్వండి! గీతలో జగత్తు మిధ్యని తెలియజెప్పడానికి యుక్తి ఏమిటి? మీరు మాకు సెలవివ్వండి' అని అడిగారు. నేను 'ఆత్మారామ్‌జీ! సత్యమునకు జన్మ - మరణాలు లేవు. ఎలాగ ఆత్మకు కూడా లేవో అలాగ. జన్మ - మరణాలు అంటే ఉత్పత్తి, వినాశముల ప్రతీతి. మన జన్మ మరణముల కల్పన చేయవచ్చు కానీ ప్రతీతి కలుగదు. అసత్యమునకు కూడా జన్మ - మరణములుండవు. వంధ్యాపుత్రుడికి లాగ. అదయితే లేనే లేదాయె, దాని ఉత్పత్తి వినాశము ఇక కలిగేది ఎవరికి?' వారు 'సరేనండి'. మీరు నాసతో విద్యతోభావో అన్న దానికి తాత్పర్యము తెలిపారు. అపుడు ఇదేమిటి? సరే సరే! అది అనిర్వచనీయము కదా! అనిర్వచ నీయము అంటే ఆత్మయే కదా! 'మరల నవ్వుతూ' ఆత్మారామ్ అజుడు, అజరుడు, అమరుడు, అవినాశి, ధన్యము! ధన్యము! అన్నారు.

ఒకసారి 'ఈ శ్రీకృష్ణుడు కూడా సీదాసాదాగా మాటలాడడు. ఒక్కోసారి అన్ని దృశ్య పదార్థములు నాలో వున్నవి అంటాడు. ఒక్కోసారి 'నాలో ఏమీ లేదు' అంటాడు. ఎటువంటి లీలాధారి వీరు?' అన్నారు ఆత్మారామ్‌జీ. నేను అన్నాను 'ఆత్మారామ్‌జీ! ఎవరికి ఎలా కనిపిస్తుందో వారి కొరకు అలాగే చెబుతారు. అర్జునుడికి జీవించివున్న భీష్మ, ద్రోణ, కర్ణుడు కనిపించేవారు, అపుడు జీవించివున్న భీష్మ, ద్రోణ, కర్ణులను చచ్చినవారిలా చూపించాడు. అది కూడా ఎక్కడ? తన శరీరములోనే. వారు ఏమిటి చచ్చారా? బ్రతికారా? అజ్ఞానుడి దృష్టితో జీవితులు. విరాట-దర్శి జ్ఞాని యొక్క దృష్టిలో మృతులు. అజ్ఞాని యొక్క దృష్టితో పరమాత్మలో సర్వం స్థితము అయింది. తత్త్వజ్ఞాని దృష్టితో ఏమీలేదు'. ఆత్మారామ్‌జీ ఒక్కోసారి మాట్లాడేటపుడు చాలా ఆశ్చర్యభావం వ్యక్తపరిచేవారు. 'ఓహోహో! ఏమిలీల! అందుకే మీరు దీనిని మాయ అంటారు. వుంది, లేదు. ఎంత ఆశ్చర్యము!' నేను కనఖల్‌లో గీత అధ్యయనము చేయించాను. దానినే మాటిమాటికి గుర్తుచేసుకుంటుండిరి.

నా ఉత్తరాలు 'ఆనంద-వాణి'లో ప్రచురించేటపుడు నాకు జ్ఞాపకం వచ్చింది, నేను గృహస్థాశ్రమములో మా వూరిలో వున్నపుడు, గోరఖ్‌పూర్ 'కల్యాణ్' పరివారములో వున్నపుడు వారికి కొన్ని ఉత్తరములు వ్రాసివుంటిని. అవి సురక్షితముగా వుంటే వాటిని పంపమని వారి పుత్రులు శ్రీభోలేనాథ్‌కి ప్రబుద్ధానందతో ఉత్తరం వ్రాయించాను, భోలానాథ్‌జీ మాతృ-పితృ భక్తులైన ఒక సజ్జన పురుషుడు. అపుడపుడు నాతో కలిశేవాడు. వారు నేను వ్రాసిన నాలుగు ఉత్తరాలు వెదికి తీసి వాటిని పంపించారు. వాటిని మా ముందుంచేముందు వారి పుత్రులు బోలేనాథ్ యొక్క ఉత్తరమును ముందుంచుతున్నాను.

ప్రబుద్ధానందజీ పేరుతో శ్రీభోలానాథ్ యొక్క లేఖ -

పరమాదరణీయ పూజ్య శ్రీ స్వామి ప్రబుద్ధానందజీ మహరాజ్ యొక్క పావన చరణకమలములలో భోలానాథ్ సవినయ ప్రణామములు.

చాలా రోజుల తర్వాత నిరాశను ఆశలోకి మార్చివేశారు. దీనికి నేను ఎంతో కృతజ్ఞుడను అని చెప్పడానికి నాదగ్గర మాటలులేవు.

మీ నుండి వుత్తరము చూసి ఎంత సంతోషము కలిగినదో, దానితోపాటే కొంచెం మనసులో వ్యథ ఎక్కువయింది. పూజ్య మహరాజశ్రీ వారు ఈ ప్రసాదమును పంపడానికి నేను అయోగ్యుడనని ఎందుకనుకున్నారు? ఏమి? వారికి నేను భోలానాథుని పేరుగల ఈ శరీరమునకు పితామహుడవడం అంగీకారం కాదా? ఒకలేళ అంగీకారమయితే ఎలాగయితే మా తండ్రిగారికి ఒక్కమాటతోనే సునిశ్చితము చేశారో అలాగే కృపను ఈ దీనుడిపైన కూడా చూపించనీ, దాని వలన పూజ్య పితృదేవులు నాదగ్గర లేరన్నది నాకు అలాగే మహరాజశ్రీ యొక్క ఉపదేశములు ఎలాగ వారి రోమరోమాలలో విద్యమానమై వుండేవో అలాగే సదైవ నా రోమరోమములో విచారణ చేస్తున్నారన్న అనుభవం కలగనీ.

ఉత్తరం వ్రాసేటపుడు పూజ్యశ్రీ మీ దగ్గరనే వున్నారని తెలిసింది. మీరు ఉత్తరములో వ్రాసినట్లు పూజ్య మహరాజవారు బాల్యములోనే ఇల్లు విడిచినారని. మొదటి సారి మహరాజశ్రీని కలిసినపుడు వారి వాస్తవిక స్వరూపము ఎలాగుండేదో

తెలుపమని మిమ్మలను సవినయంగా ప్రార్థిస్తున్నాను. పూజ్యశ్రీ యొక్క చరణసేవలో ఎన్ని రోజులున్నారు? ఎలావున్నారు? ఒకవేళ పూజ్యశ్రీ సరిఅనుకుంటే నాకు పూర్తి వివరణ ఇవ్వనీ. లేదా వారికి సరి అనితోస్తే 'చింతామణి' త్రైమాసికములో ప్రచురించనీ.

ఏప్రియల్‌లో మహారాజశ్రీ వారిని కలుసుకున్నపుడు ఎక్కువగా మాట్లాడు కోవచ్చు. పూజ్యశ్రీ వారి పుణ్య చరణాలలో శేష జీవితము గడపాలని మనసులో బాగా అనిపిస్తుంది. అయితే దాని కొరకు కూడా పితామహుడి పవిత్ర స్వీకృతి మొట్టమొదట కావలసివుంది.

ఈ రిజిస్ట్రీలో, ఈ ఉత్తరముతో పాటు మహారాజశ్రీ వారు పూజ్యులు నాన్నగార్కి వ్రాసిన లేఖలు పంపుతున్నాను, మీకు సరి అని తోచిన విధంగా మీరు చేయండి. 'చింతామణి' నాకు పంపుతూ వుండండి. నేను దానికై నా చేతనైనంత సేవ చేస్తాను.

ఆఖరున బ్రహ్మరూపులైన పూజ్య మహారాజశ్రీ పావన చరణకమలములలో మాతృ-పరివార సహితముగా సవినయ కోటికోటి ప్రణామములు. తొందరలో జవాబు పంపమని కోరుతూ ప్రార్థిస్తున్నాను.

మీ కృపాకాంక్షి,
భోలానాథ్

ఆత్మారామ్‌జీ పేరున నా లేఖ -

మొదటి ఉత్తరం - నా జన్మభూమి 'మహరైయా' పూరి నుండి వ్రాసినది. రెండవ ఉత్తరం - సేఠ్ శ్రీజయదయాల్ గోయెంకాజీ (గీతాప్రెస్ సంస్థాపకులు) వారి నివాసస్థానము 'బాంకుదా' నుండి వ్రాసినది. మూడవ ఉత్తరం - భాయిజీ శ్రీహనుమాన్ ప్రసాద్ పొదార్‌జీ (కల్యాణ్ సంపాదకులు) వారి జన్మభూమి 'రతన్‌గఢ్' రాజస్థాన్ నుండి వ్రాసినది. నాలుగవ ఉత్తరం - సన్యాసి అయ్యాక వ్రాసినది. ఐదవ ఉత్తరం - బహుశా శ్రీ జీవానందుడి పేర వ్రాసినట్లుంది.

మొదటి ఉత్తరము

శ్రీమదాత్మానందఆది మమానుభావేషు,

ఆనంద పూర్వకమైన సృష్టిలో లేశమాత్రము దుఃఖమన్నది లేదు. ప్రతీతి మరు మరీచికలాగ మన స్వకపోల కల్పన వలన జనించినదే. అఖండ ఆత్మతత్త్వములో కార్యకారణములు కేవలం స్వప్నవత్ మాత్రమే. అందువలన దృష్టి-శృత (కన్నవి, విన్నవి) అన్నవాటి యొక్క కల్పన స్ఫురణ కూడా లేదు. మనము ఎపుడైతే స్వరూపస్థితిలో వుంటామో అదే వస్తుతః జాగ్రదవస్థ. సంసారము స్వప్నదశ లాంటి దానిని సత్యమని నమ్మడం వలన రాగ-ద్వేషాలు మరియు దాని నుండి సుఖ దుఃఖాలు పడుతున్నాయి. 'ఇది స్వప్నము' అన్న ఒక స్పష్టమైన 'బోధ' వున్నదే దానికే స్మృతి, జ్ఞానము అని పేరు. సర్వ క్షేత్రములలో క్షేత్రజ్ఞుడిని నేను ఒక్కడినే, క్షేత్రము యొక్క సత్తా, శక్తి, క్రియ విభిన్న విచిత్రతలు ఏకరసుడనైన నాలో లేపోయినా అవి ప్రతీతము అవుతున్నాయి. నేను ఈ స్వాప్నిక చిత్రపటము యొక్క పవిత్రతకు నిత్యసాక్షిని. ఈ స్వప్న రహస్యములు నాకు తెలుసు. అందువలననే అన్ని రకాల దృశ్యములలో కూడా 'ఆనందము' యొక్క అవిచ్ఛిన్న ధార ప్రవాహితమవుతుంది.

సాక్షిత్వము, జ్ఞాతృత్వము ఇవి కూడా చాలా విచిత్రమైనవి. వస్తుతః 'ద్రష్టా' తననే చూసుకుంటాడు. 'జ్ఞాత' తననే తెలుసకుంటాడు. విజాతీయ వస్తువుయొక్క జ్ఞానము ఏ విధంగానూ కలుగదు. ఉదాహరణకు - నేత్రేందియములతో సూర్యుడి ప్రకాశము వలన రూపజ్ఞానము కలుగుతుంది. సర్వతేజములు తన్మాత్ర యొక్క రూపమే మనసు పాంచభౌతికమైన జ్ఞానమును గ్రహిస్తుంది. ఎందుకంటే అది వాటితోనే తయారైంది కాబట్టి. నేను జగత్తు యొక్క ద్రష్టను, జ్ఞాతను. అందువలన నాతో అది (జగత్తు) అభిన్నమైనదే. నేను చేతనుడిని, కాబట్టి అంతయు చైతన్యమే అయివున్నది. అపుడు నాలో స్వగత-భేదమున్నదా ఏమి? ఎలాగంటే దానిమ్మపండు లోని రసము, గింజలు, తోలు అంతా మొత్తము కలసి దానిమ్మ అవుతుంది, అలాగే నేను కూడా ద్రష్ట, దృష్టి, దృశ్యము వీటి యొక్క రూపమే నేనా ఏమి? విశిష్టాద్వైత మతావలంబుల అనుభవము ఇదే. సాంసారిక జ్ఞానోపలబ్ధియొక్క నియమమే ఇది. కానీ నా ఆత్మతత్త్వములో స్పందన, పరిణామము కలగడానికి వీలులేదు. ఏక రసము

అవకాశహీనము. స్థిరము, పరిపూర్ణము అయిన వస్తువులో - వికారిత్వము, దేనితోనయితే వినాశిత్వము కూడా కలిగివున్నదో, అది నాలో సంభవము కాదు. అందువలననే త్రివిధరూపత పరిణామము కాదు, వివర్తము - సతాత్వికము, అన్యథాభావము లేదు. అతాత్వికము. ఈ వివర్తము వలన సకల ప్రపంచము యొక్క సృష్టి ప్రక్రియ యొక్క సోపాత్తిక నిరూపణము, ఆత్మసాక్షాత్కారము పొందినవారి ద్వారా చేయబడింది. ఇది ప్రతి ఒక్క శుద్ధ మనన శీలురు, నిధి ధ్యాసన చేసిన వారికి ఇది అనుభవము అవుతుంది. కానీ ఈ ఝుంఝూటంలో పడనవసరము లేదు. ఏదో ఒక పాము వచ్చి మీ ఒడిలో పడింది అని ఊహించండి! అపుడు ఇది ఎక్కడి నుండి? ఎందుకు వచ్చి పడింది అని ఆలోచిస్తూ కూర్చుంటారా? లేక దానిని వెంటనే దులిపివేస్తారా? అలాగే ఈ మాట కూడా సంసారము-సర్పము అవి ఒకే అర్థము కలిగిన శబ్దములే. 'సంసరణాత్ సంసారః - సర్పణాత్ సర్పః' దీని ఉత్పత్తి, ఉపపత్తి అంటూ కూచోవడము వ్యర్థము. అందువల్లనే ఆఖరికి సాంఖ్యాదర్శన ప్రణేత ఇలా అంటారు, 'యద్వా తద్వా తదుచ్ఛిత్తిః పురుషార్థః'. ఏది ఏమైనా దానిని ఉచ్ఛేదము చేయడమే (ఆత్యంతిక సత్తానాశము) పురుషార్థము.

అందు వలననే గురువు మొదట బ్రహ్మ యొక్క స్వరూపమును అర్థము అయ్యేలా చేస్తాడు 'ప్రజ్ఞానం బ్రహ్మ' ఇది అర్థము చేసుకున్న తరువాత 'తత్త్వమసి' అని చెబుతారు. అంతే ఇక్కడితో గురుదేవుల దీక్ష, శిష్యుడి శ్రవణము కూడా సమాప్తమవుతుంది. ఇక ఇపుడు చేయవలసినది, మననము. 'అయమాత్మా బ్రహ్మ' అని చింతన చేసి, 'అహం బ్రహ్మాస్మి' అని నిధిధ్యాసన చేస్తాడు. మననము, నిధి ధ్యాసనము ఇది మనము చేయవలసిన పని. ఇది సర్వదా తన పురుషార్థ ప్రయత్నముపైనే ఆధారపడి వుంటుంది. ఇది స్వరూప సాక్షాత్కారమునకు సాక్షాత్ ఉపాయము.

మీ

శాంతను విహారీ

(మహరైయా, ధానాపూర్, బనారస్)

రెండవ ఉత్తరం శ్రీహరిః

శ్రీ ఆత్మారామ్‌జీ,

ఏకరస అఖండ సచ్చిదానంద ఆత్మయందు నామరూపముల యొక్క సత్తయే లేదు. ఆత్మలో సంయోగ వియోగములు కలగడానికి అందులో వేరుగా అస్తిత్వము అన్నది వుంటేకదా? మీరు స్వరూపస్థితులై వున్నారు. ఒకవేళ 'శాంతను' అనే పేరుగల శరీరము ఏదైనా వుంటే, అది మీతో భిన్నమైనదా? అభిన్నమైనదా? భిన్నత్వమును ఊహించను కూడా లేము, ఒకవేళ అది అభిన్నమయితే వియోగము ఎక్కడ వున్నది? దేవతా! నేను నీ నుండి వేరు అవలేదు, వేరు కాదు, వేరు అవబోను! నేను ఆత్మరూపముతో నీ అపరోక్షమును కాదా? సాక్షి, సాక్షిత్వము ఇవి లేకపోయినా నేను సాక్షినేనా? నిరంతరము నా ఈక్షణశక్తి వలననే 'ఆత్మారామ్' అనే పేరుగల శరీరము అప్యాయతము, ఆప్లావితము అవుతున్నది. అంతా నా సంకల్పమే, అయినా కూడా నేను నిస్సంకల్పుడిని. ఒకే అఖండ చిద్వస్తువులో సంకల్పము, నిస్సంకల్పము రెండూ కూడా మాయావిజృంభితములే. ఆ చిద్వస్తువు 'నేను' యొక్క వాచ్యార్థము కాదు, రెంటి యొక్క లక్ష్యార్థమే అది. అందువలన 'నేనే' సత్యము, సత్యమే నేను.

మీ శాంతను

మూడవ ఉత్తరము

ప్రియమైన ఆత్మదేవుడికి,

ఎప్పుడూ నీ ఆత్మదేవుడిలో నీవు ఆనందంగా వుండు. ఏకరస పరిపూర్ణ సచ్చిదానందమే మన వాస్తవిక స్వరూపము. భావము, అభావము ఏమీ లేదు. అనిర్వచనీయమైన స్థితి. సజాతీయ-విజాతీయ-స్వగత భేదము లేనటువంటిది. కోటి చతుష్టయ-వినిర్ముక్తము దీనిలో రాడం, పోవడం, కలవడం, విడపోవడం అని ఎక్కడుంది? నేను సత్యము! సత్యమునే చెబుతున్నాను, ఒక వేళ చెప్పకపోయినాకూడా వ్యవహారిక దృష్టితో నాకు ఎవరియందూ ప్రేమ లేదు, (ఎందుకంటే) నా కంటే అన్యమైనది కూడా ఏదీ లేదు. ఇక అపుడు ఉత్తరం వ్రాయడం, సంబంధం ఇవన్నీ చర్చ ఇక ఎక్కడ? కేవలం ఆధ్యారోపము వలననే అనుకున్నా కూడా అదీ కల్పనా

మాత్రమే. కన్‌ఖల్‌లో శ్రీశంకరానందజీ దర్శనం కోసం వెళ్ళాలని వుంది. ఒకవేళ మీ ఇల్లు దారిలో వుందా? సహరాన్‌పూర్, ఢిల్లీ మధ్యలో వుంటే గనుక కలుసుకుని వెళతాను. వెంటనే కబురు చెయ్యలేకపోతే కన్‌ఖల్ రాగలిగితే వచ్చేసేయ్!

నీ ఆత్మ
శాంతను

నాల్గవ ఉత్తరము

శ్రీహరిః

అధిగత్య త్వయా ప్రత్తం పత్రం మోముద్యతే మనః
కథం చిరాయితం తాత స్వవృత్త ప్రేషణే నను (1)

కిం న స్మరసి కుంభే ప్రాగ్హ రిద్వారే యదా వయమ్
మిలితాస్తత్వ చింతాయాం ప్రావర్తిష్మ యథాసుఖమ్ (2)

సాక్షి సాక్ష్యాదికో భేదో, ముధైవ పరి కల్పితః
జిజ్ఞాసు పరితోషార్థం క్వ బ్రహ్మ క్వ భిదా యతః (3)

నాధిష్ఠానం న చాధ్యస్తం ఆత్మైవేకో న చేతనత్
యథా తథా భాతు నామ భానం కించిన్న భిద్యతే (4)

దేశకాలౌ తథావస్తు ప్రకాశయతి యః సదా
స్వయం ప్రకాశరూపస్త్యం స ఏవాస్మీతి నిశ్చిను (5)

కదా కుత్ర కథం కేన మిలనం విరహోఽథవా
త్వమర్థో వాఽహమర్థో వా యది నాస్తి పృథక్వచిత్ (6)

అత్ర వాఽన్యత్ర వా యత్ర కుత్రాప్యాగత్య వా సుఖమ్
ఆత్మారామశ్చిరం శాంతః స్వనిష్ఠస్తిష్ఠ సాదరమ్ (7)

త్వదీయః అఖండానంద, అధివృందావనమ్.

ఈ శ్లోకముల భావార్థము ఇది - నీవు పంపిన ఉత్తరము చూచి మనసు ఆనంద భరితమయినది. నీవు జవాబివ్వడంలో ఎందుకు ఆలశ్యం చేశావు? మొదట మనము కుంభమేలా హరిద్వార్‌లో కలుసుకున్నపుడు స్వచ్ఛమైన స్వచ్ఛందవేదాంత చర్చ చేసుకునేవారము అది గుర్తున్నదా? సాక్షి-సాక్ష్యము ఈ భేదము మిధ్యా కల్పితము. కేవలం జిజ్ఞాసువుల తృప్తికోసము మాత్రమే (సమాధానము కోసము) నిజంగా! ఎక్కడ బ్రహ్మ! ఎక్కడ భేదము! రెండు ఒక్కదగ్గర వుండజాలవు. ఆత్మ అద్వయము. అందులో అధిష్ఠాన అధ్యస్తమనే భేదము లేదు. భాసమానము (భానము) ఎలాగైనా సరే! భాస్యగత భేదముతో భానస్వరూప పరబ్రహ్మలో లేక ఆత్మలో ఏ విధమైన భేదము వుండదు. ఏదైతే సదాసర్వదా దేశ-కాల-వస్తు ప్రకాశకము, స్వయం ప్రకాశ చిద్వవస్తువు అదే నేను - అని నీవు నిశ్చయం చేసుకో. నీవు, నేను వీటి అర్థము కూడా ఎక్కడైనా, ఎపుడైనా, ఏ రూపములోనైనా కూడా వేరు వేరుగా వుండదు. ఇక అపుడు సంయోగ, వియోగముల ప్రసక్తి ఎక్కడ? ఇక్కడ లేదా ఎక్కడైనా వుండనీ! ఆత్మారాముడవై సుఖశాంతులతో వుండు. ఆత్మనిష్ఠుడవై వుండు

ఐదవ వుత్తరము

శ్రీహరిః

మాతృతయా మానవతయా మేయతయా వస్తుతయా
భావతయాఽభావతయా బ్రహ్మ ఖాతి సర్వతయా ।
యావత్సో దృశ్యకలనాః సర్వాః స్ఫూర్త్యేక భూవయః
తత్త్వాశ్రయాః నిర్విషయాః నిఃస్వరూపాస్త్వమేవ తత్ ॥

నీకు ఏదైనా ఒక శరీరము యొక్క ఆవశ్యకత ఏమున్నది? నీకు ఎపుడు ఎవరితోనూ వియోగము కలుగదు స్వయంగా నీవు. అటువంటి వాడిని మనదేమి కేవలము శారీరక సంబంధము మాత్రమేనా? కాదు, కాదు, మనం ఆత్మరూపముతో ఒక్కటే. మనం కలుసుకోవడానికి మృత్యువు, వియోగం అడ్డు కాలేవు. అవునా? అంతే కదా సరేనా! శరీరాన్ని మరిచిపో. నేను ఆత్మను అన్నది గుర్తుంచుకో అంతే!! ఇంకేమీ చెయ్యనవసరము లేదు. ప్రియ ఆత్మానందుడిని అడిగానని చెప్పుము.

వారు గుర్తుచేసుకుంటూనే వుంటారు. ఆనందంగా వుండు. నన్ను అంటే నిన్ను నీవు ఎపుడూ మరువకు. ఇదే ఉపదేశము. ఇదే ఆదేశము. యథేచ్ఛసి తథాకురు.

మీ

శాంతను

శ్రీ జీవానందజీ బ్రహ్మచారి ఆత్మారామ్‌జీతో పాటు కన్‌ఖల్‌లో నన్ను కలిశారు. వైద్య ఆత్మారామ్‌జీ యందు వారికి చాలా శ్రద్ధ, వారు వారితో పాటు నాదగ్గరికి వస్తువుండేవారు. వారు సంగరూర్‌లో ఏదో ఒక గుడిలో పూజారిగా వుండేవారు. తర్వాత వారు నాతో బ్రహ్మచర్య దీక్ష తీసుకున్నారు. బృందావనములో నా దగ్గరికి వస్తూవుండేవారు. వారు శ్రీ ఆత్మారామ్‌జీ యొక్క స్థితిని గురించి చెబుతూ వుండేవారు. వారు ఇలా చెప్పారు 'ఆత్మారామ్‌జీ ఒక్కోసారి చాలా సమయం వరకు ఎలాకూర్చున్న వారు అలా కూర్చుండిపోయేవారు అటువంటపుడే వారి మనసులో ఏవాసనలు, సంకల్పములు తలెత్తేవి కాదు. ఎక్కడికైనా రావాలని పోవాలని కూడా ఇష్టము వుండేది కాదు. ఏదో నిద్రలో వున్నట్లు, కానీ ఏదైనా ప్రశ్నిస్తే సరిగ్గా జవాబు ఇచ్చేవారు. తనంతటతను ఏమీ మాట్లాడేవారు కాదు. సంకల్పము లేకుండా, శరీరము నిష్క్రియగా వుంటూ, నిద్రకాదు, జాగృతికాదు, స్మృతి, విస్మృతి లేదు. పరేచ్ఛతో వ్యవహారము జరుగుతూ వుంటే అదే స్వరూపస్థితి యొక్క లక్షణాలని శాస్త్రము చెబుతుంది.

శరీరాన్ని విడిచిపెట్టే ముందు వారి కుటుంబసభ్యులు వారిని నా దగ్గరికి తీసకుని వచ్చారు. వారి ముఖమండలముపై విలక్షణమైన ప్రసన్నత వుండేది. చేతులు జోడించి కూర్చునేవారు. మాటి మాటికీ ప్రణామం చేస్తూ వుండేవారు. ఒక్కోసారి 'ధన్యోహం' 'ధన్యోహం' అని కూడా అంటుండేవారు. నేను ఇలా అడిగాను 'జీవుడివా? బ్రహ్మవా? ఎలాగనిపిస్తుంది?' అని చిరునవ్వు నవ్వుతూ 'నేను జీవుడినీ కాను, బ్రహ్మనీ కీను' అని జవాబిచ్చారు. వస్తుతః జీవత్వ భ్రాంతి నివృత్తి కోసము బ్రహ్మత్వమును ఉపదేశిస్తారు. భ్రమ సమూలంగా నివృత్తమయిన తర్వాత 'నేను బ్రహ్మను' అని చింతన చేయవలసిన అవసరం ఏమీలేదు. ఎలాగంటే ఇపుడు ఒక మనిషి తను మనిషిని అని తెలుసుకోవడానికి 'నేను మనిషిని' అని మాటి మాటికీ అనుకోవలసిన

అవసరము లేదు. అలాగే తన అద్వితీయత తెలుసుకున్న తర్వాత 'నేను బ్రహ్మను' అని మాటిమాటికీ వల్లెవేయవలసిన అవసరం లేదు. ఇంకా కొందరు అంటారు. అజ్ఞాన నివృత్తి రూపమైన ప్రయోజనము సిద్ధించిన తర్వాత బ్రహ్మ విచారము కూడా బాధితమయిపోతుంది అని ఇదివేరే సంగతి.

శ్రీ ఆత్మారామ్‌జీ తన పరివారంతో కలసి వాళ్ళ వూరికి తిరిగి వెళ్ళారు. తర్వాత కొద్దిరోజులకే వారి ఆకృతి విరిగిపోయింది. (వారు శరీరాన్ని వదిలివేశారు) కుండ పగిలిపోయింది. కానీ మట్టి అయితే వున్నదే. మరణోత్తరగతిని గురించి సనాతనధర్మము యొక్క దృష్టికోణము చాలా నిర్ధిష్టమైనది. పూర్వజన్మ వాసన, ఉపాసన మరియు కర్మ వీటి ననుసరించి జీవుడు సూక్ష్మశరీరము, దానినే లింగశరీరం అని కూడా అంటారు అది ఉత్తరకాలీనమైన గతిని పొందుతుంది. ఎలాగంటే క్రోధానిష్టమైన సర్పముంది, మాంసాసక్తమైన గద్ద, పద్దపులి అలాగ. పాపపుణ్యములు సమస్థితిలోనే సాధారణంగా మనుష్యజన్మ కలుగుతుంది.

ఒకవేళ లౌకిక ఆకృతిలో ప్రారబ్ధ భోగసామర్థ్యము లేకపోతే యాతనా శరీరప్రాప్తి కలిగి పరలోకములో కూడా భోగించవలసివుంటుంది. కర్మయొక్క న్యూనాధికముల కరణముగా దుఃఖాధిక్యము లేదా సుఖాధిక్యము కలుగుతుంది. బ్రహ్మలోకము నుండి కూడా తిరిగి రావలసి వస్తుంది, లేదా బ్రహ్మతో ముక్తి కలుగుతుంది. కానీ ఇవన్నీ ఎంత వరకు తమ స్వరూపం యొక్క అజ్ఞానం కారణంగా పరిచ్ఛిన్నత అనే భ్రమ వుంటుందో అంతవరకే. స్వరూపజ్ఞానము కలిగిన తర్వాత దేశము బాధితము కాబట్టి రావడం పోవడమన్నది లేదు. కాలము బాధితము కాబట్టి జననమరణము లేదు. దృశ్యము బాధితము కాబట్టి శారీకప్రాప్తి కలుగదు. కర్తృత్వము బాధితము అవడము వలన పాప, పుణ్యములు, భోక్తృత్వము బాధితమవడం వలన సుఖ, దుఃఖాలు కూడా వుండవు. అందువలన ఎలాగైతే అజ్ఞాని జీవుల ప్రాణోత్క్రమణ జరుగుతుంది. అలాగ జ్ఞానీ పురుషుడికి కాదు. వారు ఎలాగుంటే అలాగ పరబ్రహ్మ స్వరూపులే! ఉపాధి మూలకమైన ఆకార-వికార, సంస్కార-ప్రకారములన్నీ బాధితము లవుతాయి. సమాధిలోకి కూడా వెళ్ళనవసరంలేదు. అందువలన నిత్య నివృత్తి యొక్క నివృత్తియే జ్ఞానము వలన కలుగుతుంది. జిజ్ఞాసువు యొక్క వ్యవహారార్థము

సత్యము, బ్రహ్మ, ఆత్మ, ముక్తి, చిన్మాత్రము మొదలైన శబ్దములను ప్రయోగిస్తారు. వస్తుతః బ్రహ్మాత్మబోధ శబ్దములు, వృత్తులు వీటి స్వైర విహారమునే బాధితము చేస్తుంది.

శాంతినిష్ఠ శ్రీ ఓంకారదత్త శాస్త్రి

సద్గురుదేవులు శ్రీ ఉడియాబాబాజీ వారి ఆశ్రమములో దైనిక భాగవత ప్రవచనము ముగించి లేవగానే ఒక నిరాడంబరుడైన యువకుడు వచ్చి నాకు నమస్కరించాడు. వేసుకున్న గుడ్డలు కూడా ధోవతి, కుర్తా, చేతిలో ఒక చిన్న సంచి. నమస్కారము చేసిన తరువాత చాలా సరళస్వభావంతో నేను మీ ఆశ్రమములో కొన్ని రోజులు వుండాలనుకుంటున్నాను, అన్నాడు. నేను 'సరే వచ్చేయ్! నా నివాసస్థానము జె.కె.మందిరములలో తయారైన ఒక గదివుంది అక్కడికిరా అన్నాను. వచ్చి వుండిపోయాడు శ్రీపద్మావతీ బిహారీ మందిరం (జె.కె. మందిరం) నుండి ప్రసాదం లభించేది. ఇలా రెండు మూడు రోజులు గడిచిపోయాయి.

ఒకరోజు నేను సంస్కృతములో కొన్ని శ్లోకాలు వ్రాశాను చూచి వాటిని సరిదిద్దండి అని అతడు అన్నాడు. రెండు మూడు రోజులు ప్రవచనము వినగానే నాకు సంస్కృత వ్యాకరణం సాహిత్యంతో పరిచయమున్నదన్న సంగతి అతడికి అర్థమయింది. నా దగ్గరికి చాలా మంది సంస్కృత శ్లోకాలు వ్రాసుకుని తీసుకువచ్చేవారు కానీ సాధారణంగా వుండేవి అంతసరిగా వుండేవి కాదు. హతవృత్తము, చ్యుతసంస్కృతము, రసాలంకార శూన్యములై వుండేవి కానీ చ, వా, హ ఈ అక్షరాలు ఎక్కువగా వుండేవి. అందుకని నాకు ఆ వ్యక్తి సంస్కృత శ్లోకము ఏమి వ్రాసివుంటాడు? అని ఆశ్చర్య మేసింది. కానీ నా అనుమతి తీసుకుని శ్లోకాలు తీసుకువచ్చి నాకు చదివి వినిపించా లనుకున్నాడు. కానీ నేనే వాటిని నా చేతిలోకి తీసుకున్నాను. ఒకటి రెండు శ్లోకాలు చూడగానే నాకు చాలా బాగా అనిపించింది. అందమైన లిపి, భాషా ప్రవాహము, వ్యాకరణము కూడా ఒక్క అశుద్ధి కూడా లేదు, అలంకృతము, రసపూర్ణము అయిన రచన. 'ఇది నీరచనయా?' అని నేను అడిగాను. ఎంత బాగుందంటే నాకు ఒక్కసారిగా

విశ్వాసం కలుగలేదు. 'అవుతనండీ! నేనే ఏదో అలా కొంచెం వ్రాస్తూ వుంటాను' అన్నాడతడు.

అలా వారి పరిచయమయింది. మహేంద్రగఢ్‌లోని ఒక చిన్న వూరిలో వారు జన్మించారు. 'భివానీ'లోని శ్రీవిద్యామార్తాండ పండిత్ శ్రీసీతారామశాస్త్రిగారికి శిష్యుడు. వారు ఈ సంగతి కూడా నాకు తెలిపారు ఏమిటంటే లాహోర్‌లో విద్యామార్తాండ శాస్త్రిగారు సర్వతంత్ర స్వతంత్ర్య విద్యానిధి శ్రీ నృసింహదేవ శాస్త్రి గారితో న్యాయ, వేదాంత విషయపరమైన గంభీర చర్చలు జరిగినపుడు లేఖన కార్యక్రమము తనే చేశేవాడినని చెప్పారు. ఇది మరీ ఆశ్చర్యకరమైన సంగతి! వీరు వేద వేదాంత మీమాంస న్యాయ శాస్త్రములలో కూడా విద్వాంసులు! వారి వ్యాకరణ, సాహిత్య జ్ఞానము వారి శ్లోకములు చూస్తేనే తెలిసిపోయింది. ఈ రోజు కూర్చుని ఈ సంఘటనలను చెప్పి వ్రాయిస్తున్నాను ఇపుడు 1984వ సం॥ అంటే ఇప్పటికి 34 సం॥ల క్రిందటి మాట. వారి సరళత, శాలీనత, సౌజన్యము, వినయము, పవిత్ర నిస్పృహ జీవనము చూచి నేను ముగ్ధుడినయ్యాను. వారి పాండిత్యమును గురించి నాకు తెలుసు. కానీ జనులు వారిని ఒక సాధారణ బ్రాహ్మణపండితుడనే అనుకునేవారు.

వారు ప్రొద్దున ప్రాతఃకృత్యాలు స్నాన, సంధ్యాదులు ముగించుకుని సాధన, భజన, సత్సంగములో మునిగిపోయేవారు. ఏదో కొంచెం రొట్టెలు దొరికితే అక్కడే తినేవారు. ఎపుడు ఎవరినీ ఏమీ యాచించేవారు కాదు. చలినుండి కాపాడుకోవడానికి బట్టలుకానీ, భోజనము కానీ ఏమీ ఎవరినీ అడిగేవాడు కాదు. స్వాధ్యాయము, ధ్యానము చేసుకునేవారు. స్వాధ్యయములో జపము, పారాయణ. చాలా అవసర మనిపిస్తే తప్ప మాట్లాడేవారు కాదు. సాధారణముగా మౌనముగా వుండేవారు. యమునా స్నానమునకు వెళ్ళేవారు. ఒక ఇత్తడి డబ్బా (క్యారీ)లో నీళ్ళు తెచ్చుకునేవారు. రావడానికి, పోవడానికి దాదాపు 4మైళ్ళు కాలినడక అయ్యేది. ఎపుడైనా నవ్వినా శబ్దం చెయ్యకుండా నవ్వేవారు. కళ్ళు ముఖము మాత్రం ప్రఫుల్లితములయ్యేవి. బృందావన ధామముపై వారికి చాలా ప్రేమ కలిగింది.

భక్తుల దృష్టిలో బృందావన ధామము లౌకికము కాదు, అది దివ్య ధామము. అక్కడి రాయి రప్పలు కూడా చింతామణులే, లతలు వృక్షములు కల్పవృక్షములే!

ఆవులు కామధేనువులు. గొప్ప గొప్ప సంత్ మహాత్ములు ఇక్కడ వృక్షరూపములో వుంటారని కొందరి విశ్వాసము ఉద్ధవుడిలాగ. లతలరూపములో భక్తిరతులైన మాతృదేవతలే నివసిస్తారు. లతరూపములో గోపి అని, తరు రూపములో శ్యామ సుందరుడని కూడా కొందరు భావిస్తారు. యమునా నది యొక్క శ్యామ ఇసుకరేణువు కృష్ణుడని, తెల్లటి ఇసుకరేణువు రాధ అని కూడా అంటారు. అక్కడి స్త్రీత్వంలో రాధారాణి యొక్క ప్రకాశము, పురుషత్వములో శ్రీకృష్ణుడి ప్రకాశము అని కూడా అంటారు. అందువలన బృందావనము బ్రహ్మమయమైన ప్రేమభూమి, భక్తజనులు ప్రేమతో ధ్యానించి ఆ దివ్యత్వాన్ని సాక్షాత్కరింపజేసుకుంటారు. స్వప్రకాశ అధిష్ఠానము యొక్క అనుభవము కలుగుతుంది. భావాత్మక స్వప్రకాశ అధిష్ఠానమే శ్రీ బృందావన ధామము. అందుకని శాస్త్రీయ దృష్టితో చూసినా స్మృతి విస్మృతులు రెంటిలో భేదమేమీ లేదు. ధామ నిష్ఠ వలన త్యాగము, వైరాగ్యము, సమత, నిర్వాసనత, తితిక్షమొదలైన అన్నిగుణములు స్వయంగా వచ్చి చేరుతాయి.

ఓంకార దత్త శాస్త్రిగారి ధామ భావన చాలా దృఢమవుతూ వచ్చింది. కానీ వారు నాతో వుంటే బాగుంటుందని నాకు అనిపించేది. నేను వారితో శాస్త్ర చర్చలు చేశేవాడిని. వారి పాండిత్యం కూడా చాలా బాగా అనిపించేది. ఒకసారి నాకు 'కాన్‌పూర్'లోని గంగాకుటి వెళ్ళవలసి వచ్చింది. నేను 'మీరు కూడా నాతో రండి' అన్నాను. వారు చాలా వినయులు, అంతే కాక నావద్ద చాలా సంకోచపడేవారు. అందువలన నా ఆజ్ఞగా భావించి వారు నాతో పాటు వచ్చారు. 8, 10 రోజులు అక్కడ వున్నారు. భాగవతముపై నా ప్రవచనము జరుగుతూ వుండినది. ఆ సమయములో శతాధిక ఆయుస్సు కల్గిన శ్రీస్వామి హీరానందజీ మహరాజ్ వారు కూడా భాగవత శ్రవణము చేశేవారు. ఎదురుగా గంగానది ప్రవహిస్తూ వుండేది. చాలా ఆనందముగా వుండేది. శాస్త్రీజీని అందరూ వైద్యజీ అనేవారు. వారు అక్కడవున్నా బృందావనమునే స్మరించుకుంటు వుండేవారు. అక్కడి నుండి తిరిగి వచ్చాక 'మీరు మరల ఎపుడు నన్ను బృందావనము నుండి బయటికి వెళ్ళేందుకు ఆజ్ఞ ఇవ్వకండి' అన్నారు. నేనూ వారి మాటను అంగీకరించాను. తర్వాత వారు జీవితమంతా బృందావన ధామములోనే గడిపారు అని చెబితే మీకు సంతోషము

కలుగుతుందనుకుంటాను. ఎలాంటి సాదాసీదా వేషభాసలో వచ్చాడో అలాగే వున్నాడు. అలాగే స్వాధ్యాయము, జపము, తపము, భోజనము... అన్నీ అలాగే.

ఒక ధనికుడికి నాపై కొన్ని సంశయాలు వుండేవి. ఎదుటికి వచ్చి అడగటానికి, చెప్పటానికి అయితే ధైర్యం లేదు. తను వచ్చి శాస్త్రిగారితో కలిసిమెలసి వుండడము మొదలుపెట్టాడు. నేను ఏకాంతములో ఏమి చేస్తానో, తెలుసుకోవాలని ఆవ్యక్తికి కుతూహలము వుండేది. నా జీవితములో ఏదైనా తాంత్రిక సాధన వున్నదేమో అనే సంశయము వుండేవి ప్రభావపూర్ణమైన వాణి, అడగకుండానే ధనము వచ్చిపడడము, స్త్రీలు గుమిగూడటము ఇవన్నీ వారి సంశయానికి సందేహానికి కారణమైనవి. వారు శాస్త్రితో 'నేను మీకు నెలకు రూ.60/-లు ఇస్తాను. జీవన-నిర్వాహానికి ఏర్పాటు చేస్తాను. ఈ విషయాలన్నీ కనుక్కుని నాకు చెప్పండి' అని అడిగారు. శాస్త్రిగారు విని వూరుకున్నారు. ఏమీ మాట్లాడలేదు. అతడు వెళ్ళిపోయాక శాస్త్రి ఏడవడం మొదలుపెట్టాడు. చాలా వ్యాకులత పొందాడు. నా దగ్గరికి వచ్చి 'నేను అపరాధిని. నా హృదయములో శాంతి లేదు' అని అన్నారు. చాలా మార్లు అడిగిన తర్వాత తన హృదయవ్యథ ఇలా చెప్పుకున్నారు 'నా హృదయములో ఎక్కడో ఏదో దోషము లేకపోతే వారికి ఇంత ధైర్యం ఎలా వస్తుంది, నాదగ్గరికి వచ్చి అలా మాట్లాడటానికి! నా శ్రద్ధలో ఏదో లోపం వుంది. దోషదృష్టి బీజరూపంలో వుంది కాబోలు! డబ్బుపై లోభమా? ఏదో ఒకటి నాలో కల్మషం వున్నది' అని చాలా వ్యాకులత చెందారు. నేను వారికి చాలా నచ్చజెప్పాను, అయినా వారికి సమాధానము కలుగలేదు. వారు నాతో ఇలా అన్నారు 'ఈ అపరాధానికి ఒక్కటే ప్రాయశ్చిత్తము! నేను మీ దగ్గర దీక్ష తీసుకుంటాను. ఎప్పటికీ మీకు శరణాగతుడనై వుంటాను'. నేను వారి మాటను అంగీకరించాను. సత్పురుషుల హృదయము అలాగే వుంటుంది. వారిలో లేశమాత్రం దోషం కనిపించినా వారికి అది కొండంత అనిపిస్తుంది. స్వచ్ఛ వస్త్రముపై కొంచెం మరక పడినా పెద్దగా కనిపిస్తుంది. శాస్త్రిగారి హృదయం అలాంటిది.

నేను వారిని నా దగ్గర కూర్చోబెట్టుకుని మానసీ, చాక్షుషీ, స్పార్శి దీక్ష ఇచ్చాను. శ్రీకృష్ణ మంత్రము సబీజంగా ఉపదేశము చేశాను. ధ్యానము, ఉపాసన విధులు కూడా తెలియజెప్పాను. వీరు మృత్యుపర్యంతము అదే విధంగా సాధన చేశారు.

వారు ఏదైనా ఒక నియమము తీసుకున్నారంటే కష్టానికి ఓర్చి అయినా నియమాలను పాటించేవారు. ఎవరైతే నియమపాలన కోసం కష్టానికి ఓర్చుకోలేరో వారికి ఆ నియమము ఫలాన్ని ఇవ్వలేకపోతుంది, అంటే అంతఃకరణ శుద్ధికి సాధన కాలేకపోతుంది.

మెల్లమెల్లగా ఆశ్రమములో వారి విశేష వ్యక్తిత్వము అందరికీ తెలియసాగింది. వారు నేను వున్నపుడు నాకంటే ముందు, నేను లేనపుడు వేరే వక్తలతో కలసి ప్రవచనములు చేయనారంభించారు. వారి ప్రవచనశైలి చాలా బాగుండేది. సాధకులకు విశేషతః విరక్తులకు వారి ప్రవచనములు చాలా నచ్చేవి. వారు ఉదాహరణ పూర్వకముగా తను చెప్పదలచినదాన్ని స్పష్టంచేశేవారు. సామాన్య జీవితములోని మాటామంతి లాగ వ్యాఖ్యానము మొదలుపెట్టి మధ్యలో గంభీరమైన విషయములను నిరూపణ చేశేవారు. ఆఖరున దాన్ని మరల మధురంగా మార్చేవారు. ప్రవచనములో అశుద్ధ ప్రయోగము చేశేవారుకాదు. జీవనోపయోగకరములైన మాటలను దృష్టిలో వుంచుకునేవారు. వాక్కులో ఏ విధమైన ఉత్తేజన లేకుండా, ఆవేశపడకుండా ఎలా శ్రోతల చరిత్ర పవిత్రమగునో, అంతఃకరణ శుద్ధమగునో అలాంటి మాటలను మాట్లాడేవారు. వారి ఉపన్యాసములు విన్నవాళ్ళకు వారు వ్యాకరణమును, దర్శన శాస్త్రములను, సాహిత్యములను తెలిసినవారని అర్థమయి పోయేది. శ్రీహరిబాబాజీ వారి ప్రవచనములను చాలా ప్రేమతో వినేవారు. తర్వాత రాత్రికాలీన సత్సంగములో వ్యాకరణ సంబంధమైన మాటలు అడిగేవారు. శాస్త్రిగారికి 'నిరుక్తము' యొక్క జ్ఞానము కూడా బాగా వుండేది.

శాస్త్రిగారి సత్సంగములో అనేక భక్తజనులు పాల్గొనేవారు. వారిలో భక్త ధర్మచంద్‌జీ ప్రముఖులు. ధర్మచందజీ వ్రజభూమి మరియు బృందావన రసికులంటే వారికి చాలా ప్రేమ. వారు వ్రజభూమి సంత్ శిరోమణి విద్యాన్ రసికశ్రీ ప్రియాశరణ్‌జీ మహరాజ్‌గారి విశేష సేవకుడిగా వున్నారు. 'సమాజ్' ధృపద ధమార్ గాయకులలో విశిష్టుడు. నిద్రావిజయి. 80, 85 సం॥ల వయసులో కూడా స్వావలంబులు. నిత్యము యమునా స్నానము, ధ్యానము చేశేవారు. స్వయంగా భోజనం తయారుచేసుకుని తినేవారు. తన పని తాను చేసుకునేవారు. ఎంతదూరమైనా అనాయాసంగా నడవగలిగే

వారు. వారి సత్సంగములో ముఖ్యులు అజమేర్ రిటయర్డ్ ప్రిన్సిపల్ మధురాదాస్, మార్వాడీ అర్జునదాసు, సింధీ సహానిజీ ముఖ్యులు. వారందరూ భక్త ధర్మచంద్‌జీతో పాటు శాస్త్రీజీ సత్సంగమునకు వస్తుండేవారు. భక్తి భగవంతుడి చర్చ జరిగేది. భక్తజీ శాస్త్రిగారితో అనేక సంస్కృత గ్రంథములను హిందీలో అనువాదము చేయించారు. వారు శాస్త్రిగారికి పాలకోసమని ఒక ఆవును పెట్టాలనుకున్నారు కానీ వీరు ఒప్పుకోలేదు. జీవన నిర్వాహము కోసమని ఏదో ఒకటి హడావిడి చెయ్యడం శాస్త్రిగారికి ఇష్టముండేది కాదు. ఎంత వరకు పాత బట్టలు పనికివస్తు వుండేవో అంత వరకు క్రొత్త బట్టలు కూడా వాడేవారు కాదు. అక్కడికి ఇక్కడికీ అని కూడా వెళ్ళేవారు కాదు. హాసపరిహాసాలు చేసేవారుకాదు. ప్రవచన సమయములో తప్ప నా దగ్గర కూడా ఎక్కువ కూర్చునేవారుకాదు. ఏదైనా వ్యాకరణ సంబంధమైన మాట అడగవలసి వస్తే నేనే వారిని నా దగ్గరికి పిలిపించుకునేవాడిని. వారి జీవితము అత్యంత శాంతము, ఏకాంత ప్రియమయినది.

శాస్త్రిగార్కి కలలంటు ఎప్పుడూ వచ్చేవి కాదు. బాగా ధ్యానములో వుండేవారు. సగుణ సాకార ధ్యానము చేసేవారు. విచారము, చింతన నిర్గుణ నిరాకారమును గురించి చేసేవారు. వారితో మాట్లాడినపుడు సాకార నిరాకార రెంటిలో కూడా వారి బుద్ధికి సునిశిత ప్రవేశముండేది అని తెలిసిపోయేది. ఒక్కోసారి ఎంత గాఢమైన ధ్యానము జరిగేదంటే 'ప్రత్యక్ష' మైనంతగాను. సగుణసాకారము యొక్క ప్రత్యక్ష ధ్యానము జరిగిన యెడల నిర్గుణ నిరాకార అపరోక్ష అనుభవము సుగమమవుతుంది. ఒక దృష్టితో చూస్తే వారి వ్యక్తిత్వము ఎలా వుండేదంటే వారిలో అధర్మము యెడల విరోధము, చిత్తవృత్తులయెడల విరోధము, భగవంతునితో అనురోధము, స్వరూప దృష్టితో సర్వదా అవిరోధము అనిపించేది. వారు చమత్కారములకు ఏమీ మహత్వము ఇవ్వలేదు. తన జీవితములోని అలౌకిక ఘటనలకు కూడా ఏమీ మహత్వం ఇవ్వలేదు. వారు స్వయముగా సదాచారపరాయణులు, ఇతరుల కూడా జీవితములలో సదాచారములను చూచి ప్రసన్నులయ్యేవారు.

నా బలవంతముపై వారు కొన్ని రచనలు చేశారు. అవి రెండు మూడు ఇక్కడ మీ సమ్ముఖంలో ఉదాహరణలు ప్రస్తుతం చేస్తాను.

1. దుఃఖ నివృత్తి కొరకు కొన్ని ఉపాయములు -

(అ) శరీరమునకు, మనసుకే దుఃఖము కలిగేది, ఆత్మకు కాదు, ఆత్మ శరీరము కంటే సర్వదా అసంగము, వేరయినది. ఎలాగైతే కుండ కంటే, కుండలో ప్రతీతమయ్యే ఆకారము భిన్నమయినదో, లేక దేహము కంటే దేహము యొక్క ఛాయ వేరయినట్లుగ మనము మన అవివేకము వలన దేహము మరియు ఆత్మ యొక్క భిన్నత్వమును అర్థం చేసుకొనకుండా దేహము, మనసులపైన పడే దెబ్బలను, మన ఆత్మపై మనపైన పడినట్లు అనుకుంటాము, అందువలన మనకు దుఃఖము కలుగుతుంది. ఏదో ఒక అడవిలో ఇద్దరు మనుష్యులు వెళ్తున్నారు. సింహగర్జన వినివారు ఇరువురూ చెరి ఒక చెట్టు యెక్కి కూర్చున్నారు. సింహము చెట్టుపైన ఎక్కలేకపోయిది. అందులో ఒకరి నీడ క్రింద పడివుండడం చూసి ఆ సింహము దాపిపై పంజా విసరి కొట్టింది. ఆ మనిషి మూర్ఖత వలన ఆ దెబ్బ తనపైనే విసరిందని అనుకుని పై నుండి క్రిందపడ్డాడు. సింహము వాడిని తినేసి ఇంకో మనిషి దగ్గరికి వెళ్ళి అక్కడ కూడా ప్రతిబింబము (నీడ) పైన దెబ్బకొట్టింది. కానీ అతడు చతురుడు. నాదేం పోయింది నీడపైన కోడ్తోంది కొట్టుకోనీలే! అని నిశ్చింతగా చెట్టుపైనే కూర్చుండిపోయాడు. ఆఖరికి సింహము నిరాశతో తిరిగివెళ్ళిపోయింది.

(ఆ) సుఖ దుఃఖ రూపములలో ఆ భగవంతుని విధానమే వస్తుంది. వారి విధానము తన స్వజనులకు ఎప్పుడు కూడా అమంగళకరము కానేకాదు, మంగళకరమే అవుతుంది. ప్రారంభములో అది (ఆ అనుభవము) కటువుగా కఠోరముగా అనిపించినా, పరిణామములో అది మధురమే అవుతుంది.

(ఇ) తమ తమ ప్రారబ్ధ ఫలములే అందరికీ లభిస్తాయి. పుణ్యఫలము సుఖము, అదీ మనము స్వయముగానే అనుభవిస్తాము. పాపఫలము - దుఃఖము అదీ స్వయముగానే అనుభవిస్తాము. 'సుఖస్య దుఃఖ్యస్య న కోఽపి దాతా, పరో దదాతీతి కుబుద్ధిరేషా' (లేదా) 'కాహు న కోవు సుఖ-దుఃఖ కర దాతా, నిజకృత కర్మ భోగ సబ్ భ్రాతా' వ్యాపారి లాభము యొక్క సుఖము అనుభవిస్తున్నాడంటే మరి, వారికి ఎపుడైనా నష్టము కలిగిన దుఃఖముతో భయపడకూడదు.

(ఈ) దుఃఖము లభించకపోతే మన భోగాసక్తి, అహంకారము, మమకారము ఇవన్నీ ఎలా దూరమవుతాయి? అన్నపానాదుల వలన కష్టము కలిగితే వాటిపట్ల ఆసక్తి పోతుంది. ఒకవేళ మమతాస్పదులైన స్త్రీ, బంధుమిత్రాదుల వలన దుఃఖము కలిగితే వారి పట్ల మమత పోతుంది. ఇవన్నీ భగవత్ప్రాప్తిలో బాధకములు.

(ఉ) మన మనసు యొక్క కల్పనయే దుఃఖమును గోరంతను కొండంత చేసి చూపిస్తుంది, నిజంగా అంత దుఃఖము కలుగదు. భయము, ద్వేషము వీటి కారణముగా అల్పమైన విసయాలు కూడా మనకు పెద్దగా కనిపిస్తాయి లేదా అసలు ఏమీ లేకపోయినా కూడా భయము, ద్వేషము వలన ఆ విధంగా అనిపిస్తుంది - ఎలాగంటే రాత్రి సమయంలో స్తంభాన్ని చూసి భూతమేమో అని అనుకున్నట్లుగా వుంటుంది.

(ఊ) 'భైషజ్యమేతద్ దుఃఖస్య యదేతన్నాను చింతయేత్' దుఃఖము వచ్చినపుడు దానిని గురించి చింతించకుండా మన పని మనం చేసుకుపోవాలి.

(ఎ) దుఃఖము వచ్చినపుడు పూర్వము నీవు అనుభవించిన దుఃఖములను గుర్తు తెచ్చుకో, అవి ఎలాగ లేకుండా పోయాయో, ఇవీ అలాగే పోతాయి. 'చక్రవత్ పరివర్తంతే దుఃఖాని చ సుఖాని చ'.

(ఏ) శరీర కష్టమును ఔషదము ద్వారా, మనః క్లేశములను మనోరంజనము ద్వారా, శీతోష్ణములను తితిక్ష ద్వారా ధనాభావమును యథాలాభ సంతుష్టిద్వారా దూరము చేసుకోవాలి.

(ఐ) నిజంగా దుఃఖమన్నది ఏ దేశములోనూ లేదు, ఏ కాలములోనూ లేదు, ఏ వస్తువులోనూ లేదు. అది కేవలము మన మనసు యొక్క కల్పన మాత్రమే.

(ఒ) ఎవరినైనా మనసుతో వాక్కులతో ఎపుడైనా పీడించివుంటే, లేదా హింసచేసి వుంటే, అది గొప్ప పాపము కావడం వలన ఈ జన్మలోకానీ, జన్మాంతరములోని కానీ వారి ద్వారా పీడింపబడతాము, హింసింపబడతాము. అందువలన మనుష్యులు ఎపుడూ మనసుతో కూడా ఎవరి అనిష్ఠమును చింతించకూడదు. ఎవరైతే ఎపుడూ ఎవరికీ దుఃఖము కలిగించరో వారికి ఎపుడూ దుఃఖము కలుగనే కలుగదు.

2. దోషనివృత్తి కొరకు ఉపాయములు -

విషయములలో రూపము మాత్రమే అన్నిటి కంటే ఎక్కువగా బాధకము కావున, దాని నుండి మనలను కాపాడుకోవడానికి మునుపు వినినటువంటి సాధనలు ప్రస్తుతి చేస్తున్నాయి. తర్వాత శబ్దము, స్పర్శ, రసము, గంధము కూడా ఇందులో అంతర్గతమే. శబ్దాదుల కోసము కూడా ఈ సాధనలను ఉపయోగములోనికి తీసుకోవచ్చు.

(అ) విషయము యొక్క సదర్శనము - ధ్యానముతో దర్శనము చెయ్యండి. సామాన్య దృష్టి పడగానే సావధానులుకండి, అందులో మహత్వబుద్ధి మరియు గుణాధానము చెయ్యకండి.

(ఆ) విషయములను భగవద్రూపమని భావించి మనసులో నమస్కరించాలి. రూప దర్శనము బాహ్యములో కానీ, అంతరములో కానీ సమానమే.

(ఇ) ప్రాణాయామము చెయ్యడం వలన మనసు యొక్క చంచలత పోతుంది. ఎందుకంటే ప్రాణము వలననే చేష్ట కలిగేది. ప్రాణము లేకుండా మనసు ఏమీ చెయ్యలేదు. 'వాయుః సర్వమిదం జగత్'.

(ఈ) ద్వేషము, భయము, సంశయము వలన కూడా విషయములు అధిక బలంతో సాధకుడి దగ్గర చేరతాయి. ఎలాగైతే ఒక సాధకుడు తన గురువుగారితో ధ్యాన సంబంధమైన ప్రశ్న వేస్తే గురువు దాని నిరూపణ చేస్తూ 'చూడు ఇదంతా చేసేటపుడు నీకు 'కోతి' మాత్రం ధ్యానంలోకి రాకూడదు' అని చెప్పాడనుకోండి - ఇక చూసుకోండి పాపం! ఆ సాధకుడు ఎపుడెపుడు ధ్యానము చెయ్యడానికి కూర్చున్నా అపుడపుడు హఠాత్తుగా కోతి ధ్యానంలోకి వస్తునే వుంటుంది, తన ధ్యేయమును గురించ రాదు. దానిని వాడు మనసులో నుండి తొలగించాలని ప్రయత్నించేకొద్దీ అది ఇంకా ఇంకా ఎక్కువగా వస్తూ వుంటుంది. అందు వలన ద్వేషాత్మకమైన వృత్తి మరియు వాటివే అయిన అవాంతర రూపములు ఘృణ, శంక, భయము - ఇవన్నీ కూడా సాధకుని తన లక్ష్యము నుండి క్రిందకు తోసేస్తాయి. అందుకని వీటితో సావధానులై వుండాలి.

(ఉ) తమ తమ అంగములపట్ల కూడా విశేష ధ్యానం పెట్టి అనావశ్యకముగా చూడరాదు. విశేష అలంకరణలతో దూరంగా వుండటమే మంచిది. సాధారణ వేష భూషణలే మేలు. నూనె, సబ్బు ఇలాంటివి సర్వదా విడిచిపెట్టడమే మంచిది లేదా వాటిని ఔషధిలాగ అత్యావశ్యకములయినపుడు ఉపయోగించేది. అలంకరణ వలన కామవాసన ఎక్కువవుతుంది.

(ఊ) ఎలాగ దయనీయమైన అశ్వము కళ్ళెం లాగే కొద్దీ అది ఇంకా ఎదురు తిరుగుతుందో, అలాగే చాలా విశృంఖలంగా వదలడము కూడా చెడుపే. అలాంటిదే ఈ మనసు యొక్క దశకూడా. ఒక్కోసారి ఎక్కువ నియంత్రించడము వలన కూడా ఎక్కువ చంచలమవుతుంది. అలాంటపుడు మనసును కొంచెం శిథిలము చెయ్యటమే హితకరముగా వుంటుంది. అలా చేయడము వలన ఎపుడైన మనసు క్రిందకు జారుతున్నట్లనిపించినా, మరల దీనిని లాగి మన చెప్పుచేతల్లో పెట్టుకోవాలి.

(ఎ) ఎక్కడ చిత్తము ఎక్కువగా ఆకర్షింపబడుతుందో అటువంటి దృశ్యములలో ఎపుడూ పాలు పంచుకోకూడదు. ఎవరిని చూడడము వలన నిర్మలతకు బదులుగా హర్షము, రజోగుణము వస్తే భోగోన్ముఖత ఎక్కువైతే వాటి నుండి శాశ్వతంగా దూరంగా వుండాలి. విషయములను మాటామాటికీ దర్శన, చింతన, అనుసంధానము చేయడము వలననే ఆ విషయములు సత్తా, స్ఫూర్తిని, బలాన్ని పొంది సాధకుడిని లాక్కుంటాయి. ఆసక్తి ఎక్కువవడానికి కారణము కూడా ఇదే.

ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తేషూప జాయతే సంగాత్సంజాయతే కామః

అందువలన వీటిని గురించిన చింతనను వదిలి తన లక్ష్యమును గురించియే చింతన చెయ్యాలి. రాగ-ద్వేష-భయ-ఘృణ, శంకా మొదలైన భావనలతో చింతన జరిగితే విషయములు ఇంకా బలపడతాయి. విషయముల నుండి రసాస్వాదనము అభ్యాసము ద్వారా దూరము చేసుకోవాలి.

(ఏ) మనసును ప్రకృతి యొక్క కార్యము అని అయినా తెలుసుకో లేదా ఇది భగవంతుడి వస్తువు అని అయినా నుకో. దేనినియితే అది మనది అని అనుకుంటామో దానిని గురించియే చింతన అధికంగా జరుగుతుంది. అందువలన మనసులో ఏమి

వచ్చింది ఏమి పోయింది అని ఇదే అనుసంధానము జరుగుతు వుంటుంది. సద్భావన వచ్చినపుడు సుఖము, విపరీత భావన కలిగినపుడు దుఃఖము, దానివలన ద్వేషము కూడా కలుగుతుంది. అందువలన ఏ సాధకుడయితే మనసును ఒక విక్రీత పశువులాగ ప్రభువుకి చెందినది అని అనుకుంటాడో, ఆ సాధకుడు నెమ్మది నెమ్మదిగా నిశ్చింతు డవుతాడు. ఆ భగవంతుడు ఇందులో మంచిపెట్టనీ, చెడ్డపెట్టనీ మేమయితే ఆ భగవంతునివైపే చూస్తాము కానీ మనసు వైపు కాదు. ఈవిధంగా మమత్వము పోగానే ఉపేక్ష కలుగుతంది అపుడు మనసు స్వతఃగా స్వస్థత పొందుతుంది.

(ఐ) స్త్రీలతో ఎపుడూ కూడా హాస పరిహాసములు చెయ్యరాదు. హాసము శృంగార రూపము. ఎవరైనా కొంచెం నవ్వినా విషయపులోయలో తనను పడవేసు కున్నట్లే. 'హసతా లభ్యతే నారీ'. అనావశ్యక వ్యవహారము వుండకూడదు. స్త్రీలు కూడా పురుషులతో ఈ విధముగానే సావధానులై వుండాలి. శాస్త్రిగారిని జనులు 'వైద్యజీ' అని కూడా పిలిచేవారు. వృందావనములో వారు ఈ పేరుతోనే ప్రసిద్ధులైనారు. కానీ వారు రస భస్మము తయారు చేయరు, వుంచరు. మూలికలు కూడా తెచ్చేవారు కాదు ఇచ్చేవారు కాదు. కానీ అపుడపుడు ఎవరికైనా రోగము యొక్క కారణము, దాని నివారణోపాయము తెలుపుతూండేవారు. గోసేవ చేయడం వలన సమస్త వ్యాధులు నశించిపోతాయని వారి నమ్మకము. ఆవు పాలు, నెయ్యి, వెన్న, గోమూత్రము, పేడ వీటన్నిటిలో ఓ అద్భుతమైన శక్తి వున్నదని నమ్మేవారు. గోసేవలో చమత్కారము! ఎవరైతే ధర్మపాలనలో దృఢనిష్ఠులై వుంటారో, ఆ ధర్మము వారిని ఆపద విపదల నుండి రక్షిస్తుంది అని నమ్మేవారు. ధార్మిక పురుషులకు సంకట సమయములలో గాబరా పడకూడదు, ధర్మాన్ని శ్రద్ధను వదలకూడదు. శాస్త్రిగారికి అతిథి సేవ అంటే కూడా చాలా ఆదరణ భావముండేది. తన ఈ నమ్మకాలను, విశ్వాసాలను సమర్థించుకొనుటకై అనేక ఉదాహరణలు ఇచ్చేవారు. అవి వర్తమానయుగానికి చెందినవి వుండేవి, పురాణేతిహాసాలవి వుండేవి. జీవితంలో ఒక విశుద్ధమైన సౌందర్యమును ప్రకాశింపజేయాలంటే సదాచారము, సద్భావము, సద్గుణాలు వీటిపైనే ఎక్కవ ప్రాముఖ్యతనివ్వాలి. సీదా సాదా జీవనము, ఉత్తమ విచారములు, వారు ఒక జీవంతమైన ఉదాహరణగా వుండేవారు.

వారు సంస్కృతములో ఎన్నో రచనలు చేశారు. వారు బృందావనములో ఎక్కడైనా పెట్టారో ఎదైనా పుస్తకాలయంలో, లేదా వారి పెద్ద అన్న ఎవరైతే నాతో సన్యాస దీక్ష తీసుకున్నారో వారి దగ్గర వున్నాయో, నాకేమీ తెలియదు వాటి సంగతి. వారు నాకోసం చాలా వందలకొద్దీ శ్లోకాలు వ్రాశారు. అవి సత్సాహిత్య ప్రకాశన ట్రస్ట్ ద్వారా రెండు పుస్తకాలుగా ప్రచురింపబడ్డాయి. అవి మా దగ్గర వున్నాయి. వాటిలో కొన్ని శ్లోకాలు వారికి మనసులో నా యందుగల ఆదరము, ప్రశంసాభావము వీటిని విజ్ఞాపన కోసముకాదు, కానీ కేవలం వారి కావ్యరచన యొక్క ప్రసాద, సౌందర్య, మాధుర్య, ఓజ, రస, అలంకార ప్రవాహమును చూపడానికే మీ ముందుంచుతున్నాను.

జనానాం యద్ గానం భ్రమతిమిరహానం వితనుతే
పదాంభోజ ధ్యానం దిశతి పరమానందపదవీం
స్మరామి ప్రాతస్తం ప్రణత జనతా జుష్ట చరణమ్
అఖండానందం శ్రీ గురువరమహం బ్రహ్మ పరమమ్

ఎవరి గుణగానము జనుల యొక్క భ్రమను శాశ్వతంగా నాశనము చేస్తుందో, ఎవరి చరణకమలముల ధ్యానము పరమానంద పదవిని దానం చేస్తుందో, వినయి, సద్గుణ సంపన్న భక్తజనులు ఎవరి చరణాలను సేవిస్తారో ఆ పరబ్రహ్మ స్వరూపులైన అనంత శ్రీగురువరులు అఖండానందులకు నేను ప్రాతఃస్మరణ చేస్తున్నాను.

పవిత్రా యద్ వాణీ ప్రవిశతి విచిత్రా హృదియదా
తదాకారా ఛిన్నా భవతి నిఖిలాకార ఘటితా
స్మరామి ప్రాతస్తం నయనరమణీయం సుఖకరమ్
అఖండానందం శ్రీ గురుపరమహం బ్రహ్మ పరమమ్.

వారి పవిత్రము మరియు విచిత్రము అయిన వాణి హృదయంలో ఎపుడైతే ప్రవేశిస్తుందో అపుడు నిఖిల నామ రూపాలతో నిర్మితమైన ఈ నానాత్వ రూపమైన సంసార శృంఖల ఛిన్న భిన్నమైపోతుంది. ఆ పరబ్రహ్మ స్వరూపుడైన లోచన చమత్కారీ, సుఖకరుడు అయిన అనంతశ్రీ గురువరులు అఖండానందుల వారికి నేను ప్రాతః స్మరణము చేయుచున్నాను.

యదంతశ్చాతుర్యం విలసతి సమాధుర్యమఖిలమ్
గుణాలీయం నిత్యం వరయతి మరలీవ దయితమ్
స్మరామి ప్రాతస్తం సరుచి కరుణాపూర మధురమ్
అకండానందం శ్రీ గురువరమహం బ్రహ్మ పరమమ్

ఎవరి హృదయంలో మాధుర్యముతో పాటు సంపూర్ణ చాతుర్యము కూడా శోభిస్తూ వున్నదో, మరాళము ఎలాగైతే తన ప్రియతమ హంసను వరిస్తుంది. అలాగే సద్గుణరాశులు ఎవరినైతే నిత్య నిరంతరము వరిస్తూ వుంటాయో, ఆ కరుణా వరుణాలయుడైన మధురాతి మధుర పరబ్రహ్మస్వరూప అనంతశ్రీ గురువరులు అఖండానందులకు నేను ఇష్టంగా ప్రాతఃస్మరణ చేయుచున్నాను.

అమరతాపి మృతిం సముపైతి సా విహితపుణ్యబలేన జితాతుయా
అవారతావర్ణం యది తే ప్రియం కురు తదాశరణం చరణం గురోః

ఏదైతే దేవ విహితము పుణ్యబలంతో లభిస్తుందో, ఆ అమరత కూడా ఒక రోజున నశించిపోయేదే. అందుకని ఒకవేళ మీకు అసలైన అమరత్వం కావాలనుకుంటే శ్రీగురుదేవుల చరణాలలో శరణులు కండి.

కిం జ్ఞాన కో వివేకో యదుపతి విషయా కా రతివ్వా మనోజ్ఞా
కా వా వ్యాపార లీలా భవతి గతిజుషాం సాధకానాం హితాయ
ఏతజ్ఞేయం సమస్తం విఘటిత విషయం యత్ప్రసాదేన లబ్ధం
సోऽయం లోకే ప్రకాశం రవిరివ కలయన్ కీర్తనీయే యతీంద్రః ॥

జ్ఞానం అంటే ఏమిటి? వివేకమని దేనిని అంటారు? శ్రీకృష్ణుడి సర్వోత్తమ భక్తి ఎటువంటిది? ప్రగతిశీలురైన సాధకుల హితార్థము వారి వ్యవహారము పరిస్థితి ఎలా వుండాలి? మొదలైన సమస్త సాధ్యసాధన సంబంధములైన తత్త్వములను ఎవరి కృపతో కరామలకవత్ చేసుకుంటామో, భువన భాస్కరుడిలాగ లోకములో జ్ఞాన ప్రకాశమును ప్రకాశింపజేస్తూ వారే మా యతీంద్రులే మాకు కీర్తనీయులు.

ధనం యత్ ధన్యానాం శరణరహితానాం చ శరణం
అనన్యానాం సేవ్యం ఫలతి సకలం వాంఛిత ఫలమ్

సదా భవ్యం భవ్యం భవతి నిహితం భావ భావనే
అఖండానందానాం శ్రయతి సుకృతి కోఽపి చరణమ్ ॥

ఎవరైతే ధన్యులకు ధనమో, శరణీనులకు శరణమో అనన్య భావాపన్నులకు సేవనీయమో, అన్నివాంఛిత ఫలములను దానము చేయడములో సమర్థుడో భావసంపన్న హృదయ భవనములో వుండి భవ్యరూపంతో, ప్రకాశిస్తున్నరో శ్రీ గురువరులు శ్రీఅఖండానంద సరస్వతీ వారి అటువంటి చరణకమలములను ఎవరో పుణ్యాత్ములే ఆశ్రయం చేసుకోగలరు.

మయాధీతా గీతా కలుషభరభీతేన మనసా
నిపీతా సా వాణీ శృతిశిఖరనీతా కథమపి
న వీతామే చింతా హర! హర! శుభైషాఽజని మతిః
అఖండానందానాం చరణవరణం శోకహరణం.

మనసు అసద్వాసనలతో భీతి చెందినది అని విచారించి భగవద్గీతను నేను అధ్యయనము చేశాను, తర్వాత యథామతి కొన్ని ఉపనిషత్తులను కూడా అవలోకనము చేశాను. కానీ హర! హర! చింతయితే నన్ను వదలలేదు. తర్వాత సన్మతి కలుగగానే తెలుసుకున్నాను శ్రీగురువరులు అఖండానంద సరస్వతుల చరణములను వరించడము వలన శోకము పోతుందని. (గురూపసత్తి లేకుండా సాధన చేస్తే అది నిరర్థకమే అవుతుంది.)

జాగ్రత్స్వప్న సుషుప్తి సాక్షికమహో యత్తత్త్వముజ్ఋంభతే
జీవేశాది వివర్తభూత మఖిలం యస్యేతి సంగీయతే
జ్ఞాతృజ్ఞేయ విభాగహీనమనిశం యచ్చింత్సతే ధీధనైః
తత్తత్త్వం కృపయాదిశత్ స కరుణః కస్మై చిదస్మై నమః ॥

ఏ తత్త్వము జాగ్రత్స్వప్న సుషుప్తి ఈ అవస్థాత్రయమునకు సాక్షియో, మరియు జీవుడు, ఈశ్వరుడు, జగత్తు ఇది ఎవరి వివర్తమని పిలువబడుతుందో, ఎవరు జ్ఞాతృ జ్ఞేయమనే భేదములేని విచారశీలుర విచారణ యోగ్యమో, ఆ తత్త్వమును ఏ కరుణా శీలుడు ప్రదానం చేశారో ఆ అనిర్వచనీయుడైన సద్గురుతమునకు నమస్కారము.

శాస్త్రిగారు సదా ప్రసన్నులై వుండేవారు. మనసులో ఏమీ అసంతోషమన్నది లేదు అని స్పష్టంగా తెలిసిపోయేది. ఎవరైనా అడిగితే చెప్పేవారు. శ్రీ శాంకర సంప్రదాయం, శ్రీ చైతన్య మహాప్రభు సంప్రదాయ గ్రంథాలను అధ్యయనము చేశేవారు. భక్తరసిక శిరోమణులు 'వాణి' (గ్రంథాలు)లో రసాస్వాదన పొందేవారు. శరీరములో ఏదైనా రుగ్మతగానీ, కష్టం కానీ వున్నా ఎవరితో చెప్పేవారు కాదు. ఎంతటి ప్రతికూల పరిస్థితినయినా అలా ఓర్చుకునేవారు. వారి జీవితంలో తితిక్ష, సమత మరియు అసంగత అనే భానములు స్పష్టంగా కనిపించేవి. నాకు భగవంతుని దర్శనము కలిగింది, తత్త్వసాక్షాత్కారము కలిగింది అనయితే వారు ఎపుడూ అనలేదు. కానీ కొంతమందికి వారికి శ్రీకృష్ణదర్శనము కలిగింది అన్న శ్రద్ధ వుండేది. తత్త్వసాక్షాత్కారమును గురించి నేను ఇంతమాత్రం చెప్పగలుగుతాను బ్రహ్మాత్మైక్య సంబంధమైన ప్రశ్నలు వారు నన్ను అడిగినపుడు వారి యొక్క గంభీరతయే పరిచయమయ్యేది. షట్ లింగముల ద్వారా పరమ తాత్పర్యము యొక్క విచారణ చేయడం వలన ఆత్మ మరియు బ్రహ్మ వీటి ఐక్యత సిద్ధిస్తుంది అని వారి ధృఢ నిశ్చయము. ఆత్మతో వేరైనది చైతన్యమెలాగ అవుతుంది? బ్రహ్మతో వేరైనది పూర్ణమెలా అవుతుంది? వారికి వారే పరిపూర్ణులు.

వారికి మృత్యు భయం లేదు. నేను మాటిమాటికీ వినిపించేవాడిని ఎవరికైతే బాహ్య పదార్థములతో మోహం వుందో వారికే అవి దూరమౌతాయన్న కల్పనతో మృత్యువుతో భయపడతారు. ప్రపంచము యొక్క ఆత్యంతిక విస్మృతియే మృత్యువు-విశ్రాంతి రూపమైన మధుర నిద్ర! కేవలము ఈ దేహములో ఆసక్తులైనవారే దానితో భయభీతులవుతారు. దేహములో వున్నటువంటి వారి స్తితి ద్రవ్యోపలబ్ధి స్థానము ఎపుడయితే చైతన్య ప్రతిబింబముగా గ్రహించేందుకు అయోగ్యమయిందో, అంటే ఎపుడయితే చిదాభాసను గ్రహించే శక్తి నశించిపోయిందో దీని సంగతి తనకు తెలియదు, ఇతరులకూ తెలియదు.

భక్తి-నిష్ఠ చంద్రమా పండిత్

వారు ఆయుర్వేద విద్వానులు. కానీ వైద్యం చేసేవారు కాదు మంచి సంగీతజ్ఞులు కానీ నలుగురిలో ఎపుడూ పాడేవారు కాదు. సకుటుంబసమేతంగా నిండైన గృహస్థాశ్రమము వారిది, కానీ ఎవరిపట్ల ఆసక్తి వుండేదికాదు. వారు భక్తులు, కానీ రోమాంచము, అశ్రుపాతము, రోదనము ఇలాంటి స్థితులు (బాహ్యఅవస్థలు) ఎవరూ చూడలేదు. వారి హృదయంలో జీవన పర్యంతము విరక్తి వుండేది. భగవంతుని పట్ల అనురక్తి వుండేది. సద్గుణముల అభివ్యక్తి వుండేది. జీవితాంతమూ ఎపుడూ ముఖమండలము ప్రసన్నతతో వెలిగిపోయేది, ఎపుడు లోట వుండేదికాదు. పొడవుగా, చామనచాయతో హృష్ట పుష్ట బలిష్టమైన శరీరము భస్మాచ్ఛాదితమైన పాలభాగముతో, భగవన్నామ జపములో సంలగ్నమయి వుండేవారు చంద్రమా పండితులు. వారిని నేను స్వామి శ్రీ యోగానందజీ గారి కుటీరములో అపుడపుడు చూశాను. సంవత్సరాలు గడిచినా మేము ఎవరూ ఒకరి కొకరు మాట్లాడుకోలేదు. నేను స్వామి వారి సేవ, సత్సంగము చూచుకుని సమయానికి ఇంటికి తిరిగి వెళ్ళిపోతూ వుండేవాడిని. చంద్రమా పండితులు జప, ధ్యానాదులు ముగించుకుని ఇంటికి వెళ్ళేవారు. మా ఇద్దరి పూర్ల నుండి స్వామి వారి కుటీరము దాదాపు 5మైళ్ళ దూరంలో వుండేది. వారు 'బరహ్'(వారణాసి)కు చెందిన రామగఢ్ నివాసి. నేను 'మహాయిచ్ (వారణాసి)కి చెందిన మహరాయి గ్రామ వాసిని. మేము ఒకరినొకరు చూచుకునేవారము. నవ్వుతూ నమస్కారం చేసుకునేవారము. ఎపుడూ మాట్లాడుకోలేదు.

ఒకసారి స్వామీజీ మహరాజ్ 'శ్రీమద్భాగవతము'లోని నవయోగేశ్వరుల ప్రసంగముపై ప్రవచనము చేస్తున్నారు. స్వామివారి విద్యా, బుద్ధి, వ్యక్తిత్వము, భాషణము చాలా ప్రభావాత్మకముగా వుండేవి. మేము ఇద్దరము సమయానికి వచ్చి

ప్రవచనాలు వినేవారము. స్వామీజీ వారి భాగవత ప్రవచనము విని శ్రోతలు ముగ్ధులయ్యేవారు. మా సర్వసత్త, జ్ఞానము, ఆనందము అంతా స్వామి వారి భాషణంతో ఎకమైపోయినట్లుగా అనిపించేది.

ఈ రోజులలోనే చంద్రమా పండితుడితో మాట్లాడాను. ఇద్దరం ఏకకంఠంతో స్నిగ్ధముగ్ధ భావంతో స్వామివారి ప్రవచనాలను ప్రశంసించేవారము. మా ఇద్దరి మధ్యలో ఎపుడూ కానీ సాంసారిక, పారివారక చర్చలు జరుగలేదు. నాకు ఇంత వరకు వారి కుటుంబ సభ్యులతో పరిచయం లేదు. వారెవరైనా కలిశారేమో అది కూడా నాకు గుర్తులేదు. కొన్ని సంవత్సరాల తర్వాత నేను 'కల్యాణ్' (పత్రిక) సంపాదక విభాగములో చేరాను. వారేమో స్వామీజీ (యోగానందజీ) సత్సంగము చేస్తుండేవారు.

స్వామివారి జీవనం పూర్తయ్యాక చంద్రమా పండితుడు మనసు సంసారము నుండి విరక్తి పొందినది. భగవంతుని యందు ప్రేమ కలుగగానే సంసారముపై వైరాగ్యము కలిగినట్లుగా సద్గురువుపై ప్రేమ కలుగగానే సంసారముపై విరక్తి కలుగుతుంది. సాంసారికమైన సకల పదార్థములు నశ్వరములు, పరివర్తన శీలములు, అంతేకాదు వాటిని మనమెంత ప్రేమించినా అవి గుర్తింపలేవు. అవి తమ యజమాని దగ్గరవున్నా, సజ్జనుల దగ్గర వున్నా, దుష్టుల దగ్గర వున్నా, పరాయి వారి దగ్గర వున్నా అంతా సమానమే. వాటి జడత్వము స్పష్టము. ఇక వచ్చేపోయే స్వజనులు, బంధువులు వీరికి కూడా ఎవరియందు పూర్ణరూపంగా నిష్కపటమైన ప్రేమ వుండదు. తండ్రి-కొడుకులు, భార్యాభర్తలు, అన్నదమ్ములు, స్నేహితులు కూడా ఒకరి కొకరు పూర్తిగా నిష్కపటముగా వుండరు. ఏదో ఒక మాట ఇతరులకు తెలియకుండా దాచేది వుండనే వుంటుంది. ఈ కారణము వలననే మహాత్ములు, శాస్త్రములు ఈ సంసారమును 'మాయ' అన్నారు. ఒక కలలాగా వచ్చి పోతోంది అంతా, ఇందులో మనది అన్నది ఏదీ లేదు. పైపైన చూస్తే ఈ మాట తొందరగా అవగతమవదు. కానీ ఎపుడైతే మన మనసు యొక్క వాస్తవికతను గురించి మననము, చింతన జరుగుతుందో అపుడు తెలుస్తుంది. స్వామి యోగానందుల వారి వియోగంతో చంద్రమా పండితుల మనసు సంసారము వైపు నుండి విరక్తమైనది. దీని (మనసు) హ్రాసము వినాశమును గురించి చింతన మొదలైంది. ఇక వారికి మిగిలినది ఒకే ఆశ్రమము అదే శ్రీసరళా మాతాజీవారు.

శ్రీ సరళా మాతాజీ వారు సరమహంస శ్రీ రామకృష్ణుల పత్నియైన శ్రీ శారదా మాతాజీ యొక్క శిష్యురాలు. ఆ రోజులలో ఆవిడ వయసు 80-90 సం॥లు వుండవచ్చు. కానీ వారి స్నేహశీలత, వాత్సల్యము, స్ఫూర్తి, క్రియాశీలత అన్నీ అద్భుతమైన గుణాలు.

స్వామి శ్రీయోగానంద పురీజీ మహరాజ్ వారు మాతాజీపట్ల చాలా ఆదరభావం చూపెట్టేవారు. ఆ రోజులలో శ్రీఉడియాబాబాజీ వారు స్త్రీలతో ఎవ్వరితో కలిసేవారు కాదు, అపుడు మాతాజీ రామఘాట్‌కు బాబా దగ్గరికి వచ్చారు. 'బాబాగారు స్త్రీలతో మాట్లాడరు' అని అక్కడి వారు అడ్డుపెట్టారు. 'వారు తల్లి గర్భంలో నుండి వచ్చారో లేదో అడిగి కనుక్కుని రండి' అని మాతాజీ అన్నారు. అపుడు శ్రీఉడియాబాబాజీ స్వయంగా లేచి మాతాజీ దగ్గరికి వచ్చారు. అంతటి వృద్ధావస్థలో కూడా వారు చాలా రుచిగా వంట స్వయంగా తన చేత్తో చేసి ప్రేమగా అందరికీ తినిపించేవారు. నేను అయితే అటువంటి రుచి మరి ఎపుడూ తినలేదని ధృఢముగా చెప్పగలను. నన్ను 'అరే' అనిపించేవారు మాతాజీ.

చంద్రమా పండితుడికి ఆమె సత్సంగము లభిస్తూ వుండేది. మాతాజీ ఆ రోజులలో వారణాసిలోని శివాలాఘాట్ దగ్గర ఒక బాడుగ ఇంటిలో వుండేవారు. దానిపేరు 'శ్రీరామకృష్ణ నిత్యానంద ఆశ్రమము' అని పెట్టారు. నేను అపుడపుడు అక్కడికి వెళ్తు వుండేవాడిని. అక్కడ చంద్రమా పండిత్ కూడా కలుస్తువుండేవారు. మాతాజీ పరమహంస శ్రీ రామకృష్ణ, మరియు శ్రీ శారదామాతల జీవన ప్రసంగాలు, ఉపదేశాలు వినిపిస్తుండేవారు. ఆ రోజులు నిజంగా ఎంత అపూర్వమైనవి! మాతాజీ ఎదుట కూర్చో బెట్టుకుని భోజనం పెడ్తూ, శ్రీశారదా మాత యొక్క మాతృత్వము, సరళత, వినయము, సమత, సహృదయతను వర్ణించి వర్ణించి చెబుతూ వుండేవారు.

మాతాజీ జీవనయాత్ర చాలించిన తర్వాత ఇక చంద్రమాపండితులకు సంసారములో ఎవరి యందు ఆసక్తి లేకపోయింది. వారు దండిస్వామి చంద్రశేఖ రాశ్రములయ్యారు. కొన్ని రోజుల తర్వాత వారు నా దగ్గరికి బృందావనము వచ్చారు. చాలా సంవత్సరాల నుండి కొద్దో గొప్పోనాతో సంపర్కము వున్నందు వలన వారు నాపై చాలా గౌరవభావం కలిగివుండేవారు. నాతో వారు తమ మానసిక స్థితి, సాధన,

భజన, అనుభవాలు ఈ విషయాలన్నీ చెబుతూ వుండేవారు. నాకు ఎంతవరకు స్మరణలో వున్నయో అవి మీముందుంచుతున్నాను వారి మాటలలోనే -

అప్పటికి నా యజ్ఞోపవీత సంస్కారము జరిగివుండినది. వేదాధ్యయనము అన్నపేరుతో నాకు కేవలము గాయత్రి, సంధ్యోపాసన మంత్రాలు నేర్పించి వుండిరి. కొద్దోగొప్పో సంస్కృతము చదివాక వృత్తి కోసమని ఆయుర్వేదము నేర్చుకున్నాను. పెద్దయ్యాక కుటుంబ నిర్వహణ బాగానే జరిగేది. అందుకని ఈ ఆయుర్వేద జ్ఞానమును ఎక్కువగా ఉపయోగించుకోలేదు. రస భస్మములు చెయ్యలేదు. కానీ మూలికావైద్యం చేసేవాడిని కానీ ఎదో లాభం పొందాలన్న దృష్టితో మాత్రం కాదు. ఎపుడైనా సంధ్యావందన మంత్రాలను గురించి ధ్యానిస్తు వుండేవాడిని. సృష్టి క్రమము, అంటే సృష్టి మొదట ఎలా జరిగిందో అలాగే పరికల్పన దానికి ఒక క్రమము కారణం వాటి నుండియే కాలం యొక్క సృష్టి జరిగిందన్నది యథార్థ సత్యము, మరియు వ్యావహారిక సత్యమని రెండు విభాగములు. దాంతో పాటు పగలు, రాత్రి మన ఇంద్రియాల ద్వారా, మనసు ద్వారా, వాక్కు ద్వారా, పాపకర్మలు జరుగుతూ వుంటాయి, వాటి నివారణార్థము దేవతలను ప్రార్థించాలి. జలము, అగ్ని, సూర్యుడు మొదలైనవాటిలో చైతన్య దేవతలు స్థితులై వుంటారు. ప్రాణాయామము కూడా జీవితమునకు ఆవశ్యకము. గాయత్రి జపము, ధ్యానము తప్పక చేస్తుండాలి. ఈ విషయాలన్ని మెల్లమెల్లగా అర్థమవసాగాయి. కానీ ఈ జ్ఞానము వలన నాకు తృప్తి కలుగలేదు. యాంత్రికముగా అన్ని పనులు జరిగేవి.

జపము చేసేటపుడు మనసు ఏకాగ్రమయ్యేది కాదు. గాయత్రి దేవి యొక్క ధ్యానము కూడా నాకు జరిగేది కాదు. పండిత్‌జీ గాయత్రి కోసం ప్రాతః, మధ్యాహ్న, సాయం సమయాలు మూడు రూపములుగా సంధ్యను తెలిపారు. అది కూడా కఠినమే నాకు ఇంకా జ్ఞానం పెరగాలనీ, ఎవరైనా మంచి జ్ఞానులతో ఇవన్నీ అర్థం చేసుకోవాలని అభిలాష తీవ్రము కాజొచ్చింది. ఆ రోజులలోనే నా జన్మ భూమి రామగఢ్ నుండి సుమారు 4, 5 మైళ్ళ దూరంలో గంగాతటముపై సహేపూర్ గ్రామము యొక్క తోటలో ఒక ఉచ్చకోటి మహాత్ముడున్నాడని విన్నాను. నేను అక్కడికి వెళ్ళాను. స్వామి యోగానందజీ మహరాజ్ వారు సంస్కృత, ఆంగ్లేయ, వంగ భాషలలో మహా

విద్వాంసులే కాక వేదాంత జ్ఞానము మరియు వైదిక, తాంత్రిక ఉపాసనలు, వాటి అనుభవం కూడా కల్గిన మహాపురుషుడు.

వారి దర్శనము, సంసర్గము, ఆలాపము వలన హృదయములో శ్రద్ధ, ప్రసన్నత వృద్ధి అయింది. 'నేను నాకు దీక్ష ఇవ్వమని వారిని ప్రార్థించాను. స్వామి శ్రీయోగా నందజీ ఇలా ఆజ్ఞ ఇచ్చారు. నీవు ఒకసారి గాయత్రి దీక్ష కూడా తీసుకున్నావు, కాబట్టి గాయత్రి ఉపాసన చెయ్యకపోతే, దీక్షను కార్యాన్వితము చెయ్యకపోతే గాయత్రి దేవి యొక్క అనుగ్రహం లభించదు. ఒకవేళ మొదట తీసుకున్న దీక్షనే నీవు చేయలేదనుకో, రెండో సారి దీక్ష తన పనిని ఎలా చెయ్యగలుగుతుంది'. వారి ఆజ్ఞతో నేను గాయత్రి పురశ్చరణ చేశాను. పురశ్చరణ 24 లక్షలు జపము చెయ్యాలి. దానికి కావలసిన విధి విధానమును గురించి కూడా వారే తెలియజేశారు. వారు సూర్య మండలము నుండి ప్రవహించే అమృతధారలో స్నానము గురించి చెప్పారు. తమ దోషములను మణిపూరక చక్రములో త్రికోణ కుండములో జ్ఞానాగ్నిని ప్రజ్వలింపజేసి హవనము చేసే రీతిని తెలిపారు. ఉదాహరణకు ఓం అవిద్యాం జహోమి స్వాహా' మొదలైనవి. పడుకునే ముందు శరీరగతమైన పృథ్వి భాగమును జలములో, జలమును తేజముతో, తేజమును వాయువుతో, వాయువును ఆకాశముతో, ఆకాశమును శిరస్థిత సహస్రారములో లీనము చేసి, శాంత చైతన్యములో స్థితమయ్యే పద్ధతిని తెలిపారు. శరీరములో మూలధార పర్యంతము పృథ్వి, స్వాధిష్ఠాన పర్యంతము జలము, మణిపూరక పర్యంతము తేజము, అనాహత్ పర్యంతము వాయువు, విశుద్ధ పర్యంతము ఆకాశము, ఆజ్ఞా పర్యంతము సవిశేష చైతన్యము మరియు సహస్రార పర్యంతము విశుద్ధ చైతన్యము యొక్క స్థితి వున్నది. ఎవరైతే నిద్రకు ముందు, ముందు ముందువి, తర్వాత, తర్వాతవి విలయము చేస్తారో తర్వాత శద్ధ చైతన్యములో శయనిస్తారో మేల్కొన్న తర్వాత ఉత్పత్తి క్రమముతో అన్నిటిని చింతన చేస్తారో, వ్యవహరిస్తారో వారికి కొన్ని నెలలోనే వారి నిద్ర సమాధి అవుతుంది. వ్యవహారములో రాగద్వేషములు క్షీణిస్తాయి. నేను స్వామివారి ఆదేశానుసారం గాయత్రి ఉపాసన చేయడం మొదలెట్టాను.

గాయత్రి జప సమయములో ఒక్కొక్క శబ్దముపైన ధ్యానముంచేవాడిని. సంఖ్య

కూడా గుర్తుంచుకోవాలి. దానితో మనసులో ఉత్సాహము వుంటుండేది. ఎలాగైతే ఒక వ్యాపారికి రూపాయి నోట్లు లెక్కపెట్టుకుంటే హర్షము కలుగుతుందో అలాగ నాకు జపసంఖ్య ఎక్కువయ్యే కొద్ది ఆనందంగా వుండేది. స్వాధ్యాయము క్రమముగా జరుగుతుండేది. లోకులతో వ్యవహారమూ జరిగేది. ఒక పూట భోజనం, రెండోపూట ఫలములు ఇదే క్రమము జరుగుతుండేది. అపుడపుడు గాయత్రి అర్థంపైన కూడా ధ్యానం జరిగేది. గాయత్రి యొక్క ప్రతిపాద్యము సృష్టి కర్త పరమేశ్వరుడే. అతడు స్వయం ప్రకాశుడు మరియు లీలా శక్తి సంపన్నుడు. వారి ఆ జ్యోతిర్మయ స్వరూపమే వరణీయము. అతడు ఎక్కడ వుంటాడు? మన బుద్ధిలో ఒక విశేషమైన ధ్యానధార ప్రవాహితమైనది. పరమేశ్వరుడు దూరం కాదు దగ్గరే. కేవలము ఆతడు అనాది కాలములో సృష్టి యొక్క నిర్మాత మాత్రమే కాదు, ఇపుడే ఇదే సమయంలో మన వృత్తుల సంచాలకుడు నియామకుడు తనే! ప్రశ్న ఉదయించింది. మేము అతనిని దర్శించగలమా?' నేను ఈ ప్రశ్న తీసుకుని స్వామీజీ దగ్గరికి వెళ్ళాను.

స్వామి యోగానందజీ అనుగ్రహించారు. ఇక నీవు గాయత్రి దేవి ధ్యానం చెయ్యనవసరము లేదు అన్నారు. ఛందస్సు పేరు గాయత్రి. మంత్రము యొక్క అధిష్ఠాతృదేవత గాయత్రిదేవి. సృష్టి, స్థితి, ప్రలయముల ఉపాధుల వలన బ్రహ్మ, వైష్ణవి, శక్తిమాన్ పరమేశ్వరుడు. ఆ పరమేశ్వరుడు వేరే దేశకాల వస్తువుల రూపములలో లేడు. తను నీ హృదయములో వుంటూ అనాది బీజ సంస్కృతి యొక్క ఉపాధులతో నీ వృత్తులను సంచాలనము చేస్తుంటాడు. అతడే సవిత! సృష్టికర్త! దేవుడు! లీలా, క్రీడా సూత్రధారి అయిన చేతనుడు. జ్ఞాత, జ్ఞాన, జ్ఞేయ, మరియు నియంత, నియమ్యుడు మొదలైన త్రిపుటి వీటి వలననే తయారవుతుంది. అది అన్యత్ర ఎక్కడో వుంటు సృష్టి నిర్మాణము చేయదు. నీ యెదుట వుంటు సృష్టిని ప్రకాశింపజేస్తుంది. నీవు పరమేశ్వరుడికి కూడా ద్రష్టవు, ప్రకాశకుడివి! త్రిపుటిలో పరివర్తనయొక్క ప్రతీతి తెలుస్తుంది, కానీ జ్ఞాన స్వరూపుడివి నీవు ఒక్కటే! దేశ, కాల, వస్తు, సర్జన, విసర్జన, ఉపాది, ఉపమిత, అన్నీ కేవలము ప్రతీతి మాత్రములే! నీవు దృక్ మాతృడివి. తన స్వరూప జ్ఞానమే వరణీయమైన 'భర్గ, భర్గ' అంటే అవిద్య, అవిద్యా కార్యమును భర్జనము చేసేటటువంటిది. వేయించేది, కాల్చివేసేది. ధ్యానము అంటే 'తాదాత్మ్యత వారితో ఏకత్వము అనుభవించుట. నా ఎదురుగుండా ఏదో

ఆవరణ తొలగినట్లయింది. నేను దేనినయితే అంధకారమనుకున్నానో అదే మహాప్రకాశమయింది. ఈ ఆత్మ జ్యోతి ప్రకాశములో భూః, భువః, స్వః వీటి భేదమే సమాప్తమయింది. కేవలం పరిపూర్ణ అద్వితీయ ఆత్మ తత్త్వము మిగిలి వుంది. ఆ తత్త్వములో కాలుడి పప్పులుడకవు. అందులో దేశము యొక్క నిర్దేశ ప్రవేశము లుండవు. అందులో వస్తు దృష్టితో ఆత్మ అనాత్మ అనే బేధము వుండదు. నా కంటే అన్యమైనది లేనేలేదు అని ఆలోచించడము మొదలు పెట్టాను. ఎవరిని తెలుసు కునేది? ఎవరిని పొందేది? ఎవరిని త్యజించేది? ఏమిటి చేసేది? గాయత్రి మంత్రము యొక్క పర్యాలోచన చేయడం వలన 'మహావాక్యము' యొక్క బోధ కలుగుతుంది. పూర్వార్థములో 'తత్' పదార్థ ప్రధానత, ఉత్తరార్థములో 'త్వం' పదార్థము యొక్క ప్రధానత! మహావాక్యార్థము అకార, ఉకార, మకార మరియు అమాత్రరూపముతో ప్రణవములో సమాహితమై వున్నది. ప్రణవముతో మహావాక్యము, మహావాక్యముతో గాయత్రి, గాయత్రితో 4వేదాలు వచ్చాయి. అంటే గాయత్రి వేదమాత!

స్వామిజీ వారి గంభీరమైన జ్ఞానము యొక్క అపరోక్ష అనుభవము కలుగ సాగినది. ఆ రోజులలోనే స్వామీజీ శరీరమును చాలించారు. కొద్ది రోజులకే అక్కడనే మాతాజీ శరీరయాత్ర కూడా ముగిసినది. సంసార సంబధము అంటూ ఏదీ ఉండేది కాదు. నేను దండీ స్వామి శ్రీ చంద్రశేఖరాశ్రమ్‌గా మారాను. సన్యాసంలో సర్వ ప్రాయశ్చిత్తము, శ్రాద్ధము, విరజా హోమము, ప్రైపోచ్చరణతోపాటు పంచీకరణము. త్రివృత్త కరణము, పంచకోశ వివేకము వీటి ద్వారా మహావాక్యార్థము యొక్క బోధ కలిగిస్తారు. శ్రీ స్వామీజీ వారి అనుగ్రహము వలన ఇవన్నీ నాకు ముందే అవగతమైనవి.

అంతఃకరణలో సత్వమహత్వభావమేదీ ఉండేదికాదు. అంతఃకరణము ఏమైనా కానీ, సమాహితము, విక్షిప్తము, సాంసారిక విక్షేపము లేదు. ఉన్నట్టుండి అంతః కరణములో ఒక విశేష భావము ఉదయించింది. అది ఆనంద భావము, రస భావితము, సంక్షేపముగా అది భక్తిభావము. తత్త్వజ్ఞాన సాధనకు రసాస్వాదన త్యాజ్యము. ఎందుకంటే అది ఆత్మలో 'భోక్త' భావమును తెస్తుంది కదా అని మనసులో అనిపించేది. భక్తి భావములో కూడా భక్తుడు స్వయముగా రసాస్వాదన చేయడమన్నది ప్రేమలో విపరీతము. ఎందుకంటే, ప్రేమ ప్రియతముడికోసము

కదా! స్వయం రసాస్వాదన చేయడానికి కాదు. ఈ విధంగా విచారణ కల్గినా కూడా రసధార అవిచ్ఛినంగా ప్రవహిస్తూ వుండేది. ఆఖరికి చింతన ఈ విధంగా ఉదయిం చింది. అంతఃకరణము యొక్క సత్తాయే బాధితము. ఇది నేనుకాదు, నాదికాదు. ఇది ఇలాగ వుండనీ, అలాగ వుండనీ అన్న దురాగ్రహమేమీలేదు. అటువంటప్పుడు ఇది నిరాకారము. కానీ సాకారముకానీ, రసాస్వాదన చెయ్యనీ, చెయ్యకపోనీ చింతితమో నిశ్చింతితమో, ఆ పైన వీటి ప్రభావము ఎక్కడ వుంది? ఎలా జరగేది అలా జరగనీ! నీ వెపుడైతే అంతఃకరణం తోటి 'అహం' 'మమ'లను వదిలివేశేవో అపుడు అందులో భగవంతుడిలీల ప్రకటమవసాగింది. వ్యక్తి యొక్క అహంభావము పోగానే సమష్టి యొక్క అహంభావము ప్రకటమయినది. వ్యష్టి ప్రతిబింబము సమిష్టి బింబము, ప్రతిబింబ సహితముగా అంతఃకరణము ప్రతీతి మాత్రము, మిధ్య, ఒక కలలో కనిపించే అనేకుల అంతఃకరణలు వుంటాయి, అలాగే ఈ అంతఃకరణకు నానా రూపాలున్నాయి. ఈ అంతఃకరణములో ఏదో ఒక అనిర్వచనీయమైన బీజముండినదేమో, అది స్వయంగా అంకురితమయినది, అని అనిపిస్తుంది. శ్రీకృష్ణుడి లీలలు అవంతటఅవే స్ఫురించసాగాయి. ఏది జరుగుతుందో అది జరగనీ! ఇది నాది కాదు భగవంతుడి లీలాస్థలమయితే మరీ మంచిదే. ఏ తత్త్వములో సంపూర్ణ జగత్తు ప్రతీయమానమో అందులోనే వ్రజభూమి, బృందావనము వున్నది. వున్నదయితే వరబ్రహ్మమే, అందులో రేఖలాగ ఒకరూపము. ఆ రూపమునకు ఒక పేరు ఎలాగైతే 'సత్'లో కార్య, కారణముంటుందో, 'చిత్'లో జ్ఞాత, జ్ఞేయముంటుంది. అలాగే ఆనందంలో భోక్త, భోగ్యముంటుంది. శుద్ధ చిత్, వృత్తి మరియు ఆభాసము ఈ మూడుటి స్పందన, నిస్పందన రెండూ ప్రతీతి మాత్రములే అయినా అదే లీల (భగవంతుని) అవుతుంది. అక్కడే ఆస్వాద్య - ఆస్వాదక భావము ఏర్పడుతుంది. కానీ రెంటిలో ఏమీ విభాజక రేఖ వుండదు. రెండు ఒకటే. భేదభ్రమ తొలగిపోయి నందుకు, నామరూపాలలో విభిన్నతవున్నా ఏకతయే వుంటుంది. ఎలాగంటే కేవలము సన్మాత్రము, చిన్మాత్రము, ఆనంద మాత్రము. ఒక్కోసారి ఆస్వాద్యము రాధ అయితే ఒకోసారి ఆస్వాదకుడు కృష్ణుడు. ఒక్కోసారి ఆస్వాద్యుడు కృష్ణుడయితే ఆస్వాదకము రాధ. పరస్పరము ఇరువురు చంద్ర చకోరములు. ఒకే స్వరూపము పేర్లు రెండు. నామ భేదము తత్త్వములో భేదము కలిగించలేదు. రూపభేదము కూడా అపరిచ్ఛిన్న

తత్త్వములో కేవలము ఒక జ్ఞానాత్మకమైన రేఖా మాత్రమే. క్రియ ఆనంద ఉల్లాసము, విలాసము, లీల. అనంత రస సముద్రములో రెండు అలలులేచాయి, ఒకటి నొకటి ఆకర్షించుకుని పరస్పరము కలిసిపోయాయి. వస్తుతః భేదము లేదు. స్వరూప అభేదము, లీలా భేదము. పూర్వాచార్యులు దీనికే స్వాభావికము. అచింత్యము లేక ఔపాధికము అని పేర్కొన్నారు. నగలు తయారు చేసినా బంగారం బంగారమే. తరంగాలు లేచినా జలము జలమే. పరిపూర్ణతత్త్వము ఎపుడూ భిన్నము కాదు. ఇదే శ్రీరాధాకృష్ణుల లీల.

నేను జె.కె.వారి బిర్లా పద్మాబిహారీ మందిరములో వున్నపుడు, తర్వాత 'ఆనంద వృందావనం' నిర్మాణం జరిగేటపుడు దండీస్వామి(శ్రీచంద్రశేఖరాశ్రమ్)జీ (చంద్రమా పండిత్) బృందావన ఆశ్రమములో చాలా సంవత్సరాలు వున్నారు. బాగా వృద్ధులు. సరిగా కనిపించేది కాదు. ఎపుడు పడుకునే వుండేవారు. కర్ర సాయంతో లేచి నిత్యకర్మలు చేసుకునేవారు. చాలా తక్కువగా మాట్లాడే వారు. వారి ముఖారవిందంపై ఎపుడూ చిరునగవు నాట్యమాడుతుండేది. ఇచ్చి పుచ్చుకోవడాలు ఏమీ లేవు. కాషాయ రంగు వస్త్రాలు వేసుకునేవారు. దండం కూడా వారి దగ్గరే వుండేది. ఎవరైనా తమకేదైనా బాధవున్నదంటే ఏదో తనకు తెలిసిన మూలికలు తీసుకోమని చెప్పేవారు. అంతా ఆత్మయే. ఆత్మ భగవంతుడు. భగవంతుడే అంతాను. ఇదే వారి అనుభవము. ఇంత కంటే మరి ఇక ఏమీ లేదు. నేను అక్కడ లేనపుడు వారు శరీరము చాలించారు. భండారా కూడా అయ్యింది. కానీ దానిని గురించి నాకు ఎక్కువగా గుర్తు లేదు. వారి శరీరపు మట్టి బృందావన మృత్తికలో కలసిపోయింది. వృందావనము ఏదో ఒక స్థూలమైన సృష్టికాదు. అగణిత అసంఖ్యాక భక్తులు దానిని ధ్యానించారు. ధ్యానములో స్థూలత వుండదు, సూక్ష్మత వస్తుంది. సూక్ష్మతలో భగవద్దర్శనము కలుగడము వలన అది ధ్యేయము, భగవన్మయము చిన్మయము అవుతుంది. రూప ధ్యానము వలన తన్మయత కలుగుతుంది. ఎక్కడున్నా సరే! నామము మన వెంట వెంటనే వస్తుంది. దానిని ఉచ్చరించవలసి వస్తుంది కానీ, ఈ ధామములో శరీరము వదలినవారికి ధ్యానం చెయ్యవలసిన పని పడదు, ఉచ్చారణ చెయ్యవలసిరాదు. వారి శరీరము ధామముతో ఏకమవుతుంది. దీని అర్థమేమిటంటే ధామములో శరీరమును

విడువడమన్నది భగవత్ప్రాప్తి కోసము చేసే జ్ఞానము, ధ్యానము, స్మరణ, జపము, పూజ మొదలైన ఏ సాధనలనూ అపేక్షించదు. ధామము బ్రహ్మస్వరూపము. భగవత్కృప వలననే అందులో నిష్ఠ కలుగుతుంది.

శ్రీ జయ దయాల్ గోయెంకా
(నా దృష్టిలో)

సంగీతములో ఒక చమత్కారతని ఆవిష్కరించిన గాయకుడు శ్రీ విష్ణు దిగంబర్‌జీ ప్రయాగలో కుంభమేలా సమయంలో శ్రీగీతాజ్ఞాన యజ్ఞమును ఏర్పాటు చేశారు. ఆసమయంలో వున్న గొప్ప గొప్ప మహాత్ములు, విద్వానులు అక్కడికి వేంచేశారు. నేను అపుడు సంస్కృత విద్యార్థిని. ఆ సభలో ఒక శ్రోతగా కూర్చున్నాను. వేదికపైకి అకస్మాత్తుగా ఒక అవధూత వచ్చి నిల్చున్నారు. లంగోటి, దండము ధరించిన ధూళి ధూసరిత శరీరము. అన్నారు 'నేను వ్యాఖ్యానము చేస్తాను'. వారిని ఎవరూ అడ్డగించలేకపోయారు. వారు చెప్పడం మొదలెట్టారు. 'గీత' శాస్త్రము కాదు, అది ఇద్దరు మిత్రుల పరస్పర సంవాదము. యుద్ధారంభములో అర్జునుడు శోకించాడు, విషాధ గ్రస్తుడయ్యాడు. శ్రీకృష్ణుడు అతని భుజముపై చెయ్యివుంచి చాలా ప్రేమగా ఇలా అన్నారు 'మిత్రమా! నీ ఈ క్రియా కలాపము అనుచితము మరియు అవస రోచితముకాదు. నపుంసక భావమును వదలి లే! లే!' మిత్రడి మాట మిత్రుడు గ్రహించాడు. విషాదస్థానములో ప్రసన్నత ఉదయించింది. ఇలా చెబుతూ చెబుతూ అవధూత కంఠము పులకించినది. కన్నుల్లో అశ్రువులు! మరి వారు కొంచెం వ్యాకులురై వేదికపై నుండి దిగి మేలాలోని జనసమూహంలో కలిశిపోయారు. అదే వేదికపై నాకు మొట్టమొదట సేఠ్ జయదయాల్‌జీ వారి దర్శనం కల్గింది.

వారు భగవద్గీత పైన గొప్ప విద్వాంసులు అని వారిని గురించి విని వుంటిని. భగవంతుడు స్వయముగా వారిని గీతా ప్రచారము నేయమని ఆదేశించారట. వారిని గురించి నా మనసులో ఒక కాల్పనిక ఆకృతి ఏర్పడి వుండినది. గౌర వర్ణముతో,

సుకుమార శరీరము, పీత వస్త్రము ధరించి వుంటారు అని! కానీ వారి దర్శనము సర్వదా విపరీతముగా వుండినది.

గోధుమ రంగు వన్నెతో, తలపై రాజస్థానీ పగడీ (సాగా) చెవులో పోగు, చూడటానికి ఒక మారవాడీ సేఠ్ లాగనేవున్నారు. చాలా ఆశ్చర్యం కలిగింది. ఇతడే 'భక్తరాజ్'. (శ్రీభారతధర్మ మహా మండలి వారు సేఠ్‌జీకి 'భక్తరాజ్' అన్న బిరుదును ఇచ్చారు. కానీ వారు ఆ ఉపాధిని యెపుడూ ఉపయోగించుకోలేదు, అంగీకరించలేదు) మనసులోని కల్పిత ఆకృతి మారి పోయింది. అపుడు నాకు వారిని కలవడం అవలేదు. నేను నా వ్యాకరణ గురువులైన పండిత్ శ్రీరామభవన్ ఉపాధ్యాయులవారి వెంట వారి సేవ కొరకు మాలవ్యజీ సనాతన ధర్మసభలో పాల్గొనడానికి వెళ్ళాను. గురూజీ యొక్క ఆజ్ఞతోనే ఆ సభలో పాల్గొన్నాను.

ఆరు సంవత్సరాల తర్వాత అర్థకుంభమేల వచ్చింది. నేను ఆరోజులలో ఝూసీ, ప్రయాగలో శ్రీ ప్రభుదత్త బ్రహ్మచారిగారి సంవత్సర వ్యాప్త సంకీర్తన యజ్ఞములో పాల్గొనియుంటిని, శ్రీమద్భాగవతముపై ప్రవచనము చేస్తూవుంటిని. మిగిలిన సమయములలో మౌనముగా వుండేవాడిని. ఫలహారం మాత్రం తీసుకునేవాడిని. త్రివేణి స్నానము యొక్క సౌభాగ్యము లభించింది. శ్రీ బ్రహ్మచారిగారి కారణంగానే నాకు అనేక మహాత్ముల దర్శనసంలాప సౌభాగ్యము కలిగినది. అక్కడికి శ్రీ సేఠ్ జయదయాల్‌జీ కూడా వచ్చారు. వారు ఎవరైనా మహాత్ములతో ప్రశ్నోత్తరాలు జరిపేటపుడు నేను చాలాసార్లు అక్కడ వుండేవాడిని. వారియొక్క గహన అధ్యయనము, గంభీర చింతనము చూసి చాలా సంతోషపడేవాడిని. వారు 'గీత'లో నిష్కామకర్మను ప్రతిపాదన చేశారు, కానీ లోకమాన్యతిలక్ లాగ జ్ఞానము కలిగిన తర్వాత కూడా కర్మ కర్తవ్యమే అని అనేవారు కాదు. వారు జ్ఞాని స్వతంత్ర్యుడు. అతడు కర్మ చెయ్యనీ చెయ్యకపోనీ, వారికి ఏమీ అనివార్యమైన ఆదేశము, బంధనము లేదు! అని అన్నారు. ఇంకొకటి వారి విశేషత ఏమిటంటే వారి అభిప్రాయములో భామతీ ప్రస్థావముననుసరించి నిష్కామ కర్మను కేవలం వివిదిషా 'అంటే జిజ్ఞాస యొక్క సాధనము మాత్రమే)కాదు. వివరణ ప్రస్థానము ననుసరించి నిష్కామకర్మను జ్ఞాన సాధనగా అంగీకరించేవారు. సగుణసాకార దర్శనములో భక్తి స్వతంత్రము,

నిర్గుణ నిరాకార సాక్షాత్కారములో జ్ఞానము స్వతంత్రము. దానితో పాటు వారు జ్ఞానీ పురుషుడి జీవితములో ఏవిధమైన దోషమును, వికారములను అంగీకరించే వారు కాదు. వారు ఝూసీ రావడం వలన సత్సంగం ఇంకా మెరుగయ్యింది. మహాత్ములలో విచార విమర్శలు జరుగుతుండేవి. సేఠ్‌జీ నిర్భయముగా మహాత్ముల మధ్యలో ఈ విచారములనుంచేవారు. నిష్కామకర్మ, జిజ్ఞాస ఇవి జ్ఞానమునకు (నిరాకార జ్ఞానము) సాధనములు అంతే కాక సగుణసాకార దర్శనములో కూడా స్వతంత్ర్య సాధనములే.

మహామండలేశ్వరుడు స్వామి శ్రీజయేంద్రపురీజీ మహరాజ్‌తో 'అవిద్యా లేశము'ను గురించి చాలా మంచి సత్సంగము జరిగింది. ప్రశ్న ఏమిటంటే తత్త్వజ్ఞానము కలిగిన తర్వాత కర్తృత్వ, భోక్తృత్వ, జ్ఞాతృత్వము సంసారిత్వము, పరిచ్ఛిన్నత నివృత్తమవుతూనే జ్ఞాని యొక్క వ్యక్తిగత జీవితంలో రోగము, భోగము, యోగము, సంయోగం-వియోగం మొదలైనవి ఎలా వుంటాయి? అని!

వేదాంతుల జవాబు - జ్ఞానం కలిగిన తర్వాత సంచితములు, క్రియమాణ కర్మలు, అసంశ్లేషములయి నశించిపోతాయి, కానీ ప్రారబ్ధకర్మ శరీర పర్యంతము వుంటుంది. ఈ ప్రారబ్ధ కర్మయొక్క సిద్ధి అవిద్యా లేశము వలన అవుతుంది. అవిద్యా లేశమంటే అర్థము ఇపుడు ఏదైనా ఒక దొన్నెలోగానీ, గిన్నెలోగానీ 'చంపా' పుష్పము పెడితే, తర్వాత దానిని తీసినా కొంచెము సేపటి వరకు దాని సువాసన దానినంటుకునే వుంటుంది. ఇదే విధముగా అవిద్యానివృత్తి కలిగిన తర్వాత కూడా దాని వాసనాలేశము కొంత వుంటుంది, అది శరీర పాత పర్యంతము భోగనిర్మాణము చేస్తూవుంటుంది. అందువలననే తత్త్వజ్ఞానులలో ఆచార్యత్వము, మఠాధిపతిత్వము మొదలైన వాటి సిద్ధి కలుగుతుంది. సేఠ్‌జీకి స్వామీజీ ఇచ్చిన ఈ ప్రతిపాదనతో సమాధానము కలుగలేదు. వారు మరల శ్రీ ఉడియాబాబాజీ వారితో ఇదే ప్రశ్నవేశారు. బాబా అన్నారు 'తత్త్వజ్ఞానికి స్వదృష్టితో అవిద్య, అవిద్యాలేశము కానీ ఏమీ లేవు. అవిద్య అన్నది భూత, భవిష్యత్, వర్తమానములలో ఎపుడూ లేదు. జ్ఞానము వలన దేని నివృత్తి కలుగుతుందో, అది మొదటి నుండియే నివృత్తమయ్యే వున్నది, నివృత్తి కాదు నివృత్తిలాగ వుంటుంది. జ్ఞానము వలన దేనిని పొందుతాఓ అది నిత్య ప్రాప్తము.

అప్రాప్తమయినది ప్రాప్తించదు. ప్రాప్తవస్తువే లభిస్తుంది. అభిప్రాయమేమిటంటే తత్త్వదృష్టితో అవిద్యలేదు, ప్రారబ్ధమూ లేదు. అది అన్య దృష్టితో జ్ఞాని పురుషుడిలో కల్పితము, అంటే అజ్ఞుడి దృష్టిలోనే ఇదంతా వున్నది. సేఠ్‌జీకి ఈ సమాధానముతో చాలా ప్రసన్నత కలిగింది.

ఆ రోజులలో శ్రీకరపాత్రజీ మహరాజ్ వారు మహాత్ముల సమాజములో దేదీప్యమానమైన సూర్యుడివలె ప్రకాశించేవారు. వారి వైరాగ్యము, జ్ఞానరశ్మి మెల్లమెల్లగా విస్తరించింది సేఠ్‌జీ వారితో సత్సంగము చేశారు. జ్ఞాని యొక్క జీవితములో ఏవిధమైన కామ క్రోధాది దోషములుండ కూడదని సేఠ్‌జీ అభిప్రాయము. ఒకవేళ జ్ఞాని జీవితములో కూడా దోషములుంటే ఎవరైనా జ్ఞానమును ఎందుకు కోరుతారు? సదా చారము మర్యాద భంగము అవుతుంది. ఆదర్శం చెడిపోతుంది. శ్రీకరపాత్రజీ మహరాజ్ అనేవారు, 'జ్ఞానుల జీవితంలో కూడా ఎపుడైనా కామ, క్రోధాది దోషములు కలుగవచ్చని తెలుసుకుని వుంటే ప్రజలు జ్ఞానులతో కూడా సావధానులై వుంటారు. దీని వలన జ్ఞానులు సర్వదా నిర్వికారులు అని అంధ విశ్వాసముతో నమ్మి తమ కోడళ్ళు, కూతుళ్ళని జ్ఞానుల దగ్గరికి పంపరు. అందుకని నిర్వికారతలో మోసపోయే అవకాశము వుంది. జ్ఞానోత్తర పాపము వలన సంశ్లేషము కలుగదని శాస్త్రము చెబుతుంది, అపుడు మనము ఆమాటను స్వీకరించవలసినదే కదా? ఇంకొకటేమిటంటే ఎవరైనా విచారవంతుడైన వ్యక్తి, కేవలము మనసులో వికారము కలిగినంత మాత్రముననే తనను అజ్ఞానినని అనుకుంటే తన తత్త్వనిష్ఠలోనే అడ్డు ఏర్పడుతుంది. రాగద్వేషములతో అంత ద్వేషమా తన యథార్థ సత్యము, నిర్వికార ఆత్మతత్త్వము కూడా ఉపేక్షించడమా? అది ఉచితము కాదు. అయినా కానీ సేఠ్‌జీ మాత్రం తన విచారధోరణిలోనే దృఢంగా వుండేవారు. వారికి జ్ఞాని జీవితంలో ఎలాంటి వికారములు అంగీకారములు కావు. ఇదే కారణముగా వారు పంచదశి, విచార సాగరము, వీటిలోని ఆభాసవాదమును అంగీకరించేవారు కాదు.

ఆ రోజులలోనే పండిత మదన మోహన్ మాలవ్యగారు అంత్యజులకు ద్వాదశాక్షర మంత్రము, అష్టాక్షర మంత్రము, పంచాక్షరము మొదలైన మంత్రములతో దీక్ష ఇస్తుండేవారు. కాశీనే కాకుండా సమస్త భారతములోని సనాతన ధర్మ

పండితులలో రెండు భాగములయ్యారు. కొందరు సమర్థించేవారు. కొందరు విపక్షములో వుండేవారు. శ్రీకరపాత్రజీ మహరాజ్ వారు కూడా విపక్షమే. శాస్త్రార్థ నిరూపణము జరిగింది. ఋషీకేశములో శ్రీకరపాత్రజీ మరియు పండిత మదన్‌మోహన్ మాలవ్యల శాస్త్రార్థము జరిగింది. శాస్త్రార్థములో ఏమి జరిగింది? అని వ్రాయడం కాదు ఇందులో నా అభిప్రాయం! ఆ శాస్త్రార్థములో శ్రీ జయదయాల్‌జీ గోయెంకాను మరియు గౌరీశంకర్ గోయెంకాను మధ్యస్థులను చేశారు. శ్రీగౌరీశంకర్ గోయెంకా స్పష్టంగా శ్రీకరపాత్రజీ వారిని విజయులుగా ఘోషించారు. కానీ శ్రీజయదయాల్‌జీ అన్నారు, 'ఒక దృష్టితో చూస్తే శ్రీకరపాత్రజీ వాదము సరైనది, ఇంకొకరకంగా చూస్తే మాలవ్యజీ వాదన సరైనదే. శాస్త్రప్రమాణముల ననుసరించి శ్రీకరపాత్రజీ పక్షము పరిపుష్టము, యుక్తుల ద్వారా మాలవ్యజీ వారి దృష్టి పరిపుష్టము. దీని వలన శ్రీకరపాత్రజీ, సేఠ్‌జీ పట్ల రుష్టులయ్యారు. వారు సంకీర్తనము, వర్ణ వ్యవస్థ దీనిపై ఒక విస్తృతమైన వ్యాసము వ్రాశారు, దానిని గీతాప్రెస్ వారు ప్రచురించలేదు. వేరే వారిద్వారా ప్రకాశితమయినది. ఈశావాస్యోపనిషద్‌లో వుండే విద్య, అవిద్య మరియు సంభూతి, అసంభూతి వీటిని గురించి సేఠ్‌జీయొక్క వ్యాఖ్యానమును కూడా వారు ఖండించారు, అదికూడా 'కల్యాణ్' పత్రికలో ప్రకాశితమవలేదు. వేరే దగ్గర నుండి ప్రకాశితమయింది. కానీ ఎపుడయితే శ్రీకరపాత్రజీ మహరాజ్ వారు 'గోరక్ష' ఆందోళనములో ప్రవృత్తు లయ్యారో అపుడు సేఠ్ శ్రీజయదయాల్‌జీ గోయెంకా, భాయిజీ హనుమాన్ ప్రసాద్ పొద్దార్ అందులో వారికి ఎంతగా సహకరించారంటే, శ్రీకరపాత్రజీ ప్రసన్నులయ్యారు. పాత సగతులు మరచిపోవాలి అని వారు నాతో అన్నారు.

సేఠ్‌జీ యొక్క ముఖ్యదృష్టికోణము సదాచారము, చరిత్రయొక్క పవిత్రతపైనే వుండేది. అందువలన పంచదశి, విచార సాగరము చదివే వారితో ఎప్పుడు జాగ్రత్తగా వుండేవారు, వారు ఉఛృంఖలులు కాకూడదని! వారు ఈ రెండు గ్రంథాలను బహిరంగముగానే విరోధించేవారు. ఉదాహరణకు మీరు చూడండి వ్యభిచారము నిషిద్ధ కర్మ, పాపము. ఒకవేళ దానిని ఎవరైనా ప్రారబ్ధభోగమని చెప్పారంటే అది సేఠ్‌జీ సహించేవారు కాదు. నిషిద్ధ ఆచరణ వాసనాపూరితమైన కర్తృత్వ ప్రధానముగా

జరుగుతుంది. దీనిని ప్రారబ్ధముపైన వెయ్యడం వారికి ఉచితమనిపించేదికాదు. వారు శ్రీమంగళనాథ్ మహరాజ్‌వారితో సంవత్సరాల తరబడి వేదాంత శిక్షణ పొందారు, అందువలన ఈ విషయంలో వారు చాలా నిశ్చయముగా వుండేవారు, ఎవరు ఏమైనా చెప్పనీ తన తీక్షణమైన యుక్తులతో వాటిని ఖండించేవారు. వారికి కలకత్తాలోని శ్రీహీరాలాల్‌జీ వారితో అత్యంత కటు అనుభవము కలిగినందువలన వారు కొంచెం కూడా సందేహము కలిగిందంటే, దానిని సార్వజనికరూపంతో వ్యతిరేకించేవారు. సావధానత, స్పష్టవాదిత వారిలో ఈ రెండు గుణములు బాగా వుండేవి.

బ్రహ్మచారి ప్రభుదత్తజీ మహరాజ్ వారి వెంట గోరఖ్‌పూర్ సంకీర్తన యజ్ఞంలో నేనూ వెళ్ళాను. గోయెంకా తోటలోనే ఆ ఆయోజనము జరిగింది. నేను ప్రతిరోజూ శ్రీమద్భాగవతముపై ప్రవచనములు ఇస్తూవుంటిని. సేఠ్‌జీకి గోపీ కృష్ణుని ప్రేమ, చీరహరణము, రాసలీల, వెన్న దొంగ లీల ఇలాంటి ప్రసంగాలన్నీ ఇష్టముండేవి కాదు. నేను భాగవత ప్రవచనము చేసేటపుడు సేఠ్‌జీ యొక్క ఆక్షేపాలను కూడా నివారిస్తూ వుండేవాడిని. పరస్పరం ఏదో చెవులు కొరుక్కునేవారు. కానీ భాయిజీ హనుమాన్ ప్రసాద్ గారు అందరినీ సమాధానపరుస్తుండేవారు. వారికి శ్రీకృష్ణలీల అంటే చాలా ప్రేమ, చాలా ఇష్టము. తర్వాత తర్వాత వారి అభిప్రాయ భేదము బాగా స్పష్టమయింది. శ్రీభాయిజీ అక్కడ రాసలీల కూడా వేయించారు. జనులు కొందరు ఎవరో ఒకరి స్వరూపాలతో (లీలాధారులతో) విశేషభావము ఏర్పరచు కునేవారు. ప్రసాదము కూడా తీసుకునేవారు. ఈ సంగతి నిశ్చయంగానే సేఠ్‌జీకి, వారి అంతరంగ అనుయాయాలకు ఇష్టం వుండేదికాదు. గోయెంకా - ఉద్యానవనమే తర్వాత కాలాంతరములో గీతావాటికగా పేరుగాంచినది.

ఫొటోలు తీసుకోవడము, జీవించివున్న వ్యక్తి యొక్క జీవితమును ప్రచురణ చెయ్యడము ఇవన్నీ సేఠ్‌జీ విరోధించేవారు. దీని వలన దేహాత్మ భావము ఇంకా పుష్టి చెందుతుందని వారు భావించేవారు, అదీ కాక తమ పేరు, ప్రతిష్ఠ, కీర్తి, పూజ వీటిని వృద్ధి చేసుకోవాలన్న వాసన కూడా వీటి వలన కలుగుతుందని అనేవారు. వారు తన మృత్యువు తర్వాత ఎవరూ నా జీవితముపైన వ్రాయకూడదని కూడా నిషేధించారు. ఎవరూ వ్రాస్తారో వారు పాపులవుతారు.' అని కూడా అన్నారు.

హనుమాన్‌బఖ్ష్ గోయెంకా, ఘనశ్యామ్ జాలాన్ పూర్వజన్మలో సేఠ్‌జీకి సంబంధీకులు. వారిని ఉద్ధరించటానికే సేఠ్‌జీ మరల జన్మఎత్తారని లోకులు చర్చించుకుంటుండేవారు. నేను ఒక రోజు ఏకాంతంలో సేఠ్‌జీని కలసి ప్రశ్నించాను 'మీకు ఎవరిదైనా పూర్వజన్మలను గురించి తెలుస్తుందా?' అని. వారి నవ్వి ఇలా అన్నారు 'అవును. ఒకవేళ నేను తెలుసుకోవాలనుకుంటే ఎవరి పూర్వజన్మను గురించి అయినా తెలుసకోగలను. వీరిద్దరిని గురించి కూడా నాకు అలాగే అనిపించింది అదేనేను వారితో చెప్పాను. ఎవరైనా సరే కావాలనుకుంటే తమ పూర్వజన్మను గురించి తెలుసుకోగలరు. దీనికి ఉపాయము ఏమిటంటే పవిత్రంగా ఏకాంతంలో కూర్చుని సంధ్యావందనము, గాయత్రి జపము చేసిన తర్వాత చిత్తమును తనస్మృతులపై ఏకాగ్రతము చేయాలి. పుట్టినప్పటి నుండి ఏ ఏ వ్యక్తులు, ఘటనలు మనసులో వస్తాయో, అన్నిటినీ వదిలివేస్తూ, ఇక ఈ జన్మకు సంబంధించిన ఏ దృశ్యములు చిత్తములో రానంతటి స్థితికి చేరుకునేది. మెల్ల మెల్లగా చిత్తము యొక్క గ్రంథులన్నీ విడిపోతాయి. అపుడు అది పూర్వ స్థితిలోకి వెళ్తుంది. గర్భంలో, తండ్రి వీర్యములో ప్రవేశించకముందు తన ఎక్కడ వున్నది, ఏమిటని తెలిసిపోతుంది. యోగదర్శనములో ఈ సంగతి స్పష్టంగా నిర్దేశించబడివుంది.

ఒకసారి నేను గీతా భవన్, సత్సంగ మండలి భవనంలో కూర్చుని వున్నాను. ఇద్దరు ముగ్గురు సత్సంగీయులు వున్నారు. సేఠ్‌జీ లేచి నిల్చుని చెప్పడం మొదలెట్టారు, 'చాలా మంది అంటున్నారు, సేఠ్‌జీ సత్సంగంపై ఇంత డబ్బు ఎందుకు ఖర్చుపెడుతున్నారు?' అని. ప్రతి సంవత్సరము ఇంత మంది రావడం, పోవడం, అన్నపానాదులు, వుండడానికి వ్యవస్థ ఇవన్నీ ఏర్పాటు చేయవలసివస్తుంది. ఏమి అవసరము? నేను అంటాను ఇదంతా నాకు సరదా! అందరూ వారి వారి సరదాలకోసమని ఏమిటేమిటో చేస్తుంటారు! సినిమాపై ఎంత డబ్బు ఖర్చు పెడతారు! నేనయితే సత్సంగముపై ఖర్చుపెడతాను' అని చెబుతుంటే వారి ముఖంపైన ఉల్లాసము, ఉత్సాహము స్పష్టంగా మెరిసిపోయేది.

సేఠ్‌జీ యొక్క 'గీతా తత్త్వ వివేచనీ' మొదట 'గీతా తత్త్వాంకము' అనే పేరుతో ప్రచురితమయింది. 'తత్త్వాంకము' వ్రాసే పని చాలమటుకు 'బాంకుడా'లోనే

జరిగింది. సేఠ్‌జీ యొక్క భక్తులు 'బాంకుడా'ను వైకుంఠము అనేవారు. మారవాడీ భాషలో రెంటికి 'బ' 'క' 'ట' అక్షరములే వ్రాస్తారు. ప్రసంగానుసారము చదువుకుంటారు. 'బాంకుడా'లో నేను 4నెలలు వున్నాను. సేఠ్‌జీ, భాయిజీ, స్వామిరామ్ సుఖదాస్‌జీ, స్వామి చక్రధరజీ, హరికృష్ణదాస్ గోయెంకా, అందరూ కలసి గీతార్థ నిర్ణయం చేసేవారము. ఒకోసారి స్వామి శ్రీ చక్రపాణీజీ వారిని కూడా పిలిపించేవారు. ఒక్కోసారి ఏదైనా శ్లోకము యొక్క అర్థనిశ్చయముపై అభిప్రాయ భేదము కలిగిన యెడల ఆ సమయంలో శ్రీభాయిజీ భావనతో, శ్రీహరి కృష్ణదాస్ కర్కశ తర్కములు రెండూ 'ఢీ' కొన్నపుడు ఇక చూడవలసిందే! శ్రీరామసుఖదాస్‌జీ శ్రీశంకరాచార్యుల సంస్కృత 'టీకా' చెప్పేవారు. హరికృష్ణ దాస్‌కి శ్రీభాష్యముపట్ల చాలా విశేషమైన అభిమానం! వాద వివాదములలో ఇద్దరి ముఖాలు కందిపోయేవి. వారి వారి అభిప్రాయములు ఆవేశించినట్లుండేవి. అలాంటి సమయములలో సేఠ్‌జీ యొక్క వ్యవహారనిపుణతను కూడా చూడవలసిందే. వారు నవ్వుతూ 'టీకా' నాపేరుతో ప్రకాశితమవుతుంది. అందుకని నా అభిప్రాయం వ్రాయవలసి వుంటుంది. 'అపుడు ఇద్దరు నిశ్శబ్దంగా వుండిపోయేవారు. నా పని ఏమిటంటే వ్రాసినదానిలో ఏదైనా ప్రాచీన ఆచార్యులపట్ల కటు ఆక్షేపము ఉండకుండా చూడడం. ఖండన మండన జరుగుతూనే వుంటుంది. అలాగని తెలిసితెలియకకూడా అగౌరవము ఎవరికి కలగకూడదు. నేను ఎపుడైనా ఏదైనా ఒక అర్థవిశేషముపై గట్టిగా చెప్పానంటే సేఠ్‌జీ చాలా ప్రేమగా ఇలా అనేవారు 'అలాగ కూడా అర్థము చెప్పుకోవచ్చు. ముఖ్యంగా నేను చెప్పిన అర్థం వ్రాయండి తర్వాత ప్రశ్నోత్తరములలాగ మీరు చెప్పిన అర్థమును వ్రాయండి. ఆ! ఇలాగ కూడా వుంటుంది అని!

భారతదేశపు సుప్రసిద్ధ సంత్ మహాత్ముడు శ్రీమంగళనాథ్‌జీ మహరాజ్‌తో సేఠ్‌జీ గీతా అధ్యయనము చేశారు. స్వామీజీ యొక్క విచారబిందు, వీర విజయము మొదలైన గ్రంథములు వేదాంతము యొక్క ప్రమాణ ప్రమేయముపై ప్రధానమైన శ్రేష్ఠమైన రచనలు వారి త్యాగవైరాగ్యములను ఆరోజులలో చాలా ప్రశంశించేవారు. వారు శంకరసిద్ధాంతము యందు అనుభవజ్ఞులయిన మహాపురుషులు. సేఠ్‌జీ వారి సిద్ధాంతములను పూర్తిగా అంగీకరించేవారు. శ్లోకముల అర్థముపై కొంచెం అభిప్రాయ భేదముండేది. కానీ తాత్పర్యములో ఏమీ అభిప్రాయ భేదముండేది కాదు.

నేను ఒక రోజు ఏకాంతములో సేఠ్‌జీని వారి శ్రద్ధను గురించి ప్రశ్నించాను. సేఠ్‌జీ 'శంకరాచార్యులు, మగళనాథ్‌జీ వారిపై 15 అణాల శ్రద్ధ వుంది' అని చెప్పారు. ఇక ఈ రెండు పైసలెందుకు తక్కువ అని అడిగారు. వారు ఇలా చెప్పారు 'శంకరాచార్యుల తత్త్వజ్ఞానము కోసము కర్మత్యాగము అనివార్యము అంటారు, అది నాకు అంగీకారము కాదు. శ్రీమంగళనాథ్‌జీ మహరాజ్ గోశాల కోసము భూమి కావాలని కోర్టులో కేసు పెట్టారు, అది నాకు ఇష్టము కాలేదు. సేఠ్‌జీ స్వభావం అలాగుండేది. వేద శాస్త్రము, పురాణములు స్పష్టంగా ఎపుడూ ఖండించరు, అనుచితములు అని కూడా అనరు. వారు మాటాడే తీరు ఇలాగుండేది 'నాకు ఇది నచ్చదు' 'నాకు ఇందులో అభిరుచిలేదు' అనేవారు. ఏ విధమైన వివాదములనుండైనా తనను తాను ప్రక్కకు పెట్టుకోవడంలో వారు అద్భుతమైన కౌశలము చూపించేవారు.

తీర్థయాత్ర స్పెషల్ ట్రైన్‌లో సేఠ్‌జీ నాకు ఒక బెర్త్ పూర్తిగా ఇచ్చారు. సుమారు 3మాసాల వరకు కలసి యాత్ర చేశాము. క్షేత్రముల పట్ల వారికి విశేషమైన ఇష్టం వుండేదికాదు. అన్ని స్టేషనులలోను, పూర్లల్లోనూ సేఠ్‌జీ సత్సంగము బాగా జరిగేది. మా కంటే ముందు ఒక గ్రూపు వెళ్ళి అక్కడ ప్రచారము చేసి వుండేవారు. సేఠ్‌జీ దృష్టిలో తీర్థయాత్ర కాదు ప్రచార యాత్ర. మందిరములలోని తీర్థ ప్రసాదములు వారు తీసుకునేవారు కాదు. ఇది కూడా నేను గమనించాను. చరణామృతమును శిరసుపైన చల్లుకునేవారు. నేను అడిగాను 'ఎందుకు మీరు ప్రసాదము తీసుకోరు' అని. 'చరణామృతములో ఏ నీరు వేసివుంటారో ఎవరికి తెలుసు' అనేవారు. 'ప్రసాదమును ఎవరెవరు ఏ ఏ భావములతో కామనలతో తెస్తారో ఎవరికి తెలుసు?' అని నవ్వుతూ ఇలా అన్నారు 'మనిషి భగవంతుడికి నైవేద్యము సమర్పించుకున్నాడు, కానీ భగవంతుడు దానిని స్వీకరించాడో లేదో తెలియదు కదా? అది నిశ్చయమైతే అపుడు ప్రసాదము స్వీకరించడంలో నాకు ఏ విధమైన అభ్యంతము లేదు. నేను కూడా వారి మాటను విన్నాను. ఇదంతా వారి వారి భావనకు సంబంధించిన మాట, మేమయితే క్షేత్రములలో ప్రసాదము తీసుకునేవారము.

తోతాద్రిలో అక్కడ అభిషేక తైలము యొక్క మహిమను విని, అది శరీరంపైగల చర్మరోగములను బాగుచేస్తుందని విని యాత్రికులు టిన్నులు టిన్నులు నింపుకుని

రైల్లో పెట్టుకున్నారు. అక్కడ నూనెకు ఏమీ మూల్యము తీసుకునేవారు కాదు. ఈ మాట తెలియగానే సేఠ్‌జీ అందరిని కోప్పడారు. 'ఇది మర్యాద కాదు. అన్యాయం! ప్రసాదం పట్ల ఇలా అవినీతి మర్యాదకాదు' అన్నారు. అలాగని అందరితో మూల్యము వసూలు చేశారు, వందలాది రూపాయలను మందిరములో జమచేయించారు. వారి న్యాయ నిష్ఠ ఆదర్శవంతమయినది. దారిలో రైలు కర్మచారులకు బహుమతి రూపంగా డబ్బులు ఇప్పిస్తుండేవారు. అంతే కాని మరల లంచం ఇవ్వడానికి ఒప్పుకునేవారు కాదు. దీనితో మీకు వీరి ధార్మికత అర్థమయిపోతుంది. జగన్నాథ పురీలో స్వయంగా తాను ప్రసాదం తినలేదు, సరికదా తన అనుయాయులను కూడా ఎవ్వరినీ తిననివ్వలేదు. పూరీలో ప్రసాదము యొక్క మహిమను గురించి శాస్త్రములలో వ్రాశారు, నిజమే అది సరే, కానీ ఆ మహిమ వర్ణాశ్రమ ధర్మమునను సరించి వుంటుంది. శాస్త్రోక్త విధితో ఏ ప్రసాదమయితే దొరుకుతుందో అదే తీసుకోవాలి. ధర్మమర్యాద ఉల్లంఘిస్తే ఉచ్ఛృంఖలత పెరుగుతుంది' అని అనేవారు.

ఈ యాత్రలో కుంభకోణము మొదలైన తీర్థప్రదేశములలో అక్కడి విద్వాంసుల కోసము అన్వేషణ జరిగింది. సేఠ్‌జీ వారిని చాలా ఆదరపూర్వకముగా ఆహ్వానించి, సత్కరించి దక్షిణలిచ్చేవారు. ఈ సమయములో మా తీర్థయాత్ర ట్రైన్ తిరువన్నామలై వెళ్ళింది. దక్షిణ ప్రదేశములో భగవాన్ శంకరుడికి 5 మహత్వపూర్ణమైన లింగము లున్నవి. పృథ్వి, జలము, వాయువు, అగ్ని మరియు ఆకాశము వాటిలో అగ్ని లింగము ఇక్కడ వున్నది. అపుడపుడు అక్కడ ఒక జ్యోతి దర్శనమిస్తుందని కూడా అక్కడ చెప్పుకునేవారు. అక్కడనే శ్రీరమణమహర్షి వారి ఆశ్రమము వున్నది. ఆ రోజులలో వారు అక్కడ విరాజమానులై వుండేవారు. సేఠ్‌జీ, ఇంకా కొందరు సత్సంగ ప్రేమికులు వారి దర్శనార్థము వెళ్ళారు. నేను వారితో వెళ్ళాను.

శ్రీరమణ మహర్షిగారు లంగోటి మాత్రమే ధరించారు. ఒక మంచంపైన పడుకుని వున్నారు. ఆశ్రమములో వేరే జిజ్ఞాసువులు కూడా వుండేవారు. వారితో హిందీ భాషలో 'ధ్యానం దేనిని గురించి చెయ్యాలి' అని ప్రశ్నించాము. ప్రశ్నలకు జవాబులుగా వారు ఒక పుస్తకము చదవమని సూచించారు. కానీ మాతో మాత్రం వారు మాట్లాడారు. ఒక సజ్జనుడు మేము హిందీలో అడిగిన ప్రశ్నలను తమిళంలో

చెప్పేవారు, వారు తమిళములో జవాబు చెబితే మరల వారు మాకు హిందీలో అర్థమయ్యేలా చెప్పేవారు. ధ్యానానికి సంబంధించిన ప్రశ్నకు వారు ఇలా చెప్పారు. 'ఈ ప్రశ్నించేది ఎవరు?' 'జిజ్ఞాసు' అని చెప్పారు. అపుడు వారు అన్నారు 'ఈ జిజ్ఞాసువు ఎవరు!' ఎవరికి తెలుసుకోవాలని ఇచ్ఛవున్నదో వారు' సరే ఈ ఇచ్ఛ ఎవరికి కలుగుతుంది? అదే దానినే ధ్యానించండి' అంటే ఆత్మధ్యానము, ఆత్మ చింతన చెయ్యాలి' అన్నారు రమణ మహర్షులు సేఠ్‌జీ మరల త్రిప్పి తిరిగి సగుణ సాకార ధ్యానమును గురించి అడగాలనుకున్నారు, కానీ శ్రీరమణమహర్షులవారు దేనినీ అంగీకరించలేదు. విల్లుపురము నుండి ఒకవైపు తిరువన్నామలై వుంటే వేరొకవైపు పాండిచేరీ వుంది. మాకయితే పాండిచేరీ వెళ్ళాలని వుంది, కానీ సేఠ్‌జీకి అక్కడికి వెళ్ళడం ఇష్టము లేదు. ఎందుకంటే యోగి అరవింద్ ఘోష్‌వారి ఆశ్రమములో శాస్త్రోక్త వర్ణాశ్రమ వ్యవస్థను వారు అనుసరించరు. సేఠ్‌జీ తన నిశ్చయముపై స్థిరంగా వున్నారు. కానీ మేమందరము వారి అనుమతి తీసుకుని ఆశ్రమము వెళ్ళాము. 24గం॥లపాటు అక్కడే వున్నాము. సేఠ్‌జీకి ఇష్టము లేకపోయినా మమ్ములను అక్కడికి పంపారు.

భాయిజీ శ్రీహనుమాన్ ప్రసాద్ పోదార్ గారికి శ్రీమద్భాగవత విశేషాంకము ప్రచురించాలని వుండేది. సేఠ్‌జీ అనే వారు ఇందులో వెన్న దొంగ లీల, చీరహరణలీల, రాసలీల మొదలైనవన్నీ తీసెయ్యమనేవారు. భాయిజీకి ఇది ఇష్టము వుండేదికాదు. భాయిజీ రతన్‌గఢ్‌లో వుండాలని నిశ్చయించుకున్నారు. సేఠ్‌జీ సంపాదక విభాగము నంత రతన్‌గఢ్ పంపించివేశారు. నేను కూడా రతన్‌గఢ్ వెళ్ళాను.

సేఠ్‌జీ రతన్‌గఢ్ వచ్చి అనువాదం నేను చెయ్యాలని భాయిజీని ఒప్పించారు. తర్వాత భాయిజీ చూసి ఎక్కడయినా అవసరమయిన దగ్గర టీకా టిప్పణి వ్రాయాలని నిశ్చయమయింది. విశేషాంకం ప్రచురించడానికి సమయం చాలా కొద్దిగానే వుండినది. అందువలన నేను మూలగ్రంథం తీసకుని కూర్చునేవాడిని. అనువాదము చెబుతూ వుంటే దేవధర శర్మజీ వ్రాస్తుండేవారు. ఒక్కోసారి వారి చెయ్యి వ్రాసి వ్రాసి బిగుసుకుపోతే బొగ్గుల పొయ్యి సెగని కొంచెం కాపడం పెట్టుకునేవారు. కొంచెం నొట్లో వక్కపొడుం వేసుకునేవారు. నేను దిండు వేసుకుని అలా ఒరిగి కూర్చునేవాడిని.

రోజుకు 10 గంటలపాటు అనువాద కార్యక్రమము జరుగుతూ వుండేది. దాదాపు 4నెలలు అయ్యేటప్పటికి తయారయింది. భాగవతములో ఏ అంశమునూ వదిలిపెట్టలేదు. ఈ కార్య కలాపములలో భాయిజీకి భాగవతము పైనుండే శ్రద్ధ, అభిరుచి సేఠ్‌జీ యొక్క ఉదారత రెండు తెలిసిపోయాయి. లేకపోతే భాగవతము ఎలాగంటే అలాగ అనువాదము సాధ్యము కాదు. ఈ విషయంలో నేను కాశిలోని మహామహోపాధ్యాయ పండిత విద్యాధర్‌జీ గౌడ్‌ను విచారించాను. ఒకవేళ మూల గ్రంథములో పరివర్తన కానీ సంక్షిప్తము కానీ, విస్తారము కానీ చేస్తే దాని సమగ్ర పారాయణ వలన కలిగే అపూర్వత కలుగ జాలదు, అందు వలన పారాయణ కొరకు సమగ్ర గ్రంథమునే అనువాదము చెయ్యాలి. అపూర్వము పైనకాక, భాగవద్భావము, తత్త్వజ్ఞానము మరియు సదాచారము వీటిని గురించి వుండేది.

అక్కడ వుండేటప్పుడే శ్రీహనుమాన్, పుస్తకాలయములో నుండి చాలా గ్రంథాలను పరిశీలించి నేను చిన్న చిన్నవి 7, 8 పుస్తకాలు వ్రాశాను. సేఠ్‌జీ కూడా మధ్య మధ్యలో అక్కడికి వస్తూపోతూ వుండావారు.

ఒకసారి నేను వారితో అన్నాను 'మీరు అందరికీ ధ్యానం చేయిస్తారట కదా? నాకు కూడా ధ్యనము కలిగేలాగ చేయండి' అన్నాను. నా మనసులో కేవలము కుతూహలమే వుండినది కానీ ధ్యానం కోసమని కాదు. మొదటనే నేను ప్రమాణ ప్రమేయములను నిషేధించి అప్రమేయ స్వస్వరూప బ్రహ్మను అన్న నిశ్చయము చేసుకునియున్నాను. అందువలన ధ్యాత, ధ్యానము వీటిలో నాకేమీ అభిరుచి లేదు. సేఠ్‌జీ ఆనందంగా నా మాటను అంగీకరించారు. ఒక సేఠ్ ఇంటి డాబాపైన ఏకాంతములో వారితో కూర్చున్నాను. వారు దాదాపు 1 1/2 గంటల వరకు ఆత్మ యొక్క అసంగతను, పూర్ణతను మరియు అద్వితీయతను నిరూపించసాగారు. నేను కదలక మెదలక, అర్ధనిమిలిత నేత్రాలతో వారు చేస్తున్న వివేచనను వినసాగాను. వారు నా అంతఃకరణలో ఒక దృఢ విశ్వాసాన్ని, బ్రహ్మభావనను ఉత్పన్నము చేయా లనుకుంటున్నారు. నిజంగానే నా మనసు ఏకాగ్రమయింది, వారి వివేచనము వలన ఆనందం కలిగింది. తర్వాత వారు అద్వైత వేదాంత సిద్ధాంతమును సరిగా అర్థం

చేసుకున్నారన్న దృఢభావం కలిగింది. ఒకవేళ తేలికమాటలో చెప్పాలంటే నేను లోలోపలే మనసులో సేఠ్‌జీని పాస్ చేశేశాను.

హరిద్వారంలో కుంభమేలా జరిగింది. అర్థకుంభమా! పూర్ణ కుంభమా సరిగా గుర్తులేదు. మేలాలో గీతాప్రెస్‌వి పుస్తకాల దుకాణము పెట్టారు. నేను దుకాణంలోనే విడిది చేసి వుంటిని. అక్కడి నుండి వెళ్ళిపోయేటపుడు మేలాలో వెనుకవైపునుండి నిప్పు అంటుకుంది. అందులో గీతాప్రెస్ దుకాణము కూడా కాలిబూడిద అయింది. దుకాణము బీమా చేయించి వుండిరి. డబ్బు అయితే పూర్తిగా దొరికింది. సేఠ్‌జీకి కబురు తెలియజేశారు. వారు లెఖ్ఖాచారము చూసి ఏ పుస్తకాలు విక్రయింపబడ్డాయో వాటి డబ్బు వసూలు (బీమా కంపెనీ నుండి) చెయ్యడం అనుచితము అని అన్నారు. వారి ఆజ్ఞతో డబ్బులు బీమా కంపెనీకి వాపసు చేశారు. వారు ప్రతి పనిని నీతిగా న్యాయంగా జరగాలనుకునేవారు. న్యాయంగా విశ్వాసంగా వ్యాపారము చెయ్యడము వలన ముక్తిని కూడా పొందవచ్చు అనేవారు.

హరిద్వార్‌లో కుంభ లేక అర్థకుంభ మేలా జరిగినపుడు ఆ సంవత్సరము సేఠ్‌జీ యొక్క సత్సంగము స్వర్గాశ్రమములో కాకుండా వేరే చోట జరిగేది. నాకు రెండు ప్రసంగాలు గుర్తున్నాయి. ఒకసారి కర్ణవాసములో, రెండవసారి బృందావనములో శ్రీజీయొక్క తోటలో. సేఠ్‌జీ వ్యవహారములో చాలా నిపుణులు. వృందావనం శ్రీజీతోటలో వారి సత్సంగము, ప్రవచనము జరుగుతూ వుండేది. వారికి రాసలీల ఇష్టము వుండేది కాదు. స్పష్టవాది అయినందువలన వారు ఇలా అన్నారు. 'ఒకవేళ రాసలీల చూడటంవలన ముక్తి కలిగేట్లయితే ఒకసారి చూడగానే కలగాలి, మాటిమాటికీ చూడవలసిన అవసరమేమున్నది? ఈ మాట వారి నోటి నుండి రాగానే నేను మాట్లాడటము మొదలుపెట్టాను, 'మాటను మీరు భగవన్నామముపట్ల కూడా చెప్పగలరా ఏమి? ఒకసారి భగవన్నామము తీసుకుంటే ముక్తి కలుగుతుంటే మాటిమాటికీ భగవన్నామము తీసుకునే అవసరం ఏమివుంది?' నేను ఒక గంట సేపు వ్యాఖ్యానము ఇచ్చాను. నా మనసులో ఈ సద్భావము కూడా వుండినది. ఎవరైనా బృందావన లీలారసికులు సేఠ్‌జీని అవమానించకూడదని. సేఠ్‌జీ మౌనంగా వింటూ వుండిరి. శాంతియుతముగా సత్సంగము పూర్తయింది.

సత్సంగము ముగిశాకా సేఠ్‌జీ నా చెయ్యి పట్టుకుని ఏకాంత ప్రదేశమునకు తీసుకుని వెళ్ళారు. నాతో అన్నారు 'మీరు చాలా మంచి పని చేశారు. మధ్యలో మాట్లాడటము మొదలుపెట్టారు మీ ఉత్తమమైన శ్రీకృష్ణలీలలను వినిపించారు. మీరు అలా చెయ్యకపోతే బృందావనములోని కొందరు భక్తులకు కష్టము కలిగియుండేది. వాద వివాదము పెరిగి సత్సంగములోనే విఘ్నము ఏర్పడేది' అన్నారు.

నా హృదయములో వారి యొక్క విచారశీలత చెరగని ముద్రవేసింది.

వారి సత్సంగములో 'సీతా మావు' పూరి రాజాసాహబ్ వచ్చేవారు. 70 సం॥ల కంటే వయస్సు ఎక్కువనే వుండవచ్చు. 50 సం॥ల నుండి వారికి సత్సంగము అలవాటు వుంది. ఒకరోజు సత్సంగములో సేఠ్‌జీ సవినయంగా రాజాగారిని ఇలా ప్రశ్నించారు. 'మీరు ఇన్ని సంవత్సరములు సత్సంగము చేసి మీ జీవితము కొరకు మీరు ఏ నిశ్చయానికి వచ్చారు'? వారన్నారు, 'నేను రెండు నిశ్చయాలు చేసుకున్నాను. ఒకటి సత్సంగము ఎపుడూ వదలకూడదు. దాని వలన సదాచారము పట్ల విశ్వాసము అలాగే వుంటుంది. భజనానందము వృద్ధి చెందుతుంది. భగవత్ తత్త్వ సంబంధమైన చింతన జరుగుతుంది. రెండవది ఎక్కడైనా వుండనీ సరే నామజపము మాత్రము వదలకూడదు. ఒకవేళ ఈ రెండు మాటలూ జీవితంలో వచ్చాయంటే జీవితం మంగళమయమవుతుంది. సమరసత చెక్కు చెదరదు'! మహరాజా చాలా సరళ స్వభావుడేకాక సేఠ్‌జీకి పరమ భక్తుడు.

గీతా తత్త్వ వివేచన టీకా వ్రాశే రోజులలో శ్రీభాయిజీ, శ్రీ స్వామీ రామసుధా దాస్‌జీ, బాబా చక్రధర్‌జీ అందరూ అక్కడే వుంటుండేవారు. నేను కూడా వున్నాను. శ్రీమోహన్‌లాల్‌జీ వారి చిన్నపిల్లవాడు మరణించాడు. సేఠ్‌జీకి మోహన్‌లాల్‌జీ చిన్న తమ్ముడే కాదు, దత్తపుత్రుడు కూడా. పిల్లవాడిని తీసుకుని మేము స్మశానమునకు వెళ్ళాము. తిరిగి వచ్చి చూస్తే సేఠ్‌జీ అత్యంత వ్యాకులుడై వున్నారు. అందరూ వారి సేవా శుశ్రూషలో మునిగి వున్నారు. మీరే ఇంత దుఃఖితులయితే లోకులేమంటారు? మీరింతటి భగవద్భక్తులు, విచార వంతులు, సత్పురుషులు! మీకే దుఃఖము పోలేదంటే ఇక భగవన్మార్గములో వెడితే మాకు మాత్రం ఏమి (దుఃఖం) తగ్గుతుంది! అని లోకులు అనుకోరా? అని వారిని సముదాయించారు. సేఠ్‌జీ అన్నారు 'ఒకవేళ,

ఎవరైనా ఇంటివాళ్ళు, బయటివాళ్ళు కానీ ఎవరైనా నా యెదుట దుఃఖపడుతూ వచ్చారంటే నేమరల బాధపడతాను. అందుకని మీరు ప్రతిజ్ఞ చేయండి మీరు ఎవ్వరూ బాధపడనంటే అపుడు నేను కూడా బాధ పడను.' అన్నారు. అందరూ అలాగే చేశారు. అంతా సరిపోయింది. నేను రెండవ రోజు ఏకాంతములో వారిని ఇలా ప్రశ్నించాను. 'నిజంగానే మీకు అంతటి దుఃఖము కలిగిందా?' సేఠ్‌జీ అన్నాను 'నేనెపుడు దుఃఖితుడనయ్యానో, అపుడు అందరూ విజ్ఞులయ్యారు, నాకు తెలియ జెప్పడం మొదలుపెట్టారు. నా ఒక్కడి దుఃఖాభినయముతో అందరి దుఃఖము పోయింది.' అన్నారు. కొందరికి ఇతరుల దుఃఖాన్ని పోగొట్టే ఒక కళ వుంటుందికాబోలు అది సత్పురుషులకే సాధ్యము!

కర్ణవాసములో వీరి సత్సంగము చాలా జోరుగా సాగింది. శ్రీ ఉడియా బాబాజీ మహరాజ్ కూడా అక్కడే వున్నారు. భాయిజీ హనుమాన్ ప్రసాద్ పోదార్ గారు కూడా అక్కడే వున్నారు. సేఠ్‌జీ మహాత్ముల జీవనశైలిపై చాలా నిక్కచ్చిగా వుండేవారు. వారు ఏ మహాత్ముడిలోనయినా కించిత్ కూడా తృటి, దోషము లేశమాత్రం కూడా ఇష్టపడేవారు కాదు. ఎవరైనా నవ్వులాటకు ఎవరిపైన అయిన (మహాత్ముడిపై) దోషము చెబితే అది నిజమనుకుని దానిని గురించి ఆలోచన చేసేవారు. మహాత్ముల జీవితములో దోషదర్శనము కొరకు ఏ అవసరము రాకూడదు, వుండకూడదు అని వారు భావించేవారు. వారు అపుడు మహాత్ముల పక్షము కాకుండా, దోషదర్శి పక్షము వహించేవారు.

ఇపుడు నాకు అనిపిస్తుంది వారి దృష్టికోణము ఎంత ఉత్తమమయినది అని! సేఠ్‌జీ వారి సత్సంగము వారు సంధ్యావందనము కొరకు లేచినపుడు, ఆ సమయములో శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్ గంగానది తీరమునకు వెళ్ళేవారు. వారు గంగాస్నానము చేసి ఆనందంతో ఇసుకలో కూర్చునివుండేవారు. నడుస్తూ తిరుగుతూ మాట్లాడుతూ వున్న ఆ 'బ్రహ్మ' యొక్క మాట నాకు మాటిమాటికీ గుర్తుకు వస్తుంది. రెండు చేతుల నిండా ఇసుకను తీసుకుని క్రిందవేస్తూ వారు ఇలా అనేవారు. 'శాంతనూ! ఈ ఇసుకలో ఒక్కో కణము కూడా బ్రహ్మమే అని తెలిసేవరకు జ్ఞానము పూర్తికాదు. వారి దృష్టిలో యజ్ఞం చెయ్యడము, గడ్డిపీకడము

రెండూ సమానమే. వారు సేఠ్‌జీ సత్సంగమునకు బలవంతంగా తీసుకువెళ్తే వచ్చేవారు. మౌనంగా ప్రసన్నంగా కూర్చునేవారు. సత్సంగము పూర్తి అయ్యాకనే లేచేవారు. వారి నిష్పంద ఆసనము ఎవరు చూశారో వారికి ఇప్పటికీ అది గుర్తువుండేవుంటుంది.

నా భాగవత అనువాదమును ప్రజలు బాగా ఇష్టపడ్డారు. సేఠ్‌జీకి కూడా బాగా నచ్చింది. అందుకని ఇక 'మహాభారతం' విశేషాంకము కూడా ప్రచురించాలని నిశ్చయించుకున్నారు. అందులో కూడా గ్రంథంలో పెంచటం, తుంచటం లాంటివి ఏమీ చెయ్యవద్దని నేను నా అభిప్రాయము చెప్పాను. నేను దేశ, కాల, పాత్రల యొక్క భేదముతో ఆయా ప్రసంగములను వ్యాఖ్యానిస్తాను' అని నేను అన్నాను. సేఠ్‌జీ అభిప్రాయమేమిటంటే మహా భారతము మొత్తము గ్రంథము తీసుకుంటే వారి సిద్ధాంతాలకు, నీతికి కొన్ని చోట్ల అది గీటురాయి కాలేదు, అదీకాక చాలా పెద్ద గ్రంథమవుతుంది. అందువలన దాని సంక్షిప్త ప్రచురణయే జరగాలి అన్నారు. ఇక నేను అంగీకరించాను. సంక్షిప్తము అన్న శబ్దము ఎపుడైతే ఉపయోగిస్తున్నామో అపుడు తగ్గించడంలో ఆపత్తి ఏమీ లేదు.

అనువాద కార్యము మొదలయింది. ఆదిపర్వము, సభాపర్వము సంక్షిప్తముగా అనువదించాము. కొంచెము వనపర్వం కూడా అనువదించాము. కానీ నా మనసులో మాటిమాటికీ అనిపిస్తుండేది, తర్వాత కాలంలో జనం గ్రంథం ఇంతే అనుకుంటారేమో! అని అలా అనుకోకూడదు కదా! వస్తుతః మహాభారతము ఒక్కొక్క పాత్ర మనోవృత్తుల చిత్రణలో సహాయకములు, అన్ని కలసి మహాభారతము ఒక సర్వాంగీణ గ్రంథమవుతుంది. ఏదైతే మహాభారతములో వుందో అదే సర్వత్ర వున్నది. ఏదైతే మహాభారతములో లేదో అది ఎక్కడా లేదు. అలాగని వ్యాసుడి ప్రతిజ్ఞ. మనిషి యొక్క వ్యక్తిగత జీవనము, సామాజిక జీవనము కూడా పరిస్థితులు ఎంత తారుమారు చేస్తాయి! అందులో ఏమేమి అవసరాలుంటాయి? యుద్ధానికి ముందు, తరువాత, పర్వతీయభూమి, సమభూమి అర్థాత్ దేశ, కాల, వస్తు, వ్యక్తి, అవస్థ, వయసు, రుచి, ప్రవృత్తి వీటి భేదముతో అన్ని మాటలను సమర్థించవచ్చు. 'భారత తాత్పర్య ప్రకాశము', 'భారత తాత్పర్య నిర్ణయము' మరియు 'నీలకంఠీ టీకా' మహా భారతములోని అన్ని ప్రసంగాలనూ భక్తిపరంగా, తత్త్వజ్ఞాన పరంగా అంగీకరిస్తాయి.

నిర్వేదము స్థాయి భావము. శాంతి రసము ప్రతిపాద్యము, అలాంటపుడు మనసులో చాలా ద్వైదీభావము ఏర్పడేది. నేను మహాభారతమును సంక్షేపము చేస్తున్నాను కదా, దీని వలన తాత్పర్యం లోపము కలుగదుకదా అని! ఈ గ్రంథముపై సంక్షిప్త మహాభారతము వ్రాయడానికి అంగీకరించానన్నదొక్కటే కొంచెం స్వాంతన. ఇందులో నా స్థితి స్పష్టము.

నేను బాల్యావస్థ నుండి కూడా అటువంటి విద్వాంసుల వెంట వున్నాను. వారు శాస్త్రములయొక్క అక్షరశః, ప్రత్యేక పంక్తి, మరియు వాక్యములను కూడా యదార్థమని అంగీకరించేవారు. దానికి సముచితమైన సమాధానము కూడా చేసేవారు. శ్రీ లక్షణ శాస్త్రి ద్రవిడ్, శ్రీ పంచానన తర్కరత్న, వృద్ధశ్రీ వామాచరణ్ భట్టాచార్య, శ్రీ ప్రభుదత్తజీ అగ్నిహోత్రి, మొదలైన విద్వాంసులు శాస్త్రములను అంగీకరించక పోవడం కానీ, వాటి ఏదో ఒక భాగాన్ని ఒప్పుకోకపోవడం కానీ, పరంపరాగత అర్థములను మార్చడము ఇవన్నీ కూడా ఒకే సమకక్షలోనివే, ఇది నాస్తికత యొక్క అభివ్యక్తమే అని వారి అభిప్రాయము. శాస్త్రవిప్లవము, ధర్మవిప్లవం సమానార్థకమే. మహాభారతముపై నీలకంఠుడు, శ్రీమద్భాగవతముపై శ్రీధరస్వామి వారు ఏ టీకాలనయితే వ్రాశారో, వారు ఏ 'పాఠ'ను అంగీకరించారో వాటిని మార్చడానికి మాకు అధికారము ఏమీ లేదు. వారి ఎదుట ఇంకా పరిపుష్టములయిన ప్రమాణము లుండేవి కాబోలు! మనము వారి పరంపరను అంగీకరించి శాస్త్రముల 'సంగతి' వ్యాఖ్యానించాలి. అలాగ మనము చెయ్యలేకపోతే శాస్త్రము యొక్క దోషము కాదు, అది మన బుద్ధి యొక్క దోషమే అవుతుంది. ఇలా ఊహాపోహలు మనసులో జరుగుతూ వుండేది, నేను భగవదిచ్ఛతో కుంభమేళ ప్రయాగకు వెళ్ళిపోయాను.

బహుశా అది అర్థకుంభమేళా అనుకుంటాను. ఒక దగ్గర జ్యోతిష్పీఠాధీశ్వరుడు శ్రీ బ్రహ్మానంద సరస్వతి మహరాజ్ వారి విడిది అక్కడ వున్నది. నేను మొదట కూడా వారి దగ్గరికే వెళ్తువుండేవాడిని. మూడు సంవత్సరముల మునుపే వారితో సన్యాసదీక్ష తీసుకోవాలని కూడా నిశ్చయమైవుండినది. అపుడు ఇంకా వారు శంకరాచార్యులు కాలేదు. ఇటు నేను తీర్థయాత్ర, భాగవతాంక ప్రకాశనంలో మునిగిపోయాను. వారి

యెదుటకు వెళ్ళగానే మొదటి వాక్యము ఇదే అడిగాను 'ఇపుడు నేను వచ్చేశాను' వారు సన్యాసమునకు రోజు నిశ్చయించారు.

నేను కాశీలో పండిత మాదన్‌మోహన్ మాలవ్యజీకి భాగవతము వినిపించి, నా సామాను గీతాప్రెస్ దుకాణములో వదిలిపెట్టి ప్రయాగ వచ్చాను. అక్కడ సన్యాసి నయ్యాను. మధ్యప్రదేశంలోని కటనీ దగ్గర ఒక నది దగ్గర వుండిపోయాను. శ్రీభాయిజీకి లేఖ వ్రాశను. ఇక మీదట నేను మహాభారతము యొక్క అనువాద కార్యము చేయనని సంక్షిప్తముగ వ్రాశాను. అనువాదము అయింది. అంకము ప్రచురింపబడింది. లోకులకు దాని వలన చాలా మంచిపనే జరిగింది. దీని శ్రేయస్సు అంతా సేఠ్‌జీకి, ఘనశ్యామదాస్ జాలన్‌కి చెందుతుంది. వారే ఆలోచిస్తూ వుండిరి, ఎంత పెట్టాలని, ఎంత తగ్గించాలని. సేఠ్‌జీకి మహా భారతముపై చాలా బాగా అభ్యాసము వుండేది. గీతార్థనిరూపణకు అది అవసరము కూడా. వారి బుద్ధి చాలా సూక్ష్మమైనది.

వారికి వేదాంత జ్ఞానముతో పాటు ధర్మశాస్త్రము యొక్క జ్ఞానము కూడా చాలా ఉచ్ఛకోటికి చెందినది. వారి ఇంటిలో రోజూ బలివైశ్యదేవజరిగేది. ఒక రోజు నాకు ప్రొద్దున్నే ఎక్కడికో వెళ్ళవలసి వచ్చింది. వారు నాకు 'బలివైశ్యదేవ' చెయ్యకముందే భోజనం పెట్టించారు. అలా ఎందుకు చేశారు? అని అడిగాను. 'అతిథికి భోజనము పెట్టడము కూడా 'బలివైశ్యదేవ'లోని ఒక అంగమే. మీ భోజనము తర్వాత అది చేస్తాము' అన్నారు. బాంకుడాలో ఒక సత్పురుషుడు వచ్చి వుండెను. వారిని భోజనానికి పిలివడానికి తన సోదరుడైన శ్రీహరికృష్ణదాస్‌ను పంపారు. సత్పురుషుడన్నారు ఈ రోజు నీవు భోజనం పెడతావు, రేపు ఎవరు పెడతారు? అని డిగారు. శ్రీహరికృష్ణదాస్ మౌనంగా వుండిపోయారు. సేఠ్‌జీ మరల ఇంకోసారి చెప్పిపంపారు నిన్న ఎవరు భోజనం పెట్టారో వారే ఈరోజూ భోజనం పెడుతున్నారు, వారే రేపు కూడా భోజనం పెడతారు. భోజనం పెట్టేవాడు ఒక్కడే, అపుడు సత్పురుషుడు ప్రసన్నులై వచ్చి భోంచేశారు.

నేను బద్రీనాథ్ ప్రయాణమయితే అన్నారు 'నేను ఒక టిన్ను నెయ్యి మీ వెంట పంపుతాను అన్నారు. దాని కోసం ఒక కూలీ కూడా ఇక్కడ నుండి పంపవలసి వస్తుంది. తిరిగి వచ్చేటపుడు అతడు ఖాళీగా రావలసి వస్తుంది' అని అన్నారు. మా

సహచరులకు కంబళ్ళు ఇచ్చారు ఒక జాబుకూడా వ్రాసి ఇచ్చారు నాకు ఎక్కడ ఏమి ఆవశ్యకత కలిగిన ఏర్పాటు చెయ్యమని. నేను ఎంత డబ్బు అడిగినా ఇవ్వమని. నా ఖాతాలో అంటే సేఠ్‌జీ ఖాతాలో వ్రాసుకొమ్మని చెప్పారు. ఈశ్వరకృప వలన నాకు ఎక్కడా ఏమీ తీసుకోవలసిరాలేదు. అడగనవసరము లేకపోయింది అది వేరే సంగతి.

ఈ ప్రసంగము కూడా గుర్తుగా వుండిపోయింది. నా కూతురు కమల వివాహ సమయంలో నాతో చెప్పారు 'వంటసామానుల దుకాణంలో వెళ్ళి మీకు ఏమి కావలిస్తే అవి తీసుకోండి. నేను 100/150 రూపాయల సామాన్లు తీసుకున్నాను. నాకు ఏదో సామాను దొరికిందని ప్రసన్నత కాదుకానీ, సేఠ్‌జీ యొక్క ఉదారత, విశ్వాసము నన్ను పులకింపజేశాయి. ఈ సంఘటన నేను సన్యాసము తీసుకునే కంటే రెండు మూడు సంవత్సరముల ముందు మాట.

ఒకసారి లోకులు సేఠ్‌జీ ముందరే వారిని చాలా ఆక్షేపిస్తుండేవారు. కానీ దాని ప్రభావము వారి ముఖముపైన కానీ, వారి వ్యాఖ్యానముపైన గానీ పడేదికాదు. ఒకసారి ఎవరో ఒక సాధుమహాత్ముడు వారి వ్యాఖాన సమయములో వచ్చి వటవృక్షము క్రింది కూర్చున్నాడు. మధ్య మధ్యలో ఆక్షేపించడం మొదలెట్టాడు. వ్యక్తిగతంగా కూడా ఆక్షేపించడం మొదలుపెట్టాడు. కానీ సేఠ్‌జీ నవ్వుతూనే ఆ ఆక్షేపములకు కూడా సమాధానాలు చెబుతూపోయారు. వ్యాఖ్యానము సాగుతూవుంది. ఆ సాధువు 'ఇక నీవు 'తత్త్వవివేచని' కూడా అమ్మడం మొదలుపెట్టు, ముక్తి అయితే నీకు ఏడుజన్మలెత్తినా దొరకదు' అన్నాడు. సేఠ్‌జీ నవ్వుతూ 'ఏడు జన్మలకు కలుగకపోయినా 8వ జన్మలో నయితే అవుతుంది. ముక్తి కలుగుతుంది అని నిశ్చితమయిపోయింది కదా!' అన్నారు. ఆ సాధువు మొహం చిన్నగాచేసుకుని అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

పరమార్థ నికేతన్‌లో దైవీ సంపద్ మహామండలిది ఏదో ఉత్సవము ఉండింది. శ్రీహరిబాబాజీ, శ్రీఆనందమయిమా, జ్యోతిష్పీఠాధీశ్వరుడు శ్రీస్వామి శాంతానందజీ సరస్వతిగారు వచ్చారు. దివ్యజీవన సంఘమునకు చెందిన శ్రీ శివానందజీ సరస్వతి గారు ఆనందమగ్నులై సంకీర్తనము చేశారు. బృందావనము నుండి రాసలీల మండలి వచ్చింది. సేఠ్‌జీ విరోధించారు, తన సత్సంగులను అక్కడికి వెళ్ళకుండా ఆపేశారు.

వారు తన నిశ్చయంలో ఎంతో దృఢంగా వుండేవారు, దానికి విరుద్ధంగా ఎవరి ముందు తలవంచేవారు కాదు.

అదే వటవృక్షము క్రింద సేఠ్‌జీ సత్సంగము జరుగుతువుండేది. గంగాజీ హరహర ధ్వనితో ప్రవహిస్తూ వుండేది. ఎదుట ఋషీకేశము యొక్క పచ్చని చెట్లు, ఒకవైపు కొండలు, ఈ మనోహర దృశ్యం యొక్క ఆనందాన్ని ఆస్వాదిస్తూ శ్రీఆనందమయిమా మరియు వారి అనుచరులు అటువైపుగా వచ్చారు. గంగ ఒడ్డున 'మా' కూర్చున్నారు. అక్కడి జనులు చెబితే అపుడు సేఠ్‌జీ మాతాజీ దగ్గరికి వచ్చారు. వారి వెంట వారి సత్సంగీయులు కూడా వచ్చారు. అక్కడికి వచ్చి నమస్కరించలేదు, సరికదా ఒక ఆక్షేపాత్మకమైన ప్రశ్నవేశారు. వారు మాతాజీతో ఇలా అన్నారు. 'మీరు మీ ఉచ్ఛిష్టాన్ని ఇతరులకు ఇస్తారని నేను విన్నాను, ఫొటోలు కూడా తీయించుకుంటారట, అలా ఎందుకు చేస్తున్నారు?' సేఠ్‌జీ ఈ రెంటినీ చాలా విరోధించేవారు. వేరే మహాత్ములను కూడా ఈ విషయంలో వ్యతిరేకించేవారు. తెలియకుండా ఎవరైనా వారి ఫొటో తీసుకున్నారంటే దాన్ని పాడుచేసేశేవారు. ఉచ్ఛిష్ఠమయితే సేఠ్‌జీ ఎపుడూ ఎవరికి ఇచ్చేవారుకాదు. వారి ఆక్షేపాత్మకమయిన ప్రశ్నవిని మాతాజీ ఇలా అన్నారు. 'పితాజీ! (నాన్నగారూ!) ఈ రోజులలో ఫొటోలు కుక్కలకు కూడా తీసుకుని తిరుగుతున్నారు. ఇక ఉచ్ఛిష్టమంటే ఎలాగంటే అలాగ తింటూనేవున్నారు. ఇందులో ఏమి గొప్పవుంది?' నేను మధ్యలోనే మాట్లాడాను, 'సేఠ్‌జీ మీరు మీలాంటి సజ్జనులు ఇలా ఆక్షేపించడం, దోషదర్శనము చేయడం సబబా? గుణ దోష దృష్టి అది సంసారుల దృష్టి!' దీని తర్వాత వారు మిన్నకుండిపోయారు. వారు దేశ, కాలములను బాగుగా ఎరిగినవారు. ఇతరులెవరైనా ఏదైనా మంచిమాట చెబితే దానిని వినేవారు.

గీతాప్రెస్ అధికారులు అందులో సేఠ్‌జీ, భాయిజీ, ఘనశ్యామదాస్‌జీ ప్రముఖులు, హిందీ టీకా సహితంగా మహాభారతము పూర్తిగా ప్రచురించాలని వారు నిశ్చయించుకున్న ఆ రోజులలో నేను కాన్‌పూర్‌లోని గంగా కుటీరములో వుంటుండేవాడిని. నా భాగవత అనువాదము ప్రజలకు చాలా నచ్చింది. అందువలన వారు నాతోనే మహాభరతము పూర్తిగా అనువాదము చేయించాలని నిశ్చయించుకున్నారు. సేఠ్‌జీ, భాయిజీ, గోస్వామి చిమ్మన్ లాల్‌జీ, శ్రీరామసుఖదాస్‌జీ,

ఘనశ్యామదాస్ జలాన్ అందరూ దురంధరులు కాన్పూర్ వచ్చారు. సేఠ్‌జీ మహాభారతము అనువాదము చెయ్యమని నన్ను బలవంతపెట్టసాగారు. ఇపుడు నావల్ల అంతటి విస్తృత కార్యము కావడం కష్టం అన్నాను.

సేఠ్‌జీ అన్నారు, 10 లక్షల రూపాయలు బ్యాంకులో జమ చేస్తాము. పండితులను మీ దగ్గరే పెట్టుకోండి. గంగానదీ తీరంలోకానీ మీకు ఎక్కడ ఇష్టమయితే అక్కడ వుండండి. ఒక అన్నక్షేత్రము తెరిపిస్తాము. అందులో మహాత్ములు భోజనం చేస్తారు. మీరు ఈ పని చేసి పెట్టండి. కానీ నాకు ఆసమయంలో ఈ పనిపైన ఇష్టము లేకపోయింది. నేను స్పష్టంగా నిరాకరించాను.

నాకు కాన్‌పూర్ నుండి బృందావనము తిరిగి రావలసి వుంది. రైలులో ఒకే డబ్బాలో (బోగీ) నేను, సేఠ్‌జీ, స్వామి రామ్‌సుఖదాస్‌జీ, ఘన శ్యామదాస్ జలాన్ అందరమూ కూర్చున్నాము. దారిలో మధ్య మధ్య సత్సంగ చర్చ జరుగుతువుండేది. 'జ్ఞాని ఎలా వుండాలి? అని చర్చ. స్వామీజీ గీతలోని లక్షణాలు చెప్పారు. ఘనశ్యామ్ దాస్‌జీ జ్ఞాని నిర్దోషులై వుండాలని వర్ణించి చెప్పారు. నేనన్నాను 'మీకు ఇంకా జ్ఞానిని అన్న అంతఃకరణమే పోలేదు' అని. ఘనశ్యామదాస్‌జీ చకితులయ్యారు. సేఠ్‌జీ నవ్వడం మొదలెట్టారు. 'వీరి దృష్టి చాలా సూక్ష్మమైనది' అన్నారు. జ్ఞాని యొక్క స్థితిని సేఠ్‌జీ అనిర్వచనీయము అని అనేవారు. జ్ఞాని యొక్క చరిత్ర ఆదర్శవంతముగా వుండాలనీ, ఏ విధమైన దోషములు వుండకూడదని వారికి ఒక దురాగ్రహముండేది. ఈ విషయంలో వారి అనుభవము చాలా గంభీరమైనది. వారు అన్నీ సరిగ్గా అర్థం చేసుకుని లోకులకు ఏది హితకరమో దానినే నమ్మేవారు. అంగీకరించేవారు.

సేఠ్‌జీకి నేనంటే ఎంత ఆదరమో, వారు నన్నెంత తన వాడినని అనుకునేవారో ఈ సంబంధంలో రెండు సంఘటనలు మీకు తెలియజేయాలనుకుంటున్నాను. ఇందులో ఏది ముందు, ఏది వెనుక ఘటనాక్రమము నాకు గుర్తు లేదు.

ఆ రోజులలో నేను కలకత్తాలో స్వ. శ్రీ లక్ష్మణ ప్రసాద్ పోదార్ వారి దగ్గర ఇజ్రాయిల్ స్ట్రీట్‌లో బస చేసివున్నాను. శ్రీమద్భాగవత కథ జరుగుతుంది. శ్రీ సీతారామ సెక్సిరియా, శ్రీ బద్రీప్రసాద్, శ్రీ ఈశ్వరీ ప్రసాద్ గోయెంకా, శ్రీ భగవథ్ కనోడియా,

వీరు అపుడపుడు వచ్చేవారు. సేఠ్‌జీ సత్సంగము కూడా గోవింద భవనములో అవుతుండేది. ఒక రోజు శ్రీ హీరాలాల్ గోయెంకా వచ్చి మీరు మా ఇంటికి రండి అంటూ బలవంతం చేయసాగారు. నేను అనుకున్నాను వీరిది ఆ రామాయణం (గడబిడ) జరిగి ఎన్నో సంవత్సరాలు అయింది. ఇపుడు వారింటికి వెళ్ళినా ఫరవాలేదు అని అంగీకరించాను. ఈ సమాచారము సేఠ్‌జీకి తెలియగానే వారు తమ సత్సంగమండలితో పాటు నాదగ్గరకి వచ్చారు. 'మీరు హీరాలాల్ ఇంటికి వెళ్ళడం మంచిది కాదు. మీరు ఒక వేళ వెళితే వారికి అనుచిత మహత్త్వము కలుగుతుంది. నాకు దుఃఖము కలుగుతుంది.' అని అన్నారు. నాకు వారి మాట వినడంలో ఆపత్తి ఏమీ లేదు. నేను హీరాలాల్ ఇంటికి వెళ్ళలేదు. సేఠ్‌జీ ఒకవేళ నన్ను తనవాడినని, ఆదరభావం లేకపోతే నన్ను ఆపడానికి ఎందుకు వస్తారు. ఇది వారి సద్భావమునకు ఒక ప్రతీక.

దైవీ సంపద్ మహామండలి యొక్క ముఖపత్రముపై 'పరమార్థము'అనే పత్రిక ప్రకాశితమయినది. మహామండలేశ్వరుడు స్వామి శ్రీ శుకదేవానందజీ, మరియు శ్రీ భజనానందజీ మహరాజ్‌ల ప్రేమపూర్ణ అనురోధముపై నేను నా పేరును వారి పత్రికకు సంపాదకుడిగా అచ్చువేసుకుంటామంటే సరే అన్నాను. బహుశా ఒక పత్రికలో నా పేరు కూడా ముద్రించారు. ఎపుడయితే ఈ సమాచారము సేఠ్‌జీకి తెలిసిందో వారు పువ్వులు పళ్ళు, తీసుకుని సత్సంగ మండలిని వెంట బెట్టుకుని 'కల్యాణ్' పత్రికా మేనేజరు బజరంగ్‌లాల్ చందగోటియాతో పాటు నా దగ్గరికి వచ్చారు. వారన్నారు ఒక వేళ సంపాదకుడిగా మీ పేరు ముద్రింపబడాలంటే అది మొదట 'కల్యాణ్' పత్రికలోనే ముద్రించాలని అన్నారు. నేనన్నాను నాకేమీ సంపాదకుడు అవాలన్న వాసన లేదు. సేఠ్‌జీ అన్నారు. అయితే మీరు ఇపుడే ఉత్తరము వ్రాయండి పరమార్థ పత్రికకు సంపాదకుడిగా నా పేరు ముద్రించవద్దు అని. నా మనసులో సేఠ్‌జీ పట్ల చాలా ఆదరభావము వుంది. నేను వారి మాటను అంగీకరించి సరే అన్నాను. కానీ వారు నన్ను నమ్మలేదు. అన్నారు ఇపుడే వ్రాసి ఇవ్వండి నేను పోస్ట్ చేస్తాను అన్నారు. నేను ఉత్తరం వ్రాసి వారికి ఇచ్చాను, నేను 'పరమార్థ' పత్రికా సంపాదకుడు కాకుండా రక్షింపబడ్డాను. అలాగ శ్రీస్వామి సదానందజీకి నేనంటే చాలా ప్రేమ. నారదభక్తి

F.N: Paavana Prasangalu.p65, P.N:162

దర్శనము 'పూర్తిగా ఒక విశేషాంకములో ప్రచురించారు. బ్రహ్మచర్య అంకములో కూడా నా రచనలు చాలా ప్రచురించారు.

సేఠ్‌జీ స్త్రీదీక్షను చాలా కఠినంగా విరోధించేవారు. ఒక సారి బృందావనములో హితదాస్‌జీతో ఈ విషయములో కొంచెం వాద వివాదములు జరిగాయి. శాస్త్రార్థము కూడా జరపాలనుకున్నారు. బాబా హితదాస్‌జీ నా దగ్గరికి వచ్చి శాస్త్రములలో స్త్రీ దీక్షా వివాదము ఎక్కడెక్కడ వున్నదో చెప్పండి అన్నారు. నేను వారికి చాలా చోట్ల చూపించాను. ఈ సమాచారము సేఠ్‌జీకి తెలిసిపోయింది. తెలిసిందో లేదో నాకు తెలియదు కానీ రాత్రి 9 గంటలకు సేఠ్‌జీ, శ్రీస్వామి రామసుఖదాస్‌జీ, ఇంకో ఇద్దరు సజ్జనులను వెంట బెట్టుకుని నా దగ్గరకు వచ్చి, శాస్త్రములలో స్త్రీ దీక్ష నిషేధము ఎక్కడెక్కడ వుందో తెలపమన్నారు. నేను చాలాచోట్ల చూపించాను. సేఠ్‌జీ అనురోధముపై పుస్తకాలయము తెరిపించి అనేక గ్రంథములు తీసి చూపించాను. వారికి సంతోషము కలిగింది. కానీ కొందరు మధ్యలో తప్పించుకున్నందుకు శాస్త్రార్థము జరగలేదు. నేను నా బుద్ధిపై విచారిస్తున్నాను. సేఠ్‌జీ భిన్న భిన్న ప్రసంగాలు ఎన్నో సార్లు గుర్తు చేసుకుంటున్నారు. వారు ఇలా అంటుండేవారు.

ఏక రకమ్ సేఠీ యహ కామ్‌ఠీక్ హై
దూసరీ రకమ్ సేఠీ యహఠీక్ నహీ హై ।

వారు అనిర్వచనీయతను బాగా సమర్థించేవారు. సేఠ్‌జీ తన నిశ్చయంలో చాలా దృఢంగా వుండేవారు. తీర్థయాత్ర స్పెషల్ ట్రైన్‌లో దాదాపు మూడు మాసములు వారితోపాటు వున్నాను, వారి సంధ్యావందనము, గాయత్రి జపములో ఏవిధమైన అంతరము వుండేదికాదు. 50 సం॥ల నుండి ఇలాగే అని తెలిపారు. ఒక వేళ నీరు దొరకలేదనుకో, అక్కడ నేను ఇసుకతో అర్ఘ్యమిస్తాను. ఇసుకతో అర్ఘ్యమిచ్చే విధానము ఎక్కడ లేదు అన్నాను. దీనికి వారు 'మృత్తిక యొక్క ఏ కణములోనైనా జలము లేకుండా వుండదు. అందుకని జలము దొరకనపుడు ఇసుకతో అర్ఘ్యము ఇవ్వవచ్చు'. అవునా యుక్తి బాగానేవుంది.

తీర్థయాత్ర ట్రైన్ భావనగర్ వెళ్ళింది. అక్కడి రాజమహల్ చూడటటానికి వారు ఆహ్వానించారు. సేఠ్‌జీ మందీ మార్బలముతో అక్కడికి వెళ్ళారు. ఫలహారము ఏర్పాటు చేశారు. అక్కడి అధికారులు చాలా చాలా బలవంతం చేశారు. కానీ సేఠ్‌జీ ఒప్పుకోలేదు. అధికారులు మాటిమాటికీ కనీసం మంచినీళ్లు త్రాగండి అన్నాకూడా 'లేదు మేము ఇపుడే భోజనము చేసి వచ్చాము. ఆకలి లేదు. అన్నారు. తిరిగి వచ్చాక ట్రైన్‌లో నేను అడిగాను వారు అంతగా మంచినీళ్ళు త్రాగమంటే మీరు ఆకలి లేదంటారే? అని. ప్రశ్న ఒకటి, జవాబు వేరొకటి! 'దాహం వేస్తువుంది. ఎలాగ దాహం లేదు అని అబద్ధము చెప్పేది, అందుకని ఆకలి లేదు అని అన్నాను.' అన్నారు సేఠ్‌జీ. వారు తన ఆచారనిష్ఠతో చాలా గట్టివారు ఒకోసారి అలాగ కూడా చేసేవారు.

స్పెషల్ ట్రైన్ యాత్రలో ఒక్కోసారి రైలు కర్మచారులు సతాయిస్తుండిరి. నీళ్ళు బంద్ చేసేవారు. ముందు దారి దొరకడం లేదు అనేవారు. వీరికి ఏదైనా ముట్టజెప్పనిదే పని జరగదని తెలిసిపోయింది. న్యాయముగా వెళితే, ఏదా పై అధికారులకు టెలిగ్రాము లివ్వడము వలన కానీ పని జరగడములేదు. ఇక ఈ సమస్యను సేఠ్‌జీకి చెప్పారు. మీరేమీ లంచం ఇవ్వడానికి ఒప్పుకోరు మరి ఇపుడు ఏం చెయ్యాలి? ఇపుడు వారు చూడండి, ఎవరైనా తమ పనిని చేసినపుడు వారికి బముమానం ఇస్తాము కదా అలాగే ఈ కర్మచారులకు ముందు గానే బహుమానము ఇవ్వండి' అని తమ నిర్ణయమును తెలిపారు. పని జరిగిపోయింది. వ్యావహారిక నిపుణత వారిలో అణువణువునా వుండింది.

సేఠ్‌జీకి రాజస్థాన్‌లో స్వామి బరవన్నాథజీ, ఉత్తమనాథజీ ముక్తినాథజీ మొదలైన వరితో సాక్షాత్, పరంపరాగత, లేదా సత్సంగములలో సంబంధముండేది. కానీ స్వామి మంగళనాథ మహరాజ్‌తో వారు వేదాంతమును విధివత్ అధ్యయనము చేశారు. మధుసూదనీ గీతా వారు నాథజీతోనే చదివారు. పంచపాదిక, వివరణ సిద్ధాంతాలను ఆధారముగా తీసుకుని లోక ప్రచలితమైన ఆభాసవాదము మరియు అవచ్ఛేద వాదమును ఖండన చేస్తుండిరి. సాధారణముగా చిన్నచిన్న వేదాంతులకు వివరణ ప్రస్థానము తెలిసివుండదు అందుకని వారు సేఠ్‌జీని వ్యతిరేకిస్తుండిరి. దీనిపైన సేఠ్‌జీ నవ్వుకునేవారు, తెలియజెప్పేవారు. కానీ ఎలాగ వేదాంత విషయాలు చెబుతున్నారో

అది చెప్పేవారు కాదు. ఉదాహరణకు 'కర్మయోగము' యొక్క ఫలము వివిదిషా, జిజ్ఞాస ఉదయించడము లేదా జ్ఞానముదయించడము. ఈ విషయములో వారు వివరణ ప్రస్థానము యొక్క అభిప్రాయముతో జ్ఞానమునే ప్రతిపాదించుచుండిరి. కానీ భామతీ ప్రస్థానము వారికి వివరణ ప్రస్థానము తెలియదు కాబట్టి వారు సేఠ్‌జీని వ్యతిరేకిస్తుండిరి. ఈ విషయంలో నేను కరపాత్రజీ మహరాజ్‌తో మాట్లాడాను. సేఠ్‌జీ యొక్క మతము శాస్త్రవిరుద్ధము కాదు.

ధ్యాననిష్ఠుడు ఝుగరూసింహ్ కానూన్‌గో

భజన యొక్క గాంభీర్యత -

నేను దగ్గరనే నిల్చుని వున్నాను. నా కళ్ళ ఎదుటనే వారు గుఱ్ఱము పైనుండి క్రింద పడ్డారు. ఒక్క క్షణం ఆలశ్యమయిందేమో అంతే లేచారు, గుఱ్ఱంపైన కూర్చున్నారు. గుఱ్ఱము అలవాటైనదే, సుమారు రెండు మూడు మైళ్ళు వారి నివాస స్థానమునకు తీసుకువెళ్ళింది. స్పృహ తప్పిన ఆయన శరీరాన్ని చప్రాసీలు గుఱ్ఱం పైనుండి దింపి మంచంమీద పడుకోబెట్టారు. నాకూ మనసులో చింతగానే వుండింది. నేను భోజనం చేశాక వారు వున్న దగ్గరికి వెళ్ళాను. వారు 3, 4 గంటల నుండి అలా స్పృహ తప్పిపడి వున్నారు. మధ్య మధ్యలో వారి శరీరము మంచము పైనుండి రెండు అడుగుల ఎత్తుకు ఎగిరిపడేది. వారి నోట ఒక గంభీర ధ్వని 'హరి ఓం తత్ సత్' అని వెలువడేది. ఇలాగ ప్రతి 5, 10 నిముషములకు జరుగుతూవుండేది. నేను 2, 3 గంటలు అక్కడనే కూర్చుని చూస్తున్నాను. దెబ్బతగిలిన 6 గంటల తర్వాత 'నకలదీహ' నుండి డాక్టర్ వచ్చి ఇంజక్షను ఇచ్చారు. కొంచెం సేపటి తర్వాత స్పృహ వచ్చింది. నన్నుచూసి నమస్కరించారు. 'పండిత్‌జీ! మీరెప్పుడు వచ్చారు? అని మాట్లాడించారు. ఆ మూర్ఛితావస్థలో కూడా తెలియకుండానే 'హరి ఓం తత్సత్' అనే ధ్వని రావడమన్నది వారి జీవితములోని గంభీర చింతన, ధ్యానమును తేటతెల్లం చేశారు.

పరిచయము -

వారి జన్మ ఆజమ్‌గఢ్ జిల్లా లలమేఉఆ-మేహనాజ్‌పూర్ అనే పేరుగల ఒక కుగ్రామములో జరిగింది. వారి అన్య సంబంధీకులను నేను మరిచిపోయాను. వారి పుత్రుడు పేరు చంద్రశేఖర్ సింహ. ఆయన నా శిష్యులే. వారు చుర్క్ సిమెంట్

ఫ్యాక్టరీ, ఉత్తర ప్రదేశ్‌లో పనిచేసేవారు. కానూన్‌గో సాహెబ్ ఝుగరూ సింహ్ వారణాసి జిల్లా, చందౌలీ తాలుకాకు చెందిన మహాఇచ్ పరగణాలో నియుక్తులై వుండిరి. నా జన్మభూమి కూడా అదే ఇలాకాలో వున్నది. 1931వ సం॥ జనగణనలో సత్యాగ్రహులు ఇంటింటిపైనా వున్న నంబర్లను తుడిచివేశారు. మా ఇంటి నంబరు కూడా తుడిచివేయ బడింది. దీని ఆచూకీ తీయడానికి వారు అపుడు వచ్చివుండిరి. 'మా ఇంటి నంబరు తుడిచేసిన వారెవరో నాకు తెలుసుకానీ నేను ఎట్టి పరిస్థితులలోనూ వారి పేర్లు చెప్పను' అని నేను స్పష్టంగా చెప్పాను. ఈ ధిక్కారము వలన వారు నన్ను గ్రామ ముఖియా పదవి నుండి తొలగించారు. ఆ ఆచూకీ సమయములోనే వారు గుఱ్ఱం పైనుండి క్రింద పడ్డారు.

వినమ్రత -

కానూన్‌గో సాహెబ్‌తో కొన్ని సంవత్సరములు క్రిందటనే నాకు పరిచయము కలిగి వుండినది. నేను ఆవాజాపూర్ గ్రామములో మావంశ పరంపరాగత శిష్యులైన ఠాకుర్ భగవాన్ సింహ వారి వరండాలో కూర్చుని వుంటిని. వారి పరివారములోని వారు ఇంకా మరి కొందరు క్రింద కూర్చుని వుండిరి. ఎందుకంటే నేను గురువును, అందుకని వారు నాతోపాటు కూర్చోలేదు. అదే సమయములో కానూన్‌గో సాహెబ్ వచ్చారు. నమస్కరించి వారు కూడా క్రింద కూర్చుండిపోయారు. అక్కడున్నవారు 'మీరు పైన కూర్చోండి' అని బలవంతం చేశారు. కానీ వారు ఒప్పుకోలేదు. సత్సంగ చర్చ జరుగుతూ వుండినది. నాకు గుర్తున్నంత వరకు ఆ ప్రసంగము దేనిని గురించి అంటే 'మనుష్య శరీరముపైన గ్రహముల ప్రభావము ఎందుకు పడుతుంది?' అని. మా తండ్రి, తాతలు చాలా గొప్ప జ్యోతిష్కులు. నేను కూడా వారి సద్ధతిలోనే జ్యోతిష్యమును ప్రతిపాదన చేస్తుంటిని. ఆ రోజులలో నాకు మార్కేశదశ నడుస్తువుండినది. సత్సంగ ప్రసంగములో నేను ఇలా చెప్పాను, మంచి మంచి మహాత్ములు నాకు ఇలా చెప్పారు. మృత్యువును దూరము చెయ్యలేము కానీ మృత్యుభయమును దూరము చెయ్యగలము. ఆత్మ అజరము, అమరము. దానిని మృత్యువు ఎపుడు స్పర్శించలేదు. మృత్యువు శారీరకము, భయము మానసికము. జ్ఞానము ద్వారా భయమును దూరం చెయ్యగలము. సాధన భావము, బాధక భావము

సమాన సత్తాలోనే వుంటాయి. ఈ మాటలు కానూన్‌గో సాహెబ్‌కు చాలా బాగానచ్చాయి. వినయంతో చిరునవ్వు నవ్వుతూ నమస్కరించారు. 'మళ్ళీ కలుద్దాం' అన్నాను నేను.

త్యాగ భావన -

నా పితామహుడి మరణానంతరము భూములపై నా పేరు ఎక్కింది. కానీ పొరపాటున కొన్ని భూములపై నాపేరు రాలేదు. పట్‌వారీ అన్నాడు 'కానూన్‌గో సాహెబ్‌కు ఆ అధికారము వుంది, వారు చేసి పెడతారు' అతడే నన్ను వారి దగ్గరకు తీసుకువెళ్ళారు. స్వాగత, సత్కారముల అనంతరము వారు నా పని చేసిపెట్టారు. 'అలాంటి సమయములలో కానూర్‌గో సాహెబ్ ఏదైనా బహుమానము ఇవ్వవలసి వుంటుంది.' అని పట్వారీ అన్నాడు. నేను ఐదు రూపాయలిచ్చాను. చాలా బలవంత పెడితే సంకోచపడుతూ వారు తీసుకున్నారు. తర్వాత తన మనసులో ఇక ఇదే ఆఖరిసారి ఇలా తీసుకోవడం అని నిశ్చయము చేసుకున్నారట. ఇపుడిక వారు ఎవరితోనూ ఏమీ తీసుకునేవారు కాదు. నేనిచ్చిన ఆ డబ్బులు నా పేర 'కల్యాణ్' పత్రిక తెప్పించారు. ఇక ఇప్పటి నుండే మారాకపోకలు, సత్సంగము మొదలైంది.

శ్రీ జగదీశానందగిరి -

కానూన్‌గో సాహెబ్ దగ్గరికి అపుడపుడు ఒక సన్యాసి వస్తూండేవారు. వారి పేరు స్వామి శ్రీజగదీశానందగిరి. వారు తమ జీవితములోని ఒక సంఘటనను గురించి చెబుతుండేవారు. వారు లాహోర్ మెడికల్ కాలేజీలో చదువుకునేవారు. వైరాగ్యము కలిగినందువలన గురువు యొక్క అన్వేషణలో భారతదేశమంతా యాత్ర చేశారు. కానీ ఎక్కడా శ్రద్ధ కలగలేదు. ఒక రోజు ఆత్మహత్య చేసుకుందామని సంకల్పించి, పైన మిద్దె పైనుండి దూకాలనుకునేటపుడు 'ఆగు! వుండు! నేను వస్తున్నాను' అని శబ్దం వినిపించింది. క్రింద నుండి ఒక కాషాయ వస్త్రధారి మహాత్ముడు పైకి ఎక్కి వచ్చారు. వారు అన్నారు, 'చనిపోవడం వలన గురువు దొరకడు, జన్మ మరణ పరంపర వదలదు. నీ గురువు హిమాలయములలో ఆదిబద్రి నుండి కొంచెం దూరములో ఒక గుహలో సమాధి స్థితిలో కూర్చుని వున్నారు. నీవు వెళ్ళి వారిని

కలువు! ఇలా చెప్పివారు వెళ్ళిపోయారు. ఇతడు హిమాలయ యాత్ర చేశాడు.

స్వామి గిరీశానందజీ ఇలా చెప్పారు. వారు సరియైన చోటుకే వెళ్ళారు. అక్కడ ఒక సరసువుంది, గుహలున్నాయి, కానీ మనుష్యులెవ్వరూ దొరకలేదు. నేను ఆకలి దప్పులతో వ్యాకులుడనయ్యాను అపుడు ఒక మహాత్ముడు నా దగ్గరకు వచ్చి నీ గురువు యొక్క సమాధి నుండి లేవడానికి ఇంకా 6 మాసాలు సమయము వున్నది. ప్రతీక్షించే, అపుడు లభ్యమవుతారు. అపుడు నేనన్నాను 'అన్ని రోజుల వరకూ నేను ఏమి తింటాను?' అపుడు ఆ మహాత్ముడు నాకు ఒక పెద్ద గిన్నె లాంటిది ఇచ్చాడు. అందులో సమయానికి కావలసిన మంచి భోజనము వస్తువుండేది. ఈ విధముగా కొన్ని రోజులు చాలా ఆనందముగా గడిచిపోయింది.

స్వామీజీ ఇంకా ఇలా చెప్పారు. 'ఈ చమత్కారము వలన నాకు చాలా ఆశ్చర్యము కలిగింది. ఒక అపూర్వ వాసన మనసులో తలెత్తింది. అదేమిటంటే ఈ గిన్నెని లోకులకు చూపించి వారిని శ్రద్ధాళువులను చేస్తాను. భగవద్భక్తులను తయారు చేస్తాను' అని నేను ఆదిబద్రి నుండి తిరిగి వచ్చాను. గిన్నె క్రిందపడి ముక్కచెక్క లయింది. మరల ప్రయత్నించినా కూడా ఏమీ ప్రయోజనము లేకపోయింది. నేను అప్పటి నుండి కొంచెం విక్షిప్తుడిలాగ అయిపోయాను. భోజనముపై ఆసక్తి తీవ్రమయింది' స్వామి శ్రీ జగదీశానందగిరి మా ఇంటికి కూడా వస్తువుండిరి. తనకు నచ్చిన భోజనము తయారు చేయించుకుని భోంచేసేవారు.

స్వామీజీని కలవడం వలన నాకు ఒక లాభము కలిగింది. వారు కానూన్‌గో సాహెబ్‌కు ఒక ఇంగ్లీషు పుస్తకము ఇచ్చారు. అది F.A. అలెక్జాండరు వ్రాసిన In The Hour's of Meditation. అని దాని పేరు. కానూన్‌గో సాహెబ్ ఆ పుస్తకమును ఇంగ్లీషు నుండి అనువదించి హిందీ నాకు వినిపించేవారు. నాకు అది చాలా బాగా నచ్చింది. నేను దానిని హిందీలో వ్రాసుకున్నాను, దాన్ని ఎక్కువగా మాటి మాటికీ చదువుకోవడము వలన కంఠస్థమయిపోయింది. అది కేవలం పుస్తకము కాదు, విషాదములో ప్రసాదమును కలిగించగలిగేది. నిరాశ, నిరుత్సాహము కలిగిన హృదయములో ఆశ, ఉత్సాహము నింపగలిగేది. అందులోని కొన్ని వాక్యములను ఉదహరించాలన్న లోభమును అణుచుకోలేకపోతున్నాను.

1. మనిషి జీవితంలో అటువంటి ఒక సమయం వస్తుంది ఎపుడైతే అతడు ప్రపంచమును విస్మరించి తన అంతర్దేశములో ప్రవేశిస్తాడో, అంటే తన స్వరూపములో స్థితుడయిపోతాడు. ఆ స్థితి పరమాత్ముడికి అంత్యత సమీపము, ఎందుకనగా అక్కడ కేవలము పరమాత్మయే వుంటాడు. ఇంత కంటే ఎక్కువ పవిత్రమైన సమయము మరి ఒకటి లేదు. ఇది వెళ్ళడం కాదు, తిరిగి రావడం.

2. నీవు ఎవరో ఒకరి ప్రకాశములో వ్రాసేవాడివి కాదు. దేనిలోనైతే అన్ని ప్రకాశములు సమావేశమైనవో ఆ మహాప్రకాశమే నీవు. మన వ్యక్తిగత జీవితమును పరమాత్ముడి శక్తి సముద్రములో తరంగాయమానము చెయ్యి. ప్రయత్నం చెయ్యకు. కాళ్ళు చేతులు కొట్టుకోవద్దు. నీవు మునిగిపోవద్దు. తేలిపోతావు.

3. ప్రత్యేక స్థితిలో అది బయటికి ఎంత చెడ్డగా కనిపించినా సరే, పరమాత్మ నీ వెంటవున్నాడు. నిరుత్సాహం, నిరాశ పడడము మూర్ఖత్వము. పూర్తి ఉత్సాహముతో ముందుకు వెళ్ళు. ఎలాగైతే గరుడ పక్షి తన వేటాడాలనుకున్న ప్రానిపై పడిపోతుందో అలాగ నీ లక్ష్యం పై నీవు ఆక్రమణ చెయ్యి.

4. ఒక పిచ్చి గెంతులోనే నీవు నీ లక్ష్యము వరకు మధ్య వున్న అంతరాన్ని చెడిపివెయ్యి. లక్ష్యము నీవు, వేరే ఎవరో కాదు. నీ స్వరూపములో స్థితుడవుకా. అటు ఇటు చూడవలసిన అవసరం లేదు.

శ్రీయోగానందపురీ -

నా పుట్టిన వూరి నుండి 5, 6 మైళ్ళు దూరంలో గంగా నదీతీరంలో సహేపూర్ అనే పేరుగల ఒక వూరు వున్నది. అక్కడి స్వామి యోగానందపురీజీ వారి కుటీరము వున్నది. వూరివారు నియమంగా ప్రతి ఇంటి నుండి ప్రతిదినము (ఒక్కొక్కరు ఒక్కొక్కరోజు) భిక్ష తీసుకుని ఇచ్చేవారు. వారు అక్కడే వుండేవారు. అందమైన ఉద్యానవనం, పెద్ద తోట, దగ్గరే గంగానది. ఒక్కొక్కసారి మంచెపై కూడా వుండేవారు. భవ్య దివ్య శరీము, ప్రసన్న గంభీర వాణి, ఉత్తమ వేదాంత జ్ఞానము, మరియు తన సద్గురువైన స్వామి నిత్యానందపురీజీ మహరాజ్ యొక్క అనన్య ఉపాసన చేసేవారు. నాగురుదేవుల చిత్ర పటము నుండి బ్రహ్మ, విష్ణు, మహేశుడు మొదలైన దేవతలు

ప్రకటమై నాకు దర్శనమిస్తారు అని వారు చెప్పారు. శ్రీమద్భాగవతముపై అత్యంత గంభీరము, హృదయగ్రాహ్యమైన ప్రవచనము చేస్తుండేవారు. వారు రామకృష్ణ పరమహంస వారి పరంపరలోని వారు. నేను వారితో శ్రీకృష్ణ మంత్రము విధి పూర్వకముగా క్రియావతి దీక్ష తీసుకున్నాను. వారు నాకు శక్తి పాతము, మరియు అభిషేకము అనుగ్రహించారు. నా వెంట వారిదగ్గరికి కానూన్‌గో ఝగరూసింహ్ కూడా వచ్చేవారు. సెలవు దినములు సాధారణంగా సత్సంగములోనే గడిచపోయేది.

కానూన్‌గోవారి శీల స్వభావము చాలా మధురమైనది. వారి ప్రతి వ్యవహారము లోనూ సౌజన్యము, స్యామ్యత ఉట్టిపడుతుండేది. వారి సంపర్కములోకి వచ్చిన వారు కూడా వారికి భక్తులయ్యేవారు. స్వామి యోగానందజీ కూడా వారంటే చాలా ఇష్టపడేవారు, వారికి ఇలా ఆజ్ఞ ఇచ్చారు, 'నీవు క్షత్రియ వంశంలో పుట్టినావు, ఇంత వరకు నీయజ్ఞోపవీత సంస్కారము జరుగలేదు. నీవు వ్రాత్యీయప్రాయశ్చిత్తము చేసుకుని యజ్ఞోపవీతమును వేసుకో' వారు స్వామీజీ వారి ఆజ్ఞను శిరసా వహించారు. మా ఇంటి వద్దనే యజ్ఞోపవీత సంస్కారమునకు ఏర్పాటు జరిగింది. వందలాది జనము కూడారు. గోదానము చేసిన తర్వాత సంస్కారము సంపన్నమయినది. నాతో వారు గాయత్రి మంత్రదీక్ష స్వీకరించారు. అప్పటి నుండి ఆజీవనం వరకు ప్రతి దినము రెండు మార్లు సంధ్యావందనము, గాయత్రి జపము నిష్ఠాపూర్వకముగా చేశేవారు.

వ్యవహారములో పరివర్తన -

వారి వ్యవహారములో ఎంతటి పరివర్తన కలిగిందంటే సాధారణంగా ఎవ్వరూ ఆలోచించలేరు! పట్‌వారీలందరూ ప్రతినెల వారికి రెండు రెండు రూపాయలు ఇస్తుండేవారు. అది తీసుకోవడం మానేశారు. జమీందారీ పనులు, రైతుల పనులు చేసిపెట్టడము వలన అపుడపుడు పై ఆదాయము వస్తుండేది, అదికూడా అంతా వదిలిపెట్టారు. గుఱ్ఱము అమ్మివేసి సైకిలు కొన్నారు. వంటవాడిని వదిలిపెట్టారు. నౌకరు అన్ని సామాన్లూ తయారుచేసిపెడితే తన స్వహస్తాలతో వంట చేసుకునేవారు. ఒక్కోసారి ఆయన భార్య వెంట వుంటే ఆమె వంట చేసేది. తన మరీ దగ్గరి బంధువులు, మా ఇంట్లో తప్ప ఎక్కడా భోజనంము చేశేవారు కాదు. భోజనము

కూడా కేవలము పందొమ్మిది ముద్దలు (బుక్కలు) తినేవారు సర్కార్ యొక్క చట్టము ప్రకారము వారి రాత్రి సమయములో తన యిలాఖా అయిన హాయిచ్ పరగణా దాటి బయటికి వెళ్ళేవారు కాదు. సర్కారు పని మీద వెళ్ళేట్టయితే అది వేరే సంగతి. వారి సంపర్కము వలన చాలామంది పట్వారీలలో కూడా భక్తి భావము మరియు సదాచారము కలిగింది. 'బభనియాప్' యొక్క శ్రీ రఘువంశలాల్‌జీ తర్వాత సన్యాసి అయ్యారు. నీరాపుర్‌కు చెందిన శ్రీచంద్రశేఖర్ లాలా యొక్క జపనిష్ఠ ఎంత ఎక్కువైనదంటే వారి గాఢనిద్రలో కూడా శ్వాసధ్వనితో పాటు స్పష్టంగా 'ఓం నమః శివాయ' యొక్క ఉచ్చారణ జరుగుతుండేది, అది అందరూ వినేవారు కూడా స్వయంగా నేను కూడా విన్నాను.

మోకల్‌పూర్ బాబా -

నేను పుట్టిన పూరు నుండి 8, 9 మైళ్ళ దూరంలో ఒక బలువా అనే పేరుగల పూరు వున్నది. అక్కడ గంగాజీ ధార మైళ్ళ పర్యంతము పశ్చిమవాహినిగా ప్రవహిస్తుంది. అక్కడి నుండి గంగానది దాటి 3, 4 మైళ్ళు నడక సాగిస్తే మోకల్‌పూర్ అనే పూరు వస్తుంది. అక్కడ ఒక మహాత్ముడు వుండేవాడు. శ్రీ గోపీనాథకవిరాజ్ వారి జీవితము (పుస్తకం)లో వారి పేరు టోరీవాలె బాబా అని వ్రాసివున్నది. మేమయితే వారిని మోకల్‌పుర్‌కీ బాబా అని అంటుండేవారము. వస్తుతః వారు సిద్ధపురుషులు. వారికి పూర్ణ అనుభవమున్నది. వారి కోసము గంగాజీ మధ్యలో ఒక స్థానము వచ్చింది. దానినలువైపులా గంగ ప్రవహిస్తూ వుంటుంది. మధ్యలో ఆ గుట్టవుంది మేము అపుడపుడు వారి దర్శనార్థము వెళ్తువుండేవారము. వారు అనేవారు 'నేను ఇక్కడ 4సం॥ల నుండి (గంగాజీ గర్భంలో) వుంటున్నాను. కానీ పారమార్థిక జిజ్ఞాసతో ఎవ్వరూ రాలేదు. ఇపుడు మీరు ముగ్గురు వస్తున్నారు. ఆ ముగ్గురిలో నేను, ఝగరూసింహ్ కానూన్‌గో మరియు సుదర్శన సింహ 'చక్రజీ'ని లెఖ్ఖపెట్టారు. బాబా అపుడపుడు అనేవారు గడ్డి నుండి మాంసం తయారవుతుంది. అంటే గోధుమ, ఫలములు పూలు మొదలైన వనస్పతులతో ప్రాణుల శరీరము తయారవుతుంది. మాంసము మట్టితో ఏకమై గడ్డి, అయిపోతుంది. మాంసం గడ్డి ఈ రెండు గంగామాత ఒడిలో తయారవుతాయి. ఆ 'బంగడ్' (పరమాత్ముడు) నిర్నిమేషంగా చూస్తు వుంటాడు.

అవడం అవకపోవడమన్న దానితో అతడి ఏమి సంబంధము లేదు. వారు శరీరములోనే పంచభూతముల ఉత్పత్తిని చూపించేవారు. ఒకసారి వారు మాకు ఇలా ఉపదేశించారు. సత్యము యొక్క అనుభవము కర్మ సాధ్యము కాదు. ఏమి చెయ్యకనే ఇంత జరుగుతూ వుంది, ఇక ఇంకా కొంచెం చేస్తూవుంటే ఇక దీని నుండి విముక్తి ఎపుడు? బాబా నిగ్రహ, అనుగ్రహముల యందు సమర్థుడు. వారికి చాలా సిద్ధులు కూడా వుండేవి, కానీ కానూన్‌గో సాహెబ్‌కి సిద్ధాల పట్ల అభిరుచి వుండేదికాదు. వారు విశుద్ధమైన పరమాత్మ సాక్షాత్కారము కొరకే ఉత్సంటితులై వుండేవారు. మేము ఆదివారము ఉదయాన్నే లేవగానే 14 మైళ్ళు దాదాపు బాబా దగ్గరికి వెళ్తుండేవాళ్ళము. సత్సంగము చేసుకుని సాయంకాలమునకో, రాత్రికో తిరిగి ఇంటికి వచ్చేవాళ్ళము. ఈ క్రమము ఇలాగే చాలా రోజులవరకు జరిగింది. రెండు సార్లు నావలో మోకల్‌పూర్ బాబా మా వూరికి వచ్చారు. కానూన్‌గో సాహెబ్‌వారు అంత ఏర్పాటు చేశారు. వారి సేవకై వేల కొద్దీ జనం కూడారు. లోకులు తమ తమ దుఃఖములు, కష్టములు తొలగించుకోవడానికి ఆశీర్వదించమనేవారు. బాబా అనేవారు అన్నిట్లోను అంత ఒక్కటే. ప్రకృతిలోని అనంతశక్తులు ఒక తృణములో కూడా వుంటాయి. సంకల్పముతో అవి జాగృతమవుతాయి. బ్రహ్మాదీ, ఈగది ఇద్దరి ఆత్మ ఒక్కటే అనేవారు. భేదము సర్వదా మిథ్య.

బాబా గులాబ్ చంద్‌జీ -

వారణాసిలో చేత్‌గంజ్ మున్సిపాలిటీ ఆఫీసు దగ్గర ఒక బాబా గులాబ్ చంద్‌జీ వుండేవారు. వారు మూలతః అఘోరపంథ్‌కి చెందిన వారు. వారి సిద్ధులు చాలా ప్రసిద్ధిగాంచాయి. ఒక ముస్లిం యువకుడిని వారు మృత్యువు తర్వాత జీవింపజేశారు. అతడికి గోరీలో పెట్టి పూడ్చివేశారు. అదిత్రవ్వి తీసి ఒకవేళ వాడు జీవించి వుండకపోతే నన్ను కూడా అందులోనే పాతిపెట్టండి అని షర్తు పెట్టారు బాబా. అతడు జీవించి వున్నాడు. ఇపుడు అతడున్నాడో లేడో నాకు తెలియదు. కానీ బాబా తర్వాత ఆశ్రమమును ఆయనే చూచుకున్నారు. 'ఆవాజేఖల్క్' అనే పారిశీభాషలో ఒక పత్రికను బాబా వెలువరించేవారు. వారి యుక్తి తెలివితేటలు విలక్షణమైనవి. వారి దగ్గరికి మున్షీ భగవతీలాల్, మున్షీ రఘువంశలాల్ మరియు ఠాకుర్ రామవృక్షసింహ

వెళ్తుండేవారు. కానూన్‌గో సాహెబ్‌ను కూడా వారు తీసుకుని వెళ్ళారు. నేను వెళ్ళాను. వారు ఒక రాతి కట్టపైన కూర్చుని వుండేవారు. వేరే జనమంతా క్రింద కూర్చునేవారు. మేము కూర్చునంతసేపు కూడా వారి చేష్టలు శాస్త్రవిరుద్ధముగా వుండేవి కాదు. వారు రామనామ మహిమను గురించి వినిపించారు. అవతార పురుషుడు రాముడికంటే అందరి హృదయాలలో వున్న రాముడి చర్చ ఎక్కువగా చేశేవారు. అంతర్ముఖులవడానికి చెవులు, కళ్ళు రెండూ మూసుకునే విధిని నేర్పించేవారు. నిజంగానే ఆ విధంగా కూర్చుంటే మనసు శాంతమయిపోతుండేది. వారు తమ 108మంది శిష్యుల ప్రత్యేక వ్యక్తి మనస్తత్వమును చిత్రించే విధంగా ఒక్కొక్క భజన వ్రాశారు. ఒక భజన కానూన్‌గో సాహెబ్ కోసము కూడా వ్రాశారు. భజన నాకు గుర్తు లేదు. అందులో ఝుగర్‌సింహ్‌జీ యొక్క శీలస్వభావము, అంతర్ముఖత, వినయము మొదలైన సద్గుణములు వర్ణన వుండినది. అది ఒక ఆదర్శరూపముగా వుండేది. నిజంగానే వారి చిత్తము యొక్క శాంతి, సౌజన్యము స్మరణకు రాగానే ఇప్పటికి హృదయము గద్గదమవుతుంది.

మధయిపుర్ బాబా -

వారణాసి దగ్గర శివపురమనే ఒక ఉపనగరము వున్నది. కాశీ పరిక్రమ చేస్తే 3వ రోజున అక్కడ ఆగుతారు. అక్కడి నుండి 3 మైళ్ళ దూరంలో మధయిపూర్ గ్రామము వుంది. అక్కడ ఒక మహాత్ముడు వుండేవాడు. వారి పేరు 'రామ ప్రతాప&' 'అవినాశి' నల్ల కంబళితో చేసిన లంగోటి వేసుకునేవారు. శ్రీ ఝుగరుసింహ్‌జీకి వారిపై పరిపూర్ణమైన శ్రద్ధ వుండేది. మధయిపూర్ బాబా వారికి ధ్యానవిధిని ఉపదేశించారు. వారి ధ్యానం గంటలకొద్దీ స్థిరంగా వుండేది. ఆ ధ్యానము ఏమిటంటే పరమాత్మ చింతనది ఒక ధార! ఆ ధ్యానములో బహిఃదృష్టి లేనే లేదు. అంతదృష్టిలో కూడా వృత్తి యొక్క స్థిరత లేదు. వృత్తి ప్రవాహరూపంగా వుండేది. కానీ దాని లక్ష్యము ఒక్కటే. అవస్థాత్రయము యొక్క ప్రక్రియ కానీ, పంచకోశము కానీ, త్రివృత్త కరణము కానీ అంతా ఒక్కటే. ఆత్మ, ప్రకృతి ప్రాకృతముతో అసంగమైనది, ఈ దృష్టి నివృత్తము చేసి ఆత్మవైపు ఆకృష్టము చెయ్యడము కొరకు యౌగిక నిరోధ ప్రక్రియ ఉపయుక్తమైనది. కానీ పరమాత్మ సాక్షాత్కారము కొరకు అది అంత ఉపయోగ

కరముకాదు. సగుణ పరమాత్మ దర్శనం కొరకు ప్రేమపూర్వక భగవదాకార వృత్తి కావాలి. మరి నిర్గుణ తత్త్వ సాక్షాత్కారము కొరకు బ్రహ్మాకార వృత్తి కావాలి. భక్తి మరియు వేదాంతము వృత్తి సిద్ధాంతమే, నిరోధ సిద్ధాంతము కాదు. బాబా అనేవారు, మనిషి శరీరములో ఎన్ని వంపులున్నాయో అవి అన్ని రేఫములు (ర)తో సమానము, ఎన్ని తెల్లటి అస్థిఖండము లున్నాయో అవి శివుడితో సమానము. శరీరములో కూడా దివ్యత వున్నది. దీని అదివ్యతను గురించిన చింతన నిష్ప్రయోజనము. దోష చింతనము కేవలము మోహనివృత్తి కోసమే.

మధయిపుర్ బాబా జీవితము కూడా విలక్షణమైనది. మధయిపుర్‌లోని ఒక పవిత్ర బ్రాహ్మణవంశంలో వారు జన్మించారు. 16, 17 సం॥లు వచ్చే వారకు ఏమీ వ్రాయడం చదవడం ఏమీ రాలేదు. భోజన సమయంలో ఉప్పు అడిగినందువలన వదినగారు వ్యంగ్యంగా మాట్లాడారు 'సంపాదించుకునిరా తర్వాత ఏమైనా అడుగు' వదిన గారి ఈ మాట గృచ్చుకుంది. చుప్ చాప్‌గా ఇంటి నుండి బయటికి వెళ్ళిపోయారు. బొంబాయి చేరుకున్నారు. అక్కడ 3 రోజులు ఉపవాసం వున్న తర్వాత రాత్రి సమయంలో ఒక సాధువు మిఠాయిలు ఇచ్చి నీకు రేపు పని దొరుకుతుంది. సంపద కూడా దొరుకుతుంది కానీ దానిని నీవు నీది అని అనుకోవద్దు.' అని అన్నారు. బాబా హల్వాయి దుకాణములో నీళ్ళు అందించే పని చేశారు. హల్వాయి తన పనితో ఎంతో ప్రసన్నుడై తన సంపత్తినంతా బాబాకిచ్చివేశారు. కొద్ది రోజులలోనే బాబా లక్షలకధిపతియయ్యారు. ఇపుడు తనకు వదినగారికి డబ్బు పంపాలని సంకల్పించారు. బాగా జబ్బు పడ్డారు. మరణాసన్నులయ్యారు. మరల ఆ మహాత్ముడే వారి దగ్గరికి వచ్చి, 3రోజులలో అంతా దానం చేయించారు. బాబాని తీసుకుని 'కటనీ' దగ్గరవున్న ఏదో ఒక కొండగుహలో పెట్టారు. అక్కడ 11 సంవత్సరముల వరకు గుహలో బందీచేసి పెట్టారు. సాధన చేయించారు, అందులో సూర్యుడి దర్శనములేదు. మహాత్ముడే వారి మలమూత్రవిసర్జన, స్నానము, భిక్ష మొదలైన వ్యవస్థ అంతా బాబా తన పైన వేసుకున్నారు. తర్వాత ఆ మహాత్ముడు వారిని విడుదల చేసినారు. తర్వాత వారు వారి వూరికి వచ్చి వూరి బయట ఒక కుటీరములో వుండిపోయారు. ఉదయం 10 గంటలకు 2 పుల్కాలు (పలుచని గోధుమ రొట్టెలు)

తిని కుటీర ద్వారము మూసివేసేవారు మరల ఉదయం 6 గంటలకు తెరిచేవారు. మధ్యలో తినటం, త్రాగడం ఏమీ లేదు. ఎవరితోనూ కలిసేవారుకాదు. నేను, కానూన్‌గో సాహెబ్ ఏ వాహనము దొరికితే దాని ద్వారా శివపుర్ చేరుకున్నాము. తర్వాత కాలినడకన వారిని చేరుకున్నాము. 6 గంటల నుండి 10 గంటల వరకు అక్కడ వుండేవారము. నెలకు ఒకసారి వారి దగ్గరికి వెళ్ళగలిగేవాళ్ళము. వారి ఉపదేశ శైలి ఎలాగుండేదంటే విషయ ప్రధానంగా వారి నిరూపణ వుండేది కాదు. ఆత్మ ప్రకాశము, బుద్ధి వృత్తి ద్వారా ఏవిధముగా విషయములను ప్రకాశితము చేస్తుందో చెప్పేవారు. ఆత్మ చైతన్యమే దేశకాల వస్తువులను ప్రకాశించపజేస్తుంది. చింతనలో విషయము యొక్క ఉత్పత్తి క్రమము కాదు కావలసినది, భావము అంటే ప్రకాశము యొక్క క్రమమే జిజ్ఞాసువుకు ఎక్కువ ఉపయోగకరము. ఏదో అజ్ఞాతము నుండి సృష్టి జరిగినది, అంటే అది అజ్ఞానమును అంగీకరించినట్లవుతుంది. జ్ఞానముతో సృష్టి ప్రకాశిస్తుంది అంటే అది అపరోక్షము. అందువలన స్వయం ప్రకాశము సర్వావ భాసము, భానస్వరూపము అయిన ఆత్మచింతనయే సరళమైన మార్గము. కానూన్‌గో సాహెబ్‌కు ఈ ఉపదేశము పూర్తిగా హృదయములో స్థిరమైంది, జీవన పర్యంతము వారు అదే మనన చింతన చేసేవారు. బాబాగారు జీవితంలో దోషదుర్గుణముల నుండి కాపాడుకోవడానికి ఎన్నో యుక్తులు తెలిపారు, వాటి చర్చ బాబాగారి జీవన ప్రసంగములో చెబుతాము.

నాకు అది ఏ సంవత్సరమన్నది సరిగా గుర్తులేదు కానీ, ఆ సంవత్సరములో బనారస్ జిల్లా కాంగ్రెస్ రాజనీతి సమ్మేళనము కమాలపురములో జరగవలసి వుండినది. నేను ఆ సమ్మేళనమునకు కోశాధ్యక్షుడిని. అందుకని ప్రతి మీటింగుకు వెళ్ళవలసివచ్చేది. అదే మీటింగ్‌లో భాయి సుదర్శన్ సింహ 'చక్రజీ' మరియు శ్రీనందకిశోర్ తివారీతో పరిచయమైంది. ఇద్దరిని నేను మా ఇంటికి తీసుకువెళ్ళాను. మిత్రతకుదిరింది. కానూన్‌గో సాహెబ్‌తో కూడా కలుసుకోవడం జరిగింది. వీరిద్దరి శీల స్వభావములు కానూన్‌గో సాహెబ్‌కు బాగా నచ్చాయి. నిజంగానే నాకూ చాలా నచ్చింది, ఉచితమనిపించది. చక్రజీ చాలామట్టుకు సంవత్సరాల తరబడి మా ఇంట్లోనే వుండిపోయారు. గంటల తరబడి ఏకాంతములో కూర్చుని భగవంతుని

ధ్యానించేవారు. మా ఇంట్లో గోష్ఠి కూడా జరుగుతుండేది. ఉదయము ధానాపూర్ నుండి కానూన్‌గో సాహెబ్, స్వామి గణేశానంద అవధూత వస్తుండేవారు. చక్రజీ అయితే అక్కడనే వుండేవారు. 'భగవద్గీత'పైన భిన్న భిన్న టీకాలు తీసుకుని కూర్చునేవారు, వాటి అర్థము, తాత్పర్యముపైన విచారణ జరిగేది. నాకు సంస్కృతము బాగా అలవాటు. నేను శబ్దములను క్రొత్త క్రొత్త అర్థాలు చెబుతుండేవాడిని. దీని వలన కానూన్‌గో సాహెబ్‌కు సంస్కృతముపట్ల అభిరుచి కలిగింది. వారు కేవలం గీతా శ్లోకాలతోనే వ్యాకరణ నియమాలను బాగా అర్థము చేసుకున్నారు. ఇపుడు వారికి సంస్కృతము అర్థము కావడంలో ఏమీ ఇబ్బంది లేకపోయింది. వేదాంత గ్రంథములు చదవడము మొదలెట్టారు. ఆ రోజులలో గోయెంకా సంస్కృత కాలేజీకి ఆ చార్యుడు శ్రీ చండీప్రసాద్ శుక్లగారు ఖండన ఖండ ఖాద్యకు హిందీ అనువాదము చేశారు. తిరిగి నాకు వాపసు ఇచ్చారు. మన మనసులో ఎపుడూ కలుగని ప్రశ్నలకు అందులో సమాధానము చెప్పారు. 'ఈ గ్రంథము వాద వివాదములకు ఉపయుక్త మైనదే కానీ, జిజ్ఞాసువులకు కాదు' అని వారు అన్నారు.

సౌమ్యస్వభావము -

దాదాపు రోజు ఉదయం 9, 10 గంటలపుడు శ్రీమద్భాగవతకథ చెబుతు వుండేవాడిని. మొదటి రోజులలో కేవలము మా తల్లిగారే శ్రోతగా వుండేవారు, నేను వక్త. వారి కళ్ళల్లో అశృవులు! ఆనందంతో కూర్చుని వుండేవారు. తరువాత చక్రజీ వచ్చాక వారు కూడా ఒక శ్రోత అయ్యారు. వారు శ్రీకృష్ణ చరిత్ర విని ఆత్మవిస్మృతు లయ్యేవారు. అలాగ 4, 5 గంటలు అదే అవస్థలో పడి వుండేవారు. స్వామి గణేశానందజీ వారిని వేళాకోళము చేస్తుండేవారు. ఎందుకంటే వారు ఘనఘోర వేదాంతులు. కానీ కానూన్‌గోజీ మాత్రము చక్రజీ మూర్ఛ, మరి గణేశానందుల ఉపహాసము! ఈ రెంటిలో కూడా సౌమ్యంగా, శాంతంగా ఏకరసస్థితిలో కూర్చుని వుండేవారు. వారికి జ్ఞానము, భక్తి వీటిలో ఏమీ దురాగ్రహము లేదు. పరమాత్మ చింతనయే వారి కభీష్టము. నాకు స్మరణ వున్నది, ఒక సారి నేను 'తృణము నుండి మూల ప్రకృతి పర్యంతము చంచలత నిండివున్నది, ఎంత వరకంటే బ్రహ్మ, విష్ణు,

మహేశ్వరుడు కూడా చంచలులే రామకృష్ణాధి, రామకృష్ణాది అవతారములు సనకాది పరమర్షులు ఎవరైనా సరే చంచలులే ఏదైతే వున్నదో అది చంచలమే, అని నిరూపణ చేసినాను. కానూన్‌ఓ సాహెబ్‌కు చాలా నచ్చింది. కేవలము ఆత్మయే అచలము, మరి మిగతవన్నీ చంచలములే మిథ్యయే. చిన్న పెద్ద సద్గుణాలను కూడా వారు చాలా ఆదరదృష్టితో వినయంతో అంగీకరిస్తుండేవారు వారి స్వభావమే అంత!

కానూన్‌గో సాహెబ్, ఝగరూసింహ్‌జీకి మూర్తిపూజ, వ్రతాల, మరియు తీర్థయాత్రలు, వేటిలోను రుచివుండేది కాదు. విరోధించేవారు కూడా కాదు. దీనికి కారణము ఇది, ఒకసారి వారు మాతో వలవకముందే తన పదవికి రాజీనామా ఇచ్చి హిమాలయములకు బయల్దేరారు. అక్కడ వారికి తీర్థజీవీ, మోసగాళ్ళు అయిన సాధువలతో కలవడం జరిగింది. జ్ఞానము, ధ్యానము వీటి చర్చ చాలా తక్కువగానే దొరికింది. పూజారుల దృష్టికోణము కానుకలు, పూజ వీటి వరకే పరమిమితమయి వుండేది. అందువలన వారు ఒక్క వారములోనే తిరిగి వచ్చారు. వారి ఆఫీసరు త్యాగపత్రము ఆపివుంచారు. దానిని ముందుకు పంపలేదు. వారు తిరిగి వచ్చాక దానిని చింపివేశారు. వారు తిరిగి తమ పదవిని స్వీకరించి పనిచెయ్యడము మొదలుపెట్టారు. వారి స్వభావమే అంత! ఎక్కడ సత్యము ప్రతీతమవుతుందో వారు దానిని స్వీకరించేవారు. వారికి ధ్యానము అంటే చాలా ఇష్టం. బాహ్య వేష భాషలు, ఆడంబరాలలో వానికి అభిరుచి లేదు.

చిత్ర కూటములో సాధన భజన చేసే మహాత్ములుంటారని మేము వినివున్నాము. అందువలన నేను, కానూన్‌గో సాహెబ్ ఇద్దరము కలసి చిత్రకూటము వెళ్ళాము. కామదగిరి పరిక్రమ చేశాము. ఆ రోజులలో అక్కడ బాలికలు చుట్టుముట్టి డబ్బులిస్తేకానీ వదిలేవారు కాదు. బ్రతుకు తెరువు ఎక్కువగా వుంది, కానీ భజన అక్కడ అక్కడ మాత్రమే. శ్రీరామ నారాయణజీ బ్రహ్మచారి, స్ఫటికశిల, అనసూయ మందిరము, హనుమాన్ ధార చాలా బాగనిపించాయి. కానీ అక్కడ జ్ఞాన ధ్యానములకేమీ స్థానము లేదు. పీరీ కోఠీవాలీ స్వామి అఖండానందజీ మహరాజ్ దగ్గరికి మేము వెళ్ళాము. నేను వారి దర్శనము మునుపు ఋషీకేశ దగ్గర చంద్రభాగనదికి ఎగువ భాగములో ఒక కాలువ (నదీపాయ) దగ్గర చేసి వుంటిని.

నేను వెళ్ళగానే వారు 'నీవు బ్రహ్మవు!' నేను చాలా వినయంగా అన్నాను 'మహరాజ్! నేను అజ్ఞానిని!' వారు విదిలించి అన్నారు. నీకు ఎపుడైతే ఈ జ్ఞానము వుందో నేను అజ్ఞానిని అని, అపుడు నీవు అజ్ఞానివి ఎలా అయ్యావు? నీ అజ్ఞానమును తెలుసుకునేవాడివి నీవు' వారి యుక్తి అకాట్యము! చిన్న పిల్లలకు కూడా గంభీర వేదాంతమును అర్థమయ్యేలాగ చేయగలిగేవారు. కానూన్‌గో సాహెబ్‌కు కూడా వారు బాగానచ్చారు. కానీ వారి నిష్ఠ ధ్యానములోనె ఉండేది అందుకని వూరూరా తిరిగి 'శివోఽహమ్' యొక్క ప్రచారమును చెయ్యడము వారికి అంతరుచించలేదు.

బౌద్ధిక చింతనవైపు వారికి అభిరుచి -

నేను ఝూసీ ప్రయాగలో వుంటున్నప్పుడు, శ్రీప్రభుదత్త బ్రహ్మచారి మహరాజ్ వెంట గోరఖ్‌పూర్ వెళ్ళాను. ఆ రోజులలో సవత్సరం, ఆరెనెలల వరకు నేను కానూన్‌గో సాహెబ్‌ను కలుసుకోలేకపోయాను. హో! వారు నన్ను గుర్తుచేసుకునేవారు, శీతాకాలంలో వారు నాకోసము ఒక కాశ్మీర దుశాలువ పంపించారు. వచ్చిపోయే వారితో వారి యొక్క సౌజన్యము, ధ్యానము, విశుద్ధ చరిత్రను గురించిన సమాచారం లభిస్తుండేది. సంకీర్తన, రాగం, తానం, నాట్యం, లీల, అభినయము ఇవన్నీ సాధరణజనులకు ఉపయోగములే కాని ఎవరైతే అంతర్ముఖులవ్వాలని కోరుకుంటారో వారికి నిధిధ్యాసన మాత్రమే ఆవశ్యకమని వారు భావించేవారు. వారు చాలా అధ్యయనము, తర్క వితర్కశాలిని బుద్ధి మరియు ఉపన్యాసాల యెడల కూడా వారు ఆకృష్ణులు కాలేదు. ఎంతవరకు నంటే ప్రమాణ ప్రమేయపరమైన వేదాంత శ్రవణములో కూడా వారికి ప్రవృత్తి కలిగేది కాదు. వివరణ ప్రస్థానము శ్రవణము చేసినత మాత్రముననే జ్ఞానముకలుగుతుందన్న శైలికి వారు అనుయాయులు కారు. వారు భామతీకారుల శ్రవణము మననము తర్వాత నిధిధ్యాసన యొక్క పరిపాకము వలన ఆత్మ మరియు బ్రహ్మయొక్క ఏకత్వమును అంగీకరించేవారు. అందువలన ఏ మహాత్ముల దగ్గర ధ్యాననిష్ఠకు ప్రోత్సాహము లభించేదో, అక్కడికే వెళ్ళేవారు. గోరఖ్‌పూర్ వచ్చాక అక్కడ భాయిజీ హనుమాన్ ప్రసాద్ పోదార్ గారితో చాలా ప్రభావితులయ్యారు. శ్రీజయ దయాల్ గోయెంకా గారి సత్సంగములో కూడా చరిత్ర శుద్ధి (పవిత్ర చరిత్ర) దృష్ట్యా చాలా ఆకర్షితులయ్యారు కానీ, వారు తమ ధ్యానములోనే

వుండిపోయేవారు. వారు 2, 3 గంటలకు కదలక, మొదలక నిష్కంపస్థితిలో కూర్చుని వుండేవారు, ముఖంలో కూడా సాధారణ భావము. విషాదము లేదు, ప్రసాదము లేదు. ముఖమండలముపై సౌమ్యతని కనిపించేది.

ఏకాంత ప్రియత -

నేను సన్యాసినయ్యాక వారితో అపుడపుడు కలుస్తువుండేవాడిని. ఎపుడైనా కలసినపుడు రాత్రి రాత్రంతా నేను, వారు వేదాంత చర్చ చేస్తు వుండేవారము. వారికి వాద వివాదము లేదా శాస్త్రార్థము సంబంధమైన వివేచన ఇష్టముండేది కాదు. వారు అష్టావక్ర గీతలోని శ్లోకాలు సరళంగా పారాయణ (పాఠ్) చేసుకునేవారు. నేను బ్రహ్మాత్మైక్యతను ఉపపాదన చేయుట కొరకు ప్రమాణములను, యుక్తులను ప్రయోగము చేశెడివాడను. వారు చాలా ప్రసన్నులయ్యేవారు. కానీ అనే వారు 'వీటన్నిటి సారము ఇదే ఆత్మ నిత్య, శుద్ధ, బుద్ధ ముక్తము. వివేక విచారముల బరువును ఎక్కువ బుద్ధిపై వేయకపోవడమే మంచిది.'

వారు శ్రీ బృందావన ధామము కూడా రెండు మూడు సార్లు వచ్చారు. శ్రీఉడియా బాబాజీ వారు బ్రహ్మాకార వృత్తి చెయ్యాలని దానిపై చాలా గట్టిగ చెప్పేవారు. వారు అన్వయ వ్యతిరేకముల ద్వారా, లేక విధిముఖముగా కానీ నిషేద ముఖముగాకానీ జిజ్ఞాసువులకు ఉపదేశించేవారు. మరి ప్రశ్నలకు జవాబులయితే తక్షణమే ఎంతో స్పష్టంగా ఇచ్చేవారు. వినేవాళ్ళు చకితులయ్యేవారు. కానూన్‌గో సాహెబ్‌కు బాబాపట్ల అవిచ్ఛిన్నమైన శ్రద్ధ ఏర్పడింది, కానీ వారు జన సందోహము చూసి గాబరాపడేవారు. ఒక సాధువు తన మరణానంతరము శరీరమును సమాధి చెయ్యడానికి ఒక స్థానము తయారుచేస్తు వుండిరి. దానికి కానూన్‌గో సాహెబ్ ఇలా టిప్పణి ఇచ్చారు 'మరణించిన తర్వాత శరీరము ఏమైన అవనీ, దాని వలన ప్రయోజనమేమిటి? ఒక మహాత్ముడు మరణానంతరము కూడా శరీరము కొరకు ఏర్పాట్లు చెయ్యడము, ఈ మాట యుక్తి సంగతము అని అనిపించడము లేదు'. నేను ఈ ప్రసంగమును ఇక్కడ ఎందుకు చర్చించానంటే వారి దృష్టి కోణము ఎంత అనాసక్తమయినదో, ఎంత స్పష్టమయినదో ఈ సంగతి జిజ్ఞాసువులకు తెలియడానికే'.

నేను బద్రీనాథ్ యాత్రకు వెళ్తున్నానని తెలిసి వారు బృందావనము వచ్చారు, ఎడమ చెయ్యివైపు 'అంజైనా'ది నొప్పివుండేది వారికి, మైలు అర్థమైలు నడ్వడము కష్టంగా వుండేది. కానీ నావెంట యాత్ర చెయ్యడంలో వారికి బాధ కలుగలేదు. వారికే స్వయంగా ఆశ్చర్యంగా వేండేది. ప్రతి రోజు సుమారు 10, 10 మైళ్ళు కూడా నడిచేవారు. మార్గ మధ్యములో చాలా మంచి సంత్ మహాత్ముల దర్శనము, సత్సంగము మరియు మాటటామంతీ లభించింది. భిక్షు శంకరానందజీ, మహా మండలేశ్వర్ శ్రీ భాగవతానందజీ మొదలైన వారి సంసర్గము, ఉపదేశము లభించింది. వసిష్ఠగుహలోని శ్రీపురుషోత్తమానందజీ మహరాజ్ యొక్క విశేషకృప లభించింది. వారు చిన్న పిల్లవాడిలాగ మాట్లాడేవారు, చూస్తే కూడా ఎలాగనిపించేదంటే వారి మస్తిష్కముపై ఏమి భారము లేదు అని. వారు నవ్వుతూ అనేవారు, ఏమీ చెయ్యవలసింది లేదు, ఏదీ పొందవలసిందీ లేదు, రాకపోకలు లేవు, పట్టు విడుపులు లేవు, అంగీకరించవలసినదీ, తెలుసుకోవలసినదీ కూడా ఏమీలేదు, చాలా ఆనందంగా యాత్ర పూర్తయింది. కానూన్‌గో సాహెబ్ యొక్క అభిప్రాయము తీర్థయాత్ర దేవదర్శనములోనే కాదు, వారు కేవలం నాకు తోడువుంటు, సత్సంగములోని ఆనందాన్ని గ్రోలడానికే.

సత్యప్రియిత, నిర్భయత -

నేను సావధానతతో తేలిపే ఈ మాట చెబుతున్నాను, నా జీవితములో గొప్ప గొప్ప సజ్జనులు, సచ్చరితులు అయిన గృహస్థులు కలిశారు, కానీ శ్రీఝుగురూసింహజీ లాంటి వాళ్ళు మరొకరు దొరికారు అని మాత్రం గుర్తులేదు. వారే ఏ ఇలాఖాలో విచారణకు వెళ్ళేవారో అక్కడ ఎవరి దగ్గర ఇచ్చి పుచ్చుకోవడాలు కాదు, కనీసం అన్నపానాదులు కూడా స్వీకరించడానికి ఇష్టపడేవారు కాదు. వారికి ప్రతిరోజు తమ రిపోర్ట్ సర్కారుకు ఇవ్వవలసి వచ్చేది. కానీ వారు ఎపుడూ అబద్ధపు రిపోర్టులు ఇచ్చేవారు కాదు. ఒక్కోసారి ఉన్నదున్నట్లుగా తన తప్పును కూడా వ్రాసుకున్న కారణంగా పై అధికారులతో చీవాట్లు వడేవి. ఎవరైనా పెద్ద అధికారి వారి ఇలాఖాలోకి వస్తే వారికి స్పష్టంగా చెప్పేవారు, 'నా ఆదాయము చాలా సీమితమైనది. దానిని మీ

స్వాగత సత్కారాల కోసము ఖర్చుచేయ్యలేను, మీరు స్వయంగా మీ ఏర్పాట్లు చూసుకోండి అని.' ఇక తాగేవారు, తినే (మాంసాహారం) వారయితే వారికి చాలా నిరాశయే కలిగేది.

స్వాతంత్ర్యము వచ్చిన తర్వాత జరిగిన ఘటన - ఆ ప్రదేశము యొక్క ముఖ్యమంత్రి ఒక ముస్లిం సజ్జనుడిని కారులో తనతో తీసుకుని కానూన్‌గో సాహెబ్ దగ్గరికి వచ్చారు. ఫలానా ముస్లిం వ్యక్తి ఇక్కడ ఆస్తిపాస్తులు వదిలి వెళ్ళారు, వారిది ఈ ముస్లిం సజ్జనుడిపేర వ్రాసి ఇవ్వమని ఆజ్ఞాపించారు. ఇతడు దానిని ఉత్తరాధికారి అని అన్నారు. ఝుగరూసింగ్‌జీ చాలా వినయంగా గౌరవముగా ఆ మంత్రిని, ఆ ముస్లిం సజ్జనుడిని సాగనంపారు. విచారించుకున్న తర్వాత విరుద్ధమైన రిపోర్టు ఇచ్చారు. (అంటే వారికి కావలసినట్లు కాదు) ఎందుకంటే వెళ్ళిపోయిన ముసల్మా నుడికి ఎవరూ ఉత్తరాధికారులు లేరు. అందువలన పాకిస్తాన్ నుండి వచ్చినటువంటి ఏ శరణార్థికో ఆ ఆస్తిపాస్తులు ఇవ్వవలసినది అని. దీనిపై మంత్రిగారు చాలా క్రోధితులయ్యారు. వారి ప్రమోషన్ అపుచేయించారు. క్రింది ఉద్యోగస్తులంతా కూడా వారి న్యాయనిష్ఠని ఎరుగుదురు. వారికి ఇంకా పై పదవి ఇవ్వాలనుకునేవారు. కానీ కానూన్‌గో సాహెబ్‌కు తన కర్తవ్యపాలన తప్పవేరే ఏమీ పట్టదు. పదవి యొక్క ఉన్నతి అవనతి పట్ల వారు ధ్యానముంచేవారు కాదు. వారి అభ్యాసము 'ధ్యానము'పైనే ఉండేది. వీరికి జీవన్మరణములలో కూడా ఏమీ అంతరం లేదు.

ఒకసారి వారు ఎక్కడికో బయటికి వెళ్ళారు. తిరిగి వచ్చేటప్పుడు స్టేషన్‌లో రైలు ఆగివున్నది. వారు ఒక అపరిచితవ్యక్తితో 'నన్ను కొంచెం సాయం పట్టి క్రిందకు దించండి' నా దుప్పటి ప్లాట్‌ఫారమ్ పైన పరచండి' అని అడిగారు. ఆ సజ్జనుడు అలాగే చేశాడు. అక్కడనే వారు యాత్ర ముగించారు, పరిచిన ఆ దుప్పటిపై ఆసనం వేసుకుని కూర్చున్నారు. శరీరము నిష్ప్రాణమయిపోయింది. అక్కడ వారిని గుర్తించేవారు ఎవరూ లేరు. పోలీసులు వచ్చి పరీక్షించారు. వారి పాకెట్‌లో ఒక కార్డు దొరికింది. అది ఎవరో వారికి వ్రాసిన ఉత్తరం. దానివలన ఇంటి అడ్రస్సు దొరికింది. సంబంధీకులకు సమాచారము తెలిసింది, వారి శవమును తీసుకువెళ్ళారు.

విధి పూర్వకముగా అంత్యేష్టి క్రియ సంపన్నమయినది. ఎలా జీవితములో అనాసక్తి వుండేదో అలాగే మరణం పట్ల కూడా వుండినది. స్వయంగా వారి జీవితములో దుఃఖ-శోకములు లేవు, ఇతరులను కూడా తన చికిత్స, ఔషధి, లేదా సేవ వీటి కోసము కష్టము కలిగించలేదు. అలాంటి సత్పురుషులు ప్రపంచములో ఎవరో ఒక్కరుంటారు. గృహస్థుడు, సర్కారీ ఉద్యోగము, రకరకాల బాధ్యతలు వుండేవి. సామాన్యుడు ఏ పరిస్థితులు సంఘటనల వలన చింతితుడై, నిరాశతో దుఃఖితుడౌతాడో అలాంటి ఎన్నో సంఘటనలు వారి జీవితములో ఘటితమైనవి, కానీ వారు మాత్రం ఎలావుండేవారంటే అలిప్తులు, ఏకరస సమరస భావంతో జీవనం గడిచిపోయింది. వారి నిష్ఠలో ఏమీ తేడా రాలేదు.

నిజంగా అలాంటి జీవితమే నిజమైన జీవితము.

బ్రహ్మమయి మాత

మస్తిష్కముపై బాగ బలంపెట్టి ఆలోచించినా తల్లిగర్భంలో వున్న సంగతి, జన్మ ఇవన్నీ స్మరణకు రావడంలేదు. చాలా చిన్నప్పటి సంగతులూ గుర్తుకు రావడం లేదు. అమ్మ మజ్జిగ చిలకడానికి కూర్చుంటే నేను వెన్న కోసం ఆమె దగ్గరికి వెళ్ళి చెయ్యి చాపేవాడిని ఆ దృశ్యం మాత్రం తప్పక గుర్తుకు వస్తూ వుంటుంది. మజ్జిగ తుంపరలు రెండు మూడు ఒంటి మీద పడుతూండేవి. చేతులకు, కాళ్ళకు కడియాలు, నడుముకు వడ్డాణం అవన్నీ ఇప్పటి వరకు మరువలేను. వెన్న తప్పక లభించేది. వారి ఒడిలో పాలు చాలా సంవత్సరాల వరకూ త్రాగాను. నేను అఖరి పిల్లవాడిని. మా అమ్మ పేరు భాగీరథి. నేను అమ్మ అన్నీ, మా అని, ఎపుడైనా కోపం వచ్చినపుడు 'మాయిరే' అని పిలిచేవాడిని. తండ్రిగారి జ్ఞాపకం కూడా బాగానేవుంది. వారు పూజా-పాఠ్ చేస్తుండేవారు. శంకరుడికి హారతి ఇవ్వడాకిని ఘంట వాయించగానే నేను ప్రసాదం కోసం పరుగుపెట్టేవాడిని. నానిన బియ్యం బెల్లం ప్రసాదము దొరికేది. వారు నాతో ఎపుడూ మాట్లాడలేదు, ఒళ్ళో కూర్చోబెట్టుకోలేదు. నాకు ఏడు సంవత్సరాల వయసులోనే గంగాతీరములో వారి శిరస్సు నుండి ఒక మాంసపు పిండము ఎగిరి గంగానదిలో పడిపోయింది, వారి భౌతిక జీవనము సమాప్తమయినది. ఇక అమ్మ 'రామ చరిత మానసము' పారాయణచేస్తుంటే ఆమె కళ్ళ నుండి అశ్రువులు ధారకట్టేవి. నేను కాగితం పైన వున్న నల్ల నల్లటి అక్షరాలను ఏదో ఒకదాని వెంట ఒకటి వరుసగా గొర్రెల మందలాగ కనిపించేది. అమ్మ ఒక్కొక్క అక్షరమును ఇది 'క' ఇది 'ఖ' అంటు పరిచయం చేశారు. వ్రాయడం రాలేదు కానీ నేను రామ చరితమానసము చదవడం మొదలుపెట్టాను. అమ్మ తనే! గురువ తనే! తనపే నాకు అక్షరజ్ఞానము కలిగించారు.

విక్రమ నామ సంవత్సరము, 1975లో చాలా సంఘటనలు జరిగాయి. అపుడే మా పెద్దన్నయ్యగారు 15 సం౹౹ల వయసు వుంటుంది. పెళ్ళి కూడా అయిపోయింది. ధాన్యం నిలువచేశే గది తెరువగానే ఆ ఆవిరి తగిలి స్పృహ తప్పి పడిపోయారు. అదే ప్రాణాంతకమయింది. అమ్మ తనను తాను సంభాళిచుకున్నారు. అదే సంవత్సరము మా పెద్దక్కయ్య పెళ్ళి జరిగింది. పెళ్ళి జరిగిన తర్వాత తెలిసింది ఆ పెళ్ళి వాళ్ళింట్లో వాళ్ళకి ఇష్టములేదని. దీనిని కూడా అమ్మ ఓర్చుకుంది. అదే సంవత్సరము మా తండ్రిగారు నిర్యాణం చెందారు. మా తాత గారు (పితామహులు) వుండేవారు. వారు దాదాపు 60 సం౹౹ల వయోవృద్ధులు. ఇంట్లో అమ్మ, పసితనం వీడని కోడలు వీరిద్దరు ఆడవాళ్ళుండేవారు. అమ్మనే ఇంటి బాధ్యతలు చూచుకునేవారు. మా తాతగారు కూడా అమ్మ సలహా తీసుకనే ఏదైన పని చేశేవారు. మా వంశపారంపర్యంగా వచ్చిన శిష్యులు, శిష్యురాండ్లు కూడా అమ్మపట్ల ఎంతో ఆదరభావంతో వుండేవారు. వారిని పూజించేవారు కూడా. ఆ సంవత్సరములో మా అక్కయ్య పెళ్ళికి నేపాల్‌కి చెందిన పంచసదస్సులలో ఒకరైన పరమహంస శ్రీజగన్నాథపురీజీ మహరాజ్ మా ఇంటికి వేంచేశారు. వారు మా సోదరి కొరకు నేపాల్ నాణెములు, ఒక మంచి చీర ఇచ్చారు. వారు నన్ను చాలా ప్రేమగా చూసుకునేవారు. పెద్దవాడినయ్యాక చాలా ఆదరంగా వుండేవారు. ఆసనమునుండి లేచి చేతులు జోడించి నమస్కరించి, హృదయానికి హత్తుకుని, తన ఆసనముపైన కూర్చొబెట్టుకునేవారు. వారి కుటీరము మా వూరికి రెండు మూడు మైళ్ళ దూరంలో కాన్పూర్, ఖడాన్ ఈ రెండు వూరి ఎల్లల్లో వుండేది. ముందు ముందు ఆ పరమహంస గారి వలన నాకు చాలా ఆధ్యాత్మిక లాభము కలిగినది. ఆ వూర్ల వాళ్ళంతా కలసి ఒక్కొక్కరు ఒక్కొక్క రోజు భిక్షను వారి దగ్గరికి తెచ్చి ఇచ్చే ఏర్పాటుచేశారు. పరమహంస వారి చర్చ నేను మరల విడిగా చేస్తాను. వారి దివ్య శరీరము, నిస్పృహవృత్తి, మరి నిర్ద్వంద్వ జీవనము యొక్క ప్రభావము ఇప్పటికీ నాపైన వుంది.

మా తండ్రి, తాత గార్ల శిష్య పరంపర దాదాపు 40 గ్రామాల వరకు విస్తరించివుంది. మా తల్లిగారు తీర్థయాత్రకు వెళ్ళడానికి సంకల్పిస్తే, వెంట చాలా మంది స్త్రీ, పురుషలు బయల్దేరారు. ఆ రోజులలో హరిద్వారం తర్వాత వెళ్ళడానికి

ఏమీ వాహనములుండేవి కాదు. వారు గంగోత్రి, జమునోత్రి, కేదనాథ్, తుంగనాథ్ మరియు బద్రీనాథ్‌కి పాదయాత్ర చేశారు. యాత్రికులు సదుపాయమున్నచోట భోజనము తయారుచేసుకునేవారు, లేనిచోట 'సత్తూ' (అది ఒకరకమైన పిండి) తిని యాత్ర చేశేవారు. ఆ రోజులలో సుమారు వెయ్యి మైళ్ళ దూరం కాలినడకతో యాత్రపూర్తి చేశారు. చాలా నెలల సమయం పట్టింది. ఆ యాత్రలో పర్వతాలు, నదులు, అడవులు, మంచుకొండలు, పుణ్యక్షేత్రములు మరియు సత్సంగము వీటితో అమ్మకు బాగా మనశ్శాంతి లభిచింది. తిరిగి వచ్చాక కూడా ఇంత పెద్ద యాత్ర కుశలపూర్వకముగా ముగిసినది అని ఒక తృప్తి సంతోషము వుండేది వారికి. ఆ రోజులలో హిమాలయ యాత్ర వెళ్ళడమంటే తిరిగివస్తామో రామో అని ముందే ఆలోచించుకుని మరీ వెళ్ళేవారు. దీని వలన సంసారిక సంబంధాలు శిథిలమయ్యేవి. ఇతరుల మృత్యువు సంగతి మరచిపోయేవారు. తమ మృత్యువే కళ్ళ యెదుట అడుగడుగునా కనబడేది. భగవన్నామ సంకీర్త, స్మరణ జరిగేది. దీనివలన సహజముగానే చిత్తశుద్ధి కలిగేది.

హిమాలయ యాత్ర తర్వాత 5, 6 నెలలకు తర్వాత దక్షిణ దేశ యాత్ర చేశారు. గంగోత్రి జలము వెంట వుండినది. పూరీ, రామేశ్వరము, ద్వారక వెళ్ళి వచ్చారు. ఈ యాత్రలో 10, 15 మంది జనం మాత్రమే వెంటవెళ్ళారు. వారు చాలా ప్రేమతో ఒక కథలాగ తీర్థయాత్రను గురించి చెబుతుండేవారు. జగన్నాథపురీలో ఒకే పొయ్యిమీద 7 కుండలు పెట్టి అన్నం వండేవారు. అక్కడ అందరూ అందరి ఉచ్ఛిష్టమును తింటారు. అక్కడ ఏకాదశి గట్టిగ చేస్తారు. అక్కడ ఠాకుర్‌జీతో (దేవుడితో) పాటు వాళ్ళ సోదరి కూడా (సుభద్ర) వుంటుంది. ఇంద్రద్యుమ్న సరోవరంలో భగవంతుడు గజేంద్రుడిని ఉద్ధరించారు. అక్కడ ఎపుడు నైవేద్యం పెట్టడానికి 'అటకా' చేస్తారు. అక్కడ వెళ్ళినపుడు ఏదైనా ఒకటి వదలిపెట్టాలి. ఈ సంగతులన్నీ వారితో విని విని నాకు చాలా ఆశ్చర్యం, ఆనందము కలుగుతుండేది. రామేశ్వరము మందిరము ఎంతో పెద్దది. హనుమంతుడు 'లింగం' తీసుకువచ్చేటపుడు వెనుకబడిపోయారు, ముందు ప్రతిష్ఠించిన లింగమును వారు కదల్చలేకపోయారు, వారి తోకనే విరుగుతుందనిపించింది. రామేశ్వరుడి స్థాపన కోసము రావణాసురుడ సీతాదేవిని

తీసుకువచ్చాడు. అక్కడ చాలా కోనేరులలో స్నానము చెయ్యాలి. చాల పెద్ద పెద్ద మందిరములున్నవి. ఈ సంగతులన్నీ వారి నోటివెంట వినే భాగ్యం కలిగింది. ద్వారక రెండు రకాలు. అక్కడ భుజములపైన ముద్రవేస్తారు. రుక్మిణీదేవి ద్వారకకు బయట వుంటుంది. ఇలాగే పుణ్యక్షేత్రములను గురించి చెబుతూవుండేవారు. అక్కడ కథలు, అక్కడి భక్తుల చరిత్రలు వినిపిస్తుండేవారు. తీర్థయాత్రలు చేసి తిరిగివచ్చాక అమ్మ మనసు పూజపారాయణలలో చాలా లీనమయింది. నాకు 11 సం॥లపుడు చదువు కోవడం కోసమని నేను వూరు వదలి కాశీ వెళ్ళిపోయాను. ఇంట్లో వృద్ధులైన మామగారు, వారి వయసు అపుడు దాదాపు 73 సం॥లుండవచ్చు. విధవరాలైన కోడలు, తనకు దాదాపు 18, 19 సం॥లుండవచ్చు. తన పూజా పాఠ్ అయ్యాక ఇంటి పనులలో అమ్మకు సాయం చేస్తుండేవారు. అమ్మకు సంసారిక కార్యకలాపాలలో విశేషమైన ఇష్టముండేది కాదు, కానీ వృద్ధులైన మామగారి ఆజ్ఞను, సేవను మాత్రం వారు చాలాశ్రద్ధగా చేస్తుండేవారు, వచ్చిపోయే వారిని కూడా బాగా చూచుకునేవారు.

వూరి దగ్గర్లో వర్షాకాలపునీరు ప్రవహించేందుకు ఒక కాలువ వుంది. ఇపుడైతే దానిపైన వంతెన కట్టారు, ఆ సమయంలో ఏమీ లేదు ఎపుడైనా అందులో నీరు నిండి వరద వచ్చిందంటే దారి బంద్ అయ్యేది. ఉత్తరము వైపునుండి వచ్చే యాత్రికులకు అలాంటప్పుడు రాత్రంతా అక్కడే ఆగవలసి వచ్చేది. ఒకవేళ ఎవరైనా ఇద్దరు ముగ్గురు యాత్రికులు రాత్రివేళపుడు వచ్చారంటే, ఇంట్లో చేసిన వంట ముందు వారికి పెట్టేవారు. ఇంటి వాళ్ళం ఆకలితో పడుకునేవాళ్ళం. తాతగారి శిక్షణ అలా వుండేది. తను భోజనము చెయ్యడంలో అంతసుఖములేదు, ఇతరులకు భోజనము పెట్టితను ఆకలితో ఉండిపోవడంలోనే ఎక్కువ సుఖము. వచ్చినవారికి మంచాలు ఇచ్చి, ఇంట్లో వారతా నేలపైన పడుకుని నిద్రపోయేవారు.

ఈ ప్రసంగములో నేను ఒక పొరుగింటి వారిని మరువలేను, వారు చిన్న (బింద్) జాతి వారే. ఇది మన హిందూ జాతిలో లేదు. వారిదగ్గర భూములు, ఇళ్ళు వుండేవి. మా ఇంట్లో చాలా మంది అతిథులు వచ్చారని చూడగానే వారు ఒక పద్దె గంపలో బియ్యం, పప్పు, పిండి, నెయ్యి, పెరుగు, బెల్లము అన్నీ తీసుకుని, తమ తలపై పెట్టుకుని ఏదో అమ్మేందుకు వచ్చేవారిలాగ వచ్చి ఇంట్లోకి వెళ్ళి సామాన్లు

ఇచ్చేవారు. ఇంకా ఏమైనా కావాలా? అని అడుగుతుండేవారు. ఇంత చిన్న జాతి! ఎంత ఉదారత! ఇది ఆశ్చర్యం! కానీ నిజమైన మాట!

నా పైన అమ్మకు చాలా ప్రేమ, అందుకని వారు మాటిమాటికీ కాశీ వస్తుండేవారు. కొన్ని రోజుల తర్వాత వారి పెద్దక్క (మాపెద్దమ్మ) సన్యాసిని అయి కాశీ వచ్చారు, 'ఛోటీ-పియరీ'లో ఒక సాధ్వి మహాత్మ ప్రేమపురీ వారి ఆశ్రమములో వుండసాగారు. వారి పేరు త్రివేణిపురి అయింది. అమ్మవారి దగ్గర వుంటుండేవారు. త్యాగ-వైరాగ్యముల వలన ఎటువంటి సుఖము కలుగుతుందో ఆ సంస్కారము వారి మనసుపై పడింది. ప్రేమపురీ వారి దగ్గరకు ఇంకా సాధ్వీమాతలు వస్తూండేవారు. వారిలో ఒక సిద్ధమాత వుండేవారు. వారిపై అమ్మకు చాలా విశేషమైన శ్రద్ధ కలిగింది. వారితో సత్సంగ చర్చ ఎక్కువగా జరుగుతుండేది. మూడు, నాలుగు సంవత్సరములు తర్వాత వారు అమ్మకు ఒక మంత్రము ఇచ్చారు. ఈ మంత్రం నాగురువుకు, నాకు తప్ప మరెవ్వరికీ తెలియదు అనుకునేవారు. ఒకరోజు భోజన సమయంలో మహానిర్వాణ తంత్రములోన సప్తాక్షరమంత్రము వున్నట్లుండి గట్టిగా చెప్పసాగాను. అమ్మకు చాలా ఆశ్చర్యమేసింది. 'నీకు ఈ మత్రము ఎలా తెలుసు' అని వారు ప్రశ్నించారు. నాకు ఈ సంగతి కూడా తెలుసు నీవు ఇదే మంత్రమే జపిస్తున్నావని. నీ ముఖముపైన వున్న తేజస్సు, లలాటముపైన ఎత్తికనిపించే రేఖలు ఇవన్నీ ఈ మంత్రము వలననే కలుగుతాయి.' అని నేను అన్నాను. 'సిద్ధమాతాజీ' మృత్యువు తర్వాత నేను కూడా ప్రేమపురీలో వచ్చి వుండసాగాను. కానీ ఆ సమయంలో నేను సన్యాసి, సన్యాసినులు ఎవరైనా తాకిన భోజనమును నేను చేసేవాడిని కాను. నేను స్వయంగా నాచేతులతో వండుకుని తినేవాడిని. అందువలన అమ్మగారు కూడా ఎపుడూ మాటి మాటికి వచ్చి నా కిష్టమైన భోజనము తయారుచేసి పెట్టేవారు. అటువంటి రుచి మరల ఎపుడూ దొరకలేదు. ఏ తల్లి హృదయంలో పుత్రుడికొరకు రక్తమే పాలుగా మారతాయో, ఆ తల్లి చేతులతో కొడుక్కి భోజనం తయారు చేసిపెట్టినపుడు, అది అమృతముగా మారడంలో ఆశ్చర్యమేమున్నది?! అమ్మమ్మ గారు చాలా వృద్ధురాలు. వారు అపుడపుడు కాశీ వస్తుండేవారు. వారి గురుదేవులు శ్రీస్వామి మనీషానంద సరస్వతి, వారు ఆకాంలో కాశీలోని ఉద్దండులైన పండితులలో

లెఖ్ఖ. అమ్మ, అమ్మమ్మ వెంట వారి దగ్గరికి కూడా వెళ్తుండేవారు. తర్వాత నేను కూడా ఆ స్వామిజీతోనే యోగ భాష్యము, మరి యజ్ఞ వల్క్యస్మృతి యొక్క 'మితాక్షరా టీకా' అధ్యయనం చేశాను. వారు 'బేఢీనీమ్' మొహల్లాలో శివగఢ్ యొక్క రాజుగారి ఇంట్లో నగ్నంగా వుండేవారు. ఆ రోజులలో వారి వయసు సుమారు 75 సం॥ల వరకు వుండవచ్చు. వారు ఉపదేశములలో ప్రమాణము, మరియు ప్రమాణజన్య బ్రహ్మాకారవృత్తి పైనే ఎక్కువ నొక్కి వక్కాణించేవారు. అందువలన శ్రద్ధాళువులకు సాధనలో ఒక క్రమము (పద్ధతి) అని ఏమీ వుండేది కాదు.

మా తాతగారి మరణానంతరము, విద్యాధ్యయనముతో పాటు నాకు ఇంటి పనులు, శిష్యులకు దీక్ష ఇవ్వడం లాంటి పనులు చేయవలసి వచ్చింది, దానితో వూరిలో ఎక్కువరోజులు వుండవలసివచ్చేది. ఆ సమయములో ఏకమాత్ర శ్రోత మా అమ్మగారే, నేను వక్తను. ఆధ్యాత్మిక రామాయణము, విష్ణు పురాణము, శ్రీమద్భాగవతము వీటికి నేను అర్థం చెబుతుండేవాడిని. తన కొడుకుని దగ్గరగా చూసుకునే అవకాశము దొరికేది. శ్రవణం చేయగలిగేవారు. శాస్త్రములలో శ్రద్ధ మొదటి నుండి వుండనే వుంది. అమ్మ వింటు వింటు గద్గదమయిపోయేవారు. ఇంటి పనులలో వారికి ఉత్సాహము తగ్గిపోయింది. మా వూరికి 5మైళ్ళ దూరంలో వున్న గంగాతీరం దగ్గర వున్న 'సహేపుర్' గ్రామంలో శ్రీస్వామి యోగానందపురీజీ దగ్గరకు నేను ఎపుడు వెళ్ళడము మొదలుపెట్టానో అపుడు అమ్మకూడా వస్తుండేవారు. నేను స్వామిజీతో శ్రీకృష్ణ మంత్ర దీక్ష తీసుకున్నాను. పరమహంస రామకృష్ణగారి ధర్మపత్ని శరదామాత యొక్క శిష్యురాలు ఒక వృద్ధమాత కూడా అక్కడ వుండేవారు. మొదట ఆమె శ్రీ ఉడియాబాబాజీ మహరాజ్ వారిని తన పిల్లవాడిలాగ ప్రేమగా చూచుకుని భోజన పానాదులు చూచుకునేవారు. వాత్సల్యమూర్తి వారికి నాపై చాలా ప్రేమ. నాకు రకరకాల వంటలు చేసి తినిపించేవారు. మా అమ్మపైన వారి జీవితము యొక్క ప్రభావము బాగా పడింది. ఆ సమయములో వారికి 90 సం॥లుండవచ్చు. కానీ ప్రొద్దు న్నుండి సాయంకాలము వరకు ఏదో ఒక సత్కర్మలో నిమగ్నులై వుండేవారు. బోసినోరు, నవ్వుతూ మాట్లాడేవారు. శారదామాత గారి జీవితపు గాథలు అనేకము మాకు వినిపిస్తుండేవారు. స్వయంగా సాక్షితు భగవతి ప్రత్యక్షమై లోకులకు

పరమానదం పంచిపెడుతున్నట్లుండేది వారిని చూస్తూ వుంటే, శ్రీస్వామి యోగానందజీ మహరాజ్, శ్రీమద్భాగవతముపై ప్రసన్న గంభీరములైన, భావపూర్ణములైన వ్యాఖ్యానములు చేసేవారు. వారి ప్రవచనములు విని ప్రభావితము కానివారు ఎవరు వుండరు, వారి మంత్రజపము, భగవత్పూజ, గురుభక్తి వీటికి చాలా ప్రాముఖ్యతనిచ్చేవారు. గంగాస్నానము తర్వాత ఉదయం 8 గంటల నుండి మద్యాహ్నం 2 గంటల వరకుతన గురువును పూజించేవారు. వారు అంటుండేవారు 'నేను ఎపుడైతే మా సద్గురువులను పూజిస్తానో అపుడు మాటిమాటికీ వారి శ్రీవిగ్రహము నుండి బ్రహ్మ, విష్ణు, మహేశ్వర, గణేశుడే, శక్తి, రాముడు, కృష్ణుడు అందరూ ప్రకటిత మవుతుంటారు. మరి వారిలో లీనమవుతుంటారు'. వారి గురుభక్తి చూసి లోకులు ఆశ్చర్యచకితులు అయ్యేవారు. వారి యొక్క వేదాంత శాస్త్ర పాండిత్యము మరియు అనుభవము కూడా పరిపూర్ణమైనవి. మా తల్లిగారి జీవితంపై వారిది కూడా చాలా ప్రభావము పడింది, వారి జీవితములో భక్తి రసముదయించినది. వారు గంటల కొద్దీ భక్తి భావనములో మగ్నులయి వుండిపోయేవారు.

నేను గాయత్రి పురశ్చరణ తర్వాత శ్రీకృష్ణ మంత్రానుష్ఠానములో సంలగ్నమయ్యాను. ఒకరోజున నాకు ఎలాంటి ఆశ్చర్యమైన అనుభవము కలిగిందంటే నాకు ప్రపంచవిస్మృతి కలిగింది. నేను ఆనందంతో పొంగిపోయి నృత్యము చెయ్యసాగాను. రోమరోమము పులకించిపోయినది. గదిలో నుండి బయటికి రాగానే అమ్మ కనిపించారు, నన్ను నేను దాచుకోలేకపోయేను, నాకు భగవంతుడు లభించాడు. అని చెప్పాను. నా ఆనందం చూసి, నాపైన పూర్తివిశ్వాసము వున్నందువలన వారు నా చరణములపై పడిపోయారు. ఆ విశ్వాసము శ్రద్ధ జీవనపర్యంతము వారిలో వుండినది. వారి స్వాభావికమైన మాతృ వాత్సల్యము శ్రద్ధ, గౌరవముతో కూడిఉండేది.

మా ఇంట్లో సత్సంగము బాగా జరుగుతూవుంది. అమ్మ యొక్క వాత్సల్య భాజనులయినవారు 4, 5గురు వ్యక్తులుండేవారు. కానూన్‌గో సాహెబ్, ఝుగరూ సింహ్‌జీ, భాయి సుదర్శనసింహజీ చక్ర, గణేశ్ ప్రసాద్ రస్తోగీ, చంద్రశేఖర్ లాల్ పట్‌వారీ మరియు నందకిశోర్ తివారి ముఖ్యులు. వీరిని కూడా అమ్మ తన కొడుకుల

లాగనే చూసుకునేది. వీరందరూ రావడము వలన ఆధ్యాత్మిక చర్చలు విశేషంగా జరుగుతువుండేవి. ఉదయం గీతా భష్యము, టీకాలు తీసుకుని మేము కూర్చునే వారము. శాంకర భాష్యము, వధుసూదనీ, శంకరానందీ, జ్ఞానేశ్వరి, మరియు లోక మాన్య తిలక్ గారి 'గీతా కర్మయోగ రహస్యము' టీక. ఒక్కొక్కరూ ఒక్కొక్క పుస్తకము తీసుకుని కూర్చునేవారము. ఒక్కొక్క శ్లోకముపై వేరేవేరే టీకాలు అన్ని చదివి శ్లోకము, శ్లోకార్థముపై విచార విమర్శ చేసేవారము. సుదర్శన్ చక్రజీ గారిలో భక్తి, కానూన్‌గో సాహెబ్‌లో భక్తి, రస్తోగీ గారిలో వేదాంతము, నందకిశోర్ గారిలో గాంధీవాదము వుండేది. చంద్రశేఖర్ శివభక్తుడు, నిద్రలో కూడా వారి శ్వాస నుండి షడక్షర శివమంత్రం యొక్క ఉచ్చారణ జరుగుతూనే వుండేది. 'గీత'పైన చర్చ జరుగుతున్నంతసేపు అమ్మ అక్కడి నుండి అసలు కదిలేవారే కాదు. వారి భక్తి దినదిన ప్రవర్ధమాన మయినది. ముందు చెప్పిన వ్యక్తులలో చక్రజీ చాలా సంవత్సరాలు మా ఇంట్లోనే వుండిపోయారు. ఇంట్లో అందరూ వారిని కుటుంబసభ్యునిలాగనే చూచుకునేవారు. వారు శ్రీమద్భాగవతము విని 3, 4 గంటల వరకు మైమరచి వుండేవారు. కంది, జొన్న, సజ్జ చేలల్లో వెళ్ళి గంటలతరబడి ఏకాంతంగా భజన చేసేవారు. నాకంటే వారినే ఎక్కువగా ఇంట్లోనివారు, అమ్మ అందరూ ప్రేమగా చూసుకుంటున్నారని అనిపించేది. చక్రజీకి కూడా అమ్మ అంటే చాలా శ్రద్ధ, ఆదరణ వుండేది. అమ్మయొక్క వాత్సల్య భాజనులయిన ఎందరో, వారి అందరి జీవన చర్చ మరల వేరుగా చేస్తేనే బాగుంటుంది. ఒకవేళ నేను బ్రహ్మచారి ప్రభుదత్తజీ వారిని గురించి చెప్పకపోతే అది ఒకరకంగా కృతఘ్నత అనిపించుకుంటుంది. నాతో ముందుగా ఏమీ పరిచయము లేకపోయినా, వారు నన్ను భజనలో ఉత్సాహితులని చేశారు. వారి దగ్గరనే నేను శ్రీఉడియాబాబాజీ మహరాజ్, శ్రీజయేంద్రపురీజీ, శ్రీగంగేశ్వరానందజీ, విరక్తులు, అవధూతలు వీరందరి సంపర్క, సంలాప, ఉపదేశాదులు పొందగలిగాను. శ్రీకర పాత్రజీ మహరాజ్‌తో కూడా వేదాంత చర్చ చేయగలిగే సౌభాగ్యం కలిగింది. నేను మౌనంగా వుండేవాడిని. కథా ప్రవచన సమయములోనే మాట్లాడుతూ వుండేవాడిని. నాకు అందరి ప్రేమ అక్కడే దొరికింది. బ్రహ్మచారిగారే నన్ను అక్కడి నుండి గోరఖ్‌పూర్ తీసుకువెళ్ళారు. అక్కడ శ్రీభాయిజీ హనుమాన్ ప్రసాద్ పొదార్ గారితో వుండే సుఅవసరము లభించింది. అమ్మ కూడా భాయిజీ దగ్గరికి వస్తూపోతూవుండేవారు.

'కల్యాణ' (పత్రిక) పరివారములో గృహస్థవాతావరణము చూసి ఇక నేను సాధువునై ఎక్కడికో వెళ్ళునులే అన్న ఒక తృప్తి కలిగింది. భాయిజీ అమ్మ తృప్తి కోసమని హింగుతర్‌గఢ్‌కి చెందిన పండిత్ వినాయక దత్తను మా ఇంట్లో సంస్కృతము చదివించడానికి వుంచేశారు. సంస్కృత పాఠశాల తెరవబడింది. హరిహర్‌జీని ఇంటి పనులు చూచుకోవడానికి పెట్టారు. దీనివలన నేను లేకపోయినా అమ్మకు ఇంట్లో మనసు నిలబడగలిగింది. 5, 6 సం॥లు వారు ఇంట్లో వుంటూనే భగవద్భజన చేసుకుంటు వుండేవారు. వారికి స్వప్నంలో, జాగ్రదవస్థలో కూడా భగవత్సంబంధమైన అనుభవాలు కలుగుతువుండేవి. వారి జీవితం క్షమ, సరళత, వాత్సల్యము, స్నేహము పరిపూర్ణముగా ప్రకటమయినవి. ఎవరి పట్ల దోషదృష్టి ఉండేది కాదు, దోషము వుండేది కాదు. వారి సద్భావనలో ఏ విధమైన ఆటంకము వుండేది కాదు.

నేను 26 సం॥ల నుండి బృందావనం వస్తూపోతూ వుండేవాడిని. కానీ ఒకసారి నేను గోరఖ్‌పూర్ నుండి బృందావనం వెళ్ళాను, అపుడు అమ్మకూడా నాతో వచ్చారు. శ్రీ ఇంద్రజీ బ్రహ్మచారి దగ్గర బస చేశారు. వారు ఆరోజులలో శ్రీహరిదేవ మందిరము యొక్క శ్రీరామానుజదాసు గారి శిష్యులైవుండిరి. నేను కూడా శ్రీరామానుజదాసుగారి దగ్గరికి వెళ్తుండేవాడిని. ఒకరోజున నేను శ్రీగిరిరాజ్ దర్శనం కోసమని వెళ్ళాను, అపుడు ఇంద్రజీ బ్రహ్మచారి అమ్మను శ్రీరామనుజ దాసుగారి దగ్గరికి దర్శనార్థం తీసుకుని వెళ్ళారు. అమ్మను చూడగానే వారు ఇలా అన్నారు, 'ఆహా! మీరు వచ్చేశారా! నేను చాలాసేపటి నుండి పంచసంస్కారముల కోసమని వేదిక తయారుచేసి మీ కోసము ఎదురు చూస్తూ కూర్చున్నాను - ఇదిగో ఇపుడు వస్తున్నారు అపుడు వస్తున్నారని!'

శ్రీరామానుజదాసుగారు శ్రీవైష్ణవ సంప్రదాయములో చాలా పేరెన్నికగన్న సంత్ మహాపురుషులు. వారు అమ్మతో ఇలా అన్నారు. 'నేను రాత్రి శ్రీశేషశాయి భగవాన్ శ్రీలక్ష్మీ నారాయణుడి అనుస్మృతిలో సంలగ్నమై వుండగా, అపుడు చూశాను, నీవు చాలా అత్యంత దీనురాలవై భగవంతుని శరణుజొచ్చావు, భగవంతుడు కళ్ళు తెరచి మిమ్మల్ని చూశారు, తర్వాత లక్ష్మీదేవికి కొంచెం సంకేతమునిచ్చారు. లక్ష్మీదేవి శ్రీభాష్యకారుడు శ్రీరామానుజాచార్యులవారి శ్రీ జీవుడిని ఉద్ధరించు అని ఆజ్ఞ ఇచ్చారు. ఆచార్యులు నాకు ఆజ్ఞఇచ్చారు. ఈ చేతనని ఉద్ధరించమని మరి నేను

శ్రీవైష్ణవదీక్ష కోసం అంతా ఏర్పాటు చేసుకుని మీ రాక కోసం ఎదురుచూస్తున్నాను' అన్నారు. మా తల్లిగారికి శ్రీవైష్ణవ సంస్కారము అన్నీ ఇచ్చారు. శంఖ చక్రాంకితములు వేశారు. శ్రీ నారాయణ మంత్ర దీక్ష ఇచ్చారు. భగీరథి అన్న వారి పేరు 'శ్రీభాగవతదాసి' అయింది. శ్రీగోవర్ధనము నుండి తిరిగి వచ్చాక ఈ సంగతి తెలిసి నాకు మనసులో కొంచెం ప్రసన్నత కలిగింది అని మాత్రం చెప్పలేను, ఎందుకంటే సంప్రదాయిక దురాగ్రహముల పట్ల ఒకరకమైన ఉదాసీనత నా మనసులో జాగృతమయినది.

ఈ ప్రసంగములో శ్రీరామానుజదాసుగారితో విన్న ఒక మంచి కథ స్మృతిపథంలో మెదులుతోంది. వారు ఇలాగ వినిపించారు. 'ఒకసారి శ్రీరామానుజాచార్యులవారు శ్రీరంగనాథ భగవానుల శ్రీవిగ్రహముపై తన చేతితో నిమరుతూ అలవందార్ స్తోత్రం పఠిస్తున్నారు. శ్రీవిగ్రహము యొక్క వీపు పైన ఒక గాయం వుండడము వారు చూశారు. వారు వ్యాకులులయ్యారు, కళ్ళ నుండి జలజల అశ్రువులు రాలాయి, చాలా బాధ కలిగింది వారికి. అపుడు భగవంతుడు అన్నాడు 'రామానుజా! ఈ వ్రణము నీ కారణంగానే అయింది. నీవు ఇతర మతవాదులను ఖండన చేయడానికి వాగ్బాణములను వదులుతావు కదా, అవి నా వీపుపైన గ్రుచ్చుకుంటున్నాయి. ఎందుకంటే నా వక్షఃస్థలముపై ధర్మము, వీపుపై అధర్మము వుంటుంది. ఇదే ఈ వ్రణము యొక్క రహస్యము.' అన్నారు. ఆ క్షణము నుండే శ్రీరామానుజాచార్యుల వారు అన్యమతవాదులను ఖండన చేయడం మానేశారు. భక్తి భావంతో పరిపూరిత మైన హృదయమంతో కేవలము శ్రీలక్ష్మీనారాయణ భగవానులనే నిరంతరం అనుసంధానము చెయ్యసాగారు'. నాకు వీరితో ఈ కథ విని చాలా ఆనందము కలిగింది.

నేను 'కల్యాణ్' పరివారములో వుండేటపుడు శ్రీభాయిజీ హనుమాన్ ప్రసాద్ పోదార్‌గారు నన్ను, మా తల్లిగారిని రెండు విషయములలో నిశ్చింతులను చేశారు. ఒకటి - తన పలుకుబడితో సహయోగములో మా కూతురు కమల పెళ్ళిని సంత్ సాహిత్యములో ప్రసిద్ధి కెక్కిన లేఖకుడు శ్రీపరశురామ చతుర్వేది వారి కుమారుడు శ్రీధనుంజయ చతుర్వేదితో చేయించారు. రెండవది - విశ్వంబరుడి (పుత్రుడు) చదువు కోసము చురు ఋషికులములో ఏర్పాటుచేశారు. దీని వలన మా తల్లిగారు నిశ్చింతగా

భగవద్భజన చేసుకోసాగారు. ఇక ఇంటి దగ్గర నడిచే సంస్కృత పాఠశాల విద్యార్థులను తన పుత్రులలాగ వాత్సల్యముతో చూసుకునేవారు. విద్యార్థులు కూడా అమ్మ అంటే చాలా శ్రద్ధ, ఆదరభావముతో వుండేవారు. విద్యార్థులకు వారు సదాచారము, శిష్టాచారము, భగవద్భజనను గురించి ఉపదేశించేవారు. వారి హృదయము దయతో నిండి వుండేది. అందరి పట్ల సద్భావనతో వుండేవారు.

42వ సం॥ము ఆరంభములో పండిత శ్రీ మదనమోహనమాలవ్య గారికి శ్రీమద్భాగవతము వినిపించిన తర్వాత జ్యోతీష్పీఠాధీశ్వరులు జగద్గురు శ్రీ శంకరా చార్యులు శ్రీ బ్రహ్మానంద సరస్వతి గారితో సన్యాస దీక్షతీసుకున్నాను, దండీస్వామినై మధ్యప్రదేశ్ వైపు వెళ్ళిపోయాను. దీనితో మా తల్లిగారి హృదయమునకు చాలా పెద్ద దెబ్బ తగిలినట్లయింది. ముందు అనుమతి అయితే ఇచ్చారు కానీ, ఇపుడు నేను ఇలా సన్యాసము తీసుకుంటానని వారు ఊహించలేదు. వారు చాలా దుఃఖితులై భాయిజీ శ్రీహనుమాన్ ప్రసాద్ పోదార్‌గారి దగ్గరకు వెళ్ళారు. వారు అమ్మకు చాలా నచ్చజెప్పారు. భాయిజీ అన్నారు 'ఒకవేళ వారు ఎవరైనా ఒక సాధారణ వ్యక్తి అయితే సన్యాసస్వీకారము చేస్తే మరల మనం బలవంతపెట్టి ప్రాయశ్చిత్తము ద్వారా మరల గృహస్థాశ్రమము లోకి తిరిగి తీసుకోవచ్చు, కానీ ఒకటి వీరు ఎంతో గొప్ప విద్వానులు ఇంకొకటేమిటంటే 'కల్యాణ్' (పత్రిక) ద్వారా వారి విద్య, రచనలు అన్నీ ఎంతో ప్రఖ్యాతి పొందినవి. ఇపుడు ఇక వారు ఒకవేళ గృహస్థాశ్రమములో తిరిగివస్తే వారికి ఎంత అప్రతిష్ఠ కలుగుతుంది!' అన్నారు. అప్రతిష్ఠ అన్న సంగతి వినగానే అమ్మ 'ఏ పని వలన తనకు అప్రతిష్ఠ కలుగుతుందో ఆపని చెయ్యమని నేను తనను ఎపుడూ బలవంతం చెయ్యను. వారు ఎక్కడ వున్నా, ఎలావున్నా, సుఖంగా వుండనీ', అన్నారు. తల్లి గారి ఆశీర్వాదము లభించింది. నేను సన్యాసము తీసకున్న తర్వాత మా తల్లిగారు అద్వైత వేదాంత విచారములు చేయసాగారు. గంగా తీరములో భ్రమణము చేస్తూ అటుగా వచ్చిన మహాత్ముల సత్సంగము చేస్తుండేవారు. భగవద్భక్తి అయితే మొదట నుండి వున్నదే వారిలో, ఇక సన్యాసము తీసుకున్న తర్వాత వారి మనసులో విశేషంగా వైరాగ్యముదయించింది, ఇంటి పనులలో కూడా ఇచ్ఛ తగ్గిపోయింది.

నేను శ్రీశ్రీ మా శ్రీఆనందయిమా వారి గాయత్రి కోటి యజ్ఞములో పాల్గొనడానికి కాశీ వెళ్ళాను అపుడు మా తల్లిగారు వచ్చి 'ఇక నేను ఇపుడు ఇల్లు-వాకిలి వదిలివేశాను. ఇక నాకు ఇపుడు ఎవరి యందు మమతలు మోహము లేదు. నా దగ్గర రూ.900లు మొత్తం వుండినది, అవి ఇంట్లోనే వదలివచ్చేశాను' అని అన్నారు. నేను వారికి నచ్చజెప్పాలని చాలా ప్రయత్నిస్తే వారు మీరు గృహత్యాగము చెయ్యగలిగినపుడు నేను ఎందుకు వదలలేను? నాకు ఏమీ వద్దు. భోజనం, బట్టలు ఏమీ వద్దు. నేను ఎవరికీ భారంగా వుండను. భగవంతుడు నా వెంట వున్నాడు, వారే నా బాధ్యత తీసుకుంటారు' అన్నారు.

ఆ యాత్రలోనే మా తల్లి గారు నాతో బృందావనము వచ్చారు. శ్రీఉడియా బాబాజీ ఆశ్రమములో వున్న 'మాతృ మండలి'లో వుంటు వచ్చారు. వారి రొట్టెలు, బట్టలు వీటి అభావం వారికి అపుడు కలుగలేదు. మా తల్లి గారు దగ్గరికి ఒక సింధీమాత బొంబాయి నుండి వస్తుండేవారు, ఆమె సింధీవారిలో కోటీశ్వరుడైన భాయి కిశన్‌చంద్ చేలారామ్‌కు శ్రీలక్ష్మీసేవక్ రామ్‌తో చెప్పి నెలకు రూ.150లు వచ్చేలాగ ఏర్పాటు చేశారు. డబ్బు సమయానికి సరిగా వస్తూనే వుండేది కానీ, అమ్మ వాటినెపుడూ స్వీకరించనేలేదు, ఇక తన కోసం వాడుకోపడమన్న ప్రశ్నయే లేదు, రెండు పూటలా కథా ప్రవచనాలు శ్రవణము చేసేవారు, కొంచెము వ్రాస్తుండేవారు. వారు వ్రాసినది జనానాకి చాలా నచ్చింది, చాలా మంది ప్రశంసిస్తూ వాటిని ప్రచురించమని కూడా అనేవారు.

నేను బొంబాయికి వెళ్ళి వస్తున్నపుడు మా తల్లిగారు నాతో రాసాగారు. స్వామి ప్రేమపురీజీ మమరాజ్ వారు తనను చాలా ఆదరించేవారు. వారు ఆశ్రమము దగ్గరలోనే వున్న శ్రీరుక్మిణీదాస్ అసియామల్ వారి ఇంట్లో బసచేసేవారు. వారు చాలా ప్రేమతో సపరివార పమేతంగా వారిని సేవించేవారు.

మా తల్లిగారికి కంట్లో శుక్లం వచ్చింది. బొంబాయిలోని సుప్రసిద్ధ నేత్రవైద్యులు బాణాజీ ఆపరేషన్ చేశారు. అమ్మకు నొప్పి, అసౌకర్యము కానీ ఏమీ కలుగలేదు. వారు శాంతచిత్తులై వుండిరి. 'ఎలా వుంది? ఏదైనా బాధగా వున్నదా?' అని అక్కడ జనం అడిగితే 'కష్టము అన్నది నన్ను స్పర్శించలేదు, కష్టము అన్నదానికి అస్తిత్వమే

లేదు. సత్తాయే లేదు' అనేవారు. 5, 6 రోజులలోనే వారి కళ్ళు బాగయినవి. చదవడం కూడా మొదలెట్టారు. కళ్ళద్దాలు అవసరం కూడా లేకపోయింది. వారు ఎల్ల వేళల ప్రసన్నంగా వుండేవారు. వారు చాలా సరళ చిత్తులు. ఏ విధమైన కల్లా కపటము, ఎత్తుగడలు ఇలాంటివి వారిని స్పర్శించలేకపోయేవి. ప్రేమపురీజీ మహరాజ్ వారు అమ్మను తనతో పాటు సమానంగా కూర్చోబెట్టుకునేవారు. శ్రీహరిబాబాజీ మహరాజ్ వారు కూడా మా తల్లి గారిని చాలా ఆదరించేవారు. ఒకసారి శ్రీహరిబాబాజీ మహరాజ్ వారు శ్రీధరటీకా సహితముగా పూర్తి భాగవతము 11 1/2 నెలలు వరకు నాతో శ్రవణము చేశారు. మా అమ్మగారు కూడా వారితోపాటు కూర్చుని శ్రవణం చేశారు. అమ్మను ఎవరో ఇలా అడిగారు 'మరణానంతరము మీరు ఎక్కడికి వెళతారు?' వారు వెంటనే ఇలా జవాబిచ్చారు 'రావడం పోవడం ఎక్కడుంది?' ఆత్మ బ్రహ్మ, బ్రహ్మతరిక్తమయినది మరొకటి లేదు'.

ఒక్కొక్కసారి మా తల్లిగారు నాతో ఇలా అంటుండేవారు 'శరీరము వదిలిన తర్వాత నా అంత్యక్రియలు ఇవన్నీ ఎవరికీ చెయ్యనవసరము లేకుండా వుంటుంది. అందుకని నాకు సన్యాసము ఇవ్వు. అపుడు మీకు నన్ను గురించి చింతించే పని వుండదు. శరీరమును ఎవరో ఒకరు ఎత్తి యమునానదిలో పడవేస్తారు' అని అనేవారు. నేను వారికి ఎంతో నచ్చజెప్పడానికి ప్రయత్నించాను, 'స్త్రీ శరీరమునకు సన్యాసము సరికాదు' అని. కానీ వారు ముందుగానే చాలా మంది సన్యాసినులైనా మహాత్ములతో కలసి వున్నారు. జునా అఖాడాలో స్త్రీలకు కూడా సన్యాసమిస్తారు. అందుకని వారు తన పట్టుదల వదలలేదు. 'నేను స్త్రీని కాదు, పురుషడిని కాదు, బ్రహ్మని కాదు, శూద్ర కాదు, అన్ని బంధనలు, విధి నిషేదములు అజ్ఞాని కోసమే వున్నాయి. అజ్ఞానముతోనే కల్పితములు. నాకయితే కేవలము పారివారిక సంబంధములను విచ్ఛేదము చెయ్యాలి, దానితో నా అంత్యేష్టి భారము ఎవరిపైన పడదు' అని అన్నారు. వారి జ్ఞానము ఎంత పరిపక్వమయినదంటే ఇక నేను వారి ఇష్టాన్ని కాదనలేకపోయాను. కాషాయవస్త్రములు ఇచ్చి వారి పేరు 'బ్రహ్మమయి మా' అని పెట్టాను. నా జ్ఞానము పట్ల, భగవత్ప్రాప్తి యందు వారికి మొదటి నుండి శ్రద్ధ వుండనే వుంది, ఇక ఇపుడు వారు నన్ను విధిపూర్వకముగా గురువగా అంగీకరించారు.

వారు ఎపుడైతే కాశీలో ఇల్లు వదలి వచ్చారో, దాని తర్వాత వారు ఇంటి సంగతులు, కుటుంబం సంగతులు వీని చర్చ వదలివేశారు. ఎపుడైనా ఎవరైనా వచ్చి నమస్కరిస్తే ఆశీర్వదించేవారు. ఎవరైనా సరే చాలా ప్రేమగా చూచుకునేవారు. కళ్ళల్లో సౌమ్యత చెదిరేదికాదు. మధురమైన స్వరంతో మాట్లాడేవారు. తలపైన, వీపుపైన చెయ్యి వుంచి ఆప్యాయంగా నిమిరేవారు. ఇంటి నుండి వచ్చాక వారు మరి ఇక ఏ తీర్థయాత్రలు చెయ్యలేదు. గంగా, యమునా నదులలో స్నానం చెయ్యాలన్న శ్రద్ధ, ఇష్టము పోయింది. మందిరము, మూర్తి వీటి పట్ల కూడా ఆసక్తి పోయింది. ఎవరైనా రాజనీతి సబంధమైన, ప్రాపంచిక చర్చలు మొదలు పెడితే ఒద్దనే వారు, స్వయంగా తానే ఏవో (భగవత్సంబంధమైన) మాట్లాడేవారు. శృంగారరస చర్చ అయితే అసలే ఇష్టముండేది కాదు. గీత చదివేవారు, రామాయణము, భాగవతము శ్రవణము చేశేవారు. ఎవరైనా వచ్చి దగ్గర కూర్చుంటే వేదాంత సంబంధమైన మాటలు మాట్లాడేవారు. ఇంటి దగ్గర నుండి వచ్చాక ఎప్పుడూ జబ్బుపడలేదు. కళ్ళ ఆపరేషను కోసము తప్ప మరి ఇక ఎపుడూ డాక్టరు, వైద్యుల అవసరం లేకపోయింది. అతి సాధారణమైన బట్టలే వేసుకునేవారు. ఎపుడు మంచి ఖరీదైన వస్త్రాలు వేసుకునేవారు కాదు. శిరసును పూర్తిగా ముండనం చేయించు కున్నారు. శ్రీఉడియాబాబాజీ, శ్రీహరిబాబాజీ వారి సత్సంగములో వెళ్ళి కూర్చునేవారు. సిద్ధ చమత్కారములలో వారికి ఎపుడూ శ్రద్ధ వుండేది కాదు. 'ఆత్మయే బ్రహ్మ' అదే వారి నిష్ఠ, అదే ఇతరులకు తెలియజెప్పేవారు. ఏకాంతము దొరికినపుడు ఏదైనా వ్రాస్తువుండేవారు. బహుశా వారు స్వహస్తములతో వ్రాసినది విశ్వంభరుడి (పుత్రుడి) దగ్గర వున్నట్లున్నాయి. వారి లేఖినిలో అష్టావక్ర గీత యొక్క ప్రభావము చాలా వుండేది. వారు ప్రక్రియా బేధములో ఎప్పుడూ పడలేదు. వాద వివాదములు ఎవ్వరితోనూ చేశేవారు కాదు. అతి తక్కువగా మాట్లాడేవారు. అన్ని రకాల పరిస్థితులలోను ప్రసన్నంగా వుండేవారు. ఏదో దొరికింది తిని వుండేవారు. తనకు కట్టుకోవడానికి, కప్పుకోవడానికి కూడా ఎప్పుడు ఎవరిని ఏమీ అడిగేవారు కాదు. వారు అనేవారు 'పళ్ళు విరిగిపోతే ఏమయింది? కొంచెం సేపు నోట్లో పెట్టుకుంటే అవే మెత్తగా అవుతాయి రుచిగానూ వుంటాయి' శరీరాన్ని సంబాళించుకోవడానికి

తన వైపు నుండి తను ఏమీ సావధానత తీసుకునేవారు కాదు, ఈ సంగతి వారిని చూస్తేనే తెలిసియోయేది. వారికి దేహభావమన్నది ఒకరకంగా పోయిందనే చెప్పాలి.

సాధానాభ్యాసములో కూడా ఏవిధమైన పట్టుదల వుండేది కాదు. మేము మోకల్‌పూర్ బాబాగారి దగ్గరికి వెళ్ళేటప్పుడే బాబా గారి దగ్గర 'ఏమీ చెయ్యకనే ఇంత పెద్ద ప్రపంచం కన్పిస్తువుంది, ఇక ఏమైనా చేస్తే ఇది ఇంకా పెరుగుతుంది కానీ, తరుగదు' అని వింటుండేవారము. నేను కూడా బృందావన సత్సంగములో సాధారణంగా ఇలాగే చెబుతుండేవాడిని, అభ్యాసజన్యమైన వృత్తి ఆత్మను కర్త లేక వృత్తిమాన్‌గా చేస్తుంది. నిస్సంకల్పత! లేదా ఏమీ అభ్యాసము చెయ్యకపోవడమే అన్నిటికంటె పెద్ద అభ్యాసము' మా తల్లిగారి బుద్ధిలో ఈ మాట నిశ్చయంగా పూర్ణరూపేణ దృఢమయిపోయింది. ప్రాపంచిక చర్చ వస్తే వెంటనే 'ప్రపంచం ఎక్క వున్నది' అని అనేవారు.

బృందావనములో శ్రీఉడియాబాబా వారి నిర్వాణదిన ఉపలక్ష్యములో ఉత్సవము జరుగుతువుండినది. స్వామి ప్రజ్ఞానందజీ శ్రీమద్భాగవత సప్తాహము చేస్తువుండిరి. ఏదో కారణము వలన అకస్మాత్తుగా వారు కథ మధ్యలోనే విడిచి వెళ్ళిపోయారు. విశ్వంభరుడు అక్కడికి వచ్చివుండెను. వారిని సప్తాహ వక్తలుగా కూర్చోబెట్టారు. మాతల్లిగారు సప్తాహము మొత్తము శ్రవణము చేశారు. బంఢారా రోజు ఉదయము శ్రీ స్వామి ఓంకారానందజీతో వారు ఇలా అన్నారు 'ఈ రోజు కలలో శ్రీఉడియాబాబాజీ దర్శనము కలిగింది. వారు నన్ను తనతో రమ్మని చెప్పారు. నేను కూడా చాలు ఇక నాకు ఇక్కడ ఏమీ పనిలేదు అని అన్నాను'. ఆ రోజుననే భండారా తర్వాత బయటి నుండి వచ్చిన వారందరితోనూ కలసి మాట్లాడి మధ్యాహ్నాము ఒంటిగంటకు తన ఆసనముపైన పడుకున్నారు. 3 గంటలకు ఎవరోచూశారు మాతాజీ గారికి శ్వాస అందడం లేదని. నేను వెళ్ళి చూశాను ఒక చెయ్యి తల క్రింద పెట్టుకుని వున్నారు. ఒక చెయ్యి నడుము పైన పెట్టుకుని ఒడ్డిగిల పడుకున్నారు. ఏవిధమైన కష్టము కలగకుండా ఏ విధమైన వ్యాకులపాటు లేకుండా శాంతంగా ప్రాణము పోయిందని అనిపిస్తోంది వారిని చూస్తుంటే. వాయువు

వాయువుతో ఏకమయ్యే వుంటుంది. కేవలము బల్బు ఫ్యూజు పోయింది, దేహ సంబంధము విడిపోయింది. చేతనాత్మ ఎపుడూ సర్వదా శుద్ధ బుద్ధ ముక్త అద్వితీయ బ్రహ్మమే. శరీరము యమునలో ప్రవాహితము చేశారు. తాబేళ్ళకు భండారా (విందు) జరిగింది. వారి పౌత్రులు విశ్వంభరనాథ్ ద్వివేది తమ వూరు వెళ్ళి విధి పూర్వకముగా శ్రార్థము, బ్రాహ్మణ భోజనము చేయించారు. మా తల్లిగారి శ్రద్ధాళువులైన భక్తుల సంఖ్య ఆసమయములో అక్కడ చాలానే వుండేది, ఇపుడు కూడా వున్నది.

✵

శ్రీ లక్ష్మీపతి సింహానియా
(కొన్ని సంస్మరణలు)

శ్రీ లక్ష్మీపతి సింహానియా వారి తల్లి గారు నన్ను తన నాలుగవ పుత్రుడిగా స్వీకరించారు. నేను వారిని 'మాజీ' అనేవాడిని. వారు నన్ను తమ పుత్రుడిలాగ ప్రేమించేవారు. వారే తమ కుటుంబమునంతా నాకు పరిచయము చేశారు. కొందరికి మంత్రదీక్ష ప్రక్రియలో శిక్షణ యిప్పించారు. వారి కారణంగానే నేను కాన్పూర్ గంగా కుటీరమునకు, బొంబాయిలోని సింహానియా హవుస్‌కి మరియు కలకత్తాలోని జె.కె.హవుస్‌కి మాటి మాటికీ వెళ్ళవలసి వచ్చేది.

మాతాజీ వారి కనిష్ఠ పుత్రడు శ్రీలక్ష్మీపతి సింహానియా చాలా సజ్జనుడు, సౌమ్యుడు, మరియు సరళమైన వ్యక్తి. అహంకారమన్నది వారిని స్పర్శించలేదు. ఎక్కువగా మాట్లాడేవారు కాదు. గట్టిగా ఎపుడూ స్వరం హెచ్చించి మాట్లాడేవారు కాదు. ఎదుటి వ్యక్తి వినగలిగినంతనే మాట్లాడేవారు. సదాచారములో వారికి చాలా నిష్ఠ. భగవంతుడంటే నమ్మకం శ్రద్ధ. వ్యాపార కళలో నిపుణులు. ఉత్సాహవంతులు, పౌరుష పక్షపాతి. అంతేకాక తన తల్లిదండ్రులు, పెద్దన్నయ్యలు వీరి పట్ల శ్రద్ధ మరియు ఆదరభావము కలిగి వుండేవారు. వారినోటి వెంట ఎపుడూ ఎవరి కోసము కూడా నిష్ఠూర వచనము వినలేదు. చాలా కోమలముగా వ్యవహరించేవారు.

ఒకసారి 'గురుపూర్ణిమ' సమయంలో పంపిన కార్డులో 'అయం మే హస్తో భగవాన్' ఋగ్వేద మంత్రము ప్రకాశితమయినది. దీని అర్థము - నా చెయ్యి ఈశ్వరుడు. వారు నాకు ఉత్తరము వ్రాసి పూర్తి సూక్తము తెప్పించుకున్నారు. సంపూర్ణ

కల్యాణమునకు (ప్రగతి) కల్యాణకరము మన హస్తము, ఇది ఒక శవమును కూడా జీవింపజెయ్యగలదు. అని అందులో ప్రతిపాదన చెయ్యబడివుంది.

ఒకసారి సోదరుడు లక్ష్మీపతితో సత్సంగము జరుగుతువుండినది. మనుష్యుని జీవితములో సద్గుణముల వృద్ధి ఎలా కలుగుతుంది? దీనిపై నేను వారికి శ్రీమద్భాగవతములోని ఈ శ్లోకము వ్రాసి పంపాను.

ఆగమోஉపః ప్రజా దేశః కాలః కర్మ చ జన్మ చ ।
ధ్యానం మంత్రోஉథ సంస్కారో దశైతే గుణమేతవః ॥ (శ్రీమద్భాగవతం 11-13-4)

ఈ శ్లోకము యొక్క అర్థము వారికి చాలా నచ్చింది అది ఈ ప్రకారముగా వుంటుంది.

మనిషి జీవితంలో సత్వగుణము, రజోగుణము లేక తమోగునము వీటియొక్క ప్రకాశము వికాసము, వృద్ధి సమృద్ధి కొరకు పది మాటలపై ధ్యానముంచడము అవసరము. ఒక వేళ అవి సాత్వికమయితే జీవితములో సద్గుణముల వికాసము కలుగుతుంది. ఆ పది విషయములు ఈ విధంగా వున్నాయి-

1. మీరు ఏమి అధ్యయయనము చేస్తుంటారు? హృదయమును పవిత్రము చేసే ఉపనిషత్తులు, గీతా, భాగవత, రామాయణము మొదలైన గ్రంథములా? లేక భోగవిలాస ధనోపార్జనకు సంబంధించిన పుస్తకాలా? లేక భూత ప్రేత, చోర్ డాకూల కాల్పనిక గ్రంథాలా? అవినీతి, చలాకీ, మంత్రతంత్రాలు, కుసంస్కారములను కలిగించే సినిమా కథలా? మన జీవితములను తమవైపు ఆకర్షించుకునేవి ఈ పుస్తకాలే.

2. మీరు ఎటువంటి నీరు త్రాగుతారు? స్నాన, భోజన, పానాదులలో ఏ నీరు వాడతారు? భగవంతుడి చరణామృతము, పవిత్రనది, ఏటి నీరు, ఫలరసాలు, కూరలరసాలు, లేదా మధ్యమా? మీరు జల ప్రభావము నుండి ముక్తులవలేరు.

3. మీరు ఎటువంటి వారితో కలవాలను కుంటారు? ఎటువంటి వారితో వుండటానికి ఇష్టపడతారు? మీరు ఎటువంటి వారితో వుంటే, పెద్దలను సేవిస్తే, ఎలాగ కావాలనుకుంటే అలాగ అవుతారు.

4. మీకు మనసులో ఎటువంటి ప్రదేశము ఇష్టమవుతుంది? నదీతీరం, పర్వతప్రదేశాలు, పచ్చని వనాలు, తీర్థస్థానములు, మందిరములు, సంత్ మహాత్ముల నివాస స్థానములు, లేదా ఎక్కడ సత్సంగము జరుగుతువుంటుందో అటువంటి ప్రదేశములా? మీరు స్వయంగా మీ అభిరుచిని పరీక్షించుకోండి. చూసుకోండి. మీరు అలాగే అవుతారు.

5. మీరు మీ సమయమును ఎలాగ గడుపుతారు? నిద్ర, సోమరిగా, అజాగ్రత్తగా, పనీపాటా లేకుండానా? అలాగయితే పురుషప్రయత్నంతో మీరు వంచితులయినట్లే. పని చేసినా కూడా అర్థలోలుపత, భోగలిప్స కోసము చేస్తారా? అలాగయితే మీ జీవితములో విక్షేపము వృద్ధి అవుతుందన్న మాట నిశ్చయము. మీరు మీ జీవితపు అమూల్య క్షణములలో ఎంత భాగము సత్యచింతనము, ఏకాగ్రత, భగవద్భక్తి మరియు లోకహితం కోసం ఖర్చు చేస్తున్నారు. మీ ఒక్క క్షణములో మీ జీవితమును స్వర్గమో, నరకమో చెయ్యగల సామర్థ్యము వుంటుంది.

6. మీకు ఏమి చెయ్యడము ఇష్టము? చోరీ, జారీ, హింస, పక్షపాతం ఇవి మోహ ప్రేరితములు వీటి నుండి మనలను మనము రక్షించుకోవాలి. స్వయంగా కష్టాన్ని సహించి అయినా ఇతరులకు హితము కొరకు ప్రయత్నిస్తున్నావా? లేదా? మనం చేసేపని బయటికి ఎంతచిన్నదయినా దాని ప్రభావము చాలా వ్యాపకము అవుతుంది. అది ఇతరులకు తెలియకపోతే పోనీ, కానీ మీ అంతఃకరణ ఆ ప్రభావం నుండి తప్పుకోలేదు. ప్రతి పనికి ఒక ప్రతిక్రియ వుంటుంది. మన ప్రతి అంగాంగ ప్రత్యంగముపై కూడా వుంటుంది. కర్మ ఫలము బహిరంగ వస్తువును ఉత్పన్నము చెయ్యదు, అంతరంగ నిర్మాణము చేసినా ముందు ఈ విషయం గంభీరంగా ఆలోచించడండి దీని వలన నా అలవాట్లు మంచివవుతాయా? పాడవుతాయా? అని. దేని వలననయినా ఎవరికయినా అహితము కలిగేట్లుంటే, లేదా మన అలవాట్లు చెడిపోయేట్లుంటే అటువంటి పని ఎప్పుడూ చెయ్యరాదు.

7. మీరు ఏ వంశంలో పుట్టారో అన్నది గౌణము (ముఖ్యముకాదు) అందుకని శరీరము యొక్క జన్మదాత శిక్షకుడు గురువు అవుతాడు. ఉత్తమ వంశపరంపర,

దోషానయనము, గుణాధానరూపమైన సంస్కారములు, సదాచారపాలన ఈ మూడు మన జీవనమును తీర్చిదిద్దుతాయి. జీవితం సదాచారత వుండడమే నిజమైన జీవితము. మీరు మీ బుద్ధి అనే త్రాసులో తూకంవేసుకుని చూడండి - మీ ఈ జన్మ మీ ఆచరణ వలన కులీనమా కాదా అని!

8. మీ చింతన ఏ దిశలో సాగుతుంది? మేల్కొనగానే, ఏకాంతములో కూర్చు న్నప్పుడు, పడుకునే ముందు, మీరు మీ మనసులో ఏమి ఆలోచిస్తుంటారు? ఆత్మ చింతన, లోక కల్యాణము, లేదా శరీరము, భోగ, రోగ, రాగ యోగములా? జాగ్రత్త! ఒకవేళ మీ చింతన దిశ అనుచితమయితే, అశుద్ధమయితే మీరు ఎందుకూ పనికిరాని వారవుతారు. మనిషి యొక్క వాస్తవిక చింతనయే తన నిజమైన జీవనమవుతుంది.

ఏదో ఎవరి మనసునో తెలుసుకోలేము అది మాత్రం నిశ్చయము. మీ మనసులోని మాట ఇతరులు తెలుసుకోలేరు. ఇతరులు మనసులోని మాట మీరు తెలుసుకోలేరు. అందువలన ఈ ప్రపంచములో మీరు మీ వాక్కు మీ వ్యవహారం, మీ శరీరమును మీ పవిత్ర చింతనను అనుగమించేలా చేసుకోండి. ఇతరుల చెడును గురించి ఆలోచించడము, మనలను మనం చెడుపుకోడమే. మీ ధ్యానము చెడ్డదయితే మీరు చెడ్డవారు. మీ ధ్యానము మంచిదయితే మీరు మంచివారు.

9. మీరు ఏదైనా పథకం వేసుకున్నపుడు (ప్లాన్) ఏ లక్ష్యముతో చేస్తారు? మీ సంకల్పము, పథకం వీటి ఉద్దేశ్యము ఏమిటి? మీరు ఏ మంత్రమును జపిస్తారు? హృదయమును పవిత్రము చేసే మంత్రములా అవి సంయమము, భగవత్ప్రేమ, పరమాత్మ చింతనతో నిండివుంటాయి. భూత భైరవ మంత్రములు ఇతరులకు అహితమును కలిగిస్తాయి. అటువంటివి మన జీవితములను చెడు అనే అగాధములోనికి తోసివేస్తాయి.

10. ప్రకృతి యొక్క గుణదోషము అనాది, అనంతములు, చిత్తవృత్తి అనే నది - అంతర్ముఖతా, బహిర్ముఖతా అని రెండు వైపులా ప్రవహిస్తుంటుంది. అందులో ఒకోసారి విషం ప్రవహిస్తుంది. ఒక్కోసారి అమృతం ప్రవహిస్తుంది. ఒక్కోసారి శాంతి,

కరుణ! మరోసారి ఈర్ష్య, ద్వేషములు! వీటితో చాలా జాగ్రత్తగా వుండాల్సిన మెట్లు ఇవి. మీరు మిమ్ములను ఉత్తమమైన విచారధారలో వేసుకోండి. ఒకసారి మునగడం, ఒకోసారి తేలడం! ఒకోసారి అటుఇటు అవుతారు. కానీ ఉత్తమధారని మాత్రము ఎపుడూ వదలకండి' అది కేవలము బాహ్య జీవితమునే సంస్కరించి, అలంక రించడము కాక అంతరంగజీవితమును కూడా అమృతమయము చేస్తుంది. కొద్ది రోజులలోనే మీరు స్వయంగా ఆశ్చర్య చకితులవుతారు, మీ జీవితం ఎంతో మధురము, సరసము, సౌరభమయము, సుకుమారము మరియు సంగీతమయము ఎలాగయినదా? అని. మీరు అమృత పుత్రులు, అమృతస్వరూపులు అవడానికి, అమృతత్త్వమై వుండడములోనే జీవిత సాఫల్యమున్నది.

భాయి లక్ష్మీపతికి ఈ ప్రసంగము ఎంతగా నచ్చిందంటే దీనిని ప్రచురించి అందరికీ పంచిపెట్టండి అని చెప్పారు.

ఒకసారి 'మాజీ' నన్ను కలకత్తా తీసుకువెళ్ళారు. భాయి లక్ష్మీపతి అన్నారు 'నేను ఆఫీసులో పని చేసేటపుడు, కొంచెం పరిశ్రమకే అలసిపోతుంటాను' అపుడు నేను వారికి ఒక ప్రక్రియ తెలిపాను అది ఉపనిషత్తుల్లో మహాభారతములో వున్నది. అది ఏమిటంటే - మధ్య మధ్యలో ఒకటి, రెండు నిమిషాల కొరకు నోరు మూసుకునేది. పళ్ళు ఒక దానినొకటి అంటుకోకూడదు. నాలుక పైన, క్రింద ఎక్కడా తగల కూడదు. ఎలాగున్నదలాగే వుండాలి. ఒక నిమిషముకూడా అలా చేస్తే అలసట తీరిపోతుంది. మనసుకు విశ్రాంతి దొరుకుతుంది. వారు అలాగే చేశారు. వారికి చాలా బాగా అయిందని కూడా చెప్పారు. అసలు ఏమిటంటే నాలుక నిష్క్రియమైపోతే, ఏదీ శబ్దము ఉచ్చరించము. శబ్దం ఉచ్చరించపోతే మనసు యొక్క పరుగులాట ఆగిపోతుంది. ఒక నిమిషము కోసము మనసు పరుగులు ఆగాయంటే చాలు చాలా విశ్రాంతి దొరుకుతుంది. ఒకవేళ అలా చెయ్యలేకపోతే, కళ్ళు ఎలాగుంటే అలాగ స్థిరము చెయ్యడము, కనుగ్రుడ్లు పైకి, క్రిందికి, ప్రక్కలకు ఎక్కడికి తిరగకుండా స్థిరం చెయ్యండి. అలాగని బలం ఉపయోగించవద్దు. క్షణమాత్రం మీ మనసు అన్ని రకాల ఒత్తిడుల నుండి ముక్తమవుతుంది. చాలా విశ్రాంతి దొరుకుతుంది.

ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. కానీ ఇప్పటికీ వారు సౌమ్య, శాంత, సౌజన్యపూర్ణమైన జీవనము, మధురమయిన వాక్కు, అపుడపుడు హృదయ ఫలకముపైన మెరిసిపోతాయి. వారి కుటుంబ సభ్యులలో కూడా వారి సద్గుణములు, సదాచారము యొక్క ప్రకాశ వికాసములు కలగాలని భగవంతుని ప్రార్థిస్తున్నాను.

దాదా లోకుమల్

దాదా లోకుమల్ జీవితంలో ఏ విధమైన కృత్రిమత వుండేది కాదు. వారి వ్యవహారము సద్భావపూర్వముగా, సహజముగా వుండేది. మాటలు తియ్యన. వినయవంతుడు అవసరమయితేనే మాట్లాడేవారు. ఒకసారి ఎవరినైనా కలిశాడంటే వారి హృదయంపై చెరగని ముద్ర పడేది. ఒక్కసారైనా ఎవరితో మాట్లాడుతారో, వారికి బంధువుల్లాగ అయిపోయేవారు. ఉదార హృదయులు, అవసరాన్ని మించి దానం చేస్తుండేవారు. స్వామి శ్రీప్రేమ్‌పురీజీ మహరాజ్ పట్ల విశేషమైన శ్రద్ధ, సేవాభావం వుండేది. వారిని అన్ని క్షేత్రాలకు యాత్ర చేయించారు. వారింట్లో ఎప్పుడూ మహాత్ముల సంగతి వుంటూ వుంటుడేవి. ప్రవచనముల కొరకు మంచి వ్యవస్థచేశారు. ఇప్పటి వరకు వారి శివాజీ పార్క్ ఇంట్లో నడుస్తూనే వుంటుంది. ముంబాదేవి ఇంట్లో కూడా వారు శ్రీమద్భాగవతము శ్రవణము చేశారు. వారు తయారు చేయించిన పండాల్‌లో 5వేల మంది వరకు జనం కూర్చోగలిగేవారు.

స్వామి ప్రేమపురీజీ మహరాజ్‌వారు బ్రహ్మలీనులయ్యాక వారి స్మృతిలో లోకహిత కుటీరము నిర్మించారు, అందులో ఈనాటి వరకు ప్రతిరోజు సత్సంగము జరుగుతుంది. స్వామి ప్రేమపురీజీ పేరుతో ఒక పూజాగృహం కూడా వున్నది.

వారు చాలా నిరుపేదలని చెబుతుండేవారు. వారి దగ్గర డబ్బేమీ లేకుండెడిది. వారు ఎవరైనా ఒక దుకాణదారుడితో ప్రొద్దున్నే కొన్ని బట్టలు తీసుకుని ఎక్కడైనా ఒక చాపపరుచుకుని కూర్చునేవాడు. సాయంకాలం వరకు ఎన్ని బట్టలు అమ్మితే మిగిలినవి దుకాణదారుడి దగ్గర పెట్టి అమ్మినవాటికి డబ్బు చెల్లించేవాడు. బతుకు గడిచిపోయేది.

మెల్లమెల్లగా వారు వృద్ధిలోకి వచ్చారు వ్యాపారులతో పరిచయం పెరిగింది. అరబ్ దేశాలకు వెళ్ళి వస్తువుండేవారు. భగవద్భజన చేసుకుంటూ, విశ్వాసంతో తన పని తను చేసుకునేవాడు. దృఢ నిశ్చయం వుంది. మనసులో సహిష్ణుత వుంది. వారి తత్పరత, ఉత్సాహము ఇవన్నీ వారికి మంచి చేశాయి. వారు లక్షలకధికారి అయ్యారు.

అన్నిటికంటే విశేషత ఏమిటంటే వారు మానాపమానాలవైపు ధ్యానం పెట్టకుండా అందరితో వినయంగా మధురంగా వ్యవహరించేవారు. అందరికి మంచి చెయ్యడానికే ప్రయత్నించేవారు.

శ్రీఉడియా బాబాజీ వారి మాటలలో 'ఎవరిలో ఓర్చుకునే శక్తి వుంటుందో, వారిలో అన్ని సిద్ధులు స్వాభావికముగానే వుంటాయి'.

భాయిజీ శ్రీ హనుమాన్ ప్రసాద్ పోదార్

అద్భుత వినయ శీలత -

డెహరాడూన్ దగ్గర వున్న కిషన్‌పూర్‌లో శ్రీశ్రీఆనందమయిమా యొక్క 'మాతృశరణమ్' ఆశ్రమములో ఒక పెద్ద ఉత్సవము ఏర్పాటుచేశారు. ఆ సమయంలో వున్న గొప్ప గొప్ప మహాత్ములంతా అక్కడికి వచ్చారు, శ్రీహరిబాబాజీ, శ్రీకృష్ణానందజీ, శ్రీచక్రపాణిజీ, మొదలైన వారంతా వచ్చారు. సత్సంగములో శ్రీహరిబాబాజీ మాతాజీ పట్ల తమ శ్రద్ధను వ్యక్తము చేస్తువుండిరి. వారన్నారు 'స్వామి పరమానందజీ మాతాజీ యొక్క శీలస్వభావములు స్నేహము, వారి విలక్షణ స్థితిని గురించి ఏమైతే చెప్పారో, దానితో నా హృదయములో ఒక నిశ్చయము కలిగినది మాతాజీ జీవన్ముక్త మహాత్మ అని! వారి నోటి వెంట ఈ మాట వినగానే శ్రీఅభయబ్రహ్మచారి లేచి నిల్చుని అన్నారు 'బాబా! మీరేం చెబుతున్నారు? సాక్షాత్ జగజ్జనని జగదంబ మా వారిని మీరు ఒక జీవన్ముక్త మనుష్యులంటున్నారా? ఇది మాతాజీ పట్ల ఒకరకమైన అనాదరణ భావమే అవుతుంది.' శ్రీహరిబాబాజీ నిండు సభలో సాష్టాంగదండవత్ చేసి క్షమించమన్నారు' భయ్యా నేను సహజ స్వభావముతో నా హృదయములోని భావన బయటపెట్టాను. దీనివలన ఒకవేళ మాతాజీకి అనాదరము, అగౌరవము కలిగిందనుకుంటే లేక మీకు దుఃఖము కలిగించివుంటే దానికి నేను క్షమించమని వేడుకుంటున్నాను'.

బాబాగారి ఈ వినయము చూసి సభమొత్తం చకితమైపోయింది. ఈ ప్రసంగమును నేను ఎందుకు ఉల్లేఖిస్తున్నానంటే ఏ మహాత్ముడికైనా అనేక మంది భక్తులున్నపుడు, తమ శ్రద్ధాస్పదుల యెడల వివిధ భావములు పెట్టుకుంటారు, దానిని గురించి వ్రాయడం, ఏదైనా చెప్పడం చాలా కష్టం. ఆ మాట కొందరికి

అనుకూలము అవచ్చు కొందరికి ప్రతికూలము అవచ్చు. కొందరు విని, తెలుసుకుని ప్రసన్నులు కావచ్చు, అప్రసన్నులు కావచ్చు.

భాయిజీ హనుమాన్ ప్రసాద్‌జీ విషయంలో కూడా ఇదే మాట. దేశ విదేశాలలో వారి భక్తులు వ్యాపించివున్నారు. కొందరు వారిని సాక్షాత్తు శ్రీరాధారాణి అని నమ్ముతారు, కొందరు గోపి భావం అని అనుకుంటారు. కొందరు ఆప్త పురుషుడు అని విశ్వసిస్తారు. కొందరు భగవద్భక్తుడని అంటారు. అందువలన వారిని గురించి ఏమైనా చెప్పాలంటే ఎక్కడైన ఎవరికైనా కష్టము కలిగించుతామేమో అని అనిపిస్తుంది. నేను వారిని ఎల్లపుడు నా సోదరుడిగా మనుష్య రూపంలోనే చూశాను. అందుకని నేను వేరే భావకులలాగ వారి విషయంలో ఏమీ చెప్పను. శ్రీహరిబాబాజీ యొక్క వినయశీలత, క్షమ-ప్రార్థన ఉదహరించడానికి కారణము ఇదే.

ఆచార్యుల యెడల నిరాశ -

నా పూర్వ పురుషులు తరాల నుండి నిష్ఠావంతులైన సనాతన ధర్ములుగా వుండిరి. వారిని ధర్మ నిర్ణయములో ప్రమాణముగా ఎంచేవారు. నా గురువుగారు శ్రీరామభవనోపాధ్యాయుడు సనాతన ధర్మము యొక్క మర్మజ్ఞుడు, ఆచారణశీలుడు కూడా అందుకని సహజంగానే నేను కూడా వేదశాస్త్రము, సనాతన ధర్మము మరియు భగవంతుని యందును నిష్ఠ కలవాడినయ్యాను. ఆ రోజులలోనే కాశీలోని అగస్త్య కుండం దగ్గర నైమిషారణ్యములో బ్రాహ్మణ మహాసమ్మేళనము ఏర్పాటు చేశారు. ఆ ఆయోజనము యొక్క కార్యకర్తలలో దేశములోని గొప్పగొప్ప శ్రద్ధాస్పదులయిన విద్వాంసులు అందరూ ఒక్కచోట చేరారు. చాలామట్టు వైదిక సాంప్రదాయపు ఆచార్య లందరూ వచ్చారు. నిజంగా ఆచార్యులు, విద్వాంసులు వీరంతా ఇంత గొప్పగా ఉపస్థితులవడం నేను ఎక్కడా చూడలేదు. సనాతన ధర్మకాలేజీలో ఉదయము విద్వాంసుల విచార వినిమయము, నిర్ణయము మరి శాస్త్రార్థము జరుగుతుండేది. పదహైదు రోజుల వరకు ఈ కార్యక్రమము నడిచింది. నేను అందులో ప్రతినిధిని, స్వయం సేవకుడిని కూడా. ఆ మహాసమ్మేళనములో సనాతన ధర్మాచార్యుల పట్ల నాకు ఒకరకమైన నైరాశ్యమే ఉదయించింది. ఎవరు ఎడమప్రక్క కూర్చోవాలి, ఎవరు కుడిప్రక్క ఎవరి ఆసనం ఇంకొకరి దానికంటే పెకి వుండాలి

లేదా క్రిందికి వుండాలి - ఈ విధముగా ఏర్పాట్లు చెయ్యవలసి వచ్చేది. అయినా కానీ ఒక ఆచార్యుడి సమయంలో ఇంకొక ఆచార్యుడు వచ్చేవారు కాదు, వచ్చినా ఒకరినొకరు చూసుకోవడం, పలకరించుకోవడం, ఏమీ లేదు, తమ తమ ప్రవచనము ఇచ్చి వెళ్ళిపోయేవారు. ఇలాంటి వీరి వలన సనాతన ధర్మరక్ష, ప్రచారము జరుగుతుందని ఆశపెట్టుకోవడం ఉచితము కాదు అని నా మనసులో దృఢమైన నమ్మకం కలిగింది. ప్రయాగలో జరిగే కార్య కారిణి సమితిలో తత్కాలీన పురీ శంకరాచార్యులు శ్రీభారతీకృష్ణతీర్థ మరియు మహా మండలేశ్వరుడు శ్రీ లక్ష్మణ శాస్త్రి ద్రవిడ వీరిద్దరికి మధ్య కార్యాలయము ఎక్కడ పెట్టాలి. కలకత్తాలోనా, కాశీలోనా అన్న విషయంపై అభిప్రాయ భేదం కలిగింది. మహామంత్రిగా ఎవరుండాలి? దేవనాయకాచార్యుల వారా? లేక కమలనయనాచార్యులా? లేక శ్యామసుందర చక్రవర్తియా? శాస్త్రిజీ ఇరుపక్షాలవైపు రెండు చేతులు ఎత్తుతుండేవారు. ఇది వారి సమత్వము, కానీ నామనసు చాలా ఉదాసీనత చెందినది. నేను 'కల్యాణ్' (పత్రిక) చదువుతుండేవాడిని, అందులో వేదాంత భక్తి మరియు ధర్మ సంబంధమైన విచారములు చదివి చాలా ప్రభావితుడనైవుంటిని. ముఖ్యంగా భాయిజీ హనుమాన్ ప్రసాద్‌వారి రచనలు నాకు చాలా ఇష్టం. ఒక సంస్థ ద్వారా ధర్మ రక్ష, స్థాపన జరగవచ్చునని నా మనసులో ఇపుడు దృఢమైన విశ్వాసము, ఆశ కలుగసాగినది. నేను వారణాసి నుండి కాలినడకన బరహల్‌గంజ్, భటపార్ మొదలైనవి దాటుతూ కాలినడకనే గోరఖ్‌పూర్ చేరుకున్నాను.

గోరఖ్‌పూర్ వైపు -

ఆ రోజులలో 'కల్యాణ్' పత్రికా కార్యాలయము శ్రీగోరఖ్‌నాథ్ మందిరము దగ్గర ఒక తోటలోని బంగళాలో వుండేది. దగ్గరలోనే గోస్వామి శ్రీ చిమ్మన్‌లాల్‌జీ వారి నివాస స్థానముండేది. వారు తమ ఇంట్లో నాకు భోజనం పెట్టారు, ఎందుకంటే ఆ రోజులలో నేను బ్రాహ్మణేతరుల ఇళ్ళల్లో భోజనము చేసేవాడిని కాను. వారు శ్రీభాయిజీని గురించి చాలా మహిమలు చెప్పారు. నేను అడిగిన ఒక ప్రశ్నకు సమాధాన మిస్తూ వారు ఇలా అన్నారు - జగత్తు ఎదుట దీనుడవవలసిన అవసరము లేదు, భగవంతుని ఎదుట దీనులమైతే మన దీనత తొలగిపోతుంది.

ఆ రోజే సాయంకాలము భాయిజీని కలుసుకోవడం జరిగింది. భాయిజీ యొక్క మొదటి కలయికలోనే వారి వినయం, సరళత, సద్భావము చూసి మనసు ప్రసన్నమయింది, ప్రభావితమయినది. మాటల సందర్భములో వారు ఇలా అడిగారు - 'మీకు ఏమి కావాలి?' నేను ఏమి ఆలోచించకుండా సహజంగానే 'నాకు భగవద్భజన కావాలి అంతే భగవద్భజన జరగాలి' వారి కళ్ళ నుండి అశృవులు జలజల ప్రవహించాయి. మాటి మాటికీ ఇలా అంటు వచ్చారు -

ఉమా రామ స్వభావ జిన్‌జానా, తిన్హహి భజన తజి భావన ఆనా వారు (చెబుతూ చెబుతూ) తన్మయులయ్యారు. నా మనసులో భగవత్స్మరణ, నామోచ్చారణ జరుగసాగింది. కొంచెం సేపటివరకు ఆ ప్రభావము అలాగే వుండినది. నిజంగానే ఆ సమయంలో చిత్తము యొక్క స్థితి అసాధారణమైపోయింది. రెండు, మూడు రోజులు నేను అక్కడనే వున్నాను.

వ్యావహారిక నిపుణులు -

ఒక రోజు ఉదయం గీతాప్రెస్ యొక్క మహారథులందరిదీ మీటింగ్ జరిగినది. ఒకటా నేను లోకుల దృష్టిలో మహత్వపూర్ణమైన వ్యక్తినీ కాను, నేను కట్టుకున్న బట్టలు కూడా అంత శుభ్రంగా లేని సాధారణమైనవి. అందుకని లోకులు నన్ను ఎవరూ పట్టించుకోలేదు. 'వేదాంత - అంక' ప్రచురించాలని నిశ్చయించుకున్నారు. ప్రసంగానుసారముగా ఒక చర్చ మొదలైంది ఏమిటంటే ఎవరో ఒక సజ్జనుడు ఒక పుస్తకం వ్రాశారు. అందులో రామాయణము, రామ చరిత మానసము వీటిపై చాలా ఆక్షేపణలు చేశారు. వాటిని ఖండిస్తూ 'కల్యాణ్'లో ప్రచురించాలని. ఈ విషయంపై బజరంగ్‌లాల్ చాంద్‌గోరియా అనే వ్యక్తి చాలా పట్టుపట్టారు. భాయిజీ అన్నారు - ఆపుస్తకాలు ఒక వెయ్యి కాపీలు ముద్రితమయివుండవచ్చు. 'కల్యాణ్' చాలా అధిక సంఖ్యలో ముద్రితమవుతుంది. ఒకవేళ ఆ పుస్తకం 'ఖండన' (విమర్శ) ఇందులో ప్రచురితమయినదంటే ఇంకా దినికి మనం ప్రచారము ఇచ్చినట్లవుతుంది. అటువంటి పుస్తకములను ఉపేక్షించడమే మంచిది. నాకు భాయిజీ యొక్క ఈ అభిప్రాయము చాలా నచ్చింది. భగవద్భక్తితో పాటు వ్యవహారంలో కూడా ఎంత నిపుణుడు! దీని వలన ఒక మంచి ప్రభావం నాపైన పడింది. కానీ అక్కడి వాతావర ణము ఒక

ఆఫీసు వాతావరణములాగే వుండేది. అందువలన నేను అక్కడ ఎక్కువ రోజులు వుండకుండా కాశీ తిరిగి వచ్చాను.

బ్రహ్మచారీజీ దర్శనము -

భగవత్కృప వలన, విద్యాస్థానములు, ధర్మస్థానముల యొక్క అధ్యయనముతో మహాపురుషుల సత్సంగము వలన, ఉపదేశముల వలన నా నిష్ఠ ఔపనిషద్ అద్వైత సిద్ధాంతములోనే వుండేది. ఏకాంతవాసము చెయ్యవలెనని చిత్రకూట్ యాత్ర వెళుతున్నాను. మార్గ మధ్యములో ప్రయాగలో బ్రహ్మచారి ప్రభుదత్తజీ మహరాజ్ యొక్క దర్శనము లభించింది. వారి త్యాగం, వైరాగ్యం, మౌనం, ఏకాంతం, స్పష్టభాషిత, దృఢత నాకు చాలా బాగా అనిపించింది. నేను, వారు ప్రేమతో బలవంతం చెయ్యడం వలన అక్కడ నెలల కొద్దీ ఉండిపోయాను. వారి ప్రోత్సాహముతో సార్వజనక రూపంతో శ్రీమద్భాగవత కథ ప్రవచనము మొదలుపెట్టాను. వారి దగ్గరికి గొప్పగొప్ప ఆచార్యులు, మహాత్ములు, విద్వాంసులు, సమాజసేవకులు, రాష్ట్ర సేవకులు, నాయకులు అందరూ వస్తువుండేవారు. నా ప్రవచనములను ప్రశంసించేవారు. నేను మౌనంగా వుంటూ, ఫలహారం తీసుకుంటూ కేవలం ప్రవచన సమయంలోనే మాట్లాడేవాడిని.

దృఢ నిష్ఠలో విశ్వాసము -

బ్రహ్మచారిగారు నన్ను గోరఖ్‌పూర్ తీసుకువచ్చారు. అక్కడ కూడా ప్రవచనాలు మొదలుపెట్టారు. నాకు అద్వైత నిష్ఠ వుండడమువలన నేను తీవ్ర వైరాగ్యము, సన్యాసము మరియు నేతి నీతి ద్వారా దృశ్య మాత్రమును నిషేదిస్తూ గట్టిగా ప్రతిపాదన చేస్తువుండేవాడిని. దానితో నేను 'ఉద్ధరించే కంపెనీలు' వీటికి విరుద్ధంగా మాట్లాడినట్లుండేది. చాలా మందికి ఈ మాటలు గుచ్చుకున్నాయి. పరస్పరం చెవులు కొరుక్కోసాగారు. కానీ ఈ సంగతి భాయిజీ దగ్గర చర్చకు తీసుకువచ్చారు, అపుడు వారు అందరిని ఆపి ఇలా అన్నారు, 'ఈ విధంగా మీరు చర్చించుకోకూడదు. వారు ఏమి చెప్పినా శాస్త్రానుసారముగానే చెబుతున్నారు. అందరికి వారి వారి నిష్ఠలో దృఢత వుండాలి. ఇతరుల నిష్ఠని గురించి ఆలోచన (విమర్శ) చెయ్యరాదు.' నేను నా

అభిప్రాయములను స్పష్టము చెయ్యడానికి 'సిద్ధాంతము - జీవనము' అనే పేరుగల వ్యాసము వ్రాశాను. భాయిజీ దానిని 'కల్యాణ్' పత్రిక 'వేదాంత అంకం'లో ప్రచురించారు.

మోహనుడి మోహిని -

భాయిజీ పరివారముతో స్నేహ సంబంధం పెరుగతూపోయింది. నేను భాయిజీ యొక్క అభిరుచికి అనుగునంగా ఒక పెద్ద లేఖ వ్రాశాను 'మధుర అనుభూతి' అని. దానిని భాయిజీ చేతిలో పెట్టి 'ఇది ప్రచురించడానికి కాదు, కేవలం మీరు ఒకసారి చదవండి' అన్నాను. దానిని చదివి భాయిజీ భావమగ్నులయ్యారు. నేత్రాలలో అశృప్రవాహం! ఆ రచనను అలాగే చేతిలో పట్టుకుని వారు నాదగ్గరికి వచ్చారు - 'మీరు నాకు చాలా ఆనందాన్నిచ్చారు. తృప్తినిచ్చారు' అని పేరు వ్రాసి భాయిజీ, ఆ లేఖకు 'మోహన్ - మోహిని' అని పేరు వ్రాసి 'కల్యాణ్'లో ప్రచురించారు. అక్కడ వారితో కూడా నాయందు ఆదరభావము కలిగివుండమని సూచించారు. నిశ్చయముగా ఆరోజులలో భాయిజీ సత్సంగములో చాలా మంది భగవద్భక్తులు వుండేవారు. వారిలో గోస్వామి చిమ్మన్‌లాల్‌జీ, శుకదేవబాబు, గంగాప్రసాద్‌జీ, పుజారీజీ, మాధవజీ మొదలైన వారుండేవారు.

సర్వరూపాలలో భగవద్దర్శనము -

ఆ దృశ్యము అపుడపుడు మనఃపటలముపై జీవంతమైనట్లుంటుంది. గీతా వాటికలో సంవత్సరవ్యాప్త అఖండ కీర్తనలో ఒకసారి అగ్ని కాండ జరిగిపోయింది. గడ్డితో చేసిన 18, 20 కుటీరములు వుండేవి. అందులో అనేక ప్రాంతముల నుండి వచ్చిన సాధకులు, మౌనముగా, ఫలహారంతో వుంటు తమ తమ సాధన చేసుకుంటు వుండేవారు. కేవలము భగవన్నామమునే ఉచ్ఛరించేవారు మరియొక్క శబ్దమును ఉచ్ఛరించేవారు కాదు. భగవత్సేవ - పూజ కూడా అందరు చేస్తుండేవారు. రాత్రి సమయంలో ఏదోకారణంతో నిప్పంటుకుంది. హాహాకారములు మొదలయ్యాయి. నోట్లు, బట్టలు, సామగ్రి అంతా కాలిపోయింది. అంతేకాక దేవుడి ఫొటోలు, పూజా సామాన్లు, పారాయణ గ్రంథాలు అన్నీ భస్మమయిపోయనవి. నిప్పంటుకున్నాక

భాయిజీ తన గదిలో నుండి బయటికి వచ్చి 'అగ్ని దేవుడి రూపంలో స్వయంగా భగవంతుడే వచ్చాడు, తెండి తెండి నెయ్యి, చక్కెర అన్నీ బాగా తీసుకురండి. ఈ రూపంలో వచ్చిన భగవంతుడిని బాగా సత్కరించండి!' అన్నారు. అలాగే చేశారు. నేనుకూడా గుహలాగ వున్న నా సేవాకుటీరము నుండి బయటికి వచ్చాను. భాయిజీ యొక్క ఈ భావ (విభోరత) భక్తి చూసి గద్గదుడనయ్యాను. నిజంగానే భాయిజీ తన జీవితమంతా ఇదే సిద్ధాంతమును ప్రతిపాదన చేశారు. అంతా భగవంతుడి లీలయే అని. అన్నీ రూపములలోనూ భగవంతుడే వున్నాడు. వారి ప్రవచనములు, వారి క్రియా కలాపములలో సర్వత్ర భగవత్భావమభివ్యక్తియే కనిపిస్తుండేది.

దోషదృష్టితో కాపాడుకో, కాపాడు -

భాయిజీ దగ్గరికి వచ్చి ఎవరైనా ఎవరినైనా నిందించడం, ఫిర్యాదులు చేశారంటే అపుడు వారు నిందించేవారినికే నచ్చజెబుతూవుండేవారు. 'మీరు అర్థం చేసుకోవడంలో ఏమైనా పొరపాటు పడ్డారేమో. దోషి యొక్క జీవితములో కూడా ఏదో వివశత వుండవచ్చు. అందరి హృదయాలలోనూ భగవంతుడే విరాజమానుడై వున్నాడు. మీరు ఎవరిని నింద చెయ్యకూడదు. మీరు నాకు చెప్పిన సంగతులు వేరే ఎవరితోనూ చెప్పకండి అని కూడా చెబుతువుండేవారు. తర్వాత ఆవ్యక్తిని కూడా ఏకాంతంలో పిలిపించి 'భాయి! నాకు తెలుసు నీలో అలాంటి దోషము ఏమీ లేదని! కానీ జాగ్రత్తగా వుండడం మంచిది కదా! నీ వలన ఇతరులు వేలెత్తి చూపేలాంటి పని జరుగకూడదు. దాని వలన ఇతరుల మనసులలో నీపై దోషదృష్టి కలుగుతుంది. మనలని మనము దోష దుర్గుణముల నుండి రక్షించుకోవడమే గాక ఇతరులను కూడా దోషదృష్టి నుండి రక్షించాలి. మన కారణంగా ఇతరుల మనసు కూడా కలుషితము కాకుండా చూచుకోవాలి, అన్న సంగతి ధ్యానములో వుండాలి. భాయిజీ సాధారణముగా విరోధిపక్షములలోకూ సమన్వయము చేస్తువుండిరి. రెండు వైపులవారితోనూ సద్వ్యవహారము నడుపుతు వుండిరి. ఇద్దరిని ప్రేమగానే చూసుకునేవారు. ఈ విషయములో సౌభాగ్యవతి సావిత్రి అమ్మ గారు కూడా పరిపూర్ణముగా భాయిజీని అనుసరిస్తువుండిరి. ఎవరిని నిందా విననిచ్ఛగించేవారు కాదు. ఒకసారి ఒక సజ్జనుడు ఎవరినో నిందించడం మొదలుపెడితే 'భాయి, ధోవతి క్రింద అందరూ నగ్నంగానే

వుంటారు. ఎవరినీ ఏమీ అనలేము, గుణ-దోషాలు అందరిలోనూ వుంటాయి. మన దృష్టి పవిత్రంగా వుండాలి అంతే' అని అన్నారు.

అద్భుత క్షమాశీలత -

ఒక బ్రహ్మచారి భాయిజీ దగ్గర వుండేవారు. చాలా అందంగా ఆరోగ్యంగా వుండేవాడు. సావిత్రి అమ్మగారి (భాయిజీ భార్య) సద్భావనను తప్పుగా అర్థం చేసుకున్నాడు. వాడి హృదయంలో వికృతభావము ఉదయించింది. చేష్టలు మారిపోయాయి. ఒకరోజు రాత్రి ఇంటి మిద్దెపైకి ఎక్కాడు. భాయిజీ వాడిని తన దగ్గరకు పిలిపించుకున్నాడు. ప్రేమతో బుజ్జగించి ఇక మీదట నీవు పనీపాట లేకుండా వుండకు, ఏదైనా సేవాకార్యములలో సంలగ్నుడవుకా'. అని తనను రాజస్థాన్‌లో ఒక పట్టణంలో ఔషధాలయములో ఏర్పాటు చేశారు. వాడికి అపకీర్తికలుగక ముందే వాడిని గోరఖ్‌పూర్ నుండి బయట పంపించివేశారు. అతడు తర్వాత చాలా గొప్ప వైద్యుడు అయ్యాడు.

ఇతరులను ఉత్సాహవంతులను చేసే స్వభావము -

ఆ రోజులలో గీతావాటికను గోయెంకా వాటిక అనేవారు. అక్కడ భగవన్నామ సంకీర్తన యజ్ఞము ఆయోజనము చెయ్యగా, దానికి చాలా గొప్ప గొప్ప పండితులు, మహాత్ములు, నాయకులు అందరిని ఆహ్వానించారు. శ్రీపండిత మదనమోహన మాలవ్యగారు కూడా వేంచేశారు. వారి పావన, ఉజ్వల వ్యక్తిత్వము చాలా ప్రభావంతో కూడినది. వారి స్వాగతమునకై 'కల్యాణ' పరివారము మొత్తం సంలగ్నమయ్యారు. శ్రీభాయిజీ ఎంత ఉదారుడంటే వారు కల్యాణ్ పరివారంలోని అందరికి మాలవ్యజీతో సన్నిహిత సంపర్కము కలగవలెనని అభిలషించేవారు. వారు మాలవ్యగారి ఎదుట నాతో భాగవత ప్రవచనము చేయించారు. మాలవ్యగారు చాలా ప్రసన్నులయ్యారు. వారు నన్ను తమ దగ్గరికి పిలిపించుకున్నారు. వారు స్వయంగా శ్రీమద్భాగవత ప్రేమికులు, విద్వాంసులు కూడా. వారు గాంధీజీకి శ్రీమద్భాగవతం సంపూర్ణంగా వినిపించారు. దీనిని విన్న తర్వాత గాంధీజీ అన్నారు, 'భాగవతము శ్రవణము చేయడం వలన నా హృదయములో అపూర్వమైన ధర్మ - రసముత్పన్నమైనది' మాలవ్యగారు

నన్ను వేద - స్తుతి, బ్రహ్మ - స్తుతి, గర్భ - స్తుతి మరియు అక్రూర - స్తుతి వీటిని విశేషంగా అధ్యయయనము చేయమని ప్రేరణని కలిగించారు, నన్ను కాశీ హిందూ విశ్వవిద్యాలయములో ప్రవచనములు ఇవ్వడానికి ఆహ్వానించారు. ఇతరులను ఉత్సాహితులను చేస్తూ, వారిని ముందుకు నడిపించడమంటే భాయిజీకి చాలా ఆనందం. నేను విశ్వవిద్యాలయమునకు వెళ్ళి మాలవ్యజీకి శ్రీమద్భాగవతకథ వినిపించాను. ఊఖల్ - బంధన్ లీల విని వారి కళ్ళల్లో నుండి అశృవులు ధారకట్టాయి. ఆఖరున వారు 'నేను ధన్యుడనయ్యా'నన్నారు.

గోస్వామి దామోదరలాల్‌జీతో భేటి -

గోస్వామి దామోదరలాల్‌గారు కాశిలోని దురంధర విద్వానులలో ఒకరు. సంకీర్తన మహాయజ్ఞంలో వారి శుభాగమనం జరిగింది. భాయిజీ వారి యెదుట కూడా నా భాగవత ప్రవచనం చేయించారు. నేను ముఖ్యంగా వారి సాంప్రదాయ ఆచార్యులు శ్రీసనాతన గోస్వామి, శ్రీరూప గోస్వామి, శ్రీజీవ గోస్వామి మరియు శ్రీవిశ్వనాథ చక్రవర్తి వారల టీక ఆధారంతో ప్రవచనములను వినిపించారు. భాయిజీ నన్ను చాలా ప్రశంసించేవారు. గోస్వామిజీ నన్ను వారిదగ్గరికి పిలిపించుకున్నారు. వ్యాకరణము, సాహిత్యము, న్యాయ, మీమాంస, మరియు వేదాంత విషయములలో అనేక గూఢరహస్యములను తెలియజేశారు. కానీ నా నిష్ఠ అద్వైత వేదాంతములో దృఢంగా వుండేది. నేను గోస్వామిజీ వారిని ఒక ప్రశ్న అడిగాను, 'భగవాన్ శ్రీకృష్ణుడి నేత్రముల చిన్మయత, పదునఖముల యొక్క చిన్మయతలో ఏమైనా భేదముందా?' అని. వారు చాలా నవ్వారు. వారు అన్నారు 'నీవు దేనిని అంగీకరిస్తున్నావె, నేను కూడా దానినే ఒప్పుకుంటున్నాను'.

యస్యేంద్రియాది లఖిలేంద్రియ వృత్తిమంతి సర్వత్రచ స్వగతభేద నివర్జితాత్మా!

ఇది బృహద్ బ్రహ్మ సంహిత యొక్క వచనము. ఇది చైతన్య మహా ప్రభువుకు చాలా ఇష్టమైన, ప్రియమైన మాట. శ్రీకృష్ణుడి దివ్య విగ్రహము జడము కాదు, చిన్మయము. వారిలో దేహ - దేహీ అన్న విభాగం లేదు. అన్ని ఇంద్రియాలలో అన్ని ఇంద్రియాల శక్తి వుంది. అందులో స్వగత - భేదము లేదు. ద్వైతము కన్పిస్తున్నాకూడా వస్తుతః అది అద్వైతమే.

భాయిజీ ప్రశంస వలన నాకు గోస్వామి గారి సత్సంబంధమేర్పడింది.

నెహ్రూజీ కూడా ప్రభావితుడే -

ఈ సంస్మరణము 1986లో వ్రాయబడుతోంది, అంటే దాదాపు సుమారు 48-50సం॥ల పూర్వం మాట. ఈ రోజులలో పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ యొక్క కీర్తి ప్రతాపము బాగా ఎక్కువగా వుండేది. దేశ స్వాతంత్ర్యము కొరకు వారి త్యాగము, బలిదానము, సహిష్ణుతల ప్రశంస బాగా వుండేది. సయిమన్ కమీషన్‌కు విరుద్ధముగా జరిగిన ఆందోళనలో నెహ్రూ గారికి, పండిత్ శ్రీగోవిందవలభ పంత్‌ను బ్రిటీష్ సర్‌కార్ వారు చాలా కష్టపెట్టారు, కొట్టారు, అది జనుల హృదయంలో గాయమయింది. అందరికి వారంటే చాలా ఇష్టం. నెహ్రూజీకి సంకీర్తన మహాయజ్ఞములో ఆహ్వానించారు. వారు వచ్చారు. వచ్చి యజ్ఞమండపములో భగవంతుడికి నమస్కరించారు. 'ఇది ఏమి రాత్రింబవళ్ళు అఖండ కీర్తన జరుగుతూ వుంటుంది. ఢోలక్, తాళాలు మ్రోగుతూ వుంటాయి.' అన్నారు. వారికి అంత వరకు ఈ సంగతులతో పరిచయము లేదు. భాయిజీ వారికి భారతీయ భక్తి భావము సంకీర్తన మహిమలపై ప్రవచనమిచ్చారు. వారు ఆశ్చర్యచకితులయి శ్రవణము చేశారు.

గీతా వాటిక సుప్రసిద్ధ సత్పురుషులు అపుడపుడు వస్తువుండిరి. 'కరహై'కి చెందిన బాబా రామదాసుగారు తమ మండలితో వచ్చి అక్కడ కొన్ని రోజులున్నారు. వారి వాణిలో ఒక విశేషమైన మాధుర్యము, ఆకర్షణ వుండేది. వారు రామచరిత మానసముపై ప్రవచనము చేస్తు చేస్తు ఏదైనా కరుణరస ప్రసంగము వినిపిచేటపుడు, శ్రోతలు ముగ్ధులయ్యేవారు. అందరికి అశృధారలు ప్రవహించేవి. శరీరము రోమాంచ మవుతుండేది. భక్తులు భావమగ్నులవుతుండేవారు.

సహృదయత -

గీతా ప్రెస్ యొక్క కర్మచారులు (పనివారు) చాలా రకాల భిన్న భిన్న విచారధారలు కలిగిన వారుండేవారు. కొందరు ఆస్తికులు, కొందరు నాస్తికులు, కొందరు కాంగ్రెస్, కొందరు కమ్యూనిస్టులు. కొందరయితే ప్రెస్‌కు విరుద్ధముగా ప్రచారము, సంఘటనలు చేయడానికి ప్రయత్నిస్తుండేవారు. వారిలో ఒకరు పండిత్

గౌరీశంకర్ ద్వివేది. వారు అనేక భాషలలో విద్వాంసులు - రష్యన్, చైనా, ఫ్రెంచ్, ఇంగ్లీషు అలా అన్ని భాషలలను తెలిసినవాడు తను, అనువాదకుడు, లేఖకుడు కూడా! కానీ వారు అక్కడి పనివాళ్ళ యూనియన్ తయారు చెయ్యడంలో నిమగ్నమయ్యేవాడు. వారి కారణంగా ప్రెస్‌లో ఒక్కోసారి సమ్మెకూడా జరిగేది. సేఠ్ జయదయాల్‌జీ ప్రెస్ పనుల నుండి వారిని తొలగించారు. ద్వివేది గారు చాలా పేదవారు. విద్య చాలా ఎక్కువ స్పష్టంగా కుండ బద్దలు కొట్టినట్టు మాట్లాడటము, పేదల పక్షపాతము - వీటి వలన వారికి ఆర్థికముగా కష్టం వచ్చింది. భాయిజీ హనుమాన్ ప్రసాద్ పొదార్, ద్వివేదీగారి విచారములను, కార్యకలాపములను ఎక్కువ పట్టించుకునేవారు కాదు. వారు ఏమయిన చెయ్యనీ భాయిజీ గుట్టు చప్పుడు కాకుండా వారికి ఏదో ఒక పని ఇచ్చి వారి భరణ. పోషణకు ఏర్పాట్లు చేస్తుండేవారు. ద్వివేదిగారి వలన ప్రెస్‌కు హాని కూడా కలగవచ్చు. కానీ, భాయిజీవారి సహృదయతలో మాత్రం ఎలాంటి లోటు రాదు. భాయిజీ వారితో శ్రీమద్భాగవతముపై ఫ్రెంచ్ భూమికను అనువాదము చేయించారు. దాని వలన భాగవతము సంపాదన చేసేటపుడు చాలా ఉపయోగం కలిగింది.

పని లేకపోయినా, భాయిజీ పని కల్పించి లోకులకు సాయం చేసేవారు.

ఉదార దృష్టి -

ఒకరు కేడియాజీ అని వుండేవారు. హిందీ సాహిత్యములో వారు గొప్ప విద్వాంసులు, మొదట వారి ఆర్థికస్థితి బాగుండేదేమో, కానీ ఆ రోజులలో వారు చాలా కష్టంలో వున్నారు. భాయిజీ వారికి సహాయం చెయ్యాలనుకున్నారు. కానీ వారు 'నేను వైశ్యుడనయి వుండి దానము ఎలా స్వీకరిస్తాను? ఒకవేళ మీరు నాతో ఏమైన పని చేయించుకుంటే అపుడు నేను జీతం తీసుకుంటాను' అన్నారు. భాయిజీ వారికి పని ఇచ్చారు. ఏమి పని ఇచ్చారు? అది ఏమిటంటే విష్ణు సహస్రనామములు, గోపాల సహస్రనామములు మొదలైన భగవన్నామములున్నాయి కదా అవి కాకుండా వ్రజభాషలో కానీ, అన్య దేశీ భాషలలో ఏ భగవన్నామములయితే ప్రచలితములో వాటిని సేకరించమని చెప్పారు. భగవంతుని అనేక నామములు క్రొత్త క్రొత్తవి సేకరించమని చెప్పారు. వారికి పని దొరికింది. జీవితమంతా చేస్తూనే వున్నారు.

ఎన్నో లక్షల నామాలు సేకరించి భాయిజీకి పంపుతూ వుండేవారు. వారు చాలా ప్రసన్నులై ఇంకా పంపండి, ఇంకా పంపండి అనేవారు.

ఈ సేకరించిన నామాలను ఏం చేశారని నాకు తెలియదు. గీతావాటికలో వున్నాయా? లేదా ప్రెస్‌లోనా? ప్రచురించారా లేదా ఏమీ తెలియదు. కానీ కేడియాజీ జీవతము హాయిగా భక్తిభావంతో గడిచిపోయింది.

ఈ సంగతి భాయిజీనే చెప్పారు - ఎవరో ఒక రాజస్థాన్‌కు చెందిన ఒక వూరిలో అపరిగ్రహీ, అకించనుడు అయిన బ్రాహ్మణుడు ఒకడుండేవాడు. వారు ఎపుడు ఎవరినీ యాచించేవాడు కాదు. ఏదో స్వాభావికంగా వచ్చినదానితో గడుపుకునేవాడు. ఇంట్లో పిండి వుంటే, పప్పుండదు, పప్పుంటే ఉప్పుండదు అలాగుండేది. అదే ఊరిలో ఒక సేఠ్ వుండేవాడు. పండిత్‌జీకి ఏమైన ఇవ్వాలనుకుంటే మరి వీరు ఏమీ తీసుకునేవారు కాదు. అపుడు సేఠ్‌జీ ఒక యుక్తి చేశారు. ఇంట్లో పెరుగు పేరబెట్టి, అందులో రెండు మూడు గిన్నీలు (వెండి నాణెములు) వేశేవాడు. సేఠ్‌జీ చుప్‌చాప్‌గా పండిత్‌జీ వారి ఇంట్లో వారికి, పత్నికి ఇచ్చి వచ్చేవారు. ఎవరికి తెలిశేది కాదు. పండిత్‌జీ జీవనం గడిచిపోయేది. ఎవరి హృదయం ఉదారంగా వుంటుందో, ఎవరైతే ఎవరికైనా సహాయం చెయ్యాలనుకునేవారో వారికి క్రొత్త క్రొత్త యుక్తులు స్ఫురిస్తుంటాయి. ఉదారత అనేది కొత్తది, ప్రశస్తమైన మార్గమును వెదుక్కునేది.

ఉత్తర ప్రదేశ్‌లో ఒక పెద్ద నాయకుడుండేవాడు. స్వరాజ్యం వచ్చాక వారు ఒక ఉన్నతపదవిని అధిరోహించారు. సత్యాగ్రహ సమయంలో వారు ఆందోళనలో మునిగి వుండిరి - కుటుంబ సభ్యులు అపుడపుడు ఆకలితోనే వుండేవారు. ఒకసారి వారు భాయిజీకి టెలిగ్రామ్ ఇచ్చారు ఇంట్లో పిల్లా పాపా అంతా 3 రోజుల నుండి పస్తులున్నారని, నేను జైలులో వున్నాను, ఏమీ చెయ్యలేను. అని. భాయిజీ అదే రోజే వారింటికి మనిషిని పంపి, స్వరాజ్యము వచ్చేవరకు కూడా వారి భరణపోషణ ఏర్పాట్లు తనే చేశారు.

ఒక వయోవృద్ధ విద్వానుడుండేవాడు. చాలా పత్రికలు సంపాదకీయం చేశేవారు. ఎన్నో గ్రంథాలు వ్రాశారు. కానీ వృద్ధాప్యము కారణంగా వారి వద్ద తిండికి, బట్టకు

కూడా ఏమీ మిగులలేదు. 5గురు విధవరాళ్ళయిన కూతుళ్ళు ఇంట్లో వుండేవారు. ఇద్దరు కొడుకులలో ఒకడు చిన్నవాడు, ఇంకొకడు తిరుగుబోతు అయ్యాడు. భాయిజీ వారికి నెలకు రూ.200/-లు ఇంట్లో కూచున్నా వచ్చేలాగ ఏర్పాటు చేశారు. ఆ వయోవృద్ధ పండితుడికి చాలా సంకోచముగా వుండేది, నేను వూరికే ఎలా డబ్బు తీసుకునేది అని. భాయిజీ వారి సంకోచమును పోగొట్టడానికై ఒక ఉపాయము చేశారు. 'కల్యాణ్' పత్రికకు వచ్చిన రచనల సంపాదన చెయ్యడానికి వాటిని వారి ఇంటికి పంపిస్తుండేవారు. తర్వాత వారు భాయిజీతో ఎంత ప్రభావితులయినారంటే వెళ్ళి గోరఖ్‌పూర్‌లోనే వుండసాగారు 'కల్యాణ్' సంపాదన - విభాగంలో పని చెయ్యసాగారు.

పూర్వజన్మలో ఋణము -

ఒకసారి ఒక విలక్షణమైన ఘటన జరిగింది. లోక వ్యవహారములో అలాంటిది తక్కువగానే చూస్తాము. ఒక సజ్జనుడు వచ్చి భాయిజీతో ఇలా అన్నాడు - 'నేను నెపాల్ యాత్రకని వాచ్చను. భార్య జబ్బుపడింది. గవర్నమెంటు ఆసుపత్రిలో చేర్పించాను. ఫలానా నంబరు గది. ఖర్చు కొరకు డబ్బులు లేవు. నేను ఏం చెయ్యాలి?' భాయిజీ వారికి 200, 250 వరకు డబ్బులిచ్చి పంపారు. 3, 4 రోజుల తర్వాత మరల వచ్చి జబ్బు బాగా ముదిరిపోయింది. ఆపరేషను చెయ్యాలంటున్నారు. ఇంకా కొంచెం డబ్బు కావాలి.'

3, 4 రోజుల తర్వాత మరల వచ్చి 'ఆమె చనిపోయింది. క్రియా, కర్మకు డబ్బు కావాలి' అన్నాడు.

'కల్యాణ్' పరివారము వారు భాయిజీతో అన్నారు - 'ఇతడెవరో మోసగాడిలాగ వున్నాడు. వీరికి ఏమీ ఇవ్వకండి.' భాయిజీ అన్నారు 'నేనయితే మొదటిరోజే ఆసుపత్రికి ఫోన్‌చేసి కనుక్కున్నాను. అక్కడ ఎక్కడా ఏగదిలోనూ వారి పత్నిని చేర్పించలేదు. భార్యనే లేకపోతే ఇక జబ్బు, మందులు మరి క్రియాకర్మ వీటి చర్చ ఎక్కడ?! కానీ ఈ సజ్జనుడు నా దగ్గరికి వచ్చి కూర్చున్నపుడు పూర్వజన్మలో ఎపుడో ఇతడికి బాకీ వున్నట్లనిపించేది. మరి అది తీర్చవలసిన అవసరం వుందికదా! అతడి అవసరం

నిజమైనదా, అబద్ధమైనదా అనే మీమాంసతో నాకేమి పని? నా హృదయం తనకు ఏదైనా ఇవ్వాలని వివశుడిని చేశింది. నేను నా హృదయవేదన తగ్గించుకోవడానికి ఇచ్చాను. అంతే కానీ ఇతడి సత్య అసత్యాలపై ఆధారపడికాదు. అందరూ సత్యవాదులే - మిథ్యావాదులే. మన హృదయము సద్భావపూర్ణమై వుండాలి అంతే. ఎవరైనా దుఃఖితుడికి, పేదవాడికి సహాయం చెయ్యడంలో మోసపోయినా కానీ అది కూడా సహృదయత యొక్క అభివ్యక్తియే'.

అపకారమునకు బదులుగా ఉపకారము -

'కల్యాణ్' సంపాదకీయ విభాగంలో ఒక గొప్ప విద్వాంసుడు, బాగా పేరు గాంచిన ఒక వ్యక్తి పనిచేస్తుండేవాడు. వారి స్వభావమనండి, ప్రకృతి అనండి, వారు ఎవరికి తెలియకుండా గవర్నమెంటు అధికారులకు గీతాప్రెస్‌లో 'కల్యాణ్'లో జరిగే చిన్న చిన్న లోపాలను తెలియబరుస్తుండేవారు. పండిత గోవింద వల్లభ్‌పంత్ ఏసమయంలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రిగా వున్నారో ఆ సమయంలో ఆ సజ్జనుడు భాయిజీవారి సంస్థ రాష్ట్రహితమునకు విరుద్ధమైన పనులు చేస్తున్నదని అనేకమైన ఉత్తరాలు వ్రాశారు. పండిత్‌జీ వారికి భాయిజీకి బాగా స్నేహం వుండేది. కానీ గోరఖ్‌పూర్ కలెక్టరు భాయిజీకి విరుద్ధముగా వుండేవాడు. రోజురోజుకు భాయిజీని అరెస్టు చేస్తరన్న ఆశంక ఎక్కువ కాసాగింది. 'మీరు కావాలనుకుంటే ఆ సజ్జనుడు, ఆ కలెక్టరు ఇద్దరిపట్ల నేను చర్య తీసుకుంటటాను' అన్నారు పంత్‌జీ.

భాయిజీ 'వద్దు వద్దు వారిపై ఎలాంటి చర్య తీసుకోకండి' అన్నారు.

ఆ వ్యక్తి వ్రాసిన ఎన్నో ఉత్తరాలు భాయిజీ దగ్గరికి పంపించారు. భాయిజీ బాగా అర్థం చేసుకున్నారు. బాగా ప్రయత్నించి ఆ వ్యక్తికి ఒక గవర్నమెంటు సంస్థలో మంచి పదవిని ఇప్పించారు. వారు సంపాదకీయ విభాగమును వదిలి వెళ్ళిపోయారు. ఆ కలెక్టరు కూడా అక్కడి నుండి బదిలీ అయ్యాడు.

కోట్లాది జనంలో నేను ఒక్కడినే -

కరాచీ నుండి కొ సజ్జనుడు మాటిమాటికీ ఉత్తరాలు వ్రాసి అడుగుతూ

వుండేవాడు - నిజం చెప్పండి. మీరు ఎవరు? గోపీయా? రాధనా? లేక మహా గొప్ప భక్తుడా?' అంటూ భాయిజీ తన స్వాభావికమైన వినయముతో 'నేను ఒక సాధారణమైన మనిషిని' ఎలాగయితే మనుష్యులలో గుణదోషాలు వుంటాయో అలాగే నాలోనూ వున్నాయి'. కానీ అడిగేవాడి పోటుకు ఎక్కువైంది. ఆఖరికి విసిగి కోట్లాది జనంలో నేను ఒక్కడినే నాలాగ, మరి ఇంకొకరు లేరు, నేను ఇతరుల లాగ కాను. ఇక మీరు ఎలాగ అర్థం చేసుకుంటారో మీ ఇష్టం! అని వ్రాశారు.

సరళత -

భాయిజీ యొక్క సరళత కూడా అద్భుతముగా వుండేది. రతన్ గఢ్‌లో వుండేటప్పుడు అక్కడి నాగరికుడికి ఒక పార్సల్ పోస్టులో వచ్చింది. న్యాయంగా దానికి అతడు రూ.2.50/-లు చెల్లించాలి. కానీ పోస్ట్‌మాస్టరు రూ.5/-లు అడుగుతున్నాడు. దీనిపై అతడు భాయిజీ దగ్గరికి వెళ్ళి తన సమస్యను గురించి తెలిపాడు. చాలా బాధపడ్డాడు. భాయిజీ వెంటనే లేచి ఆ సజ్జనుడితోపాటు పోస్టాఫీసుకు వెళ్ళి పోస్టుమాస్టరుకి నచ్చజెప్పి రూ.2.50/-లతోనే పార్సల్ విడిపించారు. అక్కడ అందరికి చాలా ఆశ్చర్యమనిపించింది. భాయిజీ లాంటి సత్పురుషుడు, రూ.2.50/-ల కోసము పోస్టాఫీసుకు వెళ్ళడము ఎంత హాస్యాస్పదమని' కానీ వారికి ఇలాంటి చిన్న చిన్న పనులు చెయ్యడంలో తమ గొప్పదనము, అభిమానము అడ్డువచ్చేవాకాదు.

ప్రేతయోని నుండి ముక్తి -

భాయిజీ స్వయంగా తనే ఈ సంగతి చెప్పారు - వారు ఒకసారి బొంబాయిలో వున్నపుడు సముద్రతీరంలో రాత్రిపూట కూర్చుని భజన చేస్తున్నారు. ఒక పారసీ సజ్జనుడు తన పారసీ దుస్తులలో వచ్చి భాయిజీ ఎదుట నిలుచున్నాడు. 'మీకు భయం కలుగుతుందా' అని అడిగాడు. భాయిజీ 'ఎందుకు భయపడతాను. మీరు సజ్జనులు మంచివారు' అన్నారు. పారసీ సజ్జనుడు 'నేను మనిషిని కాను, ప్రేతమును, నేను చనిపోకముందు పారసీ ధర్మంపై నాకు చాలా శ్రద్ధ వుండేది. చనిపోయిన తర్వాత నేను ప్రేతాత్మనయ్యాను. ఇపుడు నా స్థితి ఎలాగున్నదంటే నాకు ఆకలి దప్పులు కలుగుతాయి. కానీ మా మతములో శ్రాద్ధము చేసే పద్ధతి లేదు. అందువలన

మా కొడుకుకానీ, మనుమలు కానీ శ్రాద్ధము చెయ్యరు. మీరు నా కోసము శ్రాద్ధము చేయించండి' అని అన్నాడు.

భాయిజీ 'నేను చెప్పడం వలన మీ కొడుకులు శ్రాద్ధం చేస్తారంటారా! వారికి ఎలా విశ్వాసం కలుగుతుంది' అని అన్నారు. ప్రేతము - 'నేను మా ఇంట్లో ఫలానా చోట, చాలా డబ్బు పెట్టాను. ఇంటి వారికి తెలియదు. నేను చెప్పిన సంఖ్యను మీరు సరిగా చెప్పండి తర్వాత వారితో నాకు శ్రాద్ధము చెయ్యండి అని చెబితే వారు నా శ్రాద్ధము పెడతారు' అని అన్నాడు.

భాయిజీ అలాగే చేశారు. డబ్బు దొరికి వారు శ్రాద్ధము పెట్టారు. ఆ ఫారసీ సజ్జనుడు ప్రేతయోని నుండి ముక్తుడయ్యాడు. నైతిక విలువలను ఆదరించేవారు. (ఈ సంగతి స్వామి కృష్ణానందుల జీవితంలో పేర్కొనివున్నది).

విచిత్రమైన ఈశ్వరీయ అనుగ్రహము -

బ్రిటీష్ సర్కార్ వారు రాజద్రోహ నేరము క్రింద భాయిజీకి చాలా సుదీర్ఘకాల కైదును ఇచ్చారు. వారిని బిహార్‌లోని చక్రధరపుర్ జైల్లో వుంచారు. ఆ జైలు శిక్ష భాయిజీ జీవితంలో ఒక ఈశ్వరీయ అనుగ్రహముగా సిద్ధించింది. ఇక సంవత్సరాల కొద్దీ ఇక్కడ వుండవలసినదే కదా అని భాయిజీ చాలా ఏకాగ్రచిత్తముతో సాధన భజనలో సంలగ్నులయ్యారు. ఒకటిన్నర సంవత్సరములోపుననే భాయిజీకి ఎన్నో దివ్యమైన అనుభవములు కలిగినవి. యావజ్జీవ శిక్షకు బదులుగా వారిని 19 నెలలలోనే జైలు నుండి విడుదల చేశారు. గంభీర చంద్‌దుజారి, భాయిజీని అడిగి వారి అనుభవములనన్నింటి సంగ్రహము చేశారు. భాయిజీ కూడా చదివి ఎక్కడెక్కడ తప్పులుంటే అక్కడక్కడ తన స్వహస్తాలతో దిద్దారు. దుజారీ ఆ కాతితములను నాకు కూడా చూపించారు - భాయిజీ ఏమేమి సాధనలు చేశేవారు. వారికి శ్రీకృష్ణ భగవానుడు ఏ ఏ రూపములలో దర్శనమిచ్చారు. భాయిజీ యొక్క చేతివ్రాతను నేను బాగా గుర్తించగలను. దానిపై వారితో చర్చించాను కూడా. భాయిజీకి భగవన్నామముపై పరిపూర్ణమైన నిష్ఠ వుండేది. ఈ సంగతి అయితే వారి జీవితం వ్యాఖ్యానం మరియు లేఖనంలో స్పష్టమవుతూనే వుండేది.

రామ్ రామ్ ఏమి? రేమ్ రేమ్ కూడా -

ఒకసారి బొంబాయిలో వారు రామనారాయణ్ పొదార్ వారి దగ్గర బస చేశారు. అక్కడ భగవన్నామముపై పరస్పర మాటా మంతి మొదలైంది. ఎవరో ఒకరు భగవన్నామ మహిమపై కటాక్షము విసిరారు. భాయిజీకి ఆవేశము కలిగింది. ఆవేశంలో వారి కంఠంలో కూడా మార్పువచ్చింది. శరీరము రోమాంచితమైంది. కళ్ళు ఎర్రబడ్డాయి. వారన్నారు 'రామ రామ అనే కాదు, ఆఖరు క్షణాలలో ఎవరైనా రామ్ రామ్ అనుకుంటు చనిపోయినా కూడా వాడి సద్గతికి సందేహము లేదు. ఆ రోజు వారు 12, 14 గంటల వరకు ఆవేశములోనే వున్నారు. తినటం, త్రాగటం ఏమీ లేదు. ఎక్కడున్నవారు అక్కడే! శరీర విస్మృతి కలిగిందా అనేలాగ. భాయిజీ ఇతరులతో నామజపము చేయిస్తూనే వుండేవారు. వారు కూడా స్వయంగా నామ సంకీర్తన చేశేటపుడు నృత్యం చేశేవారు. భగవన్నామముపై వారికి అవిచలమైన విశ్వాసముండేది.

ఎవరెవరి మందులని తీసుకునేది?

భాయిజీకి జలుబు, జ్వరం వచ్చినపుడు ఎందరో వైద్యులు డాక్టర్లు వారిని చూడటానికి స్వయంగా వస్తుండేవారు. భాయిజీ అందరి మాటలు చాలా ప్రేమగా వింటుండేవారు. వారిచ్చే మందులు కూడా పుచ్చుకుంటూ వుండేవారు. ఒకరోజు నేను ఆ మందులన్నీ దిండు క్రిందనే వుండడం చూశాను, 'ఇదంత ఏమిటి భాయిజీ' అని అడిగాను.

భాయిజీ 'నేను ఎవరెవరి సలహాల్ని పాటించాలి? ఎవరెవరితో వాదవివాదములు చెయ్యాలి? వెరి మందుని నిరాకరించాలి? వారి మాట దాటకుండా తీసుకుంటాను. అంతే కానీ నేను మందులు తినను. నాకు గుర్తున్నంత వరకు భాయిజీ 'లక్ష్మీవిలాస్', 'సంజీవనీ' అనే పేర్లుగల ఆయుర్వేద ఔషధులు అపుడపుడు సేవించేవారు, అవసరమయినపుడు నాకు కూడా ఇస్తుండేవారు. వారి తియ్యటి మాటలే ఎన్నో సార్లు రోగమును మాయం చేశేవి.

లోపలి నుండి ఒకటి, బయటి నుండి రెండు -

శ్రీ సేఠ్ జయదయాల్ గోయెంకా హృదయము న్యాయ ప్రియమైనది. భాయిజీ జీవితంలో దయ, సహనుభూతి ప్రధానంగా వుండేవి. సేఠ్‌జీ కూడా భగవన్నామ కీర్తన చేసేవారు, విశేషంగా ఏకాదశిరోజున, కీర్తన చేస్తూ, చేస్తూ పడిపోయేవారు. చాలా గట్టిగా పగలబడి నవ్వేవారు. లోక సంగ్రహమే వారి ముఖ్య లక్ష్యము. కానీ భాయిజీ నామ సంకీర్తనము చేస్తూ చేస్తూ విహ్వాలురైపోయేవారు. అంగ - ప్రత్యంగ ములలో సాత్త్విక భావముదయించేది. చాలా అవసరమనుకుంటే సేఠ్‌జీ, భాయిజీ సలహాలను తీసుకునేవారు. ఒక్కొక్కపుడు అయితే వీరు ఇద్దరూ లోపల ఒక్కటే, బయటికి మాత్రం ఇద్దరు వేరు. ఎలాగంటే ఒకరు ప్రభుత్వ పక్షం, ఇంకొకరు విపక్షం. ఈ విధంగా 'కల్యాణ' పత్రిక కార్యము సుచారురూపముగ సంపన్నమయ్యేది.

మహాత్మా గాంధీగారి నుండి లేఖ -

'కల్యాణ్' సంపాదక విభాగములో కృష్ణదాస దాదా అనే పురుగల ఒక సజ్జనుడు, విద్వాంసుడు పనిచేసేవాడు. వారికి మొదట వేరు పేరు వుండేది. మహాత్మ గాంధీగారి సన్నిధిలో వుండేవారు. వారు ఇంగ్లీషులో మమాత్మాగాంధీ గారిపై రండు పుస్తకములు వ్రాశారు. 'ఏడు సంవత్సరములు, ఏడు సంవత్సరములు' అని వాటి పేర్లు. మహాత్ముడి పట్ల వారి హృదయంలో చాలా శ్రద్ధ, ప్రీతి వుండేవి. ఒకసారి వారికి మహాత్ముడి ఆయుస్సు ఇక కొద్దిగానే వున్నట్లు కలవచ్చింది. ఇకనైనా వారు భగవన్నామము తీసుకోవాలని, భాయిజీతో సంప్రదించి ఈ విషయంపై మహాత్మా గాంధీకి ఒక లేఖ వ్రాశారు. లేఖ భాయిజీ వ్రాశారు. దీనికి జవాబుగా మహాత్మాగాంధీ వ్రాశారు. దాని అభిప్రయాం కొంచెం ఇలాగుండేది -

'రామనామము అయితే అది నా జీవన సర్వస్వము. నేను నా శ్వాస-శ్వాసలో నామము చేస్తానను. అదిసేరే మంచిదే. కానీ మృత్యువు దగ్గర పడినందుకు, మృత్యు భయంతో రామనామము చెయ్యాలన్నది ఈ మాట నాకు నచ్చలేదు. రామ నామము నా ఆహారం. నా భోజనం - ఇది లేకుండా నేను జీవించనే లేను. కృష్ణదాసుకు నాపైన చాలా ప్రేమ అందుకని వారికి నావిషయంలో అలాంటి కలవచ్చివుండవచ్చు'.

భాగవతాంకము కొరకు మహాత్మా గాంధీగారి సందేశము -

'కల్యాణ్' యొక్క శ్రీమద్భాగవతాంకము ముద్రింపబడుతూ వుంది. అందరూ సత్పురుషులు, ఆచార్యులు మహాత్ములతో వారి ఆశీర్వాదరములు, సందేశములు లభించాయి. మహాత్మగాంధీగారికి కూడా భాయిజీ స్వయంగా వుత్తరం వ్రాశారు సందేశం కోరుతూ. వారు ఇలా వ్రాశారు (లేఖ యొక్క ఆశయము ఇలా వుంది).

'నేను నా సోదరుడు మదనమోహనమాలవ్య గారితో శ్రీమద్భాగవతము శ్రవణము చేసినప్పటి నుండి నా హృదయము 'ధర్మరసము' ఉత్పన్నమైనది. ధర్మనిష్ఠ అయితే ముందు నుండి వున్నదేనాయె. కానీ శ్రీమద్భాగవతము శ్రవణము వలన ధర్మములో కూడా చాలా రసము (ఆనందము) వున్నదని నిశ్చయం కలిగినది'.

మహాత్ముల ఈ సందేశం భాయిజీకి చాలా ప్రసన్నత కల్గించింది.

లార్డ్ విష్ణు

భాయిజీ ఎంతటి సహృదయుడంటే, ఎంతటి అయోగ్యుడయిన వ్యక్తితో నయినా ఏదో ఒక లోక కల్యాణ కార్యము చేయిస్తువుండేవారు.

ఒక విష్ణుదత్తుడనే పండితుడుండేవాడు. గోరఖ్‌పూర్, దేవరనియా జిల్లాకి చెందిన ఏదో గ్రామములో వారు జన్మించారు. చాలా భాషలలో వారు విద్వానులు అయినా అరవిందాశ్రం పాండిచేరిలో వెళ్ళి వుంటుండేవారు. కొంత సమయానికి వారికి అక్కడ మనసునిలవ లేదు, భాయిజీ దగ్గరికి వచ్చారు. వారి ఆచరణ చాలా విచిత్రముగా వుండేది. లక్ష్మీ నారాయణుల చిత్రపటంపై లక్ష్మీ స్వరూపాన్ని కాగితంతో కప్పి వుంచేవారు. అలాగ ఎందుకు చేస్తున్నారంటే స్త్రీలవైపెఉ చూడకూడదని సేఠ్‌జీ యొక్క అభిప్రాయము, అందుకని నేను స్త్రీని చూడను' అనేవారు. వేష భాషలు విచిత్రంగా వుండేవి. వారు తమ పేరుకుముందు లార్డ్ అని పెట్టుకునేవారు లార్డ్‌విష్ణు అని. కానీ హిట్లర్ యుగము వచ్చాక 'హర్ హిట్లర్' లాగ 'హరవిష్ణు' అని వ్రాయడము మొదలుపెట్టారు. మేమందరం వారిని సగం పిచ్చివాడనే అనుకునేవారము. కానీ భాయిజీ అలాంటి వ్యక్తిని కూడా తన దగ్గర కూర్చోబెట్టుకుని మాట్లాడుతుండేవారు,

భిన్న భిన్న భాషలలో అనువాదము చేయించి 'కల్యాణ్' సంపాదకములో ఉపయోగించేవారు. అలాంటి వ్యక్తితో పనిచేయించడం భాయిజీ కార్యకౌశలతకు ఒక గొప్ప ఉదాహరణ.

మౌనీ మహాత్మ -

గీతావాటిక, గోరఖ్‌పూర్ పట్టణము నుండి కొంచ దూరము రైల్వే లైను దగ్గర తోట, పొలాలు, వూరు వుండేది. ఆ రోజులలో చాలా ఏకాంతంగా, శాంతంగా వుండేది ఆ ప్రదేశం. ఒకరోజున ఒక అపరిచిత సజ్జనుడు వచ్చాడు. తెల్లగా, బలహీనమైన శరీరముతో మంచి స్వచ్ఛమైన బట్టలు వేసుకుని వున్నాడు. భాయిజీతో ఏకాంతంలో ఏమైనా మాట్లాడారేమో నాకు గుర్తులేదు. వారు వూరు, పేరు, జాతి, ఏమీ ఎవరికీ తెలియదు. వారిని ఒక కుటీరంలో పెట్టారు, వారు దేవుడి పూజ చేస్తుండేవారు. కానీ వారి దేవుడిని ఎవరికీ వారు చూపలేదు. మాట్లాడేవారు కాదు, వ్రాసేవారు కూడా కాదు. ఈ అద్భుతమైన మహాత్ముడిని లోకులు కౌతూహలదృష్టితో చూస్తుండేవారు. వారు భజనలో మగ్నులయ్యేవారు, లీనమైవుండేవారు ఎవరితోనూ వ్యవహారం వుండేదికాదు. కథ, కీర్తనాదులలో కూడా వచ్చేవారు కాదు. అసలు ఎవ్వరివైపూ చూశేవారు కూడా కాదు.

ఒకరోజున వానికి దేవుడి నైవేద్యం కోసం పంపిన కిసిమిస్ బాగాలేదు. కొంచెం తడిగా వుండి ముక్కలుగా వుంది. వారు కిశ్‌మిస్ చేతులో పట్టుకుని భాయిజీ దగ్గరికి వచ్చారు. 'నా ప్రేమాస్పదుడయిన దేవుడి ఇలాంటి కిస్‌మిస్ ఎలా పెట్టాలి?' అని భాయిజీకి వ్రాసి చూపించారు.

భాయిజీ వెంటనే వారి కుటీరమునకు వెళ్ళి సరియైన వ్యవస్థ ఏర్పాటు చేశారు.

జటాయువు స్తుతి వింటూ వింటూ వింటూ మౌనీబాబా దేహత్యాగం -

ఆ మహాత్ముడు చాలా సంవత్సరాలు అక్కడనే వున్నారు. ఎవరితో మాట్లాడేవారు కాదు. ఎవరితోనూ సంబంధం లేదు. ఒక రోజు వారి కుటీరము దగ్గర నుండి ఎవరో వెళుతున్నారు. వారిని సైగచేసి పిలిపించారు. వారిని అందరూ ఆదరంగా

చూచుకునేవారు. అతడు వెళ్ళి వారి దగ్గర నిల్చున్నారు. శ్రీరామ చరితమానస్‌ది చిన్న పుస్తకమును వారు అతని చేతిలో వుంచారు. జటాయు మృత్యుప్రసంగము తీసి చూపించి చదవమన్నారు. అతడు కూర్చుని చదవడం మొదలెట్టాడు.

జటాయువు స్తుతి వింటు వింటు వారిలో సాత్విక భావన ఉదయించింది. వారి నేత్రాల నుండి అశృవులయితే ఎపుడూ ప్రవహిస్తూనే వుండేవి. కానీ ఆ సమయములో అఖండధార ప్రవాహమైంది. స్తుతి వింటూ శ్రీసీతారాములకు ప్రణామము చేస్తున్నట్లుగా చేతులు జోడించి తలవంచారు. భూమిపై పడిపోయారు. శరీరమును వదిలిపెట్టారు. పాఠ్ చేశే వ్యక్తి చెప్పడం వలన అందరము అక్కడ గుమిగూడాము. భాయిజీ వారి అంత్యేష్ఠి క్రియము జరిపించారు. ఆ స్తుతి రామ చరితమానసములో అరణ్యకాండములో ఈ ప్రకారముగా వున్నది

జయ రామ రూప అనుప నిర్గున సగున గున ప్రేరక సహీ ।
దససీస బాహు ప్రచండ ఖండన చండసర మండన మహీ ॥
పాథోద గాత సరోజ ముఖ రాజీవ ఆయత లోచనం ।
నితనౌమిరామ కృపాల బహు విశాల భవభయమోచనం ॥ 1 ॥
బలమప్రమేయమనాదిమజమవ్యక్తమేకమగోచరం ।
గోవింద గోపర ద్వంద్వహర విగ్యానఘన ధరనీధరం ॥
జె రామ మంత్ర జపంత సంత అనంత జన మన రంజనం ।
నిత నౌమి రామ అకామ ప్రియ కామాది ఖలదల గంజనం ॥ 2 ॥
కరి ధ్యాన గ్యాన విరాగ జోగ అనేక ముని జెహి పావహీ ।
జెహి శృతి నిరంజన బ్రహ్మ వ్యాపక బిరజ అజ కహి గావహీ ॥
సోప్రగట కరునా కంద సోభా వృంద అగ జగ మోహయి ।
మమ హృదయ పంకజ భృంగ అంగ అనంగ బహు ఛబి సోహయి ॥ 3 ॥
జో అగమ సుగమ సుభావ నిర్మల అసమ సమ సీతల సదా ।
పశ్యంతి జం జోగీ జతన కరి కరన మన గో బస సదా
సో రామ రమా నివాస సంతత దాస బస త్రిభువన ధనీ
మమ ఉర బసవు సో సమన సంస్కృతి జాసు కీరతి పావనీ ॥ 4 ॥

వినమ్రత -

నాకు అది ఏ సంవత్సరము అని గాని కాల క్రమము గానీ సరిగా గుర్తులేదు. ఎలాగ ఎలాగ స్మృతి పథంలో గుర్తొస్తున్నాయో అలాగ వ్రాస్తున్నాను.

ఒకసారి మేమంతా 'కల్యాణ' పరివారమంతా రతన్‌గఢ్‌లోని హవేలిలో కూర్చుని వున్నాము. చిన్న ద్వారం ముఖ్యద్వారానికి కుడి వైపు వుండేది. వున్నట్లుండి భాయిజీ వచ్చారు. గోస్వామిజీ, మాధవజీ దేవధర్‌జీ మేమంతా లేచి నిల్చున్నాము. భాయిజీ అన్నారు 'నేను ఒక మనిషినే వస్తున్నాను. భూకంపమేమీ రాలేదు కదా! ఎవరైనా మనకంటే పెద్దవాళ్ళు వస్తే అపుడ లేవాలి కానీ నేను ఇంట్లోని ఒక సదస్యుడినే కదా ఒక చోట వుండేవాళ్ళము ఇంత శిష్టాచారత అవసరములేదు.' భూకంపం పేరు విని మేమందరము గట్టిగా నవ్వేశాం భాయిజీ కూడా నవ్వారు. వారు వ్యవహారములో ఎపుడూ తన అధికృతని చూపెట్టేవారుకాదు.

శ్రీ శుకదేవ బాబు -

వారు గీతాప్రెస్‌కు కోశాధ్యక్షులుగా వుండేవారు. పండిత్‌జీ (నేను) ఎక్కడికయినా బయటరికి వెళితే దారి ఖర్చులకు ఏర్పాటు చెయ్యమని భాయిజీ వారితో చెప్పారు. వారు ఎపుడూ అలాగే చేస్తుండేవారు. వెళ్ళేటపుడే అవసరమయినంత ధనం ఇస్తుండేవారు. నేను లెఖ్ఖపెట్టేది లేదు. తిరిగి వచ్చాక ఎంత మిగిలివుంటే అంత వారికి వాపసు చేసేవాడిని. ఈ రోజుల్లోలాగ అపుడు జేబులు కొట్టేవారి భయం లేదు. ఈ ప్రసంగంలో ఒక సంగతి గుర్తుకు వస్తువుంది. ఎపుడైన భగవచ్చర్చ జరిగితే భక్తి భావముతో ఉద్రిక్తుడై శుకదేవబాబు వ్యాకులుడయ్యేవాడు. నీళ్ళు నిండిన కళ్ళు, రోమాంచిత శరీరం, అత్యంత భావవిహ్వలత. నాకు వారి భక్తి భావమంటే ఎంతో ఇష్టం. వారంటే ఎంతో ఆదరం! వుండేది.

గీతాప్రెస్ స్పెషల్ యాత్ర ట్రైన్ బయలుదేరినపుడు శ్రీశుకదేవబాబు ఖజాంచి లాగ వచ్చారు, సేఠ్‌జీ నన్ను కూడా యాత్రకు తీసుకుని వెళ్ళారు. శుకదేవబాబు, భాయిజీకి అనన్య భక్తుడు. అందుకనే వారికి నేనంటే కూడా చాలా స్నేహభావం వుండేది. యాత్రారంభములోనే వారు నాకు వంద రూపాయలు ఇచ్చారు. కానీ ఒక

సంగతి అనుకోకుండా జరిగింది. ట్రైన్ అలహాబాదు చేరినపుడు మా బంధువు ఒకరు వచ్చి చాలా అత్యవసరమైన పని పడింది అని చెప్పి నాతో రూ.98/-లు తీసుకున్నారు. కానీ నేను మాత్రం ఈ సంగతి శుకదేవబాబాకు తెలుపలేదు. స్టేషను వచ్చినపుడు రైలు నిలబడగానే నేను క్రిందకి దిగేవాడనుకాను. రైల్లోనే స్నాన-సంధ్యలు పూర్తి చేసుకుని భజన చేసుకునేవాడిని. శుకదేవబాబాకు ఈ సంగతి అర్థమయింది. ఏ స్టేషను దగ్గర రైలు ఆగినా ఆవశ్యకతానుసారంగా పదో - ఐదో ఇస్తుండేవారు. నేను కూడా నా నియమం ప్రకారము మిగిలినవి వాపసు చేస్తువుండేవాడిని. వారు చాలా నవ్వుతూ వుండేవారు. భాయిజీని గురించి మాట్లాడుతూ సంతోషపడేవారు. భాయిజీ వారి అనుయాయులలో వీరిది ఒక అలౌకికమైన వ్యక్తిత్వము, భక్తి భావపూర్ణము.

శ్రీ జయ దయాల్ కసేరా -

భాయిజీగారి ప్రాణమిత్రులలో జయదయాల్‌జీ కసేరా ఒకరు. భాయిజీతో చాలా హాస్యంగా మాట్లాడుతుండేవారు. 'బాయిజీ! మీకు భగవంతుడి దర్శనము కలిగింది. మీరు ఈ పని ఎందుకు చేస్తారు? ఆ పని ఎందుకు చేస్తారు?' అని అంటుండేవారు. వారి నిష్ఠ ఎంత దృఢంగా వుండేదంటే ఒకసారి కారు దుర్ఘటనలో వారి కొడుకు చనిపోయాడు. పోలీసులు ఫోన్ చేస్తే వారు అడిగారు అబ్బాయి బ్రతికి వున్నాడా లేదా చనిపోయాడా?' అని. పోలీసులు చెప్పడానికి సంకోచపడ్తున్నారు. అపుడు 'చూడండి చనిపోయినట్లయితే శ్వశానానికి వెళ్ళే తయారీ చేసుకుని వస్తాను. సంబంధీకులకు వార్త పంపుతాను. లేదా బ్రతికి వున్నాడంటే హాస్పిటల్ కోసం ఏర్పాటు చేసుకుంటాను. నాకు నిజం చెప్పండి' అన్నారు. వారు చెప్పగానే భగవన్నామ సంకీర్తన చెయ్యసాగారు. 'జయ రామ హరే సుఖ ధామ హరే జయ జయ ప్రభుదీన దయాలహరే!'

ఒకసారి కోర్టులో ఇదే నామాలను గొంతెత్తి పలుకుతున్నారు, అపుడు అక్కడ వారిని వారించారు. అపుడు వారన్నారు 'నేను ఇది ధర్మరాజు న్యాయాలయం అనుకున్నాను. నాకేం తెలుసు ఇది దుర్యోధనుడి దర్బారు అని'. వారు చాలా యదార్థవాది, దృఢ నిశ్చయము కల్గినవారు.

కసేరాజీ ఈ సంగతి మాకు వినిపించారు. ఒకసారి కలకత్తాలో వారి ఇంటికి ఇద్దరు సాధువులు వచ్చారు. భోజనం పెట్టారు. వెళ్ళే ముందు వారు 'మేము మీ ఇంట్లో భోజనం చేశాము మీకు ఏమీ ఇవ్వకుండా ఎలా వెళ్తాము. మీరు మా ఈ మాటను గుర్తుంచుకొనండి. 'మృత్యు' అన్న పదంలో రెండు అక్షరములు వున్నాయి. 'అమృతం' లో మూడు అక్షరాలున్నాయి. 'మమ' అంటే 'మృత్యు' అని పేరు, 'నిర్మమ' అంటే 'అమృతము' అని పేరు. ఎవరి హృదయములో ఎంత మమత వుంటుందో వారు అంత దుఃఖితులవ వలసి వస్తుంది. బద్ధుడై, భయగ్రస్తుడై వుండవలసి వస్తుంది. ఎవరైతే 'నిర్మము'లై వుంటారో వారు అంతే సుఖియై బుద్ధిమంతులై నిర్భయులై వుంటారు. వారు తమ శరీరమును ఒక తొడుగు అనేవారు.

ఒకసారి గోరఖ్‌పుర్ జిల్లాలో చాలా పెద్ద వరదలొచ్చాయి. మైళ్ళ పర్యంతం నీళ్ళే నీళ్ళు. అపుడు మేము వరదపీడితుల సహాయార్థం నావలో ఒక వూరికి వెళ్ళాము. భాయిజీ హనుమాన్ ప్రసాద్ పొదార్, జయదయల్ కసేరా, ఘనశ్యామ్ దాస్ జలాన్, నేను మరియు వెంట ఇంకా చాలామంది వున్నారు. ఒక చోట 10, 15 గజముల పొడవు వంతెన విరిగిపోయింది. కాలువ చాలా వేగంగా ప్రవహిస్తోంది. నావ అక్కడి నుండి దాటడం కష్టమే. వూరి వారు ఒక తాటి చెట్టును ఒక దగ్గర వంతెనలాగ వేసి పెట్టారు. జయదయాల్, కసేరాజీ 'జయరామ్ హరే సుఖ ధామహరే' ఉచ్చారణచేస్తూ తాటి చెట్టు వంతెన మీద నుండి దాటి వెళ్ళారు. వారి వెనకాల భాయిజీ, భాయిజీ వెనకాల నేను దాటి వెళ్ళాము. కానీ ఘనశ్యామ్‌దాస్ జాలాన్ చాలా చుట్టుతిరిగి వచ్చారు. భాయిజీ వారి సత్సంగము వలన కసేరాజీ జీవితంలో అంతటి నిర్భయత వచ్చింది. మొదట కసేరాజీ దగ్గర చాలా సంపద వుండేది. వారి మనసులో లచ్చీరామ్‌జీ చూడీవాలె, చిరంజీలాల్ లయలకా వారితో కలసి కారులో, బస్సులో భారతేదశ యాత్ర చేయాలని వుండేది. విద్వాంసులైన వక్తలు వెంట వుండాలి. వాడ వాడలా సనాతన ధర్మప్రచారము జరగాలి. కానీ ఇది భగవంతుడికి ఇష్టం కాలేదు. సంకల్పపూర్తి జరగడంలో ఆలశ్య మయింది. వారి సంపద క్షీణించింది, కానీ వారి ధర్మనిష్ఠ, భగవద్విశ్వాసము వృద్ధి చెందినవి.

మొదటిసారి ఎపుడైతే తీర్థయాత్ర స్పెషల్ ట్రైన్ 3నెలలు కోసమని తీర్థయాత్ర పరిభ్రమణకని బయలుదేరిందో అపుడు భాయిజీతో సంప్రదించియే తీర్థయాత్ర ప్రారంభించారు. వెంట విధవరాలైన కోడలు, ఒక నౌకరు వున్నారు. పరిస్థితి విషమంగా వున్నా కూడా ఆ 3 నెలలు వారే నా తిండి, బట్ట అన్నీ చూచుకున్నారు. ఒక బర్త్ పూర్తిగా నాకు కేటాయించారు. దాదాపు రాత్రింబవళ్ళు మేము కలిసే వుండేవారము. సత్సంగము బాగా జరిగేది. సేఠ్ జయదయాల్‌జీ లాగ వీరు కూడా మించి వేదాంత జ్ఞానము కలిగినవారు. వారు ఉత్తములు, సత్పురుషులు, ఉదారులు, సజ్జనులు అని భాయిజీ పట్ల వారికి చాలాశ్రద్ధ వుండేది. వారు భాయిజీతో ఒకరకంగా వినోదంగా హాస్యం కూడా చేసేవారు. భాయిజీ కూడా వారితో మనసువిప్పి కలిసిపోయి వ్యవహరించేవారు. కసేరాజీని గురించి నేను వేరే ఇంకొక సారి వ్రాస్తాను.

శ్రీ జ్వాలా ప్రసాద్ కానోడియా -

కానోడియా మార్వాడి సమాజములో ఒక ప్రతిష్ఠితుడైన వ్యక్తి. గీతా - ప్రెస్‌కి ట్రస్టీగా వుండేవారు. భాయిజీకి పాత మిత్రులు. భాయిజీ సాధారణంగా కలకత్తాలో వారి దగ్గరనే బస చేసేవారు. లేక వేరుగా కూడా వారి దగ్గర వున్నారో నాకు సరిగ్గా గుర్తులేదు. ఈ సంగతి వ్రాసే సమయానికి సుమారు 50సం॥లు అయి వుంటుంది. కానోడియాగార్కి, భోజనం పెట్టడమంటే చాలా సరదా. రకరకాల వంటలు చేయించి అతిథులకు తినిపించి ఆనందిస్తుండేవారు.

ఆ రోజులలో కలకత్తాలో హిందు - ముస్లింల గలాటా చాలా వుండేది. అక్కడి నాయకులు వీధి వీధుల్లో వెళ్ళి శాంతి స్థాపన కొరకు ప్రజలకు నచ్చజెబుతు వుండిరి. నేను, భాయిజీ మరి జ్వాలా ప్రసాద్ కానోడియాతో కలసి ఇదే పనిలో పట్టణం వెళ్ళాము. నాకేం తెలుసునని కానీ, భాయిజీ స్నేహవశుడై నన్ను తనతో తీసుకుని వెళ్ళారు. నాకు కారులో నిద్ర పట్టింది. నేను ఒక కలగన్నాను. ఆ కల ఇలాగుంది -

జ్వాలా ప్రసాద్‌జీ వారింటికి తీసుకువెళ్ళి నన్ను చాలా బలవంతపెట్టి భోజనం తినిపించారు. నాకు కడుపు పగిలిపోయింది. నేను చనిపోయాను. నాకు పాడె తయారు చేశారు. వంతెన క్రింద గంగాతీరములో చితిపై నా శరీరమును కాల్చివేశారు. పొగలు

సెగలతో చితి కాలుతూవుంది. సేఠ్ జయదయాల్‌జీ, భాయిజీ, జయదయాల్ కసేరా, జ్వాలా ప్రసాద్ కానోడియా మరియు బద్రీదాసు, రామ చంద్ర గోయెంకా, నన్ను గురించి చర్చించుకుంటు వుండిరి. చనిపోయిన తర్వాత ప్రజలు చాలా ప్రశంసిస్తారు అని విన్నాను. ఒక్క సారిగా నాకు ధ్యానంలోకి వచ్చింది, అరె! నేను చనిపోయాను కదా, శరీరము చితిపైన కాల్తూ వుంది, నేను చూస్తున్నాను. వింటున్నాను. మరి ఇంతకూ చనిపోయిందెవరు? అంతలో భుజం పట్టి కుదుపుతూ భాయిజీ నన్ను మేల్కొలిపారు, మోటారు హవురా బ్రిడ్జివైపు వెళ్తూవుంది. నేను నా స్వప్నమును గురించి తెలిపాను. భాయిజీ అన్నారు 'మీకు దీర్ఘాయుష్షు కలుగుతుంది' అని నిజంగానే భాయిజీ భవిష్యవాణి నిజమయింది. ఇంత వరకు నేను జీవించయే వున్నాను.

అమ్మాయి పెళ్ళి -

నేను మొదటే చెప్పివుంటిని మా పరివారము పరంపరాగతంగా చాలా నిష్ఠావంతమైన సనాతన ధర్మపరాయణులు. ఎలాగైతే బ్రాహ్మణ కుమారుడికి 8సం॥ల వయసుకంతా యజ్ఞోపవీతము సంస్కారము జరిగి గురుకులములో వెళ్ళి అధ్యయనము చెయ్యవలసిందే. అలాగే అమ్మాయి పెళ్ళి కూడా రజస్వల అవడానికంటే ముందే చెయ్యాలి. అమ్మాయికి అదే గురుకులము, అక్కడి పారంపరిక ఆచారములను నేర్చుకొనవలె. అదే అధ్యయనము. గృహస్థధర్మాన్ని నిర్వహించడమే అగ్నిహోత్రము, గురుసేవతో సమానము. నా మనసులో కూడా అదే సంస్కారము వుండేది. నాకు ఒక కూతురుండేది కమల. తన వివాహము జరిపించవలసి వుండెను. బలియాలోని పండిత్ శ్రీ పరశురామ్ చతుర్వేది యొక్క పుత్రుడున్నాడు. యోగ్యుడు, సుందరుడు, సుశీలుడు అని తెలిసింది. భాయిజీ ఒక ఉత్తరము వ్రాసి ఇచ్చారు. నేను తీసుకుని వారి దగ్గరకు వెళ్ళాను. భాయిజీ తన సౌజన్యంతో, ఉదారతతో ఉత్తరంలో నన్ను గురించి, కమలను గురించి ప్రశంశిస్తూ వ్రాశారు. ఏ గుణాలు మాలో లేవో అవి కూడా వారు వ్రాశారు. ఇంకేమున్నది! చతుర్వేదిజీ, శ్యామసుందర్‌జీ (సెక్రటరి) ఉపాధ్యాయ్, వెంటనే సంబంధం స్వీకరించారు, భాయిజీ వివాహపు ఏర్పాట్లు గావించారు. ఇది ధ్యానంలో పెట్టుకోండి ముందు - భాయిజీ మరి డబ్బున్న వాడేమీ కాదు. కేవలం గృహస్థాశ్రమ నిర్వహణ మాత్రమే జరిగేది. కానీ భాయిజీ

వారి మిత్రులెవరికో చెప్పి వివాహపు ఖర్చులకు ఏర్పాటు చేశారు. అలాగ నేనూ ఎపుడూ గీతాప్రెస్, కల్యాణ్‌ల నుండి నాకోసము డబ్బు తీసుకోలేదు. వివాహమునకు 'కల్యాణ్' పరివారము నుండి పండిత్ భువనేశ్వరనాథ్ మిశ్ర (మాధవ) మరియు పండిత దేవధరశర్మలను భాయిజీ పంపారు.

దేవ చంద్ర వర్మ -

నేను గోరఖ్‌పూర్ కల్యాణ్ - పరివారములో వుండేటపుడు ఇండోర్ నుండి ఒక సజ్జనుడు వచ్చాడు. యువకుడు, ఒక్క చక్కని శరీరము, మృదుభాషి. వారు చాలా దీర్ఘకాలము భారతదేశ (దక్షిణము నుండి ఉత్తరమునకు) యాత్ర చేసుకుని వచ్చారు. వారు తన ఈ సుదీర్ఘ యాత్ర యొక్క విలక్షణమైన ఉద్దేశ్యము ఇలాగ చెప్పారు.

వారు నలుగురైదుగురు మిత్రులు కలసి ప్రతిరోజు భగవన్నామ సంకీర్తత చేస్తుండేవారు. ఒక రోజు చాలా ఆశ్చర్యకరమైన సంఘటన జరిగింది. రాత్రి 12 గంటలపుడు ఒక విమానము వచ్చింది. దాని ద్వారము వద్ద హృష్ట పుష్ట (బలిష్టుడైన) దేవపురుషుడు నిల్చుని వున్నారు. వారు నాతో కాళ్ళు చేతులు కడుక్కుని విమానం లోపలికి రమ్మన్నారు. నేను అలాగే చేశాను. విమానంలో 90 ఆసనములు వేసి వుంచారు. అందులో రెండు ముఖ్యమైనవి. పిలిచిన ఆ పురుషుడు అన్నాడు 'చూస్తు వుండు!' ఒక్కొక్కరుగా ఆ విమానములోపలికి విలక్షణమైన సంత్ మహాత్ములు రాసాగారు. అన్ని సాంప్రదాయముల వారు, అన్ని జాతులవారు. యోగి అరవింద్, రమణమహర్షి, ఉడియాబాబాజీ, హరిబాబా, అచ్యుతముని, జయదయాల్ గోయెంకా లెఖ్ఖగా 90 మంది మహాత్ములు వచ్చారు. లోక వ్యవహారములో పరంపరా విరోధి కావచ్చు, ఒకరినొకరు ఖండన మండన చేసుకునే వారు కూడా, ఆఖరున భగవాన్ శ్రీరామకృష్ణ కూడా వచ్చారు. పురాతన ఋషులు, మునులు కూడా వచ్చారు. దేవచందవర్మ అన్నారు - నాకు పరిచయం చేస్తువుంటే నేను ఆశ్చర్య చకితుడను అయ్యాను. సంత్ మహాత్ములలో కొందరు ప్రాచీనులు, కొందరు నవీనులు, కొందరు ఇపుడు జీవించివున్న మహాత్ములు కూడా వున్నారు. వారందరూ ప్రేమతో పరస్పరం విచార - విమర్శలు చేసుకుంటున్నారు. పరిచయం చేస్తున్న అతనితో నేను అడిగాను వీరు వ్యవహారములో పరస్పరం ఎక్కడ కనిసినట్లు కన్పించదు మరి వీరందరు

ఇక్కడ ఎలాగ ఏకత్రితమయ్యారు?'

పరిచయం చేస్తున్న పురుషుడన్నారు 'అభిప్రాయ భేదములన్నీ బాహ్యమైనవే. పరమార్థములో ఎవరికీ ఎవరితోనూ భేదాభిప్రాయములేదు. వివిధ ప్రకారములైన అధికార భేదము (యోగ్యత) కల్గిన వారికి భిన్న భిన్న యుక్తుల ద్వారా ఒకే పరమాత్మ వైపు నడిపించడమే అందరి ఉద్దేశ్యము. కొందరు పాశ్చాత్య సంస్కారం కలిగిన వారిని, కొందరు సుసంస్కృతులైన వారిని, కొందరు రైతులను, కొందరు మూర్ఖులను, కొందరు పండితులను భగవంతుడివైపు నడిపించడానికే నిశ్చయముగా పనిచేయు చున్నారు. అంతా ఒకే త్రాసులోని వారే. లోపల అంతా ఒక్కటే బయట మతభేదమన్న క్రీడ. ఆట (లీల) ఈవిధముగా అందరూ సంత్ మహాత్ములు అధికార భేదంతో విలక్షణమార్గమును నిర్దేశిస్తు అంతర్దేశములో ప్రవేశింపజేస్తున్నారు.

దేవ చంద్ర వర్మ చెప్పారు - ఆ రోజు నాటికి నేను ఏ మహాత్ముడిని దర్శించి వుండేలదు. ఆశ్చర్యంతో నేను యోగి శ్రీ అరవింద్, శ్రీరమణ మహర్షి, శ్రీఉడియా బాబా, శ్రీహరిబాబా వారి దర్శనము చేసుకుని ఇక్కడికి వచ్చాను. ఇక్కడ కూడా అదే సేఠ్ జయదయాల్ గోయెంకా, అదే భాయిజీ నేను విమానంలో దర్శనం చేసిన వారే, ఇక్కడ బయట దర్శనమిస్తున్నారు. దేవచంద్‌వర్మ ఇంకా ఇలా అన్నారు - నాతో ఒక పొరపాటు జరిగిపోయింది. నాకు ఎవరితోనూ ఈ విషయం చెప్పవద్దని వారు చెప్పి వుండిరి. కానీ విమానము నుండి దిగగానే ఆనందంతో నా మిత్రులకు ఈ సంగతులన్నీ చెప్పేశాను. ఇక నాకు మరల ఆ దర్శనం కలుగలేదు.

దేవచంద్ వర్మ చాలా కాలం వరకు 'కల్యాణ' పరివారంలో వున్నారు. నేను చెబుతుండేవాడిని వారు వ్రాస్తుండేవారు. భాయిజీ అంటే అనన్య భక్తి వారికి, నేనంటే ఎంతో ప్రీతి. కొద్ది రోజుల క్రిందటనే వారు గోలోక ధామం చేరారు.

దేవచంద్ వర్మ నాతో చాలా సంవత్సరముల వరకు కలిసి వున్నారు. మాటి మాటికీ ఈ చర్చ జరుగుతూ వుండేది. సుమారుగా 1940లో అనుకుంటాను ప్రయాగలో కుంభమేలా జరిగింది, అందులో మేము ఇరువురము ఒకే దగ్గర వున్నాము. వృందావనం నుండి ప్రకాశితమయ్యే 'సుదర్శన' పత్రికలో నేను ఈ

సంఘటనను గూర్చి వ్రాశాను, సంత్ మహాత్ములు బాహ్యరూపంగా ఎంత భిన్న భిన్నంగా కనిపించినా, అంతర్యంలో ఒకటే వుంటారు. సూక్ష్మరూపంలో 3 నెలలకు ఒకసారి కలుసుకకుని పరస్పరం విచార విమర్శలు చేసుకుంటారు. ఈ మాట నాకు వర్మ గారు తెలిపారు.

ఎక్కడైనా సమాధి వున్నదా? సమాధి? (గోరి) (కబ్ర్)

నేను 'కల్యాణ్' పరివారము నుండి మాటిమాటికీ శ్రీ ఉడియాబాబా వారిని కలుసుకోడానికి వస్తుండేవాడిని. ఒకసారి కర్ణవాసములో వారు నన్ను 'కల్యాణ పరివారములో సంస్థాపకులు, ప్రకాశకులు, సంపాదకులు వీరి విచార వ్యవహారములు ఎలాగున్నాయి? అని అడిగారు. నేను వారిని చాలా చాలా ప్రశంశించాను. దానిపై బాబా నాకు ఒక కథ వినిపించారు.

బాబా అన్నారు - 'ఒక ఫకీరుండేవాడు. వారు భిక్ష కొరకు వూరిలో వెళ్ళినపుడు అడుగుతుండేవాడు ఎక్కడైనా గోదీ వుందా గోరీ? వారు భిక్ష తీసుకుని వెళ్ళిపోయేవారు. వారి మాటలను ఎవరు అర్థం చేసుకోలేదు. ఒక విచారశీలుడైన సద్గృహస్థుడు వారి మాటలను అర్థం చేసుకున్నారు. వారు ఫకీరును అడిగారు 'ఎక్కడైనా శవం వుందా శవం?' ఫకీరు తన శరీరమువైపు చూపిస్తూ 'ఇదే శవం' అన్నారు. సద్గృహస్థుడు తన ఇంటివైపు చూపి 'ఇదే గోరీ' అన్నాడు. ఫకీరు సద్గృహస్థుడి ఇంటిలో ప్రవేశించి అక్కడనే వుండిపోయారు. ఫకీరు తన గదిలో మౌనంగా వుంటు భగవద్భజన చేసుకుంఉ వుండేవారు. అన్న పానాదులు సమయానికి అందుతుండేవి. ఎవరితో ఏమీ లావాదేవీలు ఏమీ లేదు, ఈ విధంగా 12 సం॥లు గడిచిపోయాయి. భగవదనుగ్రహంతో ఒకరోజు రాత్రి సమయంలో సద్గృహస్థుడి ఇంటిలో దొంగలు పడ్డారు. వారు వజ్రాలు, ముత్యాలు, బంగారం, నగలున్న పెట్టెను వారింటి నుండి తీసుకున్నారు. గృహస్థుడు నిశ్చింతగా పడుకుని నిద్రపోతున్నారు, ఫకీరు మేల్కొని వున్నాడు. వారు చూశారు ఏ ఇంటిలో 12 సం॥లు నా నిర్వాహం జరిగిందో, నేను చూస్తు చూస్తు అదే ఇంటిలో చోరీ జరిగిపోయింది. ఇది సరికాదు. కానీ తను ఏంచెయ్యగలడు? ఒకవేళ గృహస్థు లేచాడంటే వీళ్ళు కొట్టవచ్చు. ఫకీరు ఎవరికీ ఏమీ చెప్పకుండా చుప్‌చాప్‌గా దొంగలను వెంబడించారు. దొంగలు అడవి దారిలో

వెళ్ళేటపుడు ఫకీరు తన లంగోటి చింపి చింపి చెట్లకు అక్కడక్కడ గుర్తుకోసం కట్టాడు. దొంగలు ఆ పెట్టెను ఒక బావిలో వేశారు. ఫకీరు చూసి ఇంటికి తిరిగి వచ్చారు. రెండవ రోజు ఫకీరు గృహస్థుడికి జరిగినదంతా చెప్పారు. సంపదంతా దొరికిపోయింది. గృహస్థుడు దొంగలను పట్టుకోవడానికి ఏమీ ప్రయత్నించలేదు.

మధ్యాహ్నము భోజనాలు అయ్యాక విశ్రాంతి సమయంలో గృహస్తుడు, ఫకీరు దగ్గరికి వచ్చి వినయముగా ఇలా అడిగారు, 'మహరాజ్! గోరీ నిజమైనదా? శవం నిజమైనదా?' ఫకీరు అన్నారు 'భాయి! గోరి నిజమైనది. శవం అసత్యమైనది'. ఆరోజే ఫకీరు అక్కడి నుండి అజ్ఞాత ప్రదేశమునకు వెళ్ళిపోయారు.

శ్రీ ఉడియాబాబా చెప్పదలచినది ఏమిటంటే 'కల్యాణ' పరివారంలోని వారు అందరూ మంచివారు. వారు స్వయంగా తమ శ్రీముఖంతో ఈ మాట చెప్పారు. 'హనుమాన్ ప్రసాద్ నిజమైన భక్తుడు, వారి హృదయములో భక్తిదేవి ప్రతిష్ఠింప బడివుంది. కానీ ఫకీరూ! శవం నిజమైనది కాదు'. వారు అభిప్రయామేమిటంటే నాకు ఎక్కడయినా వారి యందు ఆసక్తి కలుగుతుందేమో అని! దీనిని నేను బాబా గారికి నాపైన చాలా అనుగ్రహం, ప్రేమ అని తెలుసుకున్నాను. వారు నన్ను ఒక ఉచ్ఛకోటి మహాత్ముడిగా చూడాలనుకుంటున్నారు. నేను మనసులో సన్యాసము తీసుకోవడానికి సంకల్పము చేసుకున్నాను. అప్పటి నుండి మనసులోనే సన్యాసము నకు తయ్యారి మొదలైంది. భాయిజీ ఈ సంగతిని బాగా గ్రహించారు. వారు తమ సన్యాసము కొరకు ఒక కమండలము కూడా తయారుగా పెట్టివుండిరి.

ఆ రోజులలో 'కల్యాణ' విశేషాంకముగా 'సంక్షిప్త - మహాభారతం' ప్రచురిం చాలని నిశ్చయమైంది. సేఠ్ జయదయాల్ గోయెంకా, ఘనశ్యాం దాస్ జాలాన్ వారు సంక్షిప్తము చేస్తువుండిరి. వారు గుర్తు పెడుతూ వుంటే నేను సరళ హిందీలో అనువాదము చేస్తువుండేవాడిని. 'ఆదిపర్వం' మరియు 'సభాపర్వము' యొక్క అనువాదము నేను చేశాను. నా చిత్తంలో కొంచెం గ్లాని కలిగింది - ఎందుకంటే వారు అక్కడక్కడ మహాభారతంలో నియోగాది ప్రసంగాలు వచ్చినపుడు 25 నుండి 50 అధ్యాయముల వరకు తీసివేశెడిడారు. నేను కాశీలోని మహామండలేశ్వరులు పండిత శ్రీవిద్యాధర గౌడతో మరిము శ్రీకరపాత్రజీ మహరాజుతో సలహా తీసుకున్నాను.

మహాభారతములోని అన్ని ప్రసంగాలతోను మాకు సమ్మతి వున్నది, వాటి మహత్వమును అంగీకరిస్తాము. వీలైనందమటుకు దేశ, కాల, అధికారి, వ్యక్తి, శక్తి, వయసు, పరిస్థితి, దైవము, మనుష్యయోని మొదలైన భేదములు ద్వారా అన్ని ప్రసంగాలకు మేము సంగతి సమన్వయము చేయుచుంటిమి. మా బుద్ధి ఇపుడు కూడా అలాగే వుంది, అంతే కాదు, మహాభారతము యొక్క ప్రత్యేక ప్రసంగము కూడా భవిష్యత్తు కొరకు కూడా ఉపయోగపడేదే - అని మా అందరి అభిప్రాయము. శ్రీభాయిజీతో ఈ విషయంలో సంప్రదించగా వారు ఉదాసీనంగా వుండిపోయేవారు. ఎందుకంటే సేఠ్‌జీ యొక్క క్రియా - కలాపములలో వారు ఏవిధమైన హస్తక్షేపము చేశేవారు కాదు. నేను శ్రీ జ్యోతిష్పీఠ శంకరాచార్యులు శ్రీ స్వామి బ్రహ్మానంద సరస్వతి గారి వద్దకు వచ్చాను, సన్యాసమును స్వీకరించాను. సన్యాసమునకు పృష్ఠభూమి ముందాగానే తయారువుండేది. సన్యాసము తీసుకున్న రోజు రాత్రి నాకు మా పితా - పితామహులు స్వప్నాను మోదనము (కలలో కన్పించి అంగీకరించారు) లభించింది. మధ్యప్రదేశ్‌లో కటనీ దగ్గర ఒక యేరు దగ్గర వెళ్ళి వుండసాగాను. శ్రీభాయిజీకి సూచన పంపించాను.

మా తల్లిగారికి నేను సన్యాసినయ్యాననే సంగతి తెలియగానే వారు గోరఖ్‌పూర్ భాయిజీ దగ్గరికి వచ్చారు. చాలా దుఃఖితులయ్యారు. భాయిజీ వారికి చాలా స్వాంతన కలిగించారు. 'ఎవరైనా సాధారణవ్యక్తి సన్యాసము తీసుకుని వుంటే వారికి నచ్చజెప్పి తిరగి గృహస్థాశ్రమములోకి తీసుకురావచ్చు. కానీ వారు విద్వానులు, 'కల్యాణ్'లో వారివి ఎన్ని రచనలు ప్రచురించబడ్డాయి. ఒకవేళ నేను బలవంతంగా వారిని తిరిగి తీసుకురావడానికి ప్రయత్నించానంటే, వారి యశస్వీ జీవితంలో విఘ్నమేర్పడుతుంది. లోకులు నిందిస్తారు' అని భాయిజీ మా అమ్మగారికి నచ్చజెప్పారు. మా అమ్మగారు ఈ మాట వినగానే వెంటనే 'వద్దు, వద్దు, నేను వారికి అపయశస్సు కలిగేలాంటి పని ఏదీ చెయ్యను. నేను కూడా ఇల్లు వాకిలీ వదిలివేస్తాను. సన్యాసినినవుతాను. అంతే కానీ తన జీవితంలో అలాగ ఏమీ జరగకూడదు. దేని వలన అపకీర్తి కలుగుతుందో అది'. అని మాతాజీ ప్రసన్నంగా ఇంటికి తిరిగి వెళ్ళారు. భాయిజీ మా అమ్మాయి పెళ్ళి అబ్బాయి చదువు ఏర్పాట్లు ముందే చేసి వుండిరి.

నా కుడిచెవిలో నుండి చీము కారుతూ వుండేది. శ్రీ బిపిన చంద్ర మిశ్ర దీరు తర్వాత హైకోర్టు జడ్జి అయ్యారు. యథాశక్తి చికిత్స చేయించారు. ఇర్విన్ హాస్పిటల్ డాక్టరు హంసరాజ్ కూడా చాలా ప్రయత్నించారు. కానీ ఏమీ మేలు కలగలేదు. భాయిజీ తన మనుషులను పంపి నన్ను గోరఖ్‌పుర్ పిలిపించుకున్నారు. వారు నా తలను తన తొడపై నిడుకుని వారు తన చేత్తో నా చెవిలో మందు వేశేవారు. నవ్వుతూ వినోదంగా, చూడండి! నేను మీ చెవి పట్టుకున్నాను అని అంటుండేవారు. నేను కొన్ని నెలల వరకు గోరఖ్‌పూర్‌లోనే వున్నాను. శ్రీ మద్భాగవతము విశేషాంకముగా, భాగవత అనువాదము మునుపు ప్రకాశితమైనదో, దానిలో కొన్ని మార్పులు చేర్పులతో మూలశ్లోకములతో పాటు పెట్టాలి. తర్వాత భాయిజీ తన భార్యతో కలసి భాగవత సప్తాహము శ్రవణము చెయ్యడానికి కూర్చున్నారు. జైలు వెనుక భాగంలో పరమేశ్వరలాల్ తీసుకున్న భూమిలో చాలా గొప్ప ఏర్పాట్లతో శ్రీమద్భాగవత సప్తాహము జరిగినది. కలకత్తా, బొంబాయి నుండి భాయిజీ భక్తులంతా వచ్చారు. నేను మొదటి రోజు మహాత్మ్య శ్రవణము చేయించానో, అపుడు భాయిజీ సభలో లేచి నిల్చుని అన్నారు - 'వీరు మూలము నుండి ఒక్క అక్షరము కూడా వదలలేదు.' ఒక్కొక్క రోజు పది గంటలు కూడా చెప్పాను. సాయంకాలానికి కళ్ళు వాచిపోయేవి. మరల ప్రొద్దుటకి సరిపోయేవి. కథ సమాప్తమయ్యే రోజున ఒక సజ్జనుడు మధ్యలోనే లేచి నిల్చుని ఇలా అన్నాడు 'శ్రీమద్భాగవతంలో ధర్మసంరక్షణ సంవర్ధము కొరకే శ్రీకృష్ణుని అవతారమెత్తారని మీరు చెప్పాను. కానీ ఏమయింది? వారి వంశంలోని వారే ధర్మవిరోధులయ్యారు, పరస్పరం చంపుకున్నారు. ఏరోజునయితే, ఏ క్షణములో నయితే శ్రీకృష్ణుడి చరణారవిందము ఈ ధరాధామముపై నుండి వెళ్ళిపోయిందో, ఆక్షణము నుండి కలియుగము భారతదేశములో ప్రవేశించింది. ఇక మరి ఇది ఏమి ధర్మస్థాపన అయినట్లు?'

'వారి చరిత్రయే ధర్మసంస్థాపన, ఈ నాటి వరకు ధర్మ-సంరక్షణ, సంవర్ధనము, సంస్థాపనము, ప్రతిష్ఠాపనములో సంలగ్నమై వున్నది' అని నేను జవాబు ఇచ్చాను. ఇది శ్రీమద్భాగవత రూప చరిత్ర ద్వారానే ధర్మము యొక్క సంస్థాపన జరిగినది.

భాయిజీ లేచి - ప్రశ్నోత్తరములు చెయ్యాలనుకుంటే, కథ (ప్రవచనము)లో చెయ్యకండి. ఇంటి దగ్గరికి వచ్చి చెయ్యండి. కథ నిర్విఘ్నముగా సమాప్తమయినది.

అక్కడ వుండేటపుడు ఒకరోజు నన్ను భాయిజీ పైకి పిలిపించి ఇలా అడిగారు. 'స్వామీజీ! నాకు నింతరం భగవత్స్మరణ ఇపుడు కలగడం లేదు'. నేను 'భాయిజీ ఈ విస్మరణ కూడా వారు (ఆ భగవంతుడు) ఇచ్చిందే' అని అన్నానో లేదో వెంటనే వారు ఈ మాట వినగానే భాయిజీ నేత్రాల నుండి అశృపాతం! భావమగ్నులైపోయారు. అన్నారు 'ఆహా! ఆహా! ఈ విస్మరణ కూడా వారు ఇచ్చినదే, వారు ఇచ్చినదే'.

భాయిజీ యొక్క ఈ స్థితి చూచి నాకు చాలా ఆనందం కలిగింది నిజం చెప్పాలంటే ఇది నిజమైన స్థితి. స్మరణ - విస్మరణ, జ్ఞానము - అజ్ఞానము ఇవన్నీ కూడా భగవంతుడి కృపా ప్రసాదమే - అన్న ఈ సంగతి అర్థమయిందంటే, జీవితంలో సమస్య అన్నది ఏమీ ఉండనే వుండదు. భగవంతుడి దర్శనము సర్వత్ర కలుగుతుంది. నిజముగా భీయిజీ యొక్క సిద్ధాంతములు, అనుభవము ఇదే - అంతా భగవంతుడి లీలయని! ఇందులో జీవుడి కర్తవ్యము ఏమీలేదు, జగత్తుది కూడా స్వసత్తా ఏమీ లేదు. లీలయే లీల. అంతా లీలయే.

నర్మదా తీరములో

కణకణములో రామ నామము -

కైలాసాశ్రమము, ఋషీకేశ్‌లోని మహా మండలేశ్వరులు శ్రీ స్వామి శ్రీ చేతన గిరిజీ మహరాజ్, నర్మదా స్నానము చేసి జబల్‌పూర్ తిరిగి వెళ్ళడానికి తయారవుతున్నారు. వారి దృష్టి ఒక నవయువకుడైన స్వస్థుడైన ఒక సాధువుపైన పడింది - నేలపైన పడుకుని వున్నాడు. మామూలు సాధారణమైన బట్టలు, శరీరము మంచి బంగరువన్నె! స్వామీజీ 'విరక్తుడివి, యువకుడివి, స్వస్థుడైవున్నావు. ప్రాతః కాలములో భగవద్భజన చేసే సమయము. ఉత్సాహము, దృఢతతో జీవిత పరమ, చరమ లక్ష్య ప్రాప్తి కొరకై కృషి చెయ్యాలి. నీవు నీ ఆయుస్సును ఎందుకు ఇలా వ్యర్థం చేసుకుంటున్నావు? అని కోప్పడ్డారు. పడుకుని వున్న ఆ సాధు సైగచేసి తన దగ్గరికి పిలిచారు 'మీరు నా దగ్గరికి రండి' అని. స్వామిజీ దగ్గరికి వెళ్ళారు. సాధు అన్నారు 'మీరు నా చెయ్య తీసుకుని మీ చెవి దగ్గర పెట్టుకోండి'. స్వామిజీ అలాగే చేశారు. ఆ సాధువు చెయ్యి నుండి రామ నామ ధ్వని స్పష్టంగా వెలువడుతోంది. సాధువు చెప్పడం వలన తలపైన, ఎదపైన ఆఖరికి చరణాలపైన కూడా చెవి యొగ్గి విన్నారు. సర్వత్ర స్పష్టంగా ధ్వని వస్తుంది 'రా...మ్, రా...మ్, రా...మ్' అని స్వామీజీ అన్నారు 'బాబా! మీరు పడుకునే వుండండి. మీకు భజన చెయ్యవలసిన అవసరము లేదు. మీ స్వరూపము, స్వభావము, రోమరోమము కణ కణము రామ రామ నామము యొక్క అనురాగరంజితమైవున్నది. ఇదే జీవితము యొక్క సాఫల్యము. మీ శరీరము మాయ - ఛాయ నుండి ముక్తమయినది. భగవన్మయమైనది' నేను ఎపుడైనా జబల్‌పూర్ వెళితే అపుడపుడు నాతో పాటు వృద్ధ సంత్ బృందావన మహాత్ముడు పూల్‌చోర్‌బాబా వారిని కలుసుకోవడానికని వస్తుండేవారు.

దొంగ సంత్ -

పూల్‌చోర్ బాబా ఈ మధ్య ఒక సంవత్సరము క్రిందట బృందావనములో లీనమయ్యారు. వారికి దాదాపు వందసంవత్సరాలు వుంటాయి. గౌరవర్ణంతో, చాలా సుందరమైన శరీరం! ఎక్కడా ముడతలు లేవు! దూదిపింజల్లాగ తెల్లటి వెంట్రికలు, పొడవైన గడ్డము! నాకు చాలా ఇష్టము వారంటే! వారు కూడా నన్ను చాలా ప్రేమించేవారు. బొంబాయిలో తన పెద్ద వ్యాపారమును వదులుకుని వచ్చేశారు. జీవితమంతా కుటీరము కట్టలేదు, శిష్యులను చేసుకోలేదు. రాత్రి ఎవరినీ తన దగ్గర వుండనిచ్చేవారు కాదు. ఒంటరిగా వుండేవారు. ఒకపైసా కూడా తన దగ్గర వుంచుకునేవారు కాదు. చరణమును స్పర్శిస్తే కోప్పడేవారు. తరిమేశేవారు లేకుంటే కొట్టేవారు. ఫొటోలు తీయించుకునేవారు కాదు. తన ప్రశంస వినేది లేదు. ఎవరైనా ప్రశంశిస్తే 'మీ అవ్వ చావనీ' అని తిట్టి భగవత్ చర్చ చెయ్యమనేవారు. వారికి ఒకే ఒక్క వ్యసనము వుండేది. ఎక్కడి నుండి అయినా మంచి మంచి పువ్వులు ఏరి వృందావనములోని శ్రీ బాంకేబిహారీజీ మందిరాలలో, రాసలీల స్వరూపాల శృంగారము కోసం వాడుకునేవారు. ఈ పూలదొంగతనము అనే అపరాధ కారణముగా సేఠ్‌లు చాలాసార్లు వారిని కొట్టారు. కానీ వారు తన పని మానలేదు. తోటలో కాలువలో నీళ్ళు పోయే దగ్గర కూడా దూరిపోయేవారు. తాళం పెట్టి కాపలా పెట్టారు. కానీ వారు పువ్వుల దొంగతనం మాత్రం మానలేదు. ఒకసారి వారి వీపుపైన లాఠీదెబ్బ తగిలింది. నా దగ్గరికి అరుస్తూ వచ్చారు 'చూడు చూడు నీ రాజ్యములోని పరిస్థితి'. వారి మనసులో ఎవరి పట్ల కూడా రాగద్వేషములు పక్షపాతము అన్నవి సర్వథా వేండేవే కావు.

వృందావనమంటే వారికి చాలా ప్రియము. కానీ సత్సంగము రాసలీల వీటి ప్రలోభనంతో వీటి కోసమని బృందావనము దాటి కూడా బయటకు వెళ్తుండేవారు. ఒక్క ఇంటి నుండి ఒక్క రొట్టెనే తీసుకునేవారు అది నియమము. నిలబడి నిలబడే తింటుండేవారు. 5 ఇళ్ళ వరకే బిక్ష చేసేవారు. ఒకసారి బొంబాయి వెళ్ళారు. భిక్ష కోసమని ఒక ఫ్లాట్ దగ్గరికి వెళ్ళి కాలింగ్ బెల్ నొక్కారు. వాకిలి తెరిచి బాబాను చూసి ఇంటావిడ భయపడిపోయారు. వెంటనే తలుపుమూసి పోలీసులకు ఫోన్

చేశారు. పోలీసులు వచ్చారు. బాబాని పట్టుకున్నారు. థానాలో తీసుకువెళ్ళి కూర్చో బెట్టారు. థానాదారుని 'ఒక రొట్టె నీవే ఇచ్చేయ్' అని అడిగి తినేసి పడుకుని నిద్రపోయారు. సాయంకాలం నా ప్రవచన సమయానికి 'నీకు నాపైన విశ్వాసముంటే నన్ను ప్రవచన వినడానికి వెళ్ళనీ' అని థానాదారుని అడిగారు. నేను మరల తిరిగి వస్తాను. విశ్వాసము లేకపోతే నీవు కూడా నాతోరా. ప్రవచనం విన్నాక ఇద్దరం కలసి వచ్చేదాం' అని అన్నారు. థానేదారు అన్నాడు 'బాబా మీరు వెళ్ళండి. తిరిగి రావలసిన అవసరము లేదు'. వారు రాత్రి రాత్రి అంతా మేలుకునే వుండేవారు. సంత్ మహాత్ముల 'వాణి' చదువుతూ వుండేవారు. రాత్రి మజ్జిగ త్రాగేవారు. తనలో తనే నవ్వుకుంటూ వుండేవారు. ఎవరైనా సేవ చేయడానికి వస్తే తిట్టుండేవారు, కొట్టేవారు. భగవంతునిపైన ఎంత విశ్వాసమంటే ఎంత నిష్ఠ అంటే వెదికినా కనిపించరు అలాంటి వారు.

వృందావనపు ఈ శతాయుసంత్‌ను నర్మదాతీరంలో వున్న 'రామనామ' సంత్ వీరిని తనవైపు లాక్కునేవారు.

నర్మదపై ఇంత ఇష్టము ఎందుకు?

ఇప్పటికి 50 సం॥లు కంటే ఎక్కువనే అయివుంటుంది. ప్రొఫెసర్ దయాశంకర్ దూబే వ్రాసిన 'నర్మదా రహస్యము' నేను చదివి, అమరకంటన్ నుండి ఖంబాత్‌లోయ వరకు నర్మదా ఉభయతట వర్తి క్షేత్రములు ఏవేవి వున్నాయి? వాటిలో ఎక్కడ శివలింగాలు లభ్యమవుతాయి? ఓంకారేశ్వరం - మాంథాత క్షేత్రము ఎలాగున్నది? భేడాఘాట్, శుకతీర్థము, ధారా ప్రవాహం ఇవన్నీ చదివి చదివి మనసులో నేను ఎప్పుడూ మేఖల నందిని 'నర్మదా' పరిక్రమ పూర్తి చేస్తానో అని ఊహించుకుంటుండే వాడిని. ముళ్ళపైన నడిచయినా సరే ఆ నదీ ప్రవాహపు ఆనందాన్ని ఆస్వాదిస్తాను. ఇంటి నుండి ఒకటి, రెండు సార్లు పారిపోయాను కూడా, కానీ ఏదో ఒక విఘ్నం వస్తుండేది. చాలా సాహసంతో కటనీ గుండా రైల్లో వెళ్ళి ఒక చిన్న కుగ్రామం వెళ్ళాను అక్కడి నుండి అమరకంటక్ వెళ్ళేరస్తా వుంది. పాదయాత్ర చేస్తూ వెళ్తువుంటే 'నర్మదా దేవి' మొసలి వాహనంపై చిరునవ్వులు చిందిస్తూ ఆశీర్వదిస్తు నాకు స్వాగతం పలుకుతున్నట్లుగా అనిపించింది. నాకు ఆలకి దప్పులు కలిగినపుడు నర్మదాదేవి నాకు కడుపునిండా పాలు త్రావించింది. కానీ ఇదేమిటి 'అమర కంటక్' చేరగానే

స్వాగతసత్కారాలు బంద్! రమాబాయి గారితో బియ్యం, పప్పు తీసుకుని ఖిచిడీ చేసుకున్నాను. సాయంకాలము బయట తిరగడానికి వెళ్ళినపుడు మార్కండేయ ఆశ్రమము దగ్గర ఒక విచిత్రమైన అవధూత దొరికారు. తిట్లు తిట్టడం మొదలుపెట్టారు. మూర్ఖుడా! నీకు వారణాసిలో గంగాతీరంలో ఎవరూ సంత్ మహాత్ములు దొరకలేదా సత్సంగము దొరకలేదా? ఎందుకు పరిక్రమ చేస్తున్నావు? తిరిగివెళ్ళిపో. ఎక్కడి నుండి నీవు వచ్చావో అక్కడనే చాలా సత్సంగము వున్నది. అని ఒక శ్లోకము చెప్పారు. వారి ఆ శ్లోకము ఇప్పటికీ నా మస్తిష్కములో మారుమ్రోగుతూ వుంటుంది.

ఇదం తీర్థమిదం తీర్థం భ్రామ్యంతి తమసా జనాః ।
ఆత్మ తీర్థం న జానంతి కథం మోక్షం శృణు ప్రియే ॥

శంకరుడు పార్వతీదేవితో అంటున్నాడు - తమోగుణము కలిగినవారు ఇది తీర్థం ఇది తీర్థం (క్షేత్రము) అని అనుకుంటూ తిరుగుతూ వుంటారు. వారికి ఆత్మతీర్థము యొక్క జ్ఞానమే లేదు. వారికి మోక్ష ప్రాప్తి ఎలా కలుగుతుంది? ఇక అపుడు నేను అక్కడి నుండి తిరిగి వచ్చాను.

ధునీ వాలే బాబా -

శ్రీ మోకల్‌పూర్ బాబా గారిని గురించి నేను చాలా సార్లు చర్చిస్తువుంటాను. శ్రీగోపీనాథ కవిరాజ్ వారి అభినందన గ్రంథములో వారి పేరు టేరీవాలె బాబా అని వ్రాశారు. వారు అంటుండే వారు 'తపసు చెయ్యడానికి నర్మదా - తటమే సరియైన స్థానము. నిశీధకాలంలో 5 నిమిషాల వరకు పాలధార ప్రవహిస్తుంది. సాధకులు దానిని ఒకసారి త్రాగారంటే, ఇక మరల రోజంతా వారికి భోజనము యొక్క అవశ్యకత వుండదు. వారు 40 సం॥లు నర్మదా తీరంలోని ఒక గుహలో వున్నారు. శ్రీధునీవాలె బాబా దగ్గర వారు దీక్ష, సత్సంగాన్ని పొందారు సంతస్కృత సాహిత్యములో దిగ్గజ విద్వానులైన శ్రీలోకనాథశాస్త్రీ (జబల్‌పుర్) గారు ఇలా తెలిపారు 'నాకు కవి కావాలన్న కోరిక వుండేది. ధునీవాలె బాబా గారి దగ్గరికి వెళ్ళాను. వారు దూరం నుండే నాపైన ఒక కర్రను విసిరి వేశారు. తన పగిలింది. రక్తం ప్రవాహమయింది. నా నోటి వెంట

కవితా ప్రవంతి అజస్రధార ప్రాహితమయినది'. శ్రీగిరిజానందన్ దుబే, వారు ఇపుడు నేను ఈ లేఖ వ్రాయించేటపుడు నా దగ్గరనే వున్నారు. వారు 3 సం॥లపుడు చనిపోయారు. మట్టిలో పూడ్చిపెట్టారు. కానీ ధునీవాలే బాబా ఎంతటి చమత్కారం చేశారంటే ఆ మృత శిశువును భూమిలో నుండి బయటికి తీయించి బ్రతికించారు. వారిపుడు ఒక మంచి ప్రతిభాశాలురైన ప్రభావవంతుడైన విద్వానులు. వీరికి వేద దర్శనంపైన చాలా గంభీరమైన పాండిత్యమును పొందారు.

అదే ధునీవాలె బాబా గారి కృపాపాత్రులు 'మోకల్ పూర్ బాబా' మరల నేను నర్మదానది వైపు ఆకర్షితుడనయ్యాను.

శ్రీ నర్మదానది యొక్క ఉద్గమస్థానము మేఖల పర్వతము. దానినే అమర కంటకమని కూడా అంటారు. శ్రీ నర్మదాజీ బ్రహ్మచారిణీ నది, గంగాజీ జ్ఞాన వైరాగ్యములను, యమునా నది ప్రేమ-భక్తిని నర్మదానది బ్రహ్మచర్యమును, తపస్సును, ఒసంగును. నర్మదానది జలముల స్నాన-పానముల వలన బ్రహ్మచర్యము పరిపుష్టమవుతుంది. ఇది నా అనుభవము. చాలా సప్తాహములు నేను ఓంకారేశ్వర ములో గడిపాను. ఆ సమయంలో నాతోపాటు బ్రహ్మచారి శ్రీరామ్‌జీ వున్నారు. వారే ఇపుడు శ్రీజ్యోతిష్పీఠశంకరా చార్యులయ్యారు. వారి పేరు శ్రీ శాంతానందజీ సరస్వతి మహరాజ్.

అక్కడ ఏకాంతసేవనము, సాధన - భజన, స్వావలంబ జీవనం బాగా ఆనందంగా గడిచిపోయింది.

విరోధమునకు సమాధానము -

ఇంతకంటే ముందు కూడా ఇందోర్‌కు చెందిన శ్రీదేవచంద్ వర్మ నర్మదాతీరాన వున్న చాలా ప్రదేశములకు నన్ను తీసుకువెళ్ళారు. శ్రీదేవ చంద్ వర్మకు ఒక విలక్షణమైన అనుభవము కలిగినదట. వారు ఒకరోజు రాత్రి సమయంలో తమ మిత్రులతో కలసి తమ ఇంట్లో కీర్తనలు చేస్తున్నారు. అందరూ సంకీర్తనరసములో తన్మయులైయున్నారు. ఆ సమయంలో ఒక విమానం వచ్చింది. ఆ విమానము నుండి ఒక అజ్ఞాత సంత్ బయటికి వచ్చి దేవచంద్‌ను పిలిచారు. వారు కాళ్ళు

చేతులు కడుక్కుని విమానం ఎక్కారు. విమానంలో సంత్ మహాత్ములది ఒక సభ జరుగుతూ వుంది! అందులో లోక వ్యవహారములో ఒకరికొకరి పడనటువంటి సంత్ మహాత్ములు వుండిరి. ఒకరి మతము, సంప్రదాయములను ఇంకొకరు వ్యతిరేకిస్తువుండిరి. అక్కడ ఆ విమానంలో వారంతా పరస్పర ప్రేమ, సౌహార్ద్రాలతో చేయబోయే ఆయోజనమును గురించి పరస్పరం విచార వినిమయం విని దేవచంద్‌కు చాలా ఆశ్చర్యం కలిగింది. ఏ సంత్ అయితే తనను పిలిచారో వారిని ఇలా అడిగారు 'ఇదేమిటి? ఇక్కడ ఇంతప్రేమ! వ్యావహారిక జగత్తులో ఆచార - విచారములను గురించి ఎంత సంఘర్షణ?' ఆ మహాత్ముడు ఇలా అన్నారు 'లోక వ్యవహారములో అందరి మనసులు, బుద్ధి, ఇష్టాఇష్టాలు ప్రవృత్తులు అన్నీ వేరువేరుగా వుంటాయి. అందరినీ పరమార్థపథము వైపు ఆకర్షితులను చెయ్యడానికి ఋషులు సంత్‌మహాత్ములు ఆచార్యులు వేరు వేరు భూమికలను నిర్వహిస్తువుండిరి. అధికారి భేదము (యోగ్యత) వలన కొందరికి కొందరు మహాత్ములు నచ్చుతారు, కొందరికి మరి కొందరు. ఒకవేళ సంత్ మహాత్ములు అలా చెయ్యకపోతే అందరూ ఒకేలాగ సంత్‌మహాత్ములపై శ్రద్ధ పెట్టలేరు. ఎవరెవరి యోగ్యతననుసరించి వారికోసము సంత్ అలా అభినయము చేస్తారు. దీని తర్వాత దేవచంద్‌జీ కనివిని ఎరుగని ఈ మహాత్ములను విమానములో వున్న వారిని దర్శించుటకై దేశభ్రమణము చేశారు, వారిని ఈ భూమిపైనే కలిశారు కూడా. చాలా సంవత్సరాల నుండి వారితో సంపర్కము లేదు కాబట్టి వారు ఇపుడు జీవించి వున్నారో, లేదో కూడా నాకు తెలియదు.

నీవే ప్రేమాస్పదుడవు -

దేవ చంద్ నన్ను 'మోడ్‌టక్కా' దగ్గర వున్న ఒక సన్యాసి సంత్ దగ్గరికి తీసుకువెళ్ళారు. ఆ మహాత్ములు వేదాంతములో అనన్య నిష్ఠ కలిగినవారు. ఉచ్చకోటికి చెందిన గ్రంథములను అధ్యయనము చేస్తుండేవారు. నాకు గుర్తున్నంతవరకు మేము వెళ్ళినపుడు వారు ఆత్మ యొక్క పరమప్రేమస్పదతను శ్రౌతపరముగ తెలియజెబుతు వుండిరి. పతి, పత్ని, పుత్రుడు, ధనము మొదలైన వాటి కంటె కూడ ఆత్మయే అత్యధికము, నిరుత్తరము అయినటువంటి పరమ ప్రేమాస్పదము అని ఉపనిషత్తులు స్పష్టంగా నొక్కి వక్కాణించాయి, తత్వము యొక్క విజ్ఞానము వలన సర్వ విజ్ఞానము

కలుగుతుందని 'శృతులు' ప్రతిజ్ఞ చేశాయి. దృష్టాంతము - మృత్తికా, లోహాదులు. ఒక వేళ ఆత్మ పరమాత్మ ఒకటి కాకపోతే 'శృతి' యొక్క ప్రతిజ్ఞ సిద్ధించదు. కొందరు కొందరు అంటారు - ఎపుడైతే ఆత్మ ఉపాసనాదుల ద్వారా ప్రపంచనిర్ముక్త స్వరూపంలో స్థిరమవుతందో, అపుడు వెళ్ళి పరమాత్మలో ఐక్యం అవుతంఉది. కాని ఈ మాట నిజం కాదు, ఎందుకంటే ఆత్మ వస్తుతః పరమాత్మ కాదు, ఇక లభ్యమయిన తర్వాత కూడ పరమాత్మ అవదు.

శ్రీ ఛోటే దాదా -

ఆ యాత్రలోనే శ్రీ దేవచంద్ నన్ను 'ఖండవా' తీసుకు వెళ్ళారు. అక్కడ 'ధునీవాలెబాబా' వారి శిష్యుడు ' శ్రీ ఛోటే దాదాజీ' వుండేవారు. వారు నగ్నముగా వుండేవారు. ఒక సిమెంటు కట్టపైన పడుకుని వుండెవారు. నేను గంటల కొద్దీ అక్కడ కూర్చున్నాను, కాని వారు కళ్లు తెరువనే లేదు. వీరు ఎటువంటి మహాత్ములు? నేను ఇంత దూరం నుండి వస్తే దర్శనం కోసమనీ మరి వీరి నిద్ర ఇంకా తీరనే లేదు అని మనసులో అనుకున్నాను. వెంటనే నవ్వుతూ నా వైపు చూశారు అలా పడుకునే వున్నారు. చెయ్యెత్తి ఆశీర్వదించారు. వారి సిద్ధులు చాలా ప్రసిద్ధికెక్కినవి. కానీ ఆ రోజులలో నాకు సిద్ధులపైన అభిరుచి లేదు. అక్కడ నా ప్రియమైన భక్తుడు శ్రీ కన్హయ్యాలాల్‌జీ చాల సత్కరించి, ఆవాస భోజనాదులు ఏర్పాటు చేశారు.

అద్భుతము !

నర్మదా తటముపై 'హండియా' అని ఒక చిన్న పల్లె వున్నది. అక్కడ ఒక చిన్న కొండపైన 84 సిద్ధ పీఠములలో ఒకటైన 'శ్రీదోమిక్‌నాథ్ గుహ' వున్నది. పొడవు వెడల్పు బాగ వున్నది. వారు తాను స్వయంగా 'భిక్ష' కొరకు వూర్లోకి వెళ్ళేవారు కాదు అని అక్కడి వారు చెప్పారు. వారి 'హండియా' (పాత్ర) వస్తుండేదట. ఆకాశంలో తేలుతూ ఆ హండియా వస్తుంటే అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. వారు శరీరము చాలించిన తర్వాత కూడ ఆ హండియా అలాగే కొన్ని రోజుల వరకు వస్తుండేదట. ఒక రాజస్వల స్త్రీ అందులో 'భిక్ష' వేసింది. అపుడు అది పగిలి క్రిందపడిపోయిందట. అప్పటి నుండి ఆ వూరిపేరు 'హండియా' అయింది. ఆ వూరి నర్మదా తీరము పైన

ఒక ఏకాంత మైన శాంతమైన ఒక ఆశ్రమము వున్నది. అందులో సాధారణముగ వేదాంత చర్చలే జరుగుతూ వుండేవి. అక్కడ జ్ఞానులు జీవితములను గురించిన చర్చల జరుగుతూ వుండేవి. జ్ఞాని యొక్క జీవనం ఎలా వుంటుంది అన్న దానిపై చర్చలు జరిగేవి. ఆ జ్ఞానులు త్యాగులు తపస్విలు సిద్ధుల రూపములో వుంటుండే వారు - ఒక్కోసారి అంతర్ధానమయ్యేవారు. ఒక్కోసారి ఎగిరిపోయేవారు, ఎక్కడి నుండి, ఎక్కడికో వందలమైళ్ళ దూరంలో మరల కనిపించేవారు. నిజం చెప్పాలంటే గంగ ఒడ్డున జరిగే వైరాగ్య పూర్ణమైన, తత్వ జ్ఞాన పరమైన విశుద్ధసత్సంగము అన్యత్ర దుర్లభము.

సిద్ధయోగి ఆత్మానంద్ -

'హండియా' వూరి నుండి నావలో కూర్చుని అటువైపు తీరానికి వెళ్ళాము. అక్కడ ఆత్మానంద బాబా వారి సమాధి వున్నది. అక్కడ ఇద్దరు ముగ్గురు మహాత్ములుండేవారు. 'బాబా' చాల సిద్ధయోగులని అక్కడి వారు చెప్పారు. ఒక రోజు వారిని చూడటానికి ఒక యోగి వచ్చారట. బాబా తను కప్పుకున్న కంబళి తీసి పక్కన పెట్టారట ప్రసన్నంగా ఆ యోగితో మాట్లాడుతున్నారట. యోగి యొక్క దృష్టి కంబళిపైన పడింది - అది గడ గడ ఒణికి పోతూవుందట. యోగి ఆశ్చర్యంలో 'బాబా ఇదేమిటి?' అని అడిగాడు. అది నా జ్వరం మీతో మాట్లాడిన తర్వాత మరల తీసుకుంటాను అన్నారు. బాబా, అక్కడ వారిని చాలా సిద్ధులు ప్రసిద్ధమయినవి. కాని భక్తి మరియు జ్ఞానము ఈ రెంటికి సిద్ధులు విఘ్నకరములు. ఇవి తపః ప్రభావము వలన వస్తాయి. నర్మదాతటముపై తపస్సులు చెయ్యాలి, గంగా తటముపై దేహత్యాగము చెయ్యాలి. ఈవల ఆవల కూడ -

హశంగాబాదుకు చెందిన శ్రీరామలాల్ శర్మ అక్కడ ఒక పేరున్న వకీలు, ఛేయిర్మన్ మరియు సంపన్నుడు. అతడు బలవంతం చేసి నన్ను వారింటికి తీసుకుని వెళ్ళారు. ఇంటి దగ్గరే నర్మదా నదీ ధార విశాలంగా వేగంగా ప్రవహిస్తోంది. అక్కడి పక్కాఘాట్ చాల పురాతనమైనది, పొడవైనది. అది చూడటానికి జనులు అక్కడికి వస్తుండేవారు. అక్కడ ఇద్దరు సంత్‌మహాత్ములుండేవారు. ఒకరు నర్మదా ఆవలి ఒడ్డున ఇంకొకరు నర్మదానది ఈవలి ఒడ్డున వుండేవారు. ఈ ధార దక్షిణతలము

మీద పశ్చిమవైపు ప్రవహించేది. ఆవలి ఒడ్డున వుండే సంత్ గొప్ప తపస్వీ మరియు యోగాభ్యాసములో నిపుణుడు. చాలా ప్రేమగా కలిశారు. సంప్రజ్ఞాత సమాధి యొక్క అనుభవాలను ఎన్నిటినో తెలిపారు. ఈ సమాధిలో వితర్క, విచార, ఆనందాసుగత వృత్తులు కూడ నిరుద్ధములవుతాయి - కేవలం 'అస్మి' నేను వున్నాను అన్నది మాత్రమే మిగిలి వుంటుంది. ఆ యోగిరాజుకి వివేక ఖ్యాతిని గురించి మాత్రము ఏమీ తెలియదు. వారికి సిద్ధులపై నమ్మకముండినది, ఇక అసంప్రజ్ఞాత సమాధిని గురించి ఏమీ చర్చించలేదు. పాలు, బంగాళ దుంపలు తినేవారు. నర్మదా జలం త్రాగేవారు. శరీరం బక్క చిక్కి శల్యమై వుండేది. ఇంకో మహాత్ముడు, వారి కుటీరము వృక్షలతాదులతో పచ్చగ కళకళలాడుతుండేది. వారు ఇతరులతో ఎక్కువగా కలిశేవారు కాదు. కలిశినా నిర్ణీత సమయంలోనే కలిశేవారు. సాధారణముగా ఎపుడూ మౌనంగా వుండేవారు. సాధన -భజన చేసుకునే వారు. గ్రామములోనికి ఎపుడూ వెళ్ళేవారు కాదు. వారు అష్టాంగయోగమును అనుష్టిస్తూ వుండేవారు. వారు ఇలా అనే వారు - భగవంతుని కృప ఎపుడు కలుగుతుందో ఏమో ఎవరికి తెలుసు ? అలాగని మనం ఎంతవరకు ప్రతీక్షిస్తు కూర్చుంటాము ? అంతవరకు మన బుద్ధి, ఇంద్రియాలు క్రియాశీలమై వుండాలి. అంత వరకు మనము సాధన అవశ్యం చెయ్యాలి. భగవంతుడు లభ్యమవుతాడా లేదా అన్నది వేరే సంగతి, సాధనోపయోగమైన శరీరము దొరికినది. కాబట్టి ఎంత వరకు వీలుంటే అంత సాధ్యమయినంతవరకు అంతరాత్మ వైపు మనసును పెట్టి వుండాలి. లోకుల సంస్కారలను తీసుకోకుండా వుండాలి. అన్యుల ప్రభావము నుండి ముక్తులమై సంయమము, తపస్య చేయడంలోనే జీవన సాఫల్యము కలదు.

శ్రీ నారాయణ స్వామి -

బరోడా నుండి కొంచెం దూరంలో నర్మదా నదీ తీరంలో 'చాణోద' అనే ఒక చిన్న పల్లెటూరు వున్నది. అక్కడ శ్రీ నారాయణ స్వామి వారు తపస్య చేశారు. తరువాత వారు ఋషీకేశ్‌లోని స్వర్గాశ్రమములో వచ్చివుంటు వుండేవారు. సాధరణంగా ఎపుడు మౌనంగా వుంటు 'నారాయణ' నామ జపము చెయ్యమని ఉపదేశించేవారు. తన సొంత స్వార్జితమునే భుజించాలి కాని, ఇతరులది పూచిక పుల్ల కూడ తీసుకోరాదని

వారి నియమము. ఎవరైన వారు చెప్పిన నియమాలను సరిగా పాలన చెయ్యక పోతే వారిపై కోపగించుకునే వారు. వారు స్వయంగా నిద్రించేవారు కాదు. మొదట వేదాంత సంస్కారముండేది, కాని తర్వాత భక్తుడయ్యాడయ్యారు. వారు అన్నారు నాకు భగవంతుడు ఈ నర్మదా తటముపై ఈ స్థానంలో దర్శన మిచ్చారు 'చతుర్భుజ నారాయణుడు' కొంచెం నాతో మాట్లాడారు. ఆ రోజులలో గీతాప్రెస్ నుండి 'ఒక సంత్ అనుభవం' అన్న పేరుతో వీరిది చిన్న పుస్తకం వెలువడింది. వారే శ్రీహరిబాబాజీతో నాకు నారాయణుడు కనిపించి ఆజ్ఞ ఇచ్చాడు మీరు సంకీర్తనము మొదలైన ప్రవృత్తులను వదిలి వేదాంత - చింతనము చెయ్యమని అన్నారు. దీనికి జవాబుగ శ్రీహరి బాబాజీ అన్నారు. నేను నా జీవితమంత భగవద్భజనలో గడిపాను. ఒకవేళ భగవంతుడికి నేననేవాడిని ఒకడిని వున్నాను అని తెలిసివుంటే సీదా నన్నే ఎందుకు ఆజ్ఞాపించకూడదు. మీ ద్వారా ఎందుకు చెప్పి పంపాలి ? మీరే నా వినతిని నారయణుడికి వినిపించండి. శ్రీ నారాయణ స్వామి తన అంతిమ జీవితం గంగా తీరంలో గడిపారు. భగవంతుడికి నైవేద్యం పెడితే ప్రత్యక్షమై స్వయంగా నైవేద్యం ఆరగించేవారని వారి చరణ చిహ్నముల కూడ వదిలి వెళ్ళేవారనేది నారాయణ స్వామి వారిని గురించి చాలా ప్రసిద్ధి కెక్కిన సంగతి. ఈ సంగతి పరీక్షించడానికి శ్రీ జయదయాల్‌గోయెంకా గారు స్వయంగా వారి దగ్గరకు వెళ్ళారు. నైవేద్యం పెట్టారు. తెర తీసిన తర్వాత చూస్తే మోహన్ - భోగ్ పైన చిన్న చిన్న రెండు చరణ చిహ్నాలు కనిపించాయి. గోయెంకాగారు అన్నారు - నారాయణుడు పెద్దవాడు కదా ఈ చిహ్నాలు చాలా చిన్నగా వున్నాయే రెండు రెండు అంగుళాలంత! ఇవి నారయణుడివే అని మేము ఎలా నమ్మాలి ? ఇవి ఏదో అచ్చువేసి నట్లుంది. దీనితో నారాయణ స్వామి కొంచెం కుపితుడయ్యాడు. గోయెంకా వారిని 'అవిశ్వాసీ' అని ఘోషించారు.

దత్తాత్రేయ ఆశ్రమము -

ఇక నర్మదా నదీ తీరంలో ఎక్కడయితే నారాయణ స్వామికి భగవద్దర్శనము కలిగినదో అక్కడి నుండి మేము నావలో కూర్చుని నర్మదా ప్రవాహము వెంట వ్యాసాశ్రమము, శుకాశ్రమము, దత్తాత్రేయ ఆశ్రమమునకు కూడ వెళ్ళాము. అక్కడ ఒక మహాత్ముడుండేవాడు. గొప్ప తపస్వి ఎవరితో ఏమి లావాదేవీలు లేవు. వారు

నన్ను పిలిచి ఇలా అన్నారు. చూడు ఇది ఎంతటి ఏకాంత స్థలము పవిత్రము. సురక్షితమైన స్థానము. కాని ఇపుడు ఇక్కడ ఎవరు వుండడము లేదు. మీరు వచ్చి ఇక్కడ వుండండి. 'భగవంతుడు ఎపుడు పిలిస్తే అపుడు తప్పక వస్తాను' అని నవ్వుతూ బదులు చెప్పాడు. ఇపుడు ఆ స్థానము నర్మదా ప్రవాహములో కొట్టుకు పోయింది. కానీ శుకదేవుడిది దత్తాత్రేయుడి ఆశ్రమము ఇప్పటివరకు వున్నాయి.

భగవాన్ దత్తాత్రేయుడు

శ్రీ దత్తాత్రేయుడు నర్మదా తటముపై విహరిస్తుంటారని ప్రసిద్ధి వారు ఒక్కొక్కపుడు ఒక్కో వేషంలో వుంటారు. అవధూత వేషంలో వుంటారు. ఆచార విచారములలో స్వతంత్రులు. నిగ్రహ - అనుగ్రహము లలో సమర్థులు. కొందరికి వరములను ప్రసాదిస్తారు, మరి కొందరికి జ్ఞానోపదేశం చేస్తారు. శ్రీ దత్తాత్రేయులవారు శాస్త్రము, ధర్మము మొదలైన వాటి పరతంత్రత నుండి ముక్తులు. వారెపుడు ద్వైత-అద్వైత పక్ష - విపక్షముల జోలికి వెళ్ళరు. అన్నిటా వారికి సమ దృష్టియే, అంతేకాక స్వయంగా అద్వైతమే. శ్రీ ఆదిశంకరాచార్యుల గురువుగారైన శ్రీ గోవిందపాదుల వారితో కూడ వారికి సంబంధం వుండేది. వారు శ్రీ ఓంకారేశ్వరంలోని ఒక గుహలో వుండేవారు. శ్రీశుక దేవులు ఇక్కడనే ఆనందమగ్నులై విచరణ చేసేవారు.

ప్రేరకుడు శ్రీ సేఠ్‌రమణ్ లాల్ -

శ్రీరమణ్‌లాల్ సేఠ్‌కు ఒక నియము వుండేది - ఎవరు తన దగ్గరికి వచ్చినా ఏదో ఒకటి ఇవ్వడం. 'పేట్‌లాద్' లో వారు సంస్కృత విద్యాలయము, చాలా పెద్ద హాస్పిటల్, స్కూల్, కాలేజి, ఆయుర్వేద ఔషధాలయము మొదలైనవి కట్టించారు. బహుశ ఇపుడు వారి సోదరుడు శ్రీ చందులాల్‌జీ, పుత్రుడు అమృతలాల్‌జీ వున్నారు. ఈశ్వరుడి కృప వలన వారిలో కూడ ధర్మము పట్ల అభిరుచి వున్నది. సేఠ్ రమణ్‌లాల్ గారు నన్ను ఒక రోజు 'ఖంబాత్‌కీఖాడీ' చూపించడానికి తీసుకుని వెళ్ళారు. ఆ రోజులలో అక్కడ యంత్రాలు పని చేస్తుండేవి. సాధువులకు ఒక పెద్ద మఠము వుండేది. అందులో శాంకర సాంప్రదాయమునకు చెందిన సన్యాసులు వుంటుండేవారు. అక్కడి మహాత్ములు సంధ్యావందనము, గాయత్రి జపము చేసిన

తర్వాత వేదాంత శ్రవణము చేసేవారు. సాధారణముగా పంచ కోశ వివేకము, అవస్థాత్రయము యొక్క వివేకమును గురించే సత్సంగము జరిగేది. అక్కడి మహంత్‌జీ చాలా ఉదార ప్రకృతి కలిగినటు వంటివాడు, వచ్చిపోయే అతిధులకు చాలా ప్రేమతో స్వాగత సత్కారములు చేశేవారు. సేఠ్ రమణ్‌లాల్‌ను గురించి అక్కడి వారు ఈ మాట చెప్పారు. వారి జీవితములో ఒక సారి ఇక అయిపోయింది. అంతా దివాల అయ్యిందన్న పరిస్థితి నిశ్చమయ్యిందట. వారు అక్కడే వున్న శ్రీ నారాయణముని అన్న ఒక మహాత్మదగ్గరిక వెళ్ళి ఇక రేపటికి నేను దివాల అయిపోతున్నానని నివేదించారు. మునిజీ అడిగారు 'నీవు ఏమైన దాచుకుని పెట్టుకున్నావా లేదా? సేఠ్ అన్నారు 'మహారాజ్! జీవన నిర్వాహము కొరకు నేను 1 1/2 లక్ష రూపాయలు పెట్టుకున్నాను'. మునిజీ అన్నారు 'నీవు వాటిని దానం చెయ్యి నీ కోసమని కొంచెము కూడ పెట్టుకోకు'. సేఠ్ అలాగే చేశారు. అక్కడ వున్న నారాయణ - సంస్కృత - విద్యాలయమును ప్రారంభించారు. డబ్బంతా ఇచ్చేశారు. ఎక్కడినుండో ఒక పెద్ద సేఠ్ వచ్చారు. వారు సేఠ్ రమణ్‌లాల్‌జీతో '10 లక్షల రూపాయలు నేను మీకు ఇస్తాను. మీరు నన్ను వ్యాపారంలో భాగస్తుడిగా చేసుకోండి' అన్నారు. అలాగే చేశారు. నమ్మకము, దాన ఫలము ప్రత్యక్షముగా చూడగలిగాము. 90 సం.ల వయసు వరకు సేఠ్ రమణ్‌లాల్ చాలా ఉదారముగా దానం చేస్తుండేవారు. ఎవరైన రానీ వట్టి చేతులతో పంపేవారు కాదు.

దారిలో కలసిన సాధకుడు, స్థల విశేషము -

బరోడాలో శ్రీ ఉపేంద్రా చార్య మహరాజ్ వారిది ఒక ఆశ్రమము వుంది. వారు ఇపుడు లేరు. మందిరమున్నది. మూర్తి వున్నది. గొప్ప గొప్ప భక్తులున్నారు. భారతీయ సుప్రీమ్ కోర్ట్ యొక్క చీఫ్ జస్టిస్ శ్రీ కనియా వారి భక్తులలో ప్రముఖులు. వారి సతీమణి లేడి కనియా ప్రభాబహన్ వారి తల్లిగారు వారి పరివారము వారంతా బలవంతం చేస్తే నేను అక్కడికి వెళ్ళాను. వారు ప్రతి సంవత్సరము ఎక్కడో ఒక చోట ఏకాంత వనము లో అనుస్థానములు, ఉత్సవములు జరిపించేవారు. ఆ సంవత్సరము నర్మదా తటము వద్ద ఝుగడియా పూరి దగ్గర వారి ఉత్సవము వుండినది. పట్టలతో నీడగా కట్టారు. దున్నిన పొలం తీసుకున్నారు. సాధకులందరూ

వేరే వేరే చెట్ల క్రింద నర్మదానదికి బాగా దగ్గరగా కూర్చుని గాయత్రి జపము, హోమము చేస్తూ వుండిరి. సాయంకాలము గోష్ఠి జరిగేది. పూజ, పారాయణ, సదాచారము, సద్గురు - భక్తి సంబంధమైన చర్చ నడుస్తుండేది. వారు వారి గురుదేవులను సాక్షాత్తు భగవంతుడి అవతారమని నమ్మేవారు. చాలా శ్రద్ధతో వారికి పూజలు చేస్తువుండిరి. నిజం చెప్పాలంటే ఆత్మ కంటె అభిన్నమైన పరమాత్మా రిక్తమైన ఇంకొక వస్తువంటూ ఏదీ లేనే లేదు. 'తత్వము' ను తయారు చెయ్యనఖ్ఖర్లేదు. తయారు చెయ్యవలసింది మన బుద్ధిని. ఒక వేళ అది ఏ నిమిత్తముతోనైన ధృఢమయినదంటే జీవుడి నిష్ఠ పరిపక్వమవుతుంది. ఆ నిమిత్తము శాలగ్రామము కానీ, నర్మదేశ్వరుడు కానీ, తులసీ - పీపల్ కానీ లేదా నిరాకారా - సాకారము కానీ, వారి యొక్క భక్తి శ్రద్ధాయుతమైన వాతావరణములో 7 రోజులు చాలా ఆనందంగా గడిచిపోయినవి. నర్మదానది నీరు అపుడుపుడు సముద్ర ప్రభావం వలన ఉప్పగా అయ్యేవి. ఆటుపోట్లు తగ్గాక మరల తియ్యగా వుండేవి. మా కొరకు భోజనము వేరుగా తయారవుతూ వుండేది. ఎందుకంటే సాధరణముగ సాధకులు ఉపవాసనత్రాలు చేశేవారు. మేము సాధకులతో వుండువారుము. అక్కడికి అవతి తీరంలో 'కబీర-వటము' వుండేది. దేశములోని పెద్ద వటవృక్షములలో అది ఒకటి. అక్కడ మహాత్మయే కబీరుదాసు సాధన చేసి వుండవచ్చు. అక్కడ ఒక చిన్న కుటీరమున్నది. ఆ సమయంలో అక్కడున్న సాధువులు ఏదో సాధన చేస్తుండేవారు, సుషుమ్ననుండి పైకి వెళ్ళే సంగతి కూడ చెబుతుండేవారు. కానీ వారికి విశేషమైన జ్ఞానమేమి వుండేది కాదు. కొన్ని 'సాఖియా'లు చదివి వినిపించేవారు. అక్కడి నుండి శుక్లతీర్థం దర్శనమయ్యేది.

ఈ శుక్ల తీర్థము 'భదౌచ్' నుండి పది కోసుల దూరం వుంటుంది. అక్కడ భగవంతుడు ప్రత్యక్షమయి తన భక్తునికి దర్శనమిచ్చాడట. ఆ ప్రదేశమును జనులు చాలా పవిత్రమైనదిగా తలచేవారు. దానిని దర్శించుటకై వెళ్తూండేవారు. సంస్కృతములో 'భదోచ్' పేరు భృగుకచ్ఛ. అక్కడ శాక్రాచార్యుడు బలిద్వార యజ్ఞము జరిపించారు. భగవంతుడు వామర త్రివిక్రముడై బలి యొక్క సర్వస్వమును తీసుకున్నాడు. అక్కడ 'సమర్పణ' యొక్క రహస్యము స్పష్టమవుతుంది. కేవలం ఇచ్చేవాడు. ఇచ్చేవాడు అంటే ఇచ్చేవాడి 'అహం' వుండిపోతుంది. కాని భగవంతుడు

బలి శిరసును కూడ కొలిచేసి 'అహం'ను కూడ స్వీకరించారు. అపుడే సమర్పణ పూర్ణమవుతుంది. వస్తుతః సమర్పణ మన్నది ఒక క్రియ, ఒక భావం కానీ కాదు. అది ఒక 'బోధ'. అది, ఇది నేను అంటే ప్రత్యక్ష, పరోక్ష మరియు అంతా భగవంతుడి పట్ల సమర్పితమే అయి వున్నది. ఈ త్రివిధత ఎలాంటిదంటే స్వర్ణ పత్రముపైన చెక్కిన మూర్తుల లాగ - అందులో కాళ్ళు, చేతులు వేరు వేరుగా కనిపించినా కానీ అంతా స్వర్ణమే.

శ్రీహంసదేవజీ -

భరోచ్ దగ్గర సరిగా నర్మదా తీరం ఆవలి ఒడ్డున పరమహంస హంసదేవజీ మహరాజ్ వారి ఆశ్రమము వున్నది. అక్కడికి రైల్వే వంతెన పై నుండి గానీ, లేక నావతో గాని దాట వలసివస్తుంది. అంకులేశ్వర్ నుండి మోటరు కూడ వెళుతుంది. విశాలమైన ఉపవనమున్నది. ఫల వృక్షములు, పుష్పలతలు, భవ్యమైన భవనము ప్రక్కనే నర్మదాస్నానము కొరకు ఘాట్ కూడ నిర్మించారు. శ్రీహంసదేవ్‌జీ గారిని చాల ఆశ్రమములున్నాయి. భరోచ్, సూరత్, జసోటీ, ఊంటీ మొదలైన చోట్లలో కూడ వారు ఎంత విలక్షణులైన మహాత్ములంటే వారిస్మృతి మనసులో కదలగానే మనసంతా నిండిపోతుంది. గౌరవర్ణం, సుందరము, పొడవైన శరీరం, నవ్వు ముఖము సాంసారికమైన ఏ బాదర బందీ లేదు. మస్తీగా తను స్వరూపస్థితులై వుండే వారు.

శ్రీ హంసదేవ్‌జీ గారు ఒక సారి ఊంటీలోని వారి ఆశ్రమమునకు ఆహ్వానించారు. ఆశ్రమము దగ్గర దట్టమైన అడవి, విశాలమైన జలాశయము, గోశాల వున్నవి. ఒక్క చిన్న ఆశ్రమము పర్వతముపైన వున్నది. దూర దూరాలు వరకు సుందర ప్రకృతి దృశ్యాలు కనుపిస్తాయి. వారు నాకు కరెంటుతో పనిచేశే ఒక కంబళిని ఇచ్చారు. చలి చాలా వుండినది. వారు తమను గురించి ఇలా తెలిపారు. బాల్యావస్థనుండి త్యాగవైరాగ్యములను అనుష్ఠించేవరట. పూర్వం వారు కాలినగడకతో చైన వారకు వెళ్ళారు. ఒకోసారి కటివస్త్రము వుండేది ఒకోసారి అదీ లేదు. కడుపు, నోరు చూపెట్టి భోజనం అడుక్కునేవారు. వారు ఏదైన అఖాద్య వస్తువు గనుక ఇస్తే తీసుకునేవారు కాదు. ఒక చోట సైన్యము వుండినది. వారు శ్రీహంసదేవజీని ఒక గూఢచారి అని అనుమానించి పట్టుకున్నారు. అక్కడి వారికి బుద్ధ భగవానుడిపై

చాల శ్రద్ధ. ఇక అడవి జాతివాయితే భారతీయులను నరికి పోగులు పెట్టి పవిత్ర ప్రసాదములాగ తినేవారట.

శ్రీహంసదేవజీ తన విరక్త జీవనమును ఎలా వదిలిపెట్టారో, తమాషాగా మనోరంకంగా ఒక కథలాగ నవ్వుతు నవ్వుతూ చెబుతారు. 'ఒక సారి ఒక సేతానీ నా దగ్గరకు వచ్చి మంత్రదీక్ష ఇవ్వమని శిష్యురాలినిగా చేసుకొమ్మనీ బలవంతం చెయ్యసాగింది. నేను తనను విదిలించి వేశాను. సేతానీ వెళ్ళి ఒక బైరాగి బాబాతో దీక్ష తీసుకున్నారు. కొన్ని రోజులయిన తర్వాత ఆమె నన్ను బిక్ష కొరకు ఆహ్వానించింది. నేను అపుడు కేవలం నడుముకు ఒక గుడ్డ కట్టుకుని వుండేవాడిని. ఆమె నాకు బయట ఒక ఆసనం వేసింది. నేను దానిపైన కూర్చున్నాను. ఇంతో ఆమె గురువు ఆ బైరాగీ బాబా వచ్చారు. ఆమె గంట, తాళాలు, ఆరతి, పువ్వులు, దండలు, పళ్ళు మొదలైనవన్నీ తెచ్చి స్వాగతం పలికింది. బట్టలు, దక్షిణ ఇచ్చింది. వెండి పళ్ళెంలో వడ్డించింది. నాకు ఆకుపైన బిక్ష పెట్టింది. అపుడు నా మనసులో అనిపించింది. ఈ చేలా-చేలీలన (శిష్యులను) చేసుకోవడం వలన చాలా మంచింది. బస్! నేను అప్పటినుండి చేలా-చేలీలను తయారు చెయ్యడం మొదలుపెట్టాను. సంసారపు రంగ్-ఢంగ్ చూస్తే కూడ దానివైపు ఆకర్షణ కలుగుతుంది.

శ్రీహంసదేవజీ మహారాజ్ ఎంతటి ప్రభావ సంపన్నుడయిన మహాత్ముడో అది సాధు-జగత్తులో తెలియని దేమీ కాదు. హరిద్వారము, ప్రయోగ, కుంభమేలలో 10-10 లక్షల రూపాయల వరకు ఖర్చు చేస్తుండేవారు. ఎంత ఉదారులంటే ఎవరొచ్చినా కూడ వారికి, ధనము, వస్త్రము, ఔషధము పంచుతుండేవారు. వారి పెండాల్ చాల గొప్పగా దర్జాగా వుండేది. అంతగా మేలాలో మరెవ్వరిదీ ఉండేది కాదు. నర్మదా తీరంలో తిరిగేవారికి వారి విశాల ఉద్యానము దర్శనీయం !

శంకరా చార్యులు వారి స్మృతి జబల్‌పుర్ -

జబల్‌పుర్ దగ్గర ధువాదార్‌లో భేదాఘాట్ యొక్క వెలుగు నీడలు దృశ్యము నేను మొదట కూడ చూశాను. కానీ జబల్‌పుర్ వెళ్ళే అవసరము ఎపుడు కలిగిందంటే జ్యోతిష్పీఠాధీశ్వరుడైన జగద్గురు శ్రీశంకరా చార్యులు అనంతశ్రీ బ్రహ్మానంద సరస్వతి

మహరాజ్ వారు అక్కడ విరాజమాను లైవున్నపుడు. వారితోనే నేను సన్యాతదీక్ష స్వీకరించాను. వారి సన్నిధిలో ఒక నెల కంటె ఎక్కువ అక్కడ వుండగలిగిఏ సుయోగము లభించినది. శ్రీమద్భాగవతమును వినిపించాను. మధ్యమధ్యలో నర్మదాస్నానం కోసం గ్వారీఘాట్ జలేరీఘాట్‌కు వెడుతూండువాడిని.

1942 సం.లో నేను శ్రీ హరిబాబాజీ వారి బాంధ్ పై వుండే వాడిని. అప్పటి మాట - శ్రీ ఉడియాబాబాజీ, శ్రీ ఆనందమయిమా మొదలైన గొప్ప గొప్ప సంత్ మహాత్ములు విచ్చేశారు. శ్రీ ఉడియాబాబాజీ వారు నన్ను ఇలా ఆజ్ఞాపించారు. నీవు శంకర్ లాల్, నిర్మల్ దాస్ మరియు ఆంజనేయ వీరిని తీసుకుని శ్రీ శంకరాచారు&యల దగ్గరికి ప్రయాగరాజమునకు వెళ్ళు. అక్కడ మొదటి ఇద్దరికి సన్యాసము, మూడవ వానికి బ్రహ్మచర్య దీక్ష ఇప్పించి తీసుకునిరా. శ్రీ శంకరా చార్యులవారు ప్రయాగరాజ్‌లోనే వున్నారేమో అక్కడ కలుసుకోవచ్చు అని అనుకున్నాము. గంగా తీర మార్గముగుండ ప్రయాగ చేరుకోవాలని నిశ్చయమయినది. మేము అక్కడి నుండి బయలు దేరాము. ఆ రోజులలో నా సేవలో బ్రహ్మచారి పద్మనాభజీ వున్నారు. వారు ఇపుడు శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతి అయి ఒక్కొకపుడు ఆంధ్రలో ఒక్కొక్కపుడు నా దగ్గర వుంటుంటారు. అనూప్ శహర్ వచ్చేటప్పటికి అతరౌలీకి చెందిన శ్రీ విశ్వంభర్ లాల్‌జీ కలిశారు. వారు ఎవరినో 'బాంధ్' కు పంపి బాబాతో అనుజ్ఞ తెప్పించారు. వీరు ముప్పురు రైల్లో ప్రయాగ వెళ్లారు అని వారే టికెట్ కొని ప్రయాగ చేర్చారు.

ప్రయాగ చేరాక శ్రీ శంకరాచార్యుల వారు జబల్‌పుర్ లో వున్నారని తెలిసింది. ప్రొద్దున గంగానదిలో స్నానం చేస్తు మేము ఒకరి కొకరు చర్చించు కుంటున్నాము. ఇక్కడి నుండి జబల్‌పుర్ కాలినడకన వెళ్ళాలంటే కొన్ని నెలలు పట్టవచ్చు. అంతలో ఆ చార్య చరణులు అక్కడినుండి వేరే ఎక్కడికయినా వెళ్ళవచ్చు. అందువలన ఇపుడు కర్తవ్యం ఏమిటి ? కిరాయికి (టికెట్) డబ్బులు ఎవరి దగ్గర లేవు. మేము మాట్లాడుకునే మాటలు అక్కడ స్నానం చేస్తున్న ఒక బ్రాహ్మణుడు విన్నాడు. మేము మా దండ కమండలము తీసుకుని అక్కడి నుండి బయలు దేరబోతుంటే ఆ బ్రాహ్మణుడు వచ్చి ఈ రోజు మీరు మా ఇంటికి బిక్షకు రండి అని ప్రార్థించాడు. బిక్ష

స్వీకరించిన తర్వాత మా కందరికి జబల్‌పుర్ టికెట్ కొని వారు మమ్ములను జబల్‌పుర్ పంపిచారు. ఆ రోజులలో ఆచార్య చరణలు 'బల్దేవబాగ్' లో వుంటుండేవారు. నా భాగవత్ కథ జరిగింది. శంకరలాల్ దండి స్వామి ప్రబోధానంద సరస్వతి, నిర్మల దాసు ప్రకాశనంద సరస్వతి మరియు ఆంజనేయ బ్రహ్మచారి శివానందలయ్యారు. అక్కడ వుండేటపుడు చాల మంది సజ్జనులలో పరిచయమయినది. వారిలో ఒకరు సుందర్‌లాల్ ఇందురఖ్యా, వారు నన్ను చాలాసార్లు జబల్‌పుర్ తీసుకుని వెళ్ళారు. వారి, వారి పరి వారము యొక్క ప్రీతి, సేవ ఇప్పటి వరకు అలాగే వున్నాయి. బ్ర. హేమానంద 'దాదా' తో కూడ అక్కడనే పరిచయమయినది. సుమారు 20 సం.ల వరకు వారు నా సేవలో వున్నారు. ఇపుడు స్వతంత్రంగా భజన చేసుకుంటారు. వారికి సంబంధించిన సంగతి ఒకటి తెలుసుకోవాలి ఏమిటంటే వారు బాల్యావస్థలో మృత ప్రాయులైనారు. ధునీవాలె దాదా యొక్క ఆజ్ఞవలన వారి తల్లి వారిని ప్రజ్వలిస్తున్న అధునిలో వేశారు. ధునివాలి దాదా ధునీలోనుండి బయటికి తీశారు. వారు స్వస్థులైనారు. జీవించారు. వారు నా దగ్గరవున్నన్ని రోజులు చాల ప్రేమగా సేవ చేస్తుండేవారు. ఇపుడు వారికి 62 సం.లు వయసు వుంటుంది.

ద్వారకా ప్రసాదశాస్త్రికి ఆ రోజులలో 18-19 సం.లుంటాయి. 5, 6 సం.లు నా దగ్గరుంటూ తను 'పురాణ' పరీక్ష ఇచ్చారు. నా దగ్గరికి రాకముందు వారు సంస్కృత సాహిత్యములో గొప్ప విద్వానుడు శ్రీలోకనాథ్ శాస్త్రి గారి దగ్గర విద్యాధ్యయనము చేశారు. వారికి బోజనం కూడ వండి పెట్టేవారు. ఎవరో ఒక సేఠ్‌ది ప్రీవి కౌన్సిల్‌లో కేసు నడుస్తూవుండినది. నా ఆజ్ఞతో ద్వారకా ప్రసాద్‌జీ ఒక అనుష్ఠానం చేశారు. అందులో చమత్కార పూర్ణమైన విజయం లభించింది. ఇక శాస్త్రికి నిర్వాహ - యోగ్యమైన సంపత్తి లభించింది.

ఒక అద్భుత ఫకీరు -

ఆ రోజులలోనే బరేలా దగ్గర వున్న జమునియాగ్రామం లో వున్న తన్‌తన్ పాల్ దాదాని దర్శించుటకై శాస్త్రి వెళ్ళారు. తన్‌తన్ పాల్ దాదా ఫకీరు లాగ వుండేవారు. అఘోరిలలాగ వుండేవారు. ఎంగిలి మంగలి అన్నీ తింటుండేవారు. కుక్క నోట్లో చెయ్యి పెట్టి దానికి తినిపించి అదే చేత్తో తను స్వయంగా తినేవారు. ఎవరితోను

మాట్లాడరు. 'బీడి తాగు, బీడి తాగు' అని అంటుండే వారు. ఎవరైన నడుముకు గుడ్డ కట్టి వెళ్ళేవాడు. ఎవరైన వచ్చి భుజము పై నెక్కించుకుని వెళ్లేవారు. స్వయంగా తనకు తానై పంచ కట్టుకొరు, ఎక్కడికో వెళ్లరు, మే ఖిరామ్‌జీ వారి ఇంటిలో వుండేవారు. తన్‌తన్ పాల్ దాదా ఎదుటకు ఒక కుమారికన్య వచ్చి ప్రణామం చేసింది. అపుడక్కడ ఆ సమయంలో శాస్త్రి వున్నారు. శాస్త్రి మనసు లో ఈమెతో తన పెళ్ళి అయితే బాగుండునని అనిపించింది. తన్ తన్ పాల్ దాదా మేఖరామ్‌ను పిలిపించి వెంటనే వాళ్ళద్దరికి పెళ్ళి చెయ్యమని ఆజ్ఞాపించారు. వివాహము జరిగింది. దానితో పాటు శాస్త్రికి చాలా సంపద కూడ లభించింది. 300 ఎకరాల భూమి, వందల కొద్ది ఆవులు, ఎనుములు, గుఱ్ఱములు లభించాయి. ఆయనకు మంచి స్థిరత కలిగింది. 5 గురు కొడుకులు, మనుమలు కూడ వున్నారు. ద్వారకా ప్రసాద్ శాస్త్రి ఇపుడు 'శాస్త్రిజీ' అన్న పేరుతో విఖ్యాతులయ్యారు. శ్రీ మద్భాగవత కథ ప్రవచనం చేస్తుంటారు. తన్‌తన్ పాల్ దాదా యొక్క చమత్కారములను , మహిమలను అందరూ ఎరుగుదురు. తన్‌తన్ పాల్ దాదా యొక్క పనులు అద్భుతముగా వుండేవి. కొదరి కొందరితో 'బీడీ పీవో' అని చెబుతుంటారు. మా దగ్గరున్న ఆది బ్రహ్మ చారి శ్రీ లీలానందజీ (ఛోటేజీ) 40 సం.లు నుండి నాతో వున్నారు. నాతో కలసి దాదాను దర్శనం చేసుకోవడం కోసం వెళ్ళారు. దాదా అన్నారు 'బీడీ పీవో (త్రాగు)' ఛోటేజీ స్పష్టంగా చెప్పారు. 'మేము బీడీ తాగము' అని. సంసార వాసనల వలన కాల్చడమే బీడీ తాగమని చెప్పేదాన్లో అంతరార్థమని అక్కడిలోకుల భావన. నా కోసం పులిచర్మపు ఆసనం వేశారు. తన్ తన్ పాల్ దాదాగారిని తీసుకువచ్చి నాతో పాటు కూర్చొ బెట్టారు. ఎలా వ్యవహరిస్తారో ఏం మాట్లాడతారో అని మనసులో కొంచెం సంకోచము వుండినది. కానీ ఏమనలేదు. ఏమైన తినమని, త్రాగమని అడిగారు.నేను అడిగాను దాదా! మీరు చనిపోయిన తర్వాత ఎక్కడికి పోతారు ? వారు అన్నారు. 'రావడం పోవడం ఎక్కడుంది'? అంటే జన్మ-మృత్యు బంధన మోక్షం అన్నీ కూడమన స్వస్వరూపములో మిథ్యయే. మా మిత్రులు కొరు అడిగారు సాధన అంటే ఏమిటి? వారు అన్నారు 'సాధన ఒక గాడిద' వారి అభిప్రాయమేమింటే ఏదైన చేయడం వలన లభించేది అది అజ్ఞానమూలకమే. మూర్ఖతకు 'గాడిద' ఒక ప్రతీకాత్మక శబ్దము. 'న కర్మణా' అంటుంది శృతి. 'నాస్తి అకృతకృతీన' అని కూడ అంటుంది. ఒక్కోసారి ఎవరికీ

తెలియకుండ చుప్‌చుప్‌గా దాదాను ఎత్తుకుని పోయేవారు. దీని కోసం పరస్పరం వారిలో వారు పోట్లాడు కుంటారుకూడ. తన్‌తన్ పాల్ దాదా ఇపుడు లేరు.

శ్రీరామ కింకర్‌జీ -

జబల్‌పుర్‌లో శ్రీరామకింకర్ ఉపాధ్యాయతో కలవడము జరిగింది. చాలా ఆరోగ్యాంగా అందంగా వున్న బుద్ధి మంతుడు. యోమ్యడైన బాలకుడు. వారి తండ్రి రామాయణి - తనకు కూడ రామాయణము బాగా అలవాటు వున్నది. ఒక రోజున స్వయముగా భోజనము తయారు చేసి నన్ను కూడ 'కుచైనీ' మందిరంలో బిక్షకు తీసుకువెళ్లాడు. ఆ రోజు ఏకాదశి. కాని తన ప్రేమ చూసి నేను భోజనం చేశాను. అక్కడనే తను నాతో రామ మంత్రము దీక్ష తీసుకున్నాడు. తర్వాత బృందావనం వచ్చారు. శ్రీహనుమాన్ జీ యొక్క కృప, మరియు శ్రీ సీతారాముల వాత్సల్యంతో వారికి అపూర్వమైన ప్రతిభ ప్రాప్తించింది. 'రామచరిత మానస్' ప్రవచనమునకు ఒక క్రొత్త శైలి ప్రవర్తనము చేశారు. అది విద్వానులలో, సాధారణ జనులలో కూడ విశేష లోక ప్రియమైనది. ఇపుడయితే భారతదేశమంత వీరి ప్రవచనములతో మారుమ్రోగింది.

శ్రీ స్వరూపానందజీ మహరాజ్ -

జబల్‌పుర్‌లో నేను దావుజీ మందిరములో వుండేటపుడు ఒక రోజు 20- 21 సం. అందం, ఆరోగ్యం కల్గిన నవయువకుడు అయిన సాధువ వచ్చాడు. ఒక మూలగా మౌనంగా కూర్చున్నాడు. నా మనసులో చాలా ఆకర్షణ కలిగింది. నేను చాల ప్రేమగా చూశాను. ఆ సాధువు 'శరణాగతి యొక్క స్వరూపమేమిటి' అని అడిగాడు. నేను కొంచెం విస్తారంగా తెలియజెప్పాను. వస్తుతః 'శరణాగతి' ఒక సిద్ధపదార్థము దృశ్య మాత్రమైనదాని శరణము 'అధిష్ఠాన చేతనమే అవుతుంది. ఎప్పటి వరకు దాని 'బోధ' కలుగదో అంత వరకు అశరణులమనే భ్రమ వుంటుంది. ఎపుడయితే యదార్థ శరణాగతి యొక్క బోధ కలుగుతుందో అపుడు ఆభ్రమ నివృత్తమవుతుంది. శరణాగతి అంటే అది ఒక క్రియ, ఒక భావం లేదా స్థితి కాదు. క్రియ అంటే విధి మూలకమవుతుంది. భావము విశ్వాసమూలకమవుతుంది. వాస్తవిక శరణాగతి

అధిష్ఠాన చేతన యొక్క బోధనే. చేతన కేవలం మన ఆత్మయే, అన్యము కాదు. యువసాధువు చాల శ్రద్ధగా అవధారణ పూర్వకముగా శ్రవణం చేశాడు. ఈ ప్రతిభా సంపన్నుడు అయిన మహాత్ముడు చాలా ఆదరముగా చెప్పినది గ్రహించాడు అని అనిపించింది. దాని తర్వాత వారితో మాకు స్నేహము ఏర్పడింది. వారు సత్సంగమునకు రావడం మొదలు పెట్టారు. నాతో పాటు బృందావనంలో చాలా సంవత్సరాలు వున్నారు. శ్రీ ఉడియాబాబాజీ వారితో మాకు వేదాంత సంబంధమైన ప్రశ్నలు జరిగినపుడు వీరు చాల ప్రముఖ పాత్ర వహించేవారు. బాబా కూడ చాల ప్రేమగా వేదాంత సంబంధమైన గంభీరమైన మాటలను కూడ తెలియజెబు తుండేవారు. వారు మొదట తన పేరుతో సరస్వతిని జోడించలేదు. నేను మొదలెట్టాను. తర్వాత వారి పేరు శ్రీ స్వరూపానందజీ సరస్వతీ అయింది. బాబా శరీరము శాంతమయిన తర్వాత వారు జ్యోతిష్పీఠాధీశ్వరుడితో దండగ్రహణము చేశారు. ఇపుడు వారు ద్వారకా - శారదా పీఠాధీశ్వర జగద్గురు శంకరాచార్య శ్రీ స్వరూపానంద సరస్వతి జీ మహరాజ్ అయ్యారు. ఇప్పటికీ మా ప్రేమ వారి పట్ట ఎప్పటిలాగానే వుంది.

సేఠ్ గోవింద దాసు మరియు ఇతరులు -

దేశపు ప్రసిద్ధనేత సేఠ్ శ్రీ సేఠ్ గోవిందదాస్ గారి అత్యంత ప్రతిభాశాలియై మంచి వయసులో వున్న పుత్రుడు, మధ్యప్రదేశ్‌కు విత్తమంత్రి శ్రీ గజమోహన్‌దాస్‌జి గారు ఆకస్మికముగా మరణించారు. సేఠ్‌గారికి, వారు కుటుంబమునకు ఈ దుర్ఘటనవలన అత్యంత దుఃఖము కలిగినది. వారు శోక మోహ పీడితులైనా దగ్గరికి వచ్చారు. ప్రవచనాలు, సత్సంగాలు జరిగాయి. వారు నన్ను జబల్‌పుర్ తీసుకువెళ్ళారు. ఒక పుస్తకము వ్రాశారు. అందులో నా సత్సంగము యొక్క సారము వున్నది. ఇపుడు నాకు శాంతి దొరికింది అని అన్నారు వారు. ఆ కుటుంబంతో పరిచయమయ్యాక మాటి మాటికి జబల్‌పుర్ వెళ్లడమయింది. వారి కుటుంబంతో ఘనిష్ఠ సంబంధం ఏర్పడింది. అంతే కాక అక్కడ నా శిష్యుల సంఖ్య సర్వోపరి ఉదయం 6 గం. నుండి రాత్రి 10 గం. ల వరకు సత్సంగం అలా జరుగుతూనే వుండేది. అక్కడి హైకోర్టు ఛీఫ్ జస్టీస్ శ్రీ శివదయాల్‌జీ మరియు వారి సహచరులు, ఇంకొ మరి

కొందరు ఉదయం సత్సంగమునకు వచ్చేవారు. వారు సత్సంగంలోని మాటలను వ్రాసిపెట్టుకుంటు వుండిరి. స్పీకరు, మినిష్టర్లు విద్వానులు అందరు శ్రీ గోపాలజీ మందిరమునకు వచ్చేవారు. 125 ఏళ్ళ ఈ పురాతన మందిరం ఒక పెద్ద జలాశయము పైన నిర్మించారు. నగర వాసులకు ఈ మందిరమంటే చాల శ్రద్ధ, భక్తి, నిత్యము నియమంగా సేవ పూజలు అక్కడ జరుగుతుండేవి.

అక్కడికి శ్రీ నృసింహ మందిరం పూజారి కూడ వస్తుండేవారు. వారు, వారి శిష్యులతో శాస్త్ర చర్చ జరుగుతుండేది. భగవంతుని సగుణ సాకార రూపము, అవతారము, మూర్తి, పూజ, భగవద్భక్తి మొదలైన వాటిని గురించి చర్చ జరిగేటపుడు వారు చాల ఆనందంగా వుండేవారు. రాజేంద్ర సింహ, వారి పుత్రులు రామ ప్రతాపసింహ వారికి విశేష కృపాపాత్రులు.

యోగులతో ముఖాముఖి -

మా వూరికి 4 - 5 మైళ్ళ దూరంలో బేవనా, నీరాపుర్ అనే పేర్లుగల రెండు వూర్లు వున్నాయి. అక్కడికి ఒక సిద్ధజీ బ్రహ్మచారి వస్తువుండేవారు. వారు ప్రొద్దున నుండి మధ్యాహ్నం వరకు పద్మాసనం వేసుకుని వెన్నెముక నిటారుగా పెట్టి, తలకొంచెం వెనక్కి వంచి సూర్యుడి ఎదుట కూర్చుండేవారు. మధ్యాహ్నం తర్వాతనే జనంతో కలిశేవారు. బేవనాకు చెందిన పాండేజీ, నీరాపుర్‌కి చెందిన చంద్రశేఖర్ లాల్ వీరి భాగసేవ చేస్తుండేవారు. ప్రాణాయామము, ధ్యానము, సమాది అయోగికి బాగ అభ్యాసముండేది. కొన్ని సిద్ధులు కూడ వుండేవి. ఒకటి రెండు సార్లు శ్రీ చంద్రశేఖర్ లాల్ వారిని తీసుకుని మా ఇంటి వచ్చారు. నేను కూడ వారి దర్శనము చేసుకున్నాను. వారు నర్మదా తీరంలో జబల్‌పుర్ దగ్గర చాల తపస్సు చేశారు. వారితో సత్సంగము చేశేటపుడు వారు నర్మదా తీరము దగ్గర వున్న మహాత్ములను గురించి చాల సంగతులు చెబుతుండేవారు. యోగాభ్యాసము లేకుండ ప్రాణములు స్థిరం కావనీ, మనసు సంయమము జరుగదనీ వారు అంటారు. నిజమైన భగవద్భక్తి, తత్త్వజ్ఞానం కావాలంటే యోగము యొక్క అవశ్యకత అనివార్యము. మనసును నియంత్రించే శక్తి ఒక్క యోగమునకే వున్నది. అని అనేవారు. వారిలో భవద్భక్తి లేశమాత్రమయినా లేదు. కాని ద్రష్ట యొక్క స్వస్వరూపావస్థానమును గురించి

మాత్రము చాల ప్రేమగా చెబుతుండేవారు. వారు ఇంకా ఇలా అంటేండేవారు తనువు మనసు, సురత్ స్థిర చేసుకుని కేవలం చూస్తువండు, విక్షేపము సమాధి రెండూ దృశ్యమే. కేవలం మన ఆత్మయే ద్రష్ట - ద్రష్ట తాదాత్మ్యత చెందకుండ వుండే వృత్తులు స్వయంగా నిరుద్ధములవుతాయి. నిరుద్ధవృత్తులలో శక్తి సంచయము కలుగుతుంది. సిద్ధులు కలుగుతాయి. సిద్ధులను ప్రదర్శించకూడదు. కాని సిద్ధులు రావడం వలన యోగము యొక్క సిద్ధాంతముపైన, నీర్బిజ సమాధిపైన పక్కా విశ్వాసము కలుగుతుంది. వారు ఇంకా ఇలా అనేవారు 'అభ్మ తాలంబన - రూప - సంప్రజ్ఞాత సమాధి వరకు నేను వెళ్లగలను. ఇంకా వివేక ఖ్యాతి కలుగ లేదు. దాని కోసము ప్రయత్నిస్తున్నాను. దాని తర్వాత అసంప్రజ్ఞాత సమాధి కలుగుతుంది. భేదాఘాట్ దగ్గర బందర కూదనీ క్రిందుగా ఒక కుటీరము వుండేది. అక్కడనే వారు చాల సంవత్సరాలవరకు అలా సాధన చేస్తూనే వుండిరి. పాలరాతి ఎత్తైన ఆ గట్ల మధ్యనుండి నర్మదా నది యొక్క పలుచటి ధార వేగంగా సర్వదా ప్రవహిస్తూనే వుంది.

విద్వాంసులు

మా పితామహుడు

మా పితామహుడు సం. శ్రీ చంద్రశేఖరద్వివేది జ్యోతిష్యము, కర్మకాండలలో మంచి ప్రతిష్ఠితుడైన విద్వానుడు. చాల చిన్న వయసు నుండే నాకు వారి నుండి శిక్షణ మొదలయింది. సత్యనారాయణ కథ, దుర్గాపాఠ్, ముహూర్త చింతామణి నాకు కంఠస్థమయినాయి. వారి దగ్గర చదువు కోవడానికి దూర దూరం నుండి విద్యార్థులు వస్తుండేవారు. అందులో కొందరు మా ఇంట్లోనే వుండి చదువుకునే వారు. మాలో మాకు ఎవరు ఎక్కువ పాఠకంఠస్తం చేసుకుంటారా అని పోటా పోటీగా వుండేది. మా పితామహుడు వారిని నేను 'బాబా' అనే వాడిని. ఏదైన శ్లోకం కంఠస్థం చేసుకోవాలంటే మాల (జపమాల) పై 108 సార్లు చదువుకుంటే ఇక ఎప్పుడు మరిచిపోరు అని వారు చెప్పారు. మొదటి రోజున కంఠస్థం చేసిన శ్లోకాలు రెండవ రోజున మరల ఒకసారి చదువుకోవాలి. దీనిని 'ఉద్ధరిణి' అంటారు. తర్వాత కొత్త శ్లోకాలు పని పట్టాలి. అంటే శబ్దముల ఉచ్చారణ క్రమము యొక్క సంస్కారము ఎంత ధృడమవ్వాలంటే తెలియకుండానే ఎవరైన శ్లోకము ఆరంభిస్తే తరువాతి శబ్దం దానంతటదే వచ్చి నాలుకపై కూర్చొవలసిందే. బాబా జ్యోతిష్యమ్యు యొక్క గణితమును ఎంత సులంభంగా చేసేవారు. కుండలి ఎలా తయారు చేసేవారు. ఫలాదేశము ఎలాగ చేస్తారు. ఇవన్నీ నేను వారిని చూచి అను^రణ చేస్తుండే వాడిని. ఇవన్నీ నాకు ఏమీ కష్టమనిపించేది కాదు.

ఎవరైనా నా వివాహము కొరకు వచ్చి అమ్మాయి పేరు చెబితే నేను గప్‌చిప్‌గా నాది, మైత్రి వర్ణ, గణాలు అన్నీ చూసుకునే వాడిని. ఆ సమయమంలో నేను చాల

చిన్న వాడిని. నాకు పది సంవత్సరముల వయసు వచ్చేటప్పటికే వారు నన్ను ఆవాజాపుర్ ఠాకుర్ గణేశ్ సింహ్ గారి దగ్గర శ్రీమద్భాగవత సప్తాహములో వక్తగా సింహాసనము పై కూర్చుండబెట్టారు. నేను కథితో వంశవిస్తారో' దగ్గర నుండి పాఠ్ మొదలుపెట్టాను.

పం. ప్రహ్లాద మిశ్ర -

మా వూరి నుండి రెండు, రెండున్నర మైళ్ళ దూరంలో ధానాపుర్ అని ఒక బస్తీ వుంది. అక్కడుండే వారు పం. ప్రహ్లాద మిశ్ర. వారు పండితులే కాక సదాచారి, చాల సజ్జనుడు, సౌమ్యుడు. నేను ప్రతి రోజు విద్యాధ్యయనము కొరకై వెళ్తుండేవాడిని. వారు గంగాస్నానం, సంధ్యావందనం ముగించుకుని గంగాజలము తీసుకుని ఇంటికి వచ్చేవారు. పిలకముడి, లలాటంపై చందన తిలకం, అధ్యాపనం లో చాల నిపుణులు. గాయత్రి జపంలో వారికి చాల నిష్ఠ వుండేది.

వారు చదివించేటపుడు ధీర గంభీర స్వరంతో ప్రేమగా ఒక్కొక్క మాటను స్పష్టం చేస్తుండేవారు. ఉదాహరణకు లఘుకౌముది పాణినీయ ప్రవేశాయలో 'పణ' ఒక దాతువు. దాని అర్థము వ్యవహారము, 'పణన్' అంటే వ్యవహారమే 'పణ' ము. అందులో ఎవరు నిపుణులో వారిని 'పాణీ' గోత్రం లో పుట్టినందులకు 'పాణిని' అయినాడు. పాణిని ద్వారా నిర్మితమయిన శాస్త్రము పాణినీయము, అందులో ప్రవేశము కొరకు పాణినీయ, ప్రవేశాయ. ఇక ఇపుడు మీరే చెప్పండి. ఈ అధ్యయనమును ఎపుడయినా మరువగలమా !

పండిత్‌జీతో లఘు కౌముదితో పాటు న్యాయబోదిని సహితముగ తర్క - సంగ్రహము, మల్లినాథటీకా సహితముగ రఘువంశము మరియు మూలరామాయణము చదివించారు.

ఒకసారి ఏం జరిగిందంటే రెండు మూడు రోజుల నేను చదువుకొన డానికి వెళ్ళలేదు. వారి తండ్రిగారు ఆయుర్వేదములో గొప్ప విద్వానుడు, పేరుగన్న చికిత్సకుడు అయిన పండిత శ్రీరఘుదత్త మిశ్ర గారు మా ఇంటికి వచ్చారు. వారు మా పితామహుడికి సమవయస్కులు. వారు నాతో ఇలా అన్నారు. బాబు నీకు

జ్వరం వస్తోంది. అందుకని రాలేదా ? రేపు నీకు జ్వరం రాక ముందు నా దగ్గరకి రా, నేను జ్వరం నిలిపివేస్తాను. అన్నారు. నా తలపమైన చెయ్యి పెట్టి వీపు నిమరి వెళ్ళి పోయారు.

రెండవ రోజు జ్వరం రాకముందే నేను వారి ఇంటికి వెళ్ళాను. వారు ఆవు పేడతో అలికి, కంబళి పరిచారు. నాతో అన్నారు. నీవు దీనిపైన కూర్చొ లేదా పడుకో. నేను నాలుగు ప్రక్కల ఆవు పేడ భస్మముతో ఒక మంత్రం వ్రాస్తాను. దానిలోపలికి జ్వరం ప్రవేశించలేదు. నీవు బయటికి రావద్దు అన్నారు.

నేను మొదట అయితే పడుకున్నాను. కాని వారు వెళ్ళిపోయాక లేచి కూర్చుని ఏమి వ్రాశారో అని చూశాను. అది హనుమాన్‌జీ మంత్రము. అందులో విభిన్న ప్రకారములయిన జ్వరముల పేర్లు తీసుకుని హనుమాన్ జీ ఈ జ్వరములను నష్టము చేయుగాక అని వ్రాసి వున్నది.

నిజంగానే ఆ రోజున నాకు జ్వరం రాలేదు. నేను మునుపటి లాగ అధ్యయన కార్యములో సంలగ్నుదనయ్యాను.

ఆ మంత్రపై నాకు చాలా సులభమైన శ్రద్ధ వుండినది, నేను ఎవరికీ చెప్ప కుండా ఆ మంత్రమును గ్రంథములలో వెదుక సాగాను. 'కళ్యాణ్' సంపాదన విభాగములోకి వెళ్ళినపుడు అది 'లాంగులోపనిషద్' లో దొరికినది.

ప్రసంగానికి కొంచెం వేరుగ వెళ్ళి నేను ఈ చమత్కారమును మీకు చెప్పదలచు కున్నాను. ఏమిటంటే ఆ రోజునుండి ఈ రోజు వరకు మరల నాకు ఎపుడు తీవ్రమైన జ్వరం రాలేదు. ఎపుడైన ఒకటి రెండు రోజుల పాటు కొద్దిగ జ్వరం వచ్చేది అంటే. ఆ మధ్యలో ఒక సారి 1934-35 లో పిత్తజ్వరం వచ్చింది. వాంతి అయి మూర్ఛి తుదనయ్యాను. భాయి సుదర్శన్ సింహ 'చక్ర' నన్ను నీటి తొట్టిలో కూర్చొబెట్టారు. నేను ఆ మూర్ఛిత దశలోనే ఒక భయంకర రాక్షసి దేని పేరయితే 'మృత్యువు' ను చూశాను. అది నా పైన ఆక్రమణ చెయ్యడానికి పరుగెట్టుకుని వస్తువుంది. అపుడు హనుమాన్ జీ చేతిలో గద తీసుకుని దాని వైపు పరుగెట్టారు. రాక్షసి పారిపోయింది. నా జ్వరం మాయ మయింది. మంత్రము యొక్క చమత్కారమనండి. కాదనండి

నా అనుభవం ఇప్పటి వరకు ఇదే. ముందు ఏమిటవుతుందో నాకు తెలియదు. పండిత ప్రహ్లాద మిశ్ర గారితో నా అధ్యయయనము సాగుతూవుండేది.

పండిత భూపనారాయణ మిశ్ర -

మా పితామహుడు నన్ను తనతో కాశికి తీసుకు వెళ్ళాడు. ఆ రోజులలో శ్రీమద్భాగవతముపై అద్వితీయ విద్వానుడు పం. శ్రీభూపనారాయణ మిశ్ర వుండేవారు. వారు నీలకంఠ మహదేవ మోహల్లాలో శ్రీరామ మందిరం లో వుండిరి. పితామహుడు సమవయస్కులు. మా వూరికి రెండుమూడు మైళ్ళ దూరం వున్న 'మహేశీ' గ్రామ నివాసులు. నాకు కాలి బొటనవ్రేలికి దెబ్బ తగిలివుండినది. వారు పసుపు మట్టితో లేపము వేశారు. వారు నన్ను చాల ప్రేమగా చూచుకొనేవారు. భాగవత శ్లోకాలు నాతో చెప్పించుకుని వినేవారు. తర్వాత నేను వారి వద్ద శ్రీధరీటీకా సహితంగా భాగవతము సంపూర్ణంగా అధ్యయయనము చేశాను. మా పితామహుడికి సలాహా ఇచ్చారు - బాకుడి మేథస్సు బాగుంది కాశిలో చదివేందుకు పంపమని చెప్పారు. కాశీలో చదవడానికి పండిత శ్రీరామ భావనోపాధ్యాయులే సర్వశ్రేష్ఠులు వారి దగ్గరికి పంపమని సలహా ఇచ్చారు.

శ్రీరామ భవనోపాధ్యాయులు -

పండిత్‌జీ బలియా జిల్లా సుఖపూరా గ్రామ నివాసులు. కాశీలో మహ మహపాధ్యాయ పం. శ్రీదామోదర శాస్త్రి వద్ద వారు వ్యాకరణమును అధ్యయయనము చేసి వుండిరి. శాస్త్రి గారు కాశిలో వున్న 4 దిగ్గజములలో ఒకరు - శ్రీ శివకుమార శాస్త్రి, శ్రీ తాంత్ర్యా శాస్త్రి, శ్రీ గంగాధర శాస్త్రి మరి దామోదర శాస్త్రి. దర్భంగా నరేశుడు అధ్యక్షతలో శ్రీ బచ్చాఝాగారితో శాస్త్రార్థము జరిగింది. అపుడు వారి విలక్షణమైన వైదుష్యమును అందరు భూరి భూరి ప్రశంశించారు.

మా గురువుగారు పం. రామభవనోపాధ్యాయులు వ్యాకరణములో ఉద్భట విద్వానులు. వారు సాధారణంగా రాత్రి 2 గం.ల కంత లేచిపోయేవారు. స్నానం చేసి అపరాజిత దేవిని పూజించి మంత్ర జపం చేశేవారు. సూర్యోదయ పూర్వం సంధ్యావందనం, గాయత్రి జపం చేసి, ఆ రోజులలో క్వీన్స్ కాలేజి దాదాపు రెండు

F.N: Paavana Prasangalu.p65, P.N:214

మైళ్ళ దూరంలో వుండేది. అక్కడ అధ్యాపనము కొరకు వారి వూరి నుండి కాలి నడకన వెళ్ళేవారు. వారు ధోవతి, అంగవస్త్రం పాగా, దుపట్టా ధరించి చిన్న చందనపు బొట్టు పెట్టుకుని బాగ తయారయి వెళ్లేవారు.

పండిత్‌జీ అధ్యాపనము, అధ్యయనము తన ధర్మము యొక్క అనుష్ఠానమే అనుకుని చేశేవారు. జీవిక, వేతనము వీటి పైన వారికి ఎపుడు దృష్టి వుండేది కాదు. ధర్భాంగ సంస్కృత పాఠశాలలో వారు అధ్యాపనము చేశేటపుడు వారికి 15 రూ. నెలకు ఇచ్చేవారు. కాని వారు ఎపుడు వాటిని తన కోసం ఉపయోగించుకోలేదు. ప్రతి రోజు 8 అణాలు పుష్పమాల తీసుకుని శ్రీ అన్నపూర్ణాదేవికి సమర్పించుకుంటు వుండిరి.

నన్ను చదివించేటప్పటికో పండిత్‌జీ బాగ వృద్ధుడు. కానీ క్వీన్స్ కాలేజీలో గొప్ప వ్యాకరణ పండితుడైనప్పటికి వారు కాలినడకన అన్నపూర్ణదేవి (మందిరము)కి వెళ్ళేటపుడు దాదాపు 3 మైళ్ళు వుంటుంది. నేను వారి వెంట వారితో పాటు నడవలేక పోయేవాడిని. కుడి చేతితో దండ పట్టుకొని ఎవరినీ ముట్టుకోకుండ నడిచేవారు. ఆ రోజులలో కాశిలోని సందుల్లో ఇంత జన సమ్మర్ధము వుండేది కాదు.

వారికి అధ్యాపనము ఎంత వ్యసనమంటే చెంబు తీసుకుని శౌచాలయముకు వెళ్ళేటపుడు కూడ ఎవరైన వచ్చి వ్యాకరణ సంబంధమైన ప్రశ్న వేస్తే అన్ని మరచి అక్కడ కూర్చుని ప్రశ్నకు సమాధాన మిచ్చి సమాధానపరచేవారు. ఆ రోజులలో వారు 'శబ్దేందు శేఖరము' పై టీకా వ్రాస్తు వుండిరి. శ్రీ సభాపతి ఉపాధ్యాయుడి ద్వారా 'మంజూషా' పైన టీకా వ్రాస్తుండిరి. మరియు శ్రీహారాణ చంద్ర శాస్త్రి ద్వారా 'కాల తత్వం విమర్శినీ' పైన టీకా వ్రాస్తుండిరి. వీరు ముగ్గురు వ్యాకరణ - శాస్త్రములో మర్మజ్ఞులు. వారు ఒకరికొకరు పరస్పరం కలుసుకుని మాట్లాడుకునే టపుడు వారి ప్రతిభా ప్రకాశము చూసి చూసి మేము ముగ్దులమవుతువుంటిమి.

పండిత్‌జీ శిష్యులలో శ్రీరామయశస్ త్రిపాఠీ (మహాశయ్‌జీ) శ్రీ దేవనాయకాచార్యులు, శ్రీ ఉమాపతి ద్వివేది, మొదలైన వారంతా కూడ వారి జీవిత కాలంలోనే తను గొప్ప పాండిత్యము కారణంగా విఖ్యాతులైరి. వారి అనేకులైన గొప్ప విద్వాన్

శిష్యులు పేర్లు నాకు అంతగా గుర్తు లేదా 60 సం.ల క్రిందటి పాత మాట. వారు చదివించేటపుడు అపుడపుడు తమాషా కూడ చేస్తుండేవారు. వారు ఒకసారి అలా గోడకి చేరగిలబడి 'సిద్ధాంత కౌముది' చదివిస్తున్నారు. నేను అడుగుతూవుంటే వారు చెబుతున్నారు. మధ్యలో ఒక శబ్దం నేను వదిలి వేశాను. వారు నవ్వుతూ ' ఓహ్ సరిపోయె! మధ్యలో ఒక శబ్దం వదిలేశావు కదా! అన్నారు. నేను ఏది? అన్నాను. పండితజీ 'ఏదయితే నీవో అదే' అన్నారు. నేను మరల పేజి త్రిప్పి చూశాను అది ఉల్లు శబ్దం ఉత్క్రుష్టం లునాతి. ఒక సారి చదివిస్తూ ఇలా అడిగారు - ఈ శ్వాస ఇలా మాటి మాటికి లోపలికి వస్తు- పోతూ వుంటుంది దీనికి కారణమేమిటి? నేను నాకు తెలియదని చెప్పాను.

పండితజీ అన్నారు 'శరీరము లోపల ఒక సరోవరము వున్నది. అందులో ఒక అష్టదళకమలము వికసించి వున్నది. దానిపై ఒక హంస పరిభ్రమిస్తూ వుంది. అది ఎపుడయితే తన చరణమును కమలదళము పై పెడుతుందో అపుడు కమల దళము నొక్కుకు పోయినందులకు గాలి యబటికి వస్తుంది. ఎపుడు అది తన చరణమును అక్కడినుండి తీస్తుందో అపుడు గాలి లోపలికి వెళ్తుంది. ఆ హంస యొక్క చరణ విన్యాస కారణముగా ప్రాణము యొక్క గమనాగమనము జరుగుతుంది. ఎన్ని సంవత్సరాల తర్వాతనో నాకు సరిగా గుర్తులేదు. నేను ఛాంధోగ్యం ఉపనిషత్తులో 'దహర-విద్య'ను గురించి చదివాను. అది ఐరం మదీయ సరోవర' అది హృదయ పుండరీకము, అదియే బ్రహ్మపురము. గురుజీ యొక్క కృప స్మరణకు వచ్చి కళ్లు చెమ్మరిల్లాయి.

ఏదో పని వుంది నేను నెల, నెలన్నర వరకు కాశి వెళ్ళలేక పోయాను. బహుశ నేను ఇమామ్ గంజ్ జిల్లా వెళ్ళి వుంటిని. అక్కడ మా పరంపరాగత శిష్యులు శ్రీ శీతలసింహజీ గొప్ప ప్రతాప వంతుడైన క్షత్రియుడు. వారి వద్ద దాదాపు వంద రకముల రామాయణముల సంగ్రహము వుండేది. వారు కూడ స్వయంగా 'శ్రీ సీతారామ చరితాయనము' అన్న పేరుగల పుస్తకం వ్రాశారు. అది 4, 5 ఖండములలో ప్రకాశితమైనది. వస్తు - విన్యాసము, కావ్య దృష్టితో చూస్తే అది చాల ఉత్తమ రచన. నాకు అక్కడ మనసుకు బాగ నచ్చింది. సంస్కృతము, హిందీ, బెంగాలీ ఎన్నో

రామాయణములను చదివాను. తిరిగి రావడానికి ఆలశ్యమయింది. గురుజీ ఎదుట సంస్కృతములో కొంచెం వ్రాసి తర్వాత ఆఖరున అనుష్టుప్ చంధస్సులో ఇలా వ్రాశాను.

శ్రీమతాం పురత్యోస్త్యేషా ప్రార్థనా వినయాంచితా
సంశోధ్య శోధనీయాన్ వైలేఖ్యాలేఖ్యా 'విహరిణః'.

దీని అర్ధము - మీ సమ్ముఖములో నివేదించుకుంటున్నాను. నేను వ్రాసిన దానిలో ఏదైన సంశోధన చేయవలసినది వుంటే దానిని సంశోధన చేసి శాంతము విహరి వ్రాయుటకు యోగ్యమైనదేదో అది కూడ చెప్పండి. నేను నా పేరు దగ్గర ఒక ప్రదేశము పేరు 'విహారి' అని ప్రయోగము చేశాను. గురుజీ తన చేత్తో నా పేరును వ్రాసేటపుడు శాంతను అని వ్రాస్తు వుండిరి. అలాగే పిలుస్తు వుండిరి. పురాణములలో భీష్మపితామహుడు తండ్రిపేరు 'శంతను' అని వుంది. అందరు నన్ను శంతను అని పిలిచేవారు. కాని గురుజీ ఎపుడు నన్ను 'శాంతను' అనే వారు. శమ తనోతి కాదు, శాంతమ్ నౌతి అంటే కళ్యాణ కరము, కళ్యాణమున విస్తరింప చేసేది అని కాదు, శాంత పురుషులను స్తుతి చేసేవాడు అని అర్ధము. నేను వ్రాసిన 'విహారి' అన్న పేరును వారు పట్టుకున్నారు. దాని క్రింద ఇలా వ్రాశారు.

విహారిణో బిహారేస్తి చేష్టా యస్మాదతః పురా
కియత్పర్యంతగ్రంథే వ్యేభ్యాసోస్తీతి నివేద్యతామ్

అర్ధము - విహారి యొక్క చేష్ట బిహారులో వుంటుంది. బిహారు ప్రాంతంలో విహారము చెయ్యాలి. అందుకని ముందు ఇది చెప్పు (నివేదించి) గ్రంథములో నీ అభ్యాసము ఎంత వరకు వచ్చినది? నేను గురుజీకి ఈ శ్లోకము వ్రాశాను.

మాఘస్య సర్గద్వయ మాత్మబుధ్యా సంపాద్య వశ్యం త్వంతం కృపాతః
త్వత్పాద పద్మా శ్రయలబ్ధశక్తి : పాఠం సమాసే పురుషే భజ్యేహమ్

అర్ధము - మీ కృపతో నేను 'మాఘ' వి రెండు సర్గలు వశం చేసుకున్నాను. మీ చరణ కమలము ఆశ్రయము శక్తిని పొంది నేను తత్పురుష సమాసమును అధ్యయనము చేయుచున్నాను.

గురుజీ చాలా ప్రసన్నుడయ్యాడు. వారు శ్లోకములు ద్వారనే చాలా ప్రశ్నలడిగారు.

ఒక సారి వారు శ్లోకములకు అర్ధము వ్రాయమంటు 'శ్లోకా విమౌస్ఫుటం ధీమన్! వ్యాఖ్యేయౌ రీతి మాశ్రయన్' అని వ్రాశారు. ఆ రోజు నన్ను గురించి 'ధీమన్' అన్న సంబోధన చూసి నేను ఎంత సంతోష పడ్డానో మీరు స్వయంగా ఊహించుకోగలరు.

వారు వ్రాసిన ఇంకొక శ్లోకము వినండి. వారికి నా యెడల వున్న అత్యంత స్నేహ, వాత్సల్యములకు సూచకముగా నున్నది.

ఆలస్యముత్సార్య సమాశ్రయస్వ భోవిదాం
ప్రియాం నీతియుతాం చదక్షతాం శ్రమో విధేయో
భవతా తితీర్షుణా సుదుస్తరం వారిధిమన్తరా తరిమ్ ॥

అర్ధము - ఆలస్యమును (సోమరితనము) వదలి విద్వానులకు బాగ ప్రియం కలిగించే నీతియుక్తమైన దక్షతము ఆశ్రయించు. నావ యొక్క అత్యంత దుస్తర వారిధి యొక్క సంతరణము కొరకు మీకు బాగా పరిశ్రమ చెయ్యాలి. స్నేహ, వాత్సల్యములు మూర్తీ భవించిన స్వరూపమే గురుజీ, వారు వ్రాసిన శ్లోకములు ఇపుడు కూడ అపుడపుడు స్మృతి పధములో మెదులుతాయి. హృదయ వటలము పైన అంకితమయినట్లు వుంటాయి. వారి కృపయే నా విద్యగా మారింది.

వారు నన్ను క్వీన్స్ కాలేజీకి పిలిస్తే అక్కడికి వెళ్ళి నేను చదువుకునేందుకు వెళ్ళేవాడిని. లేకపోతే వారి ఇంటి దగ్గరనే చదువుకునే వాడిని.

ఒక రోజు పొద్దున 6 గం.లకు కాలేజీకి రమ్మని వారు ఆజ్ఞ ఇచ్చారు. నేను వారికి ఇలా నివేదించుకున్నాను. మీరు ప్రొద్దునే చదువు చెప్పనపుడు, నేను పండిత భూపనారాయణ మిశ్రగారి వద్ద శ్రీ మద్భాగవతము అధ్యయనము చేస్తాను. వారికి శ్రీధరీటీక సహితముగా శ్రీమద్భాగవతము కంఠస్థము వుంది. వ్యాకరణములో కూడ దురంధర విద్వానులు. వారితో మా ఇంటి వారికి కూడ సంబంధం వుంది. చాలా ప్రేమగా చదివిస్తారు. గురుజీ అన్నారు. నీవు భాగవతము కూడ నాతోనే

చదువు. అన్యత్ర వెళ్ళే ఆవశ్యకత ఏమీ లేదు. రెండో రోజున నేను వారి దగ్గరికి వెళ్ళాను. రెండు మూడు శ్లోకాలు చదివించారు. ఆ మరుసటి రోజున కూడ రెండు మూడు శ్లోకాలు చదివించారు. మేము రోజు 100 శ్లోకాలు చదువుకుంటు వుంటిమి. మరల వారు నవ్వుతూ సరే నీవు అక్కడికే వెళ్ళి చదువుకో అన్నారు. నేను గురుజీ దగ్గర ఎన్ని వ్యాకరణము పాఠములు అవుతాయో అన్ని వినేవాడిని. వారు అపుడపుడు అనే వారు - నీవు వెళ్ళు, భూషణ - భాష్య విని ఏమి చేస్తావు ? అని 'గురుజీ' సంస్కారమయితే పడుతుంది కదా అని నేను అన్నాను. వారు ప్రసన్నులయ్యేవారు. గురుజీ నా ఒక్కొక్క ప్రవృత్తి పైన ధ్యానముంచేవారు. స్నానము, సంధ్య, గాయత్రి జపం స్మృతి, ధారణ బుద్ధి అన్నిటిని గమనిస్తుండేవారు. ఈ రోజు నీవు ఏమి తిన్నావు? అని కూడ అడుగుతుండేవారు. నేను నా బట్టలకు సబ్బు వాడే వాడిని కాను. కొంచెం ఇంట్లో బ్రాహ్మణ సంస్కారము కొంత ఆలస్యము. ఒకసారి వారి స్నానాల గదిలోనే నన్ను బట్టలు ఉతుక్కోమనేవారు. ఈ సంగతులన్నీ 1923-24 సం. అప్పటి మాట.

కాశిలోని శ్రీ సాంగవేద - విద్యాలయములో ప్రతి సంవత్సరము గణేశోత్సవము జరుగుతుండేది. ఆ రోజులలో కాశిలోని ఋషికల్ప విద్వాన్ వచ్చి అక్కడే శాస్త్రార్థ సమయములో విరాజమానులయ్యే వారు. శ్రీలక్ష్మణ శాస్త్రి ద్రవిడ, శ్రీ పంచానవ తర్కరత్న, శ్రీ వామాచరణ భట్టాచార్య, శ్రీ నిత్యానంద పంత, శ్రీ భాపు శాస్త్రి వఝే, శ్రీ చిన్నస్వామి, శ్రీ జయదేవ మిశ్ర, శ్రీ ప్రమధనాథ తర్కభూషణ నీరందరు మహామహోపాధ్యాయులే. వీరి ఉపస్థితిలో ఒక్కోరోజున అన్ని శాస్త్రముల, వైదిక అంగ ఉపాంగములపై శాస్త్రార్థము జరుగుతుండేది. వాది, ప్రతి వాది పురస్కృతులయ్యేవారు వారి అధ్యాపకుల కూడ సత్కారము చేసేవారు. అది ఏ విషయమైన శాస్త్రార్థమైన సరే, పండిత రాజేశ్వర శాస్త్రి, శాస్త్రార్థుల దగ్గర కూర్చుని, వారికి మార్గదర్శనమునిస్తూ, శాస్త్రార్థములో హేత్వాభాసము మరియు వితండతకు స్థానం లేకుండ జాగ్రత్త పడేవారు.

మా గురువుగారు పం. రామభవనోపాధ్యాయులు కూడ అపుడపుడు అక్కడికి వెళ్ళేవారు. అక్కడికి సభకి అధ్యక్షులుగా వుండేవారు. శాస్త్రార్థమునకు విషయము నిచ్చి విద్యార్థుల జయాపజయములను నిర్ణయించేవారు.

గురుజీ విద్యార్థులలో దేవనాయకా చార్యులు, శ్రీమునివర మిశ్ర లకు ఒకటి రెండు సార్లు పురస్కారములు లభించాయి. నేను కూడ గురుజీ వెంట వెడుతూ వుండేవాడిని. విద్వానుల పరస్పర వార్తాలాపములు, వారి సంసర్గము యొక్క ఆనందమును పొందేవాడిని. వాది - ప్రతి వాది లిద్దరి పక్ష - ప్రతిపక్షములను అవధాన పూర్వకముగా విని, అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేవాడిని, నా వైపు నుండి నిర్ణయం తీసుకునే వాడిని ఎవరి పక్షము ప్రబలము, నిర్బలము ఎవరి పక్షపాతము, అన్యాయం జరిగిందో అంచనా వేసుకునే వాడిని.

శ్రీ సాంగదేవ విద్యాలయములో ఉత్సవము జరిగేటపుడు ఎ మద్భాగవత కథ జరుగుతూ వుండేది. విద్యాలయం తరపున విశిష్టమైన వ్యక్తులను ఎపుడు పిలిపించే వారో అపుడు మా గురువుగారు కూడ ఒకటి రెండు రోజులు వెళ్లేవారు. అపుడు నేను కూడ వెంట వెళ్తు వుండే వాడిని.

ఒకసారి పం. దాతార శాస్త్రి గారు 'జన్మాద్యస్యయం:' శ్లోకమునకు అనేక ప్రకారములుగా అర్థం చెప్పారు. వేదాంత, వ్యాకరణ , న్యాయ - సమ్మతముగా ! వినివిని గొప్ప గొప్ప విద్వానులు కూడ హర్షం వెలిబుచ్చేవారు. నాకు అయితే ఆశ్చర్యంగా వుండేది - ఓహ్ ఏమీ! భాగవత శ్లోకములలో ఇంత పాండిత్యము నిండి వున్నదా !! అని నేను 14 అర్థాలు గుర్తుచేసుకుని గురుజీ కి వినిపించాను. గురుజీ చాల ప్రసన్నులయ్యారు. నా తలపై చెయ్యి పెట్టి ఆశీర్వదించారు.

విద్యావతాం భాగవతే పరీక్షా.

ఏదో ఒక విద్యాలయములో విద్వానులది దక్షిణా సభ జరుగుతూ వుండినది. కాశికి చెందిన గొప్ప గొప్ప దిగ్గజులైన పండితులంత ఏక త్రితమయ్యారు. భాగవతము లోని బ్రహ్మ మోహము ను గురించిన ప్రశ్న 'ఇతరేశే తర్కే' ఈ శ్లోకంలో 'సతి సప్తమి' మరియు 'విషయ సప్తమి' రెంటిని ఒకే సారి వాక్యములో ప్రయోగించారు. ఒక వేళ గురుముఖంగా చదవక పోతే దానికి అన్వయము కుదరడం చాల కష్టము. వైయాకరణులు భాగవతాది గ్రంథములను సాధారణముగా చదవరు. మేము మా వ్యాకరణ బలంతో ఏ శ్లోకాని కయినా సరే అర్థం చెప్ప గలమని అభిమాన పడతారు.

'శాస్త్రార్థము' చాల బాగుండినది. మహా మహోపాధ్యాయ పండిత శ్రీ జయదేవ మిశ్ర గారు కూడ ఇందులో పాల్గొన్నారు. 'పరిభాషేందు-శేఖర్' పై వారి 'విజయా' అన్న పేరుగల టీక వున్నది.

మా గురువుగారు ఇరా సరస్వతీ తస్యా ఈశే బ్రహ్మణి ముహ్యతి సతి, కస్మిన్ విషయే? అజాతః పరత్ర పరస్మిన్ బ్రహ్మణి విషయే - అని చాల బాగ స్పష్టము చేశారు. శాస్త్రార్థము ఒక మలుపు తిరిగింది. బ్రహ్మ యొక్క సరస్వతీ స్వామిత్వాముపైన బ్రహ్మణ గ్రంథములలో కూడ ఈ కథను ఉల్లేఖించారు. బ్రహ్మ సరస్వతుల కథ లౌకికమయిన దేమీ కాదు. ఇది ఆధి దైవికము, లేదా ఆధ్యాత్మికము. ఆసమయములో ప్రకాశితమైనవి. వృతి జ్ఞానము యొక్క ప్రకాశమికము మరియు అధిష్ఠానము ఒకటే అవుతుందన్నదే మూలతత్వము. ఉత్పత్తి యొక్క ఉపాదానము మరియు ఆశ్రయము కూడ ఒకటే. అంతః కరణములోనే జ్ఞానము యొక్క ఉదయము, స్థితి వుంటుంది. ఆ ప్రసంగము అద్భుతము ! ఆఖరును ఇలా చెప్పారు. భక్తి వలన భాగవత బోధ కలుగుతుంది. అంతే కానీ అభ్యాసము, లేదా విద్య వలన కాదు.

గురుజీ వ్యాస మరియు సమాసమని రెండు పద్ధతులతోను చదివిస్తుండేవారు. ఒక్కోసారి ఏదైన దృష్టాంతము కూడ వినిపించే వారు. ఒకసారి ఏ విద్యార్థికయినా వారి అధ్యాపక శైలి యొక్క రసము దొరికిందంటే ఇక మరి అతడు వారిని ఎప్పుడూ వదలడానికి ఇష్టపడడు. 'నమునే' సూత్రముపై మహభాష్యము చదివిస్తున్నారు. అభావ శబ్దముతో అభావము యొక్క అభావము కూడ తెలుస్తుందా లేదా ? సరే మంచిది! పాతం జలి ద్వారా ఉల్లిఖిత దృష్టాంతము చూడండి.

ఒక వృద్ధ తపస్విని వుండేది. ఎన్నో వర్షములు తపస్సొనరించినది. దేవత ప్రసన్నమైంది. తల్లీ మీకు ఏవరం కావాలో కోరుకొండి అది లభిస్తుంది. వృద్ధ మాత ఒక్క క్షణ మాగి ఇలా అన్నది. నేను నా ఈ శరీరపు (జీవితపు) పౌత్రుని నా ఏనుగుపైన కూర్చొబెట్టుకుని బంగారు గిన్నే లో పాలు త్రాగించాలి. అది నేను నా కళ్ళతో చూడాలి. ఏమేమి అడిగింది ! వృద్ధురాలు యువతి అవ్వాలి, వివాహము కావాలి, పుత్ర పౌత్రులు కలగాలి. ధన - సంపద, దీర్ఘాయువు ! కళ్లు కనిపించాలి ! ఓహ్ ! ఒక్క వరదానములో

ఇంత పెద్ద యోజన ! దేవత చకితురాలైంది. సర్వం లభించింది. ఒక అభావము లో అన్ని అభావముల సమావేశము ఓహ్ ! మొదట చదివించే వారి రీతి ఇలాగుండేది.

ఆ రోజులలో పండిత మదన మోహన మాలవ్యగారు అంత్యజులకు మంత్ర దీక్ష ఇచ్చి, అస్పృశ్యతా నివారణ కోసం ప్రయత్నిస్తుండేవారు. మాలవ్యగారు వాఖ్యానము ఇచ్చేటపుడు తర్క - యుక్తులను రాశిరాశిగా పేర్చుతుండేవారు. ఆశిష్టత! ఆస్పష్టత! ఆ నిరూపణ చాతుర్యము ! ఇపుడెక్కడ చూడడానికి దొరుకుతందుఇ? మా గురువుగారు అంటుండే వారు ధర్మ నిర్ణయము కేవలము యుక్తి, ప్రయుక్తి బలంపైన వుండదు. దానిలో ఋషుల యొక్క సాక్షాత్కారము కావాలి.

అతీంద్రీయాన్ అసంవేద్యాన్ పశ్యంత్యార్యేణ చక్షుషా
యే భావాన్ వచనం తేషాం నాను మానేన బాధ్యతే

అర్థము : ఏదైతే అతీంద్రియము అసంవేద్యము అయిన భావమున్నదో దానిని విద్వాన్ పురుషుడు ఆర్షదృష్టితో చూస్తాడు. కేవలం అనుమానము ద్వారా అది బాధితమవదు వారు -

యత్నేనానుమిత్యోప్యర్థః కుశలైరనుమాతృభి :
అభియుక్తతరై .... రన్యైరన్యథై వోపపద్యదే ।

అర్థము :- కుశలుడైన అనుమాత చాల ప్రయత్నముతో ఏదైన పదార్థమును గురించి 'అనుమాన' పడతాడు. కానీ యోగ్యుడైన విద్వానుడు తన అనుమాన బలంతో దానిని తిప్పి వేస్తాడు.

అచింత్యాః ఖలు యే భావా న తాంప్తర్కేణ యోజయేత్

అర్థము :- ఏదైతే అ చింత్య భావమున్నదో, దానిని తర్క మనే గీటు రాయి పైన గీయకూడదు.

గురుజీ ఈ శ్లోకముతో పాటు అనేక శృతి - స్మృతి వచనములను కూడ జోడిస్తుండే వారు. మనుస్మృతి లో...

ఆర్షం ధర్మోపదేశం చ వేదశాస్త్రావిరోధినా
యస్తర్కేణానుసంధత్తే స ధర్మం వేద నేతరః

అర్థము : - ఏదైతే వేద శాస్త్రమునకు అవిరుద్ధ తర్కము ద్వారా ఆర్ష ధర్మోపదేశాన్ని అనుసంధానము చేస్తారో, వారే ధర్మము యొక్క రహస్యమును అర్థము చేసుకుంటారు. కేవలం కుతర్కము వలన కాదు.

పం. బలదేవజీ పాఠక్ -

ఈ ప్రసంగములో గురుజీ నాలాంటి అనేక మంది విద్యార్థులను భిన్న భిన్న శాస్త్రముల అనుసంధానము చేసి వివిధ విషయముల అనుక్రమణిక తయారు చేసేపనిలో పెట్టారు. ఆ రోజులలో ఉపలబ్ధమయ్యే సమస్త స్మృతి మరియు పురాణాల, భారం నాపైన పడింది. ధర్మ శాస్త్రమును అధ్యయనము చేయడంలో నాకు చాల అభిరుచి కలిగింది. గురుజీ ఆజ్ఞలేకుండానే నేను ధర్మ శాస్త్రాచార్యుల పరీక్షకు కూర్చోడానికి సంకల్పించాను. అక్కడ బడే పియరీ మొహల్లాలో జ్యోతిషాచార్య పండిత శ్రీ బలదేవజీ పాఠక్ తో వారు హిందు విశ్వ విద్యాలయములో ప్రాధ్యాపకులుగా నుండిరి. ధర్మ శాస్త్ర నిబంధ గ్రంథములు చదువసాగాను. పండిత్‌జీ కాశిలో పేరున్న విద్యానుడు. ఆ రోజులలో వారు సూర్య గంట నిర్మాణం చేస్తుండేవారు. అందరికి ఇచ్చేవారు కూడ వారి పుత్రులు పం. శ్రీ గణేశ్ దత్త పాఠక్ మరియు శ్రీ విద్యాధర పాఠక్, పాఠక్‌జీ సంపర్కముతో నేను పారాశర మాధవము, ధర్మ - సింధు, నిర్ణయం - సింధు, శూద్ర - కమలాకరము మొదలైన గ్రంథములను అవలోకనము చేశాను. పాఠక్ గారు సమయము దొరికినపుడంతా చాల ప్రేమతో నాకు చదువు చెప్పారు. తమ గురువుల కృపా పాత్రుడినైన కారణంగా నేను వారికి కూడ విశేష స్నేహ భాజనుడినయ్యాను. పండిత గణేశ్ దత్తగారు నా జన్మ కుండలిని తయారు చేశారు.

మాలవ్యజీ సనాతన ధర్మ సభ -

పండిత మదన మోహన మాలవ్య గారు ప్రయాగలో త్రివేణి తీరంలో సనాతన ధర్మ సభ ఆయోజనము చేశారు. అందులో దేశంలోని పేరుగన్న విద్వానులను ఆహ్వానించారు. మాలవ్యజీ చాలా శ్రద్ధతో మా గురువుగారిని కూడ పిలిచారు. అది

మహాకుంభమో, అర్ధకుంభమో నాకు సరిగా గుర్తులేదు. కాని మేలా మాత్రము చాలపెద్దది. విద్వానుల ఆ సభలో గురుజీ యొక్క స్థానము విలక్షణమైనది. గ్రంథములనుండి ఏవైన ప్రమాణములు వెలికి తీయడానికి వారు నన్ను తనవెంట తీసుకు వెళ్ళారు. ఎవరో విద్వానుడన్నాడు. 'వాల్మీకి అంత్యజుడు' అని గురుజీ నా వైపు చూశారు. నేను ఆధ్యాత్మరామాయణము తీసి ఎదుట పెట్టాను. అందులో వాల్మీకి జన్మ మాత్రమున ద్విజుడని, ఆచారమువలన శూద్రుడని వ్రాసివున్నది. ఋషులు వారికి మరోమరా అని జపం చెయ్యడానికికుపదేశించారు. గురుజీ చాల ప్రసన్నులయ్యారు. వారు అపుడపుడు నన్ను మేలా చూడ్డానికి కూడ పంపిస్తు వుండేవారు.

శ్రీ విష్ణు దిగంబర్‌జీ గీతా - సభా జ్ఞాన యజ్ఞము

ఆ సంవత్సరము మేలాలో శ్రీ విష్ణు దిగంబర్‌జీ గీతా జ్ఞాన - యజ్ఞము ఆయోజనము చేశారు. మేలా చూస్తు నేను అక్కడికి వెళ్ళాను. విశాలమైన సభ బహుశ నేను అంతవరకు అటువంటి పెద్ద సభ చూడ లేదనే చెప్ప వచ్చు. గొప్ప గొప్ప విద్వాంసులు, వారి గంభీరమైన ఉపన్యాసములు, గీతాశాస్త్రము యొక్క శాస్త్రీయము మరియు సుగమమైన వ్యాఖ్యలు జరిగేవి. మంచెపైన శ్రీ దిగంబరజీతో పాటు శ్రీ జయదయాల గోయెంకా కూడ కూర్చుని వుండిరి. గీతా ప్రెస్ సంస్థాపకులు వున్నట్లుండి (ఈ పేరా ఇంతకు మునుపు గోయెంకా వారి జీవితంలో వ్రాశాము).

అవధూతయొక్క ఉద్బోధన -

అవధూత గీత ఒక శాస్త్రము కాదని, ఇద్దరు మిత్రుల వార్తాలాపమని పరస్పర సంవాదమనీ, దీనిని గంభీరమైన దార్శనిక కక్షలో పడవేయవద్దని చెప్పారు. సరళరీతిలో జీవితమును సరళంగా చేసుకుని, కృత్రిమతనుండి దూరమై సహజత కోసమే గీతను చదవండి అన్నారు. అవధూత గారి నేత్రాల నుండి జల జల అశృవులు రాలాయి. వారు తమ మానసిక నేత్రములతో కృష్ణార్జునుల దృశ్యం చూస్తున్నారేమో అన్నట్లుంది. ఒక్క నిమిషంలోనే వారు లౌడ్ స్పీకరు వదిలి జనంలో అదృశ్యమయ్యారు. నాకు ఒక క్రొత్త అనుభవము.

నాకు ఇది ఒక క్రొత్త అనుభవము. శాస్త్రములు, శ్రాస్తులు వీరి వాతావరణములో వుంటు వుంటూ నా ధ్యానం ఇటువైపు లేనే లేదు. ఈ రోజున నాకు ఒక క్రొత్త దిశ దొరికింది. ఆ సభలోనే మొట్ట మొదట గోయెంకాజీ ని చూశాను. తలపైన పాగా, చెవులో పోగు, బగల్‌బందీ వేసుకుని ఒక మార్వాడసేఠ్‌లాగనే వున్నారు. నేను ఎవరైన మహాత్ముడేమో అని అనుకుంటు వుంటిని. ఒక సేఠ్ గీతపై ఇంత గొప్ప చింతన ప్రచారము చేయడం చాల ఆశ్చర్యం వేసింది.

(బ్రహ్మణ సమ్మేళనము, కాశీ విద్యద్గోష్ఠి, సింహాసన్ ఎంత ఎత్తు ఇవన్నీ ముందు వ్రాశాము)

గురూజీ రామభవనోపాధ్యాయులకు శాంకర అద్వైత సిద్ధాంతములో నిష్ఠ వుండేది. అద్వైత సిద్ధాంతం ఔపనిషదము. ఇతరుల టీక - టిప్పణి, భాష్యము కంటె విలక్షణమని సూచించడానికి దానిని శాంకర మంటారు. గురూజీ యొక్క స్పష్టమైన అభిమతము ఏమిటంటే వ్యాకరణ దర్శనం అద్వైత సిద్ధాంతమునే ప్రతిపాదిస్తుంది. జగత్ కారణ రూపముగా ఏ శబ్ద తత్వమును స్వీకరిస్తారో అది అనాది, అనంతము, అవినాశి, అపరిణామి, ఏదయితే అర్ధ సత్తా వున్నదో అది దాని వివర్తమే. వివర్తమంటే ఏదైతే తాత్విక స్వరూపమునుండి అన్యథా ప్రతీతమవుతుందో అది వివర్తము. ఈ శబ్దతత్వము వ్యవహార దశలో ప్రకృతి ప్రత్యయము, సుబంతము, తిడుంతము మొదలైన రూపములవుతాయి కాని, పరమార్ధ స్వరూపము పరా వాక్కుయే. అది వ్యవహార విషయము కాదు. అఖండ సంవిత్‌యే. కాల-కల్పన యొక్క ప్రకాశకమగుట వలన అది నిత్యము. దేశ కల్పన యొక్క ప్రకాశము అయినందు వలన అది వ్యాపకము. వస్తు భేద కల్పన యొక్క ప్రకాశము అయినందువలన అద్వితీయము. అన్నిటికంటే విలక్షణమైనందువలన అన్నిట అత్యంతా భావములకు అధికరణము కూడ వస్తుతః శబ్దతత్వము ఆత్మ తత్వములో ఏమి బేధము లేదు. ఎలాగయితే ప్రత్యేక దృశ్యములో ఆత్మ చైతన్యము యొక్క అనుగతి వున్నదో, అలాగే ప్రత్యేక ప్రత్యయములో శబ్దతత్వము అనుగతి వుంటుంది. శబ్దానుగమనం లేకుండా ఏ ప్రత్యయము వుండదు. వ్యవహారమంతా శబ్దాను విద్ధమే. ప్రత్యక్ష అనుమాన, ప్రమాణాదులతో 'ప్రమా' ఏదయితే కలుగుతుందో

అది కూడ శబ్దముతో వ్యాప్తమే అయం ఘటః 'తత్రవహ్ని' ఇవన్ని శబ్దవ్యవహారమే.

వైయాకరణుల మతములో ప్రత్యక్ష అనుమాన శబ్దము మరియు అర్థాపత్తి అని ప్రమాణము 4 రకములు. ఉపమానము 'అనుమానము' నకు అంతర్గతమే. అనుపలబ్ధి ప్రమాణాంతర్గతము. ప్రమాణముల సంఖ్య లో మతభేదము వున్నా కూడ ప్రమేయము' లో మతభేదము లేదు. అది అన్ని దర్శనములలోను ఒక్క లాగాననే వుంటుంది. వైయాకరణీలు ఇది స్పష్ట రూపముగా స్వీకరించారు. ద్రష్ట, దర్శనము, దృశ్యములో బేధము లేదని. ఇది ఒక నిర్వికల్పసత్యము. వేదాంత సిద్ధాంతమిదియే, వేదాంత సిద్ధాంతమును వర్ణించడము వలన మనసిద్ధాంతము యొక్క వర్ణన కూడ అయింది. ఎందుకంటే వ్యాకరణము యొక్క సిద్ధాంతము వేదాంతముపై ధృడమైన ఆస్థ పెట్టినది.

పండిత్ రామభవనోపాధ్యాయుల వ్యావహారిక కార్యకలాపములు ముగిసిన తర్వాత సాధారణముగ ప్రతిదినము ప్రస్థాన త్రయి యొక్క మనన చింతన ప్రతి దినము చేస్తుండేవారు.

ఈ మాట మొదటే చెప్పాను పండిత్‌జీ సనాతన ధర్మము యందు దృఢ నిష్ఠ కలిగిన విద్వానుడు. వారు వేద శాస్త్రోక్తమైన అన్ని సిద్ధాంతములపైన విశ్వాసము కలిగినవారు. భగవంతుని నిరాకార సాకారరూపము అవతారము. మూర్తి పూజ, వర్ణాశ్రమము, స్పృశ్యాస్పృశ్యములను, శ్రాద్ధము, కన్యాదానము, భక్ష్యా - భక్ష్య విచారము, తీర్థయాత్ర మొదలైన వాటి అన్నిటి యందు వారికి చాల విశ్వాసము శ్రద్ధ చూచి తీరవలసిందే ఒక్కొక్క దానికి ఉదాహరణ ఇస్తుపోతే చాల విస్తారమవుతుంది.

ఆ రోజులలో స్వామి విశుద్ధానంద పేరుతో ఒక మహాత్ముడుండే వారు. బనారస్ ఛావనీ మార్గంలో వారి ఆశ్రమముండేది. మమామహా పాధ్యాయ శ్రీ గోపీనాథ్ కవిరాజ వారిని గురించి 'విశుద్ధానంద- ప్రసంగము' అని బెంగాలీ లో ఒక పెద్ద పుస్తకము వ్రాశారు. అది చాల ఖండములలో ప్రకాశితమై వున్నది. కవిరాజు వారివి చాల చమత్కారములు చూశారు. చంపా మొక్కను గులాబి మొక్కగా గులాబి మొక్కను

చంప మొక్కగా చెయ్యడం వారికి నిమిషాలలో పని. అద్దంపై సూర్య కిరణాలు తీసుకుని అనేక చమత్కారములు చూపించేవారు. మన నేత్రాలకు భగవద్దర్శనము కూడ చేయించే వారు. పోరు త్రాటకంతో పాషాణము కూడ భిన్న భిన్నమయిపోతుంది. మేము ఈ చమత్కారములను గురించి వింటే మాకు సహజంగానే అనిపిస్తుండేది వెళ్ళి ఆ చమత్కారములను చూడాలని వుండేది. కానీ పండిత్ రామాభవనోపాధ్యాయ గురుజీ చాల కఠోరముగా మమ్ములను వెళ్ళ వద్దని ఆపు చేసేవారు. ఒక వేళ మీరు అభీష్ట సిద్ధి చమాత్కారములలో పడిపోయారంటే చదువు - సంధ్యలు పాడవుతాయి అని అనేవారు. అప్పటి నుండి ఇప్పటి వరకు కూడ మేము ఎపుడు వారి ఆశ్రమమునకు వెళ్ళలేదు. కొన్ని సంవత్సరాల తర్వాత ఒక విదేశ సజ్జనుడు పాల్‌బ్రింటన్ 'గుప్త భారతము యొక్క అన్వేషణ' (ది సీక్రెట్ సెర్చ్ ఆప్ ఇండియా) చేస్తు స్వామి విశుద్ధానంద గారి దగ్గరికి వచ్చారు. బనారస్ యొక్క జాదుగర్ అనేపేరుతో ఎన్నో చమాత్కారములు వ్రాశారు. కానీ తర్వాత వారు వేరే పుస్తకము వ్రాసి అన్నిటిని ఖండన చేశారు.

మహామహపాధ్యాయుడు శ్రీ గంగాధర శాస్త్రి యొక్క శిష్యులలో న్యాయ, వ్యాకరణ, మిమాంస, సాహిత్యములలో ఒక గొప్ప విద్వాంసుండేవాడు. వారి పాండిత్య ప్రకర్షను అందరూ అంగీకరిస్తువుండిరి. వారు అనేక గ్రంథముల లేఖనము, సంపాదనము చేశారు. కానీ వారు చాల విలక్షణముగా వుండేవారు. స్త్రీలలాగ వెంట్రుకలు పెంచుకునే వారు. అత్తరులో స్నానం చేసేవారు. రేషమ్ వస్త్రాలు ధరించేవాడు. మా గురువుగారు వారి దగ్గరకు కూడ వెళ్ళవద్దని చెప్పారు. సభలలతో వారిని ఎన్నో సార్లు చూశాను. గోరఖ్‌పుర్ కల్యాణ -పరివారముతో వుండేటపుడు వారిని కలుసుకునే అవసరము కలిగింది. సత్సంగము కూడ జరిగింది. కానీ నేను వారున్న చోటికి మాత్రం ఎపుడు వెళ్ళ లేదు. విద్యార్థులు శారీరిక శృంగారము, వేస భాషలు ఇవన్నీ భోగ-సాధనలు, వీటి వలన విద్యాధ్యయనములో విఘ్నము ఏర్పడుతుంది. ఉన్నతి కలుగదు అని గురువుగారు అంటుండేవారు.

కాశీలోని కవులలో ఆ రోజులలో మహామహోపాధ్యాయ దేవీ ప్రసాద్ గారికి చాల గౌరవం వుండేది. వారి సాహిత్య-జ్ఞానము, కావ్య రచన యొక్క ప్రతిభ విద్వానుల

చర్చావిషయమయ్యేది. కానీ వారి దగ్గరికి వెళ్ళడానికి కూడ మాకు గురువు అనుమతి లేదు. దీనికి కారణమేమిటంటే ఆ కవి శృంగార రస ప్రసంగాలలో చాల వర్ణనలు విశదంగా చేసేవారు, వారు వుండేది కూడ కొంచెము అలాగే, అందుకని గురుజీ వారి దగ్గరికి మేము వెళ్ళడము మంచిది కాదు అని అనేవారు. పం.దేవీ ప్రసాద్ వారి తండ్రి శ్రీతుక్కుభంజన్ కవి రఘువంశముపైన 'చోరపక్షీయ' అనే టీకా వ్రాశారు. దీనిని కూడ గురుజీ శాస్త్రము యొక్క విప్లవము అని అనేవారు. వ్యాకరణ కోశము మొదలైన వాటి ననుసరించి అది సరి అయినా పాండిత్య ఉత్కర్షము సూచిస్తున్నా ఆ విధంగా వ్రాయడం వాగ్దేవిని అవమానించడమే అని అనేవారు.

శ్రీరామ పరీక్షణ్ శాస్త్రి

కాశీలోని ఈశ్వర గంగీ కొత్త బస్తీలో ఒక విలక్షణుడైన విద్వానుడుండువారు. వారి పేరు శ్రీరామపరీక్షణ శాస్త్రి. వారు తమ ఇంటిలో నుండి బయటికి వచ్చేవారే కాదు. వారు సాంగోపాంగ సహితముగా వేద -శాస్త్రములను అధ్యయనము చేశారు. దర్శనశాస్త్రము యొక్క కర్కశ తర్కము, కావ్యము యొక్క ప్రసాదముతో వారి పరిపూర్ణ ప్రతిభ చూసితీర వలసినదే. రోడ్డు దాటిన తర్వాత ఒక బావి వుండేది మేము అక్కడి నుండి నీళ్ళు తెచ్చి నింపిపెడుతూ వుంటిమి. ఇంటి బయట ప్రాంగణము కసవు వూడ్చి శుభ్రము చేస్తువుంటిమి. 48 సం.లు వచ్చే వరకు వారు వివాహము చేసుకోలేదు. మేము మా గురువుగారికి తెలియకుండ వారి దగ్గరికి వెళ్తువుంటిమి. వారు అన్ని శాస్త్రాలలోను చూడంత విద్వాంసుడు. మా పాఠ్యగ్రంథాలను వారు చిటికే వేసినంత సులభంగ కథలాగ చదివించేవారు. అంతే కాక వారి దగ్గర ఒక చౌకీ వుండేది. (కూర్చునే పీట) ఎపుడయితే వారు దానిమీద కూర్చుంటారో వారిలో దైవీ శక్తి ప్రవేశించినట్లు వారు ఒక్కొక్కటిగా 48 విషయములపై నాతో సూత్రాత్మకమైన వ్యాసములను వ్రాయించారు. తేజో దర్శనము అబ్దర్శనము మొదలైనవి. ఒక కావ్యము వ్రాయించారు దాని పేరు 'శ్రీయోగేశ్వర చరితమ్' నాకు గుర్తున్నంత వరకు శ్రీయోగేశ్వరజీ వారి తండ్రిగారి పేరు. ఒక సదాచారి బ్రాహ్మణుడు తన కన్యను దానం చేశారు. పండితుడు మాకు చదువు చెప్పేటపుడు పత్ని కనిపించే లాగ కూర్చునే వాడు. ఆమె కూడ గ్రంథము తీసుకుని కూర్చుని చదువుకునేది. వారి సంపర్కము

వలన మా బుద్ధి అన్ని విషయములలోను కొంచెము, కొంచెము ప్రవేశము చేయగలిగింది.

వారు బ్రాహ్మణోచతి ఆచారములను పాటించేవారు. వారికి ఏదో సిద్ధి వుండేది. కాశిలోని మరియు దేశ విదేశము విద్వాంసులు, తన వద్దకు వచ్చి సమాధానము పొంది వెళతారని చెప్పినపుడు ఆశ్చర్యమవుతుంది. జర్మనీ నుండి వారి వద్దకు గణిత శాస్త్రి సంబంధమైన ప్రశ్నలు వచ్చేవట. మహమనా శ్రీసుదాకర్‌జీ ద్వివేది, గోపీనాథ కవిరాజ్ కూడ వారి దగ్గర నుండి చడిచప్పుడు కాకుండా ప్రశ్నలకు జవాబులు తీసుకు వెళ్తు వుండేవారట. స్వనామధన్యులు శ్రీ శివకుమార్ శాస్త్రి మహరాజ్ కూడ వారి నిరుత్తరమైన ప్రతిభను చూచి ఆశ్చర్యచకితులవుతుండేవారు. ఇవన్నీ మాటలు నిజం కాదేమో అని అనిపిస్తూ వుండేది. కాని బాగ శ్రద్ధగా వినవలసి వచ్చేది. ఈ మాటలన్నీను ఎందుకంటే వారు ఎంత చదివించేవారంటే వేరే విద్వానులయితే అంత మాత్రము చదివించడానికి సంవత్సరాలు తీసుకుంటారు.

స్వామి మనీషానందజీ తీర్థ -

వారణాసి యొక్క టేఢీనీమ్ మొహల్లాలో శివగఢ్ రాజుది ఒక బంగళా వుండేది. 3, 4 అంతస్థులయితే తప్పక వుండేది. అందులో స్వామి శ్రీ మనీషానందజీ తీర్థ వుంటుండేవారు. ఆ బంగళా లో ఒక్కడే దిగంబరంగా వుండేవారు. ఎవరూ నౌకర్లు వుండేవారు కాదు. శ్రీ శివకుమార్ శాస్త్రితో వారికి శాస్త్రార్థము జరిగిందని విన్నాము. గృహస్తాశ్రమములో మనీషానందజీ పేరు శ్రీహరి నాథ శాస్త్రి. శాస్త్రార్థమపుడు ప్రతిజ్ఞచేశారు. నేను శివకుమార శాస్త్రితో నమస్కారము చేయించుకుంటాను. కానీ అలా జరుగలేదు. సన్యాసి అయ్యాక శాస్త్రిగారు వారికి నమస్కరించారు. మీరు ఇపుడు వారు కాదు అన్నారు. దండ గ్రహణము చేసిన తర్వాత నరుడు నారాయణడవుతాడు. ఇలా వ్రాయడంలో ఉద్దేశ్యం ఏమిటంటే స్వామీజీ ఒక ఉత్తమకోటికి చెంది విద్వాంసుడు. మరియు ధర్మము విద్య యొక్క చతుర్దశశా స్థానముల మర్మజ్ఞుడు. వారు ఒక గ్రంథము వ్రాశారు. నాకు గుర్తున్నంత వరకు దాని పేరు. యతీంద్ర చరితామృతము. ఆ గ్రంథము శ్రీ శివకుమార్ శాస్త్రి గారి

యతీంద్రచరితంకి పోటాపోటిగా వుండేది. నాకు ఇప్పటి వరకు దానిలో నుండి రెండు పంక్తులు గుర్తున్నాయి.

రేరే చిత్తచకోర చంచల-చిరాత్సంసార దావానలాత్
భీతోయద్యసి తర్హి భావయ సఖే తాపోపశాంతిం మనాగ్

వారు మా అమ్మమ్మకు గురువుగారు. అందు వలన బాల్యావస్థ నుండి కూడ వారి దగ్గరికి మా రాకపోకలు సాగుతూవుండేవి. నేను వారితో ధర్మశాస్త్రాచార్య పరీక్ష కోసమని యాజ్ఞ్యవల్క్య స్మృతి యొక్క దాయభాగము అధ్యయనము చేశాను. వారు వేదాంత శాస్త్రమున ప్రౌఢ విద్వానులు. యోగ - భాష్యము కూడ వారి దగ్గరనే అధ్యయనము చేశాను. 'మితాక్షర' దాదాపు వారికి కంఠస్థము. యోగ దర్శనముతో కూడ వేదాంత సిద్దాంతమును ప్రతిపాదన చేస్తుండేవారు. యోగములో అభ్యాస వైరాగ్యాలు వృత్తి నిరోదము మరియు స్వరూపన స్థానము ముఖ్యము కాదు. అని వారి అభిప్రాయము. ఇందులో ముఖ్యమైనది వివేక ఖ్యాతి. వివేక ఖ్యాతి కలిగిన తర్వాత నిరోధము వుండనీ, లేకపోనీ దాని కంత మహత్వము లేదు. నిరోధమునకు అవిద్యాని వృత్తి చేయగలిగే సామర్థ్యము లేదు.

ఔపాధిక హేతువుతో ద్రష్ట యొక్క అనేకత సిద్ధించదు. జన సామాన్యుల దృష్టితో ప్రపంచము యొక్క అదర్శనము కూడ చెప్పలేము. కానీ కృతార్థుణ దృష్టిలో ప్రపంచమును దృష్టమని కూడ చెప్పలేము. అందువలన మహర్షి పతంజలిది కూడ వేదాంత దర్శనము వైపే పక్ష పాతముండేది.

నేను వారి వద్ద అధ్యయనము చేసేటపుడు వారికి 75 సం.లు వుంటాయి. అంత పెద్ద ఇంటిలో ఒక్కరే వుండేవారు. నీళ్ళు నింపడము, కసవు వూడ్చుకోవడము, అంటే చిన్న చిన్న పనులు మరియు పెద్ద పెద్ద పనులు అయినా సరే అన్నీ తను స్వయంగా తన చేత్తోనే చేసుకునే వారు. వారి జీవనం సర్వథా స్వావలంబనం, పరిశ్రమతో కూడినా ఆనందంగా వుండేది. అపుడపుడు వినోదం కూడ చేస్తుండేవారు. నడుము దగ్గర కొంచెం వంగి నడిచేవారు. నడుస్తు తిరుగుతూ కూడ చదివిస్తుండేవారు. వారికి గ్రంథాలుకు గ్రంథాలే కంఠస్తముండేది. పుస్తకము చూశే ఆవశ్యకత వారికెపుడు

వుండేదికాదు. వారు విద్వానులే కొక ఒక అనుభవజ్ఞుడైన సాక్షాత్ కృతాత్మనంత్ మహాత్ముడు. డా॥గంగానాథఝూ మరియు డా॥భగవాన్ దాస్ వారి ప్రముఖ శిష్యులు.

పండిత్ శ్రీరఘు నాథ శర్మ -

పండిత శ్రీ రఘునాథ శర్మను పండిత సమాజము బాగా యెరుగును. సర్వ శాస్త్రములను కూలంకషంగ అవగాహనము చేసుకున్నటువంటి విద్వాంసుడు. వారు మొదట సన్యాసీ కాలేజ (కాశి) లో అధ్యాపనము చేశేవారు. తర్వాత శ్రీ సంపూర్ణానంద వేద విద్యాలయమున వేదాంత విభాగాధ్యక్షుడు గా చేశారు. ఇపుడు వారు బలియా జిల్లా ఛాతా గ్రామములో వుంటారు. 85 సం.ల కంటె ఎక్కువ వయసుండవచ్చును. వారి పాండిత్యము దిన దినాభి వృద్ధి ప్రకాశిస్తు వున్నది. అనేక గ్రంథములు వ్రాశారు. భర్తృహరి యొక్క 'వాక్య పదీయము' పైన వారిది విద్వద్భోగ్యమైన టీకా వున్నది. దాని పేరు అంబా కర్త్రు. మాకు వారి గృహస్థాశ్రమములో వున్నప్పటి నుండి పారివారిక సంబంధమున్నది. ఏ శాస్త్రములోని ఏ పంక్తి అయినా నేను వ్యాఖ్య చెయ్యగలను. అనే వారు వారు, తన యువావస్థలోనే వారు చిత్సుఖికి నైనా ప్రసాదినీ టీకా సంపాదన చేశారు. వారి తండ్రిగారైశ పండిత్ శ్రీ కాశినాథ్ జీ వారి ఆశీర్వదఫలమే వీరి సమగ్రపాండిత్యము అని నేను అనుకుంటాను.

పం. శ్రీ కాశీనాథ్‌జీ -

వారు విద్యా వృద్ధులు, వయో వృద్ధులు అయిన ఒక అనుభవజ్ఞులైన సత్పురుషులు. అద్వైత సిద్ధి ఖండన - ఖండ,ఖాద్య, చిత్సుఖి ఏదో ఒక కథ లాగ చదివించేవారు. చాప పైన కూర్చుని సాధారణ వస్త్ర ధారణతో గొప్ప గొప్ప దర్శన గ్రంథాలను అధ్యాపనము చేయించేవారు. ఎవరో పురాణములలో వర్ణితమైన ఋషిపుంగవుల ఎదుట కూర్చున్నామా ! అని అనిపించేది వారి ఎదుట కూర్చున్నపుడు. ఒక సారి వారు అద్వైత సిద్ధి చదివిస్తున్నారు. ఏదో కుడుతున్నట్లుంది అన్నారు. ఎక్కడ మహరాజ్ అంటే ఏదో ఏమిటా బాగా కుడుతూ వుంది అన్నారు. పాఠము సమాప్తమయ్యాక గుడ్డ తీసి చూస్తే తేలు కనిపించింది. అదే కుడుతు వుంది. కాశిలోని అనేక మంది విద్వానులు వారితో వేదాంతమును అధ్యయనము చేశారు. అనుభూతి

ప్రకాశముపై వారి సంస్కృత టీకా చదివితే వారు వేదాంత శాస్త్రములో ఎంతటి మర్మజ్ఞులో తెలుస్తుంది. ఉపనిషత్తులలోని ఒక్కొక్క మంత్రాన్ని అనుభూతి ప్రకాశము లోని శ్లోకములలో చూపించారు. ఆ గ్రంథము సుమారు ఇప్పటికి 50 సం.ల క్రితం కేవలం ఒక్క సారి ప్రకాశితమయినది ఎవరు దానిని స్వాధ్యాయము చేస్తుండిరో ఆ జిజ్ఞాసువులు దానిని ముద్రింప చేశారు. వారు సాధారణంగా సరస్వతీ గేట్ వద్ద నున్న బ్రాహ్మవిద్యా మందిరములోనే వుండేవారు.

పం. మరన మోహన్ మాలవ్యగారు రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ కొరకు లండన్ వెళ్ళటానికి అంగీకరించారో అపుడు గంగా జలము, ఆవు, పవిత్ర, మృత్తిక, భారతీయ తినుబండారాలు వస్త్రములు అంతా ఏర్పాటు చేశారు. తర్వాత వారు పం. కాశీనాథ్ జీ వారి అనుమతి తీసుకోవడానికి వెళ్ళారు. హిందు విశ్వ విద్యాలయాలములోని అధికాంశము విద్వానులు ఈ యాత్రను వ్యతిరేకించారు. మాలవ్యగారు వచ్చి పండిత్‌జీ చరణాలకు నమస్కరించి ఆశీర్వదమదిగారు పం. కాశీనాత్ జీ సంతోసంగా వారికి అనుమతి నొసంగి ఆశీర్వదించి ఇలా అన్నారు -

నీవు ఒక వ్యక్తిగా కాదు, సంపూర్ణ దేశముగా అక్కడికి వెళ్తున్నావు. అక్కడ మన దేశము తలయెత్తుకునే విధముగానే మాట్లాడు చెయ్యి ఎప్పుడైనా సరే ఆత్మగ్లాని కలిగించే పనులు చెయ్యకు. నీవు భారతదేశపు సూర్యుడివి. సనాతన ధర్మమునకు అగ్రనేతవు. అక్కడికి వెళ్ళి సనాతన ధర్మము యొక్క ఉజ్వల రూపమును ప్రకటించు.

మాలవ్యగారు వారి ఆశీర్వాదము తీసుకుని లండన్ వెళ్ళారు. పం. కాశీనాథ్ జీ మహరాజ్‌ని స్మరించుకుంటే ఇపుడు కూడ హృదయము ప్రసన్నమవుతుంది. నేను వారి సంపర్కములో వున్నందుకు వారితో మాట్లాడినందుకు ఎంతో గౌరవన్వితుడిని అయ్యాను.

పం. భూపనారాయణ మిశ్ర -

కాశిలోని నీలకంఠ మొహల్లాలో పం. భూపనారాయణ మిశ్ర వుండే వారు. నాది వారి వూరి దగ్గరనే 'మహేశీ' గ్రామము. వారు మా పితామహుల సమకాలికులు. ఇరువురు దేశంలో ప్రసిద్ధులే, ఆవాజాపుర గ్రామంలో ఇద్దరికి పరంపరాగత

శిష్యులుండిరి. సా పూర్వాశ్రమములో వారి పుత్ర పౌత్రులతో అనేక సంబంధములు వుండేవి. బంధువు లనే కాక వారి విద్య వున్నదే అది చాల ఉత్తమకోటికి చెందినది. టీకా టిప్పణి సహితంగా వారికి శ్రీ మద్భాగవతం కంఠస్థం వుండేది. 'మనోరమాశబ్దరత్న' మును చాలసార్లు ఉదహరించేవారు. నేను రోజు వారితో భాగవతము చదవడానికి వెళ్తువుండేవాడిని. అంతేగాక ఎపుడయిన సమయం దొరికితే నేను వారింటికి వెళ్తుండే వాడిని. వారి ధర్మపత్ని నాకు మేనత్త వరుస అవుతుంది. మా అమ్మ లాగ వుండేవారు. ఆమె నాకు చాల ప్రేమగ భోజనం పెట్టేది. పండిత్ జీ నాకు వేరుగా భాగవతంలోని గర్భస్తుతి, బ్రహ్మ స్తుతి, వేద స్తుతి మొదలైన గంభీరము, కఠినములైన ప్రసంగములను చదివించే వారు. వారికి అన్నీ కంఠస్థములుండేవి. భోజ మయ్యాక వారు చేరగిల పడేవారు. నేను పుస్తకము తీసుకుని కూర్చుంటే వారు చెబుతు వుండేవారు. అధ్యయనము సమాప్తమయ్యాక నేనా ఎపుడు కాశికి వెళ్ళినా వారి ఇంట్లోనే మకాం వేశేవాడిని. వారి స్నేహ పూర్ణమైన మమత నాకు లభించింది.

వారు ఒక్కొసారి ఒక్కొక్క వాక్యమునకు అనేక అర్థములు తీసేవారు. ఉదాహరణకు 'పశుపాంగజాయ' దీని అర్థము పశుప అంటే నందబాబా వారి అంగజ ఆత్మజ శ్రీ కృష్ణ పసుప నంద, వారి అంగ - మిత్ర - వసుదేవుడితో ఉత్పన్నమైన శ్రీకృష్ణుడు.

పశుప - అవిద్యాగ్రస్తులైన పశుప్రాయులైన మనుష్యులకు జ్ఞాన దానమొసంగి రక్షించుటకై బ్రాహ్మణుల ఎవరి అంగజులు అంటే వారి ముఖము నుండి ప్రకటమయినారు.

ఇది కేవలం ఒక ఉదాహరణ. వారు విరాట్ పురుషుడి అంగ-ప్రత్యంగము నుండి ఉత్పన్న సమగ్ర సృష్టిని ఈ వాక్యము యొక్క అర్థముతో ముడి పెట్టేవారు. ఈ వాక్యమునకు 115 అర్థాలు నేను వారి నోటి వెంట విన్నాను. శ్రీ కామేశ్వరనాథ మందిరంలో వారు దాదాపు 50 సం.లు శ్రీ మద్భాగావతము పైన ప్రవచనము చేశారు. వారికి రోజుకి దక్షిణ ఒక్క రూపాయ దీనిని బట్టి వారు ఎంతటి నిస్పృహలో మీరు అర్థం చేసుకోగలరు. విద్యార్థులను కూడ వారు ఇంట్లో పెట్టుకుని చదివించేవారు. వారు చదివించిన వారు ఎందరో భాగవతవక్తలుగా ప్రసిద్ధి కెక్కారు.

కానీ వారు ఎపడు ఎవరినీ ఏమీ అడిగేవారు కాదు. సాదా బట్టలు సబ్బు కూడ వాడరు. పండిత సభలకు కూడ అలాగే వెళ్ళేవారు. వృద్ధావస్థలో కామేశ్వర నాథ మందిరములో ప్రవచనాలు బంద్ అయినవి. అపుడు శ్రీ కరపాత్ర జీ మహారాజ్ ఒక రిక్షాలో ధర్మ సంఘ విద్యాలయమునకు వెళ్ళి అక్కడ భాగవతము చెప్పి రావడానికి వారికి ఏర్పాటు చేశారు.

నేను శ్రీ యోగానందజీ పురీ సంపర్కము లోకి వచ్చాక వారి దగ్గర భాగవతం చదువుకునే వాడిని. వారి ప్రవచనం చాలా లలిత లలితముగా మధుర మధురముగా ప్రసన్న గంభీరముగా వుండేది. ఒక రోజు వారు అన్నారు. నీవు భాగవత్‌జీ దగ్గరికి వెళ్తుంటావు కదా ? పురాణములు ఇతిహాసము వీటికి బేధమేమి? అని నేను అడిగితే శ్రీ భాగవత్‌జీ ఇలా చెప్పారు - ఇతిహాసము ఘటనా ప్రధానము. కాలక్రమముతో ఘటితమైనది. పురాణము శిక్షా ప్రధానము. విది - నిషేధ వచనములలో పురాణముల ఏక వాక్యత వుంటుంది. ఇది చెయ్యాలి. ఇది చెయ్య కూడదు అని వాటికి ఉదాహరణలు వుంటాయి. యుధిష్ఠురుడిలా వుండాలి. దుర్యోధనుడిలా కాదు. యుధిష్ఠురుడు కూడ ఏదైన ధర్మ విరుద్ధ కార్యము ద్యూత క్రీడ చేశాడంటే వారికి దుఃఖము తప్పదు భోగించవలసినదే. తల్లి భక్తురాలైతే పుత్రుడు పరీక్షితుడిలా భక్తుడవుతాడు. మహాభారతములో వర్ణితమైన పరీక్షిత్తు యొక్క ఇతిహాసము మానవ స్వభావము నకు ఒక పరిచయము. మృత్యు భయంతో వారు నదిలోపల ఒక మహల్ కట్టుకుని తనను సురక్షితముగా చేసుకుంటారు. శ్రీమద్భాగవతము లోని పరీక్షిత్ తన పూర్వపు వైరాగ్యము ననుసరించి గంగా తటమున కూర్చొని సర్వత్యాగి అయి శ్రీ మద్భాగవత శ్రవణము చేస్తారు. ఇదే ఇతి హాసమునకు పురాణమునకు గల బేధము. నేను వెళ్ళి ఈ జవాబుకు శ్రీయోగానందజీ మహరాజ్ గారికి వినిపిస్తే వారు చాల ప్రసన్నులయ్యారు.

భాగవతానందజీ వేద-వేదాంతములయందు కూడ మర్మజ్ఞుడు. వారు శ్రీ మద్భాగావతము యొక్క ఉపక్రమ, ఉపసంమారములలో వచ్చిన 'సత్యం పరం ధీమహి' యొక్క అభిప్రాయమును తెలిపారు. సత్యము అబాధితము. అది 'పురుషాత్ పరం కించిత్' ననుసరించి 'పర' అంటే ప్రత్యగాత్మయే. పరీక్షితుడికి శ్రీ శుకదేవల

పరమ చరమ ఉపదేశము 'అహం బ్రహ్మ పరం ధామ' ఆత్మతో అభిన్నము బ్రహ్మ. బ్రమ్మతో అభిన్నము ఆత్మ. బ్రహ్మాత్మ ఏకత్వ లక్షణ వేదాంతసారమే శ్రీమద్భాగవత రూపముగా ప్రకటమయినది. ఈ అద్వైతాను భూతి కొరకు అంతః కరణశుద్ధి ఆవశ్యకము. అది భక్తి వలన కలుగుతుంది. ప్రీతి పూర్వక తదా కారవృత్తి అంతః కరణమును శుద్ధి చేస్తుంది. భజనీయ తత్వదార్ధ రూపమైన భగవంతుని స్వరూపమును స్పష్టం చేస్తుంది. అందువలన తత్వజ్ఞానమునకున్న సహస్ర సహస్ర ఉపాయములలో భక్తియే సర్వశ్రేష్ట ఉపాయము. ఎందుకంటే భగవంతుడు స్వయముగా తన శ్రీ ముఖము నుండి దీనిని ఉపదేశించారు. ఎక్కడయితే తృతీయాంతము 'భగవాన్' అని ప్రయోగము వున్నదో 'భక్త్యా' అక్కడ సాధనత స్పష్టంగా వున్నది. ఎక్కడయితే భక్తి నుండి ఉదయించిన భక్తి అని వున్నదో అక్కడ 'భక్త్యా సంజాతయా భక్త్యా' అక్కడ కూడ పరాశాంతి యొక్క సాధనయే చెప్పబడియున్నది. పంచమీ ప్రయోగమున్న దగ్గర కూడ 'భక్తేః' హేతు అర్ధములో వున్నది. ఎక్కడయితే 'భక్తిర్విరక్తి ర్భగవత్ప్రబోధః' భక్తి మరియు విరక్తి కూడ ప్రబోధము కొరకు (జ్ఞానము) సాధనయే. ఎలాగంటే ఎపుడు ఎవరైన ధనికుడు సుఖంగా వుంటాడు. అన్నారనుకొండి అక్కడ సుఖసాధనము ధనము, అనే తెలుస్తుంది. లేక పోతే కర్ర పట్టుకున్న వారు కుండ పగులగొట్టినాడు. అంటే కుండ పగల కొట్టడానికి సాధన కర్రయే కనిపిస్తుంది. అదే విధముగా 'భక్తిమాన్ జ్ఞానీ' ఈ ప్రయోగములో కూడ జ్ఞాన సాధన భక్తి అనే తెలుస్తుంది.

ఎవరైన వ్యాకరణ న్యాయము వీటిలో విద్వానులయినా కూడ తమ విద్య, అభ్యాసముల వలన 'భాగవతం' యొక్క మర్మమును తెలుసుకొనలేరు. అని భాగవతీజీ యొక్క దృఢ నిశ్చయము భక్తితోనే భాగవతము అర్ధమవుతుంది. భాగవత సంకల్పమే భగవద్భక్తి ద్వారా పరమాత్మ యొక్క సాక్షాత్కారము అవుతుంది. సగుణసాకార భగవానుని సాక్షాత్కారములో భక్తి సర్వధా స్వతంత్రమయినది. సరిగ్గానే ఎలాగైతే నిర్గుణ నిరాకార బ్రహ్మాత్మ సాక్షాత్కారములో బ్రహ్మ విద్య.

స్వామి శ్రీ యోగానందజీ మహరాజ్ వారు అపుడుపుడు కాశిలోనీ కాశిదేవి మఠులో వచ్చి నివవించేవారు. నేను వారిని దర్శించుటకై అక్కడికి వెళ్తుండేవాడిని. మఠము యొక్క స్వామి శ్రీరామనందగిరిజీ ఆ రోజులలో బాగ వృద్ధులు. వారు

బాగా వయసయ్యాక వ్యాకరణాచార్య పరీక్ష పాసయ్యారు. చాల సహృదయులు, అందరితో కలసి పోయేవారు. సంత్ మహాత్ములను ఆదరించేవారు, భగవత్కృపవలన శతాధికము వయసు వున్నా స్వస్థులు, ప్రసన్నులు, అహమ్మదాబాద్ లో వుంటుండే వారు. వారి స్థానము లోనే స్వామి శ్రీ భాగవతానంద జీ మహరాజ్ వారు 10 - 15 శాస్త్రములలో ఆచార్యులు, అక్కడ వుండేవారు. శ్రీజ్యోతిర్మయానంద పురీ, శ్రీ దయాలుపరీ, శ్రీ చంద్రశేఖర గిరి వీరందరి పరిచయము నాకు కాశీ దేవి మఠంలోనే అయినది.

స్వామి శ్రీ జ్యోతిర్మయానందజీ -

స్వామి శ్రీ జ్యోతిర్మయానందజీ, ఠాకుర్ శ్రీ ప్రసిద్ధ నారాయణ సింహతో కలసి 'కుండలినీ జాగరణ' అభ్యాసం చేస్తువుండిరి. వారు సుందరులు, స్వస్థులు, సరళ చిత్తులు మరియు విద్వానులు వారు ఒక రోజు ప్రసన్నులై నాతో ఇలా అన్నారు. పండిత్ ! నీకు ఏమి సుఖపడాలని వున్నది, సుఖపడు. ఏమి చెయ్యాలో చెయ్యి ఎపుడయితే అన్నిటి నుండి నివృత్తులై నా దగ్గరికి వస్తావో అపుడు నేను నీకు చిటికె వేసినంతలో బ్రహ్మ జ్ఞానాన్ని కల్గిస్తాను. ఎంతవరకు ఏదో చెయ్యాలని వుంటుందో అంతవరకు ఏదో చెయ్యవలెను. లేకపోతే బ్రహ్మ అయితే మన స్వరూపమేగా ! ఆత్మ బ్రహ్మల మధ్య నిజంగా ఏమీ ఆవరణ అన్నది లేదు. ఒక వేళ అవిద్యాకృత ఆవరణ వుంటే కూడ, అవిద్య యొక్క కార్యము ఏదైన వుంటే అది వాస్తవంగా లేదు. అజ్ఞానంతో అంగీకరించిన వస్తువు నిజమైనది కాజాలదు. దృశ్య నిర్మాణము, పరివర్తనము, పరివర్ధనము, సంహరణము, నిరోధనము ఈ మాటలన్నీ ఎంతవరకు ఇచ్ఛ వుంటుందో అంతవరకే కర్తవ్యము వుంటుంది. జ్ఞానము వలన వేటి నివృత్తి కలుగుతుందో అవి కూడ సత్యము కాదు. అందుకని నీవు నిశ్చయించుకో - పరమార్ధ సాక్షాత్కారము కఠినమయిదేమి కాదు.

స్వామి శ్రీ జ్యోతిర్మయానందజీ వారిని హరిద్వార్, మాయా పూర్‌లలో సిద్ధాశ్రమములు నిర్మించారు. కాని వారి శరీరము కొద్ది రోజుల లోనే శాంతమయినది.

శ్రీ దయాలుపురీ మరియు శ్రీ శంకర చేతన్య భారతి -

శ్రీ కాశి దేవి మఠములో శ్రీ దయాలుపురీజీ వుంటుండే వారు. వారితో ప్రథమ పరిచము కూడ చాల ఆశ్చర్యజనకముగా జరిగినది. వారు ఒక సారి మహాత్మ ధర్మగిరిజీ లేదా మహాత్మ విష్ణు గిరిజీ (పేరు నాకు సరిగా గుర్తులేదు) తో కూర్చుని బ్రహ్మ సూత్రములను శాంకరభాష్యము జోడిస్తువుండిరి. ఏదో ఒక పంక్తి పైన ఆలోచిస్తున్నారు. నేను పా పల్లెటూరి వేషంలో కంబళి చెంబు తీసుకుని అక్కడికి వెళ్ళి కూర్చున్నాను. నాకు శిష్టాచారమొ యొక్క జ్ఞానము కూడ పూర్తిగా లేదనుకొండి అపుడు నేను దృష్టతతో ఆ గ్రంథము కొంచె సేపు నాకు ఇవ్వండి ! అన్నాను. నా నోటి వెంట ఆ పంక్తి యొక్క అభిప్రాయము విని ఆ వృద్ధ మహాత్ముడు 'వీరు అయితే బ్రహ్మవిద్' అన్నారు. ఆ రోజు నుండి శ్రీ దయాలుపురీ జీతో శ్రద్ధ ప్రేమ పరిచయం కలిగింది. నేను కాశిదేవి మఠము వెళ్ళి అవశ్యము వారిని కలుసుతవుండే వాడిని. వారు ఒక చాపపైన కూర్చుని కాని పడుకుని కాని వుండేవారు. వారి నాలుగు దిక్కుల శాస్త్రగ్రంథములు పెట్టి వుండేవి. ఏమీ క్రమముగాని ఏమీ వుండేది కాదు. వారంటుండేవారు నేను శాస్త్ర చింతన చెయ్యడం మొదలు పెడితే నాకు శాస్త్ర సమాధి కలిగేది. విచార ధార తత్వోన్ముఖముగా ప్రవాహితమయ్యేది. ప్రపంచము యొక్క విస్మృతి కలుగుతుంది. సిద్ధ గిరి యొక్క శ్రీ శాంకర చైతన్య భారతి పైన దయాలుపురిజీకి చాల శ్రద్ధ వుండేది. వారు వారితో చదువు కుంటువుండిరి కూడ. భారతీజీ 'ఖ్యాతి వాదము' మరియు 'ఖండన' వీటి పై 'శారదాటీకా' రెండు గ్రంథములు వ్రాశారు. అవి నాకు పూర్తిగా అర్థమయ్యేది కాదు. నేను భారతీజీ వారి దగ్గరకు ఒకటి రెండు సార్లు వెళ్ళాను. వారు పూజ పాఠ్, జపము వీటిలో సంలగ్నులై వుండేవారు. ఒక రోజు నేను వారిని అడిగాను మనసు యొక్క స్వరూపమేమిటి ? వారు చర్వాకుల దగ్గర నుండి అద్వైత వేదాంతము వరకు ఆచార్యులు మనసు యొక్క స్వరూపమును ఏమని అనుకునేవారో తెలియ జెప్పారు. నేను ఆశ్చర్య ముగ్దుడనై వింటు కూర్చున్నాను. ఆఖరున వారు తలపై చెయ్యి పట్టుకుని మరి అన్నారు. అబ్బ చాల అయింది, దీనికి అంతమెక్కడ అన్నారు. ఆచార్యులు అందరూ తమత మతానుసారముగ మనసు యొక్క కల్పన చేశారు. వారి శాస్త్రజ్ఞానపు స్థితి

చాల ఉన్నతమయినది. మేము ఇపుడు కూడ వారిని అనిర్వచనీయతా - సర్వస్వము చదువు తాము. అపుడు వారి ప్రతిభ - పాండిత్యము అలౌకికము, అద్భుతము అని ఒప్పుకొవలసి వస్తుంది.

స్వామి శ్రీ భాగవతానందజీ -

కాశీదేవి మఠము యొక్క వ్యాకిరణాచార్యులు స్వామి శ్రీ రామానందజీ మహరాజ్ వారు నాకు ఒక లేఖ వ్రాసి ఇచ్చి నన్ను కన్‌ఖిల్ లోని శ్రీ హరిభారతి విద్యాలయమునకు పంపినారు. అక్కడ స్వామి శ్రీ భాగవతానందజీ వుంటుండే వారు. కాశిలో మొదట కొద్దిగ పరిచము వుండినది. అక్కడికి వెళ్ళాక వారి స్నేహ వాత్సల్యములు లభించాయి. వారు ప్రతిరోజు పూర్వాహ్నములో శ్రీ శాంకర భాష్యము చదివిస్తువుండేవారు. మధ్యాహ్నం వారి విద్యాలయములోనే గీత భాష్యము, మహవాక్యరత్నావళి మొదలైనవి నేను చదివిస్తుండేవాడిని నాతో చదువుకునే వారిలో ముఖ్యులు పం. ఆత్మా రామ్ జీవైద్య, శ్రీహరినందన్ శాస్త్రి, డా॥ తారాచంద్, శ్రీ జీవానంద్ మొదలైనవారు. సాధరణముగా వేసవి కాలంలో ప్రతిసారి నేను అక్కడికి వెలుతుండేవాడిని. స్వామిజీ మహరాజ్ శాస్త్ర జ్ఞానమునకు అగాధ సాగరము వంటివారు. న్యాయ, వ్యాకరణ మీమాంస వేదాంతము ఇత్యాది అనేక విషయముల కయితే వారు ఆచార్యులే కాక, దేవ ఆరాణ్యక, బ్రాహ్మణములలో కూడ విద్వాంసుడు.

కనఖల్ లో వుండేటప్పుడు నేను స్వామి భాగవతానందుల వారి వద్ద కొంచెం అపుడపుడు దృష్టత కూడ చేశేవాడిని. ఒక రోజు నేను అడిగాను 'కనఖల్' శబ్దమునకు వ్యుత్పత్తి ఏమిటి ? 'కొనఖల్ యాత్ర' అంటే ఎక్కడయితే దుష్టులు లేరో అది అని కదా ' వారు వెంటనే' కాదు అలాగ కాదు 'కొపినఖలో యాత్ర' అంటే ఎక్కడయితే ఎవరూ దుష్టలు లేరో వారు అన్ని శాస్త్రముల లో వ్యుత్పన్నలే కాక, ప్రత్యుత్పన్నమతులు కూడను. నేను అక్కడికి రావడానికి సమయం పక్కా అయింది. బిహార్ నుండి ఎవరో సాహిత్యాచార్యులు వచ్చారు. ఘాట్ వద్ద కూర్చుని శాస్త్ర చర్చ చేస్తువుండిరి. ఘాట్ పైన ఇలా వ్రాసి వున్నది. 'గంగా కన్‌ఖలే పుణ్యా' నేను పండిత్‌జీని అడిగాను. ఈ వాక్యమునకు అర్థమేమిటి? కనఖలే ఏవపుణ్యా, లేక కనఖలే పి పుణ్యా అంటే గంగా కన్‌ఖల్‌లో పుణ్యము. లేదా కన్‌ఖల్‌లో కూడ పుణ్యము. రెండు

అర్థాలు కూడ సరికాదు ఎందకంటే మొదటి అర్థముతో ప్రయాగాదిలో పుణ్యం కాదు. అని ధ్వనిస్తుంది రెండవ అర్థముతో ఎలాగయితే సర్వత్ర పుణ్యమో అలాగే కన్‌ఖల్‌లో కూడ గంగ పుణ్యమే అన్న అర్థము ధ్వనిస్తుంది. పండితుడి కి నా ప్రశ్నకు సమాధానము తోచలేదు. అంతలో శ్రీ స్వామి భాగవతానందజీ వచ్చారు. వారు తెలిపారు 'పుణ్యా' అంటే అర్థము పుణ్యతరము అని గంగా సర్వత్ర పుణ్యము, కన్‌ఖల్ లో పుణ్యతరము అంటే అత్యంత పుణ్యము అని అర్థము.

ఒకసారి నేను స్వామి జీని 'కన్‌ఖల్ ఎవరైన మంచి సంత్‌మహాత్ములుంటే చెప్పండి. నేను వారి దగ్గరికి సత్సంగము కొరకు వెళతాను. అని అడగాను, నిజంగానే ఇది నా దృష్టతయే, అలా అడగడము అనుచితమే. ఎందుకంటే వారు మాత్రము మంచి మహాత్ములు కారా ఏమి ? కానీ స్వామిజీ నవుతూ ఇలా అన్నారు. నీ ప్రశ్న ఎవరైనా విరక్తుల కోసమా? బిక్షు శంకరానందజీ చాల మంచి వారు వారి దగ్గరికి వెళ్ళి వస్తువుండు. అంతవరకు బిక్షు శంకరా నంద్‌జీ మరియు సన్యాసలకు మధ్య చాల సద్భావము వుండేది.

కల్యాణ - పరివారములో వుండే సమయములో నేను ఎపుడు అడిగినా గానీ మంచి పాండిత్యపూర్ణమైన గంభీరమైన లేఖలు చాల పరిశ్రమతో వ్రాసి ఇచ్చేవారు. నేను వారి వద్ద చదువు నేర్చుకున్నా కూడ వారు నన్ను చాల ఆదరముగా చూచుకునే వారు. సన్యాసినయ్యాక కూడ నేను కన్‌ఖల్‌లో, అహమదాబాద్ లో వారి దగ్గరికి వెళ్ళి వస్తు వుంటే వాడిని. వారు మూర్తి భవించిన విద్యాయే కాక చాల ఉదార చిత్తులు, అన్ని సంప్రదాయముల ఆచార్యులను ఆదరించేవారు. ఒకసారి నా ఎదుటనే కాశీకి చెందిన పండిత బాల బోధ మిశ్ర అనేక శాస్రతములకు ఆచార్యులు - వారిని పూజించారు. వారు వీరికి విద్యా గురువులు. శ్రీ భాగవతా చార్యుల శతాబ్ది - మహత్సవములో వారు ముక్త కంఠముతో వారి పాండిత్యమును ప్రశంసిస్తూ, శ్రీ భాగవదాచార్యులు ఏదైతే బ్రహ్మ సూత్రముపై భాష్యము వ్రాశారో మంత్ర సంహితననుసరించి అధికరణ రచన చేశారు. ఇలా ఏ విద్వానులు ఈ పని చెయ్యలేదు. ఈ పనికి ఎంతటి పాండిత్యము అనుసంధానము కావలసి వుంటుందో అది ఒక విద్వాంసుడే అర్థము చేసుకోగలగుతాడు. ఈ ప్రసంగములో వారు అత్యంత

వ్యాత్సల్యముతో నన్ను కూడ గుర్తు పెట్టుకున్నారు. అంతే కానీ తను నాదగ్గర చదువుకున్న వాడు అని ఎవరితో చెప్పలేదు.

స్వామి శ్రీ భాగవతానందజీ పైన గాంధీ గారి విచారముల యొక్క ప్రభావము పూర్తిగా వుండేది. అస్పృశ్యతాది విషయముల లో కూడ ఎక్కువ కట్టరత వుండేది కాదు. మందిరములలో కూడ ఆంగ్లేయులతో సమానంగా అంత్యజుల ప్రవేశాధికారమును అంగీకరించేవారు. స్త్రీలకు కూడ వేదాంతము చదివించేవారు. అన్నిటింకంటె గొప్ప మాట ఏమిటంటే వారు లోక తంత్రమును పూర్తిగా సమర్థించేవారు. లౌకిక న్యాయములో పూర్వజన్మ, ఉత్తర జన్మల విచారణ చెయ్యకూడదు అని అనేవారు. ఒక వేళ భిన్న భిన్న సంప్రదాయముల ననుసరించి శాసన పద్ధతి తయారు చేస్తే ఇక గృహ యుద్ధము జరిగి తీరుతుంది. అందుకని అందరు వారి వారి సంప్రదాయముల రీతి స్వధర్మపాలన చేసుకొవలసినదే. కానీ, ప్రశాసనముపై వాటి ప్రభావము ఉండ కూడదు. ప్రశాసనము అందరికి సమానముగా వుండవలసినదే. అందరూ సావధానులై తమ తమ లక్ష్యమునకై సాధన చేస్తు సదుపాయము లనుపయోగించుకుని ఉన్నతిని పొందాలి. పరమాత్మ అందరి ఆత్మ అందరికి సులభుడు. జన్మ వలన పరమాత్మ ప్రాప్తికి అయోగ్యత కలుగదు. సాంప్రదాయికమైన రాజ్యము సార్వజనిక మితమును కలిగించలేదు. స్థిరత కూడ వుండదు అని వారి స్పష్టమైన అభిప్రాయము. వారిది మానవతా పక్షము. వారు చందనం, తిలకం, మాల వీటి కంటె సామాన్య ధర్మములకు ఎక్కువ మహత్వమును (ప్రాముఖ్యత) ఇచ్చేవారు. జీవితములో సత్యము, అహింస, ఆది సద్గుణములు వుండాలి. ధృతి క్షమ ఆది వృత్తులు వుండాలి. మనిషి అందరి యెడలను సద్భావముంచాలి. చరిత్ర పవిత్రముగా వుండాలి, వీటి పైనే ఎక్కువ నొక్కి చెప్పేవారు. మూర్తి పూజ, అవతారము, శ్రాద్ధము గంగా స్నానము, వ్రతము అన్నిటికి శిక్షణను ఇచ్చేవారు. నవ్వుతూ మాట్లాడే వారు. ఎవరైన అపరిచితులు తన ఎదుటకు వచ్చిన తనేముందుగా మాట్లాడే వారు. దగ్గర కూర్చొబెట్టుకునే వారు. శాస్త్రముల గంభీర రహస్యములను ఎంత సరలముగా చెబుతుండే వారంటే అరచేతిలో ఉసరిక కాయ చూపెట్టినంత! వారి హృదయములో అందరి యెడల ఆత్మీయత వుండేది. వారు

సన్యాసి - సమాజములో ఒక దేదీప్యమాన రత్నములా మెరిపోయేవారు. నేను వారు కలుసుకోవడం దాదాపు 50 సం.ల వరకు జరుగుతూ వుండేది. ఎపుడు కానీ వారి స్నేహ వాత్సల్యములలో అంతరము కనిపించలేదు.

శృతులలో విద్వాన్ శబ్దము 'బ్రహ్మవిత్' పురుషునికై ప్రయుక్త మవుతుంది. 'త్వమేవ విద్వాన్ అమృత ఇహ భవతి' విద్వానుల స్మరణ వలన హృదయము పవిత్రమవుతుంది. వారి విద్య, సదాచారము రెండు కూడా జీవితమును ప్రభావితము చేస్తాయి. ఇంకా వేరే విద్వాంసుల సంపర్కము కలిగినది. వారిని మరల విస్తార పూర్వకముగా స్మరిస్తాను. అన్న ఆలోచన కలిగింది.

శ్రీ మంగళ గిరిజీ

శ్రీ హరిభారతి విద్యాలయముతో కలసి శ్రీరామ నివాస ఆశ్రమమున్నది. అందులో శ్రీ మంగళగిరి అన్న పేరుతో ఒక వయోవృద్ధులు, విద్యా వృద్ధులు అయిన ఒక సత్పురుషుడుండేవాడు. గొప్ప గొప్ప మమామండలేశ్వరులు వారి దగ్గర న్యాయశాస్త్రములో శిక్షణ పొందినారని చెబుతుండేవారు. సమిష్టి బంఢారలలో నేను చూశాను వారిని అందరు మండలేశ్వరులు ఆదరిస్తు వుండిరి. వారితో సమానంగా ఆసనం వేసి కూర్చొబెట్టుకుంటు వుంది. వారి వద్ద రోజు న్యాయ శాస్త్రము పై ఒకటి రెండు పాఠములు జరుగుతు వుండేవి. నేను కూడ వెళ్ళి వింటుండేవాడివి. వారు చాల స్పష్టవాది. గద్దిస్తు మాట్లాడేవారు. అందుకని నాకు వారి తో మాట్లాడటేనాకి ఎప్పుడూ సాహసం కలుగలేదు. ఎంత కర్కశంగా వుండేవారంటే వారి దగ్గర ఎవరూ సేవకులు వుండేవారు కాదు. వారు అత్యంత వృద్ధావస్థలో కూడ తమ పనులు తాము స్వయముగా చేసుకునేవారు. అధ్యాపన కళలలో వారిని అందరూ గొప్పగా భావించే వారు. గొప్ప గొప్ప గ్రంధాలను చాల సరళరీతిలో హృదయంగమము చేసేవారు. వారు సాధారణముగా కన్‌ఖల్ (హరి ద్వారము)లో వుంటేండేవారు.

శ్రీ ప్రభాస భిక్షుజి -

శ్రీ మంగళ గిరిజీ ఆశ్రమము దగ్గరనే శ్రీ బస్తీరామ్‌జీ ది పాఠశాల వుండేది. అందులో వ్యాకరణాది శాస్త్రాలను విధి పూర్వకము గా 'పఠన్-పాఠన్' జరుగుతు

వుండేది. అక్కడనే శ్రీ ప్రభాసభిక్షుజీ వుండేవారు. వారు శాస్త్రాములతో మమా పండితులే కాక యజ్ఞయాగాది కర్మ కాండలలో కూడ అత్యంత నిపుణులు. వారి ఆచరణ సర్వధా శాస్త్రానుసారముగ నుండేది, శాస్త్రోక్త ధర్మములను పాలనకై వారు తపము, ఉపవాసములు చేస్తువుండిరి. చాలమంది సేఠ్‌లు, సాహుకార్లు వారి భక్తులున్నారు కాని వారు సంగ్రహ పరిగ్రహములు చేసేవారు కాదు. నేను అనాధ్యాయమునాడు వారి దగ్గరికి వెళ్తూ వుంటిని. వారు వేదాంత సిద్ధాంతమునే కాక, కర్మ కాండకు సంబంధించిన గూడరహస్యములను కూడ తెలియ బరిచే వారు. ఇపుడు కూడ వారు గుర్తుకు వస్తువుంటారు, ఎందుకంటే కర్మ కాండకను గురించిన రహస్యములను తెలియ జెప్పెవారు. ఇపుడు దుర్లభులైనారు.

మహామండలేశ్వరులు శ్రీ స్వరూపానందజీ -

హరిద్వారము నుండి దక్ష ప్రజాపతికి వెళ్ళే ముఖ్యదారి పై హరిహరాశ్రమము వున్నది. అందులో ఒక రుద్రాక్ష వృక్షము ఇప్పటికీ వున్నది. ఆ రోజులలో ఆ ఆశ్రమము అలా వెలిగి పోతుండేది. అందులో వయోవృద్ధులు మరియు విద్వానుల అయిన మహామండేళ్వరులు శ్రీ స్వరూపానందజీ మహారాజ్ వుండేవారు. అందరు వారిని చాల ఆదరించే వారు, వారు శాస్త్ర సంబంధమైన అన్ని ప్రశ్నలకు సమాధానము చెబుతుండేవారు. వారి దగ్గర వేదాంతము పైన ఏదో ఒక గ్రంధము యొక్క అధ్యాపనము అధ్యయనము జరుగుతూ వుండేది. ఏదైన శాస్త్ర సంబంధమైన శంక కలిగితే దానికి సమాధానము కొరకు పండితులు వారి దగ్గరికి వస్తు వుండిరి. నేను కూడ అపుడుపుడు వారి సేవకై వెళ్ళేవాడిని. వారి ముఖతః నేను గీత - 13వ అధ్యాయము శాంకర భాష్యము శ్రవణము చేశాను.